Title : Putchalapalli Sundarayya

*An Autobiography*

అనువాదం : డా॥ ఎ.పి. విఠల్

మొదటి భాగం

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1వ ముద్రణ | : | మే, 1986, | ప్రతులు | : | 16,000 |
| 2వ ముద్రణ | : | మే, 1990 | ప్రతులు | : | 4000 |
| 3వ ముద్రణ | : | సెప్టెంబర్,1994, | ప్రతులు | : | 3000 |
| 4వ ముద్రణ | : | జూలై, 2001 | ప్రతులు | : | 3000 |
| 5వ ముద్రణ | : | అక్టోబర్, 2002 | ప్రతులు | : | 3000 |

రెండవ భాగం

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1వ ముద్రణ | : | మే, 1987, | ప్రతులు | : | 10,000 |
| 2వ ముద్రణ | : | నవంబర్,1992, | ప్రతులు | : | 3000 |
| 3వ ముద్రణ | : | జూలై,1999, | ప్రతులు | : | 3000 |
| 4వ ముద్రణ | : | ఫిబ్రవరి, 2004, | ప్రతులు | : | 3000 |

రెండు భాగాలు కలిపి

| | | | | | |
|---|---|---|---|---|---|
| ప్రథమ ముద్రణ | : | జూలై, 2009 | ప్రతులు | : | 2000 |

ప్రచురణ సంఖ్య : 1094

వెల : రు. 100

ప్రతులకు

ప్రజాశక్తి బుక్‌హౌస్

1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27608107

బ్రాంచీలు

హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,

హన్మకొండ, నల్గొండ, గుంటూరు

ముద్రణ

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

# విప్లవపథంలో నా పయనం

## పుచ్చలపల్లి సుందరయ్య

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

*ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర*

*హైదరాబాద్-20. ఫోన్ : 27660013*

# విషయసూచిక


| | | |
|---|---|---|
| ప్రథమవర్ధంతి మా తొలి కానుక | ... | 5 |
| మా మాట | ... | 5 |
| బాల్యం, కుటుంబం, మా ఊరు | ... | 7 |
| బావగారి నీడలో చదువు - తొలి పాఠాలు | ... | 15 |
| రాజమండ్రిలో రాజకీయ చైతన్యం | ... | 19 |
| మద్రాసులో విద్యాభ్యాసం - గాంధిజీ ప్రభావం | ... | 25 |
| కమ్యూనిజంతో తొలి పరిచయం | ... | 37 |
| సత్యాగ్రహోద్యమం | ... | 41 |
| మొదటి అరెస్టు - బ్రిటిష్ పోరాటం | ... | 45 |
| మళ్ళీ బెంగుళూరులో | ... | 61 |
| గ్రామంలో కృషి - కూలీల సంఘం | ... | 75 |
| కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం | ... | 83 |
| ఐక్యత చర్యలు - కేంద్రకమిటీ | ... | 95 |
| కాంగ్రెసు సోషలిస్టు పార్టీలో | ... | 103 |
| కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో | ... | 127 |
| రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో | ... | 139 |
| ఆంధ్రదేశంలో పార్టీ విస్తరణ | ... | 153 |
| లైలాతో వివాహం | ... | 159 |
| తెలంగాణా పోరాట ప్రారంభం | ... | 165 |
| పోలీసు చర్య - పోరాటం కొనసాగింపు | ... | 173 |
| రణదివె వాదనలు - అంతర్గత పరిణామాలు | ... | 177 |
| దళాల దగ్గరకు... | ... | 187 |
| ఎన్నికలు - ఘన విజయాలు | ... | 195 |
| తెలంగాణా పోరాటం - నా అనుభవాలు గుణపాఠాలు | ... | 199 |
| రహస్య యంత్రాంగం - నాటి సహచరులు | ... | 215 |
| అడవులలోకి ప్రయాణం : దళాలతో ముఖాముఖి | ... | 227 |
| పార్టీలో అంతర్గత విభేదాలు | ... | 241 |
| ఎన్నికల తర్వాత | ... | 247 |
| పార్టీ కేంద్రం, పార్లమెంటరీ రంగం | ... | 253 |
| శాసనసభా రంగం | ... | 267 |
| మార్క్సిస్టు పార్టీ ఆవిర్భావం | ... | 277 |
| ప్రభుత్వ నిర్బంధకాండ, దుష్ప్రచారం | ... | 291 |
| మహాసభలో చికిత్స | ... | 295 |
| అంతర్జాతీయ ప్రభావం | ... | 303 |
| 1967 ఎన్నికలు | ... | 313 |
| నగ్జలైట్ చీలిక | ... | 317 |
| కార్యకర్తలతో సంబంధాలు కీలకం | ... | 327 |

# ప్రథమవర్ధంతి మా తొలి కానుక

**కా**లానికి కళ్ళాలు లేవు. వద్దన్నా కాదన్నా ప్రయాణం అది సాగిస్తూనే వుంటుంది. సుందరయ్య గారు అస్తమించి అప్పుడే సంవత్సరం అయింది. మే 19 రానే వచ్చింది. ఆ మహనీయుడి జ్ఞాపకార్థం యీ తొలి వర్ధంతికి ఏమిటి చెయ్యడం అన్న ఆవేదన కలిగింది. ఆయన జీవిత కథను రాసి ముద్రించుదామంటే ఆయన తన విప్లవ పథాన్ని గురించి చెప్పినదంతా చదవకుండా అటువంటి ప్రయత్నం చేయడం వలన ఆ రచనకు న్యాయం జరగదనిపించింది. కాగా ఆయన ఆత్మకథనే అచ్చు వేద్దామంటే అందులో ఒక భాగాన్ని డీకోడ్ చేయడం సాధ్యపడ్డది. ఇంగ్లీషులో వారు చెబుతుంటే టేప్‌రికార్డు చేయడం జరిగింది. ఆ టేప్‌రికార్డు ప్రసంగాన్ని ఇంగ్లీషులో టైపు చేయించడానికి చాలా శ్రమ, వ్యవధి కావలసి వచ్చింది. మళ్ళీ దాన్ని తెలుగులోకి అనువదించడానికీ వ్యవధి పట్టింది. ఇవన్నీ తర్జన భర్జనలు చేసుకొని, తయారైన మేరకు ఆయన స్వవచనాన్నే పార్టీకి, ప్రజలకు అందించడం యీ వర్ధంతి సమయానికి కానుకగా సమర్పించడం సముచితం అన్న నిర్ణయానికి వచ్చాం. బాల్యదశ, కుటుంబ వ్యవహారాలు, విప్లవోద్యమ ప్రవేశం, తెలంగాణా పోరాట ప్రారంభం, రాజకీయ స్వాతంత్ర్య సాధన, 1948లో కలకత్తాలో జరిగిన రెండవ పార్టీ మహాసభ పరిమాణాలు పేర్కొన్న మేరకు యీ తొలిభాగాన్ని 'విప్లవ పథంలో నా పయనం' అన్న పేరిట ముద్రించి అందిస్తున్నాం.

దీన్ని పేరుకు స్వీయ చరిత్ర అనుకున్నా పార్టీ చరిత్రా, ఆయన జీవితం మిళితమై వున్న మేలు కలయిక ఇది. అదైనా వాస్తవంగా పార్టీ కార్యదర్శి వర్గ కొర్కెను మన్నించి ఆయన చేసిన పని మాత్రమే. ఆయన ఆరోగ్యం క్షీణిస్తూండటాన్ని గమనించిన కార్యదర్శి వర్గం పార్టీ చరిత్రనూ, ఆయన జీవితానుభవాలను భావితరాలకు అందించే ప్రయత్నం చేయమని అదే పనిగా వత్తిడి  చేసింది. పనిభారాన్ని తగ్గించుకొని ఈ చారిత్రక ప్రయోజనం కొరకు ఏమైనా కేంద్రీకరిస్తే కామ్రేడ్స్ ఎ.పి.విఠల్, వి. శ్రీహరి వంటి యువ రచయితల తోడ్పాటు తీసుకోవచ్చని చెప్పి, ఆ ప్రయత్నానికి పూనుకోవడం జరిగింది. ఈ విధంగా ఆయన అంతిమఘట్టంలో రాలినపండు యీ 'విప్లవపథంలో నా పయనం'

దీనికి పెద్దలచే ఒక ఉపోద్ఘాతం రాయించాలని తొలుత తలపెట్టాం. కాని ఈ గ్రంథం పూర్తికాకుండా, దాన్ని చదవకుండా ఉపోద్ఘాతం రాయమనడం అనుచితమని భావించి, ప్రచురణ కర్తలంగానే ఈ సమాచారాన్ని తెలుపుకుంటున్నాం.

కామ్రేడ్ లీలా సుందరయ్య ఆయన దీర్ఘకాల అనుచరుడు కామ్రేడ్ చారి, నవయుగ ఫిలింస్ వారికి సంబంధించిన సూర్యప్రకాశరావుగారు ఎంతో ఓర్పుతో కృషి చేయకపోతే ఇంతలో యీ భాగం అయినా ముద్రణకు సిద్దమయ్యేదిగాదు. అదే విధంగా యీ పని పూర్తి



చేయడానికి, అనువదించడానికి డాక్టర్ ఎ.పి.విఠల్ కృషి గణనీయం. వారందరికీ ప్రచురణకర్తలంగా విప్లవాభినందనలు, ధన్యవాదాలు తెలుపుతున్నాం.

ఆ ఆదర్శమూర్తి, పీడిత ప్రజల ప్రియతమ నాయకుడి జీవిత సందేశాన్ని ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా ప్రజానీకానికి అందించమని ప్రదేశ్ కమిటీ పార్టీశాఖలకు పిలుపు ఇచ్చింది. ఆ సందర్భంగా "ప్రజాశక్తి ప్రచురణాలయం" ఉడతా భక్తిగా యీ ప్రచురణను ప్రజల ముందుంచుతోంది.

**విప్లవాభివందనలతో**

**విజయవాడ** **ప్రచురణ కర్తలు**

**19-5-86**

## మా మాట

**"వి**ప్లవపథంలో నా పయనం" అన్న సుందరయ్యగారి ఆత్మకథ రెండవ భాగాన్ని మీకు ఇందులో అందిస్తున్నాం. మే 1వ తేదీకి ఆ మహనీయుడి 76వ జన్మదినోత్సవం జరుగుతుంది. మే 19వ తేదీకి ఆయన మూడవ వర్ధంతి వస్తోంది. ఆ సందర్భానికి గ్రంథస్తం అయిన యీ అమూల్య ప్రచురణతోపాటు "సుందరయ్య విజ్ఞాన కేంద్ర" నిర్మాణాన్ని కూడా ఆంధ్రప్రదేశ్ ప్రజానీకానికి సమర్పించుకోవాలని దాని ట్రస్టు కమిటీ ఆశించింది. కాని దాని తుది మెరుగులు దిద్దడంలో కొద్ది మాసాలు ఆలస్యం అయ్యేట్లున్నది.

ఈలోగా ఒక విచారకర పరిణామం కలిగింది. ఆయన జీవిత భాగస్వామిని, తోటి కామ్రేడూ శ్రీమతి లీలా సుందరయ్య మార్చి 21వ తేదీన అస్తమించారు. ఆ ఆత్మకథ రెండవ భాగం ప్రచురణకు, విజ్ఞాన కేంద్ర ప్రారంభోత్సవానికి అత్యంత ఆసక్తితో ఎదురు చూస్తూ ఆమె అసువులు బాశారు. ఆమె ఆత్మకథనూ, జీవితగాథనూ కూడా తర్వాత అచ్చువేసి అందించగలమని ఆశిస్తున్నాం.

ప్రథమ వర్ధంతి సందర్భంగా మేము సమర్పించిన యీ ఆత్మకథ తొలి భాగంలో సుందరయ్యగారి బాల్యం నుండి స్వాతంత్ర్యం వచ్చేవరకు చెప్పబడి వున్నది. ఇప్పుడీ రెండవ భాగం తెలంగాణా పోరాటంతో ప్రారంభమై 1976 వరకు చెప్పబడినది. మొదటి భాగం వలెనే యీ రెండవ భాగాన్ని కూడా అందించడానికి డాక్టర్ ఎ.పి. విఠల్ చేసిన కృషి ప్రశంసనీయం.

విప్లవకారులైన కమ్యూనిస్టులకు కామ్రేడ్ సుందరయ్య అనేక విధాల ఆదర్శమూర్తి. ఆయన త్యాగం, దీక్ష అమోఘమైనవి. ప్రజాసేవకులకు, భావిపౌరులకు ఆయన జీవితమే ఒక మహోన్నత సందేశం. అందులో రెండవ భాగాన్ని మరో కానుకగా సమర్పిస్తున్నాం.

**19-4-1988** **విప్లవాభివందనలతో**

**విజయవాడ** **ప్రచురణకర్తలు**

# బాల్యం, కుటుంబం, మా ఊరు

అలగానిపాడు నెల్లూరుజిల్లా కోవూరు తాలూకాలో ఒక గ్రామం. మా నాయన పుచ్చలపల్లి వెంకటరామిరెడ్డి. తల్లిశేషమ్మ. మాది భూస్వామ్య కుటుంబం. మాకు 50 ఎకరాల భూమి వుండేది. పుచ్చలపల్లి కుటుంబం ఆ ప్రాంతంలో చాలా పలుకుబడి గలది.

అందరికన్నా పెద్ద మా అన్న, ఆ తర్వాత వరుసగా నలుగురు ఆడపిల్లలు, ఆ తర్వాత నేను పుట్టాను. సహజంగా ఆ రోజుల్లో మా అమ్మా, నాన్న మిగతా కుటుంబసభ్యులు మగపిల్లవాడికోసం ఎదురుచూస్తుండగా పుట్టాను కదా, అందుకని నన్ను అమితగారాబంగా చూసుకునేవారు. మా చిన్నక్కకు నాకూ 16 నెలలు కూడా తేడా లేదు. మా అమ్మ అంటూండేది "మీ అక్క తాగాల్సిన పాలు కూడా నువ్వే తాగావు. అందుకనే అది అంత బలహీనంగా వున్నది" అని, నా తర్వాత రామచంద్రారెడ్డి డాక్టరు రామచంద్రారెడ్డిగా ఆయన అందరికీ తెలిసినవాడే.

కనిగిరి రిజర్వాయర్ తూర్పు కాలువ క్రింద ఊరుమాది. మాగాణి. మా ఉళ్ళో గతంలో మాదే పెద్ద భూస్వామ్య కుటుంబంగా వుండేది. మా నాయన వాళ్ళు నలుగురు అన్నదమ్ములు. మా నాయన మూడవవాడు. మా తాత హయాంలో ఆ ఉళ్ళో చాలా భూమి మాదే. అయితే అంత భూమిని సేద్యం చేయటం కష్టమయ్యేది. శిస్తులు మాత్రం తప్పేవి కావు. అందుకని ఈ భూములు మా కొద్దు, శిస్తు నుండి మమ్ములను మినహాయించండి అని ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకుని చాలా భూమిని ఆ విధంగా వదిలించుకున్నారు.

మా పొలాల్లో పనిచేసే వ్యవసాయ కూలీలు, జీతగాళ్ళద్వారా నాకు తర్వాత ఒక విషయం తెలిసింది. గ్రామానికి వున్న ఉమ్మడి భూమిలో "నాగలి వాటా" అనో "నాగలి కొట్టువాటా" అనో 'ఎద్దుల వాటా' అనో "కాడివాటా అనో" ప్రతి వారికీ ఒక వాటా వుండేది. అప్పట్లో నాకీ విషయం అంత ముఖ్యంగా తోచలేదు కాని, ఆ తర్వాతి దశలో సమాజాన్ని గుర్చి అర్థం చేసుకునే క్రమంలో, నాటి ఉమ్మడి భూమికి సహజ పరిణామక్రమంలో వున్న ప్రాధాన్యత తెలుసుకున్నాను.



ఇక మా కుటుంబం విషయానికివస్తే, మా అమ్మ మా నాయన రెండో భార్య. మొదటి భార్య పిల్లలు కలగకుండానే చనిపోతే మా అమ్మను చేసుకున్నాడు. మా తమ్ముడు రామచంద్రారెడ్డి తర్వాత ఒక అబ్బాయి పుట్టాడు. కానీ చనిపోయి పుట్టాడు.ఆ తర్వాత 1919 మార్చిలో శివరాత్రి ముందురోజు మా నాయన చనిపోయాడు. అప్పటికి నా కారేళ్ళు. మా పెద్దన్నకు 16 సంవత్సరాలు.

అప్పుడు కొన్ని మూఢనమ్మకాలుండేవి. ఇప్పటికీ అవి పూర్తిగా పోలేదనుకోండి. తన ఆఖరి కొడుకు బతికివున్నట్టయితే మా నాయన కూడా బతికి వుండేవాడని, వాడు చచ్చిపోయి పుట్టటం వల్ల మా నాయన పోయాడనీ – మా అమ్మ అంటూండేది.

మా నాయనను గుర్చి కొంచెం నాకు గుర్తువున్నది. చెప్పాను గదా మా నాయన వాళ్ళు నలుగురు అన్నదమ్ములని. ఆస్తుల పంపకాల సందర్భంలో గొడవలుండేవి. ఊరునడాన పెద్ద ఖాళీ స్థలమూ, పెద్ద బంగళా పెంకుల యిల్లు మాది. ఒక రోజు మా నాయన ఇంటి ముందు మంచం మీద కూర్చున్నాడు. పెద్దగా అరుచుకుంటూ మా చిన్నాన్న పిల్లలు మా నాయనను కొట్టేందుకు వచ్చారు. అప్పటికే మా నాయన వృద్ధుడు. అయినా పక్కనే వున్న "వసికట్ట" ఒకటి తీసుకుని ఎదుర్కొన్నాడు. తర్వాత వాళ్ళు వీళ్ళు వచ్చారు, సర్దారు. గ్రామాలలో తగాదాల స్వరూప స్వభావాలకు యిది ఒక ఉదాహరణ. అలాగే యింకోసారి మా యింట్లో నీళ్ళబావి దగ్గర తగాదా అయి మా నాన్నకు ప్రత్యర్థులుగా వున్న వాళ్లు మా పశువులకు నీళ్ళు పెట్టే పెద్ద తొట్టెను పగులగొట్టారు.

మా నాయనతో పాటు నేనూ, మా తమ్ముడూ అప్పుడప్పుడు చేనుకెళ్తుండే వాళ్ళం, జీతగాళ్ళు, వాళ్ళు వుండే వాళ్ళు. మా నాయనను చేపలు పట్టి తనకో చిన్నచేప నివ్వమని మా తమ్ముడు మారాం చేసేవాడు. అదీ మా నాన్నే చెయ్యాలి. ఇంకెవ్వరు చేసినా మారాం చేసేవాడు. ఒకోసారి శ్రద్ధగా మా తమ్ముడు కోరినట్లే మా నాయన చేసేవాడు. ఒక్కోసారి కోప్పడేవాడు.

ఒకసారి మా నాయన చేనుకు వెళ్తుంటే మామూలుగా మా తమ్ముడు వెంటపడ్డాడు. మా అమ్మను కేకేసి "వీడ్ని రానివ్వకు. నువ్వే జాగ్రత్తగా అట్టేపెట్టుకో" అని చెప్పి వెళ్ళిపోయాడు. మా అమ్మ ఏదో పొయ్యి మీద పెట్టి ఆ సందర్భంలో వాణ్ని పట్టించుకోలేదు. మా తమ్ముడు రోడ్డున పడ్డాడు. ఎవరిదో ఎద్దు కట్టువిప్పుకుని బజారున పడ్డది. అది మా తమ్ముడు కాలు తొక్కింది. గాయం, నెత్తురూను.

మా అమ్మ గబగబా వచ్చి, వాణ్ణి తీసుకుని ఏడుస్తూ కాలికి పసుపూ అదీ రాస్తున్నది. అయినా నెత్తురు బాగానే కారుతున్నది. ఇంతలో మా నాయన వచ్చాడు. మా అమ్మకు రెండు తగిలించాడు. "నిన్ను పిల్లాణ్ణి చూడమని చెప్తే, అంత నిర్లక్ష్యంగా వదిలిపెడతావా! ఈ నెత్తురు చూసి ఏడుస్తున్నావ్! ఏడిస్తే వాడి గాయం మాస్తుందా?' అని అరిచాడు. తండ్రికి కొడుకు

మీద వుండే ప్రేమనే గాక, తన కోపాన్ని ఏ తప్పు చెయ్యని భార్య మీద చూపించే ధోరణి కూడా వెల్లడయిందన్న మాట! ఆ తర్వాత నా జీవితంలో కుటుంబాల సంబంధాల పట్ల అవగాహన విషయంలో ఈ ఘటన ప్రభావం వుంది.

మా నాన్న పొలంలో దిగి ప్రతిరోజూ పనిచేసేవాడు కాదు. అయినా, దుక్కి దున్నడంలో, నాట్లు వేయడంలో, మోపులు మొయ్యడంలో, కోతకోయడంలో, తూర్పారపట్టడంలో, నూర్పిళ్ళలో మా నాన్న "మంచి పనివాడు" అని మా జీతగాళ్ళు అనేవాళ్ళు. ఊళ్ళో ఎవరూ ఆయనకిలాంటి వ్యవసాయ పనుల్లో సాటిరారు అని చెప్పుకునేవారు. తను చేసి, ఇట్లా చెయ్యాలని పనివాళ్ళకు చూపించేవాడు.

## వీధి బడిలో విద్యాభ్యాసం

మా వుళ్ళో ఒకటే వీధి బడి వుండేది. గవర్నమెంటు స్కూలు గాని, గుర్తింపబడిన స్కూలుగానీ లేదు. అక్కడ నాకు గుర్తున్నంత వరకు పంతులుగారి పేరు ఏచిలూరి సీతారామయ్యగారు. ఆబళ్ళోకే వ్యవసాయదార్ల పిల్లలు, చేనేత వాళ్ళ పిల్లలు వెళ్ళేవారు. హరిజనులు తదితరులకు బడి అంటూ లేదు. ఈ బళ్ళోకి వాళ్ళను చేర్చుకునేవారు కారు.

నన్నుబడికి పంపించాలంటే మొదట్లో బ్రహ్మప్రళయం అయ్యేది. నేను అల్లరి పిల్లవాణ్నని పేరు. బడికి పోనని మొరాయించేవాణ్ని. బలవంతంగా లాక్కెళ్ళి కూర్చోబెట్టేవారు. అక్కడ యేదో అల్లరి చేసేవాణ్ని. ఒకటి రెండుసార్లు పంతులుగారు బెత్తం విరిగిపోయేట్లు కొట్టారు కూడా!

ఆ తర్వాత స్కూలుకెళ్ళటం అలవాటయింది. ఇక "బడి"కి వెళ్ళడం, పాఠాలు వల్లెవేయటం అంతా సజావుగా జరిగేది. అప్పుడు మాకు "పెద్ద బాలశిక్ష" పాఠ్యగ్రంథం. అందులోని అక్షరాలు, ఎక్కాలు, వీటన్నింటా చురుకుగా అందరికన్నా ముందు వుండేవాణ్ని. మా పంతులుగారి దృష్టిలోనే కాదు, పిల్లలందరి దృష్టిలో కూడా నేను బాగా చదివే పిల్లవాణ్ని? కోటంరెడ్డి కోటిరెడ్డి అని మా బంధువులు కుర్రవాడు అప్పట్లో మాకు "మానేటర్"గా వుండేవాడు. అంటే పిల్లలకు నాయకుడన్న మాట! ఆ తర్వాత కాలంలో మా గ్రామంలో నేను చేపట్టిన కార్యక్రమాలలో నాతోపాటు ఉత్సాహంగా పాల్గొనేవాడు. అలాగే మా అక్క కూడా అక్కడే చదివేది. వీళ్ళిద్దరూ నాకు మిగతా పిల్లలింకా నేర్చుకోని పెద్దబాల శిక్షలోని పాఠాలు చెప్పేవాళ్ళు. అది కూడా నేను చాలా త్వరగా పెద్దబాలశిక్ష పూర్తి చేయడానికి దోహదపడింది.

నాకు బాగా గుర్తు! నేల మీద అక్షరాలు, గుణింతాలు అవీ నేను రాయడం మా పంతులుగారు మిగతా పిల్లలతో అనేవారు "వాడు చూడండి మీ అందరికంటే చిన్న అయినా అప్పుడే ఎంత తొందరగా నేర్చుకొంటున్నాడో" అని. 20వ ఎక్కం వరకు గడగడా అప్పచెప్పగలిగేవాణ్ని. అంతేకాదు – అప్పటికి వేమన, సుమతీ శతకాల్లోని పద్యాలు కొన్ని కంఠతా వచ్చేవి. వీటి ప్రభావం ఆ తర్వాత నా జీవితంలో ఖచ్చితంగా వుంది. పెద్దయిన తర్వాత మరింత క్షుణ్ణంగా ఈ శతకాలను చదివాను.



ఈ రోజుల్లో విద్యావిధానం మరింత శాస్త్రీయంగా రూపొందించబడింది. కానీ ఆ రోజుల్లో అక్షరాలు, గుణింతాలు, ఎక్కాలు "పెద్ద బాలశిక్ష" చిన్నపద్యాలు – ఇవి వుండేవి. అయితే ఇప్పుడున్న శాస్త్రీయ విద్యా విధానం మంచిదా, ఆనాటి పద్ధతి మంచిదా అంటే చెప్పగలంతటి అధికారయుత సామర్థ్యం నాకు లేదు. ఏమైనా అప్పుడున్న ఆ పాత పద్ధతి నా వరకూ నాకు మంచినే చేసింది.

## మా ఊరు

ఇక మా అన్న చదివింది ఆ వీధిబడి చదువు మాత్రమే. మా నాయనతో పొలం వెళ్ళి వచ్చేవాడు. మా అమ్మ, మిగతా మా అక్కలూ ఇంటి పనంతా చేసేవారు. వూళ్ళో బావుల్లో నీరు కొంచెం ఉప్పుగా వుండేవి. మంచి నీళ్ళ బావి దూరంగా వుండేది. అంత దూరం నుంచి మంచినీళ్ళు మాత్రం హరిజనేతర జీతగాళ్ళు తెచ్చేవాళ్ళు.

నేను కొంచెం చదువుకుని ఇంటికి వచ్చేవరకు కూడా హరిజనులు పక్కలేయడం పాలు పిండటం, మంచి నీళ్ళు తేవటం వంటి పనులు చేయకూడదని వుండేది. పశువుల కొట్టం శుభ్రం చేయటం, బల్లలూ అవీ తుడిచి శుభ్రంగా వుంచటం – ఇలాంటి పనులు చేసేవాళ్ళు. అయితే గిన్నెలు తోముకోవడం, వంటపని, ఇల్లు ఊడ్చుకోవడం, పాలు పితుక్కోవడం వంటి ఇంటి పనులు మా అమ్మ, మా అక్కలు చేసేవారు. మా అక్కలందరికి వీధిబడి చదువులే! ఆ బడిలో చదువంటే పెద్దబాలశిక్ష, శతకాలు తెలుగు రామాయణ, భారత గాథల్లో కొన్ని భాగాలు! దాంతో చదువు పూర్తయినట్లే. ఇక భూగోళమూ, చరిత్ర, సామాన్య శాస్త్రము ఇలాంటి అంశాలు వుండేవేకావు.

మా వూళ్ళో వ్యవసాయదారులు ప్రధానంగా రెడ్లు. వాళ్ళ చేతుల్లోనే 70 శాతం భూమి వుండేది. ఆ తర్వాత నేతపని చేసుకునే పద్మశాలీలు. వాళ్ళు ప్రధానంగా నేత పనిమీద ఆధారపడేవారు. సంఖ్యారీత్యా ఎక్కువగానే వుండేవారు. వాళ్ళకు నలుమోలు వెంకయ్య అనే ఆయన నాయకుడు. తగాదా ఎట్లా మొదలయిందో నేను విచారించలేదు గానీ ఆ పద్మశాలీలకు, రెడ్లకు యెప్పుడూ పడేదిగాదు. ఈ రెడ్డి భూస్వాముల నెదుర్కోవడంలో మాత్రం వాళ్ళంతా ఐక్యంగా వుండేవాళ్ళు.

ఇక హరిజనులు – వాళ్ళలో మాల, మాదిగ, వారిలో మాదిగవారు చాలా తక్కువ సంఖ్యలో 10-20 ఇళ్ళు వుండేవి. మాల కుటుంబాలు 150 – 200 దాకా వుండేవి. ఈ మాలవాళ్ళ ప్రధానంగా వ్యవసాయ కార్మికులు, మాదిగవాళ్ళ ప్రధానవృత్తి చెప్పులు కుట్టడం. చనిపోయిన పశువులను తీసుకెళ్ళి – వాటి చర్మాలతో ఊళ్ళోవాళ్ళకి చెప్పులుకుట్టి యిచ్చేవారు. అందుకు ఏడాదికి ఇంత అని వారికి ధాన్యరూపంలో వినియోగదార్లు ముట్టజెప్పేవారు.

"గౌడు"లు వుండేవారు. వారు కల్లుగీయడం కన్నా వ్యవసాయ కార్మికులు గానే ప్రధానంగా జీవనం గడిపేవారు.

ఇక మామూలు చాకలివాళ్ళు, వడ్రంగులు, కమ్మరులు – వీళ్ళు కొద్ది సంఖ్యలో వుండేవారు. వ్యవసాయం తరుణం వచ్చేసరికి ఈ వడ్రంగులు, కమ్మరులు వ్యవసాయ పరికరాలను చేయడం లేదా చెడిపోయిన వాటిని బాగుచేయడం – అదీ చేసేవాళ్లు! చిన్నతనంలో కొలిమిదగ్గర వాళ్ళపని అదీ తమాషాగా వుండేది. కానీ, 1930 – 32 ప్రాంతంలో మా గ్రామంలో నేను పనిచేయడం మొదలెట్టిన తర్వాత గానీ యీ వడ్రంగుల పని ఎంతకష్టమో అర్థం కాలేదు. మా ఊళ్ళో వడ్రంగులే "బండి"ని పూర్తిగా చేసేవాళ్ళు. వైశ్యులు – వ్యాపార కుటుంబాలు – చాలా తక్కువగా వుండేవారు. మా భూములు అంత మంచి సారవంతమైనవి కావు. నీరు కూడా ఒక్క పంటకు సరిపడా కాలువల ద్వారా లభ్యమయ్యేది.

అప్పుడు యింతగా రసాయన ఎరువుల వాడకం లేదు. మామూలు ఎరువులే. ఎకరానికి 1 పుట్టి పండితే మామూలుగా పండినట్లే! ఇప్పుడు లెక్క ప్రకారం పుట్టి అంటే పదమూడున్నర బస్తాలు. 75 కేజీల బస్తాలన్నమాట! బాగా పండితే ఒకటిన్నర పుట్టి పండేది. అర పుట్టి పండితే చాలా నాసిగా పండినట్లు!

అప్పటికే రైత్వారీ పద్ధతి అమల్లో వున్నది. కౌలుకిచ్చే భూమి చాలా తక్కువ. ఈ భూస్వాములలో అధికభాగం వ్యవసాయ కూలీలను జీతగాళ్ళను పెట్టుకుని పర్యవేక్షణ చేసుకుంటూ తామే వ్యవసాయం చేసేవాళ్ళు. 20 ఎకరాలు, ఆ లోపు వున్న వాళ్ళంతా పొలంలో శరీరకష్టం చేసేవారే!

బాగా ధనవంతులైన కుటుంబాల స్త్రీలు పొలానికి వెళ్ళి పనిచేసే వాళ్లు కాదు. ఇంట్లో పని మొత్తం చేసుకునేవాళ్ళు. అవసరాన్ని బట్టి, పొలం పనిమీద పర్యవేక్షణ మాత్రం వుండేది. మిగతా కుటుంబాలలో స్త్రీలు మాత్రం తప్పకుండా పొలం పనికి వెళ్ళేవారు.

వ్యవసాయ కూలీలకు దినసరి కూలిగానీ, లేదా జీతగాళ్ళకు సంవత్సర వేతనంగానీ, ధాన్యరూపంలోనే చెల్లించేవారు. రోజుకు సుమారుగా ఒక మానిక ధాన్యం కూలిగా వుండేది. ఇక జీతగాళ్ళ పనివేతనాన్ని బట్టి అర్ధపుట్టి నుండి పుట్టిన్నర దాకా వేతనం వుండేది.

ఇళ్ళల్లో పనిచేసే వాళ్ళకు మూడు పూటలా భోజనం పెట్టేవారు. కాని తెల్లవారు ఝాము 4 గంటల నుండి రాత్రి 9 గంటల దాకా పనిచెయ్యాల్సి వచ్చేది. ఇళ్ళల్లో పనిచేసే వాళ్ళు వ్యవసాయ కార్మికులుగా కూడా ఉండేవారు. వాళ్ళు ఉదయం 8 గంటల కల్లా చేలో దిగి చీకటిపడేదాకా పనిచేసేవారు. పని తక్కువగా ఉన్న సందర్భాలలో బళ్ళకు మోకులు, ఎద్దులకు, ఇతర అవసరాలకు వాళ్ళు తాళ్లు పేనుతూ ఉండేవారు. పని బాగా సరిపడా వుండేదా లేదా అన్నది వేరే విషయంగానీ మొత్తం ఏడాది పొడుగునా వారికి పనిమాత్రం ఉండేది.

వ్యవసాయ కార్మికుల భార్యలు కూడా వ్యవసాయ తరుణంలో తమ భర్తలను పనిలో పెట్టుకున్న రైతువద్ద పనిచెయ్యాలి. అయితే ఆ స్త్రీ వ్యవసాయ కార్మికులకు పురుషులకిచ్చిన దానికన్నా తక్కువ కూలి ఇచ్చేవారు. మాసూళ్ళు అయిన తర్వాత పొలాల్లో మిగిలిన "పరిగె"



ఏరుకునే 'హక్కు' వారికుండేది. ఈ 'పరిగె'పై చిన్న తగాదాలు కూడా వచ్చేవి. అసలు "పరిగె" మిగలనియ్యలేదని కూలీలు, కావాలని ఎక్కువగా వదిలిపెడుతున్నారు కూలీలని రైతులు అనేవారు. ఆ తర్వాత నేను ఊళ్ళో సంఘాలు స్థాపించే సందర్భంలో ఆ గొడవంతా దేనికి అని కూలీలతో "ఈ పరిగె బదులు ఏదో ఒక నిర్దిష్టమైన మొత్తాన్ని తీసుకుని, పొలం శుభ్రంగా ఊడ్చి, మిగిలిదంతా రైతు ముఖానే కొట్టరాదా" అని చెప్పాను. అలాగే రైతులతో "ఇంత చిల్లర విషయాలపై తగాదా దేనికి, కూలీలకు అదనంగా యివ్వండి శుభ్రంగా వూడ్చమనండి" అని చెప్పాను. అయితే యిరుపక్షాలూ ఆ ప్రతిపాదనను అంగీకరించలేదనుకోండి:

అలాగే మాసూళ్ళ సమయంలో ఒక "మోపు" ఉచితంగా కూలీలు తీసుకువెళ్ళే 'హక్కు' ఉండేది. ఆ మోపును నూర్చుకుంటే మహారాత్లే ఒక 'బుట్టెడు" ధాన్యం రాలేది. అయితే దాన్ని ఒక "హక్కు"గా కూలీలు భావించేవాళ్ళు. నిజానికి కూలీలను సంతృప్తిపరచటానికి, మోసం చేయటానికి యిలాంటివి ఫ్యూడల్ మార్గాలు.

కొత్త ధాన్యం వచ్చిన తర్వాత కొత్త బియ్యంతో రైతుల ఇళ్ళల్లో తీపి పిండి వంట చేసుకుని, ఆ రోజు యింటికొచ్చిన అందరికీ పెట్టేవాళ్ళు. ప్రధానంగా సంక్రాంతి పండుగ పెద్ద పండుగగా ఉండేది. ఆ పండుగ నాడు అలాంటి తీపి వంట కూలీలకు కూడా పెట్టే వాళ్ళు.

రైతు దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి కొన్ని సందర్భాలలో శీతాకాలంలో కంబళి ఒకటి కొనిచ్చేవాళ్ళు. ఆ తర్వాత దాన్ని ఒక డిమాండ్‌గా రూపొందించి అందరు జీతగాళ్ళూ సాధించుకున్నారు.

అలాగే జీతగాళ్ళకు పెట్టుబడి అని కొంత మొత్తాన్ని ఒక్కసారే ఇవ్వాలన్న డిమాండ్‌ను కూడా సాధించుకున్నారు. అయితే రోజు కూలీలుగా వుండే వాళ్ళకు వారానికొకసారి వాళ్ళకు రావలసిన కూలీ ఇచ్చేవాళ్ళు. అంతకన్నా ఎక్కువ అవసరం పడితే కూలీలు "నాము" అనే పేరుతో అధిక వడ్డీ చెల్లింపవలసివచ్చేది. కొన్ని కొన్ని సందర్భాలలో, తీసుకున్న మొత్తాలలో సగానికి పైగా ఈ 'నాము' వుండేది. ఈ విషయమై ఆ తర్వాత నేనూ పోరాడాను.

కూలీలకు ఎలాగూ ధాన్యం వాళ్ళు చేసిన పనిని బట్టి మీరు ఇవ్వవలసిందే కదా, ఒకోసారి సంవత్సరాంతానికి గాని వాళ్ళ వేతనం వాళ్ళకు పూర్తిగా ఇవ్వరు కదా మరి అలాంటప్పుడు కూలీలు నష్టపోయినట్లే గదా. అలాగాక వాళ్ళకి ముందుగా ఎందుకు కొంత పైకం ఇవ్వకూడదు. ఈ 'నాము' పద్ధతి సరైనది కాదని నేను వాదించేవాణ్ని:

పైగా, ఈ జీతగాళ్ళకు ఎలాంటి సెలవులు వుండేవి కావు. ఏటెల్లకాలం పని చెయ్యాల్సిందే. కొన్ని సందర్భాలలో రైతు "చిత్తా"న్ని బట్టి 10–15 రోజులు జీతం కోత లేకుండా జీతగాళ్ళకు సెలవు దొరికేది. కనుక 15 రోజుల నుండి 30 రోజుల వరకూ ఇలా అవసరమై పనికి రాలేకపోతే, జీతగాళ్ళ వేతనంలో కోత వుండకూడదని కూలీలు డిమాండ్ చేశారు. పోరాటానికి ఇది ఒక పెద్ద సమస్యే.

ఈ అనుభవాలన్నీ 1928 – 30 మధ్య కాలంలో నేను గ్రామంలో పనిచేసే రోజుల్లో వ్యవసాయ కార్మిక సంఘ డిమాండ్లను రూపొందించడానికి తోడ్పడ్డాయి.

1917లోనో 18లోనో మా ఊళ్ళో మలేరియా వ్యాధి తీవ్రంగా ప్రబలింది. మా పెద్దమ్మ భర్త ఆ జబ్బుతో మంచం పట్టాడు. అప్పుడు నాకు 5 సంవత్సరాలు. చిన్న వయస్సయినా, బాగా జ్ఞాపకం వుండే వయస్సే: ఆయన పక్కనే కూర్చుని ఆయన నిద్రపోకుండా చూడాలి: ఆ వూళ్ళో వైద్యుడు చెప్పినదేమంటే, ఆయన నిద్రపోతే జ్వరం మరీ తీవ్రమౌతుంది కనుక మెలుకువగా వుండేటట్లు చూడాలి అని. అప్పుడైతే కాపలా కాశాను కానీ, ఎంత పనికిమాలిన సలహా:

ఆయన కళ్ళు మూసుకుంటే లేపాలి: లేపినా లేవకపోతే పెద్దవాళ్ళ నెవరినయినా పిలవాలి: అదీ పని. అయితే ఆయన చనిపోయాడు.

మా పెద్దమ్మకప్పుడు 16–17 సంవత్సరాలుంటాయి. జీవితాంతం ఆమె వైధవ్యాన్నే అనుభవించింది. తర్వాత తన తల్లిగారి వూరు దామరమడుగు వెళ్ళి అక్కడే వుండిపోయింది. ఆమె జీవితం కూడా ఆ తర్వాత కాలంలో స్త్రీల సమస్యల విషయంలో ఆలోచించేటప్పుడు నన్ను ప్రభావితం చేసింది.

మా నాయనకు డయాబిటిస్ వ్యాధి వుండేది. తన అరవయ్యో సంవత్సరంలో 1919లో ఆయన చనిపోయాడు. మా అన్న మా నాయనగారి అంత్యక్రియలు జరిపాడు. ఆయన కాళ్ళు రెండూ దగ్గరకు జేర్చి కట్టటం అదీ నాకు గుర్తు. ఆయన మరణం తర్వాత మా చిన్నాన్నలతో, వారి పిల్లలతో తగాదాలు సమసిపోయాయి. మా నాయన చనిపోయినప్పుడు వాళ్ళూ వచ్చారు.

ఆ తర్వాత మా కుటుంబ వ్యవహారాలను చూసే బాధ్యత మా అమ్మ తీసుకున్నది. పొలం పనులన్నీ శ్రద్ధగా పర్యవేక్షించేది. తాను కూడా వ్యవసాయంలో దిగబడి ఒకోసారి చీకటిపడ్డ తర్వాత గానీ పొలం నుండి వచ్చేది కాదు. అయితే పెద్దవాడవుతున్న కొడుక్కి కుటుంబ బాధ్యతలను పర్యవేక్షిస్తున్న తల్లికి సహజంగా వచ్చే వైరుధ్యాలే మా అన్నకు మా అమ్మకు మధ్య వచ్చేవి. మా అన్నే చివరికి దిగివచ్చి అమ్మను అనుసరించేవాడు.

మా అన్న వివాహం 1927లో జరిగింది. మా పెద్దక్క వివాహం 1929లో జిల్లా మున్సిఫ్ వీరాస్వామిరెడ్డి గారితో జరిగింది. ఆయనకిది ద్వితీయ వివాహం. మొదటి భార్య ఇద్దరు ఆడపిల్లల్ని కన్న తర్వాత చనిపోయింది. పెళ్ళి నాటికి ఆయనకు 32 సంవత్సరాలు. మా అక్కకు 16 సంవత్సరాలు.

ఆయన చిదంబరం ప్రాంతంవాడు. చాలాకాలం క్రిందట వాళ్ళ తాత తండ్రులు అక్కడకు వెళ్ళి స్థిరపడ్డారు. రెడ్డి కులస్థుడు. మంచి పదవిలో వున్నాడు. మొదటి భార్య కూడా



కావలి ప్రాంతం. అందువల్ల మా అక్కతో వివాహం జరిపి వుంటారు. ఆ రోజుల్లో కట్నం యింత విస్తారంగా, ఎక్కువగాలేదు. ఏదన్నా యిచ్చినా యిష్టానుసారమే గానీ బలవంతం ఏమీ ఉన్నట్లు నాకు గుర్తులేదు. మేమూ భూస్వాములమే: అయినా మామూలుగా బట్టలు, నగలు తప్ప పెద్దగా ఏమీ యిచ్చినట్లు లేదు. పైగా మా బావగారు పెద్ద ఉద్యోగి ఏమైతేనేం పెళ్ళికి బాగా ఖర్చు పెట్టి చేసినట్లున్నాము గాని, కట్నం ఏమీ యివ్వలేదు.

మా మిగతా ముగ్గురి అక్కలకు కూడా ఏవో చిన్న చిన్న లాంఛనాలు, నగలు, బట్టలు తప్ప ఏమీ కట్న రూపేణా యిచ్చినట్లు లేదు.

# బావగారి నీడలో చదువు - తొలి పాఠాలు

**మా** పెద్దక్క వివాహం జరిగేనాటికి మా బావగారు కర్నూలు జిల్లా మునిసిఫ్: ఆ తర్వాత ఆయనకు తిరువళ్ళూరు బదిలీ అయింది. నన్నూ, తమ్ముణ్ణి చదివించే బాధ్యత మా పెద్దక్క తీసుకుని, మమ్మల్ని తనతో తిరువళ్ళూరు తీసుకువెళ్ళింది. ఆ విధంగా మా ఊరు చదువులకోసం వదిలిపెట్టాను.

తిరువళ్ళూరులో మూడు, నాల్గు, అయిదు తరగతుల వరకు చదువుకున్నాను. మా తమ్ముడు ఒకటి, రెండు, మూడు తరగతులు అక్కడ చదివాడు.

నా విద్యాభ్యాసం యెలా జరిగిందో, నన్ను తీర్చిదిద్దిందో చెప్తాను.

బడిలో చేర్చుకొనేటపుడు, నాకు పరీక్షపెట్టి 4వ తరగతికి పనికి రానని 2వ తరగతిలోనే చేర్చుకున్నారు. దాని పేరు రెస్లెన్ ఉన్నత పాఠశాల. ప్రాథమిక విద్య అంతా తమిళంలో సాగేది. నాకు తమిళం ఒక్క అక్షరం ముక్కరాదు.

నాకు పాఠాలు సరిగా బోధపడేందుకు వీలుగా "వెంకటస్వామి" అని తెలుగు పంతులునొకర్ని మా బావగారు నియమించారు. ఆయన చాలా మంచివాడు. తెలుగులో పండితుడు. తమిళంలోంచి తెలుగులోకి అన్నీ అనువదించి బోధించేవాడు. ఆయన తెలుగుపాండిత్యం అపారం అని చెప్పాను కదా: తెలుగుపై నా ఆసక్తి ఆయన పెంచినదే: అప్పటికే నాకు ఎక్కాలు, చిన్న చిన్న లెక్కలు వచ్చును గదా: పాఠాలేమీ పెద్ద కష్టంగా వుండేవి కావు : ఇంగ్లీషు మొదలయింది ఇపుడే కదా: పైగా నాకు తెలుగులో మా ఉపాధ్యాయులు బోధించేవారు గనుక తేలిగ్గానే వుండేది. కానీ చిక్కల్లా ఎక్కడంటే వాళ్ళు తమిళంలో ప్రశ్నలడిగేవారు. బదులు చెప్పేందుకు తమిళం నాకు వచ్చేది కాదు.

ఒక్కోసారి చాలా తక్కువ మార్కులు వేసేవారు. మా బావగారు యెందుకు తక్కువ మార్కులు వచ్చాయి అని అడిగేవారు. "నన్నేం చేయమంటారు. వాళ్ళు అడిగారు, నేను రాశాను. కానీ మేం అడిగింది ఇది కాదు అని వాళ్ళు తక్కువ మార్కులు వేశారు" అని చెప్పేవాణ్ణి. మొత్తం మీద నేను క్లాసులో బాగా చదివే విద్యార్థి క్రిందనే లెక్క. చాలాసార్లు మంచి మార్కులు వచ్చేవి.



మా తమ్ముడు వాళ్ళ క్లాసులో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో వుండేవాడు. వాడి చదువు మొదలవడమే తమిళంలో మొదలైంది కదా: బహుశా నా కన్నా తెలివిగలవాడు కూడానేమో:

ఇంగ్లీషులో నాకు మంచి మార్కులు వచ్చేవి. లెక్కలు వుండేవి. వాటికి "స్టెప్స్"కావాలి: నేను ఆ పద్ధతిలో కాకుండా చేసేవాణ్ని. జవాబు సరిగ్గానే వచ్చేది. స్టెప్స్‌యేవి అని అడిగేవారు. నాకేమో వాటిని రాయడం తమిళంలో కష్టంగా వుండేది. "మీకివన్నీ దేనికి – నేను చేసిన పద్ధతి తప్పు అయితే చెప్పండి జవాబు తప్పైతే చెప్పండి" అని పంతులుగార్నే ప్రశ్నించేవాణ్ని.

ఆనాటి నుండే మాతృభాషకాని ఇతర భాషల్లో పాఠశాలలో విద్యాబోధనకు నేను వ్యతిరేకిని. శాస్త్రీయంగా చూసినా అర్థం చేసుకోవడం, వ్యక్తీకరించడం మాతృభాషలో అయితేనే సులభంగా వుంటుంది.

నాకు తెలుగు చెప్పే పంతులుగారు నాకు తెలుగు సాహిత్యంపై అభిరుచి కల్గించాలని చాలా శ్రద్ధ వహించారు. తెలుగు భాష అందాన్ని గూర్చి వివరించాడు. తెలుగు పద్య కవితల గూర్చి ఎంతగానో చెప్పేవారు. ఫలితంగా తెలుగు సాహిత్యంపై నాకు ఎంతో అభిమానం కలిగింది. మా బావగారికి చిన్న గ్రంథాలయం వుండేది. అందులో చాలా తెలుగు పుస్తకాలు నవలలు వుండేవి. మా పంతులుగారి పుణ్యమా అవి నాకు బాగా చదివే అలవాటు అయింది.

ఆయన ఆ రోజుల్లోనే అంటే 5వ తరగతి చదివే రోజుల్లోనే నాచేత మొల్ల రామాయణం చదివించారు. నాకు అర్థమయిందనే చెప్పాలి. నాకు వ్యాకరణం ప్రాథమిక సూత్రాలు కూడా అప్పుడే ఆయన బోధించారు. అంతేకాదు, పద్యాలు ప్రత్యేకించి కందపద్యము, ఆటవెలది వీటి గణ విభజన గూర్చి నేర్పారు. ఆ రోజుల్లో ఆ రెండు రీతుల్లోనూ నేను పద్యాలు కూడా రాశాను. ఎక్కడో వుండాలి.

ఏది ఏమైనా, నేను మాత్రం ఎప్పుడూ ఏదో చదువుతూనే వుండేవాణ్ని. నన్ను బాగా ప్రభావితం చేసింది నారాయణమూర్తి గారి "విమల" అనే నవల. రాజస్థాన్‌పై ఔరంగజేబు దండయాత్ర – రాజా రాజసింహుని ప్రతిఘటన – దురాక్రమణదారుణ్ణి వెనక్కి కొట్టాలి అన్న భావాన్ని నాలో ఆ నవల కల్గించింది. ఆ తర్వాత కూడా చారిత్రాత్మక నవలలు తదితర నవలలు చాలా చదివాను. నేను రాజమండ్రి వెళ్ళిన తర్వాత కూడా వివిధ గ్రంథాలయాలలో – అందుబాటులో వున్న నవలలన్నీ దాదాపు చదివాను.

అయితే "విమల" నవల దేశరక్షణ కోసం ఎంతగా తెగించి అయినా పోరాడాలి అన్న భావన నాలో కల్గించింది. రాజపుత్రులు, వారి పోరాటాలు, రాణా ప్రతాప్‌సింగ్ చరిత్రలు ఇవన్నీ నన్ను ఎంతో వుత్తేజపరిచాయి.

అలాగే అప్పట్లో చదివిన రాయచూర్ యుద్ధము, విజయనగర సామ్రాజ్యం కృష్ణదేవరాయ – తిమ్మరుసు, ఇవన్నీ తమ మాతృభూమి మీద దురాక్రమణను వారెలా తిప్పికొట్టిందీ తెలియజేశాయి. బహుశా ఆ తర్వాత దేశ స్వాతంత్రోద్యమంలో పాల్గొనేందుకు కావలసిన దేశభక్తి భూమికను అవి కలుగజేసి వుంటాయి.

మా బావగారు నవ్వుతూ అనేవాడు "సుందరయ్య కొంచెం పెద్దవాడయినట్లయితే, సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని వుండేవాడని" అప్పట్లో మిత్రుల కబుర్లలో వుద్యమమూ, వురేగింపులు అనేపదాలు తరచు దొర్లుతుండేవి.

ప్రశ్న: ఆ రోజుల్లోనే మిమ్ముల్ని "సుందరయ్య" అని పిలిచేవాళ్ళా?

సామాన్యంగా ఇళ్ళల్లో వెంకట సుందరరామిరెడ్డి అని పిలవరు. ఆ విధంగా 'సుందరయ్య' అనేవారు. ఈ వెంకట అన్నది మా కుటుంబంలో అందరి పేర్లలోను వున్నది. మా నాన్నకు మొదటి భార్యకు పిల్లలు లేకపోయే సరికి తిరుపతి వెంకటేశ్వర్లుకు మొక్కుకున్నాడు – తనకు కలిగే పిల్లలందరికీ ఆయన పేరు పెట్టుకుంటానని : అందుకే మా పెద్దన్న వెంకట రమణారెడ్డి. నేను వెంకట సుందర రామిరెడ్డిని. మా తమ్ముడు వెంకట రామచంద్రారెడ్డి.

ఆ తర్వాత 1928లోనో 30లోనో గాంధిగారి ప్రభావంతో సత్యాగ్రహ ఉద్యమంలో చేరినపుడు ఈ "వెంకట" రామి "రెడ్డి" వీటిని వదిలించుకున్నాను. "సుందరయ్య" నయ్యాను. ఇప్పుడు చాలామంది సుందరయ్య అని కూడా అనరనుకోండి. "పి.యస్." అంటారు.

అదలా వుంచుదాం. మా బావగారు నాలో తిరుగుబాటు తత్వం కూడా గమనించారు. ఆ విషయం కూడా ఆయన బాహాటంగానే అనేవారు.

అయితే మా బావగారికి మొదటి భార్యవల్ల ఇద్దరు ఆడపిల్లలుండేవారని చెప్పాను కదా, వాళ్ళకూ మాకు – అంటే నాకు, మా తమ్ముడికి పడేది కాదు. ఎప్పుడూ ఏదో వాదులాటలు, తగాదాలు, వాళ్ళు మమ్మల్ని కొట్టడం, మేము వాళ్ళని కొట్టడం కూడా జరుగుతుండేది. ఏదో మామూలుగా పిల్లల తగాదాల్లాంటివి.

అప్పట్లో మా బావగారివద్ద గుమాస్తా ఒకాయన మద్రాసు వాస్తవ్యుడు. ఆయనతోపాటు నన్నూ, మా తమ్ముణ్ణి మద్రాసు విజ్ఞానయాత్రకు మా బావగారు పంపారు. తిరువళ్ళూరు నుండి మద్రాసుకు 10 స్టేషన్లు వుండేవి, మద్రాసులో జూ, మ్యూజియం, హైకోర్టు, లైట్‌హౌస్ ఆ గుమాస్తా ఎంతో శ్రద్ధగా చూపించారు. నేనెంతో ఆశ్చర్యపోయాను. అవన్నీ చాలాకాలం బాగా గుర్తున్నాయి.

ఆ తర్వాత మా పరీక్షలలో 4వ తరగతిలో అనుకుంటాను. "తిరువళ్ళూరు దాటి రైలో ఏదన్నా వూరు వెళ్ళావా? మార్గమధ్యంలో ఎన్ని స్టేషన్లు అన్న ప్రశ్న ఇచ్చారు. నేను 6 స్టేషన్ల పేర్లు రాశాను. ఇక్కడ ప్రధాన విషయం ఏమంటే ఆ వయస్సులో పిల్లలకు



విజ్ఞానయాత్రలు ఎంతో మంచి ఫలితాన్ని ఇస్తాయి. వాళ్ళకు ఉత్సాహజనితంగా వుండటమే గాక, వాళ్ళ పసి మనసులను ఎంతగానో ప్రభావితం చేస్తాయి.

మా బావగారు రోజూ సాయంత్రం వ్యాహ్యాళికి వెళ్ళేవారు. నా ట్యూషన్ పూర్తి కాగానే ఆయనతోపాటు వెళ్ళేవాణ్ని. ఒకోసారి ఆయన నాకన్నా ముందు వెళ్తే గబగబా నడిచి, పరుగెత్తి ఆయనను కలుసుకొనేవాణ్ని. తిరువళ్ళూరు చుట్టుప్రక్కల 5 మైళ్ళలో చాలా మంచి దేవాలయాలు వున్నాయి. ఆ దేవాలయాలు, వాటి చరిత్ర వీటిని గూర్చి తెలుసుకొనేవాణ్ణి. తిరువళ్ళూరులోనే వీర రాఘవస్వామి గుడి వుంది. ఒక పెద్ద కోనేరు ఆ విధంగా చెప్పాలంటే దాదాపు ఆ ప్రాంతంలో దేవాలయాలన్నీ చూశాననే చెప్పాలి.

దేవుడు – భక్తి – సహజంగా పిల్లలకుండే భయం వాటి సంగతెలావున్నా ఆ దేవాలయాన్ని గూర్చి కథలు, అక్కడి చెక్కడాలు నాకెంతో నచ్చేవి. పురాణాలు, వాటి కథలూ చదువుతుండేవాడిని, విష్ణుమూర్తి ఎలా వివిధ అవతారాలతో రాక్షసులను జయించాడో మనమూ అలా దుష్టులకు వ్యతిరేకంగా పోరాడాలనిపించేది. ఆ విధంగా నాకు మత దృక్పథం ఏర్పడింది. కానీ అంతకన్నా వేమన ప్రభావం నా మీద ఎక్కువనే చెప్పాలి. దేశభక్తి, సమానత్వం ఈ భావాలు నాలో బలపడేందుకు నా పుస్తక పఠనం నాకెంతో ఉపయోగించింది.

ఈ రోజుల్లోనే నేను బాగా ఆరోగ్యవంతుడి క్రింద లెక్క, నడక, పరుగు పెద్ద లెక్కగా వుండేది కాదు. ఈత మాత్రం – నా విద్యాభ్యాసం అయిన తర్వాత 1930లో నేర్చుకున్నాను.

# రాజమండ్రిలో రాజకీయ చైతన్యం

మా బావగారికి 1924 -25లో ఏలూరుకు బదిలీ అయింది. అక్కడ ఆయన జిల్లా సబార్డినేట్ జడ్జి. ఏలూరు మున్సిపల్ హైస్కూల్ ఫస్ట్ ఫామ్ (ఆరవ తరగతి)లో జేరాను. నేను చదువులోనూ, ఆటల్లోనూ దిట్ట క్రింద లెక్క. అక్కడ మాకొక డ్రిల్లు మాస్టరుగారుండేవారు. ఆయన ఇంగ్లీషు, తెలుగు కూడా చక్కగా అధ్యయనం చేసినవాడు. నన్నెంతగానో అభిమానించేవాడు. నాకు ఇద్దరు స్నేహితులు. బాగా గుర్తు. ఒకతను పోతునూరి కరణంగారి అబ్బాయి. అతడు నక్కలు - అవి ఎలా జిత్తులు వేసేవి చెప్తుండేవాడు.నాకు మొదటి స్థానం ఆటలలో, చదువులో వచ్చేదికాదు కానీ రెండు, మూడు స్థానాల్లో వుండేవాడిని, మా తమ్ముడు మాత్రం తన తరగతిలో అప్పుడప్పుడు ఆటల్లోనూ, చదువులోను కూడా మొదటివాడుగా వుంటుండేవాడు.

ఆ తర్వాత మా బావగారు రాజమండ్రి బదిలీ అయిన కారణంగా, రాజమండ్రిలో 2 సంవత్సరాలు చదువుకున్నాను. అప్పటికి నాకు 12-13 సంవత్సరాలు, రాజమండ్రి ట్రైనింగ్ స్కూల్లో చదువు.

మా బావగారింట్లో మాతోపాటు ఆయన మొదటి భార్య బంధువు ఈతముక్కల రామచంద్రారెడ్డి అని వుండేవాడు. ఆయన మాకన్నా పెద్ద. అప్పటికే జూనియర్ ఇంటర్‌లో వున్నాడు. బాగా తెలివిగలవాడు. చురుగ్గా వుండేవాడు. ఇక్కడ అతనికి కొందరితో పరిచయం ఏర్పడింది. తద్వారా నాకు పందిరి మల్లికార్జునరావుతో పరిచయం ఏర్పడింది. ఆయన కాంగ్రెస్ మనిషి, ఖాదీ ఉద్యమం, దానికి తోడు హిందీ బోధించేవాడు. అట్లాగే రాజకీయ గ్రూపు సమావేశాలు వేసేవాడు.



నేను "తెలుగు నవల"లన్నింటిని చదివేసిన వాణ్ణిగా నన్ను ఆయనకు పరిచయం చేయడం జరిగింది. ఆయనకొక మంచి లైబ్రరీ వుంది. ఆ పుస్తకాలు నాకిచ్చేవాడు. "తెలుగు నవలలు సరే, చరిత్రకు సంబంధించిన పుస్తకాలెందుకు చదవవు?" అని ఆయనొకసారి నన్నడిగాడు. తప్పకుండా చదువుతాను. చదవాలని కూడా వుందని ఆయన దగ్గర ఆ పుస్తకాలు తీసుకు చదివేవాణ్ని. ఆయన కొమర్రాజు లక్ష్మణరావు గారు రాసిన చరిత్ర పుస్తకాలనిచ్చారు. అలాగే "హిందూ మహాయుగం", "మహమ్మదీయ మహాయుగం" చదివాను. చిలుకూరి వీరభద్రరావుగారి "తెలుగుల చరిత్ర" మూడు భాగాలుగా వచ్చింది. ఆ మూడు పుస్తకాలు చదివాను. ఆ తర్వాత చిల్లూరి శ్రీనివాసరావు గారి రాసిన మహారాష్ట్ర చరిత్ర అదీ చదివాను. ఒక్కమాటలో చెప్పాలంటే, పుస్తకం దొరికితే వదిలి పెట్టేవాణ్నికాదు.

ఇవిగాక "గౌతమి గ్రంథాలయం" నుండి పుస్తకాలు తీసుకు చదివేవాణ్ని. రోజూ సాయంత్రం బడి వదిలి పెట్టగానే లైబ్రరీకి వెళ్ళేవాణ్ని - చరిత్ర పుస్తకాలు నవలలు, కథలు, లైబ్రరీ మూసేసేదాకా చదువుకునేవాణ్ని. ఆ దశలోనే వీరేశలింగం గారి రచనలు, పానుగంటి, చిలకమర్తిగార్ల రచనలు - యివన్నీ చరిత్ర గ్రంథాలు చదవంగా వున్న ఖాళీ సమయంలో చదివేవాణ్ని.

ఆ గ్రంథాలయ ఉద్యోగి కూడా "ఏంటి, యెప్పుడు యిన్ని పుస్తకాలు చదువుతూనే వుంటావు" అనేవారు. ఆ తర్వాత వాళ్ళు పుస్తకాలను ఇంటికి ఇవ్వమొదలెట్టారు. నేను నా కోసమే కాకుండా, మా పెద్దక్క కోసం కూడా పుస్తకాలు తీసుకువెళ్తుండేవాణ్ని.

ఇక్కడే నాకు వంటెద్దు పార్వతీశం, అన్నాబత్తుల సుబ్బారావులనే మరో యిద్దరు కాంగ్రెస్ కార్యకర్తలతో పరిచయం ఏర్పడింది. వాళ్ళిద్దరూ బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో చదువుతూండేవారు. మేము తరచుగా కలుసుకుంటుండేవాళ్ళం. ఏవో చర్చించు కుంటుండేవారం.

ఒకరోజు గోదావరి గట్టున కూర్చుని వున్నాం. జూన్ 1925లో అనుకుంటాను. అప్పుడు చిత్తరంజన్‌దాస్ చనిపోయినట్టు మాకు తెలిసింది. దీనికి వాళ్ళు బాగా బాధపడ్డారు. అప్పుడు ఎవరీ చిత్తరంజన్‌దాస్ అని అడిగాను. దీనికి సమాధానంగా చిత్తరంజన్‌దాస్ తెలియదా, చాలా చదువుతుంటావు మళ్ళీ అని చిత్తరంజన్‌దాస్ గూర్చి చెప్పారు. నువ్వు చదివే వాటితోపాటు యివి కూడా చదవమని కాంగ్రెస్‌కు సంబంధించిన సాహిత్యం యిచ్చారు. నిజంగా నాకు చాలా సిగ్గేసింది. ఒక పెద్ద దేశనాయకుడు చనిపోతే ఆయన ఎవరో, ఏం చేశాడో

తెలియకపోవడం ఎంత అజ్ఞానం. 1922 ఉద్యమం గూర్చి పైపైన తెలుసుగానీ, వివరంగా ఏమీ తెలియదు. అందుకని అప్పటి నుండి దినపత్రికలు, కాంగ్రెస్ గూర్చి, జాతీయ ఉద్యమం గూర్చి తప్పక చదవాలని నిశ్చయించుకున్నాను.

ఆ రోజు నుండి ఆంధ్రపత్రిక దినపత్రిక గౌతమీ లైబ్రరీలో ప్రతిరోజూ తప్పకుండా చదివేవాణ్ని. ఆంధ్రపత్రిక ద్వారా పంజాబ్ గూర్చి, జలియన్ వాలాబాగ్, కాంగ్రెస్ నివేదికలు అవన్నీ చదువుతున్న కొద్దీ బ్రిటిష్ సామ్రాజ్యవాదంపై ద్వేషం పెరుగుతుండేది. ఆంధ్రపత్రికలో గాంధీజీ ఆత్మకథ ప్రచురితమయ్యేది. రోజూ క్రమం తప్పకుండా చదివేవాణ్ని. కొన్ని అంశాలు నన్ను ఎంతగానో ఆకర్షించాయి. అప్పటి రాజకీయ పరిణామాలు – గాంధీగారి విడుదల, స్వరాజ్ పార్టీతో విభేదాలు యివన్నీ నన్ను ప్రభావితం చేసేవి.

ఆ దశలోనే ఆ మిగతా యిద్దరు మిత్రులు కూడా ఈ గాంధీగారి మార్గంలో స్వరాజ్యం రాదని, సాయుధ పోరాటమే మార్గమని, అందుకై మనం ఒక "గ్రూపు" ఏర్పాటు చేయాలని – యిలా వాదించేవాళ్ళు. అయితే ముందు ఏది యేమిటో మరింతగా తెలుసుకునేందుకు ఒక ఏడాది లేదా రెండేళ్ళు అధ్యయనం చెయ్యాలనుకున్నాం. ఆ తర్వాత కార్యక్రమం రూపొందించు కోవచ్చుని భావించాము.

మేము మొదటిసారి విప్లవకారుల గ్రూపుగా ఏర్పడినాము. అప్పట్లో మేము ఈ విప్లవకారుల సాహిత్యం ప్రత్యేకించి కాకోరి కుట్రకేసులాంటివి చదువుతూ వున్నాము. అలాగే సావర్కార్ రాసిన స్వాతంత్ర్య పోరాటం పుస్తకం కూడా, ఇవన్నీ అప్పుడు నిషేధింపబడిన ప్రచురణలు. బహుశా అప్పటికే 'మాలపల్లి' కూడా చదివిన గుర్తు. అయితే అప్పుడా, ఒకటి రెండేళ్ళ తర్వాతనా అన్నది స్పష్టంగా గుర్తులేదు.

హైస్కూలులో క్లాసులో మొదటి ముగ్గురు నల్గురు విద్యార్థులలో నేనొకణ్ని. అయితే నాకన్నా ఒకరిద్దరు బాగా చదివే విద్యార్థులుండేవారు. ఒకరు కాలపడుగు రామగోపాలరావు అనుకుంటాను. ఆ తర్వాత ఆయన రచయిత అయ్యారు. ఆలిండియా రేడియోలో పనిచేసేవాడు. ఆయన చాలా తెలివిగలవాడు. మొదటి మార్కు నాకు ఎప్పుడూ రానిచ్చేవాడుగాదు. తనదే, అలాగే ఆర్థికశాఖ కార్యదర్శిగా పనిచేసిన వి.కె.రావు, వాళ్ళిద్దరూ కూడా నన్ను గౌరవించేవారు. మామూలు పాఠాలలోనేగాక, యితర విషయాల గూర్చి నాకున్న జ్ఞానం, ఆటలలో నా శక్తి సామర్థ్యాలు వారి నాకర్షించేవి.

నా విద్యాభ్యాసపు తొలిదినాల్లో నన్ను ప్రభావితం చేసిన మరో అంశం సంస్కృతంలో



నా ప్రవేశం. 6 వ తరగతిలో రెండవ భాషగా "ప్రత్యేక తెలుగు" లేదా సంస్కృతం తీసుకోవాలి, నేను సంస్కృతం తీసుకున్నాను. మాకు సంస్కృతం కన్నడ పండితుడొకాయన చెప్పేవాడు. చాలా బాగా, సులభంగా అర్థమయ్యేట్లు చెప్పేవాడు. బండార్కర్ ప్రాథమిక పుస్తకం మా సంస్కృత వ్యాకరణంగా వుండేది. నేను సంస్కృతంలో ప్రథమస్థానంలో వుండేవాణ్ని. మా సంస్కృత పండితుడు నన్ను రఘువంశము, కాళిదాసు ప్రఖ్యాత రచనలు సంస్కృత మూలంలో చదవమని ప్రోత్సహించేవాడు.

ఇక్కడొక విషయం చెప్పాలి. తెలుగులో ఆరంభంలో వ్యాకరణంలో మంచి పునాదే నాకు పడింది. వీరేశలింగంగారు రాసిన వ్యాకరణ పుస్తకాన్ని సంక్షిప్తంగా చేసిన మరో పుస్తకం వుండేది. మా తెలుగు పంతులుగారు చాలా సుబోధకంగా, చక్కగా వ్యాకరణ పుస్తకం నుండి వివరించేవారు. ఆ తర్వాత నేను బాల వ్యాకరణం చదివాను గానీ, మా తెలుగు పంతులు చెప్పిన ఆ వ్యాకరణమే నాకు మంచి పునాదిని ఇచ్చింది. ఆ తర్వాత మా సంస్కృత పండితులు బండార్కర్ వ్యాకరణాన్ని వివరించే తీరు ఎంతో చక్కగా వుండేది. ముఖ్యంగా సంస్కృత పదాలు, వాటి మామూలు అర్థాలు, గూఢార్థాలు, ఆ పదాల పుట్టుక అవన్నీ ఎంతో ఆసక్తిదాయకంగా వుండేవి.

స్కూలు విద్యార్థిగా వున్నప్పుడే 'స్కౌట్'లో జేరాను. నేను చాలా మంచి స్కౌట్ క్రింద లెక్క కానీ రామగోపాలరావు అక్కడ నాకన్నా ముందే వుండేవాడు. ఇక్కడ నేను మరో ఇద్దరు నా అధ్యాపకులను గుర్తు తెచ్చుకోకుండా వుండలేను. ఒకాయన మా లెక్కల మాష్టారు కృష్ణయ్యగారు. ఆయన బోధనా విధానం చాలా సులభంగా వుండేది. కేవలం పాఠ్యాంశాల బోధనకే పరిమితమయ్యేవాడు కాదు. ఉత్సాహం, ఆసక్తి కలిగించేందుకు ఎన్నో విషయాలు చెప్పేవాడు. మరింత తెలుసుకోవాలన్న కుతూహలం కలిగేది. ఆయన నన్నభిమానించేవాడు. నేను ఆయనను గౌరవించేవాణ్ణి. ఇతర విద్యార్థులకన్నా ముందుగానే నాకు క్లాసులో చెప్పని లెక్కలు చెప్పేవాడు.

అలాగే తెలుగు పండితులు సోమయాజులుగారు. ఆయన తెలుగు సాహిత్యంలో నిష్ణాతుడు. నేను అప్పటికే చాలా నవలలూ, ఇతర సామాన్య విజ్ఞానదాయక పుస్తకాలూ చదివి వున్నాను. కొన్ని చారిత్రక ప్రదేశాలు – అక్కడి శిల్పరీతులూ అవీ చూసి వున్నాను. ఆయన నన్ను మరింతగా ప్రోత్సహించి ఈ చారిత్రక అంశాలకు సంబంధించిన పుస్తకాలను లైబ్రరీలో ఏవేవి చదవాలో సూచించడమేగాక, ప్రత్యేకంగా సేకరించి ఇచ్చేవాడు. ఆ "చరిత్ర"పై నాకు ఆసక్తి మెండు అయింది.

అందువల్ల ఈ స్కూలు చదువులో నాకు రెండు అంశాలు బాగా ఉపకరించాయి. ఉపాధ్యాయులు చక్కగా చెప్పటం వల్ల క్లాసులో శ్రద్ధగా వింటే సరిపోయేది. ఈ పంతులుగార్ల సహకారంతో క్లాసు పుస్తకాలనేగాక, ఇతర విషయాలు తెలుసుకోవడానికి కూడా అవకాశం దొరికింది.

రాజమండ్రికి 10 కిలోమీటర్ల దూరంలో కోరుకొండ వుంది. అక్కడొక రాతి ఫలకంపై ఏదో రాసి వుందని శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారి చరిత్ర పుస్తకంలో చదివాను. కనుక వెళ్ళి చూసి వద్దామనుకున్నాను.

ఉదయం 7 గంటలకు నడిచి వెళ్దామని బయలుదేరాను. మా తమ్ముడు రామచంద్రారెడ్డి కూడా నా వెంట వచ్చాడు. అతనికి పెద్దగా ఈ చరిత్ర తదితర అంశాలపై ఆసక్తి వుండేదికాదు. తన చదువులలో, ఆటల్లో మొదటివాడే. పైగా తొందరగా స్నేహితులను సంపాదించడంలో, వారితో కలిసిపోవడంలో 'రామ్' (రామచంద్రారెడ్డి) నాకన్నా చొరవతో వుండేవాడు. ఏమాట కామాటే చెప్పాలి. ఆ విషయంలో నాకు కాస్త చొరవ తక్కువ.

అయినా నేను వెళ్తున్నాను కదా అని నా వెంట వచ్చాడు. నా కన్నా రెండేళ్ళు చిన్న. ఇద్దరం కోరుకొండ జేరాము. అక్కడ కొండ పెద్ద ఎత్తుగా లేదు. పైకి ఎక్కి చూసి వచ్చాము. వచ్చేటప్పుడు దారిలో "రామ్" మూత్రానికి వెళ్ళాడు. మూత్రం ఎర్రగా వచ్చింది. చాలా భయపడ్డాడు. నా వరకు నేను కూడా ఏం జరుగుతుందోనని హడలిపోయాను. అదృష్టవశాత్తూ మేం భయపడినదేమీ జరగలేదు.

ఇలాంటి సాహసమే యింకోసారి కూడా చేసిన గుర్తు. ఒకసారి నేను, ఈతముక్కల రామచంద్రారెడ్డి, పందిరి మల్లికార్జునరావు తదితరులం గోదావరి ఒడ్డున కూర్చున్నాం. ఉన్నట్టుండి మాలో ఒకరు "బోటెక్కి నది మధ్యకు వెళ్దామని సూచించారు. మాలో ఎవరికీ పడవ నడపడం రాదు. ఈత కూడా రాదు. కేవలం ఏదో మొండి ధైర్యంతో పడవ ఎక్కాము. నేను చుక్కానివద్ద కూర్చున్నాను. నువ్వు చుక్కాని సరిగా పట్టకపోతే పోవాలనుకున్న దిశలో పడవపోదు. మిగతా వాళ్ళు ఆ మాత్రం కూడా చుక్కాని పట్టలేకపోయేసరికి నేనే కూర్చోవలసి వచ్చింది. తిరిగి వచ్చేటప్పుడు కూడా చాలా గందరగోళం అయింది. ఎంతో భయపడిపోయాం. ఎలాగో "బతుకుజీవుడా" అని గట్టుజేరాం.

ఇక్కడ మా బావగార్ని గూర్చి చెప్తాను. ఆయన ప్రభావం నా మీద ఏమీలేదనే చెప్పాలి. అయితే ఆయన ఏనాడు నా అధ్యయనం విషయాలు గానీ, రాజకీయ విషయాల్లోగానీ



జోక్యం చేసుకొనేవాడు కాదు. నువ్వు బాగా చదువుతున్నావు అంటూ ప్రోత్సాహపరిచేవాడు. నిజానికి తన కూతుళ్ళతో "సుందరయ్యను చూడండి. ఎంత చక్కగా చదువుతున్నాడో తన పుస్తకాలే కాదు. నా లైబ్రరీలో పుస్తకాలు కూడా చదివేశాడు" అని నన్ను ఆదర్శంగా చూపించేవాడు. అలా నాకు ప్రోత్సాహమేకానీ, ఆటంకంగా యెన్నడూ లేదు.

మా తమ్ముడు మాత్రం అల్లరిచేసేవాడు. అందుకు ఆయన "రామ్"పై చెయ్యి చేసుకొనేవాడు. ఇది మా ఇద్దరికి, ఆయనకూ మధ్య కొంత తగాదా అంశంగా వుండేది. "ఇట్లా కొట్టేట్లయితే మీ ఇంట్లో వుండము" అని చెప్పాను. 1926లో ఇలాగే ఒక్కసారి ఆయన మా తమ్ముణ్ని కొట్టాడు. "మేము ఇక్కడ వుండము. మద్రాసులో చదువుకుంటాము" అని చెప్పేశాము.

# మద్రాసులో విద్యాభ్యాసం - గాంధీజీ ప్రభావం

మద్రాసులో వీరారెడ్డి సత్రం అని ఇప్పటికీ వుంది. వీరారెడ్డి అని మా బంధువొకాయన దాన్ని కట్టించాడు. మద్రాసులో అక్కడికి వెళ్ళాం. 1926 ట్రిప్లికేన్‌లో హిందూ హైస్కూలులో నేను, మా తమ్ముడు జేరాం.

ఆ తర్వాత హిందూ హైస్కూలు దగ్గర్లో "బెల్‌రోడ్" సమీపంలో పై అంతస్తులో ఒక గది తీసుకున్నాం. నిజానికి అది ఒక చిన్న ఇల్లు. మా చిన్న అక్క లేదా మా అమ్మ ఎవరో ఒకరు వచ్చి వండి పెట్టేవారు.

రాజమండ్రిలో ఉన్నప్పుడు నాకు 13 సంవత్సరాలే. అయినా ఒక విప్లవకారుల గ్రూపులో చేరాను. అప్పటికే కొంత సాహిత్యం, చరిత్ర చదివి వున్నాను. పైగా అది విప్లవకారుల గ్రూపు అని మేము భావించినా, ప్రధానంగా ఒక అధ్యయన కేంద్రం అంటే బాగుంటుంది. విప్లవకర చర్యలేమీ చెయ్యలేదనే చెప్పాలి. విప్లవకారుల జీవితాలకు, వారి చర్యలకు సంబంధించిన పుస్తకాలను చదవడమే ప్రధాన కార్యక్రమం. పైగా మాలో వున్న అన్నాబత్తుల సుబ్బారావు "ముందు బాగా చదువుకోవాలి" అని అన్నాడు. అందరం అంగీకరించాం.

సరే తర్వాత జీవితంలో ఎవరి దారి వారిదయ్యింది. ఆయన కనిగిరిలో అడ్వకేట్‌గా స్థిరపడ్డాడు. ఇటీవలే చనిపోయాడు. చివరిదాకా ఆ చిన్ననాటి "స్కూలు స్నేహం" ఏదో రూపంలో మా మధ్య కొనసాగుతూనే వుండేది.

అలాగే ఒంటెద్దు పార్వతీశం అని ఒక చేనేత కార్మిక కుటుంబం నుండి వచ్చిన మిత్రుడుండేవాడు. వాళ్ళు చాలా పేదవాళ్ళు. కుటుంబం గడవడమే కష్టంగా వుండేది. శ్రద్ధగా చదివేవాడు. అతడు కాకినాడ కాంగ్రెస్ సభలకు వెళ్ళి వచ్చాడు. ఆ సభల విశేషాలను గూర్చి, అక్కడ తాను కలుసుకున్న పంజాబ్ ప్రతినిధులను గూర్చి చెప్పేవాడు. వాళ్ళు తనకు మిఠాయిలు తినిపించి, పుస్తకాలిచ్చిన సంగతీ, విప్లవకారుల "బబ్బర్‌అకాలీ" గ్రూపు వారి ధైర్య సాహసాలు



కథలు కథలుగా చెప్పేవాడు. అక్కడ నుండి పార్వతీశం పట్టుకొచ్చిన సాహిత్యం ద్వారా సత్యాగ్రహోద్యమం – సహాయ నిరాకరణ వుద్యమం గూర్చి తెలుసుకున్నాను. ఎంత కొట్టినా, కొడ్తారని తెలిసినా ఎదురు తిరగకుండా భరించటం అన్నది నాకు వీరోచిత పోరాటంగానే కన్పించింది. గురుద్వారాకు సంబంధించిన వారి డిమాండ్లను వారు అలా పోరాడి సాధించుకోవడం ఉత్తేజాన్నిచ్చింది.

మా బంధువు వీరారెడ్డిని గూర్చి చెప్పాను కదా. ఆయన హేతువాది, బ్రాహ్మణ వ్యతిరేకి. ఆయన జీవితం యావత్తూ రోగుల సేవలో గడిపాడు. నెల్లూరు నుండి ఏ రోగులు వచ్చినా, వారిని వెంట పెట్టుకుని వెళ్ళి నిపుణులైన డాక్టర్లుకు చూపించేవాడు. ఆ డాక్టర్లతో ఆయనకు బాగా పరిచయం వుండేది. ఆ రోగులకు తగిన వైద్య సౌకర్యాలు జరిగేట్టు వీరారెడ్డి చూసేవాడు.

ఈ వీరారెడ్డి మా అమ్మవైపు బంధువు. జగదేవపేట – మైపాడు –నెల్లూరు త్రోవలో వుంది. ఆయనకు "కులపిచ్చి" వుండేది. నేనూ మా తమ్ముడు చదువుల్లో, ఆటల్లో ముందుండటం ఆయనకెంతో సంతోషంగా వుండేది. "రెడ్లం మనపైకి రావాలి" అని ఆయన ఎప్పుడూ మాకు చెప్తుండేవాడు. పైగా మా తెలివితేటలు అనువంశికమని, మా మేనమామ ఒకతను చాలా తెలివిగలవాడు వుండేవాడనీ, ఆయన ఇంటర్మీడియట్ వరకూ చదువుకున్నాడని చెప్పేవాడు. చదువుతుండగానే ఆ మేనమామకు జ్వరం వచ్చి చనిపోయాడట. ఇంగ్లీషు చదువులు చదివితే చచ్చిపోతారని మా పెద్దన్నను వీధిబడిలో మాన్పించేశారట. ఆ పిచ్చి ఎంతగా వుండేదంటే మా తల్లి, అక్క చెల్లెళ్లెవరూ తమ సంతానానికి ఈ కారణంగానే ఇంగ్లీషు చదువు చెప్పించలేదు. ఏమైనా ఈ వీరారెడ్డి మాత్రం మంచి సంఘసేవకుడిగానే వున్నాడు.

హిందూ హైస్కూలులో 9, 10, 11 తరగతులు చదివాము. మా తమ్ముడు రామచంద్రారెడ్డి కూడా అదే స్కూల్లో 7, 8, 9 తరగతులు చదివాడు. అక్కడే మెడికల్ కాలేజీలో మా చిన్నాన్న కొడుకు పి. దశరథరామిరెడ్డి చదువుతుండేవాడు. ఆయన కూడా మేము ఎక్కిరావడం పట్ల ఆనందించేవాడు. మాకు చిన్న చిన్న సహాయాలు చేసి పెట్టేవాడు.

నాకు బాగా చదివే అలవాటు వుందని చెప్పాను కదా. తెలుగు నవలలూ, అవేకాక ఇంగ్లీషు పుస్తకాలు చదవ నారంభించాను. గాంధీగారి పుస్తకాలేగాక "యంగ్ ఇండియా" అవీ చదివేవాణ్ణి. "హిందూ" పత్రికకు నేను చందాదారుణ్ణికాదు గాని, లైబ్రరీకి వెళ్ళినప్పుడు అప్పుడప్పుడు చదువుతుండేవాడ్ని. "పైక్రాఫ్ట్" రోడ్డులో ఈ లైబ్రరీ వుండేది. అక్కడ రెండు, మూడు "హిందూ" దినపత్రికలుండేవి. ఒకళ్ళ భుజాలమీదుగా ఒకళ్లు చదువుకోవలసి వచ్చేది. ఈ వీరారెడ్డి మాత్రం క్రమం తప్పకుండా వెళ్ళి చదివేవాడు. ఆ తర్వాత తెప్పించసాగాడు. అప్పటి నుండి నేను రోజూ "హిందూ" చదివేవాణ్ణి.

గాంధీగారి ఆత్మకథ, యివే కాకుండా కొన్ని తాత్విక, మతపరమైన గ్రంథాలు కూడా చదవసాగాను. వివేకానంద ఉపన్యాసాలు అవి 7 సంపుటాలుగా వచ్చాయి. అవి చదివాను. అలాగే స్వామి రామతీర్థ రచనలు – "దయానంద సత్యార్థ ప్రకాశం" వీటన్నిటికి ఆంధ్రానువాదం వుండేది కనుక తెలుగులోనే చదువుకున్నాను. పాశ్చాత్య తత్వశాస్త్రం చదవాలని "కాంట్" చదవసాగాను.

ఆ ప్రభావం నామీద బాగానే పడింది. హిందూ మతం మంచిదే. ప్రజాసేవ బోధిస్తున్నారు ప్రవక్తలు. అందుకని తిలక్ రచించిన గీతా రహస్యం చదువనారంభించాను. అప్పటికే తెలుగు అనువాదం వచ్చింది. అప్పుడు స్కూల్లో "భగవద్గీత" గురించి వ్యాస రచన పోటీ పెట్టారు. నేనూ ఒక వ్యాసం రాసి పోటీలో పాల్గొన్నాను.

మా తెలుగు పంతులుగారు నా వ్యాసం చదవనారంభించారు. ఆయన కెంతో కోపం వచ్చింది. "క్రైస్తవులకు బైబిల్ ఎంతో మనకు భగవద్గీత అంత ముఖ్యమైనది" అన్నది నా మొదటి వాక్యం. సాంతం చదవకుండానే నన్ను పిల్చి "మన భగవద్గీతను బైబిల్‌తో పోల్చడమేమిటి? మన గీత అంతకన్నా గొప్పది" అని ఆయన మండిపడ్డాడు. "సాంతం చదవండి" అని కోరాను.

సాంతం చదివి ఆయన చాలా సంతోషించాడు. నన్ను అభినందించాడు. "చాలా క్లిష్టమైనది. పైగా చాలా పెద్ద పుస్తకం అదంతా ఎలా చదివావు. ఎలా దానిలోని సారాన్ని గ్రహించగలిగావు" అని అడిగారు.

"మంచి వ్యాఖ్యానంతో దాన్ని చదివానని" చెప్పాను.

గీతలో ప్రధానమైన దేమిటి? నీ కర్తవ్యాన్ని నువ్వు నిర్వహించు. ఫలితాన్ని గూర్చి ఆలోచించకు అన్నదే కదా: ఆ అంశం నన్నాకర్షించింది. అలాగే వివేకానంద. ఆయనను హిందూ మతాన్ని పునః ప్రతిష్ఠించినవాడుగా మాత్రమే చూడగూడదు. ప్రజలకు సేవ చెయ్యటాన్ని బోధించాడు. ఆకలి గొన్నవాడికి ముందు కావలసింది అన్నం, మతం కాదు అని ఆయన చెప్పాడు. గాంధీగారి దరిద్ర నారాయణతత్వమూ అదే: రామకృష్ణ పరమహంస బోధనల సారం కూడా సంఘసేవే.

రామకృష్ణ పరమహంస మఠం మైలాపూర్‌లో వుండేది. రోజూ నేను వెళ్ళి సేవా కార్యక్రమాలలో పాల్గొనేవాణ్ణి. కొంత మత ప్రభావం కూడా లేకపోలేదు. ఈ కాలం మొత్తంలో చదవాలన్న నా కుతూహలం మరీ పెరగసాగింది. తెలుగు చరిత్ర, సాహిత్యమూ నా ప్రధాన అభిరుచి గల విషయాలు. అప్పటికే వంగూరి సుబ్బారావు గారి "తెలుగు శతకముల చరిత్ర" చదివాను. వేమన పద్యాలు సంకలనం చేయబడినవి దాదాపు మూడువేల పద్యాలకు పైగా



చదివాను. తెలుగు కవుల చరిత్ర, అప్పుడు వీరేశలింగం గారికి, శ్రీ రామ్మూర్తిగారికి మధ్య చర్చలు జరుగుతుండేవి. తెలుగు సాహిత్య పరిణామాల్ని మాత్రం జాగ్రత్తగా అధ్యయనం చేసేవాడిని. "భారతి" కూడా చదువుతుండేవాడిని. ఒక పద్ధతి అంటూ లేదు. చదవటం చదవటం, వీలైనంత తెలుసుకోవడం.

అయితే అప్పటికే దేశానికి సేవ చెయ్యాలన్న భావం ఏర్పడింది. వేమన, పోతులూరి వీరబ్రహ్మం వీళ్ళ రచనలతో కొంచెం హేతువాద దృక్పథం కలిగింది. స్వామి దయానంద, రామానందతీర్థ, వీరేశలింగం వంటి వారి రచనలతో మత భావంతోపాటు, సేవాదృక్పథం తోడైంది. సంఘ సంస్కరణ, హేతువాదం, మతాభిమానం, ప్రజాసేవ – ఇవన్నీ నన్ను ప్రభావితం చేశాయి. ఇంకా సోషలిజం సంగతి తెలియదు.

అందుకని శెలవుల్లో మా ఊరికి తిరిగి వచ్చినప్పుడు మా అమ్మతో తగాదా వేసుకొనేవాణ్ణి. "హరిజనులను ఎందుకు దూరంగా వుంచుతాము? అంటరానితనాన్ని ఎందుకు పాటిస్తావు?" అని గాంధీగారి ప్రభావం కూడా నా మీద వుందికదా: "వాళ్ళేం తప్పు చేశారు? వాళ్ళ నెందుకు వివక్షతతో చూడాలి" ఇదే నా వాదన.

నేను మాత్రం వాళ్ళతో కలిసిమెలిసి వుండేవాణ్ణి. వాళ్ళతో పాటు చేలోదిగి పనిచేసేవాణ్ణి. వాళ్ళ గుడిసెల్లోకి వెళ్ళి – వాళ్ళ జీవన పరిస్థితులు స్వయంగా చూసేవాణ్ని. ఈ మాత్రం సానుభూతి చూపినందుకే హరిజనులు, హరిజనేతరులు నన్ను ఎంతో అభిమానించేవారు.

వాళ్ళని ఆ రోజుల్లో పల్లెటూళ్ళలో ఎల్లి "గాడు", పిల్లి"గాడు" యిలా పిలిచేవారు. నేను మాత్రం మా అమ్మగాని, మరెవరైనా గానీ వాళ్ళనలా పిలిస్తే వూరుకునేవాణ్ని కాదు. ఇవన్నీ చూసిన కూలీలు తమ కష్టాలు నాతో చెప్పుకునే వారు. వాళ్ళని ఆ రైతులు ఎలా బాధలు పెడుతున్నదీ, చేలగట్లపై తమ పశువులను కూడా మేయకుండా వారెలా అడ్డుపడుతున్నదీ. అలాగే తప్పుడు కొలతలతో తమను ఎలా దగా చేస్తున్నదీ చెప్పేవాళ్ళు.

అన్నిటినీ మించి "యానాదివాళ్ళు" వుండేవాళ్ళు. వాళ్ళ తెగ దొంగతనాలు చేసే "తెగ"గా పేరు మోసింది. పోలీసులు వాళ్ళు ఎక్కడికి వెళ్తే అక్కడకు వెళ్ళి వెంటాడి వేధించేవారు. ఎక్కడ దొంగతనం జరిగినా వాళ్ళను పట్టుకొచ్చి చావచితగ్గొట్టేవాళ్ళు.

మాకు ఇద్దరు యానాది కూలీలుండేవారు. మా అన్నవాళ్ళని కొడుతుండేవాడు. ఒకసారి అందులో ఒకడు చెప్పకుండా పోయాడు. మా అన్న కొట్టబోతున్నాడు. నేను అడ్డం వెళ్ళాను. "వాణ్ణెందుకు కొడతావు. పారిపోయాడు నిజమే. నీకు బాకీ వున్నాడు నిజమే. అయితే ఇంకో రైతు దగ్గర పనికి కుదిరాడు కదా. ఆ రైతు నడిగి నీకు రావలసింది తెచ్చుకో. ఇతణ్నెందుకు కొట్టాలి" ఇలా మా అన్నతో వాదించేవాణ్ని.

"దొంగ తెగ"ల చట్టం అంటూ వుండేది. ఆ రోజుల్లోనే అలాంటి చట్టమంటే నాకు పరమ అసహ్యంగా వుండేది. ఈ విషయంపై పోలీసు వారికి మెమోరాండాలు కూడా అప్పుడప్పుడు రాస్తుండేవాణ్ని: "ఎవడో ఒకడు దొంగతనం చేస్తే తెగ మొత్తాన్ని నిందించటం, శిక్షించటం ఏమి న్యాయం? అసలు ఏ సాక్ష్యాధారాలు లేకుండా ఇలా పశువుని బాదినట్లు బాదవచ్చునా? "ఇలా నా మెమోరాండాలు ఉండేవి. స్కూల్లో చదువుతున్న యువకునికి సామాన్యంగా వుండే మానవతాభావాలే అవి.

ప్రజలు వచ్చి తమ కష్టాలు, బాధలు చెప్పుకునేవారు. "చదువు పూర్తి చేసుకోనీండి. మీ గురించే కృషి చేస్తాను" అని చెప్పేవాణ్ణి. ఇలా గాంధీ, వివేకానంద, వేమన, విప్లవకారులు వీరందరి ప్రభావం కలగాపులగంగా నాపై వుండేది. ఏదో దేశభక్తి, ప్రజాసేవ – ఇలా అస్పష్టంగానైనా నా మదిలో మెదిలేవి.

1927లో మద్రాసులో కాంగ్రెస్ మహాసభలు జరిగాయి. నేను పాల్గొనలేదు గానీ, ఊరికినే అటువైపు వెళ్ళి వచ్చేవాణ్ణి – పెద్ద మీటింగు, జనము, జాతర కాంగ్రెస్ సభలలో తీర్మానాలు, స్వాతంత్ర్యం కోసం తీర్మానం, చర్చలు ఇవన్నీ పత్రికలలో చదువుతుండేవాడిని.

అయితే ఇక్కడొక ముఖ్య ఘట్టం వుంది. సైమన్ కమిషన్ బహిష్కరణ – అప్పుడు హిందూ హైస్కూలులో 10వ తరగతి అనుకుంటాను చదువుతున్నాను. సహజంగా నేను చదివే విధానం ఇలా వుండేది. క్లాసుకు క్రమం తప్పకుండా హాజరవడం – క్లాసులో చెప్పేది శ్రద్ధగా వినడం. మిగతా సమయాల్లో నేను ఇతర పుస్తకాలు చదవడం చేసేవాణ్ణి. పరీక్షలు 10 రోజులున్నాయనంగా పాఠ్యాంశాలను మరొక్కసారి నెమరువేసుకునేందుకు మాత్రం క్లాసు పుస్తకాలు చదివేవాణ్ని. అందువల్ల ఇతర పుస్తకాలు చదివేందుకు, ఇతర కార్యక్రమాలలో పాల్గొనేందుకు సమయం బాగానే దొరికేది.

ఇక క్లాసులో కంఠతా పద్యాలు అప్పచెప్పవలసివచ్చేదనుకోండి. అంతకుముందు చదివి వుండేవాణ్ణి గనుక తీరా బడికి వెళ్ళే దారిలో చూసుకున్నా సరిపోయేది. మా ఇంటినుండి బడికి రెండు ఫర్లాంగులు వుండేది. ఈ రెండు ఫర్లాంగులు రోడ్డుమీద నడుస్తూనే చదువుకుంటూ వెళ్ళేవాణ్ని. పెద్ద కష్టపడకుండానే వాళ్లడిగినవి అప్పజెప్పగలిగేవాణ్ని. అయితే అది యేదో ముక్కున పెట్టుకుని తాత్కాలికంగా పబ్బం గడుపుకొనేందుకు ఉపయోగపడుతుంది. కానీ స్థిరంగా మనసులో నాటుకోదు.

హిందూ హైస్కూలు హెడ్‌మాస్టర్‌గారు చాలా మంచి ఉపాధ్యాయులు, పిల్లలను క్రమశిక్షణలో వుంచడంలో గాని, వాళ్ళకు చదువు చెప్పడంలో గాని, ఎంతో శ్రద్ధగా వుండేవారు. అలాగే సుబ్రహ్మణ్యంగారని ఇంగ్లీషు ఉపాధ్యాయుడు. ఆయన కూడా చాలా మంచి మాస్టారు.



నాగేంద్రశాయి అని రాజమండ్రిలో 7, 8 తరగతులు నాతో పాటే చదివిన విద్యార్థి. ఇక్కడ హిందూ హైస్కూల్లో మళ్ళీ మా క్లాసులో జేరాడు. అతడు డిప్యూటీ కలెక్టరుగారి కుమారుడు. నాగేంద్రశాయికి గుండెజబ్బు వుండటం వల్ల మద్రాసులో వుండేవాడు. పాపం తర్వాత చిన్నతనంలోనే చనిపోయాడు. "మనిద్దరం కలిసి చదువుకుందాము, చదువుకోవడంలో నాకు కాస్త తోడుగా సాయం చేయి" అనేవాడు. నిద్రరాకుండా వుండేందుకుని "టీ" తయారు చేసేవాడు. "టీ" దేనికి చదువుకోవాలనుకంటే ఈ "టీ" లేకపోయినా మెలకువగా వుండి చదువుకోవచ్చు" అనేవాణ్ని. "కాదు కాదు, టీ తాగితే నిద్దర రాదు" అనేవాడు. నాకేమీ అనిపించేది కాదు. టీ తాగేవాణ్ణి. అయినా నిద్రపోదలచుకుంటే శుభ్రంగా గురకపెట్టి నిద్రపోయేవాడిని.

అలాగే కృష్ణస్వామి అని ఇంకో సహ విద్యార్థి నాకు గుర్తు. మా తరగతి విద్యార్థి కాదు. కానీ హిందూ హైస్కూలు స్కౌట్ స్క్వాడ్రన్‌కు నాయకుడు అతనొకడు. అలాగే హైస్కూలులో నేను వాలీబాల్ ఆడేవాణ్ని. ఇతర స్కూళ్ళతో పోటీలలో పాల్గొనే మా స్కూలు టీములలో నేనూ ఆటగాణ్ణి. మా టీమ్ కెప్టెన్ గోవిందస్వామి.

అప్పుడు మద్రాసులో వున్న స్కూళ్ళలో మూడు స్కూళ్ళు యీ "వాలీబాల్"లో పోటాపోటీగా వుండేది. మాది, కల్లెతాల్ హైస్కూలు, ముస్లిం హైస్కూలు "కల్లెతాల్" హైస్కూలును తేలిగ్గానే ఓడించాం గానీ, ఈ ముస్లిం హైస్కూలు వాళ్ళు చాలా గట్టి పోటీ యిచ్చారు. అయినా మా స్కూలే గెల్చింది. ఆ "ఛాంపియన్" సర్టిఫికెట్ కూడా యెక్కడో వుండాలి. ఆటలలో కూడా నేను ముందుండేవాణ్ని కాని, అక్కడ రెండవవాడిగానో, మూడవవాడిగానో ఉండేవాణ్ని.

ఇక్కడ హైస్కూల్లో చదువుతుండగా, బులుసు రామజోగారావు అనుకుంటాను ఆయన పేరు. ఆయన "యోగ"లో నిష్ణాతుడు. ఆయన "యోగ" మీద ఒక ఉపన్యాసం చేశాడు. ఆ తర్వాత కొంతమంది విద్యార్థులను పోగేసేవాణ్ని. తెల్లవారురూఝాము 4.30 కల్లా హిందూ హైస్కూలుకు వెళ్ళేవాళ్ళం. అక్కడ "యోగాభ్యాసం" చేసేవాళ్ళం. ఆ స్కూల్లోనే "సుందరమూర్తి" అని తెలుగు పంతులుగారు వుండేవారు. ఆయన కూడా మాతో పాటు వచ్చి మాకు శిక్షణ ఇచ్చేవాడు. మొత్తం మీద యోగాసనాలు దాదాపు వేసేవాణ్ని. ఆరోగ్యం కాపాడుకోవడం కోసం ఆ తర్వాత కూడా నేను అసనాలు వేస్తూనే వుండేవాణ్ని.

ఆ రోజుల్లో కులయానందగారి "యోగా మీమాంస" అనే పత్రిక పూనా నుండి వస్తుండేది. అందులో యీ యోగాభ్యాసానికి సంబంధించిన విషయాలు సశాస్త్రీయంగా వుండేవి. నేను దానికి చందాదారుణ్ని.

నేను అసనాలు వేయడంలో మంచి నేర్పరి క్రింద లెక్క. రోజూ నడక, పరుగు సాధన చేసేవాణ్ని. 30 కి.మీ. నడవగలిగేవాణ్ని. 100 పైగా దండీలు, బస్కీలు తేలిగ్గా తీసేవాణ్ని. స్కౌట్‌లో "వంట"కు ఒక బ్యాడ్జీ. "ప్రథమ చికిత్స"కు ఒక బ్యాడ్జి – ఇలా వుండేవి. నేను ఆ బ్యాడ్జీలన్నీ సంపాదించాను.

అప్పట్లో – 1927 లేదా 28లోనో ఎన్నికలు వచ్చాయి. మా బంధువు వీరారెడ్డి, జస్టిస్‌పార్టీ గెలుస్తుందనేవాడు. "జస్టిస్‌పార్టీ అంతరిస్తున్న పార్టీ – అది ఇంగ్లీషు వాళ్ళతో రాజీ పడుతున్నది అది ఓడిపోవాలి ఓడిపోతుంది అని నేను అనేవాణ్ణి. అలాగే జస్టిస్‌పార్టీ ఓడిపోయింది. వీరారెడ్డి "నీ జోస్యమే" నిజమయింది. నువ్వు బాగా రాణిస్తావు. బాగా చదివి వృద్ధిలోకి రావాలి. మన నెల్లూరు రెడ్లు చాలా గొప్ప వాళ్ళని పేరు తేవాలి" అంటుండేవాడు.

నాకు పుస్తకాలు కొని చదివే అలవాటు (హిందూ హైస్కూల్లో) బాగా అయింది. పుస్తకాలు కొనేందుకు యెవరూ ఆటంకపరిచేవారు కాదు. మా అమ్మ మాత్రం యీ పుస్తకాలపై ఖర్చు పెట్టటాన్ని "వృధాగా డబ్బు తగలెయ్యడం"గా భావించేది. కానీ, మా పెద్దన్న "వాడు చాలా పొదుపరి. ఏదన్నా పుస్తకాలకు గానీ, మరో దానికి గానీ ఖర్చు చేస్తున్నాడంటే యెంతో అవసరమైతే తప్ప చెయ్యడు" అని ఎప్పుడు డబ్బు అడిగినా ఇస్తుండేవాడు.

సరే: సైమన్ కమిషన్ "బహిష్కరణ" విషయానికి వద్దాం. పత్రిక ద్వారా బహిష్కరణ పిలుపు తెలుసుకున్నాం. కనుక ఈ రోజు స్కూలుకు వెళ్ళవద్దు అని నిర్ణయించుకున్నాం. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలి అన్న అభిప్రాయం నాది. పెద్ద నాయకులు ఎవ్వరూ వచ్చి "మీరు పాఠశాలకు వెళ్ళవద్దు" అని మాకు చెప్పినట్టు గుర్తు లేదు. మొత్తం దేశ వాతావరణమే మమ్మల్ని ఈ చర్యకు పురికొల్పింది.

సరే. ఆ రోజు బడికి వెళ్ళలేదు. మర్నాడు మొదటి "పీరియడ్" హెడ్ మాస్టరుగారిదే. ఆయన చాలా ఖచ్చితమైన మనిషి కూడా. "బహిష్కరణ"కు ముందురోజు ఆయన ఏవో చదువుకురమ్మనాడు. అందులో నా సీటు మా క్లాసులో ముందు వరుసలో ఉండేది. నన్ను అడిగినా అడగవచ్చు. అందుకని చెప్పానుగా వెళ్తూ దారిలో నెమ్మదిగా రోడ్డుమీద చదువుకుంటూ వెళ్ళాను. 5–10 నిమిషాలు ఆలస్యమయింది. అప్పటికే పిల్లల్ని ఆయన "బెంచీ"లపై నిలబెడుతున్నాడు. నేను వెళ్ళి తలుపు వద్ద – ఆయన లోపలకి రమ్మని పిలుస్తాడని – అనుమతి కోసం వేచివున్నాను. అందర్నీ బెంచీలపై నిలబెట్టిన తర్వాత నావైపు తిరిగాడు.

"ఎందుకు ఆలస్యం అయిందని" అడిగాడు

"పొరపాటయిందండీ – ప్రత్యేకించి ఏ కారణమూ లేదు" అన్నాను

"నిన్న ఎందుకు స్కూలుకు రాలేదు?" ఆయన ప్రశ్న.

"నిన్న సైమన్ కమిషన్ బాయ్‌కాట్ పిలుపు. అందుకని స్కూలుకు రాలేదు" అన్నాడు.

"ఎవరి అనుమతితో స్కూలు బహిష్కరించావు?"

"అనుమతా? ఎందుకు? అది జాతీయ పిలుపు."

"మీ సంరక్షకుని అనుమతి తీసుకున్నావా?"



"లేదు. ఆయన అభ్యంతరం పెట్టరని నాకు తెలుసు. అయినా దేశం మొత్తానికి ముఖ్యమైన యిలాంటి సందర్భంలో ఎవరి అనుమతి అవసరం లేదనుకుంటాను. ఏదన్నా తప్పు చేస్తున్నానేమో అన్న సందేహం ఉంటే "అనుమతి" అన్న ప్రశ్న వస్తుంది కాని, చేస్తున్నది సరైనదీ. చెయ్యవల్సిందీ అయినప్పుడు అనుమతి ప్రసక్తి ఎక్కడిది?" అన్నాను.

"ఇది పెద్దవారి పట్ల భయభక్తులు లేకపోవటం కాదా?" అని ఆయన అడిగాడు.

"మేం చాలాసార్లు సైమన్ కమిషన్ వ్యవహారం చర్చించుకున్నాం. ఆయన అభిప్రాయాలు నన్ను అభ్యంతరపెట్టేవిగా వున్నట్లు నాకన్పించలేదు. అనుమతి అడగడం అన్నది లాంఛనప్రాయంగా అయితే అడగలేదు. ఒకవేళ ఆయన నన్ను అభ్యంతర పెట్టివున్నట్లయితే తన కర్తవ్య నిర్వహణ చేయనివాడుగా ఆయన వుండేవాడు. కనుక ఇక్కడ భయభక్తులు లేకపోవడం అన్న ప్రసక్తి లేదు" అని స్థిమితంగా సమాధానం చెప్పాను.

ఇక ఆయన నేను చేసింది తప్పునిగానీ, నన్ను బెంచీ ఎక్కమని గానీ అనలేదు. "ఇలాంటప్పుడు ఇక మీదట అనుమతి తీసుకోవాలి" అని మాత్రం అని, నిలబెట్టిన పిల్లల్ని కూడా కూర్చోమని చెప్పాడు. ఆ తర్వాత నేను అప్పజెప్పవలసిన పద్యం అప్పజెప్పమన్నాడు. నేను ఆలస్యంగా వచ్చినది కూడా ఆ పద్యం వల్లెవేస్తూ నెమ్మదిగా నడవబట్టేకదా. సిద్ధంగా వున్నాను. అప్పజెప్పాను. ఇక తప్పు పట్టేందుకు ఆయనకేమీ దొరకలేదు.

క్లాసు అయిపోయిన తర్వాత పిల్లలందరూ చుట్టూ చేరి "నువ్వు ధైర్యంగా చెప్పబట్టి, నీ పుణ్యాన మాకు క్లాసు జరుగుతున్నంత సేపూ క్లాసులో నిలబడే తిప్పలు తప్పింది" అని నాతో అన్నారు. "మీరు మాత్రం ఎందుకు వున్న వాస్తవం చెప్పలేదు? ఏం, తలతీసి మొలవేస్తారా?" అని అడిగాను. "మా పెద్దవాళ్ళు అట్లా చెప్పవద్దు అన్నా"రని కొందరన్నారు. "మంచిపని చేసినప్పుడు అబద్ధం ఆడవలసిన అవసరం లేదని" నేను ధైర్యం చెప్పాను.

మహాత్మాగాంధీ ఆంధ్రలో 1928లో పర్యటించారు. మా వూరుకు సమీపంలో పల్లెపాడు ఆశ్రమానికి వచ్చారు. అక్కడొక చిన్న సభ ఏర్పాటు చేశారు. మా వూరు నుండి యువకులను సమీకరించి సభకు తీసుకువెళ్లాను. మా వూళ్లో ఒక పాత లైబ్రరీ వుండేది. దాన్ని "బాలగంగాధర తిలక్" లైబ్రరీ పేరిట బాగుచేసి పునరుద్ధరించాం. కొంతమంది యువకులు లైబ్రరీకి రాసాగారు. వాళ్లని తీసుకొని గాంధీజి సభకు పల్లెపాడు వెళ్లాను.

ఈ విషయమై మళ్ళీ తర్వాత చెప్పుకుందాం. మహాత్మాగాంధీ మద్రాసు వచ్చిన రోజు సాయంత్రం ట్రిప్లికేన్ బీచ్ తర్వాత ఇప్పుడు ప్రెసిడెన్సీ కాలేజి ఆటస్థలము అక్కడ స్కౌట్‌ర్యాలీ వుంది. ఆ ర్యాలీ అయిన తర్వాత సరాసరి గాంధీగారి సభ వద్దకు వెళ్దామని అనుకుని స్కౌట్ దుస్తులలోనే అటునుంచి అటే వెళ్ళాను. ఆ మర్నాడు స్కౌట్ మాస్టరుగారు "స్కౌట్ యూనిఫారంలో గాంధీగారి సభకు ఎందుకు వెళ్ళావు?" అని అడిగారు.

అందులో తప్పేమిటి?" అని అడిగాను.

"స్కౌట్ యూనిఫారంలో ఎందుకు వెళ్ళావు?" అని మళ్ళీ అడిగారు. "మీరెందుకలా అడుగుతున్నారో నాకు అర్థం కావడం లేదు. ఇదెక్కడ సూత్రం? అయితే ఇక నుండి స్కౌట్‌లో వుండను. మీ యూనిఫారం మీరు తీసుకోండి" అని వెంటనే "గాంధీజీ సభకు స్కౌట్ డ్రస్‌లో వెళ్ళవద్దన్నారు కనుక, నేను స్కౌట్‌లో వుండను. నాకీ యూనిఫారం అక్కర్లేదు" అని ఒక లేఖ రాసి పంపాను.

నేను మంచి స్కౌట్ క్రింద జమ. అందువల్ల నన్ను వదులుకోడం మా మాష్టరుగారికి యిష్టం లేదు కనుక, "సరే, జరిగిందేదో జరిగింది. నీ లేఖను వెనక్కు తీసుకో" అని ఆయన కోరారు.

"ఎందుకు, ఎందుకు వెనక్కి తీసుకోవాలి? నిబంధనావళిలో అలా వుంటే నేనందులో వుండను. స్కౌట్ అన్న తర్వాత స్వేచ్ఛ వుండాలి. అలా వీల్లేదు అన్నప్పుడు నేనే కాదు, యూనిట్ వాళ్ళం ఎవరం వుండము, దేశ జాతీయోద్యమంలో పాల్గొనేందుకు ఈ స్కౌట్ యూనిఫారం ఆటంకం అయితే, నేనెందుకు స్కౌట్‌లో వుండాలి? ఇలా అయితే నేనీ స్కౌట్‌లో జేరి వుండేవాణ్ణి కాదు" అని గట్టిగా సమాధానం చెప్పాను.

ఆ తర్వాత మా స్కౌట్ లీడర్, నా మిత్రుడు కృష్ణస్వామి వచ్చి నచ్చజెప్పబూనాడు. "అదేం వీలు లేదు. ఒక నిర్ణయం తీసుకున్నాను. నేను స్కౌట్‌లో వుండను" అని ఖరాఖండిగా చెప్పేశాను. దాంతో నా స్కౌట్ జీవితం ముగిసింది.

పై రెండు ఘటనలూ ప్రత్యేకించి ఆనాటి నా మనోభావాలు తెలియజేస్తాయి.

సరే. అంతకు ముందు మా బావగారితో ఏదో చిన్న ఘర్షణ వచ్చి అక్కడనుండి వచ్చేశామని చెప్పాను గదా. ఆయన మళ్ళీ వచ్చాడు. "బెంగుళూరులో మాతోపాటు వుండి చదువుకోరాదా?" అని అడిగాడు. అప్పుడాయన "కంటోన్మెంట్" ప్రాంతం జిల్లా సెషన్స్ జడ్జి.

"ఆలోచిద్దాం" అని ఆయనతో పాటు బెంగుళూరు వెళ్లాను. అక్కడ సైకిల్ తొక్కటం ఆ శెలవుల్లో నేర్చుకున్నాను. బెంగుళూరులో వుండగా శెలవులలో అందరం కలసి ఊటీ వెళ్ళాము. ఊటీలో దాదాపు 10 మైళ్ళు ఎక్కటం, దిగటం చేసేవాణ్ణి. అక్కడ ఒంటరిగా అడవిలోకి, గుహలోకి వెళ్లేవాణ్ణి.

మా బావగారికి అప్పుడు 4 సంవత్సరాల కొడుకు వున్నాడు. ఆ పిల్లవాణ్ణి వాళ్ళ నాన్నగాని, అమ్మగాని ఎత్తుకోవాలి. ప్యూన్‌లు, ఇతరులు ఎత్తుకుంటే వప్పుకునేవాడుకాడు. "సరే నేనెత్తుకుంటాను. నీ ఇష్టం వస్తేరా, లేకుంటే లేదు. మీ అమ్మనాన్న నిన్ను ఎత్తుకుని మోయలేరు. నువ్వు మొండికేస్తే ప్యూన్‌ల చేతికిచ్చి మేము వెళ్ళిపోతాం" బెదిరించాను. నిజంగానే భయపడినట్లున్నాడు కిక్కురుమనకుండా వచ్చాడు.



ఊటీ నుండి తిరిగి వచ్చిన తర్వాత మా అక్కను తీసుకుని మా ఊరు వెళ్ళాల్సివచ్చింది. సరిగ్గా ఆ సమయంలో "బి" గ్రూపు పరీక్షలు వున్నాయి. అయితే అప్పుడు ఈ "బి గ్రూప్" కంపల్సరీ కాదు. మళ్ళీ మద్రాసు వెళ్ళి పరీక్షలు రాయడం దేనికిలే, ఎటూ "కంపల్సరీ" కాదుగదా, దీని వల్ల పరీక్షా ఫలితాల్లో మార్పు వుండదు కదా అని మెడికల్ సర్టిఫికెట్ పంపి, పరీక్షకు వెళ్లకుండా మా అక్కను తీసుకుని మా వూరు వెళ్ళాను.

అంతకుముందు సైమన్ కమిషన్, ఆ గొడవ వుంది కదా. దానితో నా మీద మా హెడ్‌మాష్టరు గారికి కోపంగా వుంది. అందుకని ఆయన నా పరీక్షా ఫలితాన్ని నిలిపివేశాడు. నాకు మా ఊరికి ఆయన వుత్తరం రాశాడు. నేను వెళ్లి ప్రత్యక్షంగా ఆయనను కలుసుకుని ఎందుకని పరీక్షకు హాజరు కాలేకపోయానో స్వయంగా వివరిస్తే, దానికి సంతృప్తి చెందితే ఫలితాన్ని ప్రకటిస్తాడన్నది ఆ వుత్తరం సారాంశం.

సరే: నేను వెళ్లి ఆయనను కలుసుకున్నాను. "ఎందుకు పరీక్షకు హాజరు కాలేదని" ఆయన అడిగారు. "ఆరోగ్యం బాగా లేదని, మెడికల్ సర్టిఫికెట్ పంపాను కదా" అని చెప్పాను.

"మెడికల్ సర్టిఫికెట్ పెట్టగానే సరిపోతుందా? నువ్వు దానితో పాటు వేరే శెలవు చీటి రాయనవసరం లేదనుకున్నావా?" అని ఆయన అడిగాడు.

"మా బావగారు కూడా రాయమన్నారు. నేనే, యెందుకు సర్టిఫికెట్ సరిపోదా అనుకుని, వేరే ఉత్తరం రాయలేదు" అని చెప్పాను. ఏమనుకున్నాడో ఏమో, నా ఫలితం ప్రకటించాడు. నేను అనుకున్నట్లుగానే ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడనైనాను.

నా ఫలితం నిలిపివేసేటప్పటికి మా బంధువు వీరారెడ్డికి చాలా ఆందోళన కలిగింది. అప్పటికే అప్పుడప్పుడు ఆయనతో "దేశానికి స్వాతంత్ర్యం ముఖ్యం. ఈ చదువులు చదివితే యేం? లేకపోతేయేం?" అని అంటుండేవాణ్ణి. నా ఫలితం కనుక రాకపోతే, నేనిక చదవనని చెప్పి చదువు మానేస్తానేమోనని ఆయన భయం. ఆ భయంతో మా యింటికి మా అమ్మ పేర వుత్తరం రాశాడు. ఏమైతేనేం ప్రథమ శ్రేణిలో వుత్తీర్ణుడైనట్లు ఫలితం వచ్చింది.

ఇక కాలేజీ చదువులు "లయోలా"లో కొనసాగించాలని నిశ్చయించుకున్నాను. ఆ రోజుల్లో కూడా లయోలాలో సీటు దొరకడం చాలా కష్టంగా వుండేది. ఆ కాలేజీ పేరు ప్రఖ్యాతులు అలా వుండేవి. అందుకని మంచి మార్కులు వస్తే తప్ప లయోలాలో సీటు ఇచ్చేవారు కాదు. నాకు చాలా మంచి మార్కులొచ్చాయి. 1929లో లయోలా కాలేజీలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌లో చేరాను.

ఇంటర్మీడియట్‌లో నా గ్రూపు "గణితము", భౌతికశాస్త్రము, రసాయన శాస్త్రము. ఇప్పుడిక్కడ ఇంగ్లీషులో గీగమ్ అండర్ రెస్ట్ రాసిన రాజకీయ అర్థశాస్త్రమూ, అలాగే టాసిక్

రాసిన రాజకీయ అర్థశాస్త్రమూ, రాజకీయ వ్యాకరణము ఇత్యాది పుస్తకాలు చదువనారంభించాను.

రవీంద్రనాథ్ టాగూర్, నెహ్రూ, సోవియట్ యూనియన్ గూర్చిన రెండు చిన్న పుస్తకాలు తప్ప పెద్దగా ప్రత్యేకించి "సోషలిస్టు" సాహిత్యం చదవలేదనే చెప్పాలి.

గాంధీగారి నిరాడంబరత, అస్పృశ్యతా నివారణ నన్నెంతగానో ఆకట్టుకున్నాయి. 1928లో అనుకుంటాను. హరిజనోద్ధరణకు ఆయన చందాలు పోగు చేస్తున్నాడు. ఆ వరసలో మా గ్రామానికి మూడుమైళ్ళ దూరంలో ఉన్న ఊటుకూరు వచ్చారు. ఆయన వస్తారని ఎంతో అట్టహాసంగా పెద్ద పెద్ద పందిర్లు వేసి ఏర్పాటు చేశారు. వేలాదిగా ప్రజలు బహిరంగ సభకు వచ్చారు.

ఆయన ఉదయం 10 గంటల ప్రాంతంలో వచ్చారు. చాలా అలిసిపోయి వున్నారు. స్థానిక కాంగ్రెసు నాయకుడు శేషారెడ్డి ఆయన పక్కన వున్నాడు. గాంధీగారికి వెయ్యో, రెండు వేలో ప్రజల తరఫున వసూలు చేసి యిచ్చారు. ఆయన దానికి కృతజ్ఞతలు చెప్తూ హరిజనోద్ధరణ, ఖాదీధారణ గూర్చి రెండంటే రెండే నిముషాలు ప్రసంగించారు.

ఆయనటు వెళ్ళంగానే జనం ఈ రెండు నిముషాల భాగ్యానికి యింత హంగామానా? అట్టహాసమా? ఎంత శ్రమపడి యిన్ని మైళ్ళు నడిచివచ్చాం అని చాలా అసంతృప్తి చెందారు. అప్పటి నుండి నేను 5 నిముషాలు, 10 నిముషాలు ఇలా ప్రసగించరాదని నిశ్చయించుకున్నాను. నేను బహిరంగ సభకు వెళ్తే ఒక గంట కనీసం ఉపన్యసించాలి. గాంధీ అంతటి మహానాయకుణ్ని గూర్చి "రెండే నిముషాలు" మాట్లాడాదని జనం తలకొకరకంగా అనుకుంటుంటే, నేనెందుకు 5 నిముషాల ప్రసంగానికి వెళ్ళాలి, జనం అసంతృప్తికి యెందుకు కారకుణ్ణి కావాలి.

నీకు చెప్పాల్సిందేమీ లేకపోతే మాట్లాడవద్దు. అందుకనే ఎవరన్నా వచ్చి "జనం" చూద్దామని వచ్చారండీ, ఒకటి రెండు నిముషాలు కనపడి, నాలుగు మాటలు చెప్పి పొండి అంటే నేను తిరస్కరిస్తాను. ఇదేమన్న "దర్శన" వ్యవహారమా?

ఆ మీటింగ్ తర్వాత నేను కాంగ్రెస్ నాయకులతో పోట్లాడాను. "ఈ మాత్రం దానికి గాంధీని ఎందుకింత శ్రమ పెట్టారు. 20 మైళ్ళు, యీ గతుకుల రోడ్డు వెంట తీసుకురావడం దేనికి? మీరే అక్కడే చందా యిచ్చి ఉండొచ్చుకదా. అలాగే ఈ జనాన్ని ఎన్ని యిబ్బందులు పెట్టారు! ఇది పద్ధతి కాదు" అని చెప్పాను.

ఏమైనా గాంధీగారి నిరాడంబరత్వం, రాట్నం వడకడం, హిందూ – ముస్లిం ఐక్యత, హరిజనోద్ధరణ, ఆయన దక్షిణాఫ్రికాలో నడిపిన పోరాటం, సేవానిరతి – ఇవన్నీ అంతకు ముందు ఆయన ఆత్మకథలో చదివి వుండి ప్రభావితుడైనాను. అవన్నీ పనికిరానివి అని నేను భావించలేదు.



ఇక లయోలా కాలేజీలో – వి.కె.రావు, నాగేంద్రశాయి కూడా నాతో పాటు జేరారు. వాళ్ళు గాక కంభంపాటి సత్యనారాయణ, తిమ్మరాజు సత్యనారాయణరావు వీళ్ళు కాకినాడ నుండి మద్రాసు చదువుల కోసం వచ్చారు. కాలేజీ హాస్టల్లో ఉండేవాళ్ళం. అలా దగ్గరయినాము. ఈ రోజుల్లోనే వి.కె. నరసింహం కూడా జేరాడు. అయితే కంభంపాటి ఎం.ఏ. మొదటి సంవత్సరమో, బి.ఎ. రెండో సంవత్సరమో చదువుతూ ఉండేవాడు. వి.కె. నరసింహం బి.ఎ. మొదటి సంవత్సరం.

అందరం యోగాభ్యాసం చేసేవాళ్ళం. వాళ్ళకి "యోగం" గురువును నేనే. తెల్లవారు ఝామునే లేచి, వాళ్ళను లేపేవాణ్ని. ఇక యోగాభ్యాసం మొదలయ్యేది. అప్పుడు మామూలుగా సాహిత్యాన్ని గూర్చి, రాజకీయాల గూర్చి చర్చించుకుంటుండేవారం.

# కమ్యూనిజంతో తొలి పరిచయం

ఆ రోజుల్లో మా హాస్టలుకు హెచ్.డి. రాజా వచ్చారు. ఆయన తనతోపాటు "కమ్యూనిస్టు మానిఫెస్టో" తదితర సోషలిస్టు సాహిత్యం తీసుకువచ్చారు. ఆయన పూర్వీకులది దక్షిణాది. కానీ బొంబాయిలో స్థిరపడ్డారు. ఆయన అప్పటికి కమ్యూనిస్టు పార్టీ సభ్యుడుకాదు. "యూత్ లీగ్" సభ్యుడు.

ఆయన వచ్చిన సందర్భంగా లయోలా కాలేజీ హాస్టల్లో ఒక చిన్న సమావేశం ఏర్పాటు చేశాము. ఆయన ఆ సమావేశంలో "కమ్యూనిజం" అంటే ఏమిటి అని చెప్పాడు. ఆ విధంగా వినడం అదే నాకు మొదటిసారి. ఏదో పత్రిక కూడా తెచ్చినట్లున్నాడు. దానికి చందాదారులుగా చేరమని కోరాడు.

కమ్యూనిస్టు మానిఫెస్టో, నన్ను అన్నిటికన్నా ఎక్కువగా ప్రభావితం చేసిన పుస్తకం, అప్పటి ధర, విలువ, పెట్టుబడి యిలాంటి వానిపై చిన్న చిన్న కరపత్రాలు చదివానుగాని, కమ్యూనిస్టు మానిఫెస్టో నాలో ఒక గుణాత్మకమైన మార్పుకు దోహదం చేసింది. వివేకానంద, గాంధీ వీళ్ళ సంగతి ఎలా వున్నా – జన బృందాన్ని కమ్యూనిస్టు ఉద్యమంలో భాగం చేద్దామని నిర్ణయించుకున్నాం. 'యువజన లీగ్' లోకి ఇతర విద్యార్థులను చేర్చుకుందామని భావించాము. అంటే, అప్పటికి మేము కమ్యూనిస్టు అభిమానులుగా మారిపోయాము. మరింతగా కమ్యూనిజం గూర్చి తెలుసుకోవడం మా "బృందం" లక్ష్యంగా ఉండేది.

ఆ దశలోనే మీరట్ కుట్రకేసు ఆరంభమయింది. మద్రాసులో వున్న మాకు ఆ కేసు వివరాలు తెలిసే అవకాశం తక్కువ. కొద్దికొద్దిగా పత్రికల్లో వచ్చేది. వచ్చిన మేరకు పోనిచ్చేవారం కాదు. బాంబే నుండి కూడా సాహిత్యం తెప్పించుకునేవాళ్ళం. ఆ రోజుల్లో సాహిత్యం తెప్పించుకోవడం కూడా తేలికగా వుండేది కాదు. రహస్యంగా, దొంగచాటుగా తెప్పించుకోవలసిందే: కొందరు పుస్తకాల షాపు వాళ్ళతో సంబంధం పెట్టుకుంటే అతి కష్టం మీద తెప్పించి ఇచ్చే ఏర్పాటు చేసేవారు.

మీరట్ కుట్రకేసు, ఆ తర్వాత భగత్‌సింగ్ బాంబు కేసు వీటికి సంబంధించిన పత్రికల్లో అక్షరం బీరుపోకుండా చదివేవాళ్ళం. ఆ తర్వాత జతిన్ కూడా 1929 సెప్టెంబరు 13న జైల్లో మరణించాడు.



స్వాతంత్ర్యాన్ని కోరుతూ, ప్రఖ్యాతిగాంచిన సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానం వచ్చింది. జనవరి 26ను స్వాతంత్ర్య దినంగా జరపాలని భావించాము. ఆ రోజు విద్యార్థులందరం వూరేగింపు తీశాము. మా "యువజన బృందం" వుంది. ఆంధ్రప్రాంతం నుండి వచ్చిన విద్యార్థులతో మేము సంబంధాలు పెట్టుకొనేవాళ్ళం. లయోలా కాలేజి నుండి 200 మంది విద్యార్థులను ఉరేగింపుగా కదిలించాము.

జాతీయ జెండాలు చేబూని మైలాపూర్ మొత్తం వూరేగి ట్రిప్లికేన్ చేరాము. అప్పుడు మద్రాసులో పకడ్బందీ అయిన, బలమైన కాంగ్రెస్ నిర్మాణం కూడా లేదు. అయితే ప్రజలలో మాత్రం కాంగ్రెస్‌పట్ల అభిమానం బాగావుంది. వారి మనోభావాలు ఈ స్వాతంత్ర ఉద్యమం పట్ల బాగా మొగ్గు చూపేవి. మద్రాసు నగరంలో వున్న ప్రజానీకానికి ఈ విద్యార్థి ప్రదర్శన ఎంతో ఉత్తేజాన్నిచ్చింది.

ఆ రోజు ఊళ్ళో కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ అయ్యంగారు లేదు. కాని సత్యమూర్తి, సంగమేశ్వర్ తదితర స్థానిక కాంగ్రెస్ నాయకులు మమ్మల్ని బాగా అభినందించారు. పత్రికలు కూడా ఈ విద్యార్థి ప్రదర్శన గూర్చి ప్రముఖంగా రాశాయి.

సరే ఒకరోజు కార్యక్రమమే గదా: మర్నాడు కాలేజీకి వెళ్ళాము. కాలేజిలో ఒక గొడవ జరిగింది. ఒక విద్యార్థి గాంధీ టోపి పెట్టుకొని కాలేజీకి వచ్చాడు. ఫాదర్ మర్ఫీ లేదా ఫాదర్ విలియాంట్ – వీళ్ళిద్దర్లో ఎవరో సరిగా గుర్తు లేదు గానీ ఆ విద్యార్థిని ఆ టోపీ తీసివెయ్యమన్నాడు. అతడు తియ్యనన్నాడు. అట్లా అయితే క్లాసులోంచి బయటికి పొమ్మని ఆదేశించాడు.

విద్యార్థులు ఈ ఘటనను తేలిగ్గా తీసుకోలేదు. గాంధీ టోపీ ఎందుకు పెట్టుకోకూడదు? వీళ్ళెవరు వద్దనేందుకు అని ఆ రోజు కాలేజీ బహిష్కరించారు. ఈ లోపల గాంధీ టోపీతో కాలేజీకి రాకూడదని వాళ్ళు "నోటీసుబోర్డు"లో పెట్టారు. అదీ చూద్దాం అనుకున్నాం.

మర్నాడు మేము, మిగతా కొందరు విద్యార్థులు కలసి 500 గాంధీ టోపీలు కుట్టాము. అందరం గాంధీ టోపిలు పెట్టుకుని కాలేజికి వెళ్ళాము. ఇదంతా క్రమబద్ధంగా ఒక పథకం ప్రకారం అనుకున్నట్లు చేసింది కాదు. ఆ జాతీయ మనోభావాలు విద్యార్థులలో వున్నాయి. ప్రతివాళ్ళు – "గాంధీ టోపి పెట్టుకోవద్దని చెప్పేందుకు వీళ్ళెవరు?" అని ప్రశ్నించేవాళ్ళే: ఒక విధంగా, యిలా నిరసన తెలియజేద్దామన్నది. దానంతటదే వచ్చింది. మా "యువజన బృందం" అందుకు సహకరించింది. కొన్ని సందర్భాలలో, అలా ప్రజలలో యిలాంటి నిరసనలు వ్యక్తమవుతుంటాయి.

ఫాదర్ బెర్ట్రాన్ మా ప్రిన్సిపాల్: ఆయన బయటకు వచ్చి చూసేసరికి కాలేజి గ్రౌండ్ అంతటా గాంధీ టోపిలే: వెంటనే ఆయన జోక్యం చేసుకుని, గాంధీ టోపిలు పెట్టుకురావడం నిషేధం కాదు అని కొత్త ఆదేశం జారీ చేసి నోటీసు బోర్డులో పెట్టాడు. అదొక విద్యార్థి విజయం.

అధ్యాపకులందరూ, "మీరు చాలా మంచిపని చేశార"ని మమ్మల్ని అభినందించారు. నిజానికి అది మా ఘనత కాదు. ఆ జాతీయోద్యమ ఉత్తేజం అలా వుండేది. ఫాదర్ మర్ఫీ – ఫాదర్ విలియాంట్‌లు ప్రిన్సిపాల్ ఆదేశాన్ని తిరగ తోడించేందుకు యత్నించారు. ప్రిన్సిపాల్ ఫాదర్ బెట్రాన్ మాత్రం వాళ్ళను తెలివితక్కువగా వ్యవహరించవద్దని చెప్పాడు. ఆయన మంచివాడు. ఉదారవాది. గొప్ప నిర్వహణా దక్షత కలవాడు. పాఠాలు అవీ చక్కగా చెప్పేవాడు. అన్నిటినీ మించి, ఆయనకు విద్యార్థులతో మంచి సంబంధాలు వుండేవి.

26 జనవరి, 1930న తీసిన ఊరేగింపు, ఈ గాంధీటోపీ ఉదంతంతో మా కాలేజీ "యువజన బృందం" ఒక ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఇక మాపై అదనపు కర్తవ్యం కూడా పడింది. ఇతర కాలేజీలు, హాస్టళ్ళు తిరిగి, కరపత్రాల్ని, పుస్తకాల్ని, యితర సాహిత్యాన్ని పంచడం. ఆ పని కూడా బాగానే నిర్వర్తించాము.

ఇంతలో పరీక్షలు దగ్గరపడ్డాయి. మా "బృందం"లో చర్చ వచ్చింది. కాంగ్రెస్ ఉద్యమం వృద్ధి అవుతుంది. సంపూర్ణ స్వాతంత్ర్యం తీర్మానం అయింది. కాంగ్రెస్ ప్రవచిస్తున్న పద్ధతులలో సంపూర్ణ స్వాతంత్ర్యం రావడం అనుమానం. విప్లవం ద్వారా రావాలి. మనం అందుకై కేంద్రీకరించాలి. కనుక గ్రామాల్లో వ్యవసాయ కార్మికులు, పేద రైతాంగంలో పనిచెయ్యాలి. పట్టణాలలో కార్మికవర్గంలో కృషి చెయ్యాలి. మరి ఈ మామూలు కాలేజీ చదువులు కొనసాగించి ప్రయోజనం ఏమిటి అనీ కాదు. మనం యీ చదువులు పూర్తి చేసి, పిదప విప్లవం కోసం పనిచెయ్యాలి అనీ – యిలా చర్చలు సాగాయి.

నేను మాత్రం ఈ చదువు కొనసాగించడం వల్ల ఈ దశలో ఉపయోగం లేదని గ్రామం వెళ్ళి కార్యక్రమాలు చెయ్యాలని నిర్ణయించుకున్నాను. ఆ మేరకు నేను మా ప్రిన్సిపాల్‌కు లేఖ రాశాను. "జాతీయోద్యమం తీవ్రంగా సాగాలి! నేను కూడా మా ఊరు వెళ్ళి చేతనైనంత జాతీయోద్యమానికి చెయ్యాలి. కనుక సంవత్సరాంత పరీక్షలకు హాజరు అవటం లేదు" అని రాశాను. ––

మా ప్రిన్సిపాల్ ఫాదర్ బెట్రాన్ నన్ను పిలిపించారు. "జాతీయోద్యమంలో జేరి కొనసాగించవద్దనను. కానీ ఇప్పుడెందుకు చదువు మానుకోవాలి! యింకా చాలా వ్యవధివుంది. ముందు ఈ సంవత్సరం పూర్తి చెయ్యి. తర్వాత పరిస్థితులు ఎలా మార్పుచెందుతాయో చూద్దాము. చదువులు మానుకుని రమ్మని యింకా "వాళ్ళు" కూడా చెప్పలేదు కదా!" అని నచ్చజెప్పచూశారు.

"స్వాతంత్ర్య సముపార్జన అన్నది చాలా ముఖ్యమైనదిగా భావించి, దానితో మమేకమౌదామనుకున్నప్పుడు ఈ చదువు కొనసాగించటంలో అర్థం ఏమిటి? మేము చేయవలసిందీ, చేయగలిగిందీ చాలా వున్నది" అని నేనన్నాను.

"అయితే నువ్వు ఈ గణితం, భౌతికశాస్త్రం బదులు అర్థశాస్త్రం చరిత్ర గ్రూపు తీసుకుని వుండాల్సింది. నువ్వు చేయదల్చుకున్న కర్తవ్యానికి అవి బాగా వుపయోగపడేవి" అని అన్నారు ఫాదర్ బెట్రాన్

"చరిత్ర, అర్థశాస్త్రము యింటివద్దనైనా చదువుకోవచ్చు. ఈ గణితం, భౌతిక, రసాయనిక శాస్త్రాలకు మాత్రం చెప్పే ఉపాధ్యాయుడు, ప్రాక్టికల్స్ సదుపాయాలు అవసరం –



అందుకని యీ గ్రూపు తీసుకున్నాను" అని చెప్పాను. ఏమేం చదివావు అని అడిగిన మీదట – నేను చదివిన రాజకీయ, చారిత్రక, ఆర్థిక గ్రంథాలను చెప్పాను.

ఫాదర్ బెట్రాన్ ఆశ్చర్యపోయారు. "ఇవన్నీ ఒక క్రమపద్ధతిలో జీర్ణించుకునేట్లు చదివానని కాదు గానీ, మొత్తం మీద చదివాను" అని కూడా వివరించాను. ఆయన తర్వాత నన్ను గూర్చి "అతణ్ని చూసినేను గర్విస్తున్నాను. అందరూ చదువుకోడం, వుద్యోగం సంపాదించుకోవడం – అవి ఆలోచిస్తుంటే, అతను దేశమూ స్వతంత్రమూ అని ఆలోచిస్తున్నాడు. వృద్ధిలోకి వస్తాడు" అని అన్నారు.

ఆ తర్వాత యింటి వద్ద మా అమ్మ అక్కడ బంధువులు, ఈ వీరారెడ్డి వీరందరూ పరీక్షలు రాయమని బలవంతం చేశారు సరే! చదివినంతవరకు పూర్తి చేసినట్లవుతుందని పరీక్షలు రాసేందుకు వచ్చాను. ఫాదర్ బెట్రాన్ నేను పరీక్షలకు హాజరవటం చూశారు. "మంచిపని చేశావ్? పరీక్షలు జాగ్రత్తగా రాయి. ఆ తర్వాత తీరిగ్గా ఆలోచించుకో! నీ మార్గానికి అడ్డువచ్చే ప్రసక్తిలేదు. ఆ తర్వాత చదువదలచుకుంటే చదువు కొనసాగించులేదా నీయిష్టం అయినట్లుగా జాతీయోద్యమంలో పాల్గొను" అని ప్రోత్సహపరిచారు.

పరీక్షలు ముగించుకుని మా వూరు వెళ్ళాను. ఎలాగు కృతార్థుడనవుతాను. అందులో సందేహం లేదు. హరిజనోద్ధరణ, కులమత సమానత్వం నన్ను ప్రభావితుణ్ని చేశాయని చెప్పానుగదా! మావుళ్ళో ఆ విషయంపై పనిచేద్దామనుకున్నాను. నామిత్రులను పోగుచేశాను. వేమన పుట్టిన రోజున 1930 మార్చి నెలలో అనుకుంటాను సహపంక్తి భోజనం ఏర్పాటు చేశాము. యువకులందరం కలసి ఏర్పాట్లన్నీ చేసి, వంట కూడా మేమే వండి "హరిజనులకు" భోజనానికి రమ్మని కబురు చేశాము.

వాళ్ళలో యెక్కువభాగం వ్యవసాయకూలీలు వాళ్ళు! మా బంధువులు గ్రామ భూస్వాములు. "మీరు వెళ్ళారంటే వూరుకొనేది లేదు" అని హరిజనులను బెదిరించారు. కనుక హరిజనులెవ్వరూ రాలేదు. ఎందుకు రాలేదా అని ఆలోచిస్తే ఇదీ విషయం అని తెలిసింది. మేము వాళ్ళ పిల్లలమే గనుక మమ్మల్నేమీ అనలేకపోయారు. సరే యిదా విషయం అని, గాంధీగారి ప్రభావం కూడా నా మీద వుంది గదా "సరే! అట్లా అయితే నేనూ తినను" అని ఉపవాసదీక్ష మొదలెట్టాను.

మా అమ్మ వచ్చింది. 'ఎవరో ఎవర్నో తింటానికి రానివ్వకపోతే నువ్వు పస్తులుండడమేమిటి' అని నన్ను బుజ్జగించింది. "వాళ్ళు – హరిజనులకు సహపంక్తి భోజనానికి రానివ్వలేదుకదా! వాళ్ళకి తెలియాలి నేను చేతులు ముడుచుకు కూర్చోనని, నేను సత్యాగ్రహం చేస్తాను" అని గాంధీగారి పద్ధతిలో నా నిరసన తెలియజేశాను. నిజానికి అలా నిరసన తెలియచేయడంలో అర్థం లేదు. కానీ నేను చేసిన సత్యాగ్రహం హరిజనులపై ఎంతో ప్రభావాన్ని కలిగించింది. "ఆయన చూశావా మనకోసం అన్నం మానుకున్నాడు! మనందర్నీ సమానంగా చూడాలని ఎంతో తాపత్రయపడుతున్నాడు. ఎంతమంచి మనిషో" అని వారు నా గురించి అనుకోసాగారు.

# సత్యాగ్రహోద్యమం

నేను మా ఊళ్ళో ఉండగా పశ్చిమగోదావరి జిల్లా చాగల్లు ఆనందనికేతన్ ఆశ్రమం నుండి సోదర సమితివారు నాకు ఉత్తరం రాశారు. అప్పుడు నరసింహశర్మ, ప్రకాశ రాయుడుగారలు ఆ ఆశ్రమ బాధ్యత వహిస్తున్నారు. మేము అక్కడికి వెళ్ళి సత్యాగ్రహోద్యమంలో పాల్గొనాలి. కాంగ్రెస్ ఉద్యమాన్ని నిర్వహించాలన్నది ఆ లేఖాంశం.

అప్పుడప్పుడే కాంగ్రెస్ అనుసరిస్తున్న పద్ధతుల ద్వారా స్వతంత్రం సిద్ధిస్తుందా అన్నది మాకు అనుమానాస్పదంగా వుంది. ఈ ఖాదీ, సత్యాగ్రహం ఇలాంటి వాటి వల్ల ప్రయోజనం విషయంలోనూ మాకు నమ్మకం సన్నగిల్లుతున్నది. అయినా ఆ ఉద్యమంలో పాల్గొందామనే కొంత తడవు తర్జనభర్జన జరిపి నిర్ణయించుకున్నాము.

మా అమ్మతో యిట్లా నేను సత్యాగ్రహంలో పాల్గొనేందుకు వెళ్తున్నానని చెప్పాను. సహజంగానే "అమ్మ"లు తమ కొడుకులు ఇలాంటి పనులు చేయడానికి అంగీకరించరు కదా! "మన ఊళ్ళో నువ్వు చేయదలచిన పనికి ఈ ఊరు పెద్దలు ఆటంకపరిచారనా అంత దూరం వెళ్తున్నావు? మీ అన్న నీకు అన్ని విధాల సహకరిస్తాడు. మన ఉళ్ళోనే ఉండి నువ్వు చెయ్యాలనుకున్నది చెయ్యి" అని చెప్పింది. 'అన్న సహకారం లేదని కాదు! ఏమి ఫర్వాలేదు అక్కడ పని పూర్తి చేసుకుని తిరిగి వస్తాను" అని చెప్పాను.

చాగల్లు వెళ్ళి సత్యాగ్రహ శిబిరంలో జేరాను. మా సముదాయంలో కంభంపాటి సత్యనారాయణ, తిమ్మరాజు సత్యనారాయణ, రాజమండ్రికి చెందిన బెజవాడ వెంకటేశ్వరరావు – ఆ తర్వాత ఆయన ఆర్.ఎస్.ఎస్. లో జేరాడనుకోండి – నూజివీడులో వ్యవసాయ శాస్త్రజ్ఞుడిగా పనిచేసిన మురారి విజయసారథి తదితరులం ఉన్నాము. చాగల్లు నుండి భీమవరం పంపారు. భీమవరం ఉప్పు సత్యాగ్రహానికి అప్పుడు కేంద్ర కార్యాలయం.

1930 ఏప్రిల్ 13 దిరుసుమర్రు గ్రామంలో మొదటి సత్యాగ్రహం ప్రారంభించాలి. అక్కడ ఉప్పు దండిగా వుంది. సముద్రం పోటు వచ్చినప్పుడు వెనుకకు మళ్ళిన నీరు నిలిచి సూర్యరశ్మికి ఉప్పుగా మారుతుంది. అయితే అక్కడ చాలా పని వుంటుదని నాకు చెప్పారు.

అక్కడకు వెళ్ళిన తర్వాత ఒక పెద్ద మూటగా ఉప్పును కట్టి నన్ను నా వీపు మీద మోసుకు తీసుకు వెళ్ళమన్నారు. ప్రయత్నిద్దామని వీపు మీద కెత్తుకుని రెండు ఫర్లాంగులు వెళ్ళానుగానీ ఆ తర్వాత యింక మొయ్యలేకపోయాను. ఇంకో సత్యాగ్రహి వచ్చాడు. ఇద్దరం



చెరిసగం చేసుకున్నాం. కాళ్ళు జారుతున్న ఆ పొలాల గట్ల వెంట 25–30 కిలోల ఉప్పు మోసుకు వెళ్ళటం అంత తేలికైన పనికాదు. అంటే కేవలం మన కృతనిశ్చయమే సరిపోదు. శారీరక దారుఢ్యం, సాధన కూడా అవసరం. అందులోనూ – వీపుపై అంత బరువును మోసే అలవాటు కూడా నాకు అంతకు ముందులేదు. అయితే పనికి అంకితమయి చేయడం, ఉత్సాహంగా ఉండడం, క్రమశిక్షణ పాటించడం – వీటిల్లో నాకు మంచి పేరు వుండేది.

ఆ తర్వాత దిరుసుమర్రులోనే శిబిరం పెట్టారు. ప్రతిరోజు సత్యాగ్రహం సాగేది. సత్యాగ్రహుల చేత శారీరక వ్యాయామం చేయించే పూచీ నాది. అక్కడ ముష్టి లక్ష్మీనారాయణ – ఆయనకు ఇప్పుడు 83 సంవత్సరాలుంటాయి. చలపతి అని ఇప్పుడు లేరనుకుంటాను – వీళ్ళు వుండేవారు. 'రామం' ఆ తర్వాత కొద్ది రోజులకు మాలపర్రు శిబిరంలో చేరాడు.

ఉదయమే లేచి అందర్నీ లేపి లైన్లలో నిలబెట్టి క్రమశిక్షణాయుతంగా "లెఫ్ట్", "రైట్" ఆ చేలగట్ల వెంట కొట్టించేవాణ్ని. మా శిబిరం చాలా శిక్షణాయుతంగా వుండేది. నిజానికి అది నా గొప్ప కాదు. జాతీయోద్యమ ప్రభావం. ప్రతి సత్యాగ్రహీ క్రమశిక్షణ వుండాలని తనకు తానే నిర్దేశించుకునేవాడు.

అప్పట్లో నన్ను "రెడ్డి" అనేవాళ్ళు. "నెల్లూరు నుండి వచ్చిన "రెడ్డి" చాలా ఖచ్చితమైన మనిషి. మంచి శిక్షణ గరుపుతాడు. ఏదన్నా పని జరగాలంటే చక్కటి "వ్యూహం" పన్నుతాడు. అనుకున్నది సాధించడంలో దిట్ట" అని నాగూర్చి అప్పటికే చెప్పుకునేవాళ్ళు. అందుకని మమ్మల్ని ఇంతకన్నా హెచ్చుస్థాయిలో ఉద్యమం నడపగల అవకాశం వున్న మాలపర్రు శిబిరానికి వెళ్ళమన్నారు. అక్కడ సత్యాగ్రహులపై పోలీస్‌దాడి జరుగుతుందని కూడా అనుకుంటున్నారు. అక్కడ రామమూర్తి రాజు అనే ఆయన శిబిర నాయకుడు. ఇక్కడ నాకు రామంతో పరిచయం కలిగింది. రంగశాయి అని ఏలూరు నుంచి వచ్చిన సత్యాగ్రహుల నాయకుడొకరు. సరే, ముష్టి లక్ష్మీనారాయణ ఇంకా కొందరు వున్నారు.

నరసింహశర్మగారు మన వ్యూహం ఏమిటి? అని చర్చ ప్రారంభించారు. "30–40 మంది కలిసి చర్చిస్తే తేలేదేమిటి? ఇక అయిదుగురు, ఆరుగురు మనమే ఎంపిక చేసినవాళ్ళు కూర్చుని, నింపాదిగా చర్చించి ఒక నిర్ణయానికి వచ్చి మిగతా అందరికీ ఆ నిర్ణయం వివరించాలి. అప్పుడు పని తేలికవుతుంది. అంతేగాని 30–40 మందిలో ప్రతివాళ్ళూ ఏదో చెప్తుండటం, గందరగోళం తప్ప వుపయోగం వుండదు. ముందు నాయకులుగా వున్న అయిదారుగురిని తేల్చండి. అంతగా అయితే, వ్యక్తిగతంగా మిగతావాళ్ళ అభిప్రాయములు కూడా తీసుకుని వాళ్ళు చర్చిస్తారు" అని నా అభిప్రాయం చెప్పాను.

రంగశాయి అనుకుంటాను "ఏమిటయ్యా మాకు ఆదేశిస్తున్నావు" అని వ్యతిరేకించాడు. "ఆదేశం కాదు. ఏదన్నా ఒక నిర్ణయం కావాలంటే అదే మార్గం" అని నా అభిప్రాయంగా చెప్పాను. ఆ తర్వాత ఈ సూచన మీద వాదోపవాదాలు జరిగాయి. చివరికి నా సూచనను అంగీకరించి ఒక ఆరుగుర్ని ఎన్నుకున్నారు. ఆ తర్వాత ఆ ఆరుగురిలో నన్ను కూడా జేర్చుకున్నారు.

పోలీసులు దాడిచేస్తే ఉప్పు సత్యాగ్రహ కార్యక్రమం ఎట్లా కొనసాగించాలి అన్నది ప్రశ్న. 'మనం ముందు కొన్ని దళాలుగా ఏర్పడదాం. ఒక దళం వెళ్ళి ఉప్పు తయారు చేస్తుంటుంది. పోలీసులు వచ్చి బాదుతారు. మనం సత్యాగ్రహులం యెదురు తిరిగి కొట్టకూడదు.

ఆ దళం పడిపోయిన తర్వాత రెండో దళం యిలా కొనసాగాలి. సరే చివరకు పోలీసులు ఎట్లాగూ మన దళాలన్నింటినీ అదుపులోకి తీసుకుంటారు. ఏమైనా చలించకుండా మనం మన కర్తవ్యం కొనసాగించాలి" అన్నది నా పథకం. అందరూ ఆమోదించారు.

ఇంతకీ పోలీసులు రాలేదు. కొద్ది రోజుల్లో ఎట్లాగూ వర్షాలు వస్తాయి. ఈ లోపల అక్కడున్న ఉప్పుకాస్త అయిపోతుంది. అని పోలీసులు భావించి వుంటారు. అనుకున్నట్లుగానీ, అక్కడవున్న కొద్ది రోజుల్లోనే ఉప్పు యితర ప్రాంతాలకు జేరవెయ్యడం జరిగింది. ఇక ఉప్పు మిగల్లేదు. చేసేందుకు ఏం పని మిగిలింది?

కల్లు తీసేందుకు అనువైన తాటి, ఈత మట్టలు, గెలలు నరికివేసే కార్యక్రమం తీసుకున్నాం.

తాటి తోపులు, ఈతతోపులు ఎంచుకున్న గెలలు, మట్టలు నరికి వేయడం, కల్లు అమ్మే దుకాణాల వద్ద పికెటింగ్ చేయడం కార్యక్రమంగా ఎంచుకున్నాము. తిరిగి భీమవరం కేంద్రానికి జేరాము. ఇక అక్కడ నుండి వివిధ దళాలుగా విభజన అయి, వివిధ ప్రాంతాలకు వెళ్ళాలి! అయితే ఇంతలో శిబిర నిర్వాహకులు వచ్చి, సముద్రతీరం అంతా సర్వే చేసి, యింకా యెక్కడైనా ఉప్పు సత్యాగ్రహానికి అనుకూలంగా వుందేమో చూసిరమ్మని నన్ను పురమాయించారు.

"నేనొక్కణ్ణి యింతదూరం ఎలా తిరుగుతాను" అని అడిగాను. "అంత కష్టమైన పని అనేగదా నీకు అప్పజెప్పింది" అని వారు సమాధానం. మండువేసవి. ఒక తాబేటికాయలో నీళ్ళు తీసుకుని నేనూ, దిరుసుమర్రు గ్రామం అతను ఒకరు - ఇద్దరం బయలుదేరాం. 25-30 మైళ్ళు సర్వే చేశాం. తిరిగి వచ్చి, ఇక ఎక్కడా ఉప్పు సత్యాగ్రహానికి అవకాశం లేదని చెప్పాము.

ఇక యీ "కల్లు" వ్యతిరేక వ్యవహారం ఉంది. గెలలు, మట్టలు నరికే దళానికి నేను నాయకుణ్ణి? ఇలా నరికిన వాళ్ళని, ఒక్కోసారి కొట్టటమో, జైల్లో పెట్టడమో జరుగవచ్చు. ప్రతి ఊరుకెళ్ళి యీ పనిచేయలేము. ఆ ఉళ్ళో కాంగ్రెస్ పార్టీకి గనుక సానుభూతి. సహకారం లేకపోతే కల్లు గీత కార్మికులే ఇలా గెలలు, మట్టలు నరుకుతున్న వాళ్ళని పట్టుకొని కొట్టవచ్చు.

అందుకని, కాంగ్రెస్‌కు బాగా బలమైన ఊరు యెంచుకోవాలి! దగ్గర్లోనే రామమూర్తి రాజుగారి ఊరు కుదరవల్లి ఉంది. ఆ ఊరి నడిమధ్య - పెద్ద ఎత్తాటి తాటిచెట్టు ఉంది. పక్కనే చెరువు. ఆ చెట్టు ఎక్కి మట్టలు కొట్టి, గెలలు నరుకుదామనుకున్నాం. గ్రామస్థులు ఈ కార్యక్రమం పట్ల పెద్ద ఆసక్తిగాలేరు. సహకరించేట్లు లేరు. మేం అయిదుగురం వున్నాం. మా దగ్గర కొడవళ్ళు వున్నాయి. అవీ అంత పదునైనవి కావు.

ఎక్కుదామని అయితే అనుకున్నాము గానీ, అంత ఎత్తు తాటిచెట్టు ఎవరు ఎక్కగలరు? నేను ఎక్కుతాను అన్నాను. అంతకు ముందు కొంచెం చిన్న తాళ్ళు ఎక్కిన అనుభవం వుంది. కానీ ఇంత పెద్ద "తాడి" ఎప్పుడూ ఎక్కలేదు. ఎక్కేందుకు మోకు వగైరా యేమీలేవు ఎట్లా అయితే యేం, ఎక్కి గెలలు నరికాను. నాతోపాటు మా దళంలో విష్ణు అని ఒక హరిజన యువకుడు - చాగల్లు వారి ఆశ్రమం నుండి వచ్చినతను, ప్రసాద్, తమ్మయ్య, ఇంకో ఇద్దరు యువకులూ వున్నారు.

వాళ్ళు నేను పడతానేమోనని భయపడుతున్నారు. ఆ తాడిచెట్టు నెల్లూరు "రెడ్డి" ఎక్కడని వూరంతా పాకింది. వూళ్ళో వాళ్ళు కూడా యేమవుతుందోనని భయపడుతూ చెట్టు



వద్దకు జేరారు. నేను మాత్రం క్షేమంగా దిగాను. వొళ్ళు కాస్త గీచుకుపోయింది అంతే! కొంచెం అనుభవం, పట్టుదల దాంతో ఆ పని పూర్తి చేశాను.

"ఇంత సాహసానికి వొడి గట్టావు. ఇంత పెద్ద చెట్టు బాగా అనుభవం వున్న ఒకరో ఇద్దరో తప్ప ఎక్కలేరు. నీకేం కావాలి? అని అప్పుడు వూళ్ళో వాళ్ళు అడిగారు? ఎన్నో తాడిచెట్లు మీ వూళ్ళో వున్నాయి. కల్లు పుష్కలంగా అవుతుంది. మీ వూరు కాంగ్రెస్‌కు బలమైన వూరు. కాంగ్రెస్ కల్లు వ్యతిరేక కార్యక్రమం ఇచ్చింది. మరి మీరు సహకరించకపోతే ఎలా?" అని నేను అడిగాను. సరే అని వాళ్ళూ మా వెంట వచ్చారు.

మా దళంలో మిగతావాళ్ళకు నాకున్న పాటి అనుభవం కూడా లేదు. ఆ రోజుల్లో నేను ఒక్కణ్ణి ఇరవయి ఒక తాళ్ళు ఎక్కి పని పూర్తి చేసుకు వచ్చిన గుర్తు. " ఈ రాత్రి రైల్వేలైను ప్రక్క ఈత చెట్లన్నింటినీ నరుకుదాము ఇక్కడే వుండమని" వూళ్ళో వాళ్ళు అన్నారు. వూళ్ళో యువకులు కూడా కలిశారు. అందరం కలిసి రైల్వేలైను వెంట, చెరువు గట్లు మీద వున్న ఈతచెట్లన్నింటినీ నరికాము.

అయితే ఈ కార్యక్రమంలో వున్న ఇబ్బందిని మేము గమనించలేదు. గీత కార్మికుల జీవనోపాధి ఇందువల్ల దెబ్బతింటున్నది. మేమంతా గాంధీగారి ప్రభావంతో కల్లు తాగవద్దని, ఖాదీ అనీ, సత్యాగ్రహమనీ కార్యక్రమం తీసుకున్నాం. గాంధీగారి ప్రభావం అనేకాదు. మధ్య తరగతి ప్రజలలో అట్లాగే మామూలు జనం దృష్టిలో కల్లు తాగటం చేయకూడని పని. అలా తాగిన వాణ్ణి "చిన్న" చూపు చూసేవారు.

అయితే ఈ కార్యక్రమం వల్ల నష్టపోతున్న గీత కార్మికులు అడ్డు రాలేదు. కారణం ఆ వూరు కాంగ్రెస్‌కు బలమైన కేంద్రం. ఏమన్నా అడ్డు తగిలితే, ఈ కాంగ్రెస్ జనం వూరుకోరేమోనన్న భయం.

ఈ అనుభవం మాకు ఆ తర్వాత కాలంలో తెలంగాణా పోరాట రోజుల్లో వుపయోగపడ్డది. నిజాం ప్రాంతంలో ఇలా కల్లు నిచ్చే చెట్లను నరకటం శిక్షార్హమైన నేరం. ప్రభుత్వానికి పన్ను చెల్లించి కల్లు గీసుకోవచ్చు. అయితే ఆ పన్ను చాలా ఎక్కువ వుండేది. కాంగ్రెసువారు, మన ఆంధ్ర మహాసభవారు - ఇద్దరం కల్లుగీత కార్మికులు ప్రధానంగా వున్న ప్రాంతాలలో వాళ్ళ వద్దకు వెళ్ళి ఇలా చెప్పేవాళ్ళం : "కల్లు గీసుకోండి. అయితే నిజాంకు మట్టుకు పన్ను కట్టవద్దు. అలాగే దాన్ని మరీ నిషా వచ్చేటట్టు పులియ పెట్టవద్దు." ఈతచెట్లు నరికి సేద్య వ్యవసాయ భూమిగా మార్చాలని మేము ప్రయత్నిస్తుంటే కల్లుగీత కార్మికులు అభ్యంతరం పెట్టేసరికి ఈ నినాదం తీసుకున్నాము.

ఇక 1930లో కల్లు నిచ్చే చెట్ల కార్యక్రమం వచ్చేసరికి మేము చేసిన పని జిల్లా వ్యాపిత చర్చనీయాంశమయింది. పోలీసు, మిలటరీ వాళ్ళు ఆ క్రిందటి రోజు రైల్లో అటుగా వెళ్ళారు. మర్నాడు తిరిగి వచ్చారు. వచ్చేసరికి ఆ ప్రాంతం రైల్వేలైను ప్రక్కల వందల ఈతచెట్లు నరకబడి వున్నాయి. ఇదెలా సాధ్యం? అని వారు ఆశ్చర్యపోయారు. ఏదో అద్భుతంగా, ఇంద్రజాలంగా వుందే అని వాళ్లూ, జనమూ అనుకున్నారు. నిజమే! ఏ ఒక్క మనిషి ఇంద్రజాలం అనిపించే అద్భుతం చేయలేదు. కానీ ప్రజలు తల్చుకుంటే ఇంకెంతటి అద్భుతమైనా, ఇంద్రజాలం అయినా చెయ్యగలరు.

# మొదటి అరెస్టు - బ్రిటిష్ పోరాటం

నెల్లూరు నుండి వచ్చిన “రెడ్డి” దళమే ఈ పని చేసిందని జనం చెప్పుకున్నారు. అప్పటికి ఇంకా చట్టరీత్యా రెడ్డి అన్నపదం తొలగించుకోలేదు. అయితే మాలపర్రు శిబిరంలో వున్నప్పుడే నన్ను రెడ్డి అని పిలవకండి అని చెప్పేవాణ్ణి. అయితే 35లోనో 36లోనో నెల్లూరు జిల్లా లోకల్‌బోర్డు ఎన్నికలలో అభ్యర్థిగా నిలబడ్డారు. ఆ సందర్భంగా చట్టరీత్యా గెజిట్‌లో ప్రకటించిన ఈ “రెడ్డి” పదాన్ని వదిలించుకున్నాడు.

అసలు నా పేరులో “వెంకట” అలాగే “రామ” పదాలు కూడా వదిలేశాను. నిజానికి “సుందరయ్య” అనడం తేలిక. అందరికీ “సుందరయ్య” గానే తెలుసు. ఇప్పటికొచ్చే సరికి సుందరయ్య కన్నా “పి.ఎస్” అని అనడమే సన్నిహితుల్లో చాలామందికి అలవాటు. నేను రహస్య జీవితం గడుపుతున్నప్పుడు నా పేరు నాగేశ్వరరావు. “నాగి” అన్నది అప్పటి అలవాటు.

1930 జూన్‌లో అదే మాలపర్రు గ్రామంలో నేను మొదటిసారి అరెస్టయ్యాను. నన్నూ, నాతోపాటు తమ్మయ్యనూ, దొరయ్యనూ, విష్టునీ, ఇంకా ఎవరన్నా వున్నారేమో, ఈ దొరయ్య తాడేపల్లిగూడెం తాలూకా వాడు. పేదరైతు కుటుంబం నుండి వచ్చాడు. ఈ దొరయ్య చనిపోయాడు. కానీ తమ్మయ్య బ్రతికే వున్నాడు. ఇటీవలనే కలిశాడు. ఆ పాత సంగతులన్నీ గుర్తు చేశాడు.

మా దళం వాళ్ళనీ “బోర్టసల్” స్కూలుకు పంపారు. మామూలుగా అది జైలు కాదని, సంస్కరించే పాఠశాల అని భావం. నిజానికి అలాంటిదేమీ లేదు. అది జైలుకన్నా అధ్వానంగా వుండేది. ఆ విషయం తర్వాత చెప్తాను. ఈ బోర్టసల్ స్కూలులో కనీస శిక్ష 2 సం॥లు. అందుకని రెండేళ్ళు శిక్ష పడింది. ఈ తమ్మయ్య నాకన్నా ఒక ఏడాది చిన్న. అందుకని అతణ్ణి చెంగల్పట్టు పిల్లల జైలుకు పంపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా చెట్టు నరికామని మాపై అభియోగం.

నా పేరు, ఊరు తదితర వివరాలు కోర్టులో చెప్పేందుకు తిరస్కరించాను. వాళ్లు ఒక డాక్టరును పిలిపించారు. ఆయన వచ్చి 18 సంవత్సరాలకన్నా తక్కువ అని నిర్ధారించాడు.



అందుకని తంజావూరు బోర్టసల్ స్కూలుకు పంపారు. సరే, రికార్డు అలాగే ఇతర వివరాలు పోలీసులు సేకరించి నెనెవర్నో కనుక్కోవడం పెద్ద కష్టమేమీ కాదనుకోండి.

భీమవరం సబ్‌జైల్ నుండి తంజావూర్ బోర్టసల్ స్కూలుకు రైల్లో మమ్మల్ని తీసుకువెళ్ళారు. కిటికీలోంచి దారి చూస్తూంటే నాకు ఆశ్చర్యం అనిపించింది. 1930 ఉద్యమం మంచి ఉధృతంగా వున్న రోజులు. వందలాది కాంగ్రెస్ కార్యకర్తలను నిర్బంధించబడుతున్నారు. అయినా, ప్రజలు దైనందిన జీవితంలో ఏమి ప్రభావం లేదు. వేలాదిమంది సత్యాగ్రహులు పోలీసు లాఠీచార్జీ దౌర్జన్యానికి గురవుతున్నారు. అయినా జనానికేమీ పట్టినట్లు లేదు. ఊరేగింపులు, పెళ్ళిళ్లు అన్నీ మామూలుగా వారి జీవితంలో ఏమీ సంచలనం లేనట్లే జరిగిపోతున్నాయి. మరి ఈ సత్యాగ్రహం వారినేమీ ప్రభావితం చేసినట్లు లేదు అని నాకు అనిపించింది.

మాకన్నా ముందే మా సోదరసమితిలో మిగతావారిని అరెస్టు చేశారు. ఆకివీడు దగ్గర సుద్దాపురంలో కల్లు దుకాణం వద్ద పికెటింగ్ చేస్తూ వారు అరెస్టయ్యారు. వాళ్ళకూ 6 నెలలు, ఏడాది. రెండేళ్ళు – యిలా శిక్షలు విధించి, జైళ్ళకు పంపుతున్నారు. ఇక మాకు సంబంధించినంతవరకూ, ఈ సత్యాగ్రహం వ్యవహారం ముగిసినట్లే. జైలు జీవితం ఆరంభమయింది.

ఒక్కసారి ఈ కాలాన్ని సింహావలోకన చేసుకుందాము. ఈ జైలుకు వెళ్ళబోయేముందు, మా గ్రామంలో కొన్నాళ్ళు వున్నాను కదా! వ్యవసాయ కూలీల జీవితాలు మెరుగుకావాలన్న ఉద్దేశంతో, కూలి సంఘాల స్థాపనకు యత్నించాను. అప్పటికి అందుబాటులో వున్న మార్క్సిస్టు సాహిత్య ప్రభావం వల్ల వ్యవసాయ కార్మికులను, పేద రైతులను సమీకరించి నిర్మాణయుతం చేయాలన్న తపన ఒక వంకా, మానవతాదృక్పథం, సేవ, కులరహిత సమాజం కోసం కృషి చేయాలన్న తలంపు, గాంధీగారి హరిజనోద్ధరణ యివన్నీ కూడా ఇంకోవంకా వుండేవి.

ముందు మేము చేయదలుచుకున్న వానిని మా ఉళ్ళో మా కుటుంబాలలో ఆరంభించాలనుకున్నాను. ముందుగా అందుకే మా ఉళ్ళో యువకులను సమీకరించి యీ వర్గ వ్యవస్థా దృక్పథానికి వ్యతిరేకంగా నిలబెట్టే ప్రయత్నం చేశాను. ఆ తర్వాత సత్యాగ్రహం, జైలు యిదంతా గాంధీజీ ప్రభావం. అయితే అప్పటికీ రవీంద్రనాథ్ ఠాగూర్, నెహ్రూ వీళ్ళు సోవియట్ యూనియన్ గూర్చి రాసిన పుస్తకాలు చదివివున్నాను. కమ్యూనిస్టు మానిఫెస్టో, తదితర కరపత్రాలు చదివి వున్నాను. వాటివల్ల కమ్యూనిస్టు పార్టీలో పనిచేయాలన్న గాఢమైన అభిప్రాయం నాలో కలిగింది! దానికి తోడు హెచ్.డి.రాజా వచ్చి ఏర్పాటు చేసిన గ్రూపుతో కలిసివుండేవాణ్ని.

అందువల్ల తంజావూరు బోర్టసల్ స్కూల్లో గానీ, తర్వాత నేను మార్చబడిన తిరుచినాపల్లి, రాజమండ్రి జైళ్ళలో వున్నప్పుడు నాతోపాటు జైల్లో వున్న కార్యకర్తలకు పాఠాలు

చెప్పేవాణ్ని. స్వాతంత్ర్యోద్యమం ఇలా గాంధీ పద్ధతుల్లో సత్యాగ్రహంతో స్వాతంత్ర్యాన్ని సాధించలేము. రష్యా విప్లవం జరిగినట్లే మనదేశంలోనూ జరిగితేగానీ మన లక్ష్యం నెరవేరదు. కనుక మనం బయటకు వెళ్ళిన తర్వాత రష్యా విప్లవం ఎలా జరిగిందో అవన్నీ మరింతగా అధ్యయనం చెయ్యాలి. అందుకోసం కమ్యూనిస్టు పార్టీలో చేరి కృషి చేసి రష్యాలో వున్న సమాజం మాదిరి సమాజాన్ని మన దేశంలోనూ సాధించుకోవాలి – ఇదీ నేను చెప్పే పాఠం.

**జైలు జీవితం**

అంటే జైలుకు వెళ్ళేనాటికే స్పష్టమైన అవగాహన లేకపోయినా పైపై అవగాహనగానైనా సోషలిజం సాధించాలి అని వుండేది. అయితే ఇంకా పూర్తిగా ప్రముఖంగా నాలో వున్న భావాలవి కాదు. గాంధీ సిద్ధాంతం, వివేకానంద రచనలు, కొంచెం మత అభిమానం – ఇవే నాలో వుండేవి.

కానీ, విప్లవకారుల జీవితాలు, జాతీయ వ్యక్తిగత విప్లవ వీరుల జీవితాలు, గాంధీ బోధనలూ ఇవన్నీ కూడ చదివి వున్నాను. మిగతా అంశాలెలావున్నా నువ్వు ముందు శారీరకంగా ఆరోగ్యంగా బలంగా వుండాలి. ఎలాంటి కష్టాలనైనా భరించేటందుకు సిద్ధపడి వుండాలి. రెండో అంశం – ప్రజలకు సేవ చేయ్యాలన్న దృక్పథం కలిగివుండాలి. నిరాడంబర జీవితం గడపాలి– ఇవీ నేనీ కాలంలో ప్రధానంగా సంతరించుకున్న అంశాలు.

సరే! తంజావూరు బోర్‌స్టల్ స్కూలులో మమ్మల్ని నిర్బంధించారు. అంతకు ముందు కొంతమంది జైలు జీవితం చాలా దుర్భరంగా వుంటుందని చెప్పగా విన్నాను. కొందరు "బోర్‌స్టల్ స్కూలు పెద్ద కష్టంగా వుండదు. అది వాస్తవానికి జైలు కాదుకదా" అని చెప్పారు. మరీ మామూలు జైలు కన్నా కూడా అన్యాయంగా వుంటుంది అని కొందరు భయపెట్టారు. ఏమైనా నాకు మాత్రం అంత భరించలేనట్లుగా లేదు.

అన్నిటికన్నా బాధాకరమైంది ఏమంటే ఆ జైలు వార్డర్లు, వాచ్‌మెన్‌లు ఈ ఖైదీలపట్ల ప్రవర్తించేతీరు. నిజానికి ప్రభుత్వం జీతం ఇచ్చి నియమించిన వార్డర్లు, వాచ్‌మన్‌లు చాలా తక్కువమందే. ఎక్కువభాగం వుద్యోగ బృందం ఖైదీలలో దీర్ఘకాలంగా వున్నవాళ్ళు – ఇలాంటి బాపతు. వాళ్ళకు చదువు సంధ్యలుండవు. దాదాపు మానవత్వం హరించిపోయివుంటుంది. వాళ్ళు చాలా సంస్కారహీనంగా నోటికొచ్చినట్లు తిట్టేవాళ్ళు.

అన్ని రకాల అవినీతికి జైళ్లు అలవాలాలు. ఖైదీల రేషన్‌లు దొంగతనం చేయడం, ఆ కొంచెం తిండినైనా అపరిశుభ్రంగా నిర్లక్ష్యంగా వండిపెట్టటం నిజానికి నిరుపేదలు కూడా ఆ తిండిని తినగలిగేవాళ్లు కాదు.

దాదాపు 20 ఔన్సుల బియ్యం, 4 ఔన్సుల పప్పు, 1 ఔన్సునూనె, మిగతావి 2 ఔన్సులు – ఇదీ ఆ రేషన్. మేము చదువుకునేందుకు నిషేధింపబడిన పుస్తకాలు తప్ప



మిగతావి కొనుక్కోవచ్చు. దినపత్రిక మాత్రం తెప్పించుకునే వీలులేదు. నెల కొకసారి బంధుమిత్రులెవరైనా చూసి వెళ్ళవచ్చు.జైలు డాక్టర్లు, ఆస్పత్రి వుండేవి. కాని యెప్పుడూ సకాలంలో సరైనా సహాయం లభ్యమయ్యేది కాదు. పెద్దగా చదువు అన్న భాగం లేదు. ఏవో చేతివృత్తులు నేర్పేవారు. ఉత్తరాలు రాసుకోవచ్చు. అయితే యివన్నీ చాలా వరకు కాగితం మీద వుండేవి. కానీ ఆ జైలు అధికార్లు ఈ "ఖైదీ"ల పట్ల ప్రవర్తించే తీరు మాత్రం చాలా అసభ్యంగా ఉండేది.

అక్కడ జైల్లో కూడా ఖైదీల పట్ల, కుల, ప్రాంతీయ వివక్షత వుండేది. ఖైదీ ఏ కులంవాడు అన్న ఆంశం ఫారం మీద వుండేది. హరిజన కులం అని రాస్తే మాత్రం జొన్నలు, రాగులు, సజ్జలు యివి వండిపెట్టేవారు. మిగతావాళ్లకు మామూలు బియ్యపు అన్నమే పెట్టేవారు. ఆంగ్లో ఇండియన్ ఖైదీలకయితే పాశ్చాత్య భోజన పద్ధతి –రొట్టె, వెన్న, ఎక్కువసార్లు మాంసాహారం యిలా ఉండేది.

అన్నింటినీమించి వండే పద్ధతి మాత్రం చాలా అసహ్యంగా వుండేది. ఆ గిన్నెలు శుభ్రంగా కడిగేవారు కాదు. తెచ్చిన కూరగాయలు శుభ్రం చేసేవారు కాదు. ఇక బియ్యం, పప్పులు బాగు చేసే ప్రసక్తి లేదు. ఇనుప గుండిలలో వండేవాళ్లు. అన్నంలో కూడా చిన్న చిన్న ఇనుప పెళ్ళికలు వుంటుండేవి. కూరగాయల మీద వున్న పురుగులు కూడా వుడికి కూరల్లో కలిసేవి. రాళ్ళ సంగతి చెప్పనే అక్కర్లేదు.

కూరలు, ఆకులు, కొంచెం పప్పు –చాలా నీళ్ళుపోసి, మరగబెట్టి ఇంత ఉప్పూ, కారం వేసి, "పులుసు" అని దానికి పేరు పెట్టి వడ్డించేవారు. ఆ పదార్థానికి జైల్లో పెట్టిన ముద్దుపేరు "దేవతాపులుసు" (దేవతాకొళంబు)

సరే వెళ్ళిన వారం రోజుల తర్వాత ఈ తిండి గూర్చి మా నిరసన తెలియజేశాము. అసలు మా "తిండి" ని గూర్చి మేమే పర్యవేక్షణ చేసుకునే అధికారం వుండాలి. మా రేషన్‌లు మాకు సక్రమంగా రావాలి! మేము మామూలు ఖైదీలం కాదు, సత్యాగ్రహులం. జైలు నిబంధనలను జైలు అధికారులు ఖచ్చితంగా పాటించాలి! ఖైదీలను జైలు అధికారులు బూతులు తిట్టకూడదు. మామూలుగా మర్యాదగా చూడాలి. ఈ డిమాండ్లపై ఒక మెమోరాండం జైలు అధికారులకిచ్చాము. మాలో నల్గురిని జైలు కమిటీగా మిగతావాళ్లు ఎన్నుకొన్నారు.

ఈ డిమాండ్లకన్నా ముందుకొచ్చిన డిమాండ్ మరొకటి వుంది. ఉదయమే లేచి డ్రిల్లు చేయించేవాళ్ళు . మంచిదే! కానీ ఉదయమే లేవడంతోటి కాలకృత్యాలు తీర్చుకునే అలవాటు కొందరికి ఉంటుంది కదా! అందుకుని అందరూ లేచిన తర్వాత, ఒక 30 నిమిషాలు ఆగి "డ్రిల్లు" పెట్టమని అడిగాం అధికార్లు వీల్లేదన్నారు. "అరె! ఇందులో ఏముంది మేం డ్రిల్లుకు రాము అని అనడం లేదు కదా! కాలకృత్యాలు తీర్చుకోవద్దా! ఒక అరగంట అగి డ్రిల్లుకు పిలిస్తే కొంపలేం అంటుకుంటాయి?" అని మేమే అన్నాం. కాని వారంతా తలకాయల్లేని తరహా అధికారులు. ససేమిరా అదేంకుదరదు అన్నారు. దీనిమీద నిత్యం ఘర్షణ జరుగుతుండేది.

కొంతమంది కాలకృత్యాలు తీర్చుకుని ఆలస్యంగా వచ్చేవాళ్లు! కారణం చెప్పినా వాళ్ళకేదో చిన్న శిక్ష వుంటుండేది. ఇదొకటి పెద్ద తగాదా అంశంగా మారింది.

ఇంకో విషయం. ఈ ఖైదీలలో కొందరికి బీడీలు తాగే అలవాటు వుండేది. నేను వాళ్ళ వద్దకు వెళ్ళి "ఎందుకు బీడీలు తాగుతారు. కడుపునిండేదా, కాలునిండేదా"? అని నచ్చచెప్పి, మాన్పించ యత్నించాను. నా ప్రయత్నాలు విఫలమైనాయి. వాళ్ళు నా వాదన అంగీకరించినా మానుకోలేకపోయేవారు.

ఈ "బీడీ"లు తెప్పించుకోవడం ఒక సమస్య! వార్డర్లు, వాచ్‌మన్‌లు తెచ్చిపెట్టేవాళ్ళు. కానీ ఖైదీల రేషన్ కొంత అందుకోసం వాళ్ళకి ఈ ఖైదీలు ఇచ్చేవాళ్ళు. అందులో కొంత లంచంగా కూడా! అసలే రేషన్ తక్కువ దీనికి తోడు ఈ కోత!

బీడీలు తాగటం ఎట్లాగూ మానుకోలేకపోతున్నారు గనుక వారికి దొంగచాటుగా కాకుండా, లంచమూ, రేషన్‌కోత లేకుండా బీడీలు అందించాలని అన్నది కూడా మేము రూపొందించే డిమాండ్లలో ఒకటైంది.

ఇక జైలు ఆస్పత్రి! డాక్టర్లు సక్రమంగా వచ్చేవాళ్ళు కాదు. మందులు వుండేవి కావు.

ఈ అన్ని డిమాండ్లను రూపొందించాము. మా ఖైదీల తరపున నాయకులుగా ఎన్నుకోబడిన కమిటీ మెంబర్లం నలుగురం ఒక మెమోరాండం రూపొందించి, జైలు సూపరింటెండెంట్‌కు ఇచ్చాము. మా నల్గురిని మిగతా వారి నుండి వేరు చేసి ప్రత్యేకించిన ఒక గదిలో వుంచారు. ఇలాంటి గదులు మరీ అల్లరి చేసే వాళ్ళ కోసం ఏర్పాటు చేశాం. అసలు అందరం కలసి వుండేటట్లు పెద్ద పెద్ద బ్యారక్స్ వుండేవి. ఇలాంటి ప్రత్యేక గదిలో ఉన్న మేము డ్రిల్లుకు, పొద్దున్నపూట పోసే గంజికి, తిండి సమయంలోనూ ఒక్కచోటనే వరుసగా, క్యూలో అందరితో కలసే వుండేవాళ్ళం.

ఈ మెమోరాండం ఇచ్చిన తర్వాత ఇక తిట్లు మరీ ఎక్కువైనవి. ఆ జైలు అధికారులు వుపయోగించే "పదజాలం" పరమజుగుప్సాకరంగా వుండేది. నిజానికి ఈ విషయమే నాకు మరీ దుర్భరంగా వుండేది. ఇలా అసహ్యంగా తిట్టటాన్ని వ్యతిరేకిస్తే కట్టేసి కొట్టేవాళ్ళు.

మళ్ళీ సూపరింటెండెంట్‌ను కలసి "ఈ డిమాండ్లను అంగీకరించి అసహ్యమైన తిట్లను ఆపు చేయించలేకపోతే నిరాహారదీక్ష చేస్తామని" చివరిసారిగా చెప్పివచ్చాము. వెంటనే వచ్చిన ఫలితం ఏమంటే ఆ నల్గురిని విడదీసి విడివిడి గదుల్లోకి మార్చారు. ఈ నల్గురు "రింగ్ లీడర్లు", బాగా గొడవచేసే "అల్లరి" వాళ్ళు అన్నమాట.

నేనూ, కృత్తివెంటి వెంకటేశ్వరరావు అని భీమవరం అతను, విజయవాడకు చెందిన నండూరి వెంకటేశ్వరరావు, దుర్భా కృష్ణమూర్తి – మేం నలుగురం ఆ రింగ్ లీడర్ల మన్నమాట!



సత్యాగ్రహం మొదలైంది. దాదాపు బోర్స్టల్ స్కూల్లో వున్న అందరు ఖైదీలు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. అయితే మూడో రోజుకల్లా అందరూ సత్యగ్రహ దీక్ష విరమించారు. మేము విడివిడిగా వున్నా మాకు వార్తలందుతుండేవి.

నిజానికి నీళ్ళు కూడా తాగేందుకు అనువుగా వున్నవి ఇచ్చేవారు కాదు. సత్యాగ్రహ సమయంలో అయితే మరీ తక్కువ చేశారు. ఒక్కొక్కరికి రోజుకు ఒక్క చెంబుడు నీళ్ళు మాత్రమే – అవి ఎందుకు వాడుకున్నాసరే – ఇచ్చేవారు.

జైలు అధికారులు వచ్చి మాతో అందరూ సత్యగ్రహ దీక్ష విరమించుకున్నారు. మీరు కూడా విరమించుకోండి అని చెప్పేవారు. ఆ జైల్లో మన ఆంధ్రులతో పాటు కేరళ, తమిళనాడు, గంజాం జిల్లాలకు చెందినవారు చాలామంది వుండేవారు. మద్రాసు ప్రెసిడెన్సీ మొత్తానికి అదే బోర్స్టల్ జైలు', అందరూ సత్యాగ్రహంలో పాల్గొన్నారు. అందరూ మానేశారని వార్తలు!

నిజానికి అన్నం తినకపోవడాన్ని భరించలేక నిరాహారదీక్ష విరమించలేదు. మామూలుగా నిరాహారదీక్ష చేసేవాళ్ళు మరీ నీరసపడిపోతే, అలాంటప్పుడు బలవంతాన వాళ్ళకు ఆహారం ఎక్కిస్తారు. ముక్కులోగుండా సన్నని రబ్బరుగొట్టం గొంతులో నుండి పొట్టలోనికి పోనిచ్చి దాని ద్వారా ద్రవపదార్థాలు ఎక్కిస్తారు.

కానీ మాకలా చెయ్యలేదు. మూడోనాడే ఈ బలవంతంగా ఆహారం ఎక్కించడానికి పూనుకున్నారు. అదీ ఎలా? నల్గురు జైలు వుద్యోగస్తులు వచ్చే వాళ్ళు. సత్యాగ్రహిని వెనక్కి పడేసేవాళ్ళు – ఒకడు కాళ్ళ మీద కూర్చునేవాడు. ఒకడు తల కదలకుండా పట్టుకునేవాడు. రొమ్ముల వద్ద ఒకడుండి రెండు చేతులూ గట్టిగా పట్టుకునేవాడు. నాల్గోవాడు పట్టకారులాంటి దానితో నాలిక బయటకు లాగి గొంతులో గంజిపోసేవాడు.

అయినా, గొంతు కండరాలను బిగబట్టి ఆ గంజిగొంతులో జారకుండా కొందరం ప్రతిఘటించేవారము. అలాంటి వారి గొంతులోకి ఒక సత్తుచెంచా పెట్టి, నాలిక అడుగుభాగందాకానెట్టి, అక్కడదాన్ని "స్క్రూ" తిప్పినట్లు తిప్పేవారు. ఆ బాధ భరించలేనిదిగా వుండేది.

నిజానికి నేనూ ఆ బాధను భరించలేకపోయేవాణ్ని! సత్యాగ్రహం మానేద్దామని అన్పించేది. కానీ, నేను నాయకులలో ఒకణ్ని. నేను మానేస్తే ఎలా? "పరువు" అడ్డంవచ్చింది. ఇంతలో నిరాహారదీక్ష అందరూ మానేశారు గనుక, నన్ను కూడా మానెయ్యమని వత్తిడి వచ్చింది. నేను జైలు అధికార్లతో "నాకు నమ్మకమెట్లా? అందరితోనూ యిలాగే చెప్తున్నారేమో, మానేసినవాళ్ళు వచ్చి, నన్ను కూడా మానెయ్యమంటే ఆలోచిస్తాను" అన్నాను బింకంగా!

అప్పుడు మిగతా సత్యాగ్రహులందరిచేత "తాము సత్యాగ్రహం మానేశామనీ, నన్నూ మానెయ్యమని" చెప్పించారు. దాంతో సత్యాగ్రహం విరమించుకున్నాను. నిజం చెప్పాలంటే ఇంకో రెండురోజులు ఆ విధంగా బలవంతంగా ఆహారం యిచ్చే పద్ధతి కొనసాగించినట్లయితే, యెంతవరకూ నేను నిరాహారదీక్ష కొనసాగించేవాడినన్నది అనుమానమే!

నిరాహారదీక్ష విరమణ తర్వాత కూడా రెండు నెలలవరకూ మమ్మల్ని నల్గుర్నీ మాత్రం విడిగానే వుంచారు. ఆ నిరాహారదీక్ష విరమణ జరిగిన ఒకటి రెండు రోజుల్లో – మా అమ్మ, మా అన్న కలిసి నన్ను చూద్దామని జైలుకు వచ్చారు. మా బావగారు జిల్లా జడ్జికదా! అందుకని ఇంటర్వ్యూ తేలికగానే దొరికింది.

మేము జైలు సూపరింటెండెంట్ గదిలోనే మాట్లాడుకోవాలి! సహజంగానే "ఎలా వున్నావు. సత్యాగ్రహమూ అదీ చేశావట" మా అన్న అడిగాడు. మా బావగారు కూడా ఆ సమయంలో నాగురించి వాకబు చేసేవాడట! జైలు పరిస్థితులు చెప్పాను. ఇంతలో సూపరింటెండెంట్ కలుగజేసుకొని "మీ వాడు రింగ్ లీడరు. ఈ గొడవకు కారకుడు మీ వాడే'' అని వాళ్ళతో చెప్పాడు. నేను మాత్రం జైలు దుర్భరపరిస్థితి వివరించి, "పోరాడదలుచుకున్నాము. పోరాడాము" అని చెప్పాను.

అయితే మా అమ్మ ఎంత బాధపడినా, మా అన్నకూడా చాలా దిగులు పడినా అక్కడ సూపరింటెండ్ ముందు మాత్రం బయటపడలేదు. వాళ్ళు నా కోసమని తాము తెచ్చిన మామిడిపళ్లు నాకిచ్చారు. జైలు ఉద్యోగి ఆ పళ్ళను అక్కడే తినాలని ఆదేశించాడు. "నేను ఇక్కడ తినను. నాతో ఇంకా నల్గురున్నారు. లోపలికి వెళ్ళి అందరం కలిసే తింటాము. అలా వీలు కాదంటే ఈ పళ్లు నాకక్కరలేదు. అయినా ఏ రూల్సు ప్రకారం నేను మా వాళ్ళిచ్చిన పళ్లను లోపలకు తీసుకెళ్ళకూడదో చెప్పండి?" అని మొండికేశాను. ఏమనుకున్నాడో ఏమో, పైగా వీళ్ళు జిల్లా జడ్జి తాలూకు మనుషులు అనుకున్నాడో ఏమో లోపలికి వెళ్ళి నా మిత్రులతో పాటు మామిడి పళ్లు పంచుకునే అవకాశం ఇచ్చాడు. పైగా అలా లోపలికి తీసుకువెళ్ళకూడదన్న నిబంధనలు కూడా ఏమీ లేవు.

రెండు నెలల తర్వాత మమ్మల్ని విడదీసేందుకుని తంజావూరు జైల్లో వున్న 12 మందిని తిరుచునాపల్లి జైలుకు మార్చారు.

ఈ రెండు నెలల్లోనే తంజావూరు జైల్లో జీవితం గూర్చి కొంత చెప్తాను. నాకు సంస్కృతం కొంచెం వచ్చుకదా! తెలుగు – హిందీ స్వబోధిని దగ్గర పెట్టుకుని హిందీ నేర్చుకున్నాను. ప్రముఖ హిందీ రచయితల నవలలు హిందీలోనే చదవసాగాను. పైగా హిందీ నేర్చుకోవడం అన్నది అప్పట్లో జాతీయోద్యమంలో ఒక భాగం.

ఇక్కడ యం.వి. కృష్ణస్వామి ప్రస్తుతం సి.పి.ఐ.తో వుంటున్నాడు. ఈ మధ్య యం.ఆర్. వెంకట్రామన్ చనిపోయిన సందర్భంగా మదురైలో కలిశాడు. "నేను గుర్తున్నానా" అని అడిగాడు "గుర్తున్నావని" చెప్పాను. ఆయన బాగా చదువుకున్నవాడు. అప్పుడు మాతోపాటు జైల్లో వున్నాడు. తమిళం నేర్చుకుందామని నేను ప్రయత్నించాను. ఆయన తమిళంలో ప్రావీణ్యం కోసం కృషిచేసేవాడు. తమిళంలో "తిరుక్కురల్" చదివేవాడు. ఎప్పుడూ తనకు అవసరమైన తమిళ పుస్తకాలు లభ్యం కావడం లేదని గొణుగుతూ వుండేవాడు. "హిందీ నేర్చుకోరాదా! ఇది జైలు! ఇక్కడ బోలెడంత తీరిక. ఇప్పుడు హిందీ నేర్చుకుంటే కుదురుతుంది. మళ్ళీ బయటకు వెళ్ళిన తర్వాత కుదరకపోవచ్చు' అని చెప్పేవాణ్ణి.



అలాగే మాడభూషి వెంకటాచారి అని ఒకాయన వుండేవాడు. సీతారామస్వామి అని ఇంకో ఆయన కూడా నాకు గుర్తు. తెనాలి అనుకుంటాను. నేను యం.పి.గా వున్నప్పుడు స్వతంత్ర్య సమరయోధుల పెన్షన్ సందర్భంగా కలిశాడు. అలాగే సుబ్రహ్మణ్యం అని ఇంకో అతను. వీళ్ళతో జైలో ఎక్కువగా కాలం గడిచేది. నేర్చుకోవడమో, నేర్పడమో అన్నది ప్రధాన వ్యాపకంగా వుండేది. అయితే జైల్లో నిరాహారదీక్ష తర్వాత మమ్మల్ని విడిగానే వుంచారు. తిరుచునాపల్లి జైలుకు వెళ్ళేదాకా జైల్లో మిగతా ఖైదీలతో గడిపే అవకాశం వుండేది కాదు.

జైల్లో మా చేత పని చేయించాలన్నది అసలు పద్ధతి. మిగతా ఖైదీలతో కొందరు "మనం సత్యాగ్రహులం కనుక ఈ జైల్లో పని ఎందుకు చెయ్యాలి" అనే వాళ్ళు. నేను మాత్రం "అందులో యేముంది? మనం ఏమి చెయ్యకుండా వుండటం దేనికి" అని సమాధానపరిచే వాడిని. అప్పటికి కొంచెం శరీరకష్టం చేసే అలవాటు నాకు వున్నది. సెలవులకు మావూరు వెళ్ళినప్పుడు మా చేలోపనికి యితర కూలీలతో కలిసి వెళ్తుండేవాణ్ణి. పార, పలుగు వీటితో పనిచేయడం నాకు కొత్త కాదు. గుంటలు తవ్వడం, మట్టి ఎత్తి పొయ్యడం మామూలుగానే చేయగలిగేవాణ్ణి.

మిగతావాళ్ళు పనిచేయకపోయినా "ఏం ఫర్వాలేదు మీరలా కూర్చోండి మీ పనికూడా నేనే చేసేస్తాను" అనేవాణ్ణి. నిజానికి ఆ జైల్లో పెద్ద పనేమీ ఉండేది కాదు. ఎవ్వరికీ చెయ్యాలనీ ఉండేది కాదు. వీళ్ళు చేశారా లేదా అని పట్టించుకునే వాడుండేవాడు కాదు. వాళ్ళు తిట్టే తిట్లన్నీ భరిస్తే చాలు. ఎదురు తిరిగితే తిప్పలు అంతే!

బోర్‌స్టల్ స్కూలు చిన్న పిల్లలైన నేరస్థులకు విద్యగరిపి, సంస్కరించేందుకై నిజానికి ఏర్పాటు చేయబడింది. కానీ చదువు ఏమీ వుండేది కాదు. అమానుషంగా ప్రవర్తించటం, ఉచ్చరించరాని తిట్లు తిట్టుకోవడం మాత్రం నేర్చుకోవచ్చునన్నంత అసభ్యంగా వుండేది. ఎక్కడ చూసినా అవినీతి. జైలు అధికారులు, వార్డన్లు అంతా లంచగొండులు. ఇంక జైలు ఆస్పత్రి వుండేది. మామూలుగానే డాక్టర్లు రోగుల పట్ల తగిన శ్రద్ధ చూపించరు. ఇక జైల్లో ఖైదీలపట్ల వారి నిర్లక్ష్యం చెప్పనే అక్కర్లేదు.

తిరుచునాపల్లి జైలులో పరిస్థితి కాస్తమెరుగ్గా వుండేది. అక్కడ సాధారణంగా కాంగ్రెస్ వాళ్ళు వుండేవాళ్ళు. మేము ఆ జైలుకు వెళ్ళేసరికి వారిలో ముఖ్యులును వెల్లూరు జైలుకు మార్చారు. తిరుచునాపల్లి జైల్లో ఆహారం కొంతవరకు ఫర్వాలేదు. అటు యిటు జైల్లో తిరిగే స్వేచ్ఛ కూడా యెక్కువగానే వుండేది. చాలా ఎక్కువమంది ఖైదీలుండేవారు గనుక, అదీ ప్రధానంగా సత్యాగ్రహులు, కాంగ్రెస్ కార్యకర్తలు అవటం వల్ల జైల్లో ఖైదీలను చూసే విషయం తమ అదుపులో వుంచుకోగలిగేవారు. అక్కడ మా వంట వ్యవహారం మేమే అజమాయిషీ చేసుకునే అవకాశం వుండేది. తంజావూరు బోర్‌స్టల్ జైల్లో కూడా మా నిరాహార దీక్ష తర్వాత కొంత అజమాయిషీ మాకు యిచ్చారనుకోండి. ఏమైనా తిరుచునాపల్లి జైల్లో మేం రెండు నెలలు వున్నాం.

ఇంతలో ఏం జరిగిందంటే, ఈ బోర్టల్స్ జైల్లో వున్న పిల్లల తరపున వాళ్ళ తల్లిదండ్రులలో ఒకరు దావావేశారు. ఏమిని? వీళ్ళు నేరస్తులుకాదు. నేరస్తులైన పిల్లలను సంస్కరించేందుకే బోర్టసల్ స్కూలు. కనుక వీళ్ళను బోర్టల్స్ స్కూల్లో వుంచేందుకు వీలులేదు అని. అంతకుముందే హైక్టోరులో యింకో కేసు పెండింగ్‌లో వుంది. అదేమంటే, వీళ్ళు పిల్లలు కనుక, వీళ్ళను యితర ఖైదీలతో కలిపి సెంట్రల్ జైల్లో వుంచకూడదు అని. ఈ రెండోకేసు తీర్పు మొదటగా వచ్చింది. అందువల్ల మమ్మల్ని మళ్ళీ తంజావూరు బోర్టసల్ జైలుకు తరలించారు.

తంజావూరు బోర్టసల్ జైల్లో పరిస్థితి మమ్మల్ని తిరుచునాపల్లి మార్చిన తర్వాత మళ్ళీ మొదటికొచ్చింది. మళ్ళీ మేము పోరాడాల్సి వచ్చింది. ‘మీరు వచ్చారు మళ్ళీ అల్లరి మొదలయిందా?” అని జైలు అధికార్లు మొండికేశారు. “మాకేం తోచక అల్లరి చేస్తున్నామా? అప్పుడు నిరాహారదీక్ష చేసిన సందర్భంలో యిచ్చిన సదుపాయాలు రద్దు చేసి, మళ్ళీ మీరే “అల్లరి” ఆరంభించారు” అని మేము అన్నాము. అధికారులు వినలేదు.

మళ్ళీ నిరాహారదీక్ష మొదలెట్టాము. ఈ సారి బలవంతంగా క్రిందపడేసి, పట్టకారుతో నాలుకబయటకు లాగి, గొంతులో  చెంచాపెట్టి తిప్పి – ఇలా బలవంతంగా ఆహారం ఇచ్చేపనికి జైలు అధికార్లు పూనుకోలేదు. నిరాహారదీక్ష వారం రోజులు సాగింది.

ఇంతలో యింకో తమాషా జరిగింది. కోర్టులో యింకో కేసు పెండింగ్‌లో వుంది కదా. మేము పిల్లలమైనా సత్యాగ్రహులంగానీ నేరస్తులం కాదు గనుక. బోర్టసల్ జైలు నేరస్తులకే గనుక, మమ్మల్ని అక్కడ ఉంచరాదని హైకోర్టు అనుకూలంగా తీర్పునిచ్చింది.

కనుక మమ్మల్ని బోర్టసల్ జైల్లో పెట్టేందుకూ వీలులేదు. తిరుచునాపల్లి జైలుకు పంపేందుకూ వీలులేదు. మరి మమ్మల్ని ఎక్కడకు పంపాలి అన్నది ప్రభుత్వానికి ఒక తలనొప్పిగా తయారయింది.

ఇది వదిలించుకునేందుకని, తెలుగు బాలురందర్నీ బాగా గొడవచేసే వాళ్ళుగా పేరు పెట్టి గ్రూపులు గ్రూపులుగా రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపారు.

నెల్లూరు నుండి వచ్చిన పిల్లలున్నారు. వాళ్ళు పశ్చిమగోదావరి జిల్లాలో నాతోపాటు సత్యాగ్రహంలో పాల్గొన్నవారు కాదు. వాళ్ళు విడుదలైనారు. వాళ్ళు అలగానిపాడు మాయింటికి వెళ్ళి మా అమ్మతోనూ, అన్నతోనూ, “అక్కడ మీ వాడు చాలా బాధలనుభవిస్తున్నాడు. అవి భరించలేకుండా వున్నాడు. కనుక తనని విడుదల చేయమని ఒక పిటీషను కోర్టులో వేయమన్నాడని” నా గురించి వాళ్ళతో చెప్పారు. అది నిజమేననుకొని మా అన్న “తనకు బాగా జబ్బు చేసిందని, ఒక అబద్ధం సృష్టించి, నన్ను విడుదల చెయ్యాలని” కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. అసలు నన్ను కనుక్కోవడంగానీ ఈ కేసు వేసే విషయంలో నా అనుమతి తీసుకోవడంగానీ ఏమీ లేదు. అప్పటి మద్రాసులో ప్రఖ్యాత లాయర్ యతిరాజుల నాయుడుగార్ని నియమించారు.



అప్పట్లో నాకేసు కోసం మా అన్నయ్య సుమారు మూడువేలు ఖర్చు చేశాడు. అయితే “ఎందుకిలా చేశారు” అని మా అన్న మీద కోప్పడాను. సత్యాగ్రహులు ఎంత శిక్ష వేసినా భరించాలన్నది ఆనాటి సూత్రం. తద్భిన్నంగా నన్ను విడుదల చేయాలని నా తరపున కోర్టుకు వెళ్లటం నిజంగానే నాకు కోపాన్ని తెప్పించింది. పైపైచ్చు నేను మైనర్ అవడం వల్ల సంరక్షకుడు నా తరపున, నా అనుమతి లేకుండా దావా వెయ్యవచ్చు.

“ఫలానా వాళ్ళు వచ్చి నువ్వు చాలా బాధలు పడుతున్నావని, భరించలేక  విడుదలకై దావా వెయ్యమన్నావని చెప్పారు. అందువల్ల కోర్టుకు వెళ్ళాము” అని మా అన్న చెప్పాడు. “నన్ను కనుక్కోనక్కర్లేదా వాళ్ళ మాటలోని నిజానిజాలు?” అని విసుక్కున్నాను. ఆయనేం మాట్లాడలేదు.

సరే, వాళ్ళు నా మీద ప్రేమ కొద్దీ, మళ్ళా నన్ను కనుక్కొనేదాకా వేచి ఉండలేరులే అని సరిపెట్టుకున్నాను. అయినా ధరలు బాగా తగ్గి ఉన్న ఆ రోజుల్లో మూడు వేలు ఖర్చు చెయ్యటం మాత్రం చాలా వృధాగా, దండగ మారిగా అన్పించింది.

కోర్టులో విడుదలకు అనుకూలంగా గాకుండా, నేనన్నింటికి మౌనమే వహించాను. జడ్జి మాత్రం ఏం చేస్తాడు. “అతడు నోరు విప్పడం లేదు. మాతో సహకరించలేదు. చేయగలిగింది లేదు. కేసు కొట్టి వేస్తున్నాను” అని జడ్జి తీర్పు చెప్పాడు.

మళ్ళీ రాజమండ్రి సెంట్రల్ జైలుకు తీసుకువచ్చారు. అక్కడ గతంలో వున్న సోదర సమితి సభ్యులందర్ని కూడదీశాను. వాళ్ళు, ఇంకా ఇతర యువకులు ఆ జైల్లో వున్నారు. అక్కడే నేను “ఉర్దూ” నేర్చుకోవడం ఆరంభించాను. కొద్ది నెలల్లో ఉర్దూ చదవడం వచ్చింది. ప్రేమ్‌చంద్ నవలలు ఉర్దూలోనే చదవగలిగేవాణ్ణి.

అయితే ఇప్పుడు చాలా వరకు మర్చిపోయాను. ఇక్కడొక మాట అక్కడొకమాట తప్ప ప్రస్తుతం ఏమి మిగలలేదు. నిత్యం సాధన లేకుండా ఏం మిగులుతుంది? చిన్న తనాన, మాతృభాషకాక మరో భాష – ఇంగ్లీషు ప్రవేశపెట్టి వుపయోగం ఏమి? అందుకే నా అభిప్రాయంలో, తర్వాత కాలంలో నిత్య వాడుకలో లేని ఏ భాష అయినా – మాతృభాష తప్ప – నిరర్థకం. ఏదో పరీక్షల కోసం ముక్కున పెట్టుకుని చదివినా తర్వాత నిలవదు. నా జీవితంలా, ఆ భాష తప్పనిసరిగా అవసరమయితేనో, ఏదన్నా ప్రత్యేకించి నైపుణ్యం సంపాదించాలనుకుంటే ఆ నైపుణ్యం కూడా అన్యభాషలో తప్ప లభ్యం కాకుంటేనో ఆ భాష నేర్చుకోవాలి. కేవలం తన మేధో పరిధిని పెంచుకునేందుకు అవసరం అనుకున్న వాళ్ళు చదువుకోవచ్చు.

పైగా ఆ తర్వాత జీవితంలో హిందీ ప్రాంతంలో వుంటే హిందీ, తమిళ ప్రాంతంలో వుంటే తమిళం నేర్చుకోవలసి వుంటుంది. ఒక ప్రపంచ విజ్ఞానాన్ని తెలుసుకోవాలనుకుంటే అప్పుడు ఇంగ్లీషో, రష్యనో, మరేదైనా నేర్చుకోవచ్చు. మనదేశంలో ఇంగ్లీషు నేర్చుకునే అవకాశం వుంది.

మాతృభాషలో చెప్తే బాగా అర్థం అవుతుంది. మళ్ళీ వివరించటమూ సులభము. సాహిత్యమూ, దానిలోని లోతుపాతులు, అందాలు, మాతృభాషలో ఆస్వాదించినట్లు మరో భాషలో ఆస్వాదించలేము. కనుక హిందీగానీ, మాతృభాష కాని మరే ఇతర భాషనైనా తప్పనిసరిగా నేర్చుకోవలసిన పాఠ్యాంశంగా వుండటానికి నేటికీ నేను వ్యతిరేకం.

నా వరకూ నాకు హిందీ వచ్చు. ఇప్పటికి కూడా హిందీలో మాట్లాడి నా భావాలను సరిగా వ్యక్తీకరించలేను. ఎవరైనా మాట్లాడుకుంటుంటే అర్థం చేసుకోగలను. హిందీ ప్రాంతాలలో ఉద్యమ వ్యాప్తికై కృషి చేసే సందర్భంలో ఈ మాత్రం హిందీ "జ్ఞానం" నాకు బాగా ఉపయోగపడింది.

ఉర్దూ కూడా అప్పట్లో వచ్చేదే: చెప్పానుగా చాలా భాగం మరచిపోయానని, అయితే ఒకటి చెప్పాలి : ఉర్దూభాష మరింతగా నేర్చుకునేందుకై నేను ప్రధానంగా ఉర్దూ నవలలు చదివాను. మూలంలో వాటిని చదవటం నాకెంతో ఉపయోగించింది.

ఇక తమిళం విషయం, నిజానికి నేను తమిళ ప్రాంతాలలో 6 సంవత్సరాలు వున్నాను. కొంతవరకూ మాట్లాడేందుకు అనువైన తమిళం వచ్చేది. నేను మద్రాసు హైస్కూల్లోను, కాలేజీలోనూ చదివే రోజుల్లో తమిళం నేర్చుకునేందుకై ప్రత్యేకించి శ్రద్ధ చూపలేదు. అలా చేయినందుకు తర్వాత పశ్చాత్తాప పడ్డాను. అలా నేర్చుకుని వున్నట్లయితే ఎంతో ఉపయుక్తంగా వుండేది. ఆ తర్వాత తమిళనాడులో పార్టీ పనిచేసే సందర్భంగానూ, జైల్లోనూ నేను తమిళం నేర్చుకునేందుకు కృషి చేశాను. ముఖ్యంగా 1940 ఆ ప్రాంతంలో తమిళనాడులో నేను రహస్య జీవితం గడుపుతున్న రోజుల్లో కొంత శ్రమపడ్డాను. ఫలితంగా తమిళనాడులో మామూలుగా పుస్తకాలు చదవగల స్థితి వచ్చింది. అయితే ఆ తర్వాత అవసరం పడక సాధనపోయింది. ఇప్పుడు సైన్ బోర్డులూ, పెద్ద పెద్ద ప్రకటనలూ మాత్రం చదవగలను. అలాగే తమిళంలో మాట్లాడుతుంటే స్థూలంగా అర్థం చేసుకోగలను.

తిరుచినాపల్లి జైలో ఏమీ గొడవ చెయ్యవలసిన అవసరం లేదు. తంజావూరులో బోర్ట్సల్ జైల్లో రెండుసార్లు సత్యాగ్రహ పోరాటం నడిపాము. అందువల్ల యంగ్ లీడర్లంటూ మమ్మల్ని కొందరిని వేరు చేసి వుంచారు. ఇక రాజమండ్రి జైల్లో కూడా మమ్మల్ని ప్రత్యేకంగా అట్టిపెట్టారు. మేము రాకముందు అది స్త్రీలకై కేటాయించబడిన ఒక జైలు వార్డు. మేము వస్తున్నామని ఖాళీ చేసి మాకిచ్చారు.

ఇక్కడ జైల్లో మా చేత పనిచేయించాలి. అందుకని "కంబళి" నేసేందుకై పంపేవారు. నిజానికి కంబళి నేయడం అదీ ఏమిలేదు. అక్కడ మాతోపాటు ఇతర నేరస్తులు కూడా ఉండేవారు. వాళ్ళు మాత్రం పనిచేస్తుండేవాళ్ళు. మాకు ఆ పనిలేదు. అక్కడకు వెళ్ళడం, ఏవో కబుర్లతో కాలక్షేపం చేస్తూ వుండేవాళ్ళం.

వాళ్ళలో కొందరికి వారు వచ్చిన ప్రాంతాన్ని బట్టి "రాగి" "చోళమ్" ఆహార ధాన్యాలుగా యిచ్చేవారు. మాకు – సత్యాగ్రహులకు మాత్రం వరి అన్నమే పెట్టేవాళ్ళు. వాళ్ళ తిండి మరీ



దారుణంగా ఉండేది. వాళ్ళ అన్నం నిండా యిసుక, వుడికి వుడకని అన్నం, పప్పు బద్దలు బద్దలుగా వుడక్కుండానే వుండేది.

మాకు మొదట్లో అలాగే యిచ్చారు గానీ చాలా మందిమి వుండటం వల్ల మేము నిరసన తెలియజేసిన పిదప, కొంచెం మెరుగ్గా వండిపెట్టేవాళ్ళు. అందుకని నేను వాళ్ళతో అనేవాణ్ని "మా అన్నం కొంచెం మీరు తీసుకుని, మీ రాగి లేదా చోళమ్ మాకు పెట్టండి" అని, అలా ఎందుకు చేయడం అని కొంతమంది అడిగేవారు. "వాళ్ళు కాస్తో కూస్తో కష్టపడి పనిచేస్తున్నారు. మనం తిని వూరికే కూర్చుంటున్నాము. అలాంటప్పుడు కాస్త శుభ్రమైన అన్నం వాళ్ళకి పెడితే ఏం పోయింది?" అని సమాధానపర్చేవాణ్ణి.

పైగా నాకొక లక్షణం వుంది. ఎలాంటి తిండి అయినా, ఎలా వండినా తినగలిగేవాణ్ణి. కడుపు నిండితే చాలు, "చోళం, రాగి మనం కూడా రుచి చూస్తే మంచిది గదా" అని ఇలా మామూలు నేరస్తులతో ఆహారం మార్పిడికి ప్రోత్సహించేవాణ్ణి.

రాజమండ్రి జైల్లోకి దాదాపు బోర్ట్సల్ జైల్లో వున్న తెలుగు వాళ్ళందర్ని మార్చారు. వివిధ జిల్లాల తెలుగు వాళ్ళతో పరిచయాలేర్పడ్డాయి. తరచుగా చర్చలు జరుగుతుండేవి. పుస్తక పఠనం ఒక అంశం. ఇలా ఒకరి అభిప్రాయాలు మరొకరు తెలుసుకునేందుకు తద్వారా అభిప్రాయాలు మార్చుకునేందుకు అవకాశం ఉండేది.

నేను వ్యాయామం చేయించేవాణ్ణి, యోగాభ్యాసన ఉపాధ్యాయుడిగా సరే సరి, అయితే, వీళ్ళ మధ్య చిల్లర తగాదాలు, కోపతాపాలు రాకుండా చూసేవాడిగా నాకు బాగానే పని వుండేది. కొందరు జైల్లో కాలం వృధా చేసేవారు. పేకాట ఆడటం మామూలుగా సాగేది. ఇంతకన్నా ఎక్కువ ఇబ్బందికి గురి చేసిన అంశం ఇక్కడ బీడీల వ్యవహారమే.

జైల్లో పొగత్రాగడం అప్పుడు నిషిద్ధం. మళ్ళీ తంజావూరు తంతే అయింది. బీడీల వల్ల నష్టమేగాని లాభం లేదని ఎంత జెప్పినా విన్నప్పుడు ఊ కొట్టేవారు. తర్వాత పాపం అలవాటు మానుకోలేకపోయారు. వాళ్ళ రేషన్‌లో కొంత తీసుకుని జైలు వార్డర్లు బీడీలు సప్లయి చేసేవాళ్ళు. నిజానికి బీడీలు దొరకక కొందరు ఏదో పోగొట్టుకున్నట్లు చాలా బాధపడేవారు.

దొంగచాటుగా ఎవరన్నా బీడీలు తాగుతుంటే, వార్డర్ల మెప్పుకోసం కొందరు వారితో చెప్పేవారు. వార్డర్లు ఒక్కోసారి అలాంటివారిపై చేయి చేసుకునేవారు. "మా స్వంత వ్యవహారాలలో జోక్యం చేసుకోవద్దని" నేను వార్డర్లను హెచ్చరించేవాణ్ణి. అయితే కొన్ని సందర్భాలలో వార్డర్లు కూడా చూసి చూడనట్లు వూరుకునేవారు. "ఈ బీడీలు తాగటం సర్వ సామాన్యమైనప్పుడు, బీడీలు తాగరాదన్న యీ నిషిద్ధం ఏమిటి? అందుకోసం దొంగచాటుగా వాళ్ళు తమ రేషన్ ఇవ్వనక్కరలేకుండా బీడీలు కాల్చుకోనివ్వవచ్చు కదా" అని వాదించేవాణ్ణి.

తిరుచినాపల్లి జైల్లో కొందరు పరిచయమయ్యారు. అందులో నా పరిచయస్తులు కొందరు కూడా అప్పటికి ఇక్కడకు జేరారు. అలా వచ్చినవారిలో, బెజవాడ నుండి ఇంటూరు వెంకటేశ్వరరావు ఒకరున్నట్లు గుర్తు. ఆయన ఇప్పుడు సినిమా రంగంలో వున్నారనుకుంటాను.

కాంగ్రెస్ కార్యకర్తలు వుండేవారు. వారిలో కొందరు జైల్లో పరిస్థితులపై పోరాటంలో రాటుదేలారు. మొత్తంగా చెప్పాలంటే క్రమశిక్షణాయుతంగానే వుండేవాళ్ళు. అలాగే అందరూ కలిసి మెలిసి వుండేవారు. అయినా మాకొక ప్రత్యేక స్థానం వుండేది. మేము తంజావూరులో బోర్ధల్ జైల్లో తిరుగుబాటు చేసినవారుగా మాకొక గౌరవం ఉండేది.

వార్డర్లు కూడా మా పట్ల జాగ్రత్తగా మెలిగేవాళ్ళు, వీలైనంతవరకూ మా జోలికి వచ్చేవారు కారు. తంజావూరు తిరుగుబాటుకన్నా, బయట సాగుతున్న ఉద్యమ ప్రభావం కూడా వారిపై ఉండేది. నాకు సంబంధించినంతవరకూ ఈ జైలు జీవితం ఏమీ దుర్భరంగా ఉండేది కాదు. కాకుంటే మేము చదవాలనుకున్న పుస్తకాలు లభ్యంకాకపోవడం, అలాగే దినపత్రికలు తెప్పించుకునే అవకాశం లేకపోవడం, ఇవి మట్టుకు ఇబ్బందికరంగా ఉండేవి. జైల్లో లంచగొండితనం పట్ల తీవ్రమైన జుగుప్స కలిగేది. సాధ్యమైనంతవరకూ ఏవో రాజకీయ చర్చలతోనూ, వ్యాయామం, ఆటలు, వాటితో కాలం గడిపేవాణ్ణి.

అయితే ఈ జైలు నాల్గు గోడల మధ్య నుండి ఎప్పుడు బయటపడదామా అని చాలామంది ఖైదీలు తమ శిక్ష నెలల్లో, వారాల్లో, రోజుల్లో లెక్కవేసుకునేవారు.అది వారికి సహజమే. తమ జైలు జీవితంలో ఎంత రెమిషన్ ఇచ్చారు అన్నది వారి ప్రధాన గుణింతం.

వారానికొకసారి మమ్మల్ని జైలు నుండి నగరంలోకి తీసుకువెళ్ళేవారు. నేను మటుకు వెళ్ళేవాణ్ణి కాదు. ఈ మాసిన జైలు దుస్తులో బయటకు వెళ్ళటం దేనికి? అయినా ఏం చూస్తామని? వాళ్ళెక్కడకు తీసుకువెళ్తే అక్కడికే కదా: స్వేచ్ఛా:పాదా: కనుక నాకు ఇష్టం వుండేది కాదు.

ఇక్కడ ఈ జైల్లో కామ్రేడ్ శివవర్మను కలుసుకున్నాను. అప్పుడు ఆ జైల్లో కామ్రేడ్ శివవర్మ, విజయకుమార్ సిన్హా యింకో యిద్దరు వుండేవారు. అందులో వారిద్దరూ భగత్‌సింగ్ అనుచరులు.

విజయకుమార్ సిన్హా ప్రస్తుతం హైద్రాబాద్‌లో స్థిరపడ్డారు. ఆయన ముదునూరు గ్రామవాసి. కాంగ్రెస్ వాది అయిన శ్రీ అంజయ్య కుమార్తె "రాజ్యం"ను వివాహం చేసుకున్నారు. రాజ్యం సిన్హా సమాచార శాఖలో డైరక్టరుగా వుండేది. ఇటీవల ఆమె రిటైరైంది.

ఇంతకీ చెప్పొచ్చేదేమంటే అంజయ్య గట్టి కాంగ్రెస్ వాది. ఆయన వామపక్షవాది. కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం లాంటిదేమీ లేకపోయినా, మా కందరికీ కంటే కమ్యూనిస్టు వుద్యమానికి చాలా సన్నిహితంగా వుండేవాడు. 1940, ఆ తర్వాత కాలంలోనూ ఎంతగానో సహకరించాడు. ఆ విషయం తర్వాత చెప్తాను.



ఆయన జాతీయ విప్లవకారుల త్యాగంతో ఆకర్షితుడైనాడు. విజయకుమార్ సిన్హా జైలునుండి విడుదలైన తర్వాత ఆయన్ను తమ ఇంటికి ఆహ్వానించి ఆశ్రయం ఇచ్చాడు. తన కూతురునిచ్చి వివాహం చేశాడు.

పోగా కామ్రేడ్ శివవర్మ మాతో ఎంతో చర్చలు జరిపేవాడు. తమ సాహసకృత్యాలు, తమ విజయాలు, తమ పొరపాట్లు అన్నీ చెప్పేవాడు. అలాగే తాము చేసిన కొన్ని తప్పులు, తమ నిర్లక్ష్యమూ తమ వుద్యమానికి నష్టం కలిగించిన అనుభవాలన్నీ ఆయన వివరించేవాడు. జైగోపాల్ లాంటివారు చిత్రహింసలకు తాళలేక ఎలా అప్రూవర్లుగా తయారయిందీ, తాము ఎలా అరెస్టయింది – ఇవన్నీ చెప్పేవాడు.

నేను ప్రతి విషయం మీద చాలా సూక్ష్మాంశం వరకూ వెళ్తాననీ నిజానికి వుద్యమ నాయకుడిగా అంత చిన్న చిన్న అంశాలను పట్టించుకోనవసరం లేదనీ ఒక భావం వుంది. నేను చెప్తున్నదాన్ని బట్టి కామ్రేడ్ శివవర్మ ప్రభావం నా మీద వుందో లేదో నేను ఖచ్చితంగా చెప్పలేను. అయినా వివరాలన్నింటిలోకి వెళ్ళకుండా ఏ వుద్యమాన్నైనా ఎలా నిర్వహించగలం? బహుశా కామ్రేడ్ శివవర్మ చెప్పిన కొన్ని అనుభవాల ముద్ర నాపై వుండి వుంటుంది. ఉదాహరణకు ఆయనొక సంఘటన చెప్పాడు. చాలా ప్రదేశాల్లో క్రింద వేసుకొని పడుకునేందుకు ఏమీ వుండేది కాదు. అందుకోసం వార్తాపత్రికలు కొని వాడేవాళ్ళు. ఒకసారి కామ్రేడ్ శివవర్మ వాళ్ళు ఎక్కడో కలుసుకోవాలని నిర్ణయించుకున్నారట. తీరా కామ్రేడ్ శివవర్మ అక్కడకు జేరే సరికి ఆ ప్రదేశం పోలీసుల అధీనంలో వుంది. వాళ్ళు అంతకుముందే దాడి చేశారన్నమాట. ఆ విషయం ఆ రోజు పత్రికలలో కూడా వచ్చిందట. ఆ రోజు పత్రిక కొని చదివి వున్నట్లయితే ఆ ప్రాంతం అంతా పోలీస్‌దాడికి గురయిందని తెలిసి వుండేది. కామ్రేడ్ శివవర్మ వెళ్ళి వుండేవాడు కాదు. అలా చదవకుండా వెళ్తే అరెస్టవటమే జరిగింది.

అందుకనే రహస్య జీవితం గడిపేటప్పుడు ప్రతి విషయంలోనూ చాలా ఖచ్చితమైన సమాచారంతో వుండాలి. ఇంకో విషయం. నేను అప్పుడు కామ్రేడ్ శివవర్మ నడిగాను. "మిమ్మల్ని పోలీసులు గమనిస్తున్నట్లే మీరు కూడా మీ గుఢాచారులను నియమించుకోలేదా?" అని "అది చాలా అవసరం. రహస్య జీవితంలో ఎక్కడ దాగున్నా – ఆ ఇంటిదగ్గర మన మనిషి ఒకరు అందర్నీ, అన్నీ గమనిస్తూ వుండాలి. కొత్తవాళ్ళు ఎవరన్నా ఆ పరిసరాల్లో తిరుగుతుంటే అనుమానించాలి. ఆ వర్తమానం మనకు అందించాలి. ఒకవేళ మన స్థావరం పోలీసులకు తెలిసిపోతే తర్వాత ఆ స్థావరానికి మనవాళ్ళెవరూ రాకుండా వుండేందుకు ఒక ప్రత్యేక సంకేతాన్ని ఏర్పాటు చేసుకోవాలి. లేకపోతే అనవసరంగా మిగతావాళ్ళు దొరికిపోతారు" అని శివవర్మ చెప్పారు. సరే కొన్ని అనుభవంలో తెలుస్తాయనుకోండి.

అప్పటికి కామ్రేడ్ శివవర్మ, ఇంకా ఆనాడు కొందరు జాతీయ విప్లవకారులు తాము చేపట్టిన వ్యక్తిగత హింసా విధానం నుండి పూర్తిగా బయటపడలేదు. అయితే భగత్‌సింగ్ మొదలు లాహోరు జైల్లో వున్న ఖైదీలలో చాలామంది వరకూ "సోషలిజం" వైపుగా

రూపుదిద్దుకుంటున్నారుగానీ, పూర్తిగా వ్యక్తిగత చర్యలను వొదలిపెట్టలేదు. తమ చర్యలు కొనసాగిస్తూనే సోషలిజం భావాలను వ్యాప్తి చేసేందుకై కృషి చెయ్యాలని వారు భావిస్తుండేవారు.

రాజమండ్రి జైలుకు రాకముందు కామ్రేడ్ శివవర్మ తదితరులు జైళ్ళల్లో నిర్బంధింపబడినారు. ఆ తర్వాత వారిని "అండమాన్" ప్రవాస జైలుకు పంపారు. కామ్రేడ్ శివవర్మ మాతో చెప్పినదాన్ని బట్టి సోవియట్ రష్యాలో వున్న ఉత్పత్తి సంబంధాలు కావాలి. అయితే అది సాధించే మార్గం ఇంకా వారికి గందరగోళంగానే వుందని అర్థం అయింది.

కామ్రేడ్ శివవర్మ లాంటివారు కొందరు సేలం జైల్లో, కొందరు కన్ననూర్ జైల్లో వుండేవారు. నాకు గుర్తున్నంతవరకూ ఆయన నన్ను "తర్వాత ఏ విధంగా పనిచేయబోతున్నావ"ని ప్రశ్నించినట్లు లేదు. తమ అనుభవాలు, అభిప్రాయాలు చెప్పేవాడు. అంతే: ఏ విధంగా తాము ఒక పథకం తయారు చేసిందీ, ప్రజల దృష్టి స్వాతంత్ర్య పోరాటం వైపు మళ్ళించేందుకు పార్లమెంటు భవనంపై బాంబు వేయాలని ఎలా నిర్ణయించుకున్నదీ, భగత్‌సింగ్ ధైర్యసాహసాలు, ఒకరి తర్వాత ఒకరుగా తాము ఎలా పట్టుపడిందీ, అందులో వ్యక్తులుగా తమ అశ్రద్ధ ఎంతవరకూ కారణం – ఇవన్నీ చెప్పేవాడు.

అలాగే జైల్లో తాము నడిపిన పోరాటాలు అవీ కూడా విశదీకరించేవాడు. జైల్లో జతీన్‌దాస్ మరణం ఆ రోజుల్లో పెద్ద సంఘటన. అది జైలు బయట కూడా తీవ్ర సంచలనాన్ని కలిగించింది.

అయితే అప్పటికే గాంధీగారు స్వాతంత్ర్య సిద్ధికోసం అనుసరిస్తున్న పోరాట మార్గం గూర్చి నాలో అవిశ్వాసం స్థిరపడింది. కానీ, ఈ జాతీయ విప్లవకారుల వ్యక్తిగత చర్యలపట్ల కూడా నాకు ఏ మాత్రం నమ్మకం కుదరలేదు. అప్పటికే వారి జీవిత చరిత్రలు చాలా చదివి వున్నాను. వాళ్ళ మార్గం పట్ల నమ్మకం లేకపోయినా, వ్యక్తులుగా వాళ్ళ పట్ల తగని గౌరవం వుండేది. కామ్రేడ్ శివవర్మ వాళ్ళను గూర్చి చెప్పిన తర్వాత కూడా నాకీ విధానం పట్ల ఏమీ నమ్మకం కుదరలేదు. అయినా వారి తెగువ, దీక్ష, సాహసం, త్యాగనిరతి, కడుపు కట్టుకుని కూడా దేశం కోసం వారి పోరాటం – ఇవన్నీ వారి పట్ల నాలో గౌరవాభిమానాల్ని ఇనుమడింపచేశాయి.

అందుకే, వారిని ఉగ్రవాదులు అనేందుకు నాకు మనస్కరించదు. వారిని జాతీయ వ్యక్తిగత విప్లవకారులు అనటం సమంజసమే. గౌరవప్రదమైన ఒక పదం వాడాలి.

ఇంతలో గాంధీ – ఇర్విన్ ఒడంబడిక కుదిరింది. జైల్లో ఉన్న వాళ్ళని విడుదల చేస్తారని అందరూ అనుకుంటున్నారు. దొరయ్య వచ్చి మనల్ని విడుదల చేస్తారట అన్నాడు. "ఏం పోయింది విడుదల కాకపోతే: ఎలాగూ రెండు సంవత్సరాలు ఉండేందుకై వున్నాము కదా : అని నేననేవాణ్ణి. దళాలు దళాలుగా విడుదల మొదలెట్టారు. తెలుగు ఉగాది రోజున మమ్మల్ని కూడా విడిచిపెట్టారు. బోర్‌స్టల్ ఖైదీలను విడుదల చేసిన దళాల్లో ఆఖరిది మాది.



అందరికి వాళ్ళ వాళ్ళ వూళ్ళకు రైలు టికెట్టు జైలు అధికారులు కొని ఇచ్చారు. నేను నెల్లూరుకు తీసుకున్నాను. జైలు నుండి విడుదలై కొందరు రావడం మా అమ్మ వింటూనే వున్నది. నేను రాకపోవడం ఆమెకు బాధగా వున్నది. అయితే నెల్లూరులో దిగి నేను సరాసరి మావూరు అలగానిపాడు వెళ్ళాను. మా అమ్మ, అక్కలు వరండాలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. నన్ను చూడగానే ఆనందం పట్టలేక మా అమ్మ స్పృహ తప్పిపోయింది. చన్నీళ్ళు అవీ తెప్పించి ముఖం మీద చల్లిన తర్వాత లేచి కూర్చుంది.

ఇది జైలుకు సంబంధించినంత వరకూ విశేషం. అయితే, ఇక ముఖ్యమైన విషయం ఒకటుంది. తంజావూరు జైల్లో, తిరుచినాపల్లి జైల్లో, రాజమండ్రి జైల్లో చాలా మందితో నాకు పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత ఆంధ్రదేశంలో కమ్యూనిస్టు వుద్యమానికి నిర్మించే రోజుల్లో ఈ పరిచయాలన్నీ నాకు ఎంతగానో తోడ్పడ్డాయి. కొంతమంది పార్టీ నిర్మాణంలో ఇమిడారు.

నేను 1931 మార్చిలో తెలుగు ఉగాదినాడు విడుదలైనాను. కరాచీ కాంగ్రెస్ జరగనున్నది. దానికి ముందే మార్చి 23న భగత్‌సింగ్‌ను ఉరితీశారు. ఉద్యమాన్ని గాంధీజి నిల్పివేశారు. నాకు అలా నిలపటం నచ్చలేదు. పైగా భగత్‌సింగ్‌ను ఉరితీయడం కూడా బ్రిటిష్ ప్రభుత్వం అనుకుంటే యిలా ఉద్యమాన్ని నిల్పివేయడమేమిటి అవి నాకు అసహనంగా వుంది.

# మళ్ళీ బెంగుళూరులో

మా అమ్మ అంది, "ఎటూ కాంగ్రెస్ వుద్యమం ఆగిందికదా. నువ్వు ఎందుకు మళ్ళీ కాలేజీలో జేరి చదువకూడదు? చదువు అయిన తర్వాత మళ్ళీ కావాలనుకుంటే ఉద్యమంలో జేరవచ్చు" అని చెప్పసాగింది. నాకూ నిజమేననిపించింది. అంతగా వుధృతంగా ఉద్యమం వస్తే నేను కాలేజీలో చదవడం ఆటంకం కాదు కదా? అప్పుడే ఉద్యమంలో దూకవచ్చు అనుకున్నాను. మా తమ్ముడు రామచంద్రారెడ్డి నేను జైల్లో వున్న కాలంలో చదువు కొనసాగిస్తూనే వున్నాడు. అప్పుడు మా పెద్దబావగారు బెంగుళూరులో వుంటే ఆయన వద్ద చదువుకుంటున్నాడు. నేను కూడా చదువు కొనసాగించే నిమిత్తం బెంగుళూరు జేరాను.

నన్ను ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరంలో జేర్చుకోమని దరఖాస్తు పెట్టాను. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఫస్టు మార్కులు కాకపోయినా, మంచి మార్కులే వచ్చాయి. ఏమయితేనేం నాకు రెండవ సంవత్సరంలో సీటు దొరికింది. కాలేజి నిర్వాహకులకు కూడా నేను చేసిన కార్యకలాపాలు, నా జైలు జీవితం చూచాయగా తెలుసు.

కాలేజీకి నేను ఖద్దరు ధరించి వెళ్ళేవాణ్ణి. చదువులో జేరబోయేముందే చెప్పాను. "నేను ఖద్దరు ధరించటానికి, రాట్నం వడకడానికి అనుమతి యిస్తేనే చదువు కొనసాగిస్తానని", అందుకని మా బావగారింట్లో నాకు ప్రత్యేకంగా ఒక గది కేటాయించారు. అక్కడ నేను రాట్నం వడకడం అదీ చేసేవాణ్ణి.

మా బావగారు నా యెడల చాలా మంచిగా వుండేవారు. ఆయన ఏదన్నా పొరపాటుగా చెప్పినా, చేసినా నేను వ్యతిరేకించేవాణ్ణి. ఆయనకన్నా చాలా చిన్నవాణ్ణి అయినా నన్ను గౌరవంగా చూసేవారు. పైగా కాలేజి నుండి నా "అభివృద్ధి రికార్డు" వస్తుండేది కదా. నాది మంచిగుణం అనీ, శ్రద్ధగా చదువుతాననీ, అవన్నీ ఆయనేగా చూసి సంతకం పెట్టవలసింది ఆయన అంటుంటేవాడు. సుందరయ్య చాలా క్రమశిక్షణగలవాడు, గంభీరుడు, రామ్ ఇంకా చిన్నపిల్లాడిలా అల్లరి వదల్లేదు. సుందరయ్య బాగా అభివృద్ధిలోకి వస్తాడు" అని.



ఏమైనా మా ఇద్దర్నీ ఎంతో అభిమానించేవాడు. నేను బెంగుళూరులో ఉండగా ఒకనాడు కంభంపాటి సత్యనారాయణ వద్దనుండి ఒక వర్తమానం వచ్చింది.

"అమీర్ హైదర్‌ఖాన్ నిన్ను కలవాలనుకుంటున్నాడు. ఆయన నువ్వు కమ్యూనిస్టు పార్టీకి పూర్తి కాలం కార్యకర్తగా వుండాలని కోరుకుంటున్నాడు. ఎలాగూ మనం కమ్యూనిస్టు అభిమానులుగానే వుంటున్నాము కదా. కనుక నువ్వు అమీర్ హైదర్‌ఖాన్‌తో చర్చించి తదనుగుణంగా నిర్ణయం తీసుకుంటే మంచిది. పైగా నీకు చాలా సంబంధాలున్నాయి. కనుక, పూర్తికాలం కార్యకర్తగా నువ్వు కమ్యూనిస్టుపార్టీకి బాగా ఉపకరిస్తావు" అన్నది ఆ లేఖ సారాంశం.

అయితే అప్పటికే నేను చదువు కొనసాగించాలని నిర్ణయించుకున్నాను కదా. కనుక చర్చించటానికి ఏమీ అభ్యంతరం లేదుకానీ పూర్తికాలం కార్యకర్తగా వెంటనే రంగంలోకి దిగటానికి మాత్రం సిద్ధంగా లేను. ఆ విషయమై మా అమ్మకు వాగ్దానం కూడా చేసి వున్నాను. కనుక బి.ఏ. చదువుతూ, నా రాజకీయ విధానాన్ని పెంచుకోవాలన్నది అప్పటి ధ్యేయం. ఇది ఒక అంశం.

నేను సిద్ధపడకపోవడానికి మరో అంశం కూడా ఉంది. గాంధీగారి మార్గంలో స్వాతంత్ర్య సిద్ధి అసాధ్యము అని పూర్తిగా నిర్ధారణకు అప్పటికి రాలేదు. అయితే, గాంధీమార్గం మీద విశ్వాసం ఉందని కాదు. అవిశ్వాసం ఏర్పడింది. అయినా, యింకా ఏవో కొన్ని సమస్యలు కొట్టుమిట్టాడుతూనే ఉన్నాయి.

నేను, నా విద్యా వ్యాసంగాన్ని కొనసాగించాలనీ, ఈ లోపల సోవియట్ యూనియన్ గూర్చి, కమ్యూనిజాన్ని గూర్చి ఇంకా లోతుగా అందుబాటులో వున్న సాహిత్య అధ్యయనం చెయ్యాలనీ నిర్ణయించుకున్నాను. కాంగ్రెస్ సాహిత్యం సరేసరి. "హరిజన్" పత్రిక వచ్చేది. 'యంగ్ ఇండియా' ఆ తర్వాత వచ్చింది. అలాగే "హిందూ" పత్రిక "ఆంధ్రపత్రిక" దినపత్రిక క్రమం తప్పకుండా చదివేవాణ్ణి.

ఇక్కడ ఒక ఘటన గూర్చి చెప్పాలి. నేను బెంగుళూరు చదువుల కోసం వెళ్ళే సందర్భంలో జరిగింది. నా బట్టలూ, పుస్తకాలు ఒక సంచిలో పెట్టుకుని, మద్రాసు స్టేషన్‌లో దిగాను. మళ్ళీ బెంగుళూరు వెళ్ళేందుకు రైలు ఎప్పుడుందో కనుక్కుందామని "విచారణాలయానికి" వెళ్ళాను. అక్కడ చెప్పే ఉద్యోగి లేడు. గోడమీద భారతదేశ రైల్వేలకు సంబంధించి పెద్ద మ్యాపు ఉంది. నాకు ఇలాంటి మ్యాపులు చూడటం మొదటి నుంచీ అదో హాబీగా వుండేది. ఇంకేం నా సామాను అక్కడే కిందపెట్టి గదిలోకి వెళ్ళి ఆ మ్యాపు చూడటంలో నిమగ్నమైపోయాను.

ఇంతలో ఆ ఉద్యోగి వచ్చి గభాల్న నా రెక్క పుచ్చుకుని “నువ్వు దొంగతనం చెయ్యడానికి వచ్చావు” అని నిందించసాగాడు.

“నువ్వేం మాట్లాడుతున్నావ్? నా వద్ద బెంగుళూరుకు రైలు టిక్కెట్టు వుంది. ఇదుగో నా సామాను ఇక్కడే వుంది. ఏదో ఈ మ్యాపు కనిపించేసరికి కుతూహలం కొద్దీ చూస్తున్నాను. అందుకు నన్ను దొంగ అంటావా” అని నేను తగాదా వేసుకున్నాను.

“నేను లేకుండా చూసి దొంగతనం చేసేందుకు గదిలో దూరావు. నిన్ను పోలీసులకు పట్టిస్తాను” అని బెదిరించసాగాడు.

“పోలీసులను పిలు. పట్టించు. దొంగతనానికి వస్తే నా సామానంతా ఇక్కడ పెట్టి తీరిగ్గా మ్యాపు చూస్తూ నిలబడతానా? ఏం తప్పు చేశాను గనుక నేను భయపడాలి?” అంటూ మొండికేశాను. వాదోపవాదాలు పెరిగాయి. ఆ ఉద్యోగి పోలీసును పిలిచాడు. నేను ఇలా బెంగుళూరు మా బావ జిల్లా జడ్జిగారు ఇంటికి వెళ్తున్నాననీ, నా టిక్కెట్టు, నా సామాను ఇక్కడే వున్నాయనీ ఏదో కుతూహలం కొద్దీ లోపలకి వచ్చి మ్యాపు చూస్తున్నాననీ, నిజానికి అనుమతి లేకుండా అలా వచ్చి వుండవలసిందిగాదనీ ఆ పోలీసుతో వివరించి చెప్పాను. ఆ పోలీసు కాస్త యింగితం వున్నవాడల్లే వుంది. ఆ ఉద్యోగితో – “నీ వస్తువులేమీ పోలేదుకదా! కనుక దొంగతనం అన్న సమస్య ఏముంది? కాకపోతే అనుమతి లేకుండా లోపలికి వచ్చాడని ఇతడిమీద కేసు పెట్టవచ్చు. ఇంత చిన్నదానికి అరెస్టనీ, అదనీ, ఇదనీ ఇతణ్ణి బెంగుళూరు వెళ్లకుండా ఆపవలసిన అవసరం ఏముంది?” అని నన్ను వెళ్ళమని పంపించేశాడు.

ఈ మ్యాపులు పోగుచేయడం. పరిశీలించడం అన్న హాబీ చిన్నప్పటి నుంచీ నాకు వున్నది. అదే నన్ను ఇబ్బందిలో పెట్టిందన్నమాట!

సరే! బెంగుళూరులో కబ్బన్ పార్కు లైబ్రరీ వుండేది. అక్కడ మళ్ళీ నా అధ్యయనాన్ని సాగించాను. సోషలిజం, కమ్యూనిజం, రష్యన్ విప్లవాన్ని గూర్చి దొరికిన సాహిత్యాన్నంతా అధ్యయనం చేయసాగాను. బహుశా ఇక్కడో లేదా కన్నెమెరా లైబ్రరీలోనో “రష్యా విప్లవం” రెండు భాగాలు వుండేవి. అవి కూడా సంపాదించి చదివాను.

ఇక్కడ వుండగానే అమీర్ హైదరాఖాన్ నన్ను కలిసినట్టుగా ఆయన స్వీయ చరిత్రలో వుంది. ఆయన కలిసిన సందర్భంలో మాట్లాడదామని ఆయన కోరినట్లు ఇప్పుడు నేను చదువుకోవలసిన సమయం. కనుక రేపు ఫలానా సమయంలో మాట్లాడదామని నేను సూచించినట్లు ఆయన రాశారు. నాకీ వివరాలు అంతగా గుర్తులేవు. కానీ ఆయన తన పుస్తకంలో రాసినట్లే కమ్యూనిస్టు ఉద్యమం పట్ల నాకు నమ్మకం ఏర్పడింది. ఆ పార్టీ కోసమే నేను పనిచేస్తాను. అయితే ముందు నా చదువు పూర్తి చేస్తానని అమ్మకు మాట ఇచ్చాను.



కనుక చదువు పూర్తి కావాలి! ఆ తర్వాత పార్టీ కోసం పూర్తి కాలం కార్యకర్తగా పనిచేస్తాను అన్న అర్థంలో చెప్పి వుంటాను. ఆ సందర్భంలో ఆయన ఈ చదువుల వల్ల ప్రయోజనం ఏమిటి అన్నట్లుంది గానీ? నేను నా మాట మీదే వున్నాను. కబ్బన్ పార్కులో కలుసుకున్న గుర్తు.

ఇక నా చదువు విషయానికివస్తే, లయోలా కాలేజీ సిలబస్‌కూ ఇక్కడి సిలబస్‌కూ తేడా వుంది. హిస్టరీ, ఎకనామిక్స్, పాలిటిక్స్ ఇవి అక్కడా, ఇక్కడా ఒకే విధంగా ఉండేవి. అయితే ట్రిగ్నామెట్రీ లయోలా కాలేజీలో రెండో సంవత్సరంలో చెప్పేవారు. ఇక్కడ అది మొదటి సంవత్సరంలోనే ఆరంభించేవారు. కనుక, మొదటి సంవత్సరం పోర్షను సరిగ్గా అర్థంకాకుండా, రెండో సంవత్సరంలో చెప్పే భాగం అర్థం చేసుకోవడం కష్టమే! కనుక నాకు లెక్కలు చాలా “గొట్టుగా” వుండేవి. రసాయన శాస్త్రం అంటే నాకు చాలా ఇష్టంగా వుండేది. ఏవేవో కలవటం, కొత్త పదార్థం రావడం, సూత్రీకరణలూ అన్నీ హుషారుగా వుండేది.

కానీ, భౌతిక శాస్త్రంలో ఇంకో చిక్కు వచ్చింది. లయోలా కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో దాదాపు స్కూలు ఫైనల్‌లో చెప్పిన పాఠ్యాంశాలే మళ్ళా చెప్పారు. కనుక అక్కడ ఇంటర్మీడియట్ భౌతికశాస్త్రం మొదటి సంవత్సరంలో కొత్తగా నేర్చుకున్నది పెద్దగా లేదు. ఇక్కడ బెంగుళూరు సెంట్ జోసఫ్ కాలేజీలో ఎలక్ట్రిసిటీ, హీట్ – వీనిలో కొంత భాగం మొదటి సంవత్సరంలో చెప్పేవారు. అందుకని నేను పాఠ్యాంశాలను అర్థం చేసుకోవడం కష్టంగా వుండేది.

అయితే, మీరేం చెప్తున్నది నాకు అర్థం కావడం లేదండి అని చెప్పలేను కదా! అది నా పొరపాటు. అధ్యాపనికునిదేముంది. అందుకని బయటకు చెప్పలేక, ఆయన ఏదో చెప్తుంటే, ఏదో అర్థమయిన మేరకు వింటూ వుండేవాణ్ణి. ఇదంతా మెల్లిగా ఇంటివద్ద స్వయం కృషితో నేర్చుకోలేకపోతామా అన్న భరోసా! కానీ, కబ్బన్ పార్క్ లైబ్రరీలో నేను చదవదలుచుకున్న పాఠ్యేతర అంశాలు చదవడం మాత్రం మానుకోకపోవడం వల్ల, నేననుకున్నట్లు మొదటి సంవత్సరంలో పూర్తయిన భాగాలు చదివేందుకు సమయం చిక్కేదికాదు. అప్పటికి మామూలుకన్నా అదనంగానే చదువుకోసం శ్రమపడేవాడిని.

ఏదో చెప్తుండేవాళ్ళు – నేను గుడ్డిగా, అర్థం చేసుకోకుండా అనుకరిస్తూ వుండేవాడిని. ఏదో తలూపుతూ అర్థం అవుతున్నట్లు నటిస్తూండేవాడిని. ఒకసారి మా అధ్యాపకుడు ఏదో ప్రశ్న వేశాడు. నాకు తెలిస్తేగా చెప్పటానికి లెక్కల మాష్టారుగారయితే పిల్లలకు అర్థం అవుతున్నదా లేదా అని పట్టించుకునేవాడు కాదు. ఆయన చెప్పకపోతే వదిలిపెట్టలేదు. “ఎందుకు చెప్పట్లేదు” అని అడిగాడు. “నాకు గత సంవత్సరం పోర్షన్ యేమీ తెలియదు. అందువల్ల మీ పాఠాలు సరిగా అర్థం చేసుకోలేకపోతున్నాను” అని వున్నది వున్నట్లు చెప్పాను.

"మరి యిన్నాళ్ళూ..."

"ఏదో వింటున్నాను. యాంత్రికంగా ప్రయోగాలు చేస్తున్నాను. శలవుల్లో అవన్నీ నేర్చుకుందామని అనుకుంటున్నాను" అన్నాను. ఆయనకు సానుభూతి కలిగింది. "చూడండి! ఈ పిల్లాడు స్వంతంగా చదువుకుని శలవుల్లో నేర్చుకుంటాడట! ఈ పాఠ్యాంశాలు క్లాసులో శ్రద్ధగా వింటేనే అర్థం అవటం కష్టం" అని పిల్లలతో చెప్పి "చూడు నీకు అర్థం కాకపోతే నన్నడగాలి. అంతేగాని యిలా అయితే ఎట్లా?" అని బుజ్జగించి అప్పటినుండి నా కొరకు కొంత సమయం ప్రత్యేకంగా కేటాయించేవాడు.

కెమిస్ట్రీ అధ్యాపకులు రామిరెడ్డి అని నెల్లూరు జిల్లాకు చెందినవాడే. ఆయనకు నేను జాతీయోద్యమంలో పాల్గొనటం వగైరా అన్నీ తెలుసు. అందుకని నేనంటే అభిమానంగా వుండేవాడు. ప్రత్యేక శ్రద్ధతో నాకు పాఠాలు అవీ వివరించేవాడు. రసాయనశాస్త్రం పెద్ద కష్టంగా వుండేదికాదు. ఒకరోజున ఒక పదార్థం ఏమిటో కనుక్కోవలసిన ప్రయోగం. నాకు యిలాంటి ప్రయోగాలంటే భలే ఆసక్తిగా వుండేది. అందుకని "నేను కనుక్కొంటాను" అన్నాను. రామిరెడ్డిగారు "నాకే తెలియదు నువ్వెలా కనుక్కుంటావు" అని నా ఉత్సుకతను మాత్రం అభినందించారు.

ఇక సంస్కృతం పర్వాలేదు. ఇంగ్లీషులో కూడా బాగానే ఉండేవాణ్ణి. ఇలా చదువు సాగుతున్నది.

ఇంతలో మా బావగారి పెద్ద కూతురు వివాహం జరిగింది. ఆ సందర్భంగా ఆయన జిల్లా జడ్జి గనుక అలంకరణ బాధ్యత తన క్రింది వుద్యోగస్తులకు అప్పజెప్పారు. వాళ్ళు – బ్రిటిష్‌వాళ్ళ జెండా "యూనియన్ జాక్" తెప్పించి అంతా తోరణాలుగా కట్టారు. నాకు గుర్తున్నంతలో యూనియన్ జాక్ జెండా ఎగరేశారు కూడా!

నాకు కోపం వచ్చింది. మా బావగారి వద్దకు వెళ్ళాను. "మీ ఆఫీసులో ఏదన్నా ప్రభుత్వం జరపమన్న దినోత్సవం అయితే యిలా యూనియన్ జాక్ ఎగరవెయ్యడంలో అర్థం వుంది. ఇది ఇంట్లో వేడుక. ఇక్కడ కూడా ఈ బ్రిటిష్ వాడి జెండా ఎగురవేయకుండా వుండలేరా? మీరు చదువుకున్నవాళ్ళు. తెలివిగల వాళ్ళు అయినా ఆ చదువు, ఆ వుద్యోగం వల్ల పరాయిపాలకుడి జెండానుమనింట్లో ఎగరవెయ్యాల్సిన స్థితి ఏర్పడితే ఈ చదువులకు అర్థం ఏమిటి? స్వతంత్ర భావాలు రేకెత్తించే బదులు బానిస చర్యలు చేసేందుకే విద్య వుపయోగపడితే ఆ విద్య నాకక్కరలేదు. ఇక ఈ బెంగుళూరులో వుండటం దండుగ. మా వూరు వెళ్ళిపోతాను" అని చెప్పాను.

మా బావగారు నన్ను బెంగుళూరులో వుండి చదువు పూర్తి చేయమని నచ్చజెప్ప చూశారు. కానీ నేను వినలేదు.



సహజంగా నేనొక నిర్ణయానికొస్తే ఇక తిరుగువుండేది కాదు. మా అమ్మవాళ్ళు నాది "భల్లూకపట్టు" అనేవారు. అందుకు మా వాళ్ళు నా చిన్నతనంలో ఒక సంఘటన చెప్పేవారు. నాకు యేదో లీలగా గుర్తు – మా మూడో అక్క పెళ్ళి జరుగుతున్నది. ఆ పెళ్ళి సందర్భంలో "మాంసం" కూర చేయకూడదని, మాంసాహారం వడ్డించకూడదని నేను పట్టుపట్టాను. మా తమ్ముడు రామచంద్రారెడ్డి కూడా నాతోపాటే వద్దని పట్టుపట్టాడు.

పిల్లలం కదా! మా మాట ఎవరు వింటారు. "మాంసం"తో పలావ్ వండి పెద్ద రాసిపోశారు. పెద్ద వాన వచ్చింది. పాపం పెళ్ళికి వస్తున్న వాళ్ళంతా తడిసిముద్దయ్యారు. దానికి తగ్గట్టు దారిలో వాగు వచ్చింది. ఎలాగో పాపం నానా తిప్పలుపడి వచ్చారు.

మేం వద్దన్నా వినకుండా మా వాళ్ళు మాంసం వండారన్న కోపం కొద్దీ – మా తమ్ముడు మూడు, నాలుగు తెడ్డుల ఇసుక తెచ్చి, ఈ పలావ్ రాసిలో పోశాడు. నేను చూశాను గానీ వారించినట్లులేదు. సరే అదంతా చిన్నతనం అల్లరి అనుకోండి.

ఆ తర్వాత నేను కమ్యూనిస్టుగా మారిన తర్వాత నాలో చాలా మార్పు వచ్చిందని అది వరకటి కోపం, మంకుతనం చాలావరకు తగ్గిపోయాయని మా అమ్మ అంటుండేది. నాకు గుర్తున్నంతలో నేనెప్పుడూ అంత ముక్కోపిని కాను. మంకుపట్టు విషయంలో చిన్నప్పుడొకసారి మా పంతులుగారు నన్ను కొట్టారు. నేను కూడా ఎదురుతిరిగాను. "నాకు దెయ్యం పట్టింది. నీ అంతు చూడకుండా వదలను" అని పంతులుగారి మీదకు ఉరికాను. ఆయన బెత్తం తీసుకుని దెబ్బకు దెయ్యం వదిలించాడు. ఇలా ఎన్నోసార్లు అల్లరి పనులు చేసి వుంటాను. అందుకు మంకుపట్టు అన్నారేమో! ఇక ఆ చిన్నతనపు రోజుల ప్రస్తావన ఇంతటితో ముగిస్తాను.

నిజానికి ఒక నిర్ణయం తీసుకున్న తర్వాత ఆరునూరైనా, నూరు ఆరైనా దాన్ని అమలు జరపడమే నాకు అలవాటు. బెంగుళూరులో చదువుసాగించడం అనవసరం అనుకున్నాను. మా అక్క, బావ చదువుకోమని వెంటపడినా నేను అంగీకరించలేదు.

నేను ఇలా చదువు మానుకుని మా వూరు వెళ్తున్న సంగతి వి.కె. నర్సింహన్‌కు వుత్తరం రాశాను. ఫలాన బండిలో మా వూరు వెళ్తున్నట్లు కూడా వ్రాశాను. అమీర్ హైదర్‌ఖాన్ నన్ను కలుసుకొనేందుకు స్టేషన్‌కు వచ్చాడు. రైలు కదలబోతున్నది. నేనిలా మద్రాసు వెళుతున్నాననీ, కమ్యూనిస్టు పార్టీకి పూర్తికాలం కార్యకర్తగా పనిచేసేందుకే నిర్ణయించుకున్నాననీ, అయితే ఇంటివద్ద సర్దుబాటు చేసుకోవలసిన విషయాలు కొన్ని వున్నాయనీ, అందుకని మా వూరు వెళ్తున్నాననీ చెప్పాను. మే నెలలో తిరిగి మద్రాసు వచ్చి మిత్రులను కలుసుకొని ఇక పార్టీ కార్యక్రమంలో నిమగ్నమవుతానని నా నిర్ణయం అమీర్ హైదర్‌ఖాన్‌కు తెలియజేశాను.

అయితే అప్పటికి రైలు కదిలింది. కదులుతున్న రైలు వెంట వస్తున్న అమీర్ హైదర్‌ఖాన్‌తో హడావిడిగా ఈ నాలుగు ముక్కలూ అన్నానేగానీ వివరాలు ఏమీ తీరిగ్గా మాట్లాడుకోవడానికి కుదరలేదు.

నేను మటుకు మా వుళ్ళో నా వ్యవహారాన్ని సర్దుబాటు చేసుకుని మద్రాసు చేరి పార్టీ కార్యక్రమాలలో పూర్తికాలం కార్యకర్తగా పని చెయ్యాలనే నిశ్చయించుకున్నాను. దానిలో మాత్రం తిరుగులేదు.

**మళ్ళీ మా వూళ్ళో**

మా వూరు వెళ్ళాను. ఇక నన్ను మళ్ళీ చదువుకోమని ప్రోద్బలం చేసి ప్రయోజనం లేదని ఎవ్వరూ ఆ పని చెయ్యలేదు. మా అమ్మ కూడా అటునుంచి అటే పోకుండా తిన్నగా మా వూరే వచ్చినందుకు సంతోషించింది. "నువ్వు ఏమి చెయ్యదలుచుకున్నా ఇక్కడే మా ఎదురుగా వుండి చేసుకో. నిన్నెవరూ అడ్డుపెట్టరు" అని చెప్పింది.

అప్పటికే నేను బొంబాయి నుండి కొన్ని నిషిద్ధ పుస్తకాలు తెప్పించుకొని చదివాను. 1931 డిశంబరు నుండి 32 మే దాకా మా వూళ్ళో వున్నాను. అది వరకే కొంతమంది యువకుల్ని సమీకరించి లైబ్రరీ అదీ నడిపిన విషయం చెప్పానుకదా!

ఈ లోపల పత్రికల్లో వార్త వచ్చింది. మద్రాసులో వి.కె. నర్సింహన్, అమీర్ హైదర్‌ఖాన్ వీళ్ళంతా పట్టుబడ్డారని, ఇక నేను మద్రాసుకెళ్ళి వాళ్ళని కలుసుకొని ఏమి చెయ్యాలి? పైగా నేను కమ్యూనిస్టు కార్యకర్తగా పనిచెయ్యాలంటే రహస్యంగా చెయ్యాలి. మద్రాసు వెళ్ళి వాళ్ళని జైల్లో బహిరంగంగా కలుసుకుంటే అసలు నేను చేసేపనికి ఆరంభంలోనే హంసపాదు ఏర్పడుతుంది. దానికి తగ్గట్టు "రౌండ్ టేబిల్ కాన్ఫరెన్స్" విఫలమై గాంధీజీ తిరిగి వచ్చారు. మళ్ళీ జాతీయోద్యమం ఆరంభమయ్యే సూచనలు వున్నాయి.

కనుక మా వూళ్ళో వుంటూ మొత్తం యువకులందరినీ సమీకరించి కార్యక్రమాలు నిర్వహించాలి! అలాగే గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం స్థాపించి వారి తక్షణ డిమాండ్లపై సంఘ నిర్మాణం చెయ్యాలి! మా వూళ్ళో వుండే కాలంలో ఈ పని చేద్దామని నిర్ణయించుకున్నాను.

ఇంకో విషయం కూడా వుంది. నా "ఆస్తి" వగైరా వ్యవహారాలు కూడా తేల్చుకోవాలి! విప్లవోద్యమంలోకి వెళ్ళిన తర్వాత ఈ ఆస్తి తత్సంబంధ జంఝాటం వుండకూడదు.

మా వదినకు ప్రతి కాన్పు సందర్భంలోనూ వంటికి నీరు రావడం, కాన్పు ముందు రోజుల్లో సొమ్మలు రావడం జరిగేది. ఆమెకు నేను ఇంటి దగ్గరవుంటే సపర్యలు చేసేవాణ్ని. నెల్లూరులో ఆస్పత్రిలో చూపేందుకు ఆమెను తీసుకుని వెళ్ళివస్తుండే వాణ్ని. మా ఊరికి నెల్లూరు 16 మైళ్ళు. మరి దరిదాపుల్లో ఆస్పత్రి ఉండేది కాదు. ఒకోసారి, ఆమె మూత్రం తీసుకుని సైకిలుమీద నెల్లూరు వెళ్ళి పరీక్ష చేయించుకొచ్చేవాణ్ని!



మాది భూస్వామ్య కుటుంబమే అయినా, చేతిలో రూపాయలు అంత తేలిగ్గా ఆడేవికావు. మా వదినకు మందులు, పళ్ళూ తెచ్చేందుకు కూడా మా అన్న ముందూ వెనకా ఆడేవాడు. నా విషయంలో, యెంత డబ్బు ఖర్చు చేస్తున్నా పట్టించుకునేవాడు కాదు. ఎందుకు అని అడిగేవాడు కాదు. అంతమాత్రాన నేను విచ్చలవిడిగా ఖర్చు చేసేవాణ్నని అర్థం కాదు. నేను నెల్లూరు వెళ్ళి మా వదినకు కావలసిన మందులూ, పళ్ళూ తెచ్చి పెడ్తుండేవాణ్ని.

ఆమెకు మూడు కాన్పులు పోయిన తరువాత ఒక ఆడపిల్ల బ్రతికింది. ఆమె 1984లో చనిపోయిన విద్యుల్లత, మా వదినకు ఆ తర్వాత ఒక అబ్బాయి బతికాడు. నేను మా అన్నతో "అన్నా నేను ఎట్టాగూ ఉద్యమంలోకి వెళ్తాను. నీకు పిల్లలున్నారు. పైగా యింతకాలం పొలం చూసుకుంటూ చదివించావు. కనుక నీతో సమానంగా నాకు వాటా రావటం న్యాయం కాదు. మామూలుగా నా వాటా నాకు అక్కర్లలేదు. నాకు ఖర్చులకు మాత్రం ఇవ్వు. మిగతాది నువ్వు, తమ్ముడు తీసుకోండి. అందులోనూ నువ్వు యెక్కువగా తీసుకోవాలి. ఆ తర్వాత కూడా కుటుంబ బాధ్యతలు అవీ నీ మీద వుంటాయి" అని చెప్పాను.

మా అన్న అంగీకరించలేదు. "నా వాటా నాకు వుంది. సరిపోతుంది. నీకు రావలసిన వాటా మొత్తం నువ్వే తీసుకోవాలి" అని అన్నాడు. ఆయన్ను ఎలాగో నచ్చజెప్పి ఒప్పించాను. నా వాటా 13 ఎకరాలు, నేను అందులో సగం అంటే ఆరున్నరెకరాలు తీసుకునేటట్లు! ఇక ఇళ్ళు వున్నాయి. నేను లైబ్రరీ, పాఠశాల, యువజన సంఘం ఆఫీసు అదీ నడుపుకునేందుకు ఒక ఇల్లు తీసుకున్నాను. రెండువేలో, యెంతో నగదు నాకు వచ్చేటట్లు అదీ ఒప్పందం.

1932 బాగా ఆర్థిక సంక్షోభం, ధరలు పడిపోయి వున్నాయి. బస్తా ధాన్యం ధర రెండున్నర రూపాయలు. ఎకరం మహా అయితే 500 రూపాయలు. అప్పులు కూడా తక్కువే అయినా కొన్ని మాకు ఉన్నాయి. నా వంతుకు వచ్చే అప్పుతీర్చబోతే మా అన్న అంగీకరించలేదు. అప్పులు తీర్చే బాధ్యత తనమీద వేసుకున్నాడు.

మా అమ్మకు కూడా వాటా పంచాము. దాదాపు ఆమెకూ 6 ఎకరాలో ఏమో వచ్చింది. మా అమ్మ మాత్రం అలా నేను తక్కువ వాటా తీసుకొనేందుకు మొదట్లో అంగీకరించలేదు. అంతగా అయితే తర్వాత ఇద్దువు గాని, ముందు తీసుకో అంది. కాని నేను వివరించి చెప్పిన మీదట అంగీకరించింది.

మా అన్నతో "నేనీ పొలం ఎలాగూ చేసేది లేదు. ఎవరికో అమ్మే బదులు నువ్వే కొనుక్కో. వున్నంత పైకం ఇప్పుడు ఇవ్వు. మిగిలింది నిదానంగా ఇద్దువుగాని అని మొత్తం భూమి విలువ మూడు వేలకు కట్టి మా అన్నకిచ్చేశాను.

ఆ తర్వాత కొందరు "సుందరయ్య ఎంత కమ్యూనిస్టు అయినా తన భూమి తన అన్నదమ్ములకిచ్చాడు గానీ, పేదలకివ్వలేదు" అని విమర్శ చేశారు.

పేదలకు భూమి ఎవరో దయాదాక్షిణ్యం మీద ఇస్తే వచ్చేది కాదు. పోరాడి సాధించుకోవాలి! అదీగాక మా అన్నకివ్వటం విషయమా! ఆయన పొలంలో కష్టపడి పనిచేసి నన్ను చదివించాడు. పైగా కుటుంబం వుంది. ఇంకా చిన్న తమ్ముడి చదువు వ్యవహారమూ, ఇతర కుటుంబం బాధ్యతలూ వున్నాయి. నాకలాంటి బాదరబందీ ఏమీలేదు. దీని విషయంలో పోట్లాడి, బజారుకెక్కి, నా వాటా తెచ్చుకుని – ఏమిటిదంతా! పైగా నా పొలాన్ని మాత్రం ఎవరు చెయ్యాలి? మొత్తం వ్యవహారం చూడవలసింది మా అన్న – అందుకని ఆయనే తీసుకోవడం న్యాయం అని వాదించాను.

ఎప్పుడైనా, ఎవరైనా "అంతా అన్నకే ఇచ్చి వచ్చావు తెలివి తక్కువ తనంగా" అంటే నవ్వుతూ అంటుండేవాణ్ని 'మీరే తెలివితక్కువవాళ్ళు. నేనే తెలివిగలవాణ్ని. అలా ఇవ్వడంవల్ల మా అన్న నన్నెంతో చక్కగా అర్థం చేసుకుని గౌరవించాడు? ఆయన 1948లో కడుపులో పుండువల్ల మరణించాడు. అప్పటిదాకా నేను ఎప్పుడు, ఎంత కావాలని కబురు చేసినా, కొంచెం ఎక్కువే పంపేవాడు గానీ, ఎప్పుడూ తగ్గించి పంపలేదు. అవన్నీ లెక్కగడితే ఆయన నాకివ్వవలసిన బాకీ ఎప్పుడో తీరిపోయింది' అనేవాణ్ని.

మా అన్నతో ఎవరైనా, "అలా నీ తమ్ముడు అడిగినప్పుడల్లా  పంపుతున్నావు. నువ్వివ్వాల్సింది రెండువేలే కదా" అంటే "బాగా ధరలు పడిపోయినప్పుడు వాడు చాలా చవగ్గా అమ్ముకున్నాడు. నాకే అనుకోండి. ఇప్పటిదాకా వుంచుకుంటే ఇంత వచ్చేదీగా?" అని ఎదురు ప్రశ్న వేసేవాడు, అయినా ఏ వ్యవహారం ఎలా చేసినా ఆప్యాయతాపూరిత సంబంధాలు అన్నదమ్ముల మధ్య నెలకొనేందుకు మేం పంచుకున్న తీరు దోహదం చేసింది.

ఇక్కడే మా కుటుంబ వ్యవహారాలు కూడా చెప్తే సరిపోతుంది.

మా నాల్గవ అక్కకు ఈతముక్కల రామచంద్రారెడ్డి అని మా బంధువుతో వివాహం జరిగింది. ఆయన ఉద్యమంలో నాతో సహచరుడుగా వుండేవాడు. ఆయన వ్యవసాయం బ్రహ్మాండంగా చేయాలని ఎన్నో పథకాలు వేశాడు. అవన్నీ విఫలమైనాయి. అప్పులపాలయ్యాడు.

అయినా మా అమ్మ మాత్రం మాది భూస్వాముల కుటుంబం గనుక మాతో సమాన స్థాయిలో వాళ్ళుండాలని కోరుకునేది. ఎలా వుండగలరు ఆయన అట్లా అప్పుల్లో మునిగి తేలుతుంటే?

అయినా ఆయన మాత్రం చాలా నెమ్మదస్తుడు. నిరాండంబరుడు. వాళ్ళ ఊరు అడ్డదోవన నడిస్తే మా ఊరుకు 40 మైళ్ళు అయినా వుండేది. అక్కడ పొద్దున్న బయలు దేరి



చీకటిపడేసరికి నడిచి మా ఊరు వచ్చేవాడు! ఒకవేళ ఆయన రైల్లో ప్రయాణం చెయాలన్నా పది పదిహేను మైళ్ళు నడిచో, ఎడ్లబండిమీదో తలమంచలి రైల్వేస్టేషన్‌కు చేరాలి. రైలెక్కి "తెట్టు" స్టేషన్‌లో దిగాలి. మళ్ళీ పదిహేను మైళ్లు నడిచో, బండిమీదో మా వూరు రావాలి! నడక – రైలు – బండి ఈ శ్రమ, పైగా ఖర్చు అని నడిచే వచ్చేవాడు. అప్పుడు ఇంతగా ప్రయాణ సౌకర్యాలు లేవు. తర్వాత చాలా కాలానికి బస్సు పడింది. ఆయనేకాదు చాలామంది అలానే నడిచేవారు. అప్పట్లో జనం అవసరం. ఓపిక అలా వుండేది.

ఆయన చాలా కష్టపడి పనిచేసేవాడు. కానీ పురుష అహంకారంతో అప్పుడప్పుడు మా అక్కను తిడుతూ, కొడుతూ వుండేవాడు. మా అమ్మనాతో 'దాన్ని రామచంద్రయ్య సరిగా చూడడు' అని మొత్తుకునేది. "అలా నాతో చెప్పి ప్రయోజనం ఏమిటమ్మా! ఆ బాధలు, అవమానాలు, తన్నులూ భరిస్తూ అక్క అక్కడ వుండటం దేనికి, యిష్టం లేకపోతే అక్కడ నుండి వచ్చెయ్యమను. ఆ మాత్రం దాని జీవితాంతం మనం పోషించలేమా! పోనీ, నేను పోషిస్తాను" అని చెప్పేవాణ్ణి.

మా అమ్మ మాత్రం అందుకు ఒప్పుకునేదికాదు. కానీ మళ్ళీ మళ్ళీ వచ్చి రాద్ధాంతం చేసేది. ఈత ముక్కల రామచంద్రారెడ్డితో బాగా చనువుండేది. అందుకని "ఏమిటయ్యా యీ అలవాట్లు! మా అక్కను కొట్టడం, తిట్టడం ఇవన్నీ నువ్వు చేయటం ఏం బాగాలేదు" అని ఆయన్ని మందలించాను. "అదికాదు సుందరయ్య! అప్పుడప్పుడు కోపం వస్తుంది. ఎంత ఓర్పుగా వుందామని తమాయించుకున్నా ఒకోసారి ఓర్పు నశిస్తుంది" అని తలవంచుకుని చెప్పేవాడు. "ఎంత ఓర్పు నశిస్తే మాత్రం అలా బాదటమేనా" అని విసుక్కునేవాణ్ణి.!

ఒక అర్థరాత్రి మా అమ్మ నన్ను లేపి, మా అక్కను రామచంద్రారెడ్డి ఆ రోజు చావచితగ్గొట్టాడని చెప్పి, మనిద్దరం ఇప్పుడే వాళ్ళింటికి వెళ్దామంది. అప్పటికి యింకా వాటాలు పంచుకోలేదు. నేను ఆరున్నర ఎకరాలే తీసుకుంటానని అంటున్న రోజులు."ఇలా చెప్పి ఏం లాభం! అక్కడికి వెళ్తాం. అడుగుతాం. తగాదా అవుతుంది. అప్పుడైనా అక్క మనతో వచ్చేస్తుందా? నేను ఆరున్నర ఎకరాలు తీసుకుంటానంటున్నాను కదా" పొలం అక్కకే యిస్తాను. నాకేమీ ఫర్వాలేదు. ఎలాగో ఒకలాగ బ్రతుకుతాను. ఆ పొలం ఆధారంగా బ్రతకమను" అని అన్నాను. నేనూ మా అమ్మ ఇద్దరం కలసి వాళ్ళింటికి వెళ్ళాం. మా అక్కతో "మాతో వచ్చెయ్యి నీకేమీ లోటురాదు" అని చెప్పాను. మా అక్క మా అమ్మవంక చూసింది. మా అమ్మ రావద్దని, అక్కడే వుండమని సైగ చేస్తున్నది. నాకు భలే కోపం వచ్చింది. "అదీ! ఇక్కడికి వచ్చాం. తీరా తన మొగుడు గడపదాటవద్దంటే నీ కూతురు సరేనంటుంది. నువ్వూ అదే చెప్పావు. మరి నాకెందుకు చెప్పినట్లు? ఈ మొగుడూ పెళ్ళాల వ్యవహారంలోకి నన్నెందుకు లాగినట్లు? ఇదిగో అమ్మా చెప్తున్నాను. ఇక నీ కూతురు సంగతి నా వద్ద ఎత్తవద్దు" అంటూ విసవిసా బయటకు వచ్చేశాను.

మా మూడో అక్క వ్యవహారమూ అంతే, మా బావగారిది ఓలేటిపాడు. వాళ్ళు ధనవంతులే! ఆయన, మంచి నీళ్ళ ప్రాయంలా డబ్బు తగలేసేవాడు. పేకాట, జూదం లాంటి దురలవాట్లు వుండేవి. దీనికి తోడు కొంతవరకూ స్త్రీ లోలుడు. మా అక్క బ్రతిమిలాడేది. భంగపడేది. వినేవాడు కాదు. అప్పుడప్పుడు కొట్టేవాడు. ఆ అక్కకు నేనంటే యెంతో ప్రేమ. నాతో చెప్పుకునేది.

నేను ఆయన్ను మందలించాను. "ఏమిటయ్యా యిలా డబ్బులు తగలెయ్యటం, పేకాట ఏమిటి? ఆ తిరుగుళ్ళు ఏమిటి?" అని, అంతమాత్రానే ఆయన మారగలడా!" మా అక్కతో చెప్పాను. "ఎందుకు తన్నులు తింటూ ఆయన దగ్గర పడివుండటం. ఒకటే మార్గం ఉంది. విడాకులు యిచ్చేసేయ్. హాయిగా బతగ్గలవు" అని "లోకం వుంది కదా" అనేది. "ఏమిటి లోకం. నిన్ను మీ ఆయన తన్నుతుంటే ఈ లోకం అడ్డం వచ్చిందా? మరి ఆ లోకాన్ని యెందుకు పట్టించుకోవాలి! అయినా నీకు మీ ఆయన తన్నులే బాగుంటే అక్కడే పడివుండు. దానికి మళ్ళీ అల్లరి దేనికీ?" అని అరిచేవాణ్ని.

ఆ ఇద్దరు బావలు కూడా, నేనెన్నిచివాట్లు పెట్టినా, వాళ్లకన్నా చిన్నవాణ్ని అయినా నోరు మెదిపేవాళ్ళు కాదు. మా అక్కలూ, బావలూ కూడా నన్నెంతో అభిమానంతో చూసేవారు. మా మూడో అక్కవాటాగా నెల్లూరులో "మేడ" వచ్చింది. ఆమె తర్వాత ఆ మేడ మా తమ్ముడు రామచంద్రారెడ్డి అతని పిల్లల పేర్న పెట్టాలనుకుంది. రామచంద్రారెడ్డికి తీసుకోవడం ఇష్టంలేదు. నేనే నచ్చజెప్పాను. "మీ కిచ్చిన సంతృప్తి అన్నా ఆమెకు వుంటుంది. లేకపోతే ఏం చేస్తుంది? ఆ మొగుడికి ఆ మేడ పోతుంది. ఆ తర్వాత ఆయన దాన్ని కూడా అమ్మి ఆ డబ్బూ తగలేస్తాడు" అని చెప్పాను. చివరికి "రామ్" అంగీకరించాడు. శంకరాగ్రహారంలో ఆ మేడలోనే ఆస్పత్రి పెట్టాడు. ఇదో కథ.

ఇక మా అమ్మ! మా పెద్దక్కతో తన పెద్ద కొడుకు, అంటే మా అన్న తననెట్టాకాదని పెత్తనం చెయ్యాలని చూస్తున్నాడో చెప్పుకునేది. అప్పుడప్పుడూ మా అన్న, మా అమ్మ అరుచుకునేవారు. మా అమ్మ పెత్తనం చెయ్యడానికి అలవాటు పడింది. అందుకనే తగాదాలు వచ్చేవి. "ఎందుకమ్మా! అన్నయ్య పెద్దవాడయ్యాడు. బాధ్యత తెలిసింది. వ్యవహారాలన్నీ చూసుకుంటాడు కదా! మధ్య నీకెందుకు బాదరబందీ అంతా" అని మా అమ్మతో చెప్పేవాణ్ని! మా అన్న నేనేదన్నా చెప్తే అది తనకు నచ్చకపోయినా, కోపం తెప్పించినా పాటించేవాడు.

మా అమ్మకు ఇంకో ఇద్దరు అక్కలు వుండేవాళ్లు. మా పెద్దమ్మలు అన్నమాట! ఒక పెద్దమ్మ నెల్లూరు జిల్లా పార్టీ కార్యదర్శి జక్కా వెంకయ్య నాయనమ్మ! డా. శేషారెడ్డి అమ్మమ్మ! మా పెద్దమ్మ కూతురు ఒకామెకు చిన్నతనంలోనే పెళ్ళి చేశారు. ఆమె భర్త కాపురానికి వెళ్ళకముందే చనిపోయాడు. ఇప్పటివరకూ ఆమె బ్రతుకు తెరువు కోసం "రెండు పుట్లు"



ధాన్యమిస్తున్నారు. ఇప్పుడామెకు 83-84 సంవత్సరాలుంటాయి. ఇటీవలే చూశాను. ఇంకో పెద్దమ్మ వాళ్ళది నిడుముసలి గ్రామం. ఆమె భర్త పెద్ద భూస్వామి. దానికితోడు కష్టించి పనిచేసి, బాగా వ్యవసాయం చేసి మంచి పంట తీసేవాడు. ఆయనకు ఇద్దరు కొడుకులు, అరడజను మంది ఆడపిల్లలు.

కానీ, ఊళ్ళో ముఠా తగాదాలు వుండేవి. కొందరు హరిజనులు, భూస్వాములు ఒక పక్షం. ఈయన రెండో పక్షం. ఒకళ్ళనొకళ్ళు చంపుకున్నారు. ఈయనకు కూడా అవతలి పక్షం వారు హత్య చేశారు. చాలా అప్పులున్నాయి. మా పెద్దమ్మకు ఆయన అప్పుల విషయంగానీ, తగాదాల విషయంగానీ యేమీ పట్టేది కాదు. ఏదో పెద్ద భూస్వామ్య కుటుంబం. దానికి తగ్గ రీతిలో జీవితం గడుపుకోవడం తప్ప.

ఆయన చనిపోవడంతోనే అప్పులవాళ్ళు మూగారు. ఎంత పెద్ద భూస్వామి అయినా రూపాయిల్లో డబ్బు కట్టటం కష్టంగా వుండేదా రోజుల్లో! మేము జోక్యం చేసుకుని వాళ్ళ స్థితిని కొంత చక్కబరిచాము. మా ఇంట్లో కొన్నాళ్లు వుంచుకుని వాళ్ళను ఆదుకున్నాము. మా పెద్దమ్మ ఒక్కసారిగా తన పరిస్థితి మారిపోయిందని కృంగిపోయింది.

ఇవన్నీ ఎందుకు చెప్తున్నానంటే, స్త్రీల పరిస్థితి ఎంత దయనీయంగా వుందో నాకు బయటకు వెళ్ళకుండా మా కుటుంబాలను చూస్తేనే తెలిసొచ్చింది. పైగా యీ స్త్రీలందరూ డబ్బు కలవాళ్ళు. వీళ్ళ జీవితాలే ఇంత బాధాకరంగా వుంటే ఇక నిరుపేద స్త్రీల బ్రతుకులెంత అధ్వానంగా వుండి వుంటాయో అర్థమయింది. అప్పటి నుండి స్త్రీల జీవితాలు మెరుగుపడాలనీ, అందుకై కృషి చెయ్యాలనీ నేను నిశ్చయించుకునేందుకు ఈ అనుభవాలు తోడైనాయి. అయితే మా పెద్దమ్మలూ, వాళ్ళ పిల్లలూ, మేమూ అంతా బాగా సన్నిహితంగా వుండేవాళ్ళం. నేనూ, మా తమ్ముడు రామచంద్రారెడ్డి చాలా ఎక్కువ కాలం మా పెద్దమ్మల ఇళ్ళ వద్దే గడుపుతుండే వాళ్ళము.

ఇక శలవులకు మావూరు వెళ్ళినప్పుడల్లా మా పొలం వెళ్ళి యితర వ్యవసాయ కూలీలతో పాటు కలిసి చేలోపని చేస్తుండేవాణ్ని. అప్పుడు పొలానికి మా అమ్మ అన్నం పంపించేది. నాకొక్కడికే ప్రత్యేకం. మిగతా పనివాళ్ళందరికీ ఒక రకం. నేను మా అమ్మతో తగువు వేసుకునేవాణ్ణి. "నాకు పంపినట్లే వాళ్ళకు కూడా పంపు. లేదా వాళ్ళతో నాకూ పంపు – అంతేగాని ఇలా తేడాగా అన్నం పంపవద్దు" అని.

నాకు మొదటి నుండి మీగడ అన్నా, మంచి పెరుగన్నా బాగా యిష్టం. అంతకన్నా జున్ను అంటే మరీ యిష్టం. శలవులలో నేను ఇంట్లో వున్నన్నాళ్ళూ పాలమీద మీగడ తీసి దాన్ని వెన్న చేసే పనేలేదు. మీగడ మాత్రం నా వంతు. అలాగే ప్రతీసారీ జున్నుపాలు దొరకవు

గదా? అందుకని పాలు విరగ్గొట్టి జున్ను లాగా చేసుకుని తినేవాణ్ని! నువ్వు వస్తేచాలు "పాలకుండ"ను బతకనివ్వవంటూ మొత్తం అన్ని పాలనూ ఎక్కడ ఉప్పో, ఏదో వేసి విరగ్గొడ్తానో అని నా కోసం ప్రత్యేకంగా మా అమ్మ ఒక గిన్నెలో పాలు విడిగా తీసేది.

ఇక నేను చేలో దిగి శరీరకష్టం చేస్తుంటే పనివాళ్ళందరూ నన్ను చూసి "వాళ్ళ నాన్న లాగానే బాగా కష్టపడి పనిచేస్తాడు. పనులన్నింటా మేటి" అనేవాళ్ళు. మామూలు వ్యవసాయ పనులన్నీ చేసేవాణ్ని! మా అన్న కూడా "బాగా అనుభవం వున్న జీతగాడు చేసినంత పనిచేస్తావు" అని నన్ను మెచ్చుకునేవాడు.

ఈ దున్నటం అదీ పెద్ద కష్టమేమీ కాదు. ఎటుగూడి నడుంవంచి "కోత" కొయ్యటం నాకు కష్టంగా వుండేది. మిగతావాళ్ళు కోసేదాంట్లో సగం కూడా కోయలేక పోయేవాణ్ని. నడుము విపరీతంగా నొప్పి పుట్టేది. పిచ్చయ్య అని మా యింట్లో ఒక జీతగాడు వుండేవాడు. ఆయన మేమెవ్వరమూ పుట్టకముందు నుండి మా యింట్లో పని చేస్తుండేవాడు. చాలా వయస్సు మీరిన తర్వాతనే 1970లో అనుకుంటా చనిపోయాడు.

ఆయన్ను అడిగాను. "ఇలా వంగికోతలు కోయడం వల్ల నాకు బాగా నడుంనొప్పిగా వుంది. మీకు నొప్పి అనిపించటం లేదా" అని, "ఎందుకు వుండదూ! మాకు నొప్పిగానే వుంటుంది. కాకపోతే కొత్త గనుక నీకు కాస్త ఎక్కువగా ఉంటుంది. మేమయితే తప్పదు కదా, సర్దుకుపోతాము అంతే తేడా!' అని యెంతో ఆపాయ్యంగా చెప్పేవాడు. పిచ్చయ్య విషయంలో మాత్రం యింటిల్లపాది ఒక పెద్దమనిషిని సలహా అడిగినట్లు అడిగేవాళ్ళు.

ఒకరోజున చేలో దున్నుతున్నాను. నాగటి ఎద్దులో ఒకటి బాగా పొగరుమోతుగా అందర్నీ పొడుస్తుండేది. దానికి ముకుతాడు వేశారు. అది నాగలి విడిపించుకుని పొడవటానికి మీదకు వచ్చింది. నాకేం చెయ్యాలో తోచలేదు. దాని కొమ్ములు పట్టుకుని ఆపేందుకు ప్రయత్నిస్తున్నాను. అది ఇంకా పొగరుగా నన్ను నెట్టేస్తున్నది. ఇదంతా గమనిస్తున్న మిగతా కూలీలు – "దాని ముక్కుతాడు పట్టుకు లాగమని" కేకలేస్తున్నారు. ముక్కుతాడు లాగాను. దానికి విపరీతమైన నొప్పి పుట్టింది. అప్పుడు దారిలోకి వచ్చింది.

పొలంలో పనిచేసే కూలీలందరూ, నేను చాలా ధైర్యవంతుణ్ణన్ని, రెండు కొమ్ములు పట్టుకుని పోట్లగిత్తను నిలవరించగలిగానని చెప్పుకోసాగారు. నేనే కాదు ముక్కుతాడు పట్టుకుని నిలవరించాలని తెలియకపోతే తన్నుతాను రక్షించుకునేందుకు యెవడైనా నా మాదిరే తంటాలు పడేవాడు.

ఆరుగంటలు, ఎనిమిదిగంటలు యిలా పొలంలో పనిచేసేటప్పుడు ఒకే పనిచేసే బదులు మార్పుకోసం కావిడిమోసేవాణ్ని, ఎవరో ఒకరు ఇంటికి వెళ్ళి కూలీలందరికి తిండి



తీసుకురావాలి! ఒక రెండుమూడు గంటలు కోతపని అయిన తర్వాత ఇంటికి వెళ్ళి కావడిలో అన్నంతెచ్చే పని నేను తీసుకునేవాణ్ని. కావడి మొయ్యటం చాలా కష్టం అని కొందరనుకునేవారు. "మీరెందుకండి కావడి మొయ్యటం" అనే వారు, వాళ్ళకేం తెలుసు, నాట్లు వెయ్యాలన్నా వంగి వెయ్యాలి! కోతలు కొయ్యాలన్నా వంగి చెయ్యాలి. ఇలా వంగటం, లేవటం నా వరకూ నాకు చాలా బాధాకరంగా వుండేది. దానితో పోలిస్తే ఇటు ఇరవై కిలోలు, అటు ఇరవై కిలోలు బరువు పెట్టుకుని కావడి మొయ్యటమే తేలిక! మొదట్లో కొంచం కష్టంగా వుంటుంది. గానీ, అలవాటయితే చాలా తేలిక!

అందుకనే, నాట్ల తరుణంలో కూడా కావడిలో నారు తీసుకుని నాట్లు వేసే వాళ్ళకు అందించే పని నేను తీసుకునేవాణ్ని.

# గ్రామంలో కృషి - కూలీల సంఘం

1927లో అనుకుంటాను. మా ఊళ్ళో వ్యవసాయ కార్మికులు సమ్మెజేశారు. పనిలోకి యెవ్వరూ రాలేదు. ఇంట్లో పనిచేసేవాళ్ళు కూడా రాలేదు. పశువులకు మేత లేదు – వాటికి నీళ్ళు లేవు. పశువులను విడిచేవాడు లేడు. కొష్టాలు శుభ్రం చేసేవాళ్ళు లేరు. భూస్వాముల కుటుంబాలు నానా యిబ్బంది పడుతున్నాయి. ఆ సమ్మె నిర్వహణలో నాకేమీ అప్పుడు ప్రమేయం లేదుగానీ, వాళ్ళ ఇళ్ళకు వెళ్ళి చూసివచ్చేవాణ్ని గనుక, వాళ్ళ దారిద్ర్యం గూర్చి తెలుసు. అందుకని వాళ్ళ కోర్కెలపట్ల సానుభూతే వుండేది.

అయితే ఇంట్లోకి మంచినీళ్ళు తీసుకురావలసి ఇంకా కొంతమందితో కలసి దూరం నుంచి నీళ్ళు తెచ్చేందుకు వెళ్ళాను. అక్కడ చెరువులో దిగాము.

నీళ్ళలో ఒకళ్ళ నొకళ్ళు అంటుకునే ఆట ఆడుకుంటున్నాము. ఆ ఆట మైకంలో నాకు అందనంత లోతుకుపోయాను. అక్కడొక చిన్న సుడిగుండం వుంది. నాకు ఈతరాదు. దాదాపు మునిగిపోయినంత పనైంది. ఇంకో గొడ్లకాపరి వచ్చి రక్షించాడు గనుక సరిపోయింది.

ఇక అప్పుడనుకున్నాను. ఏమైనా ఈత నేర్చుకోవాలని, అలాగే ఆ తరువాత ఈత నేర్చుకున్నాను. ఇప్పుడైతే అనారోగ్యంగా వున్నాను గానీ, లేకుంటే నేను మామూలుగా మంచి ఈతగాణ్ననే చెప్పవచ్చు.

ఇక్కడొక విషయం కూడా చెప్పదలచుకున్నాను. పల్లెటూళ్ళలో అందరి విషయాలు అందరికీ తెలుస్తాయి. నేను చేలకు వెళ్ళేటప్పుడు లేదా మా ప్రక్క వూళ్ళు వెళ్ళేటప్పుడు నాతోపాటు మా వద్ద పనిచేసే వ్యవసాయ కార్మికులు వెంటవస్తూ ఏవో సంగతులు చెప్తూ – స్త్రీ పురుష సంబంధాలు కూడా చెప్పేవారు. తమకు ఏ స్త్రీలతో సంబంధం వుందీ యిలాంటివన్నీ అతిశయోక్తులు జేర్చి కూడా చెప్పేవారు. అలాగే భూస్వాములు బలవంతంగా తమవద్ద పనిచేసే స్త్రీ కూలీలను యెలా లొంగదీసుకునేదీ, లేదా బలవంతం లేకపోయినా వీళ్ళే ఒకోసారి యెలా అంగీకరించేదీ, భూస్వాముల కుటుంబాలలో స్త్రీలు కూడా తమ పాలేర్లతో కొన్ని సందర్భాలలో ఎలా సంబంధాలు పెట్టుకునేదీ – యివన్నీ చెప్పేవాళ్ళు.

ఇవన్నీ నాకు మొదట్లో వింతగా అన్పించేవి. మనుషులు యెందుకిలా ప్రవర్తిస్తారు. అని ఆలోచించేవాణ్ణి.



అయితే ఈ రకమైన వ్యవహారాలు మనకు తెలిసినదానికన్నా చాలా విస్తృత పరిధిలోనే వున్నాయని కూడా అర్థమయింది. ఇలా చెప్పుంటే నేను వాళ్ళని కోప్పడేవాణ్ని కాదు. అయినా ఈ వ్యవహారాలను పూర్తిగా ఆపలేకపోయినా, కనీసం సంస్కరించాలి అని భావించేవాణ్ని.

నా ఉద్దేశంలో "లైంగిక వాంఛ" అన్నది బలమైన అంశం. ఎవరన్నా పొరపాటున ఏదన్నా చేస్తే –వాడిలా చేశాడు అని పెద్ద గోల చేయనవసరం లేదు. ఈ విషయాల్ని భరించలేనట్లుగా తయారయితే తప్ప – వాటిపై రాద్ధాంతం చేయడం అనవసరం అన్న నిర్ణయానికి నేను వచ్చాను. కానీ అప్పుడూ ఇప్పుడూ కూడా బలవంతంగా, బెదిరించి ఎవరైనా ఎవరినైనా అనుభవించడానికి ప్రయత్నించారని వింటే నాకు తగని కోపం వస్తుంది.

మా బంధువుల స్త్రీలు ఈ కూలీ స్త్రీలను – అసలు మనుషులుగా చూడకుండా అవమానపర్చే పద్ధతులను చూస్తుంటే నాకు అసహ్యంగా వుండేది. స్త్రీల హక్కుల కోసం, సమానత్వం కోసం పోరాడాలి అన్న నిశ్చయానికి వచ్చాను. అయితే అప్పటికే భారత స్త్రీలలో అత్యంత వున్నతుల జీవిత చరిత్రలు చదివి వున్నాను. ఉదాహరణకు బండారు అచ్చమాంబ రాసిన "అబలా సుచరిత్ర రత్నమాలా" పుస్తకం చదివాను. ఇప్పుడది దొరకడం లేదు.

బండారు అచ్చమాంబ అంటే కొమర్రాజు లక్ష్మణరావు గారి చెల్లెలు. ఆ కుటుంబమే చాలా గొప్ప కుటుంబం. చాలా పేరు ప్రఖ్యాతులున్న కుటుంబం. కొమర్రాజు లక్ష్మణరావు సైన్సు మీద, చరిత్ర మీద తెలుగులో చాలా పుస్తకాలు ముద్రించారు.

స్త్రీలకు వివాహానికి సంబంధించి తగిన స్వేచ్ఛ వుండాలని వాదించేవాణ్ణి. మా బంధువుల అమ్మాయికి ఒకరికి దగ్గరుండి వర్ణాంతర వివాహం జరిపించాను. ఆ విషయం తర్వాత చెప్తాను. ఇప్పుడు 1932లో వున్నాము. 1935–36 సమయానికి వచ్చేసరికి వివాహం, నైతిక ప్రవర్తన వీటిపై చాలా పుస్తకాలే చదివాను. పేరు "ఎల్విన్‌కే" అనుకుంటాను ఇక స్వీడిష్ రచయిత్రి "వివాహంలో నైతిక విధులు" అన్న పుస్తకం రాసింది. ఆ పుస్తకాన్ని అనువాదం చేయించి ముద్రణ చేయించిన గుర్తుకూడా వుంది. ఏమైనా స్త్రీ – పురుష సమానత్వం కొరకు పోరాటంలో ముందుండేవాణ్ణి అని చెప్పవచ్చు.

సరే! అమీర్ హైదర్‌ఖాన్ తదితరులు అరెస్టయిన తర్వాత మద్రాసు వెళ్ళి ప్రయోజనం లేదని గ్రహించి, మా ఊళ్ళోనే వుండి బహుముఖ సంఘసేవా కార్యక్రమాలు నిర్వహిద్దామని నిశ్చయానికి వచ్చానని చెప్పాను కదా! అలా నిర్ణయం తీసుకోకపోయినట్లయితే 1934 మధ్య వరకూ మా ఊళ్ళో నేను చేపట్టిన సంఘసేవా కార్యక్రమాలు చేసి వుండేవాణ్ణి కాదు. అంతేగాక ఆంధ్ర అంతా తిరిగి గతంలో నాతో పరిచయం ఏర్పడిన వారందరినీ కలిసి కమ్యూనిస్టు ఉద్యమంలో కార్యకర్తలుగా వారిని తయారు చేసుకోవాలనుకున్నాను.

ఈ లోపల మా వూళ్ళో లైబ్రరీ నిర్వహించాను. ప్రాథమిక పాఠశాల నొకదాన్ని ఈ వ్యవసాయ కార్మికుల పిల్లల కోసం నేను ఉపాధ్యాయుడిగా వుండి నడిపేవాణ్ణి. అలాగే మా వూళ్ళో వర్తకులు నెల్లూరు నుండి సరుకులు తెచ్చి అధిక లాభంతో అమ్ముతుండేవారు. అందుకని నేనొక సహకార దుకాణం నడిపాను. మామూలుగా అవసరమైన చింతపండు, బెల్లం, ఉల్లిపాయలూ – యివన్నీ తెచ్చి అమ్మేవాణ్ణి.

తీరిక సమయాల్లో మా యువక బృందానికి రాజకీయ అంశాలు బోధించేవాణ్ణి. నేను రాజకీయ సాహిత్య అధ్యయనం సాగించేవాణ్ణి.

ఈ సందర్భంలోనే నెల్లూరులో వున్న జాతీయ విప్లవకారుల దళంతో సంబంధం యేర్పడింది. అందులో బలరామిరెడ్డి, నాయుడు పట్టాభిరామిరెడ్డి, చుండి జగన్నాథం వుండేవారు. ఇలాంటి వారి దేశభక్తిని, త్యాగనిరతిని, ధైర్యసాహసాలను శంకించనవసరం లేకున్నా, వారు యెంచుకున్న మార్గం మాత్రం సరైంది కాదని నచ్చచెప్పయత్నించేవాడిని. వీళ్ళేకాక స్థానికంగా ఆ ప్రాంతంలో వున్న కాంగ్రెస్ యువకులతో కూడా సంబంధాలు కొనసాగించేవాడిని.

సరే పరిణామాలు యెలా వస్తాయో వేచి చూద్దామనుకున్నాను. అందుకని మా వూళ్ళో వ్యవసాయ కార్మిక సంఘం నిర్మించటానికి ఉపక్రమించాను. 1932లో మొదటగా వ్యవసాయ కార్మిక సంఘానికి నిబంధనావళి రూపొందించాను. ఇప్పటికీ స్థూలంగా అది సజీవమైనదే అని నా అభిప్రాయం. కాకపోతే బహుముఖ కార్యక్రమాలను కూడా మరికొన్నింటిని దానిలో జేర్చాలి!

ఇక్కడ వూళ్ళో నా కార్యక్రమాలకు పూసపాడు నరసింహరాజు, కోటంరెడ్డి రమణారెడ్డి, పాలిచెర్ల శంకరయ్య, పాలిచెర్ల రమణయ్య, రామయ్య ఇంకా కొందరు చాలా సహకరించారు. వీళ్ళల్లో కొందరు యింకా వూళ్లో బడిలో చదువుతున్నారు. కొందరు నాకన్నా పెద్దవాళ్ళు కూడా!

ముందు వూళ్ళో గ్రంథాలయాన్ని పునరుద్ధరించాము. నా దగ్గర వున్న పుస్తకాలు కొన్ని నేనిచ్చాను. కొన్ని పోగుచేసి యిచ్చాను. కొన్ని కొన్నాము. "ఆంధ్రప్రతిక" దినపత్రికకు చందా కట్టాము. గ్రంథాలయం సక్రమంగా నడిచేది.

ఇక ప్రధానంగా వ్యవసాయ కూలీ బిడ్డల కోసం ప్రాథమిక పాఠశాల నొకదాన్ని తెరిచాము. సాధారణంగా మా బృందంలో మిగతావాళ్ళు ఆ పాఠశాలలో పంతుళ్ళుగా వ్యవహరించేవారు. నేను అప్పుడప్పుడు అక్కడ పాఠాలు చెప్పినా, నా ముఖ్యమైన కర్తవ్యం రాత్రి పాఠశాల నడపడం.

ప్రతి ఉదయం ప్రాథమిక చికిత్సా కేంద్రం నడిపేవాణ్ణి. మా బంధువు ఒకతను డా॥ దశరథరామిరెడ్డి ఉన్నాడని చెప్పాను గదా! ఆయన అప్పటికి ఇంకా చివరి సంవత్సరం ఎం.బి.బి.ఎస్. పూర్తి చెయ్యలేదు. ఆయన్ను అడిగి మామూలుగా వచ్చే జబ్బులు నయం అయ్యేందుకు మందులు అడిగి తెలుసుకున్నాను. మొత్తం ఒక పదికరాల ముందులు, సెలిసిలిక్ యాసిడ్, క్వినైన్ అలాగే మెర్క్యురిక్ రెడాక్సైడ్, ప్లాస్టరు – ఇలాంటివి నా వద్ద ఉండేవి. రోజూ సుమారు 50 లేక 60 మంది నా వద్దకు "వైద్యాని" కి వచ్చేవాళ్ళు. ఊళ్ళో వున్న "మంగలి"తప్ప ప్రత్యేకించి వైద్యుడు లేడు. ఈ మాత్రం ప్రథమచికిత్స కూడా ఆ చుట్టుపట్ల లభించేది కాదు. అతి దగ్గరలో ఉన్న గ్రామీణ వైద్యశాల కూడా 5 కిలోమీటర్ల దూరంలో విడవలూరులో వుండేది. అక్కడెవరో నాటువైద్యుడు వుండేవాడు. అప్పటి అధునాతన వైద్యం, గాయాలు చీముపట్టకుండా పరిశుభ్రం చేసే విధానం అదీ ఆయనకు తెలిసేదీ కాదు.



నా ప్రాథమిక చికిత్సా కేంద్రంలో నా మందులనే ఉచితంగా ఇచ్చేవాడిని. ఎవరన్నా గాయపడి వస్తే – ముందు శుభ్రంగా గాయాన్ని తుడిచి, ఆ తర్వాత అయింట్‌మెంట్ వేసి కట్టుకట్టేవాణ్ణి. నొప్పి తగ్గేందుకు సెలిసిలిక్ యాసిడ్ ఉండనే వుంది. చాలా వరకూ సహజంగా ఈ గాయాలు తగిలినవాళ్ళు ఆరోగ్యవంతులు గనుక, గాయాలు నయమవుతూనే వుండేవి.

ఒక సంఘటన మాత్రం మర్చిపోలేను. ఒకరోజు ఒక స్త్రీ వచ్చింది. అంత దూరానికే 'చీము' వాసన కొడుతున్నది. రొమ్ము మీద గడ్డ అయింది. కట్టు విప్పదీసి చూశాను. లోపల చాలా పొడవాటి గుడ్డపెట్టి ఉంది. మెల్లగా తీసేశాను. ఆమెతో చెప్పాను. "చూడమ్మా! ఇది నేను చేయగల వైద్యం కాదు. జాగ్రత్తగా బాగా తెలిసిన డాక్టర్లతో వైద్యం చేయించుకోవాలి" అని. కానీ ఆమె వినలేదు. "నువ్వే తగ్గించాలి! నీ "హస్తవాసి" మంచిది నేనింకో చోటికి వెళ్ళను" అని మొండికేసింది. "నావల్ల కాదు. నేను నిన్ను నెల్లూరు పంపుతాను. నీ దగ్గర నెల్లూరులో వైద్యం చేయించుకునేందుకు పైసలు లేకపోతే నేను ఖర్చు భరిస్తాను" అని నచ్చజెప్పజూశాను. నాకు అప్పటికే మంచి పేరు ఉంది. నేనేదన్నా కేసు ఏ డాక్టరు వద్దకు పంపినా జాగ్రత్తగా చూసేవారు. మరీ తప్పనిసరి అయితే తప్ప పెద్దగా ఫీజు తీసుకునేవారు కాదు. ఆ ధైర్యంతోనే చెప్పాను. నెల్లూరు సంగతి తర్వాత! ముందు నీ వైద్యం నువ్వు చెయ్యమని కూర్చుంది. "ఇప్పుడు పుండులో గుడ్డ అంతా లాగేశాను కదా! అది కూడా మళ్ళీ నేను లోపలికి నెట్టి కట్టుకట్టలేను. ఇదుగో! అందుకని పైపైనే శుభ్రం చేసి గుడ్డ కడుతున్నాను" అని చెప్పి పైపైనే శుభ్రం చేసి అయింట్‌మెంట్ రాసి ప్లాస్టరు అంటించాను. మొత్తం యెట్లా అయితేనేం నచ్చజెప్పి నెల్లూరు పంపగలిగాను.

వచ్చిన రోగుల కష్టసుఖాలు విని చాలా తక్కువే అయినా చెయ్యగలిగిందేదో జాగ్రత్తగా చేసి, వచ్చిన వారిని ఆదరంగా చూసినందుకే నాకు మా ఊళ్ళోనే గాక ఆ చుట్టుపట్ల కూడా మంచిపేరు వచ్చింది. అప్పటికే నాకు కమ్యూనిస్టుగా గుర్తింపు ఉంది. ఫలానా సుందరయ్య యువకుడు. గట్టి గాంధీ అనుయాయి. కమ్యూనిస్టు – ఇలా వాళ్ళ ఊళ్ళోను చుట్టు ప్రక్కల రకరకాల ప్రజాహిత కార్యక్రమాలు చేస్తున్నాడు అని చెప్పుకునేవారు. మరీ ముఖ్యంగా చదువూ సంధ్యాలేని పామరజనం నన్నెక్కువగా అభిమానించేవారు.

ఇక నా సహకార దుకాణం సంగతి. ప్రతి వ్యవసాయ కూలీ కుటుంబం వద్దకు వెళ్ళాను. "మీరు ఈ సహకార దుకాణంలో జేరండి. ఒక్కరోజు వేతనం పెట్టుబడి పెట్టండి. అలా పెట్టుబడి పోగేసి, మన నిత్యావసర వస్తువుల దుకాణం మనమే నడుపుకుందాం. ఇప్పుడు పెడ్తున్న ధరలకన్నా చవకగా వస్తాయి" అని చెప్పాను. ఐదువందల రూపాయల పెట్టుబడి పోగయింది. నేనొక ఐదువందలు తోడువేశాను. వెయ్యి రూపాయలతో దుకాణం ఆరంభించాను.

"లాభం నష్టం" లేని పద్ధతి మీద దుకాణం సాగించాను. సహకార సంఘంలో పెట్టుబడి పెట్టినవారికి, మిగతా వారికన్నా కొంచెం చౌకగా సరుకుల నిచ్చేవాణ్ణి. ఊళ్ళో వ్యాపారస్థులు పేదలను మరీ దోచుకునేవారు. ధనవంతుల విషయంలో కొంచెం జాగ్రత్తగా వుండేవారు. పేదవారయితే వాళ్ళిచ్చిన ధాన్యానికి తక్కువ వెలకట్టేవాళ్ళు. తప్పుడు తూకాలు తూచేవాళ్ళు. పైగా ధర బాగా ఎక్కువ తీసుకునేవారు.

అందువల్ల అనతికాలంలోనే నా దుకాణం ప్రసిద్ధికెక్కింది. "సుందరయ్య దుకాణంలో ధరలు చౌక, మోసం వుండదు" అని ప్రచారమై, పొరుగూరి వాళ్ళు కూడా నా దుకాణానికి వచ్చేవారు. అదీగాక, నేను నెల్లూరు సైకిల్‌మీద వెళ్ళి సరుకులు తెచ్చుకునేవాణ్ణి. జీతమిచ్చి ఎవర్నీ ఉద్యోగంలో పెట్టుకోలేదు. కిరసనాయులు డబ్బాలు అవీ బస్సులో వేసుకొచ్చి, బస్సు నుంచి వూళ్ళోకి రెండు మైళ్ళు కావడిలో వేసుకువచ్చేవాణ్ణి. అందువల్ల మోత కూలీ, లగేజీ వంటి పైపై ఖర్చులు వుండేవి కావు.

పైగా ఆ వ్యాపారస్తులయితే వ్యాపారం మీదే బతకాలి! నాకు వేరే బ్రతుకు తెరువు మార్గం వుంది కదా! ఆ వ్యాపారస్తులు వచ్చి నాతో తమ ఇబ్బందులు చెప్పుకునేవారు. "ఈ కూలీలు కూడా తక్కువ వాళ్ళు కాదు. గడ్డీ - గాదం, రాయి - రప్పా జేర్చిన ధాన్యం ఇచ్చి సరుకులివ్వమంటారు. తీరా చెరిగితే సగం కూడా వుండవు" అని చెప్పేవాళ్ళు. "నన్ను వాళ్ళు అలా మోసం చేయడం లేదే! అన్నీ శుభ్రంగా ఇంటివద్దే చెరిగి ఖచ్చితంగా తెస్తారు. మీరు వాళ్ళని మోసం చేస్తున్నారు గనుక మిమ్మల్ని మోసం చేసినా తప్పులేదని కూలీలనుకుంటున్నారు. నిజానికి వాళ్ళకు మోసం చేయడం కూడా చేతకాదు. మీరు నాలాగే, ఖచ్చితంగా వాళ్ళిచ్చిన ధాన్యానికి ధరకట్టి, సరైన తూకం తూసి, సరసమైన ధరకు ఇవ్వండి" అని చెప్పేవాణ్ణి!

"ఇలా అయితే వ్యాపారం చేసినట్లే" అని "నీ దుకాణంలో మమ్మల్ని గుమస్తాలుగా పెట్టుకో, అని అనేవాళ్ళు. వాళ్ళు తమాషాగా అంటే, నేనూ తమాషా గానే చెప్పేవాణ్ని. "నావద్ద మీరు పనిచేస్తే మీకు జీతాలివ్వాలి! అందువల్ల మళ్ళీ సరుకుధర పెంచాల్సివస్తుంది" అనేవాణ్ని. "అదీగాక మీరు నాతో జేరితే, కొన్ని రోజులు నడిపినట్లు చేసి, నా దుకాణం మూతపడేట్లు చేస్తారు" అని కూడా వాళ్ళతో చెప్పేవాణ్ని.

మా బంధువు వీరారెడ్డి వుండేవాడు కదా! ఒకసారి మా వూరు వచ్చి నేను చేస్తున్నదంతా చూశాడు. 'చక్కగా చదువు సాగించినట్టయితే నీకు పెద్ద హోదా గల వుద్యోగం వచ్చేది. ఇదేంపని' అనేవాడు. "ఆ వుద్యోగం, సద్యోగం నాకక్కరలేదు. నా తోటి ప్రజలకు తోడ్పడుతున్నాను. ఇంతకన్నా హుందా ఏమిటి? అని బదులిచ్చేవాడిని: ప్రజలు కలసికట్టుగా నిలబడితే, సమాజం సంపూర్ణంగా మారే వరకూ వేచి వుండకుండానే, కొంత వరకూ సాధించుకోగలం అని ప్రజలకు తెలియజెప్పడమే ఈ సహకార దుకాణం నడపడంలో నా వుద్దేశం.

ఈ సమస్యలన్నింటిలో నాకు మా యువక బృందం చాలా తోడ్పడేది. తప్పుడు కొలతల విషయం వచ్చింది గనుక చెప్తున్నాను. మా ఇంట్లో నేను పోరుపెట్టి 'పిచ్చ మానికలు' తొలగింప చేశాను. ఆ తర్వాత తప్పుడు కొలతలకు వ్యతిరేకంగా వుద్యమమే సాగింది. క్రమేపీ తప్పుడు కొలతలు పోయాయి.

ఇక మా గ్రంథాలయం సంగతి : చాలా బాగా మా లైబ్రరీ నడిచిందనే చెప్పాలి. ఇదివరకు వూళ్ళో కొంతమంది యువకులు మధ్యాహ్నం పూట, పొలం పని లేని రోజుల్లో పేకాట, పులిజూదం... వీటితో కాలం వృధా చేసేవారు. ఇప్పుడలా కాదు. గ్రంథాలయానికి రావడం వారికి అలవాటయింది. దగ్గర గ్రామస్తులు కూడా వచ్చి చదువుకునేవారు.



రాత్రి పాఠశాల విషయం : పగలల్లా కాయకష్టం చేసి వచ్చిన వాళ్ళకు రాత్రిళ్ళు చదువు చెబుతాం నేర్చుకోండి అంటే అంత తేలిక కాదు. చాలా తక్కువ మందే ఈ వయోజన పాఠశాలకు వచ్చేవారు. పరిస్థితులు మారితే తప్ప ఈ విధంగా నడిపే వయోజన పాఠశాలలు సాగవు. వాళ్ళు అక్షరాలు నేర్చుకునేదానికన్నా ప్రధానంగా అక్కడ చాలా అంశాలు చర్చించేవాళ్ళం. పత్రికలు చదివి వినిపించే వాళ్ళం. వాళ్ళల్లో కొంత వికాసానికి ఈ చర్చలు, అవీ ఉపయోగపడేవి. అలాగే మహాత్మాగాంధీ, బాలగంగాధరతిలక్ వీళ్ళను గూర్చి చెప్పేవాళ్ళం. భగత్‌సింగ్, ఆయన అనుచరుల వీరగాథలు, రష్యా విప్లవం, సోషలిస్టు సమాజం - వీటిగూర్చి మాకు తెలిసింది వాళ్ళకు చెప్పేవాళ్ళం. ఇవి నిజంగానే వుపకరించాయి.

యువజన సంఘం అంటూ ప్రత్యేకంగా ఏర్పాటు చేయలేదు గానీ, మా యువకబృందం అలా "యూత్ లీగ్" లా పని చేసేది.

వ్యవసాయ కార్మికసంఘ నిర్మాణం పెద్ద కష్టం అన్పించేదికాదు. ఒక గోనె సంచి భుజాన వేసుకుని ముగ్గురు, నల్గురు దళంగా వ్యవసాయ కార్మిక కుటుంబాలన్నింటికీ తిరిగేవాళ్ళం. "వ్యవసాయ కార్మిక సంఘంలో జేరండి" "సహకార సంఘ దుకాణంలో సభ్యులుగా జేరండి" అనీ ఎందుకు జేరాలో కూడా వివరించేవారం. దాదాపు ప్రతి కుటుంబంలోనూ జేరారు. ముఖ్యంగా హరిజనులు ముందుకొచ్చి ఎక్కువ సంఖ్యలో జేరారు. వాళ్ళల్లో చెప్పులు కుట్టేవాళ్ళు కూడా ఒక్క కుటుంబం బీరుపోకుండా అందరూ జేరారు.

పద్మసాలీలు మాత్రం గ్రామ కక్షలవల్ల, గ్రామంలో వ్యవసాయ కూలీలు అందరూ కలిసివున్న ఈ సంఘంలో జేరలేదు. అయినా మా పట్ల గౌరవం, అభిమానం కలిగి వుండేవారు. నేను గనుక అక్కడ రంగంలో వుంటే తిట్టుకోవడం, కొట్టుకోవడం చేసేవారు కాదు. నేను ఈ రెడ్ల రైతులతో "యెందుకీ తగాదాలు అందరం ఒక ఊళ్ళోవాళ్ళం. ఒకచోట వుండాల్సిన వాళ్ళం - తగాదాలను సర్దుబాటు చేసుకోరాదా" అని అంటుండేవాణ్ని.

అలాగే చిన్న రైతులు వచ్చి, భూస్వాములు వూరి చెరువుగట్టుపైన తమ పశువుల్ని మేయనివ్వడం లేదనీ, తమ చేలల్లోకి సరిగా నీరు పారనివ్వడం లేదనీ తమ కష్టాలు చెప్పుకునేవారు. కలాసీ మొదలు ఇంజనీర్ వరకూ గల ఉద్యోగులకు లంచాలిచ్చి పై వ్యవహారాలన్నింటినీ తమకనుకూలంగా భూస్వాములు మార్చుకోగలిగే వారు. కొన్ని సందర్భాలలో నేను జోక్యం చేసుకొని "ఇదేమి పద్ధతి" అని నలుగురిలో బిగ్గరగా మందలించేవాణ్ని! అంత మాత్రానే అన్ని వేళల్లో సమస్య పరిష్కారమయ్యేది కాదు.

కానీ నేనన్నా మా యువజన బృందం అన్నా ఈ విధంగా వివిధ రకాల ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టినందువల్ల గ్రామంలో, చుట్టుపట్ల మంచి ఆదరణ, విశ్వాసం ఏర్పడ్డాయి.

1932 కాంగ్రెస్ వుద్యమంలో జేరవద్దని నిర్ణయించుకున్నాను. నాకు పరిచయాలున్న కాంగ్రెస్ వాదులను కలుసుకుని, "ఈ జైళ్ళు నింపే కార్యక్రమంవల్ల ఏమీ ప్రయోజనం లేదు. గాంధీగారి మార్గం స్వాతంత్ర్య సముపార్జనలకు సరైన మార్గం అని అనుకోవడం లేదు" అని

చెప్పి "మీరు కూడా మా గ్రామంలో మాదిరిగా ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టండి. వ్యవసాయ కూలీలాంటి సంఘాలు నిర్మించండి" అని సలహా ఇచ్చేవాణ్ని.

అయితే, నేను కొంచెం ఆలస్యంగా నిర్ణయం తీసుకోవడం వల్ల ముందుగానే నా మిత్రులందర్నీ కలవలేకపోయాను. కొందరు అప్పటికే జైళ్ళకు వెళ్ళారు. కొందరు మాత్రం నా వాదనతో వారి అనుభవాన్ని జత చేసుకుని ఆ కార్యక్రమంలో పాల్గొనలేదు. మా రెండవ బావగారి దగ్గర బంధువు ఏటుకూరి బలరామిరెడ్డి అని ఒకతను వుండేవాడు. ఆయన పురోగామి దృక్పథం కలవాడు. 1930 లో నేను పశ్చిమగోదావరి జిల్లాలో అరెస్టయి జైలుకు వెళ్తే ఈయన నెల్లూరులో అరెస్టయి జైలుకు వచ్చాడు. అలాగే నాయుడు పట్టాభిరామిరెడ్డి కూడా! నిన్నా, మొన్న ఏవో పాత "ఫైళ్ళు" తిరిగేస్తుంటే ఆ బాంబు కేసులో ఈయన కూడా వున్నట్లుంది. మంచి ధైర్యవంతుడు. రైతులలో పలుకుబడి గలవాడు. ఈ తర్వాత, ఏదో స్త్రీ సంబంధమైన వ్యవహారంలో ఈయనకు అక్రమ సంబంధం వుందని అనుమానించి ఆమె తరపువారు హత్య చేశారు. నిజానిజాలు నాకూ తెలియవు. చుండి జగన్నాథం చదువు ముగించుకుని వచ్చాడు. స్వాతంత్రోద్యమంలో జేరేందుకు సిద్ధంగా ఉన్నాడు.

వాళ్ళతో మాట్లాడాను. మొదట్లో నేను చెప్పినట్లు తమ తమ గ్రామాల్లో మా గ్రామంలో మాదిరే నిర్మాణాత్మక ప్రజాహిత చర్యలు చేపట్టగలమని చెప్పారు. ఆ తర్వాత వారి ధోరణి అలాలేదు. "బాంబులతో దాడి చెయ్యాలి! బ్యాంకులు లూటీ చెయ్యాలి! ప్రజలు అసహ్యించుకునే వారి పని పట్టాలి - ఈ రకంగా జాతీయ విప్లవకారులవలే చర్యలకు పూనుకోవాలి" అని నాకు నచ్చజెప్పబోయారు. పైపైచ్చు "నీకు అనుచరబృందం చాలా వుంది. మీరంతా యీ చర్యలకు దిగండి - దానికి అవసరమైన పైకం సమకూర్చే పూచీమాది" అని నన్ను ఒప్పించబూనారు.

నేను అంగీకరించలేదు. "కొంచెం సేపు స్థిమితంగా ఆలోచించండి ఇలాంటి పనివల్ల ప్రయోజనం ఏమిటి? మీరు బాంబు విసరవచ్చు. బ్యాంకు దోపిడీ చేయవచ్చు. కాని ఎన్ని ఉదాహరణలు కావాలన్నా యిస్తాను. ఎవరో ఒకరు ఏదో చిన్న పొరపాటు వల్ల పట్టుబడతారు. అందరూ అరెస్టవుతారు. కొందరు వీర మరణం చెందవచ్చు. కానీ, మీరెంచుకున్న లక్ష్యం ఏమవుతుంది? డబ్బు కావాలంటే మీ కార్యక్రమం విశదీకరించి, ప్రజలవద్ద నుండి వసూలు చేయండి. ఒకవేళ బ్యాంకు దోపిడీ వల్ల మీరు కొంత పైకం సంపాదించినా మీ పైవుండే కేసులలో నుండి బయటపడేందుకో లేదా మరిన్ని ఆయుధాలు సంపాదించుకునేందుకో ఖర్చు చెయ్యాల్సి వస్తుంది. కనుక అదొక విషవలయం. అందులో చిక్కుకుంటారు. దానివల్ల అంతిమంగా ప్రయోజనం శూన్యం. మీకేదో తాత్కాలిక సంతృప్తి మిగులుతుంది అంతే! ఇది మార్క్స్ చెప్పిన మార్గం కాదు. కమ్యూనిజం సాధించేమార్గం అంతకన్న కాదు" అని నేను చెప్పాను. నేను చెప్పింది ఆలోచిస్తామన్నారు వాళ్ళు. నాకు మాత్రం వారు మాటలతో మారిపోతారన్న నమ్మకంలేదు. అదే విషయం చెప్పు, మరోసారి ఆలోచించండని, వాళ్ళది యెలా పొరపాటు మార్గమో మళ్ళీ ఒకసారి చెప్పాను. వాళ్ళు తమ కార్యక్రమాలు కొనసాగిస్తూనే వున్నారని కూడా నాకు తెలుసు. అంతేకాదు, నాతో వుంటున్న యువజనబృందంలో కూడా



కొందరిని తమవైపుకు మళ్ళించుకోవాలని యత్నించారు. కాని వీరిపై నా ప్రభావం యెక్కువగా ఉంది. కనుక ఆప్రయత్నాలు ఫలించలేదు.

అనుకున్నంతా అయింది. ఒకరోజు వాళ్ళు నా దగ్గరకు వచ్చారు. కాపిరాల శంకరయ్య కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారనీ, కనుక రక్షణ యివ్వమనీ నన్ను కోరారు. నా వద్దవుంటే ఎవరికీ అనుమానం రాదనీ, ఎందుకంటే యిలాంటి వారిని దాచేపని నేను చేపడ్తానని యెవరూ నమ్మరని నన్ను అడిగారు. "అది సాధ్యం కాదు. ఈ రోజుకాకున్నా త్వరలోనే తెలిసిపోతుంది. అది ఊళ్ళో ఒక కాలక్షేపం చర్చ అవుతుంది. నేను నిర్వహిస్తున్న కార్యకలాపాలకు కూడా అంతరాయం అవుతుంది. కనుక అది మంచి పద్ధతి కాదు. కావాలంటే, మైపాడులో బలరామిరెడ్డి దగ్గరకు జేరుస్తాను. అక్కడనుండి మీ ఏర్పాట్లు మీరు చేసుకోండి. అక్కడేవుండి అతణ్ని, అతనికి సానుభూతి వుండేవాళ్ళను చిక్కుల్లో పెట్టవద్దు" అని చెప్పాను. వాళ్ళు సరేనని ఆ శంకరయ్యను నాకప్పగించారు. అతనికి సైకిలు తొక్కటం రాదు. అందుకని నా సైకిలు పై కూర్చుండ బెట్టుకుని, 30 మైళ్ళు సైకిలు తొక్కుకుంటూ వెళ్ళి ఏటుకూరి బలరామిరెడ్డి యింటివద్ద వదలిపెట్టి వచ్చాను.

రెండు రోజుల్లో ఆ కేసులో వున్న వాళ్ళిద్దరూ అరెస్టయినట్లుగా పత్రికల్లో చూశాను. ఆ తర్వాత చుండి జగన్నాథంతో "చూశావా ఏం జరిగిందో! ఉద్యమానికి ఉపయోగపడే బదులు మీరు అంతా జైల్లో కూర్చున్నారు. ఇప్పుడైనా ఇది విధానం కాదన్నది గ్రహించండి" అని చెప్పాను.

ఈ రోజుల్లో మద్రాసులో "గూటీ" బాంబు కేసు జరిగింది. ఒక జాతీయ విప్లవకారుని వద్ద "బాంబు"లు తీసుకున్నారు. ఆ బాంబులు తీసుకువస్తుంటే బర్మాషెల్ వద్ద పరుగెత్తుతూ పడిపోగా బాంబులు పేలాయి. కొందరక్కడే మరణించారు. మిగతావాళ్ళు గాయపడ్డారు. ప్రకాశం పంతులుగారు ఆ కేసులో ముద్దాయిల తరపున వాదించారు. అయినా వాళ్ళకు రెండేళ్ళు చొప్పున శిక్షపడింది. ఈ జాతీయ విప్లవకారులతో నా సంబంధాలిలా వుండేవి

1933లో గాంధీజీ ఉద్యమం నిలిపివేశారు. మా ఊళ్ళో వుండి నా కార్యక్రమాలు కొనసాగిస్తున్నాను. నా పరిచయస్తులలో చాలా మంది జైళ్ళలో వున్నారు. బయటవున్నవారు బహుకొద్దిమంది. వాళ్ళు జైలు నుండి రాగానే వెళ్ళి కలుసుకొని చర్చించేవాణ్ని. మా ఊళ్ళో చేపట్టిన కార్యక్రమాలు వాళ్ళని కూడా చేపట్టమనీ, సమన్వయం చేసుకుందామని వాళ్ళకు చెప్పేవాణ్ణి.

ఈ విధంగా పాత పరిచయస్తులతో సంబంధాలు పెట్టుకోవడం, వారికి పుస్తకాలిచ్చి చదవమనడం, నేనూ నా పని విధానాన్ని పెంచుకోవడంతో పాటు మా ఊళ్ళో కార్యక్రమాలు కొనసాగిస్తూ ఉండేవాడిని.

# కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం

ఈ రోజుల్లోనే మా ఊళ్ళో యువజనబృందం కోసం నేను "కమ్యూనిస్టు మానిఫెస్టో" అనువదించాను. అలాగే "రాజ్యాంగ యంత్రమూ, విప్లవము" కూడా తెనిగించాను. "అతివాద కమ్యూనిజం ఒక బాలారిష్టం" కూడా తెనుగించేందుకు ప్రయత్నించిన గుర్తు. వాటిని కామ్రేడ్ ప్రసాదరావు టైపు కూడా చేసిన గుర్తు.

మీరట్ కేసులో వాళ్ళ సంయుక్త ప్రకటన. యితర ప్రకటనలూ, వచ్చాయి. అయితే 1935 దాకా నేనుగా మీరట్ ప్రకటన పూర్తి పాఠం చదవడం కుదరలేదు. అయినా నేను చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం కార్యకలాపాల వల్ల నేను "అస్పృశ్యత"కు బద్ధవ్యతిరేకిననీ, కమ్యూనిస్టుననీ పెద్ద ప్రచారం జరిగింది.

అమీర్ హైదర్‌ఖాన్ అరెస్టయిన పిదప కూడా ఒక ప్రయత్నం జరిగింది. ఆయన కమ్యూనిస్టు ఉద్యమంలో శిక్షణ కోసం ఒకరిని రష్యా పంపాలని అనుకున్నాడు. వి.కె. నరిసింహన్ కూడా అరెస్టయ్యాడు. నేను గనుక అంగీకరిస్తే నన్ను పంపాలని నిశ్చయించుకున్నారు. నేను కూడా సిద్ధపడ్డాను. డబ్బు పెద్ద సమస్య కాదు. మాయింట్లో అడిగినా మా అమ్మ, మా అన్న నాకు డబ్బు యిచ్చేందుకు వెనుకాడరు. కానీ, నేను రష్యా వెళ్ళడం వాళ్ళకు యిష్టం వుండదు. ఏమవుతానో ఏమోనన్న భయం. అందుకని వాళ్ళను అడగదల్చుకోలేదు. డా. దశరథరామిరెడ్డి అని వున్నాడన్నాను కదా! ఆయన అన్నగార్ని అడిగాను "ఒక వెయ్యి రూపాయిలుంటే యివ్వండి, మళ్ళీ తిరిగి వచ్చిన తర్వాత యిస్తాను" అని. యెందుకు - ఏమిటి వివరాలన్నీ చెప్పాను. ఆయన అంగీకరించాడు.

నేను వి.కె. నర్సింహన్‌ను కలుసుకున్నాను. ఆయన బొంబాయిలో 'తత్సంబంధీకులకు' ఒక ఉత్తరం రాసిచ్చాడు. వాళ్ళు బొంబాయిలో భీమా కంపెనీలో ఉద్యోగస్తులు. అయితే వి.కె. నర్సింహన్ యేదోరాసిచ్చి జైలునుండి బయటపడ్డాడు. అయినా కమ్యూనిస్టు ఉద్యమం యెడల సానుభూతిగానే వుండేవాడు. నేను నర్సింహన్‌ను ఆయన యింటివద్దే కలుసుకున్నాను. వాళ్ళ మామగారు కూడా ఉన్నారు. నా గురించి, జైలు జీవితం గురించి, మా వూళ్ళో నా కార్యక్రమాల గురించి చాలా వివరంగా అడిగి తెలుసుకున్నారు.



నర్సింహన్ చెప్పాడో యేమో అప్పటికే ఆయనకు నా ఆరోగ్యం పట్ల క్రమశిక్షణపట్ల, సేవాభావంపట్ల సద్భావం వున్నట్లుంది. "నీలాంటి యువకులు దేశానికి అవసరం" అని నన్ను మెచ్చుకున్నారు.

వి.కె. నర్సింహన్‌కు సంబంధించి, ఆయన ప్రభుత్వానికి స్వయంగా ఇచ్చిన పూచీకత్తు అన్నది ఏదో మామూలుగా ఇచ్చిందే. అయినా ఆయన పార్టీ సంబంధాలను కొనసాగించడంలోనే వున్నాడు. ఆయన నాకు బొంబాయిలో ప్రొఫెసర్ మిశ్రాజీకి వుత్తరం రాసి ఇచ్చాడు. ఆ మిశ్రాజీ తన ఫోటో కూడా నాకు ఇచ్చారు.

నేను వుత్తరం తీసుకుని బొంబాయి వెళ్ళాను. ఈ అడ్రస్‌గల మిశ్రాజీ ఒక ఇరుకు సందులో, ఒకే గదిలో అద్దెకుంటున్నాడు. ఆయన నిజంగా ప్రొఫెసర్ అవునో కాదో అనుమానమే! శ్రామికుడల్లే వున్నాడు. బహుశా ఈ ప్రొఫెసర్ అన్నది "గోప్యంగా" వుండే నిమిత్తం పెట్టుకున్న పేరు అయివుండాలి.

అప్పటికి బొంబాయిలో "యంగ్ వర్కర్స్ లీగ్" అని ఒకటి ఏర్పడి వుంది. నేను మిశ్రాజీని కలిసి ఈ వుత్తరం ఇచ్చే సందర్భంలో, ఆయనతో "యంగ్‌వర్కర్స్‌లీగ్" విషయాలు మాట్లాడుతున్నారు. నేను కలిసింది 1932 అక్టోబరులో! అప్పటికీ జర్మనీ పరిస్థితి బాగాలేదు. "మీ రష్యా పయనానికి అవసరమైన ఏర్పాట్లు చేసి మీకు కబురు చేస్తాను. ప్రస్తుతం మీరు మీ వూరు వెళ్ళండి" అని నా అడ్రసూ అది తీసుకుని నన్ను పంపాడు. ఆ తర్వాత పరిణామాల్లో అసలు అంతర్జాతీయ సంబంధాల గొలుసు పూర్తిగా తెగిపోయింది. నేను వెళ్ళడం పడలేదు. కనుక 1932లో నా రష్యా ప్రయాణం అగిపోయింది.

మళ్ళీ మా వూళ్ళో మేము చేపట్టిన కార్యక్రమాలు కొనసాగిస్తూనే వున్నాము. 1933 -34 సంవత్సరాలలో ప్రధానంగా ఈ కార్యక్రమాలు నడిపాను.

ఈ లోపలే 1933లో హరిజన్ అవార్డు వచ్చింది. గాంధీజీ నిరాహారదీక్ష వగైరా జరిగాయి. ఆయన దేశం అంతా తిరుగుతూ, హరిజనులకై చందాలు పోగుచేస్తున్నాడు. అలాగే అవకాశం వున్న చోట్ల హరిజనుల ఆలయ ప్రవేశ కార్యక్రమం కూడా ఆయన పర్యటనలో వున్నది. ఆ సందర్భంలో ఆయన నెల్లూరు కూడా వచ్చారు. నెల్లూరు కాంగ్రెస్ అప్పటికింకా శైశవదశలోనే వుంది. భూస్వామి, జస్టిస్ పార్టీవాళ్ళు గాంధీగారి నెల్లూరు పర్యటనను విచ్ఛిన్నం చేయాలని, హరిజనుల ఆలయ ప్రవేశం లాంటివి జరగకుండా చూడాలని పట్టుదలతో వున్నారు.

అందుకని స్థానిక కాంగ్రెస్ నాయకులు నన్ను కలిసి గాంధీగారి పర్యటన ఏ గోల, గలభా లేకుండా చూడాల్సిందని కోరారు. సరే, అలాగే చేద్దాం అని నేను హామీ ఇచ్చాను. మావూరు నుంచి యువజనబృందం దళం ఒకటి నా నాయకత్వాన, కొరుటూరు నుండి గన్నవరపు హనుమారెడ్డి నాయకత్వాన మరో దళం నెల్లూరు జేరాయి. నాపై వున్న విశ్వాసం

కొద్దీ రెండు దళాలను కలిపేసి, నన్నే దళ నాయకుడుగా వుండమన్నారు. ఈ దళంలో కాంగ్రెస్ వారు, కమ్యూనిస్టులు అందరూ వివిధ దశల్లో వున్నారు.

సరే, నేను ఒక పద్ధతి ప్రకారం కార్యకర్తలందర్నీ ఎవరెక్కడ వుండాలో ఒక వేళ దాడి జరిగితే ఎవరి పాత్ర ఏమిటో ఇవన్నీ వివరంగా వాళ్ళతో కలిసి చర్చించి గాంధీగారి సభ ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ చేశాను. ఫలితంగా ఎలాంటి గందరగోళం లేకుండా సభ ప్రశాంతంగా జరిగింది.

ఆ తర్వాత గాంధీగారి కార్యక్రమం "గన్నవరం" అన్న గ్రామంలో వుంది. అది నెల్లూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి వూరు. అక్కడ పర్యటనలో గాంధీజీకి పరాభవం చెయ్యాలనీ, ఎట్టి పరిస్థితులలోనూ హరిజన ఆలయ ప్రవేశం జరగరాదనీ జస్టిస్ పార్టీ వాళ్ళు, భూస్వాములూ నిర్ణయించుకున్నారు. అందుకని ముందుగా మా దళాన్ని వెళ్ళి అక్కడ ఏర్పాట్లు చూడమన్నారు. అంతకన్నా ముఖ్యమైంది, ఆ గ్రామంలో రెండు ముఠాలున్నాయి. ఒక ముఠా నాయకుడు ఈ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, అందువల్ల ఆ గ్రామంలో రెండో ముఠా అంత పట్టుదలగా వుంది.

సరే మేం ఆ గ్రామం వెళ్ళాము. ఊరు బయటే వ్యతిరేక ముఠా ఎదురై "ఊళ్ళోకి వచ్చేందుకు వీల్లేదు" అని అటకాయించారు. "మాదేమీ నిషిద్ధ సంస్థ కార్యక్రమం కాదు. గాంధీగారి పర్యటన సవ్యంగా జరిగేటట్లు చూసేందుకు మేం వాలంటీర్లం వచ్చాము" అని చెప్పాను. "అదేం కుదరదు. గాంధీజీ హరిజనుల ఆలయ ప్రవేశానికి వస్తున్నాడు. దాన్ని జరగనియ్యము" అని వాళ్ళు. "మేం సత్యాగ్రహులము. మీరు పొమ్మనగానే పోయేందుకు సిద్ధంగా లేము. ఇక్కడే కూర్చుని ధర్నా చేస్తామని" అక్కడే అందరం కూర్చున్నాము.

ఇంతలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శేషారెడ్డి వచ్చాడు. ఆయన్ను ఇటీవలే కలిశాను. కూడా! ఆ తరువాత ఒకసారి కాంగ్రెస్ ఎన్నికలలో ఆయనను నేను ఓడించాను కూడా! ఆయనరావడంతోనే, ఆయన ముఠా కూడా అక్కడకు జేరింది. మావైపు బలం పెరగడంతో మమ్మల్ని ఆటకాయించిన వాళ్ళు వెనక్కి వెళ్ళిపోయారు. స్థానికంగా కొంత బలం లేకుండా కేవలం  బయటనుండే వచ్చి కార్యక్రమాలు వేటినీ జయప్రదంగా నిర్వహించలేము,

ఆ తరువాత గాంధీగారు వచ్చారు. అంత ఉద్రిక్త వాతావరణంలో కూడా సభా, హరిజన ఆలయ ప్రవేశం ప్రశాంతంగా జరిగినాయి. మా కార్యకర్తలు చాలా జాగ్రత్తగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పహరా యిస్తూ మంచి కృషి చేశారు. అయితే, మంచి క్రమశిక్షణతో దళాలను నడపగల కార్యకర్తగా నాకు పేరు వచ్చింది.

1935లో నెహ్రూగారు మద్రాసు వచ్చారు. ఆయన ఒక బహిరంగ సభలో మాట్లాడాల్సి వుంది. కాంగ్రెస్ వాళ్ళు ఏ విధమైన ఏర్పాట్లు చేయగల స్థితిలో లేరు. అందుకని, నెహ్రూజీ రైలు దిగేటప్పుడే పెద్ద తొక్కిసలాట అయి, అంతా గందరగోళం గజిబిజి అయింది. అప్పుడు నేను మద్రాసులో వున్నాను, కార్మికసంఘం, విద్యార్థి సంఘాలు మా నాయకత్వాన వుండేవి.



మద్రాసులో కాంగ్రెస్ పార్టీ నాయకులలో "లంక" అని ఒక ఎడ్వకేట్ వుండేవారు ఆయన నన్ను పిలిచి, "సాయంత్రం బహిరంగ సభ కూడా ఉదయం మాదిరి ఛిన్నాభిన్నం అవుతుందేమో! ఎలా! వాలంటీర్లతో ఆ సభ సక్రమంగా జరిగేటట్లు చూడమనీ" అర్థించాడు. నేను సరేనని, రామచంద్రారెడ్డి ద్వారా విద్యార్థి వాలంటీర్లను కొందరిని, కార్మికసంఘం ద్వారా కొందర్ని దాదాపు 200 మందికి పైగా వాలంటీర్లను సమీకరించాను.

సాయంత్రం ఆరు గంటలకు బహిరంగసభ. వేల సంఖ్యలో జనం హాజరు కానున్నారు. ముందుగా నెహ్రూజీ వేదిక వద్దకు వెళ్ళే సందర్భంలో జనం తోసుకురాకుండా ఏర్పాటు చేశాము. ఆ తరువాత చుట్టూతా వాలంటీర్లు వుండి వచ్చిన జనాన్ని వచ్చినట్లు కూర్చోబెట్టాలి! ఎవరూ, మధ్యలో లేవకూడదు. బయట ఏదన్నా జరిగితే చూసుకునేందుకు వాలంటీర్లు వున్నారనీ, కనుక జనం లేవాల్సిన అవసరం లేదనీ కూర్చున్న జనానికి ఓపికగా చెప్పటం, జనం గందరగోళంగా లేచినందువల్ల మరీ అల్లరయి సభ చెదిరిపోతుంది కనుక యేమీ గాభరా పడకుండా స్థిమితంగా కూర్చోమని నచ్చచెప్పటం, చూట్టూ పహరా యిస్తుండడం – యిలా ఏర్పాటు  చేశాము.

ఫలితంగా నెహ్రూగారు ఏ మాత్రం యిబ్బంది లేకుండా వేదిక వద్దకు వెళ్ళగలిగారు. తీరిగ్గా మాట్లాడారు. ఏ గందరగోళం లేకుండా సభ ముగిసింది. ఆయన "మీటింగ్ యేర్పాట్లు యింత పకడ్బందీగా చేసి, సభ ప్రశాంతంగా నిర్వహించిన స్థానిక కాంగ్రెస్ నాయకత్వాన్ని చూసి గర్వపడుతున్నా"నని వారిని అభినందించాడు. పత్రికలు మాత్రం ఉదయం స్టేషన్‌లో గలాభా తర్వాత యింత ప్రశాంతంగా జరిగిందంటే అందుకు ప్రధాన కారణం విద్యార్థి సంఘం, ప్రెస్ వర్కర్స్ సంఘం, కార్మిక సంఘం అన్న విషయాన్ని కూడా ప్రత్యేకించి ప్రస్తావించాయి.

అప్పటికి కమ్యూనిస్టు యూత్‌లీగ్ అంటూ ఇంకా ఏర్పడలేదు. ఆ సభల్లో ఎ.యస్.కె. అయ్యంగార్ కూడా వున్నట్లు గుర్తు. అప్పటికి మన పి. రామ్మూర్తి ఈ వాలంటీర్ల దళంలో వున్నాడో లేదో గుర్తులేదు. ఈ విధంగా ఒక క్రమపద్ధతిలో శిక్షణాయుతంగా వివిధ సందర్భాలలో మేం చేసిన కృషి అందరి ప్రశంసలూ ప్రత్యేకించి కాంగ్రెస్ వారి ప్రశంసలు అందుకుంది.

మా ఊరికి దగ్గర్లో "పల్లెపాడు" ఆశ్రమం వుందని, 1929లో గాంధీజీ ఒకసారి అక్కడకు వచ్చాడని చెప్పాను గదా! ఆ ఆశ్రమానికి 10–15 ఎకరాల భూమి వుంది. మా యువజన బృందంలో వున్న పూసపాడు నర్శింహరాజును ఆ ఆశ్రమాన్ని నిర్వహించేందుకు పంపాను. అక్కడ కూడా మా ఊళ్ళో మాదిరే. అన్నీగాకపోయినా కొన్ని ప్రజహిత కార్యక్రమాలు నిర్వహించాలన్నది ప్రధాన వుద్దేశ్యం. అయితే ఈ ఆశ్రమం అధీనంలో భూమిని కొంచెం కొంచెంగా భూస్వాములు, ప్రత్యేకించి ఆ ఊరి మునసబు తమ భూముల్లో కలుపుకుంటున్నారు. దాన్ని కూడా అరికట్టడం మా ధ్యేయం.

నేనూ, మా యువజన బృందం వెళ్ళాం. అక్కడ ఒక బావి ఉంది. "ఏతాం" ద్వారా నీళ్ళు తోడి, ఆ భూమిలో వేరుశనగవేసి, వ్యవసాయం ఆరంభించాము. ఆ మునసబు ఒకసారి పశువుల్ని భూమిపైకి తోలాడు. వాటన్నింటినీ పట్టుకునీ, పక్క ఊళ్ళో మునసబు అధీనంలోని బందెలదొడ్డిలోకి తోలాము. ఈ ఊళ్ళో అయితే ఆ తోలిన ఆయనే మునసబు గనుక వెంటనే విడిచిపెట్టే అవకాశం వుంది కదా! ఈ మునసబు ఆ ఊరువెళ్ళి ఈ పశువుల్ని విడిచిపెట్టమని అడిగాడు.

ఆ మునసబు "పట్టుకొచ్చింది ఫలానా వాళ్ళు. వాళ్ళను వెళ్ళి అడిగితే వాళ్ళ ఒప్పుకుంటే విడిచిపెట్టేందుకు నాకు అభ్యంతరం లేదు" అని చెప్పాడు. పల్లిపాడు మునసబు మా దగ్గరకు వచ్చాడు. "ఇక ముందు యీ విధంగా ఆశ్రమ భూమిని అన్యాక్రాంతం చేసే యత్నాలు మానుకోవాలనీ, అలా ఉండేటట్లయితే మీ పశువులను ఒదిలి పెట్టేందుకు నాకేం అభ్యంతరం లేదనీ, చెప్పాను. ఆయన సరేనన్నాడు. ఆ తరువాత ఆశ్రమం జోలికి ఆయన రాలేదు. నేనలా ధైర్యంగా చెప్పగలగటానికి, వినటానికి యింకో కారణం కూడా ఉంది. ఆ ఊళ్ళోనూ, చుట్టుపట్ల ఊళ్ళోలోనూ మాకు చాలామంది బంధువులున్నారు. కనక మా మీద తగాదా పెట్టుకోవడం ఆయనకంత తేలికకాదు.

అయితే, ఆయన ఇలా మాతో ఒప్పందానికి వచ్చి ఇక ఏమీ చెయ్యకుండా ఉన్నాడన్న సంగతి యెంతకాలం దాగుతుంది. తెలిసిపోయింది. దాంతో కూడా మా పలుకుబడి పెరిగింది. ఇక నేనక్కడవుండి మిగతా ప్రజాహిత కార్యక్రమాలన్నింటినీ ప్రత్యక్షంగా పర్యవేక్షించలేదు. మా యువజన బృందం ఉంది కదా! వాళ్ళు స్థానికంగా కొందర్ని కలుపుకుని ఆ విషయాలన్నీ చూసేవారు.

ఇంతకన్నా మా పలుకుబడి ప్రత్యేకించి నా ప్రభావం పెరగటానికి మరో ముఖ్య కారణం ఉంది. రాయనపాడు అనే గ్రామంలో వ్యవసాయ కార్మికసంఘం స్థాపించాము. దాని ఆధ్వర్యంలో కూలి పెరగాలనీ, పిచ్చి కొలతలు పోవాలనీ ఉద్యమం సాగించాము. త్వరలో ఆ ఉద్యమం చుట్టు పక్కల మరికొన్ని గ్రామాలకు కూడా పాకింది. ఆ ఊళ్ళలో కూలీలు వచ్చి, మా ఊళ్ళో కూలి సంఘం పెట్టమని బలవంతం చేసేవారు. దాంతో భూస్వాములకూ, నాకు ప్రత్యక్ష వైరుధ్యం ఏర్పడింది. "నువ్వు ఈ కూలివాళ్ళను కూడగడ్తున్నావు, వాళ్ళివాళ ఎక్కువ కూలి అంటున్నారు. రేపు అసలు భూములే తమవంటారు. ఇది చాలా ప్రమాదకరమైన విషయం. అయినా మనకు భూమిమీద యెంత వస్తున్నది గనుక యింతకన్నా ఎక్కువ కూలి ఇవ్వగలం? అంటూ వాదించసాగారు. నేను లెక్కలు వేసి, వ్యవసాయ కూలీల కోర్కె ఎంత సమంజసమైనదో నచ్చజెప్పే యత్నం చేశాను. నిజానికి మొదటి నుండి యిలాంటి లెక్కలలో నేను సిద్ధహస్తుణ్ణే.



అయితే కూలీల ఐకమత్యం చెడగొట్టేందుకు వాళ్ళొక కొత్త భావన తెచ్చారు. "నువ్వు ఏదో సమానత్వమని కబుర్లు చెప్తున్నావు. ముందు మీ కూలీల్లో మాల, మాదిగల మధ్య సమానత్వం వున్నదా! ఒకరి సరసన ఒకరు భోజనం చేస్తారా?" అని అడగసాగారు.

"అది వేరే విషయం! వారికి విద్యలేదు. పై పైచ్చు తరతరాల సాంప్రదాయం అంటూ దాన్ని పట్టుకు వేళ్ళాడుతున్నారు. క్రమేపీ అదీ పోతుంది. అయినా ఇప్పుడా విషయం దేనికి. వాళ్ళల్లో తగాదా పడతారు. కనుక వాళ్ళనందర్నీ దోచుకునే హక్కు మీకెక్కడిది?" అని నేను సమాధానం చెప్పాను.

"పోనీ భోజనం సంగతి అటుంచు, అసలు ఒకళ్ళ బావిలో నీళ్ళు ఇంకొకళ్ళ బావిలో కలిస్తేనే వాళ్ళిద్దరూ ఊరుకోరు, ముందు నీకు చాతనైతే మాల, మాదిగ బావిల్లో నీళ్ళు కలుపు చూద్దాం" అని భూస్వాములు అన్నారు.

"నేనెప్పుడూ ఆ ప్రయత్నం చెయ్యలేదు. దానికి వాళ్ళకి అభ్యంతరం వుండనవసరం లేదు" అన్నాను.

"నువ్వట్లా అంటున్నావు కదా వాళ్ళ హరిజనవాడలో బావులున్నాయి గదా! అక్కడ నుండి ఇంకొకళ్ళు నీళ్ళు తెచ్చుకుంటే వారు ఊరుకోరు" అని తమ వాదన కొనసాగించారు.

మన గ్రామంలో ఊరుబావులున్నాయి. అక్కడ నుండి వాళ్ళను నీళ్ళు మీరు చేదుకోనిస్తారా! అని నేనడిగాను.

"వాళ్ళ బావులు వాళ్ళకుండగా, మరో గ్రామంలో బావులతో వాళ్ళకు పనేమిటి? "వాళ్ళకు నీళ్ళు అవసరమూ లేదా అన్నది కాదు ప్రశ్న. వాళ్ళకెందుకు నీళ్ళు తోడుకునే హక్కులేదు. మీరెవరు అడ్డగించేందుకు?"

"హరిజనవాడలలో బావి నీళ్ళు తోడుకోనిస్తారా?"

"ఎందుకు తోడుకోనివ్వరు? మీరు వెళ్ళి తోడండి ఎందుకు అభ్యంతరం పెడతారు?' అయితే, వీళ్ళకు హరిజనవాడలో బావినీళ్ళు తోడుకునే ధైర్యం లేదు. వాళ్ళుకొట్టినా కొడ్తారని భయం.

"నువ్వెళ్ళి తోడుకురా చూద్దాం" అన్నారు.

నేను వారి సవాల్ వెంటనే స్వీకరించలేదు గానీ, నా ప్రయత్నం ఆరంభించాను.

"సరే నేనింకా వాళ్ళతో మాట్లాడలేదు. చెప్తే అర్థం చేసుకుంటారు." అని వెళ్ళి హరిజనులతో "మీ బావిలో నీళ్ళు నన్ను తోడుకోనిస్తారా" అని అడిగాను.

అయ్యో! మీరు తోడుకునేందుకు అభ్యంతరం ఏమిటి? మీరు దేవుళ్ళాంటి వారు. మా మంచికోరేవారు. అయితే మాదిగల బావిలో నీరు తెచ్చి మా బావిలో పోసి మా బావి

మైలపరచవద్దని" కూడా ఈ మాలలు అన్నారు. అయితే నేను నీరు తీసుకుని, మాలవాళ్ళ బావి నీటితో విడిగా కలపవచ్చునని వాళ్ళు అంగీకరించారు. ఊరికి దక్షణంగా మాదిగ గూడెం వుంది.

బాగా మెజారిటీగా వున్న మాలవారి అనుమతి పొంది మాదిగవాడకు వెళ్ళి, "నేను మీ బావిలో నీళ్ళు తీసుకుని, మాలవాళ్ళ బావి నీళ్ళతో కలిపేందుకు అభ్యంతరమా" అని అడిగాను.

"అదేమిటి, మీరు చేస్తే కాదనగలమా! మీరు మా ఇంటికి వస్తారు. మా కష్టసుఖాలు చూస్తారు. మీరు మా బావి నీళ్ళు తీసుకుని, ఇంకే నీళ్ళతోనైనా సరే కలిసి తాగినా, అన్నం వండుకు తిన్నా గౌరవమే కదా" అని మాదిగ వారన్నారు.

నాకు ధైర్యం వచ్చింది.

గ్రామస్తుల దగ్గరకు వెళ్ళి, "నేను నీళ్ళు తోడుకు రావడమే కాదు. మాల, మాదిగ వాళ్ళ బావుల నుండి నీరు తీసుకువచ్చి, ఆ రెండు బావుల నీళ్ళు కలిపి, గ్రామంలో వున్న యువకులందర్నీ పిలిచి, సహపంక్తి భోజనం ఏర్పాటు చేద్దా"మని చెప్పాను. "అన్నం వండి, వూళ్ళో వున్న మన అందరికీ కులాల తేడా లేకుండా భోజనం ఏర్పాటు చేస్తానని" చెప్పి వూళ్ళోవున్న యువకులందర్నీ హరిజనులను తప్ప భోజనానికి పిలిచాను.

గత అనుభవం దృష్ట్యా వీళ్ళతో పాటు మాల, మాదిగలను కూడా కలిపి సహపంక్తి భోజనానికి పిలువలేదు. అలా పిలిస్తే మొదటికే మోసం వచ్చి మాల, మాదిగ బావుల నీళ్ళతో గ్రామంలోని మిగతా కులాలవారందర్ని కలిపి, సహపంక్తి భోజనం చేయించాలన్నదానికే అంతరాయం కలగవచ్చు.

కావడి వేసుకుని రెండు బావుల నీళ్ళు తెచ్చారు. భోజనం వండాము. అనుకున్నట్లు అందర్నీ పిలిచి విందు చేశాము. నా ప్రయత్నం పూర్తిగా సఫలమైంది.

అన్నట్లు ఈ రెండు బావుల నీళ్ళే కాదు, మొదట్లో అరమైలు దూరంలో వున్న బావినుండి నీళ్ళు తెచ్చాను. ఈ తర్వాత రెడ్ల బావి, తరువాత పద్మసాలీల చెరువు నుండి నీళ్ళు తెచ్చాను. మిగతా కులాలందరూ – హరిజనులు తప్ప – వాడే బావి ఒకటే వుంది. అక్కడ నుండి కూడా నీళ్ళు తెచ్చాను. వాళ్ళు మాత్రం చాలా కోపంగా వున్నారు. నాపై దాడి చేద్దామని కూడా అనుకున్నారు గానీ, హరిజనులు నా తరుపునా వచ్చి మళ్ళీ తిరిగి వాళ్ళపై దాడి చేస్తారేమోనన్న భయంతో వూరుకున్నారు.

అయితే ఈ సహపంక్తి భోజనం జరిగిన తర్వాత తమ బావికి వచ్చి హరిజనులు నీళ్ళు తోడుకుంటారేమోననుకున్నారు. తాము వాడ వీలు లేకపోయినా సరే, హరిజనులు మాత్రం ఆ బావి నీళ్ళు తోడుకునేందుకు రాకూడదనే ఉద్దేశంతో ఆ బావిలో మానవ మలం



దిమ్మరించారు. ఆ సంగతి తెలిసి, మా యువజనబృందం వెళ్ళి బావిలో దిగి, బావి అంతా శుభ్రం చేసింది. మేము పంతానికి పోయి హరిజనులచే బలవంతాన మిగితా బావుల్లో నీళ్ళు తోడించలేదు. హరిజనులు కూడా ఆ విధంగా మిగతా బావుల నీటికి రాలేదు. ఏది ఏమైనా అన్ని బావుల్లో నీళ్ళు అందరూ వాడుకోవచ్చన్న గుర్తింపు మాత్రం వచ్చింది. ఆచరణలో అలా జరగకపోయినా!

ఏమైనా ఈ బహుముఖ కార్యక్రమాలు, అంతకు మించి ఈ వ్యవసాయ కార్మిక సంఘ నిర్మాణం జిల్లా వ్యాపితంగా నాకు చాలా మంచిపేరు తెచ్చిపెట్టాయి. ముఖ్యంగా వ్యవసాయ కార్మికులు, పేద రైతులు కలిసికట్టుగా వుంటే భూస్వామ్య దౌర్జన్యాన్ని యెదిరించవచ్చునన్న విశ్వాసంతో, మా ఊళ్లోనేగాక చుట్టుపక్కల ఊళ్ళలో సంఘటితమైనారు. గతంలో సత్యాగ్రహాలు చేశాననీ, జైలుకెళ్ళాననీ వచ్చిన పేరుకు ఈ సంఘ నిర్మాణం తోడైంది.

1934 వరకూ ఈ కార్యక్రమాలన్నీ సాగించారు. కాంగ్రెస్ వారంతా నేను ఏ ఉద్యమంలో వున్నా ఆ ఉద్యమానికి ఒక పెద్ద బలం అని భావించసాగారు. ఈ సందర్భంలోనే దువ్వూరి బలరామిరెడ్డి వంటి నెల్లూరు జాతీయ విప్లవకారులు అరెస్టయ్యారు. గాంధీజి సత్యాగ్రహోద్యమం విరమించి దేశం యావత్తూ పర్యటించాడు. దాన్ని గూర్చి చెప్పాను కదా!

ఈ సందర్భంలో యింకో విషయం చెప్పాలి. నాకు పశ్చిమగోదావరి జిల్లాలో పరిచయమైన చోళ్ళ విష్ణు అనే హరిజన కామ్రేడ్‌ను మా ఊరు పిలిపించాను. నాతోపాటు ఈ రెండేళ్ళు అతను మా ఊళ్ళో వుండి, ఈ బహుముఖ కార్యక్రమాలన్నింటా మాతో వున్నాడు.

**పార్టీ విస్తరణకై**

ఆ తర్వాత 1934లో అమీర్ హైదర్‌ఖాన్ విడుదలైనాడు. ఈ లోపల వ్యక్తిగత పరిచయాలు కొనసాగించటం తప్ప ప్రత్యేకించి ఏమీ పెద్ద కార్యక్రమం లేదు. నేను మద్రాసుకు వెళ్ళి అమీర్ హైదర్‌ఖాన్‌ను కలుసుకున్నాను.

నాకు గుర్తున్నంతలో ఆయన మద్రాసులో రహస్యంగా ఉంటున్నాడు. ఆయన వున్న గది దగ్గర్లో ఒక పోలీసు స్టేషన్ వుంది. అందువల్ల, యే వేళలో పడితే ఆ వేళలో ఆ ఇంటికి వెళ్ళే వీలులేదు. త్వరలోనే బొంబాయి వెళ్ళనున్నానని ఆయన చెప్పాడు. ఎంతో జాగ్రత్తగా కల్సుకునేవాణ్ణి. పార్టీ నిర్మాణ పరిస్థితి, పార్టీని ఐక్య పరిచే కృషి, ఇతర డాక్యుమెంట్లు – వీటన్నింటిని గూర్చి వివరంగా ఆయనను అడిగాను. అప్పటికే కేంద్ర కమిటీ మీటింగ్ ఈ ఐక్యతా విషయమై జరిగిందని తెలుసుగానీ, డాక్యుమెంట్లు వివరాలు తెలియవు. ఆయన తనకు తెలిసినంతవరకూ వివరంగా చెప్పి 'బొంబాయి వెళ్ళాడు.

ఆయన బొంబాయినుండి తిరిగి వచ్చిన తర్వాత డిసెంబరు డాక్యుమెంటు ఇస్తానని, దాని అవగాహన ప్రకారం పార్టీని సమన్వయ పరచాలని చెప్పాడు. ఆ తర్వాత పార్టీలో

ఎవరెవరు ఏమిటి? మీరట్ కామ్రేడ్స్ సంగతేమిటి? ఎవరెవరిపై చర్యలు తీసుకోవడం జరిగింది. ఈ పరిస్థితులలో ఎలా పనిచెయ్యాలి – అన్నీ చెప్పాడు. ఆ తర్వాత బొంబాయిలో పార్టీ అంతర్గత చర్చలలో పాల్గొనేందుకు తాను వెళ్తున్నాననీ బొంబాయిలో పార్టీ ఐక్యతకు తాను కృషి చెయ్యాల్సి వుందనీ చెప్పాడు. ఒక వేళ తనకేమన్నా జరిగితే, కేంద్ర కమిటీతో నేను సంబంధాలు పెట్టుకోవలసి వుంటుందని సూచించాడు.

నన్ను అమీర్‌హైదర్‌ఖాన్ కేంద్ర కమిటీతో సంబంధాలు పెట్టుకోవలసిందని సూచించేటప్పటికి నేను పార్టీ సభ్యుడనా? అనే సమస్య ఉత్పన్నం కావచ్చు. సభ్యత్వం సమస్యను ఈ విధంగా చూడాలనుకుంటాను. 1930 హెచ్.డి. రాజా వచ్చి వివరించినది తర్వాత మేము అంటే నేనూ, కంభంపాటి సీనియర్ పార్టీలో పని చేద్దామనుకున్నాము. అయితే రాజా మాకు పార్టీ సభ్యత్వం ఇవ్వలేదు. నిజానికి కమ్యూనిస్టు యువజన సంఘంతో తనకు సంబంధం వుందని ఆయన చెప్పాడు తప్ప – ఆయన పార్టీ సభ్యుడు అవునో కాదో కూడా మాకు తెలియదు.

అయితే 1931లో అమీర్ హైదర్‌ఖాన్ నన్ను రెండుసార్లు కలుసుకున్నాడు. మొదటిసారి బెంగుళూరులో, ఆ తర్వాత మద్రాసు రైల్వే స్టేషన్‌లో! బెంగుళూరులో కలిసినపుడే నన్ను కమ్యూనిస్టుపార్టీలో పనిచేసే పూర్తికాలం కార్యకర్తగా రమ్మని కోరాడు. అప్పుడు అందుకు నేను నిరాకరించాను. కనుక అప్పటి నుండీ నేను పార్టీ సభ్యుణ్ణి అని భావించాల్సి వుంటుంది. సాంకేతికంగా చూస్తే నేను ఏమీ ప్రమాణం చేయడం గానీ, దాని అంగీకరించడంగానీ జరగలేదు. కనుక, అమీర్ హైదర్‌ఖాన్ నన్ను 1931లో పార్టీ సభ్యుడిగా గుర్తించాడని చెప్పాలి! ఆ తర్వాత 1931లోనే మద్రాసు రైల్వే స్టేషన్‌లో కలిసినప్పుడు పూర్తి కాలం పనిచేసే కమ్యూనిస్టు కార్యకర్తగా వస్తానని చెప్పాను.

అదీగాక 31 –34 మధ్య కాలంలో నా కార్యకలాపాలన్నీ కంభంపాటి సీనియర్ ద్వారా, వి.కె. నర్సింహన్ ద్వారా అమీర్‌హైదర్‌ఖాన్‌కు తెలుస్తూనే ఉన్నాయి.

1930లో హెచ్.డి. రాజాను కల్సిన సమయం తర్వాత 31 వరకూ నేను క్యాండిడేట్ సభ్యుణ్ణి అని అర్థం చేసుకోవచ్చు. 32 లో నన్ను రష్యా పంపే ప్రయత్నాలు కూడా జరిగాయి. జైల్లో కూడా అందరూ నన్ను "కమ్యూనిస్టు" అనేవాళ్ళు. అది ఏ కమ్యూనిజం, దాని లోతుపాతులెంత, సైద్ధాంతిక పునాది ఎంత – యిలాంటి ప్రశ్నలన్నీ పక్కకు పెడదాం. నాకు 1932 నాటికి పద్ధతి ప్రకారం కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం వచ్చిందా లేదా అన్నది ప్రశ్నకాదు. అమీర్‌హైదర్‌ఖాన్‌తో సహా అందరూ నన్ను కమ్యూనిస్టుగా గుర్తించారు అని చెప్పాలి.

మా ఊళ్ళో. పరిసర ప్రాంతాలలో నా కార్యక్రమం చేస్తూనే వివిధ జిల్లాలలో అంతకుముందు నాతో వివిధ సందర్భాలలో పరిచయం వున్న రాజకీయ వ్యక్తులను కలుసుకోనారంభించాను. రాజకీయంగా వారిని ప్రభావితం చేసేందుకు ప్రయత్నించాను. వీరుగాక, కొత్తగా కొందరు యువకులతో, విద్యార్థులతో పరిచయాలేర్పడ్డాయి.



జాతీయోద్యమంలో జైలుకెళ్లి వచ్చిన వారిలో కొందరు జాతీయ విప్లవకారులతో సంబంధంలో వున్నారు.కొందరు బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుండి వచ్చిన వారితో సంబంధాలు పెట్టుకున్నవారున్నారు. వివిధ జిల్లాలో యిలా వున్నవారి పేర్లు, అడ్రసుల జాబితానొకటి తయారు చేసుకొని వారిలో కొందరిని కలుసుకున్నాను. మద్రాసు "యంగ్ వర్కర్స్ లీగ్" కాకుండా మొత్తం ఆంధ్ర అంతటికి కలిపి వేరే నిర్మాణం ఒకటి ఏర్పాటు చేసేందుకు వారిని వొప్పించాను. అలా నేను తొలిరోజుల్లో సంబంధం పెట్టుకున్నవారిలో పశ్చిమగోదావరి జిల్లాలో కామ్రేడ్ ఉద్దరాజురామం, టి.వి. చలపతి, అల్లూరి సత్యనారాయణ (తర్వాత కాంగ్రెస్ నాయకుడై చనిపోయాడు), ఏలూరు నుండి గారపాటి సత్యనారాయణ కూడా వున్నారు. ఇంకొందరు వుండివుంటారు. కామ్రేడ్ రామం చెప్పగలడనుకుంటాను. వీళ్ళు – వీళ్ళతో సన్నిహిత సంబంధాలున్న వాళ్ళు, వీళ్ళను అనుసరించే బంధువులు – యిలా కొంతమంది.

నావద్ద ఒక లిస్టు వుంది కదా! ఆ తర్వాత వెంట్రప్రగడ గ్రామం వెళ్ళాను. అక్కడ కొసరాజు శేషయ్య, మద్దుకూరి చంద్రం పేర్లు నావద్ద ఉన్నాయి. వాళ్ళిద్దరితో మాట్లాడితే ఆ యిరువురూ కమ్యూనిస్టు ఉద్యమంలో పాల్గొనేందుకు అంగీకరించారు. మద్దుకూరి వెంటరాగా భట్ల పెనుమర్రు వెళ్ళాను. అక్కడ చలసాని వాసుదేవరావు. చలసాని జగన్నాధరావు. ఆ వూరు అమ్మాయిని వివాహమాడిన కాట్రగడ్డ నారాయణరావు వీళ్లతో సంబంధాలు ఏర్పడినాయి. ఇక కృష్ణాజిల్లాలో ఎవరెవర్ని కలుసుకోవాలి అన్న విషయం మద్దుకూరి చంద్రం, చలసాని వాసుదేవరావు, కొసరాజు శేషయ్య వీళ్ళకప్పగించాను. వీళ్ళు ముగ్గురూ బాగా చొరవగల వాళ్ళుగా వుండేవాళ్లు.

గుంటూరు జిల్లా వెళ్ళి అప్పట్లో కలుసుకున్నవాళ్లల్లో పోలే పెద్ది నర్సింహమూర్తి, జొన్నలగడ్డ రామలింగయ్యలు ముఖ్యులు అని చెప్పవచ్చు. ఇక నెల్లూరు జిల్లా వరకు వస్తే గతంలో నాకున్న సంబంధాలు కాకుండా బసవారెడ్డి శంకరయ్య, అల్లూరుకు చెందిన రావి ఆదిశేషయ్య వీళ్ళుగాక, అప్పట్లోనో, కొంచెం తర్వాతో గుర్తులేదు సహకార బ్యాంకు మేనేజరు ఖండవల్లి కృష్ణారావు కూడా నేను కలుసుకున్న వారిలో వున్నారు.

ముత్తరాజు గోపాలరావు వంటి కాంగ్రెస్ కార్యకర్తలతో నాకు సంబంధాలుండేవి. కానీ, వారెన్నడూ కమ్యూనిస్టుపార్టీలో జేరలేదు. 1935 నాటికే బసవారెడ్డి శంకరయ్య రావి ఆదిశేషయ్య కమ్యూనిస్టు వుద్యమంలో వున్నారని ఖచ్చితంగా చెప్పవచ్చు. వాళ్ళు పార్టీ సభ్యులని కూడా భావించవచ్చు.

ఇలా ఈ సంబంధాల ద్వారా పరిచయమైన వాళ్ళందరం ఒక చోట కలుసుకుని ఒక కమిటీని ఎన్నుకుందామనుకున్నాం. తదనుగుణంగా విజయవాడ పటమటలో కాట్రగడ్డ నారాయణరావు గారి తోటలో కలుసుకున్నాం. అప్పుడు ఏడుగురితో ఒక కమిటీని ఎన్నుకున్నట్లు

గుర్తు. అయితే నాకు అయిదు పేర్లే గుర్తున్నాయి. వాళ్ళు పోలేపెద్ది నర్సింహమూర్తి, చలసాని వాసుదేవరావు, చంద్రం, అల్లూరి సత్యనారాయణ, టి.వి. చలపతి,

ఇక ఈ కమిటీ పని చేయనారంభించింది. అమీర్ హైదర్‌ఖాన్ అరెస్టయిన తర్వాత పార్టీ నిర్మాణాన్ని, వుద్యమాన్ని నిర్మించే బాధ్యత తీసుకున్నాను. అలాగే ఆయన చెప్పినట్లే పార్టీ కేంద్రం బొంబాయి –తో సంబంధం పెట్టుకున్నాను. ఇక మా వూరు నుండి మకాం ఎత్తేశాను. మద్రాసులో ఆఫీసు నొకటి ఏర్పాటు చేశాను. బహిరంగంగా మా కార్యక్రమాలు నిర్వహించటం కోసం, కార్మిక రక్షణ సమితి ప్రారంభించాము. అదీ పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో మద్రాసులో కూడా కార్మిక రక్షణ సమితి శాఖనొక్కదాన్ని ఏర్పాటు చేశాను. దీనికొక నిబంధనావళి తయారు చేశాము. అందులో అయిదారు నిబంధనలకన్నా లేవు. 1936 – 37లో జయప్రకాష్ నారాయణ మద్రాసు వచ్చినపుడు మా కార్మిక రక్షణ సమితి నిబంధనావళి తెప్పించుకు చూసి, ఇంత చిన్నదా మీ నిబంధనావళి అని నవ్వాడు. “అది సరిపోతుంది. సంక్షిప్తంగా, సాధారణంగా వుంది” అన్నాను.

నేను ఈ విధంగా మద్రాసులో వుంటూ, ఏర్పడిన కమిటీతో సంబంధాలు పెట్టుకుంటూ, అలాగే మద్రాసులో కొత్త సంబంధాలు నెలకొల్పుకుంటూ వున్నాను. ఈ లోపల, యీ కమిటీ మరి కొందరితో సంబంధాలు ఏర్పరచుకోసాగింది. ఈ దశలో బనారస్ హిందూ యూనివర్సిటీ నుండి వచ్చిన విద్యార్థులతో సంబంధాలేర్పడ్డాయి. అలాగే జైలు నుండి విడుదలై వచ్చినవారు – యిలా ఉద్యమం అభివృద్ధి చెందసాగింది. అక్కడ కమిటీకి పోలేపెద్ది నరసింహమూర్తి కార్యదర్శి. ఈకమిటీ ఎలా ఆంధ్రలో ఉద్యమాన్ని ఎవరెవరితో సంబంధాలు ఏర్పరచుకుని వృద్ధి చేసిందీ ప్రత్యేకించి చూడాలి!

నా విషయానికి వస్తే ఆనాటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి అంతటికీ కలిపి ఒక కమిటీ వుంది. దానికి నేను కార్యదర్శిని. 1934 అక్టోబర్‌లో అమీర్ హైదర్‌ఖాన్ అరెస్టయ్యాడు. ఈ విషయం బొంబాయి వాళ్ళు మాకు తెలియజేస్తూ, ఇక్కడ మద్రాసు నుండి నేను బొంబాయి వెళ్ళి, అక్కడి కామ్రేడ్స్‌తో సంబంధాలు నెలకొల్పుకోవాలని సూచించారు. 1934 సెప్టెంబరో, అక్టోబరో సరిగా గుర్తులేదు. బొంబాయిలో జాతీయ కాంగ్రెస్ జరగడానికి కొంచెం ముందుగా నేను బొంబాయి వెళ్ళాను. అక్కడ కామ్రేడ్స్ ఏదో ఊరేగింపుకు సిద్ధమవుతున్నారు. అలాగే పార్టీ నిర్మాణం గూర్చి చర్చించవలసి ఉంది.

కాంగ్రెస్‌లోనే ఉంటూ గాంధీజీ ఈ విధానాలతో అసంతృప్తి చెందిన కొందరు 1934లోనే కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ స్థాపిద్దామనుకున్నారు. ముందుగా వాళ్ళు పాట్నాలో సమావేశమై యీ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు మళ్ళీ బొంబాయి జాతీయ కాంగ్రెస్ మహాసభలకు ముందుగా బొంబాయిలో సమావేశమై తమ భవిష్యత్ కార్యక్రమమూ, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నిర్మాణమూ యివన్నీ చర్చించదలచుకున్నారు. వారిలో జయప్రకాశ్ నారాయణ, నరేంద్రదేవ్, యూసఫ్ మెహరాలీ, అచ్యుత్‌పట్వర్థన్ తదితరులు వున్నారు. కాంగ్రెస్‌లో వున్న వామపక్షీయులను కలుసుకుని బొంబాయిలో ఈ సమావేశం వేశారు. నేను కూడా సమావేశానికి హాజరైనాను.



నేను 1932లో ఒకసారి బొంబాయి వెళ్ళాను. అప్పుడు నేను బహిరంగంగానే వున్నాను. మిగతా కామ్రేడ్స్ కూడా బహిరంగంగానే వుండేవారు. “యంగ్‌వర్కర్స్ లీగ్ ఆఫీసు”, “బాంబే కర్మగార్ యూనియన్” వుండేవి. అప్పుడు నాకు లభించిన సంబంధం ఇన్సూరెన్సు కంపెనీలో పనిచేస్తున్న మిశ్రాజీ. ఆయన బహిరంగంగానే “బాంబే ప్యాపర్ లేన్” గిర్గామ్ వీధిలో వుండేవారు. ఇప్పుడు ఆ ప్రాంతం ఎలా మారిందో!

ఆ ప్రాంతంలో ఒక ఇంట్లో కామ్రేడ్స్ అందరూ కలుసుకునేవారు. కామ్రేడ్ ఘాటే, అధికారి వీళ్ళు బహిరంగంగానే వుండేవారు.

నేను చెప్పాను కదా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ సభకు నేను కూడా హాజరైనానని. కాంగ్రెస్ పనిచేస్తున్న వారందర్నీ వాళ్ళు రానిచ్చారు. అయితే నేను ప్రతినిధిని కాదు. దక్షిణ భారతదేశం నుండి ఎవరు సోషలిస్టు భావలుగల వాళ్ళో తెలుసుకోవడం నా ముఖ్యోద్దేశం. మొత్తం దక్షిణాదిన నాటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రం మొత్తం పార్టీని నిర్మించవలసిన కర్తవ్యం నాది. అక్కడే కామ్రేడ్ దినకర్ మెహతా, కామ్రేడ్ నంబూద్రిపాద్‌లను కలుసుకున్నాను. పెద్దగా వాళ్ళతో యేమీ చర్చించలేదు.

ఆ సభలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఏర్పాటయింది. కమ్యూనిస్టులుగా వున్న మేము కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో జేరలేదు. దానిపట్ల యె వైఖరి తీసుకోవాలి అన్నది అప్పటికింకా చర్చనీయాంశంగానే వుంది. పైగా అప్పుడు రజనీ పామీదత్ రాసిన ఒక వ్యాసం ప్రకారం కాంగ్రెస్‌లో వుంటూ, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ సోషలిస్టుగా వుండదు కనుక మేము దానిలో జేరే ప్రసక్తి లేదు. పైగా కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం అంటూ మాకొకటి వుందికదా! అయినా అంతకుముందు నుండి కాంగ్రెస్‌లో కూడా కొందరం వుండేవారం. సభ్యత్వం వున్నదా లేదా అన్నది ప్రశ్నలేదు.

1933 నాటికి పార్టీలో అంతర్గతంగా ప్రతి సూక్ష్మాంశం వరకూ ఐక్యత ఉన్నా, లేకపోయినా సాధారణ ఐక్యత మాత్రం యేర్పడింది. కాంగ్రెస్ పోరాట విరమణకు వ్యతిరేకంగా ఒక ఊరేగింపు చేద్దామనుకున్నారు. 1934 మహాసభల సందర్భంగా చాలామంది యువజనులనే సమీకరించారు. 1934 ఆరంభంలో బొంబాయిలో బట్టల పరిశ్రమ కార్మికులు సమ్మె చేశారు. ఆ సందర్భంలోనే కామ్రేడ్ బి.టి. రణదివేని అరెస్టు చేసి జైల్లో పెట్టారు.

ఆ సమ్మె పట్ల కాంగ్రెస్ వారిలో కూడా సానుభూతి వుంది. అవన్నీ దృష్టిలో వుంచుకుని కాంగ్రెస్ మహాసభల వద్దకు ఒక ఊరేగింపు వెళ్లింది. మెమోరాండంలో కార్మికుల కోర్కెలు, కాంగ్రెస్ కర్తవ్యం ఇవన్నీ వున్నాయి. అయితే ఊరేగింపును కాంగ్రెస్ సభదాకా వెళ్ళనివ్వలేదు. లాఠీచార్జీ జరిగింది. కొందరికి దెబ్బలు తగిలాయి. బాబూ రాజేంద్రప్రసాద్ మహాసభకు అధ్యక్షుడు. ఈ విషయంపై కొన్ని కరపత్రాలు మాత్రం నాకు దక్షిణాది కాంగ్రెస్ వారిలో కొందరితో వున్న పరిచయాన్ని బట్టి మహాసభలో పంచటం జరిగింది. మహాసభలు చూసేందుకు కాంగ్రెస్ సభ్యుడుగా నాకు అవకాశం వుంది. అయితే మహాసభలలో పాల్గొనలేదు. అంతకన్నా ఆ సభలపట్ల నాకు పెద్ద ఉత్సాహం కూడా లేదు.

# ఐక్యత చర్యలు - కేంద్రకమిటీ

ఈ బొంబాయి పర్యటనలో చెప్పుకోదగింది ఏమంటే ఐక్యతా చర్చల, నిర్ణయాలు అనంతరం కేంద్రకమిటీ సమావేశం జరిగింది. నన్ను. అజయ్ ఘోష్‌ను కేంద్ర కమిటీలోకి అధికారయుతంగా తీసుకున్నారు.ఘాటే అప్పుడు పార్టీ కార్యదర్శి. పార్టీకి సంబంధించిన నిర్మాణ అంశాలు, ఇతరేతరంగా పార్టీకి వున్న పరిచయాలు, కొందరు వ్యక్తులు – ఇవన్నీ ఆ కేంద్రకమిటీ సమావేశంలో చర్చించాయి. ఎవరిమీద క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి. ఎవరిపై తీసుకున్న చర్యలు వుపసంహరించాలి. ఐక్యతా డాక్యుమెంటు వెలుగులో తీసుకోవలసిన చర్యల గూర్చి చర్చించి కొన్ని నిర్ణయాలు తీసుకున్నాం. అయితే పెద్దగా రాజకీయ చర్చలు జరగలేదు. అప్పటికి క్రమశిక్షణా చర్య గైకొనబడిన వారిలో కామ్రేడ్ బి.టి.ఆర్. జైల్లోనే వున్నాడు. డాంగే పార్టీ వెలుపలే వున్నాడనుకుంటాను. పి.సి.జోషి కేంద్రకమిటీసభ్యుడు. ఆయనా జైల్లో వున్నాడు మిరాజ్‌కర్ లాంటి యువకులతో చర్చించి, ఐక్యతా డాక్యుమెంటును ఆచరణలో ఎలా పెట్టాలి, రానున్న సమీప భవిష్యత్తులో పార్టీ సమన్వయానికి ఏమేమి చెయ్యాలి అన్న అంశాలపై చర్చించి కొన్ని నిర్ణయాలు తీసుకున్నాము.

కొన్ని సంబంధాలు, తత్సంబంధిత అడ్రస్‌ల వివరాలు మాకందజేయబడినాయి. కేంద్రంతో సంబంధం ఎలా కొనసాగించాలో కూడా చెప్పమన్న గుర్తు. ఆ సమావేశం తర్వాత నేను తిరిగి వచ్చాను. భారతదేశానికి రాజ్యాంగ బద్ధ సర్వ ప్రతినిధి సభ కావాలా, లేక సోవియట్ రిపబ్లిక్ తరహా కావాలా! దేన్ని మనం కోరాలి అన్న విషయంపై పార్టీలో భేదాభిప్రాయాలు వున్నాయి. ఎక్కువమంది సోవియట్ రిపబ్లిక్ కోరాలి అని చెప్పారు. రాజ్యాంగ బద్ధ సర్వ ప్రతినిధి సభ కోరటం, తద్వారా ఏదో వొరుగుతుందని భావించడం భ్రమపడటమే అన్నది పై అభిప్రాయం గల వారి వాదన.

కాంగ్రెస్‌లో జేరాలా వద్దా అన్నది సమస్యగా ముందుకు రాలేదు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో జేరాలా వద్దా అన్నది చాలా కాలం నుండి పార్టీలో వున్న విభేదం. అయితే కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో వుండాలంటే కాంగ్రెస్ సభ్యుడై వుండాలన్నది ఒక నిబంధన. కనుక కమ్యూనిస్టు



పార్టీ సభ్యత్వం వుండి కాంగ్రెస్ సభ్యత్వం లేని వాళ్ళకు అవకాశం లేదు. నేను మాత్రం మనకు కాంగ్రెస్ వారితో వున్న పరిచయాలు కొనసాగిద్దామనే చెప్పాను. కార్మిక రక్షణ సమితులను పటిష్టం చేసి, ఇతర కార్మిక సంఘ కార్యకలాపాలు చూస్తూ, కాంగ్రెస్‌లో వున్న వుత్సాహవంతులూ, నిజాయితీ పరులూ ఆయన కాంగ్రెస్ వాదులతో సంబంధం పెట్టుకోవాలి. నాకు సంబంధించినంతవరకూ దక్షిణాదిన అలాంటి సంబంధాలనన్నింటినీ ప్రభావితం చేసి, కమ్యూనిజం వైపు తీసుకువచ్చే కర్తవ్యం వుంది.

దీనికి ఆరంభంగా మద్రాసులో "ప్రెస్ వర్కర్స్ యూనియన్" తెరిచాము. ఇంతకుముందు కూడా మాకు ఈ సంఘంతో సంబంధం వుంది. "యంగ్ వర్కర్స్", "రైల్వే కార్మికుల సంఘం" ఇవి వుండేవి. అధికారయుతంగా కాంగ్రెస్ సభ్యులు కానివారు జాతీయోద్యమంలో జైలుకు వెళ్ళినివారు, విద్యార్థులుగా, యువకులుగా, సరాసరి పార్టీలోకి వచ్చినవారు. వీళ్ళందర్నీ ఈ కార్మిక రక్షణ సమితిలాంటి వాటిలో జేర్చుకోవాలి. నిజానికి ఈ కార్మిక రక్షణ సమితి అంటే అప్పట్లో దాదాపు కమ్యూనిస్టు పార్టీ కిందే లెక్క.

ఇదిలా జరుగుతుండగా బొంబాయిలో మళ్ళీ ఇంకో సమ్మె జరిగింది. ఈసారి కొందరు కమ్యూనిస్టులను అరెస్టు చేశారు. మరి కొందరిని బొంబాయిలో వుండరాదని నిషేధాలు విధించి, ఇతర ప్రాంతాలకు పంపేశారు. అలా ఘాటే బొంబాయి నుండి మంగుళూరు జేరాడు. అక్కడ ఆయన వదినగారు ఉండేది. అధికారి బీజ్‌పూర్ జేరాడు. అలాగే మిరాజ్‌కర్ కూడా బొంబాయిలో లేదు. పార్టీ కేంద్రం అంటూ లేకుండా పోయింది.

బెంగాల్ నుండి కామ్రేడ్ సోమనాథ్ లాహిరీ వచ్చి కేంద్ర బాధ్యతలు చూడాలి అని నిర్ణయమైంది. ఆ మేరకు లాహిరీ బొంబాయి జేరాడు. నేను 1935లో లాహిరీని కలుసుకునేందుకు వెళ్ళాను. "మెరీన్ డ్రైవ్" వద్ద కలిసి ఒక గంట మాట్లాడాము. "పి.సి.జోషి త్వరలోనే విడుదల అవుతాడని అనుకుంటున్నాము కనుక, కేంద్ర కమిటీ సమావేశమై మొత్తం కార్యక్రమాన్ని రూపొందించుకోవాలి' అని లాహిరీ నాకు సూచించాడు. లాహిరీతో సంబంధాలు ఎలాగోలాగు కొనసాగిస్తామని చెప్పి నేను వచ్చేశాను. నేను వచ్చిన కొద్ది రోజులకే లాహిరీ కూడా అరెస్టయినట్లు తెలిసింది. లాహిరీని నేను కలిసినప్పుడు "1935 డిసెంబరు ఆ ప్రాంతంలో నాగపూర్‌లో కేంద్ర కమిటీ సమావేశం అవుతుందని, ఆ సమావేశానికి ఏదో విధంగా హాజరై కొత్త సంబంధాలు, ఇతర అంశాల గూర్చి నీవు రిపోర్టు ఇవ్వవలసి వుంటుందని" చెప్పాడు. లాహిరీ జైల్లో వున్నాడు గదా! పి.సి. జోషి విడుదలై వచ్చి కేంద్రం బాధ్యత తీసుకున్నాడు.

మద్రాసులో అప్పుడు ఆఫీసు "తాతా ముతియప్పన్" వీధిలో వుండేది. అక్కడే ప్రెస్ వర్కర్స్ యూనియన్ ఆఫీసు కూడా వుండేది. ఆ యూనియన్‌లో అప్పటికే రాజవడివేలు, మాణిక్యం వుండేవారు. వారుగాక ఆంధ్రపత్రికలో పనివారు కొందరు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పనిచేసే "సంబంధం" అన్న అతనూ, సోమేశ్వరరావు అని ఒక ప్రూఫ్‌రీడర్ అనుకుంటాను

అతనూ వుండేవారు. వారిలో సోమేశ్వరరావు చదువుకున్నవాడు. అతనే యూనియన్ కార్యకలాపాలు చూసేవాడు. 1934-35 నాటికే కంభంపాటి సీనియర్ మద్రాసు జేరాడు. ఆయన "కార్మిక రక్షణ సమితి"లో ఉండేవాడు. వి.కె. నర్సింహన్ వుండేవాడు. కానీ బహిరంగ కార్యకలాపాల్లో పాల్గొనేవాడు కాదు. సానుభూతి పరుడుగా వుండేవాడు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ వుండేది.

మద్రాసులో యివన్నీ చేస్తున్న సందర్భంలో నేను కేరళ వెళ్ళాను. అక్కడ కామ్రేడ్ కృష్ణపిళ్ళైని, కామ్రేడ్ ఇ.ఎం.యస్. నంబూద్రిపాద్‌ను, అలాగే ఎన్.సి.శేఖర్ తదితరులను కలుసుకున్నాను. అయితే అప్పుడు కృష్ణపిళ్ళై, ఇ.యం.యస్‌లు అక్కడ ముఖ్యులు. వాళ్ళిద్దరూ కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నిర్మాణంలో ప్రధాన భాగస్వాములు. వాళ్ళిద్దరినీ కలిసి చర్చించాను. ఐక్యతాడాక్యుమెంటు యిచ్చాను. ఇది కూడా చదివి ఆలోచించండి అని వారికి చెప్పాను. నాతో సంబంధాలు కొనసాగించమని కూడా కోరాను. వారంగీకరించారు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ గూర్చి నన్ను ఆలోచించమని వారు కోరారు.

వారిని వెంటనే కమ్యూనిస్టు ఉద్యమంలోకి వచ్చేయండి అని వెంటపడదలచుకోలేదు. ఇద్దరూ అన్నీ తెలుసుకోవాలనే తపనకలవారే! వారితో సంబంధం వుంచుకుంటూ, మెల్లగా నచ్చజెబుతూ, చర్చిస్తూ కమ్యూనిస్టులుగా మార్చుకోవాలి గాని ఏదో ఒకటి తేల్చి చెప్పండి అని నిలదీసి ప్రయోజనం ఉండదు. వాళ్ళు ఈ డాక్యుమెంటూ, అదీ చదివి సంబంధాలు వుండే వారి నైజాన్ని బట్టి తప్పకుండా కమ్యూనిజం వైపు వచ్చి తీరుతారన్న విశ్వాసం నాకు వుండేది. పైగా వాళ్ళకేదో స్వతంత్ర అవగాహన వుంది. అది తప్పు అని అప్పటికప్పుడే వాళ్ళపై రుద్దినట్లు చెప్తే మనకు వచ్చే ప్రయోజనమూ వుండదు. అందుకని మీరు కావలసినంత వ్యవధి తీసుకుని ఆలోచించండి అని చెప్పి వచ్చాను. అప్పటికే వారు కాంగ్రెస్ పార్టీలోనే గాక, వామపక్ష భావాలుగల కాంగ్రెస్ యువకులలో మంచి గుర్తింపు  పొంది వున్నారు. వాళ్ళు కొచ్చిన్‌లో నేను కలుసుకోదగిన కొందరు కామ్రేడ్స్‌పేర్లు, అడ్రసులు యిచ్చారు.

కొచ్చిన్‌లో కలుసుకున్న వాళ్ళల్లో ఇప్పుడు సి.పి.ఐలో వున్న అతనొకడున్నాడు. 1965లో మన మద్దతు లేకుండా శాసనసభకు సి.పి.ఐ. తరపున గెలిచాడు. అలాగే యింకో నంబూద్రి అనే ఆయన్ని కూడా కలిశాను. అక్కడ నుండి అలెప్పి మీదుగా త్రివేండ్రం జేరాను. అక్కడా కొందర్నీ కలుసుకుని, చర్చించి "మళ్ళీ కలుద్దాం, సంబంధాలు మాత్రం కొనసాగించండి" అని చెప్పాను.

మద్రాసు మా కార్యకలాపాలకు కేంద్రస్థానంగా వుండేది గదా! వివిధ రకాల కార్యక్రమాలు పార్టీ తరపున వివిధ సంఘాల పేర్లపై జరిగేవి. అవన్నీ వేరు వేరు కామ్రేడ్స్ చూసేవారు. నేను పార్టీ నిర్మాణం, విస్తరణ, సంబంధాలు – యివి ప్రధానంగా చూసేవాడిని పార్టీ చరిత్ర రాసేటప్పుడు విడివిడిగా వివిధ రాష్ట్రాలలో పార్టీ చేపట్టిన వివిధ కార్యకలాపాలు,



పాల్గొన్న కామ్రేడ్స్ పాత్ర యివన్నీ తప్పకుండా రాయాలి! అనంతాచారి అనే ఇన్సూరెన్సు ఏజెంట్ ఒకతను సంబంధంలోకి వచ్చాడు. ఆ తర్వాత అతను ఇన్సూరెన్సులో పెద్ద ఉద్యోగి అయ్యాడు. ఆయన ఈ ఉత్తర ప్రత్యుత్తరాలకు బాగా ఉపయోగపడేవాడు. మామూలుగా మా అడ్రసులకు కాకుండా వేరే అడ్రసులకు ఉత్తరాలు నడిచేవి. ముఖ్యమైన డాక్యుమెంట్లూ అవీ అయితే ఈ కామ్రేడ్స్ వచ్చినప్పుడు గానీ లేదా మనం వెళ్ళిగానీ నేరుగా అందించడమే గానీ పోస్టులో పంపే సమస్య ఉండేదికాదు.

ఇక ఆంధ్ర దేశానికి వస్తే 1934-35లోనే ఒక కమిటీ వేశాము కదా: కార్మిక రక్షణసమితి కార్యకాలాపాలు విస్తరించసాగాయి. 1935లో కాబోలు, పోలేపెద్ది నర్సింహమూర్తి మెల్లగా నండూరి ప్రసాదరావునూ, పులుపుల శివయ్యనూ పార్టీలోకి తీసుకువచ్చాడు. అప్పుడు కోవూరి విమానశ్రయంలోనో, యెక్కడో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న జొన్నలగడ్డ రామలింగయ్య పోలేపెద్దికి తోడు గుంటూరుకు మకాం మార్చాడు. ఈ కార్మిక రక్షణ సమితిని విశాఖ తదితర పెద్ద పట్టణాలన్నింటా ఏర్పాటు చెయ్యాలని నిర్ణయించుకున్నాము.

దైనందిన కార్మిక సంఘ కార్యకలపాలతో పాటు ఈ కార్మిక రక్షణ సమితికి చుట్టూ జేరిన కమ్యూనిస్టులను చైతన్యవంతం చేసుకోవటం ఒక ప్రధాన కర్తవ్యంగా ఉండేది. అందుకు అవసరమైన డాక్యుమెంట్లు, కరపత్రాలు అందజేయబడేవి. అవి చదువుకుని చర్చలు జరిపేవాళ్ళు: ఐక్యతా డాక్యుమెంటూ అప్పటికి మీరట్ వారి "సంయుక్త ప్రకటన" వచ్చింది. అదీ చదివేవారు. ఆనాటికే కమ్యూనిస్టు మ్యానిఫెస్టో తెలుగులోకి తీసుకువచ్చాము. "కమ్యూనిజం సూత్రాలు – ఆచరణపై" ఎంగెల్స్  ప్రశ్నలూ– సమాధానాలు ఇలాంటివీ: "రాజ్యాంగ యంత్రం – విప్లవం" అచ్చు కాలేదు కాని, తెలుగు రాత ప్రతి వుండేది."కూలి, శ్రమ, పెట్టుబడి" వ్యాసం కూడా అముద్రితంగా వ్రాతప్రతిగా వుండేది. ఇవన్నీ ఆయా గ్రూపులలో చదివేవారు. ఈ పుస్తకాలు అచ్చుకు అవసరమైన ధనం నేనూ, కాట్రగడ్డ నారాయణరావు సమకూర్చేవారం. ఏలూరులో గారపాటి సత్యనారాయణ ఒక ముద్రణాలయంలో వీటిని అచ్చువేసేవాడు. ఆ ముద్రణాలయ అధిపతికి కూడా అచ్చుఅవుతున్నవి ఏ పుస్తకాలో తెలిసేది కాదు. ఒకవేళ అక్కడక్కడా కమ్యూనిస్టు పదజాలం వున్నా ఆయనకు అర్థంకాక పట్టించుకునేవాడు కాదు. వాళ్ళు వ్యాపారస్థులు, వ్యాపారం సక్రమంగా సాగుతున్నంతవరకూ మిగతా అంశాల విషయం వారికేమీ పట్టేది కాదు.

అప్పటికే గద్దె లింగయ్యగారొక పత్రిక వెలువరించేవారు. కొన్ని కరపత్రాలు కూడా ఆయన వేసేవారు. కామ్రేడ్ చంద్రం కూడా సంపాదక బాధ్యతల్లో వుండేవాడు. 1934లో బొంబాయి కాంగ్రెస్ సందర్భంగా జరిగిన చర్చ "రాజ్యాంగ బద్ధ ప్రతినిధి సభ" భారతదేశానికి అవసరమా – లేదా సోవియట్ తరహా రిపబ్లిక్ ఈ చర్చ చాలా జోరుగాసాగేది. నిజానికి ఈ రెంటికి మధ్య గల తేడా, వాటిని గురించి సైద్ధాంతిక అవగాహన మాకు సమగ్రంగా తెలియదు. మెజారిటీ సోవియట్ తరహా రిపబ్లిక్ కోరేవారు. మైనారిటి అభిప్రాయం రాజ్యాంగబద్ధ సర్వ

ప్రతినిధి సభ అని: మనం మెజారిటీ అభిప్రాయానికి కట్టుబడి పనిచేయాలన్న దృక్పథం తప్ప, మాకు తెలిసింది పెద్దగాలేదు. పార్టీలైను గనుక మారు మాటాడకుండా అంగీకరించడమే: ఈ రాజ్యాంగబద్ధ ప్రతినిధి సభ అన్న సూచన సంస్కరణవాద సూచన అని మాభావం. అందుకని పార్టీకి సోవియట్ తరహా రిపబ్లిక్ భారతదేశానికి అవసరం అన్నది గట్టిగా నొక్కి చెప్పేవాళ్ళం.

అంతకుముందు బొంబాయిలో కాంగ్రెస్ మహాసభ సందర్భంగా కార్మికసభ ఉరేగింపుపై లాఠీఛార్జీ జరిగింది కదా: దానికి నిరసన తెల్పాలనుకున్నాం. బాబూ రాజేంద్రప్రసాద్ ఆంధ్రదేశానికి పర్యటనకు వచ్చాడు. ఆ సందర్భంగా నల్లజెండాల ప్రదర్శన చేయాలని నిర్ణయించాం. విజయవాడ, ఏలూరు, భీమవరం – ఇట్లా ఒక ఆరు కేంద్రాలను నిరసన ప్రదర్శన చేయాలని ఎంచుకున్నాం. కొన్ని చోట్ల మనం నల్లజెండాలు చూపలేదు కాని మెమోరాండంలు మాత్రం ఇచ్చాం. ఆ సభలకు వేలాదిమంది ప్రజానీకం వచ్చేవాళ్ళు. మనం ఒక పాతిక – ముప్ఫై మందిమి ఒక చోట చేరి పెద్దగా అరుస్తూ నినాదాలు ఇచ్చేవాళ్ళం. ఇప్పుడు వెనుక్కు తిరిగి చూస్తే ఎంత మూర్ఖంగా చేశామో అనిపిస్తుంది. ఈ నిరసన తెలియజేయటం, ఒక ప్రత్యేక గ్రూపుగా వ్యవహరించటం వరకూ సరియైనదే. కానీ వేలాదిమందిలో ఆ రకంగా గలభా చేయటం, కాంగ్రెసు వాళ్ళు కూడా దాన్ని ఏదో చూసీ చూడనట్లు వూరుకున్నారు. గనుక సరిపోయింది గానీ లేకపోతే దెబ్బలాటై వుండేది. ఆ నిరసన వ్యవహారానికి నాదే నాయకత్వం.

నీ వ్యతిరేకతనంతా బయటికి కక్కవలసిన అవసరం లేదు. నువ్వు చేయదలచుకున్నది చేసి చూపిస్తే ప్రజలే గ్రహిస్తారు.

కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ 7వ మహాసభ జరగనున్నట్లు ఈ రోజుల్లోనే తెలిసింది. దానికి మనదేశం నుండి కూడా ఒక ప్రతినిధి పంపాలి. అందుకు కామ్రేడ్ మిరాజ్‌కర్‌ను పంపుదామని నిశ్చయించినట్లు గుర్తు అయితే ఆయనను మహాసభకు వెళ్ళేదారిలో సింగపూర్‌లో అరెస్టు చేశారు. కనుక ఆయన మహాసభకు వెళ్ళలేదు. కానీ పత్రికల ద్వారా ఫాసిజానికి వ్యతిరేకంగా ఐక్య సంఘటన కట్టే విషయమై 1935 నాటికి 7వ మహాసభ చర్చించి నిర్ణయాలు గైకొన్నట్లు తెలిసింది.

ఈ లోపల 2వ సారి అరెస్టు అయి అమీర్ హైదర్‌ఖాన్ తిరిగివచ్చారు. ఆయనతో పాటు "ట్రిపోల్"లో ముద్రించబడిన పుస్తకం ఒకటి తెచ్చారు. కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంపై సందేహాలు – సమాధానాలు ఆ పుస్తకం. అదీ, కొన్ని ఇతర డాక్యుమెంట్లు వాటిని తెలుగులోనికి అనువదించి వివిధ గ్రూపులకు అందజేశాం.

హెచ్.డి. రాజా బొంబాయిలో యూత్‌లీగ్ నొకదానిని ఏర్పాటు చేసి దాని ప్రతినిధిగా అంతకుముందు మమ్ములను కలుసుకున్నట్లుగా చెప్పాను గదా: మేము కూడా అదే మాదిరి ఒక యూత్ లీగ్‌ను ఏర్పాటు చేద్దామనుకున్నాం. నిజానికి ఆ యూత్‌లీగ్ అన్నది పార్టీకి ఒక



వేదికగా మాత్రమే ఉండేది. కమ్యూనిస్టులు కాని యువకులు కొందరున్నా, ఎక్కువ భాగం తాము కమ్యూనిస్టులమనుకునేవారు లేదా పార్టీకి గట్టి సానుభూతిపరులైనవారు మా యూత్‌లీగ్ సభ్యులుగా ఉండేవారు.

1935లో కాంగ్రెస్ పార్టీ నుండి బయటకు రావాలని నిర్ణయం తీసుకోవటం జరిగింది. కనుక మేమందరం కాంగ్రెస్‌ను వదలిపెట్టేసి ఈ యూత్‌లీగ్‌లో పనిచేయనారంభించాము. గాంధీగారు ఉద్యమాన్ని విరమించటం వల్ల కాంగ్రెస్‌వారిలో కొంతమందిలో అసంతృప్తి ఉంది. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఆ అసంతృప్తిని పోగేసుకుంటున్నది. కానీ మేము కాంగ్రెసులో సభ్యులంగా లేము గనుక మాకు కాంగ్రెస్ వదిలిపెట్టి రావలసిందిగా నచ్చజెప్పటం నాపనయింది. ఈ దశ ఒక అయిదారు నెలలు మించిలేదు.

అయితే పార్టీలోకి బెనారస్ నుండి విద్యార్థులుగానూ, కార్మిక రక్షణ సమితి ద్వారానూ కొత్తగా వచ్చిన వారికి కాంగ్రెస్‌తో సంబంధాలేమీ లేవు. వారికి కాంగ్రెస్‌తో తెగతెంపులు చేసుకున్నందుకు ఏ బాధాలేదు. ఇంకా చెప్పాలంటే పీడ వదిలిపోయినట్లే భావించి ఆనందంగా ఉన్నారు.

బెనారస్ నుండి వచ్చిన వారిలో పోలే పెద్ది నర్శింహమూర్తి, పులుపుల శివయ్య, కాట్రగడ్డ నారాయణరావు, నండూరి ప్రసాదరావు మొదలైనవారున్నారు. పొన్నం వీరరాఘవయ్య కూడా బెనారస్ నుంచే వచ్చాడు. 1935 ఆరంభం నాటికే చంద్ర రాజేశ్వరరావు బెనారస్ గ్రూపులో చురుకుగా వుండేవారు. విద్యార్థి ఉద్యమం నడిపిన సందర్భంగా ఆయనను బెనారస్ విశ్వవిద్యాలయం నుండి బహిష్కరించారు. కనుక విశాఖపట్నం వచ్చి మెడికల్ కాలేజీలో చేరారు.

అప్పటికే ప్రధానమైన పారిశ్రామిక కేంద్రాల్లో పనిచేస్తే తప్ప మనం అభివృద్ధి చెందలేమన్న మార్క్సిస్టు అవగాహన మాకుండేది. కనుక మేము రాజేశ్వరరావును కలుసుకునేందుకు ప్రయత్నించాం. అక్కడి గ్రూపుకు ఆయనే నాయకుడిగా ఉండాలని చెప్పాం. తాను బెనారస్ విశ్వవిద్యాలయం నుండి బహిష్కరింపబడి విశాఖపట్నం చేరకముందే కమ్యూనిస్టు పార్టీతో రాఘవయ్య ద్వారా సంబంధాలను వుంచుకునేవాడనని, ఇక్కడ ఉద్యమం సుందరయ్య చూస్తున్నాడని, కేంద్ర కమిటీతో సంబంధంలోనే ఉన్నామని, కేంద్ర కమిటీ సూచనల మేరకు పని చేస్తున్నామని రాఘవయ్య ద్వారా తెలుసుకున్నట్లు తర్వాత రాజేశ్వరరావు నాతో చెప్పాడు.

1935లో ఆరంభ సమావేశానికి దాదాపు 10 మంది దాకా ప్రతినిధులు వచ్చారు. నాకిప్పుడు అందరిపేర్లు గుర్తులేవు. ఇంతకు ముందు చెప్పిన అయిదుగురు మాత్రం ఉన్నారు.

ఇంతకీ చెప్పొచ్చేదేమంటే గాంధీజీ ఉద్యమ విరమణపట్ల అసంతృప్తి చెందినవారు కాంగ్రెసు సోషలిస్టు పార్టీలో చేరారు. ఇక విద్యార్థులుగా విప్లవం కోసమే పనిచేద్దామనుకునేవాళ్ళు కమ్యూనిస్టు పార్టీలోకి వస్తున్నారు. అది అప్పటి పరిస్థితి.

నిజానికి ఇంతకుముందే 1930 – ఆ తర్వాత "33, "34 వివిధ సందర్భాలలో కాకినాడలో సత్యాగ్రహంలో పాల్గొన్న నందూరి, కృష్ణమాచారి, ఇతర సోదర సమితి సభ్యులు – వీళ్ళందరితో సంబంధం పెట్టుకొని చర్చలు అవీ జరుపుతుండేవాణ్ణి. హైదరాబాదులో కూడా అలాంటి సంబంధాలు చాలా తక్కువే అయినా ఉన్నాయి. అయితే వారందరినీ ఒక పద్ధతిగా నిర్మాణంలో ఇమిడ్చామని కాదు. అప్పటికి కమ్యూనిస్టు పార్టీకి బహిరంగ వేదిక "యూత్‌లీగ్" దాదాపు అది యువ కమ్యూనిస్టుల గ్రూపుగా ఉండేది. మల్లిపూడి పల్లంరాజు లాంటివారు అక్కడక్కడ యూత్‌లీగ్ లో లేకపోలేదు. అయితే వాళ్ళు కాంగ్రెసులో అతివాదుల క్రిందలెక్క ఇప్పటి కాంగ్రెసు అతివాదులల్లేకాదు. వాళ్ళు నిజంగానే చాలా నిజాయితీగా ఉండేవారు. పోరాటానికి కూడా ముందుండేవారు. ఆ తర్వాత వాళ్ళెలా మారారు అన్నది వేరే విషయం.

1936 మొదటి వరకూ ఈ రకంగా సంబంధాలు కొనసాగిస్తూవుండే వాళ్ళం. పార్టీ చరిత్ర రాసే సందర్భం అయితే ఇంకా వివరంగా ఏయే ప్రాంతాలలో ఎలాంటి ఉద్యమాలు, ఏ ఏ కామ్రేడ్స్ నిర్వహించారు. అవన్నీ వ్రాయాల్సి ఉంటుంది. స్వీయ చరిత్ర గనుక ప్రధానంగా నా కార్యకలాపాలను, కృషిని లోటుపాట్లను చెప్తే సరిపోతుందని భావిస్తున్నాను.

అయితే మన కామ్రేడ్స్ వున్న గ్రామాలలో వ్యవసాయ కార్మిక సంఘ నిర్మాణం ప్రధానంగా ఉండేది. 1935 చివర్లోనో, "36" లోనో జొన్నలగడ్డ రామలింగయ్య ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా దావులూరులో మొదట వ్యవసాయ కార్మిక సంఘ నిర్మాణం జరిగింది. ఆ తర్వాత రామలింగయ్య వీరులపాడుకు మకాం మార్చాడు. అక్కడా వ్యవసాయ కార్మికసంఘం నిర్మాణం చేపట్టాడు. పట్టణాలలో కార్మిక వర్గంలో పనిచేసేందుకు పిల్లలమర్రి వెంకటేశ్వర్లును మరణించిన మన కామ్రేడ్ కె. యల్. నరసింహాన్ని నియమించాము. ఈ విధంగా కార్మిక రక్షణ సమితి పేరిట కార్మిక సంఘ నిర్మాణం కొనసాగిస్తుండేవాళ్ళం.

అన్నిటికన్నా పెద్ద తలనొప్పి ఏమంటే, కేంద్ర సమావేశాలకు హాజరవడం. నేను వెళ్తుండేవాణ్ణి. 1935 చివర్లో నాగపూర్‌లో సమావేశం జరిగింది. సరే అంతకుముందే నాకు అందించిన సంబంధాల ఆసరాగా నేను హాజరైనాను. ఒక వృద్ధ కామ్రేడ్ అక్కడ ఈ ఏర్పాట్లలో వున్నాడు. పేరు గుర్తులేదు. అది నా రెండవ కేంద్రకమిటీ సమావేశం, అక్కడకు పి.సి. జోషీ వచ్చాడు. అలాగే అంతకుముందు సమావేశంలోనే నాతోపాటు కేంద్రకమిటీకి ఎంపిక చేయబడిన అజయ్‌ఘోష్ వచ్చాడు. ఆ వృద్ధ నాగపూర్ కామ్రేడ్ కూడా వున్నాడు. అధికారి, మిరాజ్‌కర్ రాలేదు. బెంగాల్ నుండి రణేన్ సేన్, బొంబాయి నుండి జంబేకర్ హాజరయ్యారు. నాకు గుర్తున్న దాని బట్టి కామ్రేడ్ బి.టి.ఆర్. రెండు సంవత్సరాలపాటు సస్పెండ్ చేయబడినాడు. అలాగే సుహాసిని కూడ సస్పెండు చేయబడివుంది. "బిర్లాడి" కూడా సస్పెన్షన్‌లో వున్నట్లున్నాడు. కేంద్రకమిటీలోకి తీసుకున్న యింకో కామ్రేడ్ భరద్వాజ అయితే ఆయన ఆ సమయంలో అరెస్టయి జైలులో వున్నాడు. పంజాబ్ నుండి కామ్రేడ్ ఇక్బల్ వున్నాడు. ఆయన మాస్కో వెళ్ళి



వచ్చాడు. మిరాజ్‌కర్ తర్వాత ఆయన స్థానంలో ఉన్నాడు. అయితే ఆయన్నీ అరెస్టు చేశారు. జైల్లో వున్నాడు. ఆయన తర్వాత కామ్రేడ్ లాహిరీ వచ్చాడు గానీ ఆయన్నీ అరెస్టు చేసి ప్రభుత్వం జైల్లో నిర్బంధించింది.

డాంగేను పార్టీ నుంచి బహిష్కరించి మళ్ళీ 1937-38 లో పార్టీలోకి తీసుకున్నట్లున్నారు. ఉత్తరప్రదేశ్ తదితర ప్రాంతాల నుండి యెవరూ కేంద్ర కమిటిలో వున్నట్లు లేదు. ఆ వివరాలన్నీ నా స్వీయ చరిత్ర దృష్ట్యా అంతగా అవసరం లేదు.

# కాంగ్రెసు సోషలిస్టు పార్టీలో

ఆ కేంద్ర కమిటీకి సంబంధించి ప్రధాన విషయం ఒకటుంది. "దత్ - బ్రాడ్లే థీసిస్ వచ్చింది. దాన్ని చర్చించి ఆమోదించాము. సోవియట్ తరహా రిపబ్లిక్ నినాదం వదులుకున్నాము. కాంగ్రెస్‌నే సామ్రాజ్యవాద వ్యతిరేక సంఘటనగా మారుద్దామనుకున్నాము. ప్రజా సంఘాల అనుబంధం కూడా తదనుగుణంగా మారాలి. పార్టీ సభ్యులు తమ పార్టీ సభ్యత్వం వుంచుకునే కాంగ్రెస్‌లో జేరి, దానితో సన్నిహిత సంబంధాలుంచుకోవాలి. అలాగే కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో కూడా జేరి అంతా గమనిస్తూ వుండాలి. ఇవీ ప్రధాన రాజకీయ నిర్ణయాలు.

ఇంకో ప్రధానమైన చర్చనీయాంశం - పార్టీ కేంద్రాన్ని సక్రమంగా యెలా నడపాలి? వివిధ ప్రాంతాలలో నిర్మాణమవుతున్న పార్టీని, కార్మికోద్యమాన్ని యెలా సమన్వయం చెయ్యాలి? అన్నది. ఈ ప్రశ్నలతో పాటు బొంబాయి గ్రూపులో వున్న విభేదాలు. అవి చాలా చికాకు కలిగించేవి. వాటిని యెలా సర్దుబాటు చెయ్యాలి. అదేమిటో ఎవరు బొంబాయి వెళ్ళినా అరెస్టయ్యేవారు.

కనుక అసలీ సమస్య క్షుణంగా చర్చిద్దామనుకున్నాం. మన కామ్రేడ్స్ ఎందుకిలా అరెస్టవుతున్నారో పరిశీలించాలనుకున్నాం. ముఠా తగాదాల వల్ల సమాచారం బయటకు పోతున్నది అని భావించాము. కావాలని దుర్బుద్ధితో చెప్పారా లేదా అన్నది కాదు. ఏదో ఎవరి ముఠాలో వాళ్ళో ఊరికే చెవులు కొరుక్కుంటున్నట్లు ఉబుసుపోక మాటలు చెప్పుకునేవారు. పోలీసులు దాన్ని పట్టుకుని ఒక డొంకంతా కదిలించేవారు. అందులో నాయకత్వానికి సన్నిహితులుగా వుండేవాళ్ళు ఈ విషయాలపై చర్చోపచర్చలకు మరికొంత జేర్చి బాహాటంగా చెప్పుకునేవారు. సంపూర్తిగా మొదలంటూ పరిశోధిస్తే తప్ప, ఎవరు కారణం అన్నది తేలదు. అయితే అప్పటిదాకా బొంబాయిలోనే పార్టీ కేంద్రాన్ని కొనసాగించటం సమంజసం కాదు.



మరి అలాంటప్పుడు కలకత్తాకు పార్టీ కేంద్రాన్ని మార్చటం కూడా అంత తేలికకాదు. ఇవన్నీ దృష్టిలో వుంచుకుని ఈ కేంద్ర కమిటీకి ఒక కన్వీనర్‌ను ఎంపిక చేసుకోవాలనుకున్నాం. అప్పుడు మీరట్ కుట్రకేసు నుండి బయటపడి యువకుడుగా వున్న పి.సి.జోషి కన్వీనర్‌గా ఎన్నుకున్నాం. ఆయనకు అజయ్‌ఘోష్ సహకరించాలి. కామ్రేడ్ భరద్వాజ్ త్వరలోనే విడుదల అవవచ్చని భావించాం. ఆయన గనుక విడుదలైతే ఆయన కూడా కామ్రేడ్ జోషికి సహకరిస్తాడు. ప్రస్తుతానికి ఉత్తరప్రదేశ్ లో కేంద్రం ఏర్పాటు చేయాలి.

మళ్ళీ జరిగే కేంద్ర కమిటీకి కామ్రేడ్ జోషి ఏర్పాట్లు చేయాలనీ, అది కూడా మళ్ళీ కాంగ్రెస్ మహాసభలకు ముందుగా జరగాలని నిర్ణయించాము. అలా జరిగితే కాంగ్రెస్ సభలలో కూడా కొంత మన ప్రభావం పడవచ్చు. అందుకని 1933 ఏప్రిల్‌లో మళ్ళీ కమిటీ కలుసుకోవాలనుకున్నాము. కాంగ్రెస్ మహాసభ ముందు జరగబోయే సమావేశానికి వీలైనంత ఎక్కువమంది కామ్రేడ్స్ హాజరయ్యేట్లు చూడాలని కూడా తీర్మానించుకున్నాము.

దత్-బ్రాడ్లే సిద్ధాంతం ఆమోదించాము కదా:- తదనుగుణంగా ఒక డాక్యుమెంటు రాసి అందరికీ పంచాలి: ప్రధానంగా కాంగ్రెస్ మహాసభలలో కాంగ్రెస్ వారికి పంచాలి. ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఆంధ్ర కామ్రేడ్స్‌కు కాంగ్రెసు వారితో మంచి సంబంధాలే వున్నాయి. వాటిని ఆసరా చేసుకుని కాంగ్రెస్ సభలలో, బహిరంగ సమావేశంలో ఆ కరపత్రాలను పంచాలన్నది నిర్ణయం.

కేంద్రకమిటీ మీటింగ్‌లే ప్రధానసమస్య: ఇక్కడ బొంబాయిలోనే ఫలానాచోట, ఫలానాతేదీన జరుగుతుందని ఇప్పుడే నిర్ణయం తీసుకుంటే ఆ నిర్ణయం కూడా బయటకు పోతుందేమోనని మా అనుమానం. బయటకు పొక్కిందా ఇక ఆ సమావేశం జరగదు. కనుక తేదీ, ప్రదేశం తర్వాత నిర్ణయించి తెలియజేయాలనుకున్నాం. కావాలని బొంబాయిలో ఈ స్థాయి నాయకత్వమే రహస్యాలు బయటపడవేస్తున్నదని కాకపోయినా, ఏదో విధంగా అవి జేరాల్సిన చోటుకు జేర్తున్నాయి కదా: కనుక బొంబాయి కామ్రేడ్స్ లేకుండా సమావేశం ముఖ్యమైన భాగం జరిగిపోవాలని మేమనుకున్నాం. అందుకని నిర్ణయించిన తేదికి రెండు రోజులు ముందే మిగతావాళ్ళం సమావేశమై ముఖ్యమైన అంశాలపై చర్చించి, నిర్ణయాలు తీసుకోవాలని మా వరకు మిగతావాళ్ళం తీర్మానించుకున్నాము. బొంబాయి కామ్రేడ్స్ వచ్చిన తర్వాత మళ్ళీ లాంఛనప్రాయంగా సమావేశమవవచ్చు.

మరో ముఖ్యమైన విషయం కూడా వుంది. 1936లో కాంగ్రెస్ మహాసభలు జరుగనున్నాయి. నెహ్రూ అధ్యక్షుడు. నెహ్రూకు వామపక్ష భావాలున్నాయి. సోషలిస్టు భావాలకు మంచి పూతమే వస్తుంది. కనుక మహాసభల సందర్భంగా మమ్మల్ని అరెస్టు చేయకపోవచ్చు. అదీగాక కొత్త రాజ్యాంగచట్టాన్ని ప్రభుత్వం ప్రకటించింది. కనుక, ఎన్నికలు జరగాల్సివుంది. ఎన్నికలలో పాల్గొనాలా వద్దా అన్న సమస్య వుంది. మొత్తంగా కమ్యూనిస్టులందర్నీ అరెస్టు

చేయడం వారి ఉద్దేశం కాకపోవచ్చుగానీ, పార్టీ ఐక్యం కాకుండా పార్టీకి కేంద్రం పనిచేయకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని అర్థం అవుతున్నది. అందుకే కేంద్ర కమిటీ నాయకత్వాన్ని మటుకు అరెస్టు చేస్తున్నారు.

దత్ –బ్రాడ్లే థీసిస్ ప్రకారం కాంగ్రెస్‌ను సామ్రాజ్యవాద వ్యతిరేక సంఘటనగా మార్చాలన్న నిర్ణయాన్ని పార్టీ అంతా అంగీకరించేట్లు వొప్పించుకోవలసివుంది. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో జేరి పనిచేయాలి. అలాగే ఘాటే మంగుళూరులో వారి వదినగారి వద్ద వున్నాడని చెప్పాను గదా: ఆయనను ప్రభుత్వం ఒకకంట కనిపెడుతున్నది. ఆయన్ని ఎలాగో కలుసుకుని, కేంద్ర కమిటీ సమావేశానికి హాజరయ్యేట్లు చూడాలి: కామ్రేడ్ ఘాటేను కలుసుకుని ఆయనను ఎవరూ గమనించకుండా మంగుళూరు నుండి బయట పడవేసి, లక్నో సమావేశానికి తీసుకు రావలసిన బాధ్యత నాకప్పగించారు.

కేరళ కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నాయకులు, ముఖ్యంగా కామ్రేడ్ ఇ.యం.యస్, కృష్ణపిళ్ళె లాంటి వారితో సంబంధాలు కొనసాగిస్తున్నాను కదా: కామ్రేడ్ ఘాటేతో వాళ్ళకు పరిచయం ఏర్పాటు చేసి, వాళ్ళ సహాయంతో ఘాటేను మంగుళూరు దాట్టిద్దామనుకున్నాను. కామ్రేడ్ ఘాటే మంగుళూరు దాటితే, ఇక ఆయన ఎక్కడున్నారో తెలుసుకోవడం కష్టం. పోలీసులు బొంబాయి చుట్టుపట్ల వెతుకుతారు గానీ, మా పథకం వేరేగా వుంది కదా!

ఎలా అయితేనేం అనుకున్నట్లు ఘాటే లక్నో జేరాడు. కేంద్రకమిటీ సమావేశం అనుకున్నట్లు జరిగింది. మేం పంచదలచుకున్న కరపత్రం పంచాము. కొత్త సంబంధాలు కూడా దొరికాయి.

కాంగ్రెస్ మహాసభలలో నెహ్రూ తన అధ్యక్ష వుపన్యాసంలో సోషలిస్టు సమాజ ఔన్నత్యం గూర్చి ప్రస్తావించారు. వేలాదిమంది మధ్య ఆయన ప్రసంగం వుపయుక్తమయింది.

1936లో మళ్ళీ అందరం కాంగ్రెస్‌లో జేరాము. అది పెద్ద కష్టం కాలేదు. ఆ తర్వాత కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో కూడా జేరాము. మన పార్టీ నాయకత్వం కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమైన పాత్ర వహించింది. ఉదాహరణకు చంద్రం కృష్ణాజిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడైనాడు.

ఇక ఇప్పటి నుండీ "యూత్ లీగ్" కాదు మా కార్యకలాపాల ప్రధానవేదిక: కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ వేదిక నుండి మేమే పని చేయగలుగుతున్నాము.

బెనారస్ గ్రూపు వారు కూడా కాంగ్రెస్‌లో జేరారు గాని, కాంగ్రెస్‌పై పెద్దగా ప్రభావం చూపగల స్థాయిలో వారికి కాంగ్రెస్‌తో గతంలో సంబంధాలు లేవు. అందుకనే గుంటూరులో ఆ విధంగా కాంగ్రెసుతో సంబంధాలు అంతగారాలేదు. కృష్ణాలో కాంగ్రెస్, మనవాళ్ళు కలిసిపోయారు. పశ్చిమగోదావరిలో మనం కాంగ్రెసులో ముఖ్య స్థానాల్లోనే వున్నాం.

నా వరకూ కాంగ్రెసులో జేరడం చాలా సులువైంది. మధ్యలో ఆరు మాసాలు తప్ప– అప్పటి దాకా నేను కాంగ్రెస్ సభ్యుణ్ణే నేను కమ్యూనిస్టునని తెలుసు. అయినా



హరిజనులకోసం, గ్రామాభ్యుదయం కోసం తీవ్రంగా కృషి చేస్తున్నవాడిగా కూడా కాంగ్రెస్‌వాదులలో గుర్తింపు వుంది. నేను తమతో వుంటే తమకు మంచి కార్యకర్త దొరికినట్లు భావించి వారు ఆనందించారు. 1936లోనో, 37లోనో ఎన్నికలు జరిగాయి. ముందు రంగాను వామపక్ష కాంగ్రెసు వాదుల తరపున కాంగ్రెస్ అధ్యక్షుడిగా నిలబెడదామనుకున్నాం. అవతల పోటీ భోగరాజు పట్టాభి సీతారామయ్య, చివరకు రంగాకు బదులు నాగేశ్వరరావు గారిని నిలబెట్టినట్లున్నాం. నేను కార్యదర్శికి పోటీ చేశాను. ఇద్దరం ఓడిపోయాము. కాని చాలా మంది కాంగ్రెసు కార్యకర్తలు మాకు ఓట్లు వేశారు. ఆ తర్వాత ఎ.ఐ.సి.సి.కి ఎన్నుకోబడినాను. అప్పట్లో రాష్ట్ర కాంగ్రెస్ ప్రతినిధికి కూడా ఎన్నికలు జరిగేవి. నేను రెండు స్థానాల్లో పోటీ చేశాను. ఒక చోట ఓడిపోయాను. రెండో చోట యూత్‌లీగ్ బాగా ప్రచార కార్యక్రమం నిర్వహించింది. గెలిచాను. బాగా ప్రసిద్ధ కాంగ్రెస్ నాయకుణ్ణి ఓడించి నేను గెలవడం అన్నది పెద్దగా ఆశ్చర్యంగా చెప్పుకున్నారు.

నిజానికి అదేమీ పెద్ద ఘనకార్యం కాదు. నా గురించి వ్యతిరేకంగా ప్రచారం చేసేందుకు అవతలి వారి వద్ద ఏమీ లేదు. పైగా యువ కార్యకర్తలు సైకిళ్ళపై తిరుగుతూ అందర్నీ కలుసుకుని, గ్రూపు మీటింగులు పెట్టి చాలా చక్కగా ప్రచారం చేశారు.

ఈ పనులు చేస్తూనే నెల్లూరు జిల్లా ఇందుకూరు పేటలో రైతు మహాసభ జరిపాము. పోలీసులు మాత్రం ఈ రైతు మహాసభను కమ్యూనిస్టులు తమ కార్యకలాపాలకు ఒక ముసుగుగా మాత్రమే వాడుకుంటున్నట్లు భావించారు. కానీ నీటి వనరులపట్ల పంటకు రావలసిన ధరపట్ల రైతాంగంలో తీవ్ర అసంతృప్తి ఉంది. అప్పటికి యింకా ఎన్నికలు జరగలేదు. జస్టిస్ పార్టీ వారు తిలక్ వసూలు చేసిన సొమ్ము కోటి రూపాయలదాకా కాంగ్రెస్ వృధాగా ఖర్చు చేసిందని ఒక కరపత్రం వేసి వుంచారు. వాళ్ళ నాయకుడు బుచ్చికి చెందిన బెజవాడ రామచంద్రారెడ్డి. ఆయన మా దూరపు బంధువు.

నేనూ ఆ కరపత్రాన్ని తీవ్రంగా ఎదుర్కొన్నాను. "ఈ జస్టిస్ పార్టీ ఏమిటి లెక్కలడిగేది? వాళ్ళు బ్రిటిష్‌వాళ్ళ ఏజంట్లు. మేము కాంగ్రెస్ కోసం కోటి వసూలు చేశాం. ప్రజా పోరాటాలకు ఖర్చు పెట్టినాము. మాకు హక్కుంది. డబ్బు వసూలు చేసింది. బ్యాంకుల్లో దాచుకోవడానికి కాదు. వీళ్ళెవరు అడిగేందుకు" అని ధైర్యంగా నిలబడ్డాను. ఈ ఎదురుదాడికి కాంగ్రెస్ వారు బాగా సంతోషించారు. రైతు సమస్యలూ అవీ తీసుకుని పనిచేస్తున్నాం. కాంగ్రెస్‌లో ఈ విషయాల్లో మనదే చొరవ. మన పార్టీ వారు ఎక్కడ కాంగ్రెస్ కమిటీల్లో వున్నారో అక్కడల్లా ప్రజా సమస్యలు ముమ్మరంగా తీసుకున్నాం.

కాంగ్రెస్‌లో జేరని పార్టీ సభ్యులకు "యూత్ లీగ్", "కార్మిక రక్షణ సమితి" వుండనే వున్నాయి:వాళ్ళందులో వుండి పనిచేసేవారు. దత్–బ్రాడ్లే థీసిస్ ఆచరణలో పెట్టడం అవసరం. బొంబాయిలో వున్న ముఠా తగాదాలను ముందు పరిష్కరించాలి. కామ్రేడ్ పి.సి. జోషి, అజయ్‌ఘోష్, బొంబాయిలో ఆ పని కోసం చాలా రోజులు గడిపారు. ఎంతవరకు

సఫలీకృతమైనారో వివరంగా నాకు తెలియదు. కానీ, మొత్తం మీద స్థూలంగా ఐక్యత ఏర్పడింది. ఆ తర్వాత ఎన్నికలు జరిగి, బాహాటంగా పనిచేసే అవకాశం వచ్చిన తర్వాతనే బొంబాయిలో ఆఫీసు ఏర్పాటు చేశారు. "నేషనల్ ఫ్రంటు" పత్రిక కూడా తీసుకు రావడం ఆరంభించారు. అందుకోసం అజయ్‌ఘోష్ తన నివాసం బొంబాయికి మార్చాడు.

మేమిక్కడ ఆంధ్రలోనూ, తెలంగాణలోనూ కూడా సంబంధాలు యేర్పాటు చేసుకుంటున్నాం. సరైన యంత్రాంగాన్ని బొంబాయిలో సిద్ధం చేసుకున్నాం. పార్టీ పత్రిక వస్తున్నది. బొంబాయి గ్రూపులో ఏదో ఒక ఐక్యత వచ్చింది. అయితే ఈ మధ్యలో పార్టీ రహస్య కేంద్రం కలకత్తాలో 1936లో ఏర్పాటు చేసుకున్నాం. 1937 నుండి, 1939 లో యుద్ధం ప్రకటించబడేవరకూ బొంబాయిలో పార్టీ కేంద్రం ఉంది.

ఈ దశలో అండమాన్ కామ్రేడ్స్‌తో సంబంధాలు దొరికాయి. అండమాన్ నుండి తప్పించుకున్న కామ్రేడ్ పృథ్వీసింగ్ ఆజాద్ సంబంధంలోకి వచ్చి పార్టీ సభ్యత్వం తీసుకున్నాడు. ఆయనను కలకత్తాలో ఇతర కామ్రేడ్స్‌తో పాటు, సాంకేతిక అంశాలు చూసేందుకు నియమించాము. భరద్వాజ కూడా వచ్చి కాన్పూర్‌లో వుండసాగాడు. ప్రధానంగా నేను దక్షిణాది పార్టీ నిర్మాణంలో చురుకుగా వున్నాను. దక్షిణాది నుండి పార్టీకి నేను "లింకు"గా వుండేవాణ్ణి.

1936-37లో కామ్రేడ్ రామ్మూర్తి పార్టీలోకి వచ్చిన గుర్తు. ఆయన స్వాతంత్రోద్యమంలో పాల్గొని, జైలుకు వెళ్లి వచ్చి, మద్రాసులో "నేతి" దుకాణం ఒకటి నడుపుతున్నాడు. "భాష్యం" ఒక నవల రామ్మూర్తికి ఇచ్చి అనువదించమన్నట్లు, అట్లా సంబంధం ఏర్పడినట్లు చెప్పాడు. నాకు సరిగా గుర్తులేదు. మొత్తం మీద ఆ రోజుల్లో యువకులకు సాహిత్యం బాగా అందజేసే పనిమటుకు చేసేవాళ్ళం.

తర్వాత కామ్రేడ్ అయ్యంగార్ వచ్చాడు. ఆయనను "ప్రెస్ వర్కర్స్" సంఘం చూడమన్నాము. ఆ తరువాత ఆయన "రేవు" కార్మికుల సంఘం కూడా చూసేవాడు. అలాగే 1936-37లో శ్రీనివాసరావు, దాదాపు ఆ సమయంలోనే వెంకట్రామన్ సంబంధాల్లోకి వచ్చారు. కానీ వాళ్ళిప్పటికే వివిధ ప్రజా రంగాల్లో పనిచేస్తున్నారు. ఎలా, ఏయే రంగాల్లో పనిచేశారన్నది డాక్యుమెంట్లలో చూడాలి. పార్టీ చరిత్ర రాసేటప్పుడు అవన్నీ అవసరం.

ఈ దత్ -బ్రాడ్లే థీసిస్ రాకముందు 1935లో మేము ఆనాటి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రాంతం యువజన మహాసభ జరిపాము. "రాడికల్ యూత్" అనో, ఏదో పేరు పెట్టినాము. మా బహిరంగ కార్యకలాపాలకు అదొక అవకాశం. ఆంధ్ర నుండి కమ్యూనిస్టు దృక్పథం గల యువకులు చాలామంది హాజరైనారు. అలాగే తమిళనాడు నుండే కాకుండా కేరళ నుండి కూడా కాంగ్రెస్‌లో వామపక్ష భావాలు గల యువకులు, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీకి చెందినవారు చాలామంది వచ్చారు. మంచి ముద్ర చేయగలిగాం.

1935లోనే బొంబాయి కార్మికసమ్మె సందర్భంగా నింబాల్కర్, ముకుందలాల్



ఇరువురూ అరెస్టయినారు. వాళ్ళకు బెయిల్ కావాలి. మేజిస్ట్రేటు 2,000 రూపాయలు పూచీకత్తు కావాలన్నాడు. మా అన్న దగ్గరకు వెళ్ళి రెండు వేలు తెచ్చి, డిపాజిట్ కట్టి వారిని విడుదల చేయడానికి సహాయపడ్డాను.

తాను మీరట్ కేసులో వున్న ఆర్.యస్.ఓంకార్‌ని, బొంబాయిలో పార్టీ సభ్యుడిగా పనిచేస్తున్నానని, గిర్నీకాంగార్ యూనియన్ తాను చూస్తున్నానని అతిశయోక్తులు చెప్పేవాడు. నిజానికి అప్పటికతడు అధికారయుతంగా పార్టీ సభ్యుడు కాదు. ఆ రోజుల్లో ఫిలిప్‌స్ప్రాట్ తదితరులు వచ్చారు.

ఈ స్ప్రాట్ ఆ తర్వాత సింగారవేలు చెట్టి కూతుర్ని వివాహం చేసుకున్నాడు. మీరట్ కేసుకుముందే సింగారవేలు కమ్యూనిస్టు రాజకీయాలకు దూరమయ్యాడు. సామాన్య కార్మిక నాయకుడుగా వుంటున్నాడు. 1924 లో ఆయన చాలా ఉత్సాహంగా ఉద్యమంలో పనిచేశాడు. ఆయన భావాలు మొదట్లో యెలా వున్నా తర్వాత కమ్యూనిస్టు ఉద్యమం నుండి వైదొలిగాడు. అందుకనే నేను సింగారవేలు చెట్టిని కమ్యూనిస్టు ఉద్యమ ఆరంభకుడుగా ఆమోదించను, 1920 -24లలో కార్మిక ఉద్యమాలు నడిపాడు. ఆ రోజుల్లో కాస్త "మిలిటెంట్" వుద్యమం మేం నడిపినా, యెవరు నడిపినా దానికి ప్రభుత్వం "కమ్యూనిస్టు" అని ముద్ర వేస్తూండేది. అయితే సింగారవేలు తన స్వీయ చరిత్రలో ఏమి రాసుకున్నాడో చూడాలి.

అమీర్ హైదర్‌ఖాన్ సింగారవేలును కలుసుకునే ప్రయత్నం చేయలేదు. కారణం అప్పటికి చాలా సంవత్సరాలకు ముందే సింగారవేలుకు కమ్యూనిస్టు వుద్యమంతో సంబంధం పోయింది. పోలీసులు మాత్రం ఆయనను మొదట్లో పెద్ద కమ్యూనిస్టుగా తలపోసి కేసు పెట్టారు. కానీ తర్వాత ఆ కేసు వుపసంహరించుకున్నారు. ఉపసంహరణకు ఆయన అనారోగ్యం కారణంగా చెప్పారు.

ఆయన కూతురు, అల్లుడు వుండేవారు. సింగారవేలు ఆ తర్వాత సానుభూతిపరుడిగా కొనసాగాడు. స్ప్రాట్ ద్వారా ఆయనకు చాలా సంగతులు తెలిసి వుండవచ్చుగానీ ఆయన పాల్గొనేవాడు కాదు. ఏం జరిగిందో తెలియదు. ఆయన పార్టీ సభ్యత్వం అదీ వదులుకున్నాడు. ప్రారంభించిన కొత్తలోనే జారిపోయే వాళ్ళను నిర్మాతలుగా చెప్పడంలో అర్థం కాలేదు. నా అభిప్రాయం మాత్రం ఇది.

తమ జీవితాంతం మొదటి నుండి కమ్యూనిస్టు పార్టీలో కొనసాగేవారిని, చురుకుగా పాల్గొన్నవారిని వుద్యమ నిర్మాతలనవచ్చుగాని, వచ్చి మధ్యలో జారిపోయే వాళ్ళనలా అనలేము. అలా అయితే చాలామంది మొదట్లో వచ్చారు. జారిపోయారు. డాంగేని తీసుకోండి. ప్రారంభ దినాల్లో ఆయన పార్టీకి చాలా చేశాడు. ఇటీవలదాకా కమ్యూనిస్టు వుద్యమంలో వున్నాడు. ఆ తర్వాత జారిపోయాడు. అందుకనే ఆయన పార్టీ ప్రారంభ నిర్మాతల్లో ఒకడిగా నేను జమకట్టలేను. అంతమాత్రాన వారు మొదట్లో చేసిన కృషిని తక్కువ చేయమని కాదు. ఇది నా అభిప్రాయం ఎవరు అంగీకరిస్తారు. ఎవరు అంగీకరించరు అన్నదాంతో నాకు నిమిత్తం లేదు. 1934

నుండి 38 వరకు ఆంధ్ర దేశంలో నా కార్యకలాపాలెలా సాగినయ్యో యింకా వివరంగా చెప్పుకొనే సందర్భంలో ప్రధానంగా అలగానిపాడులో ఏ విధంగా వ్యవసాయ కార్మిక సంఘం యేర్పాటయిందీ, ఆ తర్వాత 36 నాటికి గుంటూరు, కృష్ణా జిల్లాలకెలా విస్తరించిందీ, అలాగే, "కార్మిక రక్షణ సమితి" ఏ విధంగా వివిధ ప్రాంతాల్లో నెలకొన్నదో కొంత రేఖామాత్రంగా చెప్పాను. "యూత్ లీగ్"ల ఏర్పాటు, దాన్ని రాష్ట్ర వ్యాపిత సంఘంగా నిర్మించటం, ఆ తర్వాత కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో పనిచేయడం - యివీ చెప్పాను. అయితే ఆంధ్రదేశంలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ అభివృద్ధి, అందులో నుండి చాలా యెక్కువ సంఖ్యలో కమ్యూనిస్టు పార్టీలోకి రావడం యివి చెప్పాల్సివుంది.

అయితే అంతకుముందు ఇంకో విషయం ప్రస్తావిస్తాను. 1932 -34 కాలంలో గ్రామంలో వుండగా విప్లవోద్యమంలో పాల్గొనేందుకు అనువుగా నా శరీరదారుఢ్యాన్ని పెంచుకోవడం ఒక కర్తవ్యంగా యెంచుకొన్నాను. బుచ్చిరెడ్డి పాలెంలో దొడ్ల ముద్దు కృష్ణారెడ్డి అని ఒక దూరపు బంధువు వుండేవాడు. ఆయన విదేశాలకు వెళ్ళి వచ్చాడు. సాంఘిక, రాజకీయ, ఆర్థిక శాస్త్రాలకు సంబంధించిన గ్రంథాలతో ఆయన దగ్గర ఒక మంచి లైబ్రరీ వున్నది. మా వూరు నుండి ఆయన గ్రామానికి 18 మైళ్ళు వుండేది. మా వూళ్ళో తెల్లవారు ఝామున లేచి నడిచి ఎనిమిదిన్నర తొమ్మిది గంటలకల్లా ఆ వూరు చేరేవాణ్ణి. అక్కడనే మూడు నాలుగు గంటలు గడిపి, ఆయనతో కలసి అక్కడే భోజనం చేసి మళ్ళీ మధ్యాహ్నం 1 గంటకు అక్కడ బయలుదేరి మా వూరు సాయంత్రం 5- 5.30 కల్లా వచ్చేవాణ్ణి. అయినా ఇంకో 5-10 మైళ్ళు నడవగల శక్తి వుండేది.

నెల్లూరు మావూరుకు 16 మైళ్ళు వుండేది. ఈ 16 మైళ్ళు కాలినడకనే వెళ్ళి వచ్చేవాణ్ణి. అలాగే నడవడంలో నా శరీర దారుఢ్యాన్ని అభివృద్ధి చేసుకునే వుద్దేశం కూడా లేకపోలేదు. బస్ సౌకర్యాలు అవీ లేకపోవడం, నా పని నెరవేర్చుకోవడం కూడా వుండేది అనుకోండి. ఆ తర్వాత సైకిలు కొన్నాను. మొత్తం మీద రోజుకు 50 -60 మైళ్ళు నడవగలనన్న విశ్వాసం నా కేర్పడింది.

సైకిలు కొన్న తర్వాత సైకిల్‌పై మద్రాస్ నుండి మా వూరుకు, మా వూరు నుండి మద్రాసుకు మూడుసార్లు వెళ్ళాను. మద్రాసు మావూరుకు 100 మైళ్ళుకు పైగా వుంటుంది. ఒకసారి మద్రాసులో బయలుదేరి నెల్లూరు వచ్చి, అక్కడ నుండి కందిపాడు వెళ్ళాను. మళ్ళీ ఆ సైకిలుపై నెల్లూరు వచ్చాను. ఇదంతా ఒకే ట్రిప్పులో.

సి.ఐ.డి.లు మద్రాసు నుండి నేను సైకిలుపై వస్తుంటే సైకిళ్ళతోనే వెంటపడేవారు. అయితే కొంతదూరం సైకిలు తొక్కేసరికి వారివల్ల కాకపోయేది. తిరిగి మద్రాసు వెళ్ళి ప్రమాణాలతో పోలిస్తే యిదేమీ పెద్ద ఘనకార్యం కాదు. కానీ ఈ శరీర ధారుఢ్యం, ఇవన్నీ కూడా 1940 లో పార్టీ రహస్యంగా వుండాల్సిన సమయంలో గానీ, ఆ తర్వాత తెలంగాణా



పోరాట సందర్భంలోగానీ నాకు బాగా ఉపయోగపడినాయి.

ప్రతి విప్లవకారుడూ తన శారీరక పటుత్వాన్ని రాటు దేల్చుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి అన్నది నా నిశ్చితాభిప్రాయం.

నేను "కర్రసాము" పూర్తిగా నేర్చుకోలేకపోయానన్నది మాత్రం అప్పుడప్పుడు నాకు లోటుగా అనిపిస్తుంది.

1942 -43 కాలంలో గెరిల్లా శిక్షణ కొంత పొందాను. గెరిల్లాకు కావలసిన మంచి లక్షణాలన్నీ నాకు వున్నాయనీ, దళాలకు బాగా నాయకత్వం వహించగలనని, ఆ శిక్షణ నేర్పినాయన నాకిచ్చిన ప్రశంస : ఆ శిక్షణలో శత్రువు వెంటాడుతుంటే తప్పించుకోవడం ఎలా అన్నది కూడా ఒక అంశం. ఒక చిన్నపొద, పొదనానుకొని చిన్న మురుగ్గుంట వున్నాయి. ఆ శిక్షణలో నేను ఆ రెంటినీ కలిపి దూకేశాను. సరే, అంతా కలిపి 16 -17 అడుగుల మించి "లాంగ్ జంప్" వుండి వుండేదేమో:

అలాగే ఏదన్నా సరస్సులోనో, చెరువులోనో దూకి శత్రువు గమనించకుండా ఈదుకుని వెళ్ళాలి. ఈత నేర్చుకున్నానని చెప్పాను కదా: అందులోనూ నీళ్ళలో మునిగి ఈదడం నాకు వచ్చును. ఆ శిక్షకుడు నిజంగానే ఆశ్చర్యపోయాడు.

నాకు కొండ యెక్కడం కూడా ఒక "హాబీ" ఆ శిక్షణా సమయంలోనే కొండ యెక్కడంలో ఆరితేరిన వారితో పోటీపడేవాణ్ణి. నేను చాలా త్వరగా యెక్కిదిగిరావడం వాళ్ళ ప్రయాణాల దృష్ట్యా చూస్తే వాళ్ళకు గొప్పగా అన్పించేది. ఇలాంటివన్నీ విప్లవకారుడు నిరంతరం సాధన చెయ్యాలి.

కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో కృషి గూర్చి చెప్పబోయేముందు యింకో విషయం కూడా చెప్తాను మద్రాసులో "ప్రెస్‌వర్కర్స్ యూనియన్" నిర్మించామనీ, అది బలమైన సంఘంగా వుండేదని చెప్పాను కదా! "ఆంధ్రపత్రిక" దినపత్రికలో పనిచేసే ప్రెస్ కార్మికులు కొన్ని కోర్కెలను యాజమాన్యం ముందు వుంచారు. చాలా చర్చలు జరిగాయి. అయినా కార్మికుల కోర్కెలను యాజమాన్యం అంగీకరించలేదు. ఇక సమ్మె చేయక తప్పలేదు. పత్రిక రెండు రోజులు ఆగిపోయింది.

వి.వి. గిరి, కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు నా వద్దకు వచ్చారు. సరే మళ్ళీ చర్చించి ఒక అంగీకారానికి వచ్చాము. సమ్మె విరమించాము. ఆ కోర్కెలు గొంతెమ్మ కోర్కెలు కావు. విజయం కూడా ఆర్థికపరంగా చాలా బ్రహ్మాండమని చెప్పలేము. కానీ, ఆ మేరకు అవి కార్మికుల స్థితిని కొంచెం మెరుగుపరిచేవి అవడంవల్ల కార్మికులలో ధైర్యం ఉత్సాహం వచ్చాయి.

కానీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు మాత్రం చాలా బాధపడ్డారు. "డబ్బు ఎంత నష్టం అన్నది ప్రశ్నకాదు. నా పరువుపోయింది కదా! మీరు గనుక ముందుగా నన్నే

కలిసినట్లయితే, యింత గొడవ లేకుండా ఒప్పందానికి వచ్చే వాళ్ళం కదా! ఏమైనా నా యాజమాన్యంలో వున్న 'పత్రిక'లో కూడా సమ్మె జరగటం నాకే మాత్రం గౌరవప్రదం కాదు" అని బాధపడ్డారు.

"మీ పత్రిక మేనేజ్‌మెంట్ చూస్తున్న వాళ్ళు మరీ మూర్ఖంగా, నిర్లక్ష్యంగా ప్రవర్తించారు గనుక సమ్మె చేయవలసి వచ్చిందని" వివరించాను. "గిరి" కూడా సరే! పరిశ్రమ అన్న తర్వాత యిలాంటివి వస్తూనే వుంటాయి. దాని కంత కలత చెందనక్కరలేదు" అని నచ్చజెప్పాడు. ఇంకా కొన్ని కోర్కెలు కూడా సాధించుకునేదాకా సమ్మె కొనసాగించగల శక్తి మాకు లేదు. ఏది ఏమైనా కార్మిక వర్గంలో మా పట్ల అభిమానం, విశ్వాసం పెరిగాయి.

ఆ రోజుల్లో యింకో ముఖ్యమైన విషయం యేమంటే, నేనొక ఆందోళనా కరపత్రం రాశాను. దాన్ని ముద్రించాము. కార్మికుల స్థితిగతులు, వారిపట్ల పరిశ్రమ యజమానుల వైఖరి, వారు యెలా భూస్వామ్య పద్ధతులు కూడా వినియోగించి వ్యవహరిస్తున్నారు – ఇవీ ఆ కరపత్రంలో ప్రధాన అంశాలు తర్వాత ఆ కరపత్రం వర్గవైషమ్యాన్ని ప్రోత్సహిస్తూ తిరుగుబాటును రెచ్చగొట్టేదిగా వుందని ప్రభుత్వం కేసు పెట్టింది.

ఆ కరపత్రం స్థూలంగా ఇది.

యజమానులు చెప్పేదేమంటే, ఈ కూలీలు, వారి తాత ముత్తాతలు ఒళ్ళువంచి పని చేయలేదు. అందుకని వాళ్ళకేమీ లేదు. మా తాత ముత్తాతలు చాలా శ్రమపడి పని చేశారు. మాకు ఆస్తిపాస్తులు వచ్చాయి – అన్నది వారి వాదన.

నిజమే, వాళ్ళ తాతముత్తాతలు పనిచేయలేదు. కానీ యిప్పుడు వాళ్ళు పని చేస్తున్నారు. మీ తాతముత్తాతలు పని చేశారు. కానీ మీరు యిప్పుడు పని చేయడం లేదు. తాత ముత్తాతలు కష్టపడడంవల్లనే ఆస్తులు పోగుగావు అన్న సంగతి అందరెరిగినదే. అదలా వుంచుదాం. మీ వాదనే అంగీకరిద్దాం అంటే పని చేయని వాళ్ళకు అనుభవించే హక్కులేదనే కదా: మీరు పని చేయడం లేదు గనుక మీ పిల్లలో, మనవలో, ముదిమనవలో అనుభవించేందుకు ఏమీ వుండరాదన్నమాట: కార్మికుల తాతముత్తాతలు కష్టపడి పని చేయలేదు గనుక ఈ రోజు వాళ్ళగతి ఇంతే అని మీరంటున్నారంటే అంతేకదా.

ఇదెలా వుందంటే వెనకటికి మనందరికీ తెలిసిన తోడేలు, గొఱ్ఱెపిల్ల కథలా వుంది. తోడేలు ఒక సెలయేరు ఎగువన నీళ్ళు తాగుతున్నదట! గొఱ్ఱెపిల్ల దిగువున నీళ్ళు తాగుతున్నదట.

"నా నీళ్ళనెందుకు మురికి చేస్తావ్? అని తోడేలు గొఱ్ఱెపిల్ల నడిగిందట.

"నే నెక్కడ మురికి చేశాను. నేను దిగువనగదా నీరు తాగుతున్నది" అని గొఱ్ఱెపిల్ల సమాధానం చెప్పిందట:

"ఇప్పుడు కాదు – కింద టేడాది మురికి చేశావ్" అందట తోడేలు.

"కిందట ఏడాదికి నేను పుట్టనేలేదు కదా" అందట గొఱ్ఱెపిల్ల.



"నువ్వు కాకపోతే, నీ తల్లి మురికి చేసింది" అని చెప్పి మింగేసిందట:

అలా వుంది మీ వాదన: ఎలాగూ కార్మికులను దోచుకోదలుచుకున్నారు. అందుకని యిలాంటి కట్టు కథలల్లుతున్నారు అని ఆ కరపత్రం ఇలా చాలా సులభంగా అర్థమయ్యేటట్లు వుందని మద్రాసు, గుంటూరు, నెల్లూరు, ఏలూరులో దాన్ని పునర్ముద్రించారు. మద్రాసులో కంభంపాటి సత్యనారాయణ అప్పటికే కార్మిక రక్షణ సమితితో పని చేస్తున్నాడుకదా: సమాజ శాంతికి భంగకరమైన ఈ కరపత్రం ముద్రాపకునిగా ఆయనను అరెస్టు చేశారు. గుంటూరులో జొన్నలగడ్డ రామలింగయ్యను ఈ నేరం మోపి అరెస్టు చేశారు. వీరికి 6 మాసాలు జైలు శిక్ష విధించారు.

నెల్లూరులో చుండి జగన్నాథం, రావి ఆదిశేషయ్య, బలరామిరెడ్డి వీళ్ళు వ్యక్తిగత జాతీయ విప్లవకారుల పంథా అనుసరించి, బాంబు కేసులో పట్టుబడి అప్పటికి విడుదలైనారు. వారు తమ పోరబాటు గ్రహించి మాతో కలిసి పని చేస్తున్నారు. చుండి జగన్నాథంపై కూడా ఈ నేరమే మోపారు. అయితే నెల్లూరు మేజిస్ట్రేటు, ఈ కరపత్రంలో అంత అభ్యంతరకరమైంది ఏమీలేదు. ఇలాంటివి మామూలేనని చెప్పి కేసు కొట్టివేశాడు.

ఇక్కడ ముఖ్య విషయమేమంటే, ప్రభుత్వం నన్ను నిర్బంధించి కేసు పెట్టాలని నిర్ణయించింది. నేను కాంగ్రెస్‌లో వుంటూ కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ పేరుతో కార్యక్రమాలన్నీ నిర్వహిస్తున్నాననీ, నేను నాయకుడిననీ ప్రభుత్వ ఉద్దేశం. నన్ను అరెస్టు చేస్తే ఈ ఆందోళనలు తగ్గిపోతాయని భావించింది.

నేను రాజమండ్రిలో సోషలిస్టు పార్టీ మహాసభలో ప్రసంగించాను. ఆ సందర్భంగా "కేవలం శాంతియుత పద్ధతులలోనే మనం ఆశించినది సిద్ధించదు అన్న విషయం మన అనుభవం రుజువు చేస్తున్నది. మన అనుభవమే కాదు. ప్రపంచ అనుభవమూ అదే" అని యూరప్ దేశాల అనుభవం చెప్పి "కనుక దేనికైనా మనం సిద్ధపడి వుండాలి" అని చెప్పాను. దాన్ని పట్టుకుని నేను వెన్వెంటనే సాయుధ పోరాటంలో బ్రిటిష్ వారిని చంపివేయమని రెచ్చగొట్టే ఉపన్యాసం చేసినట్టు ప్రభుత్వం వక్రీకరించింది.

ఆ రోజుల్లో షార్ట్‌హాండ్ ఇంకా మామూలు వాడకంలో లేదు. టేపు రికార్డర్లు లేవు. కనుక నా వుపన్యాసం అంటూ తప్పుల తడకగా, గందరగోళంగా ప్రభుత్వం ఒక వుపన్యాసాన్ని తయారు చేసింది.దాని ఆధారంగా నన్ను నిర్బంధించాలని, అలా నాపై నిఘా ఎక్కువైంది. మద్రాసులో నేనెటు కదలుతున్నా, మనవారిని కలుసుకునేందుకు వెళుతున్నా ప్రభుత్వ సి.ఐ.డిలు అనుసరించేవారు.

అయితే వాళ్ళు నాతోపాటు సైకిల్ తొక్కలేకపోయేవారు. నన్ను వెంబడించడం అంత తేలికయ్యేదికాదు. ఒకవేళ ఖర్మజాలక దగ్గర్లోకి రాగలిగినా ఏ సందులోకో సైకిల్ తిప్పి, వాళ్ళని తిప్పలు పెట్టేవాణ్ణి. అప్పటికింకా రహస్యంగా వెళ్ళామని నిర్ణయించుకోలేదు.కనుక పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తే దొరకడం కష్టమయినా అసంభవం మాత్రం కాదు. ఏదో

వంక దొరకాలిగా నన్ను నిర్బంధించేందుకు: అందుకు నేను రెచ్చగొట్టే వుపన్యాసం చేసినట్టు నాపై తప్పుడు అభియోగం మోపి కేసు పెట్టారు.

1936లో వివిధ జిల్లాలలో జిల్లా బోర్డు ఎన్నికలు జరుగుతున్నాయి. మా గ్రామం కూడా వున్న ఒక నియోజకవర్గంలో నెల్లూరు జిల్లాలో నన్ను నిలబెట్టారు. అలాగే ఇంకోచోట జి.సి. కొండయ్యను నిలబెట్టారు. యువ నాయకత్వాన్ని కొంతమందినైనా ఎన్నికలలో నిలబెట్టాలని అప్పుడు కాంగ్రెస్ భావించింది. జి.సి. కొండయ్య కూడా అప్పుడు తన పాత విధానం వదులుకుని బలరామిరెడ్డి వాళ్ళతోపాటు మాతోనే కలసి పనిచేస్తున్నాడు. కాంగ్రెస్ వారు కూడా ఈ ప్రతిపాదన ఆమోదించారు. కాంగ్రెస్ కార్యకలాపాల్లో కూడా మా అంత చురుగ్గా ఇతరులెవ్వరూ పాల్గొనేవారు కారు. అందువల్ల మా అభ్యర్థిత్వాన్ని కాంగ్రెస్‌వారు అందరూ సంతోషంగా బలపరిచారు.

ఈ ఎన్నికల ఏర్పాట్లలో వుండగా నన్ను తెనాలి రైల్వేస్టేషన్‌లో అరెస్టు చేసి కాకినాడకు తరలించారు. నేను ఇచ్చిన ఉపన్యాసం రాజమండ్రిలో కదా! అందుకని.

అయితే ఇలా మమ్మల్ని ఎప్పుడైనా సరే అరెస్టు చెయ్యవచ్చని 1934 నుండే అనుకుంటూ, తగిన జాగ్రత్తలు తీసుకొనేవాళ్ళం. ఈసారి నన్ను అరెస్టు చేయవచ్చని నేను అభిప్రాయపడుతూనే వున్నాను. అందుకనే నన్ను నిలబెట్టవద్దనీ, ఇతరులలో ఎవరైనా యింకో కాంగ్రెస్ వ్యక్తిని నిలబెట్టమని చెప్పాలని నిశ్చయించుకున్నాను. ఆ విషయంలో తగు నిర్ణయం తీసుకునేందుకు పార్టీ మీటింగో, పార్టీ కమిటీ మీటింగో అనుకుంటాను. అది తెనాలిలో నిర్ణయించాము. ఆ విషయం అక్కడ చెప్పి రహస్య జీవితానికి వెళ్దామని నా భావన! అందుకే తెనాలి వెళ్ళాను. రైలు దిగుతుండగానే ప్లాట్‌ఫారం మీద అరెస్టు చేశారు. ఇంకో రెండు మూడు రోజుల్లో నన్ను అరెస్టు చేయవచ్చునని అనుకుంటూనే ఉన్నాను. దానికి తగ్గట్టే కొందరు ప్రభుత్వోద్యోగస్తులు కూడా వ్యక్తిగతంగా కలసినప్పుడు నన్ను హెచ్చరిస్తూనే వున్నారు. కానీ ఆ రాత్రే నన్ను అరెస్టు చేస్తారని అనుకోలేదు.

అలాంటి అవకాశం వుందని అనిపించినపుడు తాత్సారం చేయడం మంచిదికాదు. ఇట్లా జరగవచ్చని సూచనలు వస్తున్నప్పుడే గనుక నేను రహస్యంగా వెళ్ళిపోయినట్లయితే ఈ అరెస్టు నివారింపబడేది. చూద్దాములే అని చివరి క్షణం దాకా ఎప్పుడూ వేచివుండకూడదు.

కాకినాడలో డా॥ చెలికాని రామారావు వున్నాడు. ఆయన కాంగ్రెస్ వాది. జైలుకు వెళ్ళివచ్చిన అనంతరం కాకినాడలో ప్రాక్టీసు ప్రారంభించాడు. ఆ కుటుంబంతో వుండేవాడిని.

నాకు బెయిల్ కోసం శేషగిరిరావు అని అక్కడ ప్రఖ్యాతి చెందిన క్రిమినల్ లాయర్ ద్వారా ప్రయత్నించాము. తూర్పుగోదావరి జిల్లా దాటకుండా వుండే షరతుపై నాకు బెయిల్ దొరికింది.

కేసు విషయంలో "ప్రభుత్వం నా వుపన్యాసం పేరుతో తయారు చేసిన వుపన్యాసం వుత్త "బోగస్" అనీ, ఆ రిపోర్ట్ ఎవరో వ్రాతచేతగాని వాడిదనీ, నేనలా మాట్లాడలేదనీ, సౌమ్యంగా



మాట్లాడడమే నా అలవాటనీ, అలాంటి పదజాలం నేను వాడనే వాడననీ, పైగా ప్రభుత్వ తయారీ వుపన్యాసం చదువుతుంటే అంతా తప్పుల తడకగా, ఆసందర్భంగా గందరగోళంగా వుందనీ, అది కేవలం కల్పితమేనని, కనుక నన్ను నిర్దోషిగా గుర్తించాలనీ" నా తరపు వకీలు చాలా బలంగా వాదించాడు.

అయినా కోర్టుకివేవీ అక్కర్లేదు. ఏదో విధంగా నన్ను నిర్బంధించడమే కావలసింది. ఆ మేరకు, నాకు రెండు సంవత్సరాలు కారాగార శిక్ష విధించారు.

నేను సౌమ్యంగా మాట్లాడతాననీ, చెప్పదలచుకున్న అంశాన్ని అర్థమయ్యేటట్లు చెప్పగలనని, కాకుంటే బ్రహ్మాండమైన వక్తను కాననీ అప్పటికే ఒక అభిప్రాయం వుంది. బహుశా ఇప్పటికీ అదే అభిప్రాయం వుండి వుండాలి! ఆకర్షణీయంగా మంచి వక్తలా మాట్లాడడం మంచిదే! కానీ చెప్పాల్సిన అంశం లేకుండా వూకదంపుడు వుపన్యాసాలు మాత్రం దండగని, మనం మాట్లాడినంత సేపూ ప్రజలు శ్రద్ధగా ఆసక్తితో వినేలా చేసుకోవడం ఎంత ముఖ్యమో, వుపన్యాసం అయిన తర్వాత కొన్ని ముఖ్యమైన విషయాలైనా శ్రోతలలో మిగిలి వుంటాయో లేదో చూసుకోవడం కూడా చాలా అవసరం.

సరే! హైకోర్టుకు అప్పీలు చేసుకున్నాం. హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ బెయిలలో సాధారణంగా వుండే షరతులు – నేనెక్కడా ఇలాంటి రెచ్చగొట్టే వుపన్యాసాలు ఇవ్వరాదనీ, అలాంటి కార్యకలాపాల్లో పాల్గొనరాదనీ, ఇలాంటివన్నీ వున్నాయిగానీ, ప్రత్యేకంగా నా కదలికలపై ఎలాంటి ఆటంకాలు లేవు. ఎలాగూ నేను పెద్ద వుపన్యాసకుణ్ణి కాదు.

నేను తేజపూర్ వెళ్ళాలి. తేజ్‌పూర్‌లో కేంద్రకమిటీ సమావేశం జరగాల్సి వుంది. అక్కడ మాట్లాడుకుని భవిష్యత్ కార్యక్రమం నిర్ణయించుకోవాలి! అలాగే నూతన సంబంధాలు ఇవన్నీ కూడా ఏర్పాటు చేసుకోవాలి! జైలు నుండి సరాసరి వస్తున్నాను గనుక, దారిలో మా వూరు వెళ్ళలేదు గనుక నా వద్ద పైకం లేదు. దారిలో దిగి కాట్రగడ్డ మధుసూదనరావును కలుసుకుని విషయం చెప్పి యాభై లేదా వందరూపాయలు ఇవ్వమనీ, తిరిగిరాగానే ఇచ్చేస్తాననీ చెప్పాను. ఆయన వందరూపాయలు ఇచ్చాడు. తర్వాత వంద రూపాయలు తిరిగి ఇవ్వబోతే తీసుకోలేదు. "తిరిగి ఇస్తే తీసుకుందామన్న ఉద్దేశంతో నేనివ్వలేదు. నా వంతు కర్తవ్యాలలో అదొకటిగా మాత్రమే చేశాను" అని ఆయన చెప్పాడు. ఆ విధంగా నాకు కాట్రగడ్డ వారి కుటుంబంతో సాన్నిహిత్యం వుండేది. 1934 నుండి ఆ కుటుంబం నాకు తెలుసు. కాట్రగడ్డ మధుసూదనరావు, భవానీ, నారాయణరావు, శ్రీనివాసరావు – వీళ్ళంతా నాకు సన్నిహితులుగా వుండేవారు. నా పట్ల వారికి చాలా గౌరవం కూడాను.

1933 –34 లో కమ్యూనిస్టు మానిఫెస్టో అనువదించి ముద్రించే సందర్భంలో తరచుగా ఏలూరు, విజయవాడ మధ్య తిరగవలసి వచ్చేది. నా సైకిలు వాహనం వుండనే వుంది కదా! ఒకోసారి సైకిలుపై ఏ అర్ధరాత్రో, అపరాత్రో విజయవాడ జేరేవాణ్ని. నారాయణరావు నా కోసం భోజనం చేయకుండా యెదురు చూస్తుండేవారు. ఇద్దరం కలిసి వంటింట్లోకి వెళ్ళి

వున్నదేదో తినేవాళ్ళం. నారాయణరావు అమ్మగార్కి కూడా నాకు మీగడ అంటే చాలా ఇష్టమని తెలుసు. అందుకని వాళ్ళమ్మగారు ప్రత్యేకించి గిన్నెలో మీగడ, పెరుగు నా కోసం వుంచేవారు.

బెయిల్ వచ్చిన రెండు నెలలకల్లా హైకోర్టు నా కేసును పరిశీలించి, శిక్ష 6 నెలలకు తగ్గించింది. మళ్ళీ నేను జైలుకు వెళ్ళవలసి వచ్చింది.

ఈ లోపల "యేచూరు" మహాసభలకు వెళ్ళాను. అక్కడ కామ్రేడ్ భరద్వాజ కలిశాడు. ఇద్దరం మాట్లాడుకున్నాం. ఏవో డాక్యుమెంట్లు తీసుకున్నాను. ఇక్కడ పని వివరించాను. ఇది అంత ప్రధానమైనది కాదు. కేరళ, ఆంధ్ర కామ్రేడ్స్‌తో సంబంధాలు వుంచుకోవడం,పెంచుకోవడం అలాగే పార్టీ నూతన విధానాన్ని అందరూ ఆమోదించేట్టు చూడడం ముఖ్యమైంది. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో జేరి కార్యక్రమాలు కొనసాగించాలి అన్నది ఆ విధానం. అదే సమయంలో మన యూత్ లీగ్ పార్టీ నిర్మాణం వీటిని అశ్రద్ధ చేసేందుకు లేదు.

1936 పి.సి. జోషి అఖిల భారత స్థాయిలో కార్యదర్శిగా ఎన్నుకోబడినాడు. కాంగ్రెస్, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ, సోషలిస్టులు అందరూ కలిసి ఒక పెద్ద ఉద్యమాన్ని నిర్మించాలనీ, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో మనం ప్రత్యేకించి కృషి చేయాలని ప్రధానంగా సూచించాడు.

ఇంకా పార్టీలో చర్చ సాగుతూనే వున్నది. మేము కమ్యూనిస్టు అంతర్జాతీయ సంస్థకు అనుబంధంగా వున్నాము. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ అందుకు అంగీకరించదు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో వుండేవాళ్ళు ఖచ్చితంగా కాంగ్రెస్ పార్టీలో సభ్యులై ఉండాలి. అంతకుముందు ఈ కాంగ్రెస్‌ను, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీని మేము అవహేళన చేస్తూ వచ్చాము. కాంగ్రెస్‌లో సోషలిజం ఏమిటి? కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఏమిటి? అని అంతేకాదు. నాకు గుర్తున్నంతలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీని సోషల్ ఫాసిస్టు పార్టీ అని కూడా అన్నట్లు వుంది.

ఇప్పుడు అదంతా కాదు. ఈ నూతన థీసిస్ ప్రకారం ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరి, కాంగ్రెస్, సోషలిస్టు పార్టీలో వుంటూ కలిసి పనిచెయ్యాలి. అయితే యిలాంటి ఐక్యతా ప్రయత్నాలకు ప్రధానంగా మసానీ, అశోక్‌మెహతా అడ్డుపడుతూ వచ్చేవారు. వీళ్ళు సోషలిస్టులలో కూడా మితవాదులు. "మనం కమ్యూనిస్టుల మీద ఆధారపడడం ఏమిటి? వాళ్ళకీ, మనకూ పొత్తు కుదరదు. వాళ్ళని దూరంగా వుంచాలి" అని వాళ్ళ వాదన. . అయితే జయప్రకాష్ నారాయణ్ ఐక్యతకు అనుకూలం. ఆయనకు నరేంద్రదేవ్ మద్దతు– కామ్రేడ్ ఇ.యం.యస్, కామ్రేడ్ దినకర్ మెహతా, బాట్లీవాలా వీళ్ళు సరే, యెలాగూ కమ్యూనిస్టులతో ఐక్యతకు సిద్ధమే! వీళ్ళల్లో కొందరు, కాంగ్రెస్‌లోనే అతివాద భావాలు గలవారు, కమ్యూనిస్టు అభిమానులు. కొందరైతే కమ్యూనిస్టు పార్టీ సభ్యులు కూడాను, దినకర్ మెహతా, బాట్లీవాలా లాంటివాళ్ళు.

మేము ఇక్కడ ఆంధ్రదేశంలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో జేరాము. అప్పటికే మనకు కాస్తో కూస్తో నిర్మాణయుతమైన యూత్‌లీగ్ యివన్నీ వున్నాయి.గదా! కనుక కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో మనమే చొరవతో, ఉత్సాహంతో పనిచేసేవాళ్ళము.



కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో కమ్యూనిస్టులతో కలిసి పనిచేయడం పట్ల వచ్చిన విభేదాలను దృష్టిలో వుంచుకుని జయప్రకాష్ నారాయణ్ ఆంధ్రదేశం పర్యటించాలని నిశ్చయమైంది. ఆయనతో పాటు నేను కూడా వుండాలని కూడా అనుకున్నాము. ఆ మేరకు ఆయన విజయవాడ, పామర్రు, ఎలమర్రు, రాజమండ్రి, గుంటూరు – యిలా చాలా చోట్ల పర్యటించారు. ఆయన సభలకు యువకులు చాలా పెద్ద సంఖ్యలో హాజరవడం ఆయన స్వయంగా గమనించారు. ప్రత్యేక కృషితో సమీకరించాము. మన యూత్ లీగ్ వుండనే వున్నది. నిర్మాణయుతమై కూడా వుంది కదా! అందుకని సమీకరణ సులభమైంది. ఇప్పటికి రాజేశ్వరరావు చదువు వదిలేసి పూర్తికాలం కార్యకర్తగా వచ్చాడు.

ఆ పర్యటనలో ఆయన మనకు ప్రజలలో వున్న పలుకుబడి, గౌరవాలపట్ల, నిర్మాణదక్షతపట్ల చాలా సంతృప్తి చెందాడు. ఆ పర్యటన సందర్భంగా ఆయన "మీరు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో జేరాలని ఎందుకనుకుంటున్నారు?" అని నన్నడిగారు. "ఏముంది! సోషలిస్టు ఆశయాన్ని బలోపేతం చేద్దామని" అన్నాను. ఆయనకు నేను కమ్యూనిస్టునని తెలుసు. అందుకని "కమ్యూనిస్టులుగా యిందులో జేరి ఏం సాధించాలని?" అని అడిగాడు. "సోషలిస్టు భావాలు గల శక్తులతో యేకమై – సోషలిజం పట్ల అనుకూలంగా ప్రజలలో మార్పు తీసుకువచ్చేందుకు ఐక్య కృషి వలన మరింత వుపయోగం అని భావిస్తున్నాను. ఈ కార్యక్రమం సరిపోదనీ, సాధించవలసిన దానికన్నా చాలా తక్కువ స్థాయికే పరిమితమవుతుందనీ మాకు తెలుసు. అయితే అది తర్వాత అనుభవం ద్వారా మేము గానీ, మీరుగానీ నేర్చుకోవచ్చు. ఈ లోపల సోషలిస్టు ఆశయం శక్తివంతంగా బలపడటం మన ఉభయులకూ ఇష్టమే కదా! కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి వుంటాము" అని చెప్పాను. ఆయన అంగీకరించారు. కమ్యూనిస్టులతో కలసి పనిచెయ్యడంలో తప్పులేదని, అది సోషలిస్టులకు వుపయుక్తమేనన్న నిర్ణయానికి వచ్చి, ఆ విధంగానే తమ వారితో చెప్పాడు.

పాలకొల్లులో జయప్రకాష్ నారాయణ్ మీటింగ్‌కు వాళ్ళు – అంటే, యీ కలయికను అంగీకరించనివారు – వారి శక్తులను సమీకరించారు. మన శక్తులను మనం సమీకరించాము. వాళ్ళు మా కన్నా పెద్ద సంఖ్యలో వున్నారు. అప్పుడే చెప్పాం. వారిని యెవరినీ దూరంగా వుంచదలచుకోలేదనీ, వివిధ కార్యనిర్వాహక కమిటీలలో వారిని జేర్చుకోవాలన్నదే మా అభిమతమనీ, మాకు కావలసిందల్లా ఉద్యమం బలపడాలి! యెక్కువమంది మనతో రావాలి! వాళ్ళకు నాయకులలో ప్రధానంగా రంగశాయి, క్రొవ్విడి లింగరాజు వీళ్ళున్నారు. పున్నయ్య కూడా వున్నాడు కానీ, అతడు మాతోనే యెక్కువగా యేకీభవించేవాడు. ఆ తర్వాత పార్టీలో కూడా జేరాడు.

కనుక వారిని వదిలివేయకుండా, వారికి కమిటీలలో సముచితస్థానం ఇస్తూనే నేను కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కార్యదర్శిగా ఎన్నికయ్యాను. ఆంధ్రదేశానికి సంబంధించినంతవరకూ కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో మాదే ప్రధాన భాగం. కేరళ, తమిళనాడు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలలో కూడా మెజారిటీ మాతోనే వుండేది. ఆ తర్వాత వారిలో అత్యధికులు కమ్యూనిస్టులకు అనుకూలంగా వుండేవారు.

1938 లాహోర్ సోషలిస్టు పార్టీ మహాసభ జరిగింది. ప్రతినిధి వర్గంగా మేము వెళ్లాము. అక్కడ రాజకీయ తీర్మానం తదితర అంశాలు చర్చనీయాంశాలయినాయి. ఒక విషయంలో మనం తీసుకున్న వైఖరి సరి అయినది కాదు అని ఆనాడే నేననుకున్నాను. అక్కడ జరిగినదేమంటే ప్రధానమైన రాజకీయ అంశం వచ్చినపుడు "ఓటింగ్" కొరకు వత్తిడి చేయకుండా రాజీపడ్డాము. అప్పుడు బాట్లీ వాలా నాయకుడుగా వ్యవహరించాడనుకుంటాను. అయితే కార్యవర్గానికి యెన్నిక జరిగే సందర్భంలో వాళ్ళు కొన్ని సీట్లు మనకు యిచ్చేందుకు సిద్ధమైనారు. మనం యింకా కావాలని పట్టుబట్టాము. వారంగీకరించలేదు. మనం వేరే ప్యానల్ ప్రవేశపెట్టాము. మన ప్యానల్‌లో వాళ్ళలో అతి ముఖ్యులను మాత్రం వుంచి చాలా యెక్కువ సంఖ్యలో మన వాళ్ళను జేర్చాము. సహజంగా వాళ్ళు తక్కువయి మనం ఎక్కువవడం లేదా అతి ప్రధాన పదవులలో, బాధ్యతలలో మనం ఉండడం వారికి ఆమోదయోగ్యం కాదు గదా! చివరికి జయప్రకాష్ నారాయణ్, నరేంద్రదేవ్ లాంటివారు కూడా వారి ప్యానల్‌కే ఓటు వేశారు. దానితో మనలో చాలామందికి కార్యవర్గంలో ఉద్వాసన జరిగింది. సరే నంబూదిపాద్, కృష్ణపిళ్ళై వంటి వారికి వారు ఉద్వాసన చెప్పలేదు. వాళ్ళకు కమ్యూనిస్టులుగా అప్పటికి గుర్తింపు లేదు. నిజానికి అధికారయుతంగా వాళ్ళప్పటికి కమ్యూనిస్టులు కాదు. ఇలాంటి వారిని కూడా వారు దూరం చేసుకుంటే మొత్తం వారి వెనకాల వున్న వాళ్ళలోనే పెద్దగండి పడుతుంది.

మమ్మల్ని కూడా పార్టీ నుండి బహిష్కరించలేదు. అఖిల భారత స్థాయి కార్యవర్గంలో మనకు తగిన స్థానం మాత్రం యివ్వలేదు – ఇదీ జరిగింది. అంతకుముందు కార్మిక సంఘాల చీలిక సందర్భంలో కూడా కేంద్రకమిటీ ఒక విషయం చెప్పింది. ప్రధాన విధాన నిర్ణయాలపై పోరాడకుండా నిర్మాణ అంశంగా దాన్ని మార్చి మనమే మొత్తం సంఘాన్నంతా అదుపులో వుంచదలుచుకున్నామన్న అభిప్రాయం కలుగజేయడం మంచిది కాదనీ, దానివల్ల వాళ్ళకు అవకాశం యిచ్చిన వారమవుతామనీ కేంద్ర కమిటీ చెప్పనే చెప్పింది. మన డిమాండ్లు న్యాయ సమ్మతమయినప్పుడు వాటి కోసం పోరాడాలి! ఈ ఎన్నికలు, నిర్మాణం అలాంటి సందర్భాలల్లో మిగతావారిపై ప్రభావం కల్గించే ప్రయత్నాలు చేస్తూ పరిస్థితి ఎలా మారనున్నదో గమనిస్తూ సరైన అవకాశం కోసం ఎదురుచూస్తూ వుండాలి! అంతేగానీ, మన బలం నిరూపించేందుకై తొందరపడకూడదు. ఐక్యకార్యాచరణ అన్నప్పుడు మొత్తం కార్యవర్గంలో అంతటిలో మనమే వుండాలనుకుంటున్నామన్న భావం కలుగకుండా జాగ్రత్తపడాలి! అలా చేసినట్లయితే వాళ్ళు మెజారిటీ అయితే మనల్ని గెంటివేస్తారు. మనం మెజారిటీ అయితే వాళ్ళు చీలిపోయి వేరేసంఘం పెడతారు.

కార్మిక సంఘాలకు సంబంధించి అదే జరిగింది. అయినా ఆ అనుభవంతో లాహోర్ సోషలిస్టు పార్టీలో జాగ్రత్తపడలేదు. ఇది పెద్ద పొరబాటు.

పార్టీ సభ్యులుగా మా ప్యానల్‌కు మేము వోటు చేశాం. వోడిపోయాం. కానీ దీనివల్ల కోరుకున్న ఐక్యత రాకపోగా చీలిక తీవ్రమయింది. అయితే 1939 –40 లలో గానీ మమ్మల్ని



పూర్తిగా బహిష్కరించలేదనుకోండి. అది కూడా ప్రపంచయుద్ధం మొదలైన తర్వాత అప్పుడు మన కార్యక్రమం యెలా వుండాలి అన్న అంశంపై వచ్చిన విభేదాల వల్ల జరిగిందే! నాకు గుర్తున్నంతలో వాళ్ళు ఈ యుద్ధ సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా దాదాపు గాంధీజి మార్గంలో వ్యక్తిగత సత్యాగ్రహమూ, ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని అనుకొంటుండగా, మేము మొత్తంగా తుండూ తుపాకీ లేపేందుకు ఎదిరించాలని అనే భావంతో ఉన్నాం. ఇవి రెండూ భిన్న కార్యక్రమాలు. పార్టీ చరిత్ర రాసే సందర్భంలో డాక్యుమెంట్లన్నీ పరిశీలించి ఖచ్చితమైన సమాచారం యివ్వాల్సి వుంటుంది. ఆ తర్వాత మేము రహస్య జీవితానికి వెళ్ళవలసి వచ్చింది. అవన్నీ వేరే విషయాలు.

అయితే ప్రధాన అంశం ఏమంటే కేరళ, తమిళనాడు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో కొందరు వ్యక్తులు తప్ప అందరూ కమ్యూనిస్టులే! ఆంధ్రలో కొద్దిమంది తప్ప కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ అంతా కమ్యూనిస్టులే! అందుకే మసానీ లాంటి వాళ్ళు అనేవాళ్ళు ఈ కమ్యూనిస్టులదంతా "ట్రోజన్ హార్స్" యెత్తుగడలు. ముందు మెల్లగా మనతో జేరటం, క్రమేపి మనలను లేకుండా చేసి మొత్తం పార్టీ యంత్రాంగాన్ని స్వాధీనం చేసుకోవడం కమ్యూనిస్టుల పద్ధతి" అని. జయప్రకాష్ నారాయణ్ కమ్యూనిస్టులతో కలసి పనిచేయవచ్చునన్న తప్పుడు నిర్ణయం తీసుకున్నందుకు ఆయనపై ఈ అశోక్‌మెహతా, మసానీ, వీళ్ళు విమర్శపెట్టారు.

జయప్రకాష్ నారాయణ్ కూడా ఆశ్చర్యపోయాడు. కేరళ, తమిళనాడు, ఆంధ్రలలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో కమ్యూనిస్టులు పెద్ద మెజారిటీగా వున్నారు. సోషలిస్టులు చాలా అల్పసంఖ్యలో మిగిలిపోయారు. అందుకని తన తప్పుని వాళ్ళ యెదుట అంగీకరించి కమ్యూనిస్టు వ్యతిరేకంగా మారిపోయాడు. అయితే కొంత ప్రజాస్వామ్యయుతంగా వుండేవాడు. మిగతావారిలా పచ్చి కమ్యూనిస్టు వ్యతిరేకిగా మారలేదు. అయినా తను కమ్యూనిస్టుల చేత మోసగింపబడినట్లు మాత్రం ఆయన భావించాడు. అదే అభిప్రాయం వెలిబుచ్చాడు కూడా!

అయితే మా వాదన ఏమంటే "ఈ మూడు రాష్ట్రాలలో సోషలిస్టు పార్టీకి వ్యతిరేకంగా మేము యేమీ కుట్ర చెయ్యలేదు. మీ విధానాలు వారికి సంతృప్తి కలిగించలేదు. పరిస్థితికి తగినట్లు లేవు. కమ్యూనిస్టు పార్టీ విధానాలు వారిని ఆకట్టుకున్నాయి. అందువల్ల వారి కమ్యూనిస్టులవైపు మొగ్గారు. అంతకన్నా వేరే యేమీలేదు. మీరు మీ విధానాలను మార్చుకోవాలి గానీ, మమ్మల్ని నిందించి ప్రయోజనం ఏమిటి?" అని, అయితే వారికి యివేమీ చెవికెక్కలేదు.

ఐక్యసంఘటన, ఐక్యకార్యాచరణ నడుపుతున్నామంటేనే క్రమేపీ మెజారిటీని సంపాదించుకునేందుకు అని. ఆ విధంగా జరిగేటట్లు యితరులను ప్రభావితం చేయకూడదని కాని, సిద్ధాంత పరిజ్ఞానం కల్పించరాదని గాని యెక్కడా లేదని కూడా చెప్పాము.

కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఈ విధంగా శక్తిమంతమైంది. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కార్యదర్శిగా పార్టీని శక్తిమంతం చేసుకునేందుకు నేను కృషి చెయ్యాలి కదా! వివిధ ప్రజాసంఘాలలో ఎలా పని చెయ్యాలి? బహిరంగ సభలు ఎలా నిర్వహించాలి? ఇలాంటివన్నీ

చిన్న చిన్న సర్క్యులర్‌లు రాసి కార్యకర్తలకు అందించేవాడిని. 1938 మొదట్లో ఈ సర్క్యులర్‌లనన్నింటినీ కలిపి చిన్న బుక్‌లెట్‌గా వేశాం! ఈనాటికి కూడా ఖచ్చితంగా నేనొకటి చెప్పగలను. ఏవో కొన్ని చిన్న చిన్న మార్పులు తప్పిస్తే, ఆరోజుల్లో ఆ బుక్‌లెట్ పార్టీ నిర్మాణానికి కార్యకర్తల పనిని మెరుగుపరచుకునేందుకు ఎంతగానో దోహదపడింది.

ఆ రోజుల్లోనే పార్టీ కార్యకర్తలను చైతన్యవంతులను చేసుకునేందుకై రాజకీయ పాఠశాలలు నిర్వహించాము. 1937 మేలో ఒంగోలు తాలూకా కొత్తపట్నంలో ఒక స్కూలు జరిగింది. అప్పటికి కొంచెం ముందుగానే ఎన్నికలు జరిగాయి. కానీ కాంగ్రెస్ వారు మంత్రి వర్గాల్లో జేరలేదు. కూర్మా వెంకటరెడ్డి నాయకుడి చేత తాత్కాలిక ప్రభుత్వాన్ని గవర్నర్ ఏర్పాటు చేయించాడు.

కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ పేరుతోనే ఆ స్కూలును నిర్వహించాము. అయితే "యూత్‌లీగ్"కు సంబంధించిన వాళ్ళు కూడా పాల్గొన్నారు. ఈ విద్యార్థులలో చాలామంది తర్వాత కాలంలో కమ్యూనిస్టు ఉద్యమంలో వివిధ స్థాయిలో వున్నారు. అప్పుడే అన్నాప్రగడ కామేశ్వరరావు కూడా స్కూలులో వున్నాడు. ఆయన అంతకు ముందే రష్యా వెళ్ళి శిక్షణ పొంది వచ్చాడు. ఆ తర్వాత తూర్పు ఆఫ్రికా వెళ్ళాడు. అక్కడ నుండి తిరిగి వచ్చిన తర్వాత కమ్యూనిస్టు పార్టీలో జేరాడు. ఆ రోజుల్లో ఆయన ముఖ్య నాయకుడే! ఆంధ్ర కమిటీలో ఆయనను, మద్దూరి అన్నపూర్ణయ్యను కూడా తీసుకున్నాము. ఆ స్కూలు నిర్వహణకు కామేశ్వరరావు ప్రధాన బాధ్యుడు. కాంగ్రెస్‌లో వున్న అతివాదుల సహాయం, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ వారి సహకారం, యూత్‌లీగ్ సహాయ సహకారాలు వుండనే వున్నాయి – వారందరి సహకారంతో ఆయన ఆ పాఠశాల నిర్వహణ బాధ్యత చేపట్టాడు.

రాజమండ్రిలో "శాంతి భద్రతలకు భంగకరంగా వుండే ఉపన్యాసం నేను ఇచ్చానన్న ఆరోపణపై హైకోర్టు శిక్ష తగ్గించినా, ఆరు నెలలు మిగిల్చిందన్న విషయం చెప్పాను కదా! ఆ కేసు సందర్భంగా నేను జైలులో వున్నాను. నేను జైల్లో వున్నప్పుడు ఈ కొత్తపట్నం రాజకీయ పాఠశాల జరిగింది. పోలీసులు పాఠశాలపై దాడిచేసి, విద్యార్థులను ఎక్కడివాళ్ళను అక్కడకు వెళ్ళిపొమ్మన్నారు. మనవాళ్ళు అలా వెళ్ళేందుకు అంగీకరించలేదు. పోలీసులు లాఠీచార్జీ చేశారు. కొందరికి దెబ్బలు తగిలాయి. కొందరిపై పోలీసులు తప్పుడు కేసులు బనాయించారు. తర్వాత ఆ కేసుల ఉపసంహరణకు, పోలీసుల చర్యకు వ్యతిరేకంగా పెద్ద ఆందోళన జరిగింది. చివరకు పోలీసులే కేసులను ఉపసంహరించుకున్నారు. ఈ పాఠశాల పదిహేను రోజులపాటు జరిగింది.

ఆ తర్వాత 1938లో మంతెనవారి పాలెంలో రాజకీయ పాఠశాల నడిపాము. ఆ పాఠశాల దాదాపు నెలపాటు జరిగింది. ఆ పాఠశాలలో నేను కూడా వున్నాను. ఆల్ ఇండియా నాయకత్వం దేశపాండే, పి.సి. జోషి, భరద్వాజ్ వీరందరూ వచ్చారు. వివిధ పాఠ్యాంశాలపై వాళ్ళు బోధించారు. ఈ కొత్తపట్నం, మంతెనవారి పాలెం రాజకీయ పాఠశాలలు మౌలికమైన అంశాలపై పునాది ఏర్పాటు చేసుకునే అవకాశం మన కార్యకర్తలలో చాలామందికి



కలిగించాయి. ఫలితంగా కాంగ్రెస్ సోషలిస్టుపార్టీలోను, కమ్యూనిస్టు ఉద్యమ నిర్వహణలోనూ, కార్యకర్తల పని విధానంలోనూ మంచి మెరుగుదల వచ్చింది.

ఈ స్కూళ్ళు మేము నడపక ముందే యన్.జి.రంగా నిడుబ్రోలులో కిసాన్ పాఠశాలలు నిర్వహించేవాడు. ఒకసారి కమ్యూనిస్టు వుద్యమాన్ని గూర్చి లేదా అలాంటి అంశమేదో మాట్లాడవలసిందిగా నన్ను కూడా ఆయన ఆహ్వానించాడు. నేను అంగీకరించాను. 1935లోనో 36లనో అందుకై నిడుబ్రోలు వెళ్ళాను.

నేను ప్రధానంగా పారిస్ కమ్యూన్ నుండి రష్యా విప్లవ విజయం వరకూ చదివాను. ప్రధాన అంశం ఏమంటే పెట్టుబడిదారీ వర్గం విప్లవాన్ని పరిపూర్ణం చెయ్యలేదన్నదని, 1848లోనే కార్మికవర్గ పురోగమనానికి భయపడి పెట్టుబడిదారీ వర్గం ఏ విధంగా భూస్వామ్య విధానంతో లాలూచీపడిందీ. చెప్పి, పటిష్ఠమైన కార్మికవర్గ పార్టీ నిర్మాణావశ్యకత గూర్చి చెప్పాను. రైతాంగం, వ్యవసాయం కార్మికులు తమ తమ సంఘాలలో సంఘటితపడాలని – ఇవీ ముఖ్యమైన అంశాలు.

రైతాంగం అంటే రంగాగారి "రైతాంగం" అన్న అర్థం కాదు. ఆ రాజకీయ పాఠశాల ప్రధానంగా రంగా తన అనుచర వర్గాన్ని సృష్టించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. కానీ, నా ఉపన్యాసం ఆయన పాఠశాల విద్యార్థులలో చాలామందిపై మంచి ప్రభావాన్ని కల్గించిందనే చెప్పాలి! ఆ పాఠశాలలో చాలామంది విద్యార్థులు తర్వాత కమ్యూనిస్టు వుద్యమంలోకి వచ్చారు. కామ్రేడ్స్ మాకినేని బసవపున్నయ్య, కంఠంనేని వెంకటరత్నం మొదలైనవారున్నారు. అయితే మరి కొందరు మళ్ళా కాంగ్రెస్ పార్టీలో జేరారు. పిడతల రంగారెడ్డి, కందుల ఓబుల్‌రెడ్డి, బాలిరెడ్డి అలాంటివారు. ఆ తర్వాత వారిలో కొందర్ని తొలగించాల్సి వచ్చింది. కొందరు తమంత తామే పార్టీ సభ్యత్వం వదులుకున్నారు.

ఈ కాలంలో జరిగిన ఇంకో ముఖ్యమైన సంఘటన ఒకటున్నది. వ్యవసాయ కార్మిక వుద్యమం నిర్మిస్తూ వున్నాం. అదే సమయంలో కిసాన్ సభ నిర్మాణం కూడా చేపట్టాము. 1934 –35 ల్లోనే ఆరంభించాము. ఈ సమయంలో ఇచ్ఛాపురం నుండి మద్రాసు దాకా "కిసాన్ యాత్ర" నిర్వహించాము. కొమ్మారెడ్డి సత్యనారాయణ, చలసాని వాసుదేవరావు దానికి నాయకత్వం వహించారు. కొమ్మారెడ్డి సత్యనారాయణ అధికారయుతంగా పార్టీ సభ్యుడుకాడు. కానీ ఆయన దాదాపు పార్టీతోనే వుండేవాడు. ప్రధానంగా రైతు సమస్యల సందర్భంగా మనతో పూర్తిగా వుండేవాడు. నిజానికి ఈ యాత్రలో కూడా ఆయనదే ప్రధాన పాత్ర తర్వాత చలసాని వాసుదేవరావు.

ఆంధ్రదేశంలో కిసాన్ ఉద్యమం పశ్చిమగోదావరి, గుంటూరు, కృష్ణాజిల్లాల్లో "రీసెటిల్‌మెంటుకు" వ్యతిరేకంగా ఆరంభమయింది. దండు నారాయణరాజు, ఎన్.జి.రంగా తొలిదశలో నాయకులు. ఆ తర్వాత వారు ఆ కార్యక్రమం విరమించుకున్నారు. ప్రభుత్వం వ్యతిరేకించటం వారు వుద్యమ నాయకత్వాన్ని వదులుకోవడానికి ఒక కారణం. ఈ సందర్భంలో

మేము నిర్వహించిన యాత్ర ఎంతో వుత్తేజాన్నిచ్చింది. దారిలో వివిధ గ్రామాలల్లో బహిరంగ సభలు జరుపుకుంటూ మద్రాసులో మోమోరాండం ఇచ్చాం.

అలాంటిదే మరో ముఖ్యమైన విషయం "నిరుద్యోగ యాత్ర". ఎ.కె. గోపాలన్ దాన్ని నిర్వహించారు. అది కూడా మా ఆధ్వర్యంలో జరిగింది. దానిలో నా ప్రత్యక్షపాత్ర ఎలా వున్నా మొత్తం పార్టీగా దాన్ని నిర్వహించడంలో కార్యదర్శిగా నా పాత్ర కూడా వుంది. అంతకన్నా ప్రధానమైంది. కేవలం కమ్యూనిస్టులదే కాకుండా ప్రజలపాత్ర! ఆ వుద్యమ నిర్వహణకూ, ఫలితానికి ఏ ఒక్క నాయకునిపై ప్రశంసలు కురిపించడం సరికాదు. అలా అని వారి ప్రధానపాత్రను తక్కువ జేయమని కాదు. మరో విషయం చాలామంది ప్రధానంగా దాదాపు ప్రాథమికోపాధ్యాయులందరూ కాంగ్రెస్ సభ్యుల్లో, సానుభూతిపరులో అలా వుండేవారు. ఇదంతా కూడా జాతీయోద్యమ నేపథ్యంలో జరిగినదని మర్చిపోకూడదు.

ఈ దశలోనే జమీందారీ విధానాన్ని – ఇనాందారీ విధానాన్ని రద్దు చేయాలన్న నినాదం కూడా చేపట్టాము. ఈ మోమోరాండంలో కూడా ఈ విషయం ప్రస్తావించాము. కొన్ని పోరాటాలు కూడా 1936 –38 సంవత్సరాలలో చేపట్టాము. ఉదాహరణకు మునగాల పరగణా పోరాటం. మునగాల పరగణా చుట్టూ నైజాం పాలన వుంది. కామ్రేడ్ నందూరి ప్రసాదరావు, ఇంకా కొంతమంది కృష్ణాజిల్లా కామ్రేడ్స్ ఆ పోరాటానికి నాయకత్వం వహించారు.

మునగాల ప్రభువు తనకున్న భూములన్నీ అమ్మేసుకోవాలని యత్నించాడు. ప్రజలలో క్రోధాగ్నివుంది. మనం ప్రజలను కూడగట్టి అతనిపై పోరాటం నడిపాము. ఆ సందర్భంలో చాలామందిని నిర్బంధించి రాజమండ్రి తదితర జైళ్ళలో పెట్టారు. సత్యాగ్రహపోరాటాలు భూస్వాములకు వ్యతిరేకంగా కూడా జరిగాయి.

అలాగే నెల్లూరుజిల్లా వెంకటగిరిలో జమిందారుకు వ్యతిరేకంగా పోరాడారు. వెంకటగిరిలో మాత్రం వెంకటరామ నాయుడు నాయకత్వం వహించాడు. కమ్యూనిస్టులు ఆ పోరాటంలో లేరనే చెప్పాలి! అయితే కనిగిరి, పొదిలి, దర్శిలలో కూడా ఆ జమీందారీ విధానం ఉంది. దానికి వ్యతిరేకంగా రైతు యువకులు రంగంలోకి వచ్చారు. ఆ పోరాట క్రమంలో వారిలో చాలా మంది కమ్యూనిస్టుల వైపు మొగ్గారు. కమ్యూనిస్టుపార్టీలో జేరారు.

కృష్ణాజిల్లాలో ఉయ్యూరు, నూజివీడు వంటి చోట్ల అలాగే చల్లపల్లి జమిందారుకు వ్యతిరేకంగా పోరాటాలు జరిగాయి. చల్లపల్లి జమిందారుకు పదిహేడు వేల ఎకరాలు వున్నాయి. ఆయన పైపెచ్చు కౌలుదార్లను వెళ్ళగొడ్తున్నాడు. ఆయన జమీందారీ రద్దు కావాలనీ, భూములు రైతులకు చెందాలని ప్రధాన నినాదం.

అలాగే పశ్చిమ గోదావరి జిల్లాలో కాళీపట్నం జమిందారుకు వ్యతిరేకంగా పెద్ద సత్యాగ్రహం నడిచింది. రామం లాంటి వాళ్ళు ముందున్నారు. పొలం చేస్తున్న రైతులకే భూములు దక్కాలన్నది నినాదం. అప్పటికి కాంగ్రెస్ స్థానిక ప్రభుత్వాధికారాన్ని స్వీకరించింది.



ప్రజలు కాంగ్రెస్ తమకు అనుకూలంగా వ్యవహరిస్తుందని ఆశించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను అణిచేందుకు పూనుకున్నది. దాంతో ప్రజలలో కోపం పెరిగి పెద్ద ఆందోళనకు సిద్ధమైనారు.

అప్పుడు కాంగ్రెస్ వారొక నిర్ణయం చేశారు. కాంగ్రెస్ కమిటీల అనుమతి లేకుండా కాంగ్రెస్ వారెవరూ ఏ సత్యాగ్రహాన్ని ఆరంభించకూడదు, దానిలో పాల్గొనకూడదు అని. స్థానికంగా కాంగ్రెస్ కమిటీలతో సహా కాంగ్రెస్ వ్యక్తులు అంటే మేము కూడా, ప్రతి దానికి రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అనుమతి ఏమిటి అని ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా సత్యాగ్రహపోరాటంలో పాల్గొన్నాము. మా మీద చర్య తీసుకుంటారా లేదా అన్నది ప్రధానమైన సమస్యగా మాకు లేదు. కాంగ్రెస్ వేదికను వినియోగించుకుని ఈ ప్రజా పోరాటాలను యెంతగా అభివృద్ధి చేయగలిగితే అంతగా చెయ్యాలన్నదే మా ఉద్దేశం. ప్రజలలో మాకు చాలామంచిపేరు, పలుకుబడి వుంది గనుక మా పై యేమీ చర్య తీసుకోలేదు. అదీగాక, కాంగ్రెస్ మొత్తం మీద చూస్తే జమీందారీ వ్యతిరేక భావాలతో నిండి వుంది. కామ్రేడ్ రామం, అల్లూరి సత్యనారాయణ మొదలైన వాళ్ళను కాళీపట్నంలో అరెస్టు చేశారు.

కామ్రేడ్ కె.ఎల్. నరసింహం, ఎం.ఎస్.ఎం. రైల్వే యూనియన్‌కు కార్యదర్శిగా ఎన్నుకోబడినాడు. ఆయన తన నివాసాన్ని మద్రాసుకు మార్చాడు. సరిగ్గా ఎప్పుడో గుర్తులేదు కానీ, ఆనాటికే ఎం.ఎస్.ఎం.లో మనమే నిర్మాణయుతంగా వున్నాము.

ఏది ఏమైనా వ్యవసాయ కార్మిక సంఘాల్లో, కార్మిక సంఘాల్లో మనదే ప్రధానశక్తి, రైతు రంగంలో కూడా మనమే వున్నాము. రంగాకు వేరే నిర్మాణం వున్నది.

ఆ రోజుల్లోనే, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో ఇంకో ప్రశ్న వచ్చింది. డాంగే అప్పటికే అందరికీ తెలిసిన కమ్యూనిస్టు. మేము గుంటూరు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ తరపున డాంగేను ఆహ్వానించాము. మసానీ దానికి అభ్యంతరం తెలిపాడు. అయినా ఆహ్వానించాము. అదొక సమస్యగా రూపుదాల్చింది. వాళ్ళవాదన ఏమంటే, "ఈ కాంగ్రెస్ సోషలిస్టు పార్టీని కమ్యూనిస్టులుగా ఒక బహిరంగ వేదికగా వాడుకుంటున్నారు. మొత్తం దీన్ని కమ్యూనిస్టు పార్టీగా మార్చివేస్తున్నారు" అని, మేము మాత్రం "అలా అనడం సరికాదు. యూసఫ్ మోహరాలీని కూడా మేము పిలవడం లేదా? అలాగే డాంగేని కూడా పిలుస్తున్నాము" అన్నాము. ఏమైనా వారి వాదన వారిదే, మా వాదన మాదే. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీకి సంబంధించి ఇది.

1936లో కాంగ్రెస్ సంస్థకు ఎన్నికలు జరుగుతున్నాయి. మేము కాంగ్రెసులో కూడా వుండి పనిచేస్తున్నాము కదా! ఇంతకు ముందు చెప్పినట్లు మేము రంగాను కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారికి వ్యతిరేకంగా కాంగ్రెస్ అధ్యక్షుడిగా నిలబెట్టాము. నేను సంజీవరెడ్డికి వ్యతిరేకంగా కాంగ్రెస్ కార్యదర్శిగా నిలబడ్డాను. మా వైపున యువకులు వున్నారు గానీ, కాంగ్రెస్ సంస్థగా మొత్తంగా చూస్తే మాకు మెజారిటీ లేదు.

ఇంకో విషయం జరిగింది. గాంధీజీ సత్యాగ్రహ విధానంపై విశ్వాసం

ప్రకటించబడుతూ వారొక తీర్మానం చేశారు. 'గాంధీజీ రెండుసార్లు విఫలతకు కారణమైనారు. కనుక మాకు విశ్వాసం లేదు' అని మేము అంగీకరించలేదు. తీవ్రంగా చర్చ జరిగింది. అప్పుడు కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారొక మాట అన్నారు. "గాంధీజీకి వ్యతిరేకంగా కూడా మాట్లాడే రోజులు – అదీ కాంగ్రెస్ వారే – వచ్చాయి అన్నమాట" అని. అవును గాంధీజీ పొరపాట్లు చేస్తే విమర్శించకూడదా" అని నేనన్నాను. భోగరాజు పట్టాభి సీతారామయ్యా కూడా మమ్మల్ని కాంగ్రెస్‌లో వుంచడానికి ఇష్టపడలేదు. అందుకని "గాంధీజీకి కూడా వ్యతిరేకంగా మాట్లాడారు గనుక వీరు కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికలలో పాల్గొనేందుకు వీలు లేకుండా చెయ్యాలి" అన్నారు.

"అలాంటి చర్య తీసుకునే హక్కు మీకు లేదు. మీరెంత కాంగ్రెస్ సభ్యులో నేనూ అంతే సభ్యుణ్ణి! ఏ విషయంలో నేను తప్పు చేశాను? కాంగ్రెస్ నిబంధనావళికి వ్యతిరేకంగా ఎప్పుడు ప్రవర్తించాను? ఏ పునాదిపై నన్ను తొలగిస్తారు" అని నేను అన్నాను.

ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఆ రోజుల్లో భోగరాజు పట్టాభి సీతారామయ్యతో ఇంటర్వ్యూ తీసుకుంది. అందులో "ఎందుకు సుందరయ్యను పార్టీలోంచి తీసేశారు?" అని అడిగింది. "మిగతా విషయాల సంగతి ప్రధాన సమస్య కాదు. సుందరయ్యకు అహింస మీద విశ్వాసం లేదు" అని ఆయన సమాధానమిచ్చారు.

ఆ తర్వాత దానిపై నా వివరణ ఏమిటి? అని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నన్ను అడిగింది. "అహింసే కాంగ్రెసు – కాంగ్రెసే అహింస అని కాదు. కాంగ్రెసు అహింసను ఒక విధానంగా ఎంచుకొన్నది. అంతే! కనుక అహింస పట్ల విశ్వాసం ఉన్నదా లేదా అన్న దాన్నిబట్టి కాంగ్రెస్‌లో సభ్యుడు అవునా – కాదా అని కాదు. నాకు అహింసపట్ల నమ్మకం లేదు. కాని తద్భిన్నంగా నేను వ్యవహరించానా? కాంగ్రెస్ ఎంచుకున్న పద్ధతిని సంపూర్తిగా అమలు జరిపాను. కనుక నన్ను కాంగ్రెస్ సభ్యుడు కాదనే హక్కులేదు. అందుకనే నేను అప్పీలు చేసుకున్నాను' అని చెప్పాను.

ఈ రెండు అభిప్రాయాలనూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రముఖంగా ప్రకటించింది.

అసలు సమస్య ఇక్కడ కాదు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో ఇది పెద్ద చర్చనీయాంశం అయింది. గాంధీజీ "అహింసపట్ల విశ్వాసం లేనివారికి కాంగ్రెస్‌లో స్థానం లేదు" అని నన్ను తొలగించాలన్నారు. వల్లభాయ్‌పటేల్, భోగరాజు పట్టాభి సీతారామయ్య గాంధీజీని బలపరిచారు. సుభాష్ చంద్రబోస్ అడ్డం తగిలాడు. "అహింస పట్ల విశ్వాసం అన్నది కాదు ప్రశ్న! కాంగ్రెసే అహింస, అహింసే కాంగ్రెస్ అన్నది ఎక్కడా లేదు. కాంగ్రెస్ అహింసను ఒక విధానంగా ఎంచుకున్నది. ఆ మాటకొస్తే నాకూ అహింసపట్ల విశ్వాసం లేదు" అని సుభాష్ వాదించాడు. ఏమయితేనేం నన్ను కాంగ్రెస్ నుండి తొలగించాలన్న ప్రతిపాదన ఉపసంహరింపబడింది. ఆ విధంగా అది చాలా పెద్ద చర్చ అయింది.



ఇది యిలా వుండగా, మేము కాంగ్రెస్‌లో చాలా చురుకుగా పనిచేస్తున్నాము. టంగుటూరి ప్రకాశం పంతులు, బులుసు సాంబమూర్తి ఇలాంటి వారితో సంబంధాలు వుండేవి. ఒక విధంగా బులుసు సాంబమూర్తి తీవ్రవాది! ఆయనకు అహింసపట్ల అంత విశ్వాసం వుండేది కాదు. మేమొక ప్రతిపాదన పెట్టాము. వ్యక్తిగత సభ్యత్వంతో పాటు, వివిధ ప్రజా సంఘాల సామూహిక సభ్యత్వాన్ని కూడా కాంగ్రెస్ ఆమోదించాలి అని! బులుసు సాంబమూర్తి ఈ ప్రతిపాదనను అంగీకరించారు. తమాషా ఏమంటే ఈ ప్రతిపాదన ఆమోదించబడింది. అది ఒక పెద్ద ఆశ్చర్యంగా అనిపించింది. ఆ మీటింగ్‌లో ప్రకాశం పంతులు లేరు.

ఈ తర్వాత మీటింగ్‌కు ప్రకాశం వచ్చారు. అందులో అంతకుముందు ఆమోదింపబడిన పై ప్రతిపాదన పరిశీలనకు పెట్టారు. ప్రకాశం పంతులు చాలా గట్టిగా దాన్ని వ్యతిరేకించారు. "కాంగ్రెస్ పార్టీలో వ్యక్తిగత సభ్యత్వానికి అవకాశం వుంది గానీ, సామూహిక సభ్యత్వానికీ వీలులేదు. అలాంటప్పుడు కాంగ్రెస్ నిబంధనావళిని మార్చేందుకు మనం ఎవరం?" అని ఆయన వాదించాడు.

నిజానికి 1938 లో అఖిలభారత కాంగ్రెస్ కమిటీ మీటింగ్‌లో కాంగ్రెస్ అధికార తీర్మానానికి నేనొక సవరణ ప్రతిపాదించాను. వ్యక్తిగత సభ్యత్వంతో పాటు ఇలా ప్రజా సంఘాల సామూహిక సభ్యత్వాన్ని కాంగ్రెస్ స్వీకరించాలనీ, కాంగ్రెస్ కార్యకర్తలు కార్మిక సంఘాలు, రైతు సంఘాలు యిలాంటి వానిలో పనిచెయ్యాలనీ నా సవరణ! అప్పటికీ కాంగ్రెస్ యీ తరహా కార్యక్రమాలకు వ్యతిరేకం.

"ప్రతివాళ్ళూ కాంగ్రెస్‌లో వుంటుండగా మళ్ళీ యీ సవరణ దేనికి" అని కాంగ్రెస్ నాయకత్వ సమాధానం. అయితే ఆ తర్వాత పార్టీ నేను సవరణ పెట్టడం పొరబాటు అభిప్రాయపడింది. "అదే జరిగితే కాంగ్రెస్ వీటిల్లో కూడా ప్రధాన చోదకశక్తి అవుతుంది. కాంగ్రెస్ సామూహిక సభ్యత్వాన్ని ఆమోదించాలనడం సరైనదే కానీ, కాంగ్రెస్ వారు ఈ ప్రజా సంఘాలలో కృషి చెయ్యాలనడం, వీటిని కూడా కాంగ్రెస్‌కు అప్పజెప్పటమే! మన స్వతంత్ర కార్యాచరణ దెబ్బ తింటుంది. సరే! ఎటూ ఆమోదించే ప్రశ్నలేదు. గనుక దాన్ని గురించి రాద్ధాంతం అక్కర్లేదు" అని పార్టీ చెప్పింది. నేను కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో ముఖ్య బాధ్యతల్లో వున్నాను కదా! కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కూడా నా సవరణకు వ్యతిరేకం. కనుక నేను నా సవరణ బలవంతం మీద ఉపసంహరించుకోవలసి వచ్చింది.

నెహ్రూ నా సవరణకు వ్యతిరేకంగా పిడుగులు కురిపించాడు. కానీ, కమలాదేవీ, ఛటోపాధ్యాయ మాత్రం నా సవరణను బలపరిచింది. 'ఎందుకు కాంగ్రెస్ వారు ఈ ప్రజా సంఘాలలో పని చేయరాదు?' అని ప్రశ్నిస్తూ, "నెహ్రూ వ్యతిరేకించాడు గనుక మీరు కూడా వ్యతిరేకించాలా?" అని సోషలిస్టు పార్టీ నాయకులను నిలదీసింది. "మనం కాంగ్రెస్ వాదులుగా ఈ ప్రజా సంస్థలను నిర్మాణం చేసి, పని చేయించకపోతే సోషలిజం ఎలా సాధిస్తాము. పైగా నెహ్రూ పిడుగులు కురిపించాడు గనుక ఆయనకు భయపడి, సోషలిస్టు నాయకులు కూడా

సుందరయ్య సవరణకు వ్యతిరేకమవుతారా?" అని ఆవేశంగా ప్రశ్నించింది. ఏం జరిగినా అప్పట్లో ఈ నిరంకుశ పోకడల పట్ల వున్న వ్యతిరేక మనోభావాలను కమలాదేవి ఛటోపాధ్యాయ ప్రసంగంగా సూచిస్తున్నది.

1939లో కాంగ్రెస్ అధ్యక్షుడి ఎన్నిక వచ్చింది. అప్పటికి సుభాష్ బోస్ అధ్యక్షుడిగా వున్నాడు. రెండవసారి కూడా అధ్యక్షస్థానానికి ఆయన పోటీ చేస్తున్నాడు. గాంధీగారు వర్కింగ్ కమిటీలో బోస్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించారు. ఆయన భోగరాజు పట్టాభిసీతారామయ్యను ప్రతిపాదించారు. కాంగ్రెస్‌లో వామపక్ష వాదులకు, మితవాదులకు మధ్య విభేదాలలో అదొక ప్రధాన అంశమయింది. దేశ వ్యాపితంగా తీవ్ర చర్చనీయాంశం అయింది.

ఆంధ్రలో మేము కాంగ్రెస్‌లో వున్నాము గనుక మేము "బోస్"కు అనుకూలంగా మా శక్తిని సమీకరించాము. ఏమైనా భోగరాజు పట్టాభిసీతారామయ్యయకే ఆంధ్రా కాంగ్రెస్‌లో ఎక్కువ మెజారిటీ వుంది. చాలా స్వల్ప తేడాతో "బోస్" గెలిచారు. ఆంధ్రలో మా ఓట్లు ఆ గెలుపులో కీలకపాత్ర వహించాయి. ప్రకాశం పంతులులాంటి వాళ్ళందరూ బోస్‌కు వ్యతిరేకం. సహజంగా వారి సిద్ధాంతం అందుకే దోహదపడుతుంది. రెండో అంశమేమంటే, మొదటిసారిగా ఒక ఆంధ్రుడు కాంగ్రెస్ అధ్యక్ష పదవికి నిలుస్తున్నాడు. గెలవాలి! అంతకు ముందు ఏ తెలుగువాడు కూడా అంత ప్రధాన స్థానంలోకి రాలేదు. ఈ ఉద్దేశం కూడా బాగానే పనిచేసింది. మా ముందు కూడా ఈ వాదన కాంగ్రెస్ ప్రముఖులు పెట్టారు మేము చెప్పాం. "ఆంధ్రుడా, కాదా అన్నది కాదు ప్రశ్న. అతివాద విధానం కావాలి! బోస్ గెలుపు అతివాదానికి గెలుపు" అని!

తీరా ఫలితాలలో చాలా స్వల్ప తేడాతో భోగరాజు పట్టాభి సీతారామయ్య ఓడిపోవడంతో ఇక్కడ మన ఆంధ్రా కాంగ్రెస్ వారంతా "మీరే మన ఆంధ్రుడి ఓటమికి కారణం" అని మమ్మల్ని విమర్శించసాగారు. మేము కనుక భోగరాజుకే వేసివున్నట్లయితే ఆయనే గెల్చేవాడు. అందులో సందేహం లేదు. కానీ, ఇలాంటి సంకుచిత తత్వాలకు లొంగకుండా కొన్ని సూత్రాలకు కట్టుబడ్డామన్న విషయం కూడా ప్రశంసలందుకుంది.

బాట్లీవాలాను ఆంధ్రప్రదేశ్ పర్యటనకు పిలిచాము. ఆయన మంచివక్త! కమ్యూనిస్టు అని తెలిసిన విషయమే. ఆయన వివిధ ప్రాంతాలలో ప్రసంగించాడు. ఒంగోలులోనో, గుంటూరులోనో ఆయన చేసిన ప్రసంగంపై బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, జనాన్ని రెచ్చగొడ్తున్నాడని పోలీస్ ఆయనను అరెస్టు చేసింది. అప్పుడున్న రాజాజీ కాంగ్రెసు ప్రభుత్వం ఆ అరెస్టును ఆమోదించి కేసు నడిపింది. ఈ అరెస్టుకు వ్యతిరేకంగా పెద్ద ఆందోళన బయలు దేరింది.

'బ్రిటిషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా జనాన్ని రెచ్చగొడితే రాజాజీ ప్రభుత్వం – అదీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అరెస్టు చెయ్యాలి? బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జనాన్ని రెచ్చగొట్టడం



ప్రతి భారతీయుని హక్కు" అన్న వాదన బలంగా జనాన్ని ఆకట్టుకుంది. ఆ తర్వాత ఏదో ప్రకటనా అదీ జరిగాయి. మన ఆందోళనా ఫలితంగా కేసు ఉపసంహరింపబడింది.

కొత్తపట్నంలో రాజకీయ పాఠశాలపై లాఠీచార్జీ, మంతెనవారిపాలెం రాజకీయ పాఠశాల, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో మన కృషి, భోగరాజు పట్టాభి సీతారామయ్యకు వ్యతిరేకంగా పోరాటం, వివిధ వ్యవసాయ, కార్మిక, రైతు ఉద్యమాలూ, బాట్లీవాలా అరెస్టుపై ఆందోళన – వీటన్నింటితోనూ ఆంధ్రలో వామపక్ష శక్తి కాంగ్రెస్‌లో పెరుగుతున్నదని అందరూ గ్రహించారు. కమ్యూనిస్టులే, యివన్నీ చేస్తున్నారు. అన్న అవగాహన కూడా అందరికీ ఏర్పడింది.

# కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో

1938 -39 కాలంలో వివిధ జిల్లాల్లో పార్టీగా పురోగమించాము. రాయలసీమ జిల్లాలో కూడా కొంత విస్తరించాం. అనంతపురంలో నాగిరెడ్డి 1938లో వచ్చాడు. కడపలో కూడా వెంకటరెడ్డి అని ఒక ఉపాధ్యాయుడు, అలంకాని పల్లిలో ఒక చిన్న గ్రూపు, అలాగే పులివెందుల, జమ్మలమడుగులోనూ, కర్నూలులో ఈశ్వర్‌రెడ్డి, చిత్తూరులో తిరుపతి, నగరి, పుత్తూరు, మదనపల్లిలో కూడా సంబంధాలు వచ్చాయి. నాకు ఈ ప్రాంతాలన్నింటికీ వెళ్ళడం, కొత్త సంబంధాలు సంపాదించడం కాక, మామూలుగా వుండే పని వుండేది. మోటూరు హనుమంతరావు విద్యార్థిగా వుంటూ 1936 -37 లో అనుకుంటాను పార్టీలోకి వచ్చాడు. లావు బాలగంగాధరరావు 1937 -38లో వచ్చాడు.

"నవశక్తి" తీసుకురావడం ఈ సమయంలో యింకో ముఖ్యమైన ఘటన. 1936లోనే ఘాటేపై బహిష్కరణ ఉపసంహరించబడింది. ఆయనను మద్రాసు రమ్మని కోరాము. ఆఫీస్ ఛార్జీ తీసుకున్నాము. "న్యూ ఏజ్" మాసపత్రిక వెలువడేది. హెచ్.డి.రాజా దాని బాధ్యుడు. అయితే ప్రధానంగా అందులో రాసేది మేమే! ఆయన తర్వాత "న్యూ ఏజ్"కి సంపాదకుడైనాడు. కేంద్రంలో వుండేవాడు. అప్పటి నుండి కేరళ, తమిళనాడులలోని సంబంధాలకు ప్రధాన బాధ్యుడుగా వుండేవాడు. నేను ఆంధ్రకు బాధ్యత వహిస్తూ వుండేవాణ్ణి – ఇదీ మాపని పంపకం. అప్పుడప్పుడు కలుసుకుని పని సమన్వయం చేసుకునే వాళ్ళం.

1937 చివరల్లోనో, 1938 ఆరంభంలోనో "నవశక్తి" ప్రారంభించాము. అది వారపత్రిక మద్దూరి అన్నపూర్ణయ్య ఒక పత్రిక నడపాలని వుత్సుకతతో వున్నాడు. మాకూ పత్రిక అవసరం అనిపించింది. కామ్రేడ్ చంద్రం, తుమ్మల వెంకట్రామయ్యలను ఆ పనిలో నియమించాము. రాజమండ్రిలో మద్దూరి అన్నపూర్ణయ్య వుండేవాడు. పేరు, అదీ ఆయనదే అయితే ప్రధానంగా మద్దుకూరి చంద్రం బాధ్యత వహించేవాడు.

"నవశక్తి"కి ముందే గద్దె లింగయ్య "ప్రభ" అని ఒక పత్రిక నడుపుతుండే వాడు. అందులో మరీ మొరటుగా విప్లవాన్ని గూర్చి కొన్ని వ్యాసాలుండేవి. ఉదాహరణకు ఒక వ్యాసంలో



"ఎక్కడైతే ఎక్కువ దరిద్రం, పస్తులు వుంటాయో అక్కడ విప్లవం త్వరితమవుతుంది" అని రాశారు. అది చదివిన వెంటనే గద్దె లింగయ్యకు నేనొక లేఖ రాశాను. "దరిద్రమూ, పస్తులూ, దిగజారుడూ ఎక్కువైన కొద్దీ – విప్లవావకాశాలు మెరుగుపడతాయన్నది పూర్తిగా తప్పు సూత్రీకరణ. ఇది మార్క్సిజం కాదు. వీటివల్ల ప్రజలు బాధలు పెరిగేమాట నిజమే అయినా, అదంతా విప్లవం వైపు మొగ్గదు. విప్లవం అన్నది చైతన్యవంతమైన కృషితో రావలసినది, ప్రజలను తమ కష్టాలకు వ్యతిరేకంగా పోరాటంలో నిలబెట్టాలి! అంతేగానీ, కష్టాలెక్కువైతే విప్లవం వచ్చేఅవకాశాలూ పెరుగుతాయనడం తప్పు. ఎక్కడా మార్క్స్ ఎంగెల్సులు అలా చెప్పలేదు" అని నేను పార్టీ నాయకుణ్ణి అని తెలుసు కనుక, వాళ్ళు వెంటనే ఆ పొరపాటు ధృక్పథాన్ని సవరించుకున్నారు.

అలాగే "నవశక్తిలో"కూడా యేమన్నా యిలాంటి పొరబాటులు చొరబడితే వెన్వెంటనే నా విమర్శ రాసి పంపేవాణ్ణి. నేను కూడా అప్పుడప్పుడూ వ్యాసాలూ రాస్తుండేవాణ్ణి. "నవశక్తి"కి గానీ, "న్యూఏజ్"కి కావలసిన ఆర్థిక వనరులు సమీకరించటం నా బాధ్యతగా వుండేది. "న్యూ ఏజ్" మాసపత్రిక గనుక కొంతవరకూ నయం. "నవశక్తి" వారపత్రిక. దానికి ఆర్థికపరమైన ఇబ్బందులుండేవి. మా కామ్రేడ్స్ తలా కొంత ఆర్థికంగా ఆదుకున్నారు.

రాజమండ్రి నుండి "నవశక్తి"ని విజయవాడకు మారుద్దామనుకున్నాము. గవర్నర్‌పేటలో కాట్రగడ్డ మధుసూదనరావు వాళ్ళ మూడంతస్తుల భవనం తీసుకున్నాము. ఆయన చాలా తక్కువ అద్దెకు ఆ భవనం యిచ్చాడు. క్రింద మన "ప్రెస్", దానికి సంబంధించిన యితరాలు. మొదటి అంతస్థులో మా ఆఫీసు వుండేది. కామ్రేడ్స్ వుండేందుకు కొన్ని గదులు వుండేవి. పై అంతస్థులో రెండు మూడు గదులున్నాయి.

నేను కూడా వ్యక్తిగతంగా పత్రికకు కొంత పైకం యిచ్చాను. నేను నాకున్న ఆస్తి అంతా అంతకుముందే అమ్మేసిన మాట నిజమేగానీ, ఒక్కమాటలో చెప్పాలంటే మా అన్నే నా బ్యాంకు. ఆయన యెప్పుడు నేను డబ్బు కావాలన్నా నీ వంతు వచ్చిన పైకం అయిపోయింది అని చెప్పేవాడు కాదు. అడిగినంతా యిచ్చేవాడు. దానికితోడు మా తమ్ముడు రామచంద్రారెడ్డి వాటా కూడా వుంది కదా! "రామ్"కు నేనంటే యెంతో అభిమానం. మారుమాటాడకుండా నన్ను అనుసరించేవాడు. మెల్లగా "రామ్" వాటా కూడా నేను పార్టీ కోసం ఖర్చు పెట్టసాగాను. 1939 కల్లా అదీ అయిపోయింది. "రామ్" వైద్యుడిగా ప్రాక్టీస్ ఆరంభించేందుకు అవసరాల కోసం మా అన్న అయిదువేల రూపాయలు యిచ్చాడు. ఆ రకంగా చాలా అప్యాయంగా మా మధ్య సంబంధాలు వుండేవి.

"నవశక్తి" ప్రధాన సంపాదకుడు కామ్రేడ్ చంద్రం. ఇతర రాజకీయ వ్యాసాలతో పాటు 2 పేజీలు ప్రపంచ వార్తల సమీక్షకూ, రెండు పేజీలు జాతీయ వార్తల సమీక్షకు కేటాయించేవాళ్ళం. ఒక విధంగా సంక్షిప్తంగా, సమగ్రంగా నడిపే ప్రయత్నం చేశాము. నేను కూడా కొన్ని వ్యాసాలు రాశాను, నేను కేంద్రంలో వుంటూ నిర్మాణం చూస్తూ వుండేవాణ్ని. 'నవశక్తి' రెండు ప్రత్యేక సంచికలు కూడా తీసుకువచ్చాము. 1938 నవంబరులో ఒకటి,

1939లో మరొకటి తీసుకొచ్చాము. "త్రిపురి" ప్రత్యేక సంచికలో జాతీయోద్యమ అభివృద్ధి, జాతీయ విప్లవకారుల జీవితాలు కూడా వున్నాయి. ఆ రెండు సంచికలు మంచి ప్రశంస పొందాయి. దాదాపు నాలుగువేల కాపీలు ఆ రెండు సంచికలు అమ్ముడైనాయి. ఆ ప్రత్యేక సంచిక వెల నాల్గు అణాలు. "నవశక్తి" మామూలుగా ఒక అణా.

కొండేపూడి లక్ష్మీనారాయణ కూడా వచ్చి "నవశక్తి"లో జేరాడు. తెనాలిలో పార్టీకి సానుభూతిపరుడు ఒకతను ఫోటోలకు బ్లాకులు చేసి యిచ్చేవాడు. సోవియట్ ప్రత్యేక సంచికలో సోవియట్ వివిధ జాతులకు సంబంధించి మంచి అందమైన ఫోటోలు ముద్రించాము. నిజానికి సోవియట్ యూనియన్ అభివృద్ధిపై అదొక సమగ్ర సంక్షిప్త సంచిక అనవచ్చు. "సోవియట్ దేశం భూతల స్వర్గం" అని పేరు పెట్టినట్లు గుర్తు.

ఒక్కొక్కసారి ముద్రణా యంత్రం చక్రం తిప్పే అతను రాకపోతే మేమే వంతులవారీగా చక్రం తిప్పేవాళ్ళం. పత్రికను మడతపెట్టి అంటించి అడ్రస్ రాసే పని కూడా అప్పుడప్పుడు వున్నవాళ్ళం అందరం చేస్తుండేవాళ్ళం. తుమ్మల వెంకటరామయ్య అంటుండేవాడు. "మనమే సంపాదకులం, మనమే ప్రూఫ్ సరిదిద్దే వాళ్ళం. మనమే యంత్రం నడిపేవాళ్ళం. చివరికి పోస్టు చేసేందుకు అనువుగా మడతలు పెట్టి, అడ్రస్ రాసి, అంటించి పోస్టు చేసేది కూడా మనమేనని!" నిజమే ఆ అవసరాన్ని బట్టి అందరం, తలా ఒకటి అందుకోకపోతే పత్రిక సకాలంలో బయటకు రావడం అసాధ్యమై వుండేది. అప్పటి ప్రమాణాలలో మంచి సర్క్యులేషన్ నవశక్తికి వున్నట్లే చెప్పుకోవాలి! సామాన్య పాఠకుణ్ని, కార్యకర్తను చైతన్యం చేసేందుకు అవసరమైన అంతర్జాతీయ, జాతీయ ఘటనలు, సమీక్షలు అవీ వుండేవి. అందరికీ అందుబాటుగా చవకగా కూడా వుండేటట్లు చూశాము. మద్దుకూరి చంద్రం, కంభంపాటి సీనియర్‌లు ప్రధాన రచయితులుగా వివిధ ఆర్థిక, రాజకీయ అంశాలపై కరపత్రాలు కూడా వెలువరించేవారము. అలాగే అభివృద్ధి కాముక నవలలు, చిన్న చిన్న పుస్తకాలు తీసుకురావాలని నిర్ణయించుకున్నాము. కంభంపాటి జూనియర్ కూడా అప్పటికీ విజయవాడ "నవశక్తి"లో జేరాడు. అనువదించడంలోనూ, తదితరంగానూ సహాయపడేవాడు.

"నవశక్తి"లో వివిధ అంశాలపై ఆయా అంశాల ప్రాధాన్యత దృష్ట్యా పరిశోధనాత్మక వ్యాసాలు కూడా వుండేవి. ఆ "నవశక్తి" పత్రికలన్నింటినీ, జాగ్రత్తగా ఫైల్ చేసుకుంటే, తత్సంబంధితమైన ఏ అంశంపైన రాయదలచుకున్నా రచయితకు సమాచారం దొరికేది. రాజకీయ నిర్మాణ అవగాహన కూడా దృష్టిలో వుండేది.

1938 నవశక్తి ఉన్న భవనంలోనే రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ రెండవ మహాసభ జరిగిందనుకుంటాను. 1936లో కాకినాడలో జరిగిన యువజన మహాసభను ఆంధ్రరాష్ట్రంలో మొదటి కమ్యూనిస్టు పార్టీ మహాసభగా పరిగణించవచ్చు. యువజన మహాసభ పేరుతో పార్టీ మహాసభే జరిగింది. 1943లో ప్రజా యుద్ధం సమయంలో మూడవ మహాసభ జరిగింది. దాని విషయం తర్వాత చెప్పుకుందాం.



ప్రభుత్వం యుద్ధం ప్రకటించగానే ఇక బహిరంగంగా పనిచేయడం సాధ్యం కాదనే ఉద్దేశ్యంతో పత్రికని నిలిపివేశాం. ఆ తర్వాత అది తొందరపాటు చర్య అని భావించాం. ప్రభుత్వం నిషేధించేదాకా కొనసాగించి వుండవల్సింది. మా అభిప్రాయమేమంటే వీలైనంత తక్కువ నష్టంతో బయటపడాలి. అందుకని మొత్తం సరంజామానంతటినీ విజయవాడ నుండి తరలించి రహస్యంగా పత్రికను నడపసాగాం.

అందులో మొదటి వ్యాసమే రాజాజీ దృష్టికి వచ్చింది. ఆయన ఆ వ్యాసం రెచ్చగొట్టేదిగా ఉందని, శాంతి భద్రతలకు భంగకరమని, పత్రికపై చర్య తీసుకొని కేసు పెట్టాలని అనుకున్నారు. పత్రిక అప్పటికే నిలిపివేయబడింది గదా! రాత్రికి రాత్రి మొత్తం ముద్రణాయంత్రం తదితరాలు అన్నీ మాయమైనాయి. ఎక్కడికి చేరాయో ఎవరికీ తెలియదు.

1939 నుండి 42 వరకు నేను, చంద్రం, మొత్తం పార్టీ అంతా కూడా రహస్యంగానే వుండిపోయాం. కనుక "నవశక్తి" స్థానంలో "స్వతంత్ర భారత్" అనే సైక్లోస్టయిల్ పేపరు ప్రారంభించాం. చంద్రం ప్రధానంగా ఉన్నా మేమందరమూ అందుకు సహకరించేవాళ్ళం. మొదట్లో కేసరపల్లి దగ్గర తోటలో నుండి ఇది వచ్చేది. ఆ తర్వాత పశ్చిమగోదావరి జిల్లాలో మాకు సానుభూతిగా వుండే భూస్వామి ఇంటినుండి 'స్వతంత్ర భారత్" తెచ్చేవాళ్ళం. ఆ భూస్వామి గట్టి కాంగ్రెసు వాది. పైపైచ్చు కాంగ్రెస్‌లో అతివాది. ఇకదాన్ని వివిధ ప్రాంతాలకు సైకిళ్ళపై పంపేవాళ్ళం. ఆయా ప్రదేశాల నుండి ఇక అది పంచబడేది. స్థానికంగా ఉండే కొన్ని పత్రికలతో పాటు కూడా ఇది పంచబడేది.

ఏది ఏమైనా "స్వతంత్ర భారత్" వామపక్ష అవగాహనతో ఉండేది. కాంగ్రెస్ నిర్లిప్తంగా వుండటం పట్ల విమర్శకంగా వుండేది. దానితో ప్రతిష్ట పెరిగింది. ప్రభుత్వం కూడా 'స్వతంత్ర భారత్'ను స్వాధీనం చేసుకునేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసి విఫలమయ్యింది. పత్రిక మాత్రం క్రమం తప్పకుండా వస్తుండేది.

ఇక మన సంబంధాలను కొనసాగిస్తూ, సైకిల్‌పై తిరుగుతూ పత్రిక అందించడం కూడా నేను చేసేవాడిని. సైకిల్ తొక్కడంలో నాకున్న సామర్థ్యం ఇప్పుడు కూడా అక్కరకు వచ్చింది.

ఉదాహరణకు పశ్చిమ గోదావరిలో పత్రిక ఉన్న ప్రాంతం నుండి గుడివాడ, విజయవాడ వరకు ఒక్క రాత్రిలో సైకిల్‌మీద వచ్చి, పత్రిక అందించి తిరిగివెళ్ళేవాణ్ని. అది కూడా ప్రధాన రహదారుల వెంట కాదు – కాల్వ గట్లు, కచ్చారోడ్లు ఎంచుకోవాల్సి వచ్చేది.

ఒకసారి ఏం జరిగిందంటే, గుంటూరు జిల్లా కామ్రేడ్స్‌ను కలుసుకుని రేపల్లె నుండి వస్తున్నాను. అవనిగడ్డ మీదుగా ఉయ్యూరు చేరుకునే సమయానికి దట్టంగా మబ్బులు పట్టనారంభించాయి. అప్పటికే చీకటి పడవస్తున్నది. నన్ను గుర్తుపట్టడం ఎవరికీ అంత తేలికయ్యేదికాదు. అయినా సరే, సాంకేతికంగా ప్రధాన రహదారులు వద్దనుకున్నాం కనుక

వేరే దోవలగుండానే ప్రయాణం సాగిస్తున్నాను. వాన రాకముందే చేరాలని బాగా స్పీడ్‌గా సైకిల్ తొక్కుతున్నాను. ఈ లోపల వాన వచ్చిందో అదేమీ మెటల్ రోడ్డు కాదు. మట్టి రోడ్డు కనుక సైకిల్ కదలదు. వల్లూరు దాటేసరికి పెద్ద వాన ప్రారంభమయింది. ఇక సైకిల్ని భుజాల మీద మోస్తూ నడవడం తప్ప వేరే గత్యంతరం లేదు. అట్లా ప్రారంభమయింది. ఇక సైకిల్ని భుజాల మీద మోస్తూ నడవడం తప్ప వేరే గత్యంతరం లేదు. అట్లా పటమటదాకా నడిచి వచ్చాను. సుమారు 9 మైళ్ళు. అంటే సైకిల్‌పై నేను కూర్చొని త్రొక్కేబదులు సైకిల్ నా భుజాలపై ఎక్కివచ్చిందన్నమాట. బాగా అలిసిపోయాను. ఇక్కడ నాకు తెలిసిన వారింట్లో విశ్రాంతి తీసుకున్న తరువాత మామూలు మనిషినయ్యాను.

ఈ రహస్య జీవితం గడిపే సందర్భంలో మన పార్టీ కేంద్రాన్ని కలుసుకునేందుకు ఒకసారి బొంబాయి వెళ్ళాను. ఆ రోజుల్లో ఇష్టమొచ్చినచోటికి ప్రయాణం చేసేందుకు రైల్వే వారు టిక్కెట్లు అమ్మేవారు. అలాంటి యం.యస్.యం రైల్వే టిక్కెట్లు కొనుక్కున్నాను. యం.యస్.యం. రైల్వే అప్పట్లో బొంబాయికి దగ్గరగా పూనె దాకా వుండేది. ఆర్థిక విషయాల్లో కూడా మేము జాగ్రత్తగా వుండాలి కదా!

బొంబాయి వెళ్ళి పార్టీ కేంద్రంతో చర్చించి తిరిగివచ్చేటప్పుడు వారు నాకు యుద్ధ వ్యతిరేక సాహిత్యాన్ని ఇచ్చారు. నాకు విజ్ఞాన యాత్రలన్నా, చారిత్రక తదితర ముఖ్యమైన ప్రదేశాలు చూడటం అన్నా మొదటి నుండీ చాలా ఇష్టంగా వుండేది. కనుక గోవా చూసి వెళదామని లోంగా స్టేషన్‌లో దిగాను. నేనొక పిచ్చిపని చేశాను.

నా దగ్గర వున్న సాహిత్యాన్ని అక్కడే స్టేషన్లో వున్న సామాన్లు భద్రపరిచే గదిలో పెట్టి వెళితే సరిపోయేది. ఆ చిన్న మూటేగదా, ఎవరు మాత్రం పరిశీలించబోయేరు అని – కస్టమ్స్ అధికార్లు వుంటారని తెలిసి కూడా ఆ మూటతో సహా బయలుదేరాను. వెళ్ళేటప్పుడు ఏమీ చిక్కలేదు. కాని వచ్చేటప్పుడు మాత్రం కస్టమ్స్ వారి కన్ను ఈ మూటపై పడనే పడింది. వాళ్ళు నన్ను నిలేసి ఈ మూట ఏమిటని ప్రశ్నించారు.

ఇదేమీ పెద్ద ప్రమాదకరమైంది కాదని, అసలు ఆ మూట నాది కానేకాదని గాని చెప్పేందుకు వీల్లేదు కదా! రైల్వే పోలీసులు నన్ను నిర్బంధించారు. కస్టమ్స్ అధికార్లు ప్రశ్నించేందుకని నన్ను తీసుకెళ్తున్నారు. అసలే చాలా అనవసరంగా పట్టుబడ్డాను అని అనిపిస్తుంది. ఇక పారిపోవాలని నిర్ణయించుకున్నాను.

నన్ను ఒక అడవి మధ్యగా తీసుకెళ్తున్నారు. చుట్టూ పోలీసు, కస్టమ్స్ అధికార్లు వున్నారు. పారిపోవటం కష్టమే! అయినా ప్రయత్నిద్దాం, "తప్పించుకోగలిగితే తప్పించుకుంటాను లేదా జరిగేదేముంది, ఎలాగూ నిర్బంధంలోనే వున్నాను గదా" అనుకుని పారిపోయేందుకే నిశ్చయించుకున్నాను. మూత్రంకి వెళ్ళాలని వారితో చెప్పాను. వారు కూడా నేను పారిపోతానని ఊహించలేదు. సరే వెళ్ళమని అనుమతి ఇచ్చారు.



ప్రక్కనే చిన్న కొండ వుంది. నేను 10 గజాలు కొండవైపు నడిచి మూత్రం పోస్తున్నట్లు నటిస్తూ కాళ్ళకున్న చెప్పులు చేత్తో పట్టుకొని కొండపైకి వడివడిగా పరిగెత్తడం ప్రారంభించాను. ఇక వారందరూ అరుపులు, కేకలు మొదలుపెట్టారు. నన్ను వెంబడించడానికి ప్రయత్నించారు గానీ, వారు ఎలాగూ నాతో పాటు పరుగెత్తలేరు. పైగా అప్పటికే నేను వారికన్నా ముందుగా దూరంలోనే వున్నాను. నన్ను తుపాకులతో కాలుద్దామంటే వారు తుపాకులను అందుకు సన్నద్ధంగా వుంచుకోలేదు.

నా వెంటపడ్డ వారి నుండి తప్పించుకొనేందుకని క్రింద వున్న చిన్న లోయలో దట్టమైన అడవి వుంటే దూకి అడవిలోకి పారిపోయాను. ఆ పోలీసులు లోయలోకి దూకేందుకు సాహసించలేదు. చీకటిపడింది. నాకా అడవి ప్రాంతమంతా కొత్త. కాని నాకు రాత్రిపూట ఆకాశంలో వుండే నక్షత్రాలబట్టి దిశ నిర్ణయించుకోవడం కొంచెం తెలుసు కనుక ఆ రాత్రంతా నేను ఎంచుకున్న దిశ వెంబడే అడవిలో ప్రయాణం చేశాను. ఎప్పుడూ నా వద్ద ఓ చిన్న చాకును వుంచుకోవడం అలవాటు. ఏవన్నా చిన్న చిన్న మృగాల్లాంటివి అనుకోకుండా అడ్డంవస్తే వినియోగించుకొనేందుకు చాకును సిద్ధంగా వుంచుకున్నాను.

దీనికి తోడు వాన మొదలైంది. అయినా ఎక్కడో ఒక చోట కూర్చుని మాత్రం ప్రయోజనం ఏమిటి? ఇంకాసేపటికి పోలీసులు వెతుక్కుంటూ రావచ్చు. కనుక నడుస్తూ వుండటమే, పోలీసులకు యిక్కడ నుండి రైల్వేస్టేషన్‌కు గాని, రోడ్డు మార్గానికి గాని వెళ్ళే దోవలు తెలిసి వుండాలి. కనుక ఆ దోవలన్నీ దాటేసి ఎలాగో రైల్వేస్టేషన్‌కి చేరాలి. ఆ రోజంతా నడకే. నేను రైల్వేస్టేషన్‌కి చేరేసరికి కాళ్ళు అరటిబోదెల్లా వాచిపోయాయి. దానికి తోడు కాళ్ళనిండా ముళ్ళు. ఇక ఏమాత్రం నడవటం సాధ్యమనిపించలేదు. బాగా అలిసిపోయాను. పైగా వానజోరు కూడా ఎక్కువైంది. అందువల్ల కాస్త రక్షణగా వుండే ప్రదేశం చూసి విశ్రాంతి తీసుకుంటే తప్ప కదలగలిగే స్థితిలో లేను.

ఆ దగ్గరలో పెద్ద మర్రిచెట్టు వుంది. దానికి ఓ పెద్ద తొర్ర. ఆ తొర్రలో అయితే బాగుంటుందని వెళ్ళి తొర్రలో కూర్చున్నాను. మళ్ళీ యిదొక పిచ్చిపని. అదృష్టమంటారో ఏమంటారో గాని లోపల పామేమీ లేదు. ఏదైనా పాము – అది కూడా విశ్రాంతికై అక్కడే వున్నట్టయితే ఏమయ్యేది.

ఏమైనా తెల్లవారకముందే ఇక్కడ నుండి లేచి వెళ్ళిపోవాలి. తెల్లవారితే పోలీసులు రోడ్లన్నీ వెతుకుతారు. నాకొక లక్షణం వుంది. ఎప్పుడు లేవాలి అనుకుంటే అప్పుడు ఖచ్చితంగా మెలకువ వస్తుంది. ఇక్కడ ఈ సందర్భములో నాకు శివవర్మ చెప్పిన కొన్ని సాంకేతిక పరమైన జాగ్రత్తలు కూడా రహస్య జీవితానికి చెందినవి గుర్తుకొచ్చాయి. లేచి నేను వచ్చిన దారిలో దృష్టిలో వుంచుకొని దానికి వ్యతిరేకంగా నడుస్తున్నాను. జాగ్రత్తకోసం మైలురాళ్ళ దగ్గరకెళ్ళి ఎంత దూరం వచ్చాను, యింకెంత దూరం వెళ్ళాలి అని చూసుకున్నాను.

తేలిందేమంటే, నేను వెళ్ళవలసిన వైపు కాకుండా ఎటునుండి పారిపోయే వచ్చానో అటే వెళ్తున్నానని.

సుమారు నాలుగు గంటలు నడిచిన తరువాత మళ్ళీ మర్రిచెట్టు దాపులోకే వచ్చాను. సరే, యిక్కడ నేను నా బట్టలు మార్చుకోవాలి. అవే బట్టలతో వుంటే నన్ను గుర్తించటం తేలిక. దారిలో చెప్పులు వదిలేశాను.  వంటిమీద ఉన్న కోటు కూడా పారేశాను. చొక్కా విప్పేసి ధోవతి కట్టుకోవాలి అనుకున్నాను.

కనుక ఏదైనా బట్టల దుకాణం దగ్గరకెళ్ళి ధోవతి, ఉత్తరీయం కొనుక్కొని ఇక మిగతా ప్రయాణం చేద్దామనుకున్నాను. దగ్గరలో ఆల్మోరా రైల్వేస్టేషన్ వుంది. స్టేషన్‌కు వెళ్ళి బట్టలు మార్చుకొని రైల్ టిక్కెట్ కొనుక్కోబోతుండగా వేరే ఆలోచన వచ్చింది. ఈ స్టేషన్ నేను పారిపోయిన దానికి దగ్గరలో వుంది. పోలీసులు చుట్టుపక్కల స్టేషన్‌లన్నింటా నిఘావేసి వుండొచ్చు. కనీసం హుబ్లీ స్టేషన్ వరకైనా వాళ్ళ నిఘా వుండి వుంటుంది. ఎందుకు మళ్ళీ అనవసరంగా ప్రమాదాన్ని కొని తెచ్చుకోవటం?

అప్పటికి మధ్యాహ్నం 2 గంటలు అయింది. ఏదైనా బస్ వుండవచ్చు నేమో అనుకుని బస్‌స్టాండ్‌కు వెళ్ళాను. బస్‌టైమ్ టేబుల్ చూస్తున్నాను. సరిగ్గా అక్కడికి కారులో కస్టమ్స్ అధికారులు వచ్చారు. వారు ఒకవేళ నన్ను గుర్తుబట్టి పట్టుకోదలిస్తే పారిపోగల ఓపిక నాకు లేదు. అలాంటప్పుడు ఏమీ పట్టనట్లు అక్కడే కూలబడితే మంచిదనిపించింది. వాళ్ళు నన్ను చూసినప్పుడు పైజమా, కోటు ధరించి వున్నాను. ఇప్పుడు పంచె, చొక్కాతో వున్నాను. పైగా వారు నా ముఖాన్ని కూడా సరిగా చూసినట్లులేదు. అటు ఇటు కాస్త హడావిడిచేసి కారులో వాళ్ళదారిని వాళ్ళు వెళ్ళిపోయారు.

ఇప్పుడు రైల్వేస్టేషన్‌కి వెళ్ళినా ప్రమాదమే. బస్ ప్రయాణం కూడా ఎంతవరకు సాధ్యమో అనుమానమే. నాకు హిందీ రావటం మంచిదైంది. జైల్లో నేర్చుకున్న హిందీతో పాటు ప్రైవేట్‌గా దక్షిణ భారత హిందీ ప్రచారక్ సభవారి ప్రవేశిక పరీక్ష కూడా పాసై వున్నాను. జాతీయోద్యమంలో భాగంగా హిందీ నేర్పుతూ వుండేవాణ్ని. కనుక హిందీ ధారాళంగానే మాట్లాడగలిగేవాణ్ని.

హుబ్లీస్టేషన్ లోపల నేను ఎక్కడారైలు ఎక్కదలచలేదు. అందుకని టాక్సీ ఏమన్నా దొరుకుతుందేమోనని వాకబు చేశాను. నాకొక టాక్సీ చూపించారు. భౌగోళికశాస్త్రం కాస్త చరిత్ర తెలిసివుండటం వలన ఆ ప్రాంతానికి పూర్తిగా కొత్తవాడ్ని కాదన్నట్లు నటించగలిగాను. టాక్సీ అతనితో ఫలాన వూరిలో, ఫలానా పేటకి వెళ్ళాలని, అక్కడ వ్యాపార సంబంధ విషయాలు అర్జంటుగా మాట్లాడవల్సి వుందనీ, కనుక టాక్సీ కావాలని అడిగాను. నిజానికి ఆ టాక్సీవాళ్ళకి ఈ కథలన్నీ అనవసరం. వారికి కావాల్సింది బాడుగ.

టాక్సీకి డబ్బు కట్టేస్తే నా దగ్గర చాలాకొద్ది మొత్తమే పైకం ఉంటుంది. ఎక్కడికిపడితే అక్కడికి ప్రయాణం చేయగల ప్రత్యేక టికెట్‌తో మూడవ తరగతిలోనే ప్రయాణం చేయాలి.



అంతమంది మధ్య అలా ప్రయాణం చేయడం మంచిదికాదు. రెండవ తరగతి టికెట్టు కొనుక్కుంటే మద్రాసు దాకా బొటాబొటీగా డబ్బులు సరిపోతాయి. మొదటి తరగతిలో ప్రయాణం ఆ సందర్భంలో మంచిది. అయితే నావద్ద నున్న పైకంతో మద్రాసు వరకూ టికెట్టు కొనలేను. బెంగుళూరు వరకు మొదటి తరగతి టికెట్టు కొన్నాను. ఆ స్టేషన్‌లో మామూలుగా ఆ రైలు ఆగదు. అయితే మొదటి తరగతి ప్రయాణికుడెవరన్నా వుంటే ముందుగానే ఈ స్టేషన్ నుండి తెలియజేస్తే రైలు ఆగుతుంది. ఆ విధంగా స్టేషన్ మాస్టరు తెలియజేశాడు.

అన్నట్టు చెప్పటం మరిచాను. టాక్సీలో సరాసరి స్టేషన్‌కు రాలేదు. 4 మైళ్ళు దూరంగా దిగాను. వూళ్ళో యేదో పనివుందని చెప్పానుగా! అప్పుడు రాత్రి 8 గంటలు అయింది. అక్కడ నుండి స్టేషన్‌కు 4 మైళ్ళు. కాళ్ళు వాచిపోయి వున్నాయి. అడుగు వెయ్యటం కష్టంగా వుంది. నన్ను నేను ఈడ్చుకు వెళ్తున్నానా అన్నట్లు ఈ నాలుగు మైళ్ళు ఆరుగంటలపాటు నడిచి రాత్రి 2 గంటలకు స్టేషన్ జేరాను.

తెలతెలవారుతుండగా రైలు వచ్చింది. మొదటి తరగతిలో ఎక్కాను. అయితే మొదటి తరగతిలో చాలా తక్కువమంది ప్రయాణీకులు వుంటారు కదా! తెల్లవారిన తర్వాత యెవరన్నా పెట్టెలోకి తొంగిచూస్తే గుర్తుపట్టవచ్చు. అదీగాక నేను ఎక్కింది చాలా చిన్న స్టేషన్ గనుక, రైలు ఆపించి మరీ ఎక్కాను గనుక అక్కడ నుండి మొదటి తరగతితో ఎక్కిన ప్రయాణికుణ్ణి నేను ఒక్కణ్ణే గనుక దొరికిపోవచ్చు. అందుకని మధ్యలో ఏదో స్టేషన్‌లో దిగి మూడవతరగతి టిక్కెట్టు బెంగుళూరు వరకూ కొనుక్కొని బెంగుళూరులో దిగాను.

బెంగుళూరులో దిగిన తర్వాత ఆటోకుగానీ, రిక్షాకుగానీ, తిండితినేందుకు గానీ చేతిలో పైసా లేదు. నేను బెంగుళూరులో మా బావగారివద్ద చదువుకున్నాను కదా! ఆయన స్నేహితులనెవరినైనా కల్సుకుందామనుకున్నాను. ఒక కెమిస్ట్రీ ప్రొఫెసర్ వున్నారు. ఆయనింటికి రిక్షాలో వెళ్ళాను. ఆయన అప్పుడే మద్రాసు వెళ్ళేందుకు స్టేషన్‌కు వెళ్ళాడని తెలిసింది. మళ్ళీ రిక్షాలో స్టేషన్‌కు వచ్చి ఆయనను కల్సుకున్నాను. ప్రయాణంలో నా పర్సు పోయిందనీ, మద్రాసు జేరాలనీ, నాకు పైకం కావాలనీ అడిగాను. ఆయన వద్ద కూడా సరిపడా పైకం లేదు. తాను యివ్వలేకపోయినందుకు ఆయన చాలా నొచ్చుకున్నాడు. అయితే ఒకమేలు జరిగింది. మా బావగార్ని, మమ్మల్ని ఎరిగిన యింకో పెద్దమనిషి అడ్రస్ దొరికింది.

అదే రిక్షాలో ఆ పెద్దమనిషి ఇంటికి వెళ్ళాను. రిక్షా అతనికి ఇచ్చేందుకు డబ్బులు లేవు. బయటనే వేచి వుండమని చెప్పి, లోపలకివెళ్ళి ఆయనతో డబ్బు పోయిందనీ, మద్రాసు జేరాలనీ, పైకం కావాలనీ, బయట వున్న రిక్షా అతనికి కూడా ఇవ్వలేదనీ, త్వరలో తిరిగి పైకం యిచ్చేస్తానని చెప్పాను. ఆయన కాదనలేకపోయాడు.

అప్పట్లో సైకిలు రిక్షాలు లేవు. అన్నీ లాగుడు రిక్షాలే! ఆ రిక్షా అతను మామూలుకన్నా చాలా ఎక్కువ అడిగాడు. ఆ పెద్దమనిషే ఏదో విధంగా సర్దిచెప్పి అతనికి డబ్బులు ఇచ్చి పంపాడు.

నేను బెంగుళూరు నుండి వెళ్ళిపోయిన తర్వాత మా బావగారి ద్వారా ఆయన నా గురించి తెలుసుకుంటూనే వున్నాడట! నేనంటే గౌరవం కూడా వుంది. అందుకని భోజనం పెట్టి అవసరమైన పైకం ఇచ్చి పంపాడు. ఆ పైకం తిరిగి పంపనక్కరలేదని, అలా సహాయం చేయటం తన కనీస బాధ్యత అని కూడా చెప్పాడు. మా అక్క బావల గూర్చి, వాళ్ళ పిల్లలగూర్చి యోగక్షేమాలడిగాడు.

మద్రాసు చేరాను. నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు చెందిన లేడీ డాక్టరొకరు ఒక తమిళ డాక్టరును వివాహం చేసుకుని మద్రాసులోనే ప్రాక్టీస్ పెట్టి వైద్యం చేస్తున్నది. వాళ్ళింటికి వెళ్ళాను. ఆమె తగిన ప్రథమ చికిత్స చేసింది. మా తమ్ముడు రామచంద్రారెడ్డి నెల్లూరులో అప్పటికే ప్రాక్టీసు పెట్టాడు. అక్కడికి కబురు చేశాం."రామం" వచ్చి కారులో తీసుకువెళ్ళాడు.

నా మూర్ఖపు పనివల్ల ఇంత గందరగోళం అయింది. ఇలాంటివే ఇంకో రెండు మూడు సాహసకృత్యాలు ఆ రోజుల్లో చేశాను. మద్రాసులో మకాంవేసి ఆంధ్ర, కేరళ, తమిళనాడు పార్టీ వ్యవహారాలను సమన్వయం చేయాల్సి వచ్చింది. కామ్రేడ్ ఇ.యం.యస్. 1939 -40 నాటికి పార్టీలోకి వచ్చాడు.

మద్రాసులో రహస్య నిర్మాణాన్ని ఏర్పాటు చేసుకోవాలి! పరుచూరి రామకోటయ్య వాళ్ళ కుటుంబం ఒక రహస్య కేంద్రం, ఆయన భార్య సూర్యాంబ. అలాగే మాలెంపాటి సీతారామయ్య - దివి తాలూకా వాళ్ళది - వాళ్ళ కుటుంబం ఒక రహస్య కేంద్రం. వీళ్ళకి నిజానికి మద్రాసులో ఏమీ పనిలేదు. కేవలం రహస్య కేంద్రాలను నిర్వహించేందుకే కుటుంబాలతో సహా వచ్చారు. మాలెంపాటి సీతారామయ్య భార్య శారద. ఈ రెండు కుటుంబాలు రహస్య కేంద్రాలను సాగిస్తూ రహస్యంగా వున్న కామ్రేడ్స్‌కు అతిథ్యం ఇచ్చే నెలవులయ్యాయి. అలాగే వేములపల్లి హనుమంతరావు బాగా చురుగ్గా పార్టీ కార్యక్రమాలలో పాల్గొనేవాడు. ఆయన కొరియర్‌గా వుండేవాడు. ఆ తర్వాత పార్టీనుండి వైదొలిగాడు. వేములపల్లి హనుమంతరావు కార్మికరంగంలో పనిచేసేవాడు.

యం.ఆర్. వెంకట్రామన్ కూడా రహస్య జీవితం గడుపుతున్నాడు.ఆయన భార్యకు తీవ్రంగా జబ్బు చేసిందని కబురొచ్చింది. వెడితే అరెస్టు చేయవచ్చు. అయినా సరే వెళ్ళమని చెప్పాను. వీలైనంత జాగ్రత్తగా వెళ్ళి రమ్మన్నాను. ఒక్కొక్క సమయంలో కొన్ని తప్పవు. అంతగా జబ్బు వున్న భార్యను చూసి రాకుండా వుండడం కమ్యూనిస్టులకు మంచిది కాదు.

వెంకట్రామన్ వెళ్ళి వచ్చాడు. అతని భార్య అతనితో వెంటనే వెళ్ళిపొమ్మనమనీ, లేకపోతే అక్కడే అరెస్టు అయితే భార్యను చూడకుండా వుండలేక వచ్చి అరెస్టయ్యాడని ప్రజలు భావిస్తారనీ చెప్పి పంపించింది. వెంకట్రామన్ వచ్చేసిన రెండో రోజున ఆమె చనిపోయింది. ఇటీవల వెంకట్రామన్ కూతురు భారతి కన్పిస్తే "మీ అమ్మ గుర్తు వున్నదా!" అని అడిగాను. "ఎలా వుంటుంది? నేను అమ్మపోయే నాటికి ఏడాది రెండేళ్ళ పిల్లను గదా" అని తన కూతురు ఫోటో చూపించి "మా అమ్మాయి అచ్చం మా అమ్మలా వుంటుందంటారు' అంది. నేను భారతి తల్లిని పద్దెనిమిదేళ్ళ వయస్సులో చూశాను.



భారతి కూతురుకు కూడా పద్దెనిమది సంవత్సరాలే వుంటాయి. అచ్చం వాళ్ళ అమ్మమ్మలాగానే వున్నది. నాకు అప్పటి వెంకట్రామన్ భార్యనే చూసినట్లనిపించింది.

ఆ తర్వాత నెల్లూరులో వెంకట్రామన్ పట్టుబడ్డాడు. ఎవరో సమాచారం అందించారల్లే వుంది. ఆయన నదిలో స్నానం చేస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు.

రామ్మూర్తిని తంజావూరులో తన గ్రామం దాటి వెళ్ళరాదన్న ఆదేశాలతో ప్రభుత్వం నిర్బంధించింది. ఆయన చిన్నతనంలో కోతి కొమ్మచ్చులాడుతూ పడితే కాలు విరిగింది. సరైన వైద్యం జరగలేదు. ఒక కాలు రెండో దానికన్న పొట్టి అయింది. అందువల్ల బాగా నడవలేడు. పరుగెత్తలేడు. ఆయన్ని ఆ వూరు నుంచి దాటించి మద్రాసు జేర్చాలి! నాకున్న సానుభూతిపరులైన తెలుగు వాళ్ళ సాయంతో ఏర్పాటు చేశాను. వారు కారులో వెళ్ళి అనుకున్న టైముకు ఆయనను ఒక ప్రదేశానికి వచ్చే ఏర్పాటు చేసుకుని అక్కడ నుండి కారులో మద్రాసు తీసుకు వచ్చారు.

ఇప్పుడు "ప్రజాశక్తి" మేనేజర్‌గా వున్న గోళ్ళ రాధాకృష్ణమూర్తి ఆయుర్వేదిక్ మెడికల్ విద్యార్థులతో పాటు మద్రాసులోనే వుండేవాడు. అలాగే ముత్తయ్య అన్న తమిళనాడు కామ్రేడ్ - ఇంకా సంబంధాలుండేవి. ఇవన్నీ మాకు ఉత్తరాలు జేరే అడ్రసులుగా ఉపయోగపడేవి.

కామ్రేడ్ శివశర్మ ఈరకంగా ఎవరి అడ్రసో యిచ్చి ఉత్తరాలు జేరవేసుకోవడం కొన్ని సందర్భాలలో తప్పదనీ, అన్ని సందర్భాలలో అన్ని చోట్లకు కొరియర్‌ను పంపటం సాధ్యం కాదనీ చెప్తూనే వీటి విషయంలో నిశ్చితంగా వుండేందుకు వీలులేదని కూడా చెప్పాడు. ఎప్పటికప్పుడు పరిశీలన చేసుకుంటూ, అడ్రసులు మారుస్తూ వుండాలి!

పోలీసులకు అనుమానం వస్తే మొత్తం "టపా" అంతటినీ పరిశీలిస్తారు. ఒక్కోసారి హఠాత్తుగా కొన్ని ఉత్తరాలు పరిశీలిస్తారు. వారికి అనుమానం తోస్తే ఇక ఆ అడ్రస్ వెంటపడతారు. తద్వారా ఎక్కడనుండి వచ్చింది అవన్నీ తెలుసుకుంటారు. అలాగే ఆ యింటిపై కన్నువేసి వుంచుతారు. కొత్తవాళ్ళెవరన్నా వస్తే పసిగడతారు. వారిని అనుసరించి ఒకోసారి రహస్య కేంద్రాన్ని తెలుసుకుంటారు. సామాన్యంగా తమకు అనుమానం తోచిన వ్యక్తులను ఇలాంటి సందర్భాలలో వెంటనే నిర్బంధించరు.

వేములపల్లి హనుమంతరావు మాకు బయట నుండి సమాచారం చేరవేసే కొరియర్. నేనెప్పుడూ బయటి కొరియర్‌కు సరాసరి రహస్య కేంద్రానికి వచ్చే అవకాశం కల్పించేవాణ్నికాదు. మా రహస్య కేంద్ర కొరియర్ బయటకు వెళ్ళి, ఆ బయట కొరియర్‌ను కలుసుకుని కావలసిన సమాచారం ఇచ్చో, తీసుకునో రావాలి! ఇందువల్ల సరాసరి రహస్య కేంద్రం పోలీసులకు తెలిసే అవకాశాలు తక్కువ.

అయినా ఒకోసారి పోలీసులు ఈ వ్యవహారం పట్ల అనుమానపడేవారు. అయితే, వెన్వెంటనే యెవర్నీ అరెస్టు చెయ్యరు. ముందు తమ అనుమానాన్ని ధ్రువీకరించుకునేందుకు కొంత సమయం తీసుకుంటారు.

ఆ విధంగా రామ్మూర్తిని త్యాగరాయనగర్‌లో ఒక రహస్య కేంద్రంలోనూ, మోహన్‌కుమార మంగళాన్ని పెరంబూర్‌లో నా రహస్య కేంద్రంలోనూ ఉంచాము. అయితే నేను "గోవా" యాత్ర పిచ్చి సాహసకృత్యం నుండి బయటపడేసరికి ఆ ఇరువురూ వుంటున్న రహస్య కేంద్రాలు బయటపడ్డాయి. రామ్మూర్తిని, మోహన్ కుమార మంగళాన్ని వేములపల్లి హనుమంతరావును అరెస్టు చేశారు.

నేను మళ్ళీ కొత్త కేంద్రాన్ని ఎంపిక చేసుకుని, కొత్త సంబంధాలను ఏర్పరుచుకుని మొత్తం రహస్య యంత్రాంగాన్ని తిరిగి పునర్ నిర్మించుకోవాలి! ఈసారి నా రహస్య కేంద్రంతో పాటు మరో రెండు కుటుంబాలను ప్రత్యామ్నాయ కేంద్రాలుగా ఏర్పాటు చేసుకున్నాను. ఇప్పుడిక ఏదో ఒక కేంద్రంలోనే వుండనవసరంలేదు. కేంద్రాన్ని మారుస్తూ వుండొచ్చు. నేను యెప్పుడు ఎక్కడ ఉంటానో అక్కడికి వెళ్ళేదాకా యెవరికీ తెలియదన్నమాట! దీనికి తోడు పోలీసు నిఘాపై ప్రత్యేకంగా మా నిఘా యేర్పాటు చేసుకున్నాము.

1942 వరకూ ఈ రహస్య నిర్మాణం సాగింది. ఆ తర్వాత పార్టీ విధానంలో వచ్చిన మార్పు దృష్ట్యా పార్టీపై నిషేధం తొలగించిన తర్వాతనే మేము బహిరంగంగా వచ్చాము. మద్రాసు కుట్రకేసు అని పెట్టి అందులో రామ్మూర్తిని, మోహన్‌కుమార్ మంగళాన్ని నిర్బంధించి జైల్లో పెట్టారు. అయితే ఆ తర్వాత పార్టీ విధానంలో మార్పు వచ్చినప్పుడు వాళ్ళను వదిలేశారు.

ఈ కుట్ర కేసులోనే డా॥ అచ్చమాంబ భర్త వెంకట్రామన్ కూడా నిర్బంధించారు. తన అడ్రసు రహస్య కార్యకలాపాలు గూర్చి ఉత్తర ప్రత్యుత్తరాలకు అవకాశం యిచ్చాడనీ, రహస్య యంత్రాంగానికి తోడ్పడుతున్నాడనీ ఆరోపణ! ఈ కేసును అడ్వకేట్ బచ్చు జగన్నాథం తీసుకుని మా తరపున వాదించాడు. ఆ తర్వాత ఆయన హైకోర్టు న్యాయమూర్తిగా చేసి ప్రస్తుతం రిటైర్ అయినారు.

ఈ కాలంలో నా ముఖ్యమైన కార్యక్రమాలలో రెండు, మూడు చెప్తాను. 1940 మధ్య భాగంలో కేరళలో అక్కడ రహస్యంగా వుంటున్న పార్టీ వారికి పార్టీ విధానాన్ని వివరించేందుకు వెళ్ళాను. కన్ననూర్, పాల్ఘాట్ తదితర ప్రాంతాలు తిరిగాను. అక్కడ కూడా పార్టీ మొత్తం రహస్యంగా వుంది. కామ్రేడ్ ఇ.ఎం.ఎస్. ఒక బెస్తవాని గుడిసెలో తన రహస్య జీవితం గడుపుతున్నారు. ఆయన జనానికి బాగా తెలిసినవాడు గనుక ఎలాంటి చిన్న అవకాశం పోలీసులకు యిచ్చినా ఆయనను పట్టుకోవడం తేలిక! పట్టపగలు ఎట్టి పరిస్థితులలో బయటకు వచ్చేవాడు కాదు. రాత్రి పూటనే స్నానం వగైరా! కొన్ని సందర్భాలలో ఆయన జైలులో వంటరిగా ప్రత్యేక గదిలో నిర్బందించబడినపుడు చెయ్యాల్సి వచ్చినట్లుగా కాలకృత్యాలు కూడా తన గుడిసెలోనే కుండల్లో తీర్చుకోవలసి వచ్చేది.

నాకు చాలా గొప్పగా అనిపించిందేమంటే ఆయన చాలాపేరు ప్రతిష్టలు గల నంబూద్రి కుటుంబం నుండి వచ్చినా, సంస్కృతంలో, వేదంలో పండితుడైనా, ఛాందసత్వం మధ్య పెరిగినా



సామాన్య పేదలతో, హరిజనులతో ఆయన కలిసిపోయిన తీరు ఈ పేదల ఆచార వ్యవహారాలెలాంటివైనా వాటిని ఆయన పాటించాడు. ఏ మాత్రం సందిగ్ధం లేకుండా వాళ్ళు పెట్టిన ఆహారం – చేపలతో సహా శుభ్రంగా తినేవాడు.

అప్పుడు ఈ కేరళ పర్యటనలో నాకు కొరియర్‌గా 12 –14 సం॥ల వయసు గల కుర్రవాడు పనిచేశాడు. ఆయన పేరు కున్‌హి ఆనందన్! ఆ తర్వాత పార్టీ బహిరంగంగా వచ్చినప్పుడు పార్టీ కార్యకర్తగా పనిచేశాడు. అటు పిమ్మట బెర్లిన్ వెళ్ళాడు. జర్మన్ భాషలో ప్రావీణ్యం సంపాదించి పత్రికా విలేఖరిగా జర్మనీలోనే స్థిరపడిపోయాడు. "బ్లిడ్జ్" పత్రికకు అంతర్జాతీయ పరిస్థితిపై వ్యాసాలు రాస్తుంటాడు.

కేరళపార్టీ, కేరళ ప్రజల పోరాటపటిమకు వుదాహరణ చెప్తాను. ఇ.కె. నయనార్ తన స్వీయచరిత్రలో ఒక ఘట్టంగూర్చి రాశారు. అది 1940లో జరిగింది. కేరళలో చాలా పెద్ద ఎత్తున యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు జరిగాయి. ఆ సందర్భంగా ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని తెచ్చిపెట్టింది. పోలీసులతో ప్రజలు ఘర్షణపడ్డారు. ఇద్దరు పోలీసులు చనిపోయారు. అది ఆసరాగా వేటకుక్కల్లా పార్టీని, ప్రజలను వెంటాడి వేధించారు. ఆ ప్రతిఘటనతో నాయకులు తెగించి, చాలా ధైర్యసాహసాలతో పోలీసులను తప్పించుకు తిరుగుతున్నారు. చివరికి ఒక అడవిలో వారిని పోలీసులు అరెస్టు చేశారు. వారి విడుదల కోరుతూ పెద్ద ఎత్తున కేరళ అంతటా ప్రదర్శనలు జరిగాయి.

అలాగే కయ్యూరులో కూడా భూస్వాములు, పోలీసులు కలిసి మనవారిపై దాడి చేశారు. ఆ ఘర్షణలో మన కామ్రేడ్ హతుడైనాడు. తర్వాత చెప్పరాని నిర్బంధం కొనసాగింది. మన కామ్రేడ్స్ నల్గురిని అరెస్టు చేసి, కేసుపెట్టి ఉరిశిక్ష వేశారు. 1943లో వారిని ఉరితీశారు. ఈ వురితీయడానికి ముందుగానే నేను, జోషి, కృష్ణపిళ్ళై వెళ్ళి వాళ్ళను జైల్లోనే కలుసుకున్నాము. వాళ్ళు వురి తీయబడేముందు చెప్పిందేమంటే, "మా వంతు కర్తవ్యం మేము చేశామనే గర్వపడుతున్నాం. ఎర్రజెండా ప్రతిష్టను సమున్నతంగా ఎగురవేయవలసింది మీరు" అని. ఈ ఘటన కేరళ పార్టీపై గౌరవాన్ని కలుగజేయడమేగాక, మాకు ఎంతో వుత్తేజాన్నిచ్చింది.

# రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో

1940 –42 మధ్య యూరపును ఆక్రమించిన తర్వాత సోవియట్ యూనియన్ పై హిట్లర్ దాడికి పూనుకున్నాడు. బ్రిటిష్ ప్రభుత్వం తాను సోవియట్ యూనియన్‌కు మద్దతుగా వుంటానని, హిట్లర్‌ను ఓడించడానికి కృతనిశ్చమై వున్నానని ప్రకటించక తప్పలేదు. ప్రపంచంలో వున్న కమ్యూనిస్టులందరూ ఈ ప్రకటనను ఆహ్వానించారు. దీనితో కమ్యూనిస్టు వ్యతిరేక దుర్మార్గాన్ని కొనసాగించే అవకాశం హిట్లర్‌కు తగ్గింది. మొత్తం ప్రపంచమే హిట్లర్ దాసోహమనవలసి వస్తుందేమోనని బ్రిటన్ భయపడ్డది. దానికి తోడు ప్రపంచ వ్యాపితంగా ప్రజానీకం ప్రత్యేకించి బ్రిటన్‌లో వున్న ప్రజానీకం కూడా ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో అంతర్భాగమై వున్నారు. వారెట్టి పరిస్థితులలోను ప్రపంచ ప్రజల కిరాతక శత్రువు హిట్లర్‌ను తమ ప్రభుత్వాలు సమర్థిస్తే సహించగల స్థితిలో లేరు. తమవర్గ ప్రయోజనాలు, ప్రజల్లో వున్న హిట్లర్ వ్యతిరేకత కలసి బ్రిటిష్ ప్రభుత్వంచే హిట్లర్‌కి వ్యతిరేకంగా సోవియట్ యూనియన్‌కు మద్ధతును ప్రకటింపజేశాయి.

అమెరికా, బ్రిటన్‌లు రెండూ కూడా సోవియట్ యూనియన్‌కు హిట్లర్ తమ దాడితో బలహీనపరుస్తాడని, ఆ క్రమంలో వారి ప్రతిఘటనలతో హిట్లర్ కూడా బలహీనపడతాడని భావించాయి. ఈ రెండు శక్తులూ బలహీనపడ్డ సమయంలో తాము రెంటిపైనా పైచేయిగా వుండవచ్చునని ఆశించాయి. వారి ఆశలు ఏమైతేనేమి వారు మాత్రం హిట్లర్‌తో చేయి కలపలేదు. సోవియట్ యూనియన్‌కు మద్దతునిస్తామని చెప్పక తప్పలేదు. అదే విధంగా జపాన్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న చైనాకు కూడా అమెరికా, బ్రిటన్‌లు మద్ధతు ప్రకటించాయి. అప్పుడు ఒక ప్రశ్న ఉత్పన్నమైంది. కమ్యూనిస్టులు ఏం చేయాలి? యుద్ధం మొదలైన తొలి దశలో అంటే 1939 సెప్టెంబర్ నుండి సోవియట్ యూనియన్‌పై హిట్లర్ దాడి ఆరంభించేంత వరకు ఒక విధానం అనుసరిస్తూ వచ్చాము. హిట్లరే ఆరంభించినప్పటికీ, అది సామ్రాజ్యవాదుల మధ్యే యుద్ధమని, కనుక ఈ యుద్ధాన్ని వ్యతిరేకించాలని భావించాము. కాని, హిట్లర్‌కు వ్యతిరేకంగా వున్న సామ్రాజ్యవాద దేశాలు మాత్రం యుద్ధంలో నిమగ్నమై వున్నాయి. ఈ



కమ్యూనిస్టులు మాత్రం ఒకరి భూభాగాన్ని మరొకరు అక్రమణలో వుంచుకొని షరతుమీద శాంతియుత పరిష్కారం కావాలని కోరుతున్నారు.

దీనిపై వివిధ దేశాల కమ్యూనిస్టు పార్టీలలో విభేదాలు వున్నాయి. ఈ శాంతియుత పరిష్కారాన్ని కోరడం వలన కమ్యూనిస్టు ఉద్యమం అభివృద్ధి చెందుతుందా? లేదా? అన్నది ప్రధానమైన ప్రశ్నగా వుంది. తదనుగుణంగా వివిధ దేశాల కమ్యూనిస్టు పార్టీల నాయకత్వాల్లో మార్పు వచ్చింది. ఉదాహరణకు బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా రజనీ పామీదత్ బాధ్యత స్వీకరించవలసి వచ్చింది. బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీలో ప్రత్యేకించి ఇంకొక సమస్య కూడా ముందుకు వచ్చింది. అంతకుముందు దశాబ్దంగా వారు ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో ప్రధాన పాత్ర వహించారు. అలాంటప్పుడు తీరా ప్రత్యక్షంగా హిట్లర్ బ్రిటన్‌పై బాంబులు వేస్తున్న సందర్భంలో శాంతియుత పరిష్కారం అని చెప్పడం వారి దేశ రక్షణకు ఎంతవరకు మంచిది అన్నదే ఆ ప్రశ్న. హిట్లర్‌ను, ఇన్నాళ్ళు హిట్లర్ విధానాలకు మద్ధతునిస్తున్న తమ ప్రభుత్వాన్ని అందులోనూ తమ ప్రభుత్వం సోవియట్ యూనియన్‌తో ఒప్పందానికి రాకపోవడాన్ని విమర్శించడం ఒక ఎత్తుకాని, నేరుగా బ్రిటన్‌పైనే హిట్లర్ దురాక్రమణకు పూనుకున్నప్పుడు శాంతియుత పరిష్కారం కావాలి అని ఒక్కసారిగా ప్రజానీకానికి వివరించడం మరింత కష్టం. ఉన్నట్లుండి, ఎందుకు బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీ ఇలా తన వైఖరిని గతానికి భిన్నంగా మార్చుకుందో ప్రజలు గ్రహించేటట్లుగా చెప్పబూనడం అంత సులభ సాధ్యమేమీకాదు.

ఇక సోవియట్ యూనియన్ హిట్లర్‌తో నిర్యుద్ధ ఒడంబడికను చేసుకోవడాన్ని హర్షిస్తూ "నవశక్తి"లో కూడా ఒక ప్రకటన చేశాము.

హిట్లర్‌కు వ్యతిరేకంగా కలిసి రావలసిందిగా ఇతర సామ్రాజ్యవాద శక్తులకు సోవియట్ యూనియన్ పదే పదే ప్రతిపాదించింది. కాని, ఆ శక్తులేవీ అందుకు అంగీకరించలేదు. కనుక, హిట్లర్‌తో నిర్యుద్ధ ఒడంబడికకు రావడం సోవియట్ యూనియన్‌కు తప్పనిసరైంది. హిట్లర్ పోలెండు ద్వారా సోవియట్ యూనియన్‌పై దాడి చేయాలని ప్రయత్నం చేస్తున్న సందర్భమది. సోవియట్ యూనియన్ సహాయం తీసుకొనేందుకు పోలెండ్ నిరాకరిస్తున్నది. ఈ నిర్యుద్ధ ఒడంబడిక వల్ల సోవియట్ యూనియన్ తనపై తక్షణమే రావలసిన దాడిని నివారించుకోగలదు. కొంత వూపిరి పీల్చుకునే సమయం దొరుకుతుంది. సోవియట్ యూనియన్ మరింత సన్నద్ధమై హిట్లర్ దాడి నుండి తాను రక్షించుకోగలదు.

ఇవన్నీ దృష్టిలో వుంచుకునే నిర్యుద్ధ ఒడంబడికను ఆహ్వానించాము. 1938 మ్యూనిచ్ ఒప్పందానికి కూడా చాంబర్లేన్ ద్రోహం చేశాడు. ఫ్రెంచి ప్రభుత్వమూ అదేపని చేసింది. అప్పుడు చెకోస్లోవేకియా ప్రజాతంత్ర ప్రభుత్వం కూడా సోవియట్ సహాయం తీసుకునేందుకు నిరాకరించింది. పోలెండ్ మీదుగా చెకోస్లోవేకియా లోకి తన సైన్యాలను నడిపించి, సోవియట్ యూనియన్ చెకోస్లోవేకియాతో సహకరిస్తానన్నా ఆ సహకారాన్ని తీసుకునేందుకు

చెకోస్లోవేకియాలో ప్రజాతంత్ర ప్రభుత్వం పేరుతో వున్న బూర్జువా ప్రభుత్వం సంసిద్ధంగా లేదు. తమదేశం దురాక్రమణకు గురయ్యేందుకు వారు అవకాశం యిచ్చారు.

కనుక, ఇలాంటి పరిస్థితులలో సోవియట్ యూనియన్ తన మార్గాన్నేదో తాను ఎంచుకోక తప్పలేదు. మ్యూనిచ్ ఒప్పందం కుదిరిన సంవత్సరం తర్వాత తుదకు చెకోస్లోవేకియా దాదాపు పూర్తిగా ఆక్రమించబడిన తర్వాత కూడా సోవియట్ యూనియన్ ఫాసిస్టు వ్యతిరేక సంఘటన కోసం కృషి చేసింది. ఆ సమయంలో కూడా సామ్రాజ్యవాద దేశాలు నిరాకరించాయి. హిట్లర్ సోవియట్ యూనియన్‌పై దాడి చేయాలని వారు కోరుకున్నారు.

అయితే హిట్లర్ ఒకే సమయంలో అటు యూరప్‌తోను, ఇటు సోవియట్ యూనియన్‌తోను ద్విముఖంగా యుద్ధం చేసేందుకు సిద్ధపడలేదు. ముందుగా యూరపును ఓడించి, బ్రిటన్‌ను కూడా ఆక్రమించి, ఒకవైపు యుద్ధాన్ని విజయవంతంగా ముగించుకొని, ఆ తర్వాత సోవియట్‌పై దాడి చేయాలని నిశ్చయించుకున్నాడు. ఈ దశలో గత్యంతరంలేని పరిస్థితులలో సోవియట్ యూనియన్ హిట్లర్‌తో నిర్యుద్ధ సంధి చేసుకున్నది. దీన్ని ఫాసిస్టు వ్యతిరేక పోరాటానికి వెన్నుపోటు పొడవడంగా చిత్రించడం చరిత్రకు ద్రోహం చేసినట్లే. ఆ విషయంలో భారత కమ్యూనిస్టు పార్టీలో గాని, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో గాని ఎలాంటి భేదాభిప్రాయాలు లేవు.

అలాగే సోవియట్ యూనియన్ ఫిన్‌లాండ్ ప్రభుత్వానికి పరస్పర సహకార ఒప్పందం చేసుకుందామని ప్రతిపాదించింది. ఫిన్‌లాండ్ ప్రభుత్వం అందుకు అంగీకరించలేదు. పైగా జర్మన్ సైన్యాలు తన దేశం మీదుగా రాకుండా నిరోధించేందుకు కూడా ఫిన్‌లాండ్ ప్రభుత్వం ఎలాంటి గ్యారంటీ ఇవ్వలేదు. కనుక సోవియట్ లోని లెనిన్ గ్రాడ్‌కు ప్రమాదం రాకుండా ఉండగలందులకై ఫిన్‌లాండ్‌లో కొంత భాగాన్ని రష్యన్ సైన్యాలు ఆక్రమించాయి. దానితో ఫిన్‌లాండ్ బలవంతానైనా సరే ఒప్పందంలోనికి రాకతప్పలేదు. ఈ చర్య కూడా సరైనదేనని తర్వాత చారిత్రక పరిణామాలు నిరూపించాయి. హిట్లర్ లెనిన్‌గ్రాడ్‌పై దాడిచేసే సమయానికి సోవియట్ తీసుకున్న పై చర్యవల్ల లెనిన్‌గ్రాడ్‌ను మరింత పటిష్టవంతంగా సోవియట్ యూనియన్ రక్షించుకోగలిగింది.

దాదాపు వేయి రోజులపాటు లక్షలాది లెనిన్ గ్రాడ్ ప్రజలు వీరోచితంగా జర్మన్ సైన్యాన్ని ఎదుర్కొన్నారు. హిట్లర్ అనుసరించిన "బ్లాక్‌డే" వలన తమకు కనీసంగా అవసరమైన రేషన్ లేకపోయినప్పటికీ, అర్థాకలితో, పస్తులతో వుంటూ కూడా జర్మన్ సైన్యాలను వెనుకకు కొట్టారు. ఈ పరిస్థితులలో సోవియట్ యూనియన్ అంత వీరోచితంగా పోరాడుతున్నప్పుడు హిట్లర్ ఫాసిజానికి వ్యతిరేకంగా ధీరోదాత్తంగా నిలబడినప్పుడు ఈ పరిణామాలన్నింటా సోవియట్ యూనియన్‌తో ఖచ్చితంగా నిలబడడంలో భారత కమ్యూనిస్టు పార్టీ సక్రమైన వైఖరినే తీసుకున్నది.



అయితే ఈ దశలో అంటే యుద్ధం మొదటి దశలో సోవియట్ యూనియన్ పై హిట్లర్ దాడి చేసేవరకు కూడా కాంగ్రెస్ పట్ల మేం విమర్శనాత్మకంగా ఉన్నాం. ఈ అదను చూసుకొని జాతీయోద్యమాన్ని ఉధృతం చేసి బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని త్రోసివేసేటట్లుగా స్వాతంత్ర్య పోరాటాన్ని నడపమని కాంగ్రెస్‌కు పిలుపునిస్తూ వచ్చాము. కాంగ్రెస్ అనుసరిస్తున్న వ్యక్తిగత సత్యాగ్రహము ఇలాంటివి ఏవో పైపై పూతలని, నిజానికి కొన్ని రాయితీలు రాబట్టుకుని బ్రిటిష్ సామ్రాజ్యవాదంతో లాలూచీ పడి కాంగ్రెస్ సామ్రాజ్యవాదానికి సహకరిస్తున్నదని తీవ్రంగా విమర్శించాం.

అయితే ఈ లోపల బ్రిటిష్ ప్రభుత్వం హిట్లర్‌కు వ్యతిరేకంగా మిత్రకూటమి గెలిచేందుకు తను చేయగలిగిందల్లా చేస్తానని ప్రకటించింది. ఇప్పుడేం చెయ్యాలి? ఇంతకుముందు చెప్తున్నట్లుగానే ఇది సామ్రాజ్యవాద యుద్ధమని, ఈ అదనుతో బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని త్రోసివేసేందుకు జాతీయోద్యమాన్ని ఉధృతం చెయ్యమని చెప్పాలా? అలా చేసినట్లయితే మిత్రకూటమిలో భాగస్వామి అయిన బ్రిటన్ మీద పోరాటం నడపటం వలన ప్రపంచానికే ప్రమాదంగా తయారయిన ఫాసిస్టు వ్యతిరేక పోరాటాన్ని నీరుగార్చిన వారం అవుతామా? ఈ ప్రశ్న ప్రధాన చర్చనీయాంశమైంది.

నాకు స్పష్టంగా ఒక విషయం గుర్తున్నది. మనం రహస్యంగా తీసుకువస్తున్న పత్రికలలో ఆ రహస్యంగా వున్న రోజుల్లోనే నేనొక వ్యాసం రాశాను. సోవియట్ యూనియన్ గెలవాలని హిట్లర్ ఓడిపోవాలని మనం కోరుకుంటున్న మాట నిజమే. అంతమాత్రం చేత బ్రిటన్ ప్రకటించిన ఈ మద్దతును నిజాయితీ గలదిగా భావించలేం... హిట్లర్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న సోవియట్ యూనియన్‌కు మద్దతుగా బ్రిటిష్ ప్రభుత్వం తన సర్వశక్తులను ఒడ్డుతుందనుకుంటే మోసపోయినట్లే. సోవియట్ యూనియన్ పై దాడి కొనసాగాలని, తద్వారా సోవియట్ బలహీనపడాలని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఆశిస్తున్నారు. కనుక బ్రిటిష్ వారు చేసిన ఈ బహిరంగ ప్రకటనకే మనం భ్రమలో పడిపోరాదు. మన జాగ్రత్తలో మనం వుండాలి. ఫాసిస్టు వ్యతిరేక పోరాట విజయానికి అత్యంత ప్రధానమైన గ్యారంటీ ఒకటుంది. అది బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని ఎదిరించి పోరాడటమే కనుక, పరిస్థితిని మనచేతుల్లోనికి తీసుకుని బ్రిటిష్ సామ్రాజ్యవాదులపై భారతదేశ – జాతీయ స్వాతంత్ర్య పోరాటం కొనసాగించాలి. అలాంటి జాతీయ స్వాతంత్ర్యం సాధించిన భారతదేశం అయితేనే సోవియట్ యూనియన్‌కు అనుకూలంగా తనకున్న వనరులన్నింటినీ, ప్రజానీకాన్ని సమీకరించగలదు. ఇదీ ఆ వ్యాసం సారాంశం.

ఈ వ్యాసం అప్పుడు బొంబాయి నుండి వెలువడుతున్న పార్టీ కేంద్ర రహస్య పత్రికలో ఆంగ్లంలో అచ్చయింది.

హిట్లర్ సైన్యాలు సోవియట్ యూనియన్‌లోనికి చొచ్చుకెళుతున్నాయి. సోవియట్ ప్రమాదంలో పడిందన్న భయం సాధారణంగా అలుముకొంది. పార్టీ సభ్యులు, సానుభూతిపరులు

అందరూ కూడా భయపడుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సోవియట్ గెలిచి తీరాలని వాంఛిస్తున్నారు. కనుక ఈ దశలో సోవియట్ యూనియన్‌తో మిత్రత్వాన్ని ప్రకటిస్తూ హిట్లర్‌కు వ్యతిరేకంగా తన వనరులన్నీ సమీకరించగలనని చెబుతున్న బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాన్ని తీవ్రతరం చేయటం సరైనది కాదు అన్న అభిప్రాయం అందరిలో చోటు చేసుకున్నది.

కానీ బ్రిటీష్ ప్రభుత్వం మాత్రం జాతీయోద్యమం కోరుతున్న కనీస డిమాండ్లను కూడా ఆమోదించటం లేదు. బ్రిటిష్ సామ్రాజ్యవాదం బలహీనపడ్డది. ఇప్పుడు మన పోరాటాన్ని తీవ్రతరం చేస్తే బ్రిటిష్‌వారు లొంగి వచ్చి మనకు స్వాతంత్ర్యాన్ని ఇస్తారు. ఇదే మంచి అదను. సోవియట్ యూనియన్ ఓడిపోవాలని, హిట్లర్ గెలవాలని గాని ఎవ్వరూ కోరుకోనప్పటికీ ఈ అవకాశాన్ని జారవిడుచుకోవటం తప్పు అన్న అభిప్రాయం జాతీయోద్యమంలోనే ఒక భాగంలో బలంగా ఉంది. వీరికి సోవియట్ యూనియన్ భవిష్యత్తుపట్ల పెద్ద ఆసక్తి లేదు.

నెహ్రూతో సహా కాంగ్రెస్‌లో వున్న వామపక్షీయులు, కమ్యూనిస్టులు అందరూ కూడా సోవియట్ యూనియన్ విజయం సాధించేందుకు మనం చేయవలసిందల్లా చేయాలని అంటూనే ఉన్నారు.

ఈ చర్చలు ఇలా సాగుతూ వుండగా "డియోలి" నిర్బంధ క్యాంపు నుండి ఒక డాక్యుమెంటు వచ్చింది. "డియోలి" రాజస్థాన్‌లో ఉన్నది. అక్కడికి ఎలాంటి రవాణా సౌకర్యమూ లేదు. దొరికిన ప్రముఖ కమ్యూనిస్టు నాయకులను ఆ "డియోలి"లో నిర్బంధించారు. వాళ్ళు కామ్రేడ్స్ బి.టి. రణదివె, డాంగే, మూడవ వ్యక్తి భరద్వాజో లేదా ఘాటేనో సరిగా గుర్తులేదు. ఈ ముగ్గురు కలసి ఒక థీసిస్ బయటకు పంపారు. ఈ భరద్వాజ్ ఉత్తరప్రదేశ్‌కు చెందినవాడు. ఆయన బి.బి.సి. ఐ. రైల్వే వర్కర్స్ యూనియన్ కార్యక్రమాలలో ఉండగా అహమ్మదాబాద్‌లో అరెస్టు చేశారు. సరే, ఇంతకీ, ఆ థీసిస్ సారాంశం ఇది : ఈ ఫాసిస్టు వ్యతిరేక యుద్ధంలో ఎట్టి పరిస్థితుల్లోనూ సోవియట్ యూనియన్ రక్షింపబడాలి. అందుకై మనం చేయగలిగినదంతా చేయాలి. కనుక మన విధానాన్ని మార్చుకొని బ్రిటిష్ ప్రభుత్వం యుద్ధ ప్రయత్నాలను చురుకుగా కొనసాగించేటట్లు చూడాలి.

అప్పటికి బొంబాయిలో పార్టీ రహస్య యంత్రాంగం పని చేస్తున్నది. ఈ యుద్ధము, వీరు పంపిన థీసిస్ – ఇవన్నీ చర్చనీయాంశాలైనాయి. అప్పుడు పొలిట్‌బ్యూరోలో అధికారి, పి.సి. జోషి ఉన్నారు. ఇతర పి.బి. సభ్యులు అరెస్టయ్యారు గనుక దక్షిణాది ఉద్యమాన్ని ప్రతిబింబించేందుకని నన్ను కూడా పి.బి. లోనికి తీసుకున్నారు. కనుక ఆ పి.బి. సమావేశానికి నేను కూడా హాజరయ్యాను.

సుదీర్ఘమైన చర్చలు సాగాయి. ఈ చర్చలలో నా పాత్ర పెద్దగా వుందని చెప్పలేను. ఇక్కడ ఒక విషయం మటుకు స్పష్టం చేయదలచుకున్నాను. కామ్రేడ్ అధికారి తదితరులు "దేశానికి స్వాతంత్ర్యం కచ్చితంగా ఇస్తామన్న షరతును బ్రిటిష్ ప్రభుత్వం అంగీకరిస్తేనే తప్ప,



యుద్ధ ప్రయత్నాలకు మద్దతునిస్తామని బహిరంగంగా ప్రకటించకూడదు. అలా అయితే మన విధానమును మార్చుకొని బహిరంగంగానే ప్రకటిస్తాము" అని చెప్పారు.

పి.సి. జోషి అప్పుడు పార్టీకి తాత్కాలిక కార్యదర్శిగా వున్నాడు. ఆయన గురించి ఇక్కడ కొంచెం చెప్పాలి. 1935 నుండి మొత్తం రెండవ ప్రపంచ యుద్ధ కాలమంతా కేంద్ర యంత్రాంగాన్ని నిర్మించిన ఘనత ఆయనకే దక్కాలి. 1935–40 మధ్య "నేషనల్ ఫ్రంట్" రోజులలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని, పార్టీ నిర్మాణాన్ని, ప్రజాసంఘాల ఏర్పాటును పరిశీలిస్తే పి.సి. జోషి నిర్వహించిన ప్రముఖమైన పాత్ర అర్థమవుతుంది. ఆఫీసు నిర్వహణలో ఆయనకున్న ప్రత్యేకత ఆయనకు వుంది. ఒక్క మాటలో చెప్పాలంటే 1935–42 మధ్య భారతదేశ వ్యాపితంగా కమ్యూనిస్టు ఉద్యమ అభివృద్ధిలో కీలకమైన పాత్ర ఆయనదే.

ఈ సమస్య సందర్భంలో ఆయన ఆందోళనంతా ఆ 'థీసిస్'ను ప్రజలకు నచ్చే విధంగా ఎలా చెప్పగలము అన్నదే. సోవియట్ యూనియన్ గెలిచి తీరాలని, అందుకై మనం చేయవలసినదంతా చేయాలని అన్నదాంట్లో ఆయనకు ఏమాత్రం సందేహం లేదు. అంతేకాదు, సోవియట్ యూనియన్ ఓడిపోయేటట్లయితే భారతదేశానికి స్వాతంత్ర్యం రావడం కష్టసాధ్యమన్నది ఆయన అభిప్రాయం.

కాని బ్రిటిష్‌వారి యుద్ధ యత్నాలను బలపర్చడం ద్వారా స్వాతంత్రోద్యమాన్ని ముందుకు తీసుకు వెళ్ళగలము అని ప్రజలకు ఏ విధంగా నచ్చచెప్పగలము? అన్నదే ఆయనకు పెద్ద సమస్య అయింది. ఇదేదో సోవియట్ ప్రయోజనాల కోసం చేస్తున్న పని కాదనీ, మన ప్రయోజనాల దృష్ట్యానే ఈ వైఖరి తీసుకోవాల్సి వుందనీ ప్రజలకు చెప్పేదెలా? అంతేకాదు. సోవియట్ యూనియన్ ఓడిపోతుందేమోననే భయంతో మనమే ఈ విధానం చేపట్టడం లేదనీ, హిట్లర్ ఓడిపోవడం ముఖ్యం కనుక ఈ విధానం చేపడుతున్నామనీ చెప్పగలగాలి. కనుక బ్రిటిష్ ప్రభుత్వ యుద్ధ ప్రయత్నాలను బలహీనపరిచే ఏ చర్యలు చేపట్టకుండానే స్వతంత్ర పోరాటాన్ని బలపర్చగలగాలి. ఇదీ ఆయన ఆందోళన.

నేను ఆయన రహస్య కేంద్రంలోనే రెండు, మూడు వారాలుండి ఈ చర్చలలో పాల్గొన్నాం. అందువలన నాకు బాగా గుర్తు. రేయింబవళ్ళు మనం అనుసరించవలసిన నూతన విధానాన్ని ప్రజలకు ఆమోదయోగ్యమయ్యే పద్ధతిలో చెప్పడం ఎలా అన్నదే ప్రశ్న. ఎట్టకేలకు ప్రజా యుద్ధం సూత్రాన్ని పట్టుకున్నారు.

ఈ ప్రజా యుద్ధంలో ప్రజలు సాధించిన విజయం వారి చేతుల్లో బందీగాచిక్కిన సామ్రాజ్యవాదుల విజయం కాజాలదు. బ్రిటిష్ ప్రభుత్వ విజయం అంతకన్నా కాదు. అది ప్రజల విజయం. సోవియట్ యూనియన్ తదితర ఫాసిస్టు వ్యతిరేక శక్తుల విజయం. తాత్కాలికంగా బ్రిటిష్‌వారు, ఇతర మిత్రులు ఈ విజయం వలస కొంత ప్రయోజనం పొందినట్లు కన్పించినా, దేశానికి స్వాతంత్ర్యం రాకుండా నిరోధించడం మాత్రం వారివల్లకాదు.

అందుకనే ఆయన “ప్రజా యుద్ధం నుండి స్వతంత్ర సంఘటన వరకు” అని తాను రాసిన పుస్తకానికి పేరు పెట్టారు. ప్రజా యుద్ధం అని ఆయన చెప్పినది అంగీకరింపబడింది.

ఇక దక్షిణాది కామ్రేడ్స్ విషయం : తమిళనాడు కామ్రేడ్స్ చాలామంది జైళ్ళల్లో వున్నారు. కేరళ, ఆంధ్ర, తమిళనాడుల్లో మిగిలి వున్న కొద్దిమంది కామ్రేడ్స్ ఈ విధానాన్ని పూర్తిగా ఆమోదించారు. ఉదా: కామ్రేడ్ చంద్రం సోవియట్ యూనియన్ ప్రమాదంలో పడినపుడు ప్రజాయుద్ధం విధానమే సరియైనదని నొక్కి వక్కాణించినట్లు నాకు బాగా గుర్తు.

అదేగాక, అంతవరకూ మనం సోవియట్‌కు అనుకూలంగా, హిట్లర్‌కు వ్యతిరేకంగా తీవ్రమైన ప్రచారం సాగిస్తున్నాం. అందువలన ప్రజలు కూడా సోవియట్‌పై దాడిపట్ల ఆందోళనతో వున్నారు. అలాంటప్పుడే ప్రమాదంలో వున్న సోవియట్ యూనియన్‌తో మైత్రి నెరుపుతున్న బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటాన్ని తీవ్రతరం చేయమనడంలో అర్థమేమిటి? హిట్లర్‌కు వ్యతిరేకంగా రెండవ యుద్ధరంగం తెరవమని మనం బ్రిటిష్‌వారికి చెప్పగలగాలి.

ఈ అవగాహనను దాదాపు అందరూ ఆహ్వానించారు. వ్యతిరేకత లేదు. మొదట్లో మన పార్టీలో కూడా కొందరు ఈ విధానాన్ని అంగీకరించడానికి వెన్వెంటనే సిద్ధపడలేదు. ఉదా: బాట్లీవాలా, అజయ్‌ఘోష్‌లు, అజయ్‌ఘోష్ కూడా డియోలీ నిర్బంధ క్యాంపులో ఉన్నప్పటికీ కామ్రేడ్ బి.టి.ఆర్. డాంగేలు పంపిన డాక్యుమెంట్‌పై సంతకం చేయలేదు. కమిటీలో ఉన్న వారేగాక మిగతా వారు కూడా ఆనాడు తామెలా భావించారో స్పష్టంగా రాయగలిగితే అది వేరే విషయం.

డియోలీ థీసిస్ ప్రకారం“ఇది మన యుద్ధము” కనుక “యుద్ధ” ప్రయత్నాలను బలపరుద్దాం’ అన్నదానిని సంపూర్తిగా బలపర్చడం అంత తేలికైన విషయం కాదు. ఊగిసలాటలు వున్నాయి. అందులో మన స్వాతంత్ర్య సమస్య యిమిడి ఉన్నది. బ్రిటిషువాళ్ళు పదే పదే చేస్తున్న ద్రోహం, వారు జాతీయోద్యమం కోరుతున్న కనీస కోర్కెలను కూడా అంగీకరించలేకపోవడం, పైగా ప్రజా పోరాటాలను బ్రిటిష్ ప్రభుత్వం దారుణంగా అణచివేస్తున్న తీరు – ఇవన్నీ ఉన్నాయి. వీటన్నిటికీ సంబంధం లేనట్లుగా మనం వెంటనే “ఇది మన యుద్ధం. యుద్ధ ప్రయత్నాలను బలపర్చాలి” అని చెప్పగలగడం చాలా కష్టమైన విషయం.

ఈ లోపుగా హిట్లర్ సైన్యాలు మాస్కోని ఆక్రమించబూనడం – విఫలమవడం జరిగింది. జపాన్ పెరల్ హార్బర్‌పై దాడిచేసి అమెరికాకు వ్యతిరేకంగా యుద్ధ రంగంలో దిగింది. కనుక ఈ పరిస్థితిలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు కూడా చాలా వత్తిడికి లోనైనారు. పెద్దగా ఏమీ ఇవ్వకుండానే కొన్ని కొన్ని పైపై వెసులుబాటులు కల్పిస్తూ సాధ్యమైనంత ఎక్కువ సహకారం పొందాలని బ్రిటిష్ ప్రభుత్వం 1942 నాటికి భావించింది. కాంగ్రెస్ గనుక పూర్తి సహకారాన్ని ఇచ్చేట్లయితే తాత్కాలిక ప్రభుత్వాన్ని కాంగ్రెస్ ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పిస్తామని బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించింది. ఇది కాంగ్రెస్‌కు సంతృప్తి కల్గించలేదు. గాంధీజీ



“స్వతంత్రమో– మరణమో” అన్న నినాదం ఇస్తూ ఉద్యమాన్ని ఉధృతం చెయ్యాలని భావించారు. నెహ్రూ, కొంతవరకూ మౌలానా అబుల్‌కలామ్ ఆజాద్ అంత దూరం పోకూడదని, ఈ పరిస్థితిలో బేరసారాలు చేస్తేనే మంచిదని చెప్పారు. వారిద్దరూ సోవియట్ విజయాన్ని, ఫాసిస్టు వ్యతిరేక పోరాటాన్ని దృష్టిలో వుంచుకోవాలన్నారు.

తాత్కాలిక ప్రభుత్వాన్ని తప్పించి బ్రిటిష్ ప్రభుత్వం ఇంకా ఆదనంగా ఇచ్చేందుకు సిద్ధపడలేదు. పైగా విపరీతమైన అణచివేత ద్వారా కాంగ్రెస్‌ను లొంగదియ్యాలనుకున్నది. ఇక మా విషయానికి వస్తే మా వైఖరి మారిందన్న విషయం ప్రభుత్వ దృష్టిలో వుంది. 1941 జూన్‌లో సోవియట్‌పై హిట్లర్ దాడి, ఆ తరువాత మన విధానం వివరిస్తూ కరపత్రం రావడం –ఇవన్నీ గమనిస్తూ ఆగస్టులో జరుగనున్న అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశానికి ముందుగా కమ్యూనిస్టు పార్టీపై నిషేధాన్ని బ్రిటిష్ ప్రభుత్వం తొలగించింది.

మనం బాహాటంగా వచ్చేందుకు, పనిచేసేందుకు అవకాశం వచ్చింది. 1942 జూలై, ఆగస్టు నాటికి జపాన్ సైన్యాలు మన సరిహద్దుల దాకా వచ్చాయి. దాంతో మనం ఆఫీసులు తెరుచుకునేందుకు, బహిరంగంగా పనిచేసేందుకు మరింత వెసులుబాటు నిచ్చింది. ప్రభుత్వం, మేము కాంగ్రెస్ – లీగ్ ఐక్యత రావాలనీ, జాతీయ ప్రభుత్వం ఏర్పడాలని సూచించాము. ప్రభుత్వం కూడా జాతీయోద్యమ డిమాండ్లను అంగీకరించడంలో వెనుకంజ వేయరాదనీ, త్వరితంగా అంగీకరించాలనీ చెప్తూ వచ్చాము. అలా అయితే యుద్ధ సహకార చర్యలు గైకొనేందుకు మంచి వాతావరణం ఏర్పడుతుందని ప్రభుత్వానికి తెలియజేశాము. కానీ, అదే సమయంలో మేము మాత్రం యుద్ధ ప్రయత్నాలకు హృదయపూర్వక మద్దతు యిస్తామని స్పష్టం చేశాం.

ఆగస్టు 9 తరువాత ప్రభుత్వం తీవ్ర నిర్బంధానికి పూనుకున్నది. ఆ నిర్బంధానికి వ్యతిరేకంగా ఎక్కడికక్కడ తిరుగుబాటు వెల్లువ వచ్చింది. కాంగ్రెస్ దానికి నాయకత్వం వహించింది. రైల్వేలైన్లను, రోడ్లను ధ్వంసం చేయడం జరిగింది. మొత్తం కాంగ్రెస్ నాయకత్వాన్ని ఏ.ఐ.సి.సి. నాయకత్వాన్ని ప్రభుత్వం అరెస్టు చేసింది. కాంగ్రెస్ తన కార్యకలాపాలను రహస్యంగా నడుపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కాంగ్రెస్ జాతీయోద్యమాన్ని ఇంత తీవ్రంగా నడుపుతున్న సందర్భంలో వారిని “పంచమాంగదళం” అని మేం వ్యతిరేకించసాగాం. ఇది మూర్ఖత్వం తప్ప మరొకటి కాదు.

మహాత్మాగాంధీని గాని, నెహ్రూగాని పేరు పెట్టి పంచమాంగ దళం అని అనలేదు గాని, సుభాష్ చంద్రబోస్‌ను మాత్రం పేరు పెట్టినిందించాం. ఆయన! 40లో జర్మనీకి పారిపోయి అక్కడ నుండి జపాన్ వెళ్ళి ఇండియన్ నేషనల్ ఆర్మీని (ఐ.యన్.ఎ) నిర్మించాడు. జపాన్‌వారి సహకారంతో భారతదేశంలోని బ్రిటిష్ ప్రభుత్వంపై ఇండియన్ నేషనల్ ఆర్మీ ద్వారా యుద్ధం చేయడానికి పూనుకున్నాడు. ఈ విధంగా స్వాతంత్రం రాదనీ, బ్రిటిష్ స్థానంలో జపాన్

అధిపత్యానికి దోహదం చేస్తుందని మన వాదన. బోస్ ఆలోచన భ్రమ తప్ప మరొకటి కాదని మనం విమర్శించడంలో ఏ మాత్రం తప్పులేదు. కాని ఆయన చేసిన మొత్తం ప్రయత్నాన్ని జపాన్ వారి పంచమాంగదళ ప్రయత్నంగా చిత్రించడం వలన కమ్యూనిస్టు ఉద్యమం సహజంగానే ఒంటిదౌతుంది. ఇక్కడ ఇంకో విషయం కూడా ఉంది. ఈ యుద్ధ సమయంలో "మరింత ఉత్పత్తి జరగాలి. సమ్మెలు ఉండకూడదు" అని మనం చెప్పాలి. మనం కార్మికుల కోర్కెల కోసం పోరాడుతాము అనే పేరుతో సమ్మెలను ప్రోత్సహించి సాగించినట్లయితే అది యుద్ధ సమయంలో జరగవల్సిన ఉత్పత్తికి నష్టం కలుగజేస్తుంది. ఆ మేరకు బ్రిటిష్ వారి యుద్ధ ప్రయత్నాలు, ప్రజాయుద్ధం బలహీనపడతాయన్నది నిజమే. కానీ ఏ సమస్యపైనా సమ్మెలు జరగరాదనడం తప్పు నినాదం.

కార్మికులకు కూడా కనీస జీవితావసరాలు తీరవల్సి ఉంది. వాటిని వారు రక్షించుకోవాలి. వారి కనీస అవసరాలు తీరినట్లయితే ఉత్సాహంగా, యుద్ధ ఉత్పత్తికి దోహదపడుతారు. కానీ ఈ సమ్మెలు వుండకూడదు అన్నది ఎంత దూరం వెళ్ళిందంటే, ఉదాహరణకు ఆంధ్రలో కొన్ని ప్రాంతాలలో మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్నారు. సహజంగా ఆ సమ్మె వల్ల ప్రజలు యిబ్బందిపడతారు. కానీ మేము మాత్రం ప్రభుత్వం యుద్ధ ప్రయత్నాలకు సమ్మె నష్టం కల్గిస్తుంది అంటూ ఆ సమ్మెను వ్యతిరేకించాము.

అలాగే గాంధీజీ సత్యాగ్రహం ఆరంభించారు. ఆయన నిరాహారదీక్షకు మద్దతుగా రహస్యంగా వుంటున్న సోషలిస్టులు నిరసన సమ్మె చేయవలసిందిగా బొంబాయి కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సమ్మెకు సహజంగానే యజమానులు వ్యతిరేకం. మేము కూడా ప్రభుత్వ యుద్ధ ప్రయత్నాలకు నష్టం అన్న పేరుతో సోషలిస్టులు మమ్మల్ని కలసి అడిగినా వ్యతిరేకించాము. సహజంగానే మా వ్యతిరేకత దేశభక్తియుత శక్తుల నుండి మమ్మల్ని దూరం చేస్తుంది.

అయితే, యీ రకంగా ఒక కొసకు ఎందుకని సాగలాగుతున్నాం? ఈ తప్పుడు అవగాహనకు మూలమెక్కడ? అంటే సోవియట్ యూనియన్ ప్రమాదంలో వుంది కనుక, సోవియట్ యూనియన్‌కు మిత్రకూటమిలో బ్రిటిష్ ప్రభుత్వం ఉంది కనుక, ఆ బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏ మాత్రం వేలు కదిపినా, సోవియట్‌కు నష్టదాయకము అన్నది అవగాహన, ఆ పరిస్థితిపై యిది సంపూర్తిగా తప్పుడు వాదము.

ఆ తరువాత 1951లో మా వాళ్ళు సోవియట్ యూనియన్ వెళ్ళినప్పుడు స్టాలిన్ దగ్గర ఈ సంగతి లేవనెత్తటం జరిగింది. దానికి కామ్రేడ్ స్టాలిన్ ఇలా చెప్పారు: "మీ అంతర్జాతీయ కర్తవ్యాలను నెరవేర్చడానికి మీరు సిద్ధపడటం సరి అయినదే కానీ, దాని అన్వయించుకోవడంలో అంతర్జాతీయ కర్తవ్యానికి, మీ ప్రజల పట్ల మీరు నిర్వర్తించవలసిన కర్తవ్యానికి వైరుధ్యం వున్నట్లు మీరు అవగాహన చేసుకున్నారు. అది మీ వైఫల్యం."

ఇప్పటికి కూడా ఆ సందర్భంలో ఏం చేసి వుండవలసింది అన్నది చర్చనీయాంశంగానే



ఉంది. మేము రైల్వేలను ధ్వంసం చేసే ప్రయత్నాలను వ్యతిరేకించడం సరైనదే. కానీ, ప్రజలకు వ్యతిరేకంగా ప్రభుత్వం అనుసరిస్తున్న ఎన్నో అంశాలపట్ల మేము మా సహకారాన్ని నిరాకరించి ఉండవలసింది. లేదా శాంతియుత సత్యాగ్రహం వంటివి కొన్ని చేసి ఆయా సందర్భాలలో ప్రభుత్వం మీద వత్తిడి చేయవలసింది.

ఇంత పొరపాటు రాజకీయ అవగాహన కలిగి ఉన్నప్పటికీ ఈ కాలం అంతా కాంగ్రెస్ నాయకులను విడుదల చేయాలని కాంగ్రెస్ ద్వారా జాతీయ ప్రభుత్వం కావాలని, అలా కాకుండా ప్రజలను ఫాసిస్టు వ్యతిరేక యుద్ధంలో దించడం సాధ్యం కాదని మేము నిరంతరం ప్రచారం చేస్తుండడం వల్ల రక్షింపబడ్డాం. ఈ రోజుల్లోనే ప్రజల సమస్యల పరిష్కార కోసం ఎన్నో ఊరేగింపులు ప్రచారం కోసం వేలాదిమందిని రంగంలోకి దించడం – ఇవన్నీ చేస్తూనే వున్నాం. అందువల్లనే మేము బ్రిటిష్ సామ్రాజ్యవాద తొత్తులమని చేసిన ప్రచారాన్ని చాలామంది అంగీకరించలేదు. ఒక ప్రక్క సమ్మెలు అసలేవద్దని, మరొకవైపు సుభాష్ చంద్రబోస్‌తో సహా బ్రిటిష్ ప్రభుత్వమును వ్యతిరేకించిన వారిని "పంచమాంగ దళము" అని మేము నిందించిన మాట వాస్తవమే. కానీ అదే సమయంలో నిర్బంధితులందరి విడుదల కోసం కూడా మేము తీవ్రంగా ప్రచారం చేశాము. మా స్వతంత్ర వేదిక నుండి మేము నడపవలసిన పోరాటాల్ని మరింత తీవ్రతరం చేసి వుండవలసింది కానీ, అలా చేయలేదు. ఇది ఒక అంశం.

ఈ యుద్ధ సమయంలో ప్రభుత్వం దిగజారుతున్న తన ఆర్థిక పరిస్థితిలో ఆ యుద్ధ భారాన్ని రైతాంగంపై వేసేందుకు తీవ్రంగా ప్రయత్నించింది. మేము కార్మిక, కర్షకులపై ఈ భారాన్ని మోపరాదని ధనవంతులైన వారిపై ఈ అదనపు భారం వేయాలని కృషి చేశాం. అలాగే ప్రజలపై తీవ్రమయిన నిర్బంధానికి వ్యతిరేకంగా మేము రంగంలో నిలబడ్డాం. అలాగే అవినీతికి, అధికారుల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ప్రజల తరపున ప్రత్యక్షంగా నిలబడ్డాం. వీటన్నిటివల్ల మా ప్రతిష్ట కూడా నిలబడింది.

ఇంకో విషయం కూడా ఇప్పుడే చెప్పాలి. యుద్ధం ముగియడంతోటే ఐ.ఎన్.ఎ.పై బ్రిటిష్ ప్రభుత్వం కేసులు మోపింది. అప్పుడు ఆ కేసులు ఉపసంహరించుకోవాలని, అలాంటి దేశభక్తులపై ఈ విధంగా కేసులు నడవడం సమంజసం కాదని బహిరంగంగా ముందుకు వచ్చాము. ఆ కేసుల ఉపసంహరణకు మద్ధతుగా సమ్మెలు, సార్వత్రిక సమ్మెను కూడా, నిర్వహించాం. అంతేకాదు, యుద్ధానంతరం రైతాంగ పోరాట వెల్లువలో నాయకత్వం వహించాం. సంపూర్ణ స్వరాజ్యం కావాలని నడుస్తున్న పోరాటాలన్నింటా మేము ముందుండి నడిచాము. అందువల్ల అంతకుముందు తీసుకున్న తప్పుడు యెత్తుగడల వల్ల కలిగిన నష్టం కొంతవరకు పూడింది.

మరీ ప్రధానమయిన విషయమేమంటే, ఆర్.ఐ.ఎన్ (నావికుల తిరుగుబాటు) తిరుగుబాటుకు మద్ధతుగా బ్రహ్మాండమైన కార్మికవర్గ ప్రదర్శనలు జరిగాయి. లక్షల సంఖ్యలో

ప్రజలు రంగం మీదకు వచ్చారు. దానిని పూర్తిగా మేమే నిర్వహించలేదు. అయినా ఆ తిరుగుబాటు వెల్లువలో ముందున్నాం. బ్రిటిష్ ప్రభుత్వం కాల్పులు జరిపింది. ఆ కాల్పుల్లో కొందరు ముఖ్యమైన పార్టీ కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులు కూడా బ్రిటిష్ సామ్రాజ్యవాదుల తూటాలకు బలి అయినారు. ఇదంతా ప్రజలు ప్రత్యక్షంగా చూశారు. అదే సమయంలో ఆర్.ఐ.ఎన్. తిరుగుబాటును కాంగ్రెస్ వ్యతిరేకించింది. ఇది కూడా మా ప్రతిష్ట నిలబడటానికి ఒక ముఖ్య కారణం.

ఏది ఏమైనా మేము తీసుకున్న లైనువల్ల చాలా పెద్ద నష్టమే జరిగింది. అంతర్జాతీయ పరిస్థితిలో జాతీయ పరిస్థితిని సమన్వయం చేయడంలో విఫలమయినామ. 1937 -40 లోనే నేషనల్ ఫ్రంట్ పత్రికలో సర్దేశాయ్ ఒక వ్యాసం రాశారు. ప్రపంచశాంతి కోసం జరిగే పోరాటానికి, మన దేశ స్వాతంత్ర్యం కోసం జరిగే పోరాటం లోబడే ఉండాలని ఆ వ్యాసం సారాంశం. అయితే దానిని అప్పుడు పార్టీ తిరస్కరించింది. అది సక్రమమైన అవగాహన. మనదేశ స్వాతంత్ర్య పోరాటాన్ని ప్రపంచ శాంతి పోరాటం పేరుతో దానికి లోబడి ఉంచడం సరికాదన్నది సక్రమంగానే అవగాహన చేసుకున్నాము. కానీ, తీరా అసలు సమస్య ముందుకు వచ్చేసరికి అన్వయించడంలో విఫలమయ్యాం.

ఈ తప్పుడు వైఖరికి కామ్రేడ్ జోషిని బాధ్యుడను చేయడం జరిగింది. అది “మన యుద్ధమని”, “ప్రజా యుద్ధమని”, “మన శత్రువైన సామ్రాజ్యవాది బంధితుడని” అనడంలో చాలా దూరమే వెళ్ళాము. అయితే ఇప్పటికీ కొందరు మనం ఆనాడు అనుసరించిన విధానం సరి అయినదేనని వాదిస్తూ సోవియట్ యూనియన్ గెలిచింది. గనుకనే మనకు స్వాతంత్ర్యం వచ్చిందని కూడా ఆ విధానాన్ని సమర్థించవచ్చు.

కేవలం ఆ విజయం వల్లనే స్వాతంత్ర్యం వచ్చిందనడం సరి అయినది కాదు. మనం పోరాడాము. మన పోరాటాలను అణచలేనంతగా సామ్రాజ్యవాదం బలహీనపడింది. ఏది ఎలా ఉన్నా పార్టీ చేసిన పెద్ద పొరపాట్లలో ఇది ఒకటి.

ప్రజల సమస్యలను తీసుకొని పనిచేయటం వల్ల కొంతవరకు రక్షింపబడ్డామని చెప్పానుగదా. ఆ సందర్భంగా ప్రధానమయిన వానిలో ఒకటి బెంగాల్ కరువు సహాయక ఉద్యమము. దేశ వ్యాపితంగా పార్టీ ఈ సమస్యను తీసుకున్నది. మన డాక్టర్లు, ఇతర సహాయక దళాలు బెంగాల్ ప్రజలను ఆదుకొనేందుకు వెళ్ళాయి. వివిధ రాష్ట్రాల నుండి సహాయక నిధిని వసూలు చేసి బెంగాల్‌కు అందించాం.

1940 నుండి 42 జూన్, జూలై వరకు మేమంతా రహస్యంగానే వున్నాము. ఆ తరువాత వివిధ ప్రాంతాలకు తిరిగి ప్రజాయుద్ధం విధానాన్ని ప్రజలకు వివరించవలసిన బాధ్యత మామీద ఉన్నది. ఈ కొత్త విధానానికి చాలా పెద్ద వ్యతిరేకత కూడా ప్రజలలో ఉన్నది. మా బహిరంగ సభలను విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నాలు జరిగేవి. మా వాలంటీర్ల



ద్వారా మేము సభలను జరుపుకోవలసి వచ్చింది. ఉదాహరణకు గుడివాడలో పదివేల మందిని సమీకరించి బహిరంగ సభ జరిపాము. కాంగ్రెస్ వారు వచ్చి ఆ సభను చెదరగొట్టచూశారు. మేము చెదిరిపోలేదు. వారు ఏవో ప్రశ్నలు వేసి గందరగోళం చెయ్యాలని చూశారు. ఈ కుంటి ప్రశ్నలన్నింటికి సమాధానం చెప్పవలసిన అవసరం లేదని అన్నాం. వేదికను చుట్టేశారు. కొట్లాట ఆరంభమయింది. నాకు గుర్తు ఉన్నంతలో దండమూడి రాజగోపాలరావు అక్కడ నిలబడి వేదికను రక్షించడానికి నిమగ్నుడై వున్నాడు.

అలాగే తెనాలి తాలూకా అమృతలూరులో ఈ విధంగానే జరిగింది. గంగాధరరావు తదితరులు నిలబడి వారిని తరిమి కొట్టారు. మా వాలంటీర్ దళాలకు అవసరమయిన శిక్షణ, డ్రిల్ నేర్పుకున్నాము. నాలుగు లైన్లలో సైనిక దళాల మాదిరి ఈ వాలంటీర్ దళాలు రక్షణ వలయంగా ఉంటూ ఉండేవి. మొదటి వలయాన్ని ఛేదించుకుని చొచ్చుకు వచ్చినా రెండవ వలయంలో వున్న మన వాలంటీర్లు త్రిప్పికొట్టేవారు. ఈ సందర్భంలో ఏలూరులో జరిగిన ఒక ఘటన కూడా నాకు బాగా గుర్తువున్నది. ప్రొవిన్షియల్ కాంగ్రెస్ మీటింగ్ ఏలూరులో జాతీయ విద్యాలయంలో జరుగుతున్నది. కాట్రగడ్డ నారాయణరావు పి.సి.సి సభ్యుడు కాకపోయినా ఒక ముఖ్యమైన కాంగ్రెస్ నాయకుడు. అయినా, ఆయన మనపట్ల సానుభూతితో ఉండేవారు. ఆయనను కాంగ్రెస్ వారు కొడతారని తెలిసింది. జాతీయ విద్యాలయం గేట్లు విరగగొట్టి లోపలికి పోయేందుకు ప్రయత్నించాము. ఈ లోపల పోలీసులు వచ్చారు. కాంగ్రెస్ నాయకుడు సంజీవరెడ్డి “అలాంటిదేమీ జరగకముందే కాట్రగడ్డ నారాయణరావును సురక్షిత ప్రాంతానికి చేర్చామని” చెప్పుకున్నాడు.

1945లో మమ్మల్నందరినీ కాంగ్రెస్ నుండి అధికారయుతంగా బహిష్కరించారు. 1945 -46లో ఎలక్షన్లు జరుగుతున్నాయి. “కేబినెట్ మిషన్” పథకం సిద్ధం చేయబడింది. “కాన్స్టిట్యుయంట్ అసెంబ్లీని పిలవవలసి వుంది. అవి అన్నీ లోపలే మమ్మల్నందరినీ జాతీయ వ్యతిరేకులని పేరు పెట్టి బహిష్కరించారు.

పి.సి. జోషి, పార్టీపై జరుగుతున్న నిందా ప్రచారాన్ని త్రిప్పికొడుతూ, మహాత్మాగాంధీగారి ప్రశ్నలకు సమాధానం చెపుతూ మూడు సంపుటాల పుస్తకాన్ని ఒకదానిని వెలువరించారు. ఇక్కడే ఇంకొక విషయం చెబితే సరిపోతుంది. మేము తీసుకున్న పొరపాటు వైఖరివల్ల మాకు గుర్తున్నంతవరకు ఏ పార్టీ సభ్యుడూ పార్టీని వదిలి వెళ్ళలేదు. ఒకటి క్రమశిక్షణ, రెండూ సోవియట్ యూనియన్ విజయం సాధించాలన్న వాంఛ, మూడు చైనాలో కమ్యూనిస్టు ఉద్యమానికి ఇక్కడ ఉన్న పెద్ద మద్దతు – ఇవి కొన్ని కారణాలు. అంతేకాకుండా సుభాష్ చంద్రబోస్ విషయంలో కూడా ఫాసిస్టులతో చేతులు కలిపి ఆయన ఏమి సాధించగలడు? అది పెనంలో నుండి పొయ్యిలోకి దూకినట్లుగాదా అన్నది ప్రతి కమ్యూనిస్టు చైతన్యంలోనూ ఉన్నది. అందుకని అప్పటికే కమ్యూనిస్టులైనవారు ఎవ్వరూ జారిపోలేదు. కానీ కొత్తగా వస్తున్న

యువతరంకు మాత్రం సుభాష్ చంద్రబోస్‌ను మేము పంచమాంగ దళంగా వర్ణించడం భరించరానిదైంది. వారి అభిప్రాయంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడుతున్న వారు మిత్రులు, ఫాసిస్టుల సహకారం తీసికొని అయినా సరే మన పోరాటాన్ని ఉధృతం చేయాలి. ప్రపంచం ఏమయిపోతేనేం? మనకు కావలసింది మనదేశ స్వాతంత్ర్యం. మన అభిప్రాయం ఇంతకుముందే చెప్పాను కదా. మనకు అతి ముఖ్యమైనది సోవియట్ యూనియన్‌ను రక్షించుకోవడము. సోవియట్ యూనియన్ కనుక ఓడిపోయినట్లయితే మన స్వాతంత్ర్య పోరాటం కూడా ఓడిపోతుంది. ఈ అవగాహనతో ఉన్నాము కదా : అంతర్జాతీయ, జాతీయ కర్తవ్యాలను సరిగ్గా సమన్వయం చేసుకొని ఉన్నట్లయితే అది వేరే పరిస్థితి.

అయితే యింతవరకు పార్టీ ఈ విషయంపై అధికారికంగా ఏమి నిర్ధారించలేదు. కార్యకర్తలను ఆ విధంగా చైతన్యవంతుల్ని చేయలేదు. ఏది ఏమయినా వాస్తవం మాత్రము ఇదే అన్నది నా నిశ్చితాభిప్రాయం. మరి ఏమిచేసి ఉండవలసి వున్నది?" అని అడిగితే "ఇలాంటి సందర్భాలు వచ్చినట్లయితే ఇకముందు జాగ్రత్తగా ఉండాలి. సమస్యలను అన్ని కోణాలనుండి అధ్యయనం చేయగలిగి వుండాలి" అని మాత్రం చెప్పగలను.

1942లో బహిరంగంగా పనిచేయు నారంభించాము. అయినా ఒకవేళ జపాన్ దాడి చేసినట్లయితే రక్షించుకునేందుకు సన్నద్ధంగా ఉండాలి అన్న ఉద్దేశంతో దేశవ్యాపితంగానే 'గెరిల్లా' దళాలను తయారుచేసి శిక్షణ యిప్పించే కార్యక్రమం తీసుకున్నాము. యుద్ధం మరో మలుపు తిరిగి జపాన్ తరిమివేయబడింది.

1943 ఆరంభంలో భారత కమ్యూనిస్టుపార్టీ ప్రథమ మహాసభ జరిగింది. అంతకుముందుగానే పార్టీ కేంద్రకార్యాలయం ఏర్పాటు చేసుకోవాలి: పత్రిక ప్రచురణ విభాగం నెలకొల్పుకోవాలి: ఈ బాధ్యతలు నాకప్పగించారు. నేను ఆ పని నిమిత్తం బొంబాయికి మకాం మార్చాను. ప్రస్తుతం బొంబాయిలో మహారాష్ట్ర సి.పి.ఐ ఆఫీసు వున్న భవనంలో, "న్యూఏజ్" ముద్రణాలయం ఏర్పాటు చేశాం.

అయితే, ఈ పనిలో వుంటూనే గెరిల్లా దళాల శిక్షణ ఏర్పాట్ల బాధ్యత కూడా తీసుకున్నాను. అందువల్ల దేశం అంతా ఆ పనిపై తిరగవలసి వచ్చేది. ఈ కాలంలోనే ఆంధ్రలో యితర కామ్రేడ్స్‌తో కలసి "ప్రజాశక్తి" వారపత్రిక ఆరంభించాము. అంతకుముందు "నవశక్తి" వుండేది. ఆ తర్వాత రహస్యకాలంలో "స్వతంత్రభారత్" ఉండేది. ఇప్పుడు కూడా రాజకీయ ప్రచారానికి పత్రిక కావాలి: అందుకని "ప్రజాశక్తి"ని శేషాచారివీధిలో నెలకొల్పుకున్నాము. పత్రిక కార్యాలయం పై దాడులు జరుగుతుండేవి. రక్షించుకునేందుకు సర్వదా సిద్ధంగా వుండేవాళ్ళం. ఒకసారి యిలాగే కాంగ్రెస్‌వారు ఊరేగింపుగా వచ్చి పత్రిక కార్యాలయంపై దాడి చేయబోయారు. తిప్పికొట్టాము. రాజేశ్వరరావు యెత్తుగా వుండేవాడు. గుర్తుపట్టడం తేలికగా వుండేది. రాజేశ్వరరావుపై కేసు కూడా వచ్చింది. బెయిలు తీసుకోవడం అదీ జరిగింది.



1938 -39లలో రాష్ట్ర పార్టీ రెండవమహాసభలో కామ్రేడ్ మాకినేని బసవపున్నయ్యను రాష్ట్ర కమిటీలోకి తీసుకున్నాము. ఆ తర్వాత అమృతసర్ కాంగ్రెస్ జరిగేవరకూ యం.బి. ఆంధ్రలో పార్టీ బాధ్యతలలో వుండేవాడు.

మద్రాసులో "న్యూఏజ్" వుండేది. బొంబాయిలో పత్రికకు "పీపుల్స్‌వార్" అని పేరు పెట్టాము. ముద్రణాలయం పేరు మాత్రం "న్యూఏజ్" అనే: ఆ తర్వాత యుద్ధకాలం అంతా అది "పీపుల్స్ వార్" పేరుతోనే ఉండేది. యుద్ధానంతరం మళ్ళీ "న్యూఏజ్" పేరుతోనే నడిచేది. అప్పుడే "పీపుల్స్ పబ్లిషింగ్ హౌస్" కూడా స్థాపించాము. నేను ఆర్థిక నిర్మాణ బాధ్యతలలో వుండేవాడిని. అధికారి కూడా ముఖ్యమైన బాధ్యతలలో వుండేవాడు. వివిధ కరపత్రాలు, పార్టీ డాక్యుమెంట్లు తీసుకువచ్చాము. మార్క్స్, ఏంగెల్స్, లెనిన్ రచనలు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి సంబంధించిన డాక్యుమెంట్లు కూడా ముద్రించాము.

ఆంధ్రలో కూడా "ప్రజాశక్తి" క్రమం తప్పకుండా వచ్చేది. ఆఫీసు అదీ సక్రమంగా నిర్వహించబడేవి. 1945 చివర్లో "ప్రజాశక్తి" వారపత్రికను "ప్రజాశక్తి" దినపత్రికగా మార్చాము. భారతదేశంలో మొదటి కమ్యూనిస్టు పార్టీ దినపత్రిక "ప్రజాశక్తి", కేరళ వారి దేశాభిమాని నాటికి వారపత్రిక, బెంగాలీ వారికి "స్వాధీనత" వుండేది. 1943 మహాసభలో రాజేశ్వరరావును ఆంధ్ర రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నాము. నాకు కేంద్ర బాధ్యతలూ అవీ వున్నాయి. అదీగాక దక్షిణాదిన మొత్తం ఉద్యమాన్ని పర్యవేక్షిస్తూ సమన్వయ బాధ్యతలో ఉన్నాను కదా: కేరళలో క్రిష్ణపిళ్ళె కార్యదర్శిగా వుండేవాడు.

# ఆంధ్రదేశంలో పార్టీ విస్తరణ

ఆంధ్ర దేశంలో పార్టీ అభివృద్ధి గూర్చి చెప్పుకుందాం. 1943లో నేనూ, రాజేశ్వరరావు కలసి చర్చించుకుని పార్టీ నిర్మాణానికి, ప్రజా సంఘాలకు రాజకీయ పాఠశాలలు గూర్చి వివిధ సర్క్యులర్లు తయారుచేసే వాళ్ళం. "పార్టీ నిర్మాణం" పై రాజేశ్వరరావు ఒక చిన్న పుస్తకం రాశాడు. నేను దాన్ని అఖిల భారత కేంద్రానికి కూడా తీసుకువెళ్ళి ఇచ్చాను. అధికారి రాసిన "కమ్యూనిస్టు ఉద్యమచరిత్ర"ను తెలుగులోకి కామ్రేడ్ చంద్రం అనువదించాడు. పార్టీ నిర్మాణం, సాహిత్య ప్రచురణ అన్నీ సజీవంగానే సాగుతుండేవి.

ఇక్కడ రాష్ట్రానికి, కేంద్రానికి సంబంధించిన ఆర్థిక సమస్య కూడా ఒకటి వుంది. పార్టీ ముఖ్య నాయకత్వం - పార్టీ పూర్తికాలం కార్యకర్తలుగా వున్నవారు తమ ఆస్తులను అమ్మేసి వీలైనంత ఎక్కువ మొత్తం పార్టీ నిధికి దానం చెయ్యాలని ఆంధ్రలో పిలుపునిచ్చాము. కామ్రేడ్ బసవపున్నయ్య, రాజేశ్వరరావు, మానికొండ సుబ్బారావు, సూర్యావతీ తమ తల్లిదండ్రులకు అవసరమైనదేదో వుంచుకుని మిగతాది పార్టీకి యిచ్చేశారు.

కేంద్రానికి, ఆర్థిక అవసరాల నిమిత్తం మేము మా రాష్ట్రం తరపున రు. 50,000 కోటా తీసుకున్నాము. నేను కేంద్ర కమిటీ సమావేశంలో ఆ కోటా కాక ఇంకో రు. 50,000 కూడా ఇస్తామని చెప్పాను.

'కామ్రేడ్స్ ఆస్తులు అమ్మి ఇవ్వవలసిందిగా చెప్తున్నాను. ఆ తర్వాత వాళ్ళెలా బతకాలి?' అని కేంద్ర కామ్రేడ్స్ నన్నడిగారు. "ఏముంది పార్టీకోసం ప్రజల వద్ద వసూలు చేస్తాం లేదా మళ్ళీ ఇంకోసారి తమ ఆస్తులు అమ్మి పార్టీ నిధికి ఇచ్చేయండని పిలుపునిస్తాము. ఇప్పటికే ఇచ్చేసిన వారు కాకుండా, ఎప్పటికప్పుడు కొత్తవారు పార్టీలోకి వస్తుంటారు కదా: వాళ్ళు తమ ఆస్తులు అమ్మి పార్టీకి ఇస్తుంటారు. వాళ్ళ అవసరాలు తీరాలి: పార్టీ అవి చూస్తుంది. వారికే వేరే ఆస్తిదేనికి?" అని చెప్పాను.

అప్పుట్లోనే పార్టీ బలం కార్యకర్తలకు ముగ్గురుకున్నా ఎక్కువ మంది సంతానం వుండరాదని ఒక సర్క్యులర్ కూడా పంపాము.



అయితే కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య కొన్ని విషయాల్లో విభేదాలు వచ్చేవి. ఉదాహరణకు కౌలు ఎంత వుండాలి అన్న సమస్యే వుంది.

"కౌలుదారు భూకామందుకు 1/5 వంతు లేదా 1/6 వంతు ఫలసాయం ఇవ్వాలని" కేంద్ర పార్టీ వాదన, మా రాష్ట్రంలో పరిస్థితి అలాలేదు. ఇప్పుడు 3/4 వంతు ఫలసాయాన్ని కౌలుదారు భూకామందుకు ఇస్తున్నాడు. అదీగాక ఇక్కడ కౌలుదారు స్వచ్ఛందంగా కౌలుదారు. కనుక దాన్ని 1/2 వంతుకు చేయగలిగినా గొప్ప పనే: మనం కనుక 1/5 లేదా 1/6 అంటే ఇక్కడ అంగీకారం కాదు అని రాష్ట్రం తరపున రాజేశ్వరరావు వాదన.

"ఆంధ్ర కమిటీ ధనిక రైతాంగం పక్షాన నిలబడుతున్నదనీ, కౌలుదార్ల హక్కులకై పోరాడే బదులు భూకామందుల పక్షాన వుంటున్నదనీ కేంద్రం విమర్శించింది. మనం రూపొందించే నినాదాలు గాలిలో వుండకూడదు. భౌతిక పరిస్థితులకు అనుగుణంగా వుండాలి. ఆ దృష్ట్యా చూస్తే ఆంధ్రకమిటీ ఆ సమస్యపై తీసుకున్న వైఖరే సరైనది. ఈ నినాదం ఆచరణ యోగ్యమాకాదా అన్నది చూసుకోవాలి : ప్రచార నినాదాల విషయం కాదు. నేను చెప్తున్నది అసలు ఆ నినాదం వినడంతోనే ఇది సాధ్యం కాదన్న భావనవస్తే పోరాటానికి ప్రజలు నిలబడరు. ఆయా రాష్ట్రాలలో వున్న నిర్దిష్ట పరిస్థితులకు ఆ నినాదం తగినదా లేదా, దానిపై ప్రజానీకం రంగంలోకి దిగుతారా లేదా అన్నది చూసుకోకుండా పోరాటంలో దిగలేము.

పోరాట నినాదం, ఆందోళనా నినాదం, ఆచరణ నినాదం ఈ మూడూ భిన్నమైనవి. కానీ ఈ మూడింటిని కలగాపులగం చేసి గందరగోళ పడరాదు.

ఈ కాలంలో మేము ఎన్నో రైతు మహాసభలు వివిధ ప్రాంతాలలో జరిపాం. జిల్లా మహాసభలకు అలా ఉంచినా అతి పెద్ద మహాసభ 1944లో విజయవాడలో జరిగిన అఖిల భారత కిసాన్ మహాసభ. నా అంచనా ప్రకారం సుమారు లక్ష మంది ప్రజలు హాజరైనారు. అయితే అప్పట్లో కిసాన్ మహాసభలో మాతోపాటు స్వామి సహజానంద, ఎన్.జి. రంగా, కార్యానందశర్మ లాంటివారు కూడా వున్నారు. అంతకుముందు 1943లో అమృతసర్‌లో 30 మైళ్ళ దూరంలో ఉన్న భాన్నోలో అఖిల భారత కిసాన్ సభ జరిగింది. ఆ మహాసభలో కామ్రేడ్ పరులేకర్ భవానీసేన్, కామ్రేడ్ రసూల్ - ఇలాంటి వారందరూ పాల్గొన్నారు.

విజయవాడ మహాసభ నిర్వహించిన తీరు అందరి ప్రశంసలు పొందింది. దూర ప్రాంతాల నుండి వచ్చిన వారందరికీ భోజన సదుపాయం కల్పించాం. సరే భోజనానికి డబ్బులు తీసుకున్నాం. ఆ విధంగా 50వేల మంది భోజనం చేశారు. ఇప్పుడు విజయవాడలో స్టేడియం గ్రౌండ్స్ ఉన్నచోట అప్పుడు మహాసభ జరిగింది. ఎక్కడ భోంచేయాలి? ఎక్కడ ఆకులు పారెయ్యాలి? చేతులు కాళ్ళు కడుక్కునేది ఎక్కడ. ఇవన్నీ చాలా పద్ధతి ప్రకారం సాగాయి. ఆ స్టేడియం ప్రక్కనే మామిడి తోటలు ఉండేవి. ఆ తోటలో నీళ్ళ టాంకు ఉంచాము.

గతంలో చిన్న చిన్న మహాసభలు జరిపి వున్న అనుభవం, ముందుగానే ప్రతి చిన్న విషయాన్ని కూడా చర్చించి తయారు చేసుకున్న పథకం, ఆ పథకాన్ని అమలు చేసేందుకు ఉన్న యంత్రాంగము - వీటన్నిటి వల్ల మహాసభ దిగ్విజయంగా జరిగింది. రాజేశ్వరరావు కూడా ఇలా పథకం ప్రకారం నిర్వహించడంలో సిద్ధహస్తుడు.

అందరు కలిసి కూర్చుని చర్చించిన తర్వాత వాలంటీర్లు ఎంతమంది కావాలి. వారికి ఎలాంటి శిక్షణ ఇవ్వాలి. నిధిని ఎలా పోగు చెయ్యాలి. వంట వ్యవహారం ఎవరు చూడాలి – ఇవన్నీ పని విభజనలో తేలిపోతాయి. ఎంతమంది జనం రావచ్చు. ప్రతినిధులు ఎంతమంది వస్తారు. వారికి ఎక్కడ వసతి కల్పించాలి? వారు బళ్ళ మీద వస్తే ఆ బళ్ళను ఎక్కడ వుంచాలి – ఇలాంటి చిన్న చిన్న వివరాలు కూడా సంపూర్తిగా చర్చించాము. అలాగే పారిశుధ్యం విషయంలో మాకు గాంధీగారి అవగాహన కొంత ఉండేది. తదనుగుణంగా ఏర్పాట్లు చేశాము. ఇప్పుడు భారత ప్రభుత్వానికి సలహాదారుగా ఉన్న జి. పార్థసారథి అప్పుడు "హిందూ" పత్రికా విలేకరిగా వుండేవాడు. మాకు సన్నిహితంగా కూడా ఉండేవాడు. ఈ మహాసభ గూర్చి రాసేందుకు ఆయన కూడా వచ్చాడు. ఇదంతా చూసి "నేను చాలా మహాసభలు చూశాను గాని అంతా ఒక పద్ధతి ప్రకారం ఇన్ని వేల మందికి ఏర్పాట్లు జరగటం ఇంతకుముందు చూడలేదు" అని అన్నాడు.

కొన్ని వేల మందికి వంట వండటం అన్నది అంత తేలికైన విషయం కాదు. అయితే సమస్య ఎక్కడ వచ్చిందంటే ఎవరు తిన్న ఆకుల్ని వాళ్ళే తీసుకు వెళ్ళి దూరంగా పడవేయమని చెప్పాం. దాంతో కొంచెం గందరగోళం అయింది. ఆ అనుభవంతో మరునాటి నుండి ఆకులు తీసి శుభ్రం చేయడం వలంటీర్లే చేశారు. ఆ తర్వాత రైతు మహాసభ 1945లో నేత్రకోనలో జరిగింది. ఈ నేత్రకోన ప్రస్తుతం బంగ్లాదేశ్‌లోని మైమెన్‌సింగ్ జిల్లాలో వుంది.

ఈ రోజుల్లోనే మరొక చెప్పుకోదగ్గ కార్యక్రమం చేపట్టాము. యుద్ధానికి సహకరించాలన్నది కదా మా వైఖరి. అందుకని బందరు కాలువ పూడిక తీసేందుకు పూనుకున్నాం. కాలువ పూడుకుపోయి లోతు తగ్గిపోయింది. అదంతా తీసివేసి లోతు చేస్తే తప్ప నీరు సరిగా పారదు. యుద్ధం కోసం మరింత ఉత్పత్తి చేయాలి. ఇంజనీర్లకు తగినంతమంది కూలీలు దొరక్క ఆ కాలువ విషయంలో ఏం చేయలేకపోయారు. మామూలు కూలి తీసుకుంటూ ఆ కాలువ బాగు చేద్దామని నిర్ణయించుకున్నాం. ఆ బాధ్యత తీసుకుని పార్టీ సభ్యులందరినీ వాలంటీర్లుగా వచ్చి పని చేయాలని పిలుపునిచ్చాం. రాష్ట్ర వ్యాపితంగా చాలా ఎక్కువ సంఖ్యలో వాలంటీర్లు వచ్చారు. వాలంటీర్లకు భోజన వసతి సౌకర్యాలు మాత్రమే ఏర్పాటు చేశాం. ఒక నెలరోజుల లోపల అనుకున్న పని పూర్తయింది. మా వాలంటీర్ల కృషి అందరి ప్రశంసలు అందుకుంది. రైతాంగంపై ఈ కార్యక్రమం చాలా మంచి ప్రభావాన్ని కలుగజేసింది.

అయితే ఆ తర్వాత ఇలాంటివన్నీ సంస్కరణవాద కార్యక్రమాలని, ఈ పని ప్రభుత్వం నిర్వహించవలసి వున్నదని విమర్శ వచ్చింది.

అయితే చాలా ఎక్కువ మంది మాత్రం ఈ కార్యక్రమం మంచిదని నాలాగే భావించారు. మా కేంద్ర కమిటీ కూడా ఆమోదించింది. నిజానికి ఆ తరువాత జరిగిన నేత్రకోన మహాసభలో రైతాంగ కోర్కెలకై పోరాడుతూనే మా అనుభవాన్ని ఉదహరించి ఆ విధంగా రైతాంగానికి చేతనైన విధంగా సహాయపడాలని కూడా సూచించారు.



ఇలాంటి పనులన్నింటి వల్ల రాజకీయంగా పొరపాటు వైఖరి తీసుకున్నా ప్రజానీకాన్ని అంటిపెట్టుకుని ఉండేందుకు వీలైంది.

ఈ సందర్భంగానే 1943 ఆరంభంలో వెంట్రప్రగడ దగ్గర పాములపాడు గ్రామంలో కృష్ణాజిల్లా రైతు మహాసభ నిర్వహించాము. ఆ సందర్భంగా పెద్ద ఊరేగింపు తీశాము. ఆ ఊరేగింపు ప్రక్కనే ఉన్న దోసపాడు గ్రామంలోకి వెళుతున్నది. ఆ వూరు కాంగ్రెస్‌కు బలమైంది. ఉన్నట్టుండి వాళ్ళు ఒకసారి ఊరేగింపుపై విరుచుకుపడ్డారు.

సహజంగానే మనం తిప్పికొట్టాము. ఆ కాంగ్రెస్ వాళ్ళ ఇళ్ళలోకి కూడా జొరబడి లోపల వున్న వాళ్ళందర్నీ కొట్టాలని మా దళాలు ఉరుకుతుంటే వాళ్ళనాపటం నాకూ, రాజేశ్వరరావుకు చాలా కష్టమైంది. నిజానికి అలా ఆపటం చిన్న వాదులాటకు కూడా దారి తీసింది.

ఇంతేకాదు కాంగ్రెస్ వాళ్ళు వ్యక్తిగతంగా మామీద నీచప్రచారం కూడా చేసేవారు. ఉదాహరణకు "ములుకోల" అని ఒక పత్రిక ఉండేది. అన్నీ చెత్త విషయాలు రాస్తూ ఉండేది. వ్యక్తిగతంగా నా మీద రాస్తూ నేనొక వ్యభిచారినని నిందించింది. ఇలా చాలా అసహ్యామైన దుష్ప్రచారం సాగింది. మద్దుకూరి చంద్రం ఆ ప్రచారం చూసి చాలా ఆగ్రహపడ్డాడు. "నేను పోయి ఆ రాసిన వాళ్ళను చంపేసి వస్తాను. అంతగా అయితే వ్యక్తిగత హింసకు పాల్పడినందుకు పార్టీ నుండి తీసేసినా సరే" అని బయల్దేరాడు.

సరే ఇదంతా ఏదో కావాలని చేస్తున్న దుష్ప్రచారమేలే అని వాదించాము. ఆ తర్వాత చంద్రం "రొచ్చుగుంట" అని వ్యాసం రాశాడు. వారి దుష్ప్రచారానికి తగిన సమాధానం ఈ వ్యాసం.

ఇదే సమయంలో 1942 – 43లో సాంస్కృతిక రంగంలో కూడా చాలా చురుకుగా ఉండేవాళ్ళం. ఈ విషయంలో కామ్రేడ్ మాకినేని బసవపున్నయ్య ప్రధాన పాత్రే నిర్వహించేవాడు. మామూలుగా ఆటలాడించడమే కాకుండా శిక్షణా తరగతులు కూడా నిర్వహించేవాళ్ళు. సాహిత్యంతో ఎం.బి.కి మంచి పరిచయం ఉండేది. మంచి ఉపన్యాసకుడు. ఆ చెప్పే అంశం ఆకర్షణీయంగా, శక్తివంతంగా చెప్పేవాడు.

ఈ కాలంలోనే ఒకవేళ బాంబులు పడి ఇల్లు తగలబడుతుంటే ఏ రకంగా రక్షించుకోవాలి మొదలైన విషయాల్లో యువతీ యువకులందరికీ శిక్షణ ఇచ్చాము. యువతీ యువకులందరూ పార్టీవారు కాకపోయినా మమ్మల్ని అభినందించేవారు. కాకుంటే మీరు కూడా కాంగ్రెస్‌లో చేరి స్వాతంత్ర్యోద్యమాన్ని తీవ్రతరం చేసినట్లయితే ఉద్యమం మరింత తీవ్రమయ్యేదని, ప్రభుత్వం స్థంభించిపోయేదని అనేవారు. అసలు మీరైతే మరింత ధైర్య సాహసాలతో తెగించి పోరాడి ఉండేవారు అనేవారు. అంటూనే పార్టీ తీసుకున్న రాజకీయ విధానం పట్ల ఆగ్రహావేశాలు వెలిబుచ్చేవారు.

ఇక మేము నడిపిన మిగతా కార్యక్రమాలు చెప్పబోయేముందు తెలంగాణాలో మేము చేసిన కృషి కూడా ఇప్పుడే చెప్పటం అవసరమని భావిస్తున్నాము. 1940–42 రహస్య కాలంలో అంతకుముందే తెలంగాణాలో మాకున్న కొన్ని సంబంధాలలా ఉండగా కామ్రేడ్ రాజేశ్వరరావు కృష్ణాజిల్లా బాధ్యత వహిస్తూ తెలంగాణాలోని ఆంధ్ర మహాసభ కామ్రేడ్స్‌తో సంబంధాలు పెట్టుకున్నారు.

వారు కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలోకి వచ్చారు. 1940కి ముందు 1935–36లోనే కాంగ్రెస్ అసోసియేషన్ అన్నదొకటి ఏర్పడింది. కానీ అదేమీ ప్రత్యేకంగా అధ్యయనం తదితర కార్యక్రమాలు నిర్వహించలేదు. ఇంకొంచెం ముందుకుపోతే 1928 ఆ ప్రాంతాలలో కమ్యూనిస్టు పార్టీ లేదుగాని ఆంధ్ర జనసంఘం అని గ్రంథాలయ ఉద్యమం అని నడుస్తూ వుండేవి. 1938లో రాష్ట్ర కాంగ్రెస్ నిర్వహించిన సత్యాగ్రహం, వందేమాతర ఉద్యమం ఈ ప్రభావం తెలంగాణాలో వున్నది.

కామ్రేడ్ మగ్దుమ్‌లాంటి వాళ్ళతో సంబంధాలున్నాయి. 1940లో ఆంధ్ర మహాసభ నుండి అక్కడి పెద్ద భూస్వాముల పిల్లలు మన సంబంధాలలోకి వచ్చారు. రావి నారాయణరెడ్డి, ఎల్లారెడ్డి, చిర్రావూరి లక్ష్మీనర్సయ్య, సర్వదేవభట్ల రామనాథం, ఆరుట్ల లక్ష్మీనర్సింహారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు యిలాంటివారు. ఆంధ్ర మహాసభలో వున్నవారితో వివిధ ప్రాంతాలలో పరిచయాలేర్పడినాయి. వీరు యువకులు. వామపక్ష భావాలు గలవారు. వీరంతా ఆంధ్ర మహాసభలో మితవాద నాయకత్వంగా వున్న బూర్గుల రామకృష్ణారావు, ముందుముల రామచంద్రరావు, మాడపాటి హనుమంతరావు, నరసింహారావు, కొండా వెంకట రంగారెడ్డి వీరికి వ్యతిరేకంగా నిలబడేవారు.

ఈ యువకులు క్రమేపీ కమ్యూనిస్టు పార్టీ వైపుకు వచ్చారు. అందుకు ఒక ప్రధాన కారణం కమ్యూనిస్టు పార్టీ ఆంధ్రా కమిటీ, ఆంధ్ర మహాసభలోని ఈ విభాగాన్ని తనతో పాటు తీసుకువెళ్తూ – సరైన రాజకీయ మార్గదర్శకత్వం యిచ్చింది.

కమ్యూనిస్టు పార్టీగా నైజాం సంస్థానంలో 'ప్రాతినిధ్య ప్రభుత్వం – తాత్కాలికంగా' కావాలన్న నినాదం యిచ్చాము. అలాగే దేశ్‌ముఖ్‌లకు, పెద్ద భూస్వాములకు వ్యతిరేకంగా సమరశీల ఉద్యమాలు నిర్వహించాలనేవారము. ఇవి ఆంధ్రమహాసభలోని మితవాద నాయకత్వానికి వచ్చేవి కావు. వాళ్ళకు కొన్ని చిన్న చిన్న సంస్కరణలు సరిపోయేవి. అందువల్ల ఆంధ్రమహాసభలో చీలిక అనివార్యం అయింది.

11వ ఆంధ్ర మహాసభ కాన్ఫరెన్స్ భువనగిరిలో జరిగింది. ఆ సభలో రావి నారాయణరెడ్డి ఆంధ్ర మహాసభకు అధ్యక్షుడైనాడు. మితవాదులు మానుకోటలో వేరే మహాసభ జరుపుకున్నారు. ఏమైనా మా సమీకరణ శక్తి చాలా ఎక్కువగా వుండేది. నిజానికి ప్రజలు చాలా ఎక్కువమంది మాతోనే వుండేవారు.

ఆ తర్వాత ఖమ్మంలో ఆంధ్ర మహాసభ కాన్ఫరెన్స్ జరిగింది. నేను కూడా హాజరైనాను. చాలా పెద్ద బహిరంగసభ జరిగింది. నన్ను కూడా ప్రసంగించమన్నారు. 'ముందు మీరు మాట్లాడండి నా వంతు వస్తుంది కదా' అని వూరుకున్నాను. నేను అక్కడ వున్నాననీ వారికి



సలహాలూ అవీ యిస్తూ నడుపుతున్నాననీ అందరికి తెలుసు. అయినా బాహాటంగా ఆంధ్రా కమ్యూనిస్టు కమిటీగా సంబంధం వున్నట్లు బయటపడదలచుకోలేదు.

కనుక 1945 నాటికే నల్గొండ, వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాలలోనూ, హైదరాబాద్ పట్టణంలోనూ మెదక్ కూడా కొంతవరకూ వున్న నిజాం సంస్థాన వ్యాపిత ఉద్యమం మా అధీనంలోకి వచ్చింది. ఆంధ్ర మహాసభలోని వామపక్షీయులు కమ్యూనిస్టులైనారు. ఆ రోజున వారినే గనుక మేము మా వైపుకు తీసుకురాలేక పోయినట్లయితే, ఆ తర్వాత ఉద్యమ స్వరూప స్వభావాలు వేరుగా వుండేవి. కమ్యూనిస్టు పార్టీ అనుసరించిన సరైన రాజకీయ వైఖరికి ఇదొక ఉదాహరణ.

సరే, బాధ్యతాయుత ప్రాతినిధ్య ప్రభుత్వం కావాలన్న నినాదం యిచ్చామని చెప్పాను కదా! అందులో 50% ముస్లింలకు, 50% హిందువులకు ప్రాతినిధ్యం వుండాలని సూచించాము. ఈ యుద్ధకాలం అంతా యీ తాత్కాలిక ప్రభుత్వ అధీనంలో యుద్ధ ప్రయత్నాలకు అనుగుణంగా ప్రజలను సమీకరించాలి. అయితే ప్రజలపై నిర్బంధంగా ఏదీ రుద్దరాదు. అధిక శక్తులు, బలవంతంగా భూముల నుండి వెళ్ళగొట్టడం, లెవీ ధాన్యం వసూలు చేయడం వంటివి జరగరాదు.

ఆ తర్వాత మా చర్చలలో ఆ విధంగా హిందువులకు, ముస్లింలకు చెరిసగం ప్రాతినిధ్యం అన్న నినాదం సంస్కరణవాద దృక్పథంతో వచ్చిందని విమర్శ వచ్చింది. జోషి మేమిచ్చిన నినాదంతో ఏకీభవించాడు. అసలిప్పటి పరిస్థితిలో, ఆ చెరిసగం ప్రాతినిధ్యం వున్న బాధ్యతాయుత ప్రభుత్వం సాధించుకోవడమే పెద్ద గొప్ప. ముస్లింలను కూడా పోరాటంలోకి దించగలగాలన్నది మా ఉద్దేశం.

ఏదిఏమైనా తర్వాత కాలంలో ఆ వివాదం వదులుకున్నాము. ఈ లోపల నైజాం తీవ్ర నిర్బంధానికి పాల్పడ్డాడు. దేశ్‌ముఖ్‌లు తమ గూండాలతో బీభత్సాన్ని సృష్టిస్తున్నారు. ఉదాహరణకు చెప్పాలంటే ప్రస్తుత పార్లమెంట్ సభ్యుడు కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డిని చావచితగ్గొట్టి నోట్లో మూత్రం పోశారు. స్థానిక నాయకులను హత్య చేస్తున్నారు.

ఇంతలో యుద్ధం ముగిసింది. యుద్ధానంతర వెల్లువలో భాగంగా అప్పటికే ఉద్యమం సాగుతున్న తెలంగాణాలో బ్రహ్మాండమైన రైతాంగ ఉద్యమం వచ్చింది. 'దున్నేవానికి భూమి', 'వెట్టి చాకిరి రద్దు కావాలి' అనే నినాదాలను ముందుకు తెచ్చాము. 'హైదరాబాద్ సంస్థానాన్ని భాషా ప్రాతిపదికపై విభజించాలి' అన్నది కూడా మేమిచ్చిన నినాదమే.

1945 వరకూ కామ్రేడ్ రాజేశ్వరరావు ఆంధ్ర కమిటీ తరఫున తెలంగాణా ప్రాంతాన్ని కూడా చూస్తున్నారు. 1943లోనే ఆంధ్ర కమిటీలోకి తెలంగాణాలోని ముఖ్య కామ్రేడ్స్‌ను తీసుకున్నాము. అలా వున్న నాకు నారాయణరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, ఎల్లారెడ్డి, చిర్రావూరి లక్ష్మీనరసయ్య, సర్వదేవభట్ల రామనాథం 1942–45లో తెలంగాణాలో కమ్యూనిస్టు ఉద్యమం గూర్చి ప్రత్యేకించి పార్టీ చరిత్ర రాసేటప్పుడు రాయాలి. తెలంగాణా పోరాటంలో నా పాత్ర, 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' అన్న పుస్తకం యివన్నీ తర్వాత వివరంగా చెప్తాను.

# లైలాతో వివాహం

ఇక నా వ్యక్తిగత విషయాలు, మా కుటుంబానికి సంబంధించినవి, కొన్ని ముఖ్యం అనుకున్నవి ఇక్కడ ప్రస్తావిస్తాను.

'ప్రజాయుద్ధం' స్వభావాన్ని చర్చించే సందర్భంలో నేను కేంద్రంలో వుండేవాడిని. ఎ.ఎస్.ఆర్. చారి అప్పటికే నిర్బంధంలో వున్నాడు. దిల్షాద్ చారి ఆయన భార్య వుండేవారు. వారి గృహం రహస్య స్థావరాల సంబంధాలకు నిలయంగా వుండేది. వారింట్లో 'లైలా' వుండేది. అప్పటికి ఆమె డిగ్రీ పూర్తి చేసి సెంట్రల్ బ్యాంకులో క్యాషియర్‌గానో, అకౌంటెంట్‌గానో వుండేది.

ఆ తర్వాత పార్టీ బహిరంగంగా వచ్చినప్పుడు పార్టీ కేంద్రం నిర్వహణలోనూ, పత్రిక నిర్వహణలోనూ వారి కుటుంబం బాగా తోడ్పడుతుండేది. ఎ.ఎస్.ఆర్. చారి విడుదలైనారు. ఆయన అప్పుడే పైకి వస్తున్న లాయరు. మంచి ధైర్యశాలి. ఆయన స్వీయచరిత్ర కూడా అదే విషయాన్ని తెలియజేస్తుంది. ఆయన కాంగ్రెస్‌వారి చేతుల్లో దెబ్బలు తినడం, ఆ కేసును ఆయన తర్వాత కోర్టులో తానే వాదించుకోవడం – మొత్తం మీద సాహసవంతుడు. పార్టీ కేంద్రానికి సహాయపడుతూ, పార్టీ పత్రికకు కరస్పాండెంట్‌గా వుండేవాడు. అప్పుడప్పుడు వ్యాసాలు కూడా రాసేవాడు.

మొత్తం ఈ నిర్మాణాన్నంతా చేపట్టాము గనుక, అక్కడే సామూహిక భోజనశాల (కమ్యూన్) ఏర్పాటు చేశారు. ఈ కమ్యూన్‌లో 'మాయ్' అన్న ఆమె వంటశాల ఇన్‌ఛార్జిగా వుండేది. అందరం 'మాయ్' అని పిలిచేవాళ్ళం. అక్కడే ఒక గదిలో చారి తన భార్యతో వుండేవాడు. ఇంకో గదిలో లైలా – తన తల్లితో వుండేది.

లైలా తన బ్యాంకు పనికి వెళ్ళబోయేముందు, బ్యాంకు నుండి వచ్చిన తర్వాత శని, ఆదివారాల్లో, తీరిక సమయాల్లో పార్టీ కేంద్ర ఆఫీసులో వివిధ రకాల పనులు చేస్తుండేది. అదీగాక ఆ రోజుల్లో ఒక గోడ పత్రిక నడిపేవాళ్ళం. పార్టీ కమ్యూన్ ఉన్న ప్రతిచోట ఈ గోడ పత్రిక ఒకటుండేది. వివిధ అంతర్జాతీయ, జాతీయ సమస్యలపైన, పార్టీ ఆంతరంగిక వ్యవహారాలపైన ఈ గోడ పత్రికలో కామ్రేడ్స్ రాస్తూ వుండేవారు.



లైలా ఆఫీసులో ప్రధానంగా లెక్కలు అవీ చూడటంతో పాటు ఈ గోడ పత్రిక కూడా నిర్వహిస్తుండేది. ఆమెను వివాహం చేసుకుందామనుకున్నాను. ఆ విషయమే ఆమెతో చెప్పాను. ఆమె అంగీకరించింది. 1943 ఫిబ్రవరి 27న మా వివాహం జరిగింది. ఆమె చాలా కష్టపడి పనిచేసే స్వభావం కలది. ప్రధానంగా ఆ గుణమే నన్నెక్కువగా ఆకర్షించింది. ఆ తర్వాత నేనొకసారి ఆమెనడిగాను 'నాలో ఏం చూసి ఆకర్షింపబడి నీవు నన్ను చేసుకునేందుకు ఇష్టపడ్డావు' అని. 'ఏముంది మీ ఆరోగ్యం, కార్యక్రమాల పట్ల దీక్ష – వీటితో ఆకర్షింపబడ్డానని' నాతో చెప్పింది. నిజానికి అప్పటికి నాకు 30 సంవత్సరాలు. ఆమెకి 30 సంవత్సరాలు. ఇద్దరం పెళ్ళికోసం ఆదుర్దాగానే వున్నాము. మా పెళ్ళి చాలా సాధారణంగా జరిగిపోయింది. పి.సి. జోషి వద్దకు వెళ్ళి మేమిద్దరం భార్యాభర్తలుగా వుండదలుచుకున్నామని చెప్పాము. కమ్యూన్‌లో మిగతా వాళ్ళందరికీ అదే విషయం ప్రకటించాము. అందరినీ పిలిచి చిన్న టీ పార్టీ ఇచ్చాము. అంతే. అప్పటి నుండి ఇప్పటికి సుమారు 40 సంవత్సరాలకు పైగా గడిచింది. మేమిద్దరం అన్యోన్యంగా వుంటూనే వున్నాం. తీవ్రమైన తగాదాలు పడ్డ సందర్భాలేమీ లేవు.

మీ వివాహం అట్లా జరిగినా, నా అభిప్రాయంలో ప్రతి వివాహం ఖచ్చితంగా రిజిష్టరు చేయబడాలి.

లైలా తల్లి భర్త చనిపోయిన తర్వాత మళ్ళీ వివాహం చేసుకుంది. ఆమె కర్ణాటకలోని ఒక బ్రాహ్మణ కుటుంబానికి చెందినది. నర్సుగా పని చేస్తుండేది. ఆ తర్వాత ముస్లిం యువకుణ్ణి వివాహం చేసుకున్నది. మొదటి భర్త వల్ల ఆమెకు ఇద్దరు మొగపిల్లలనుకుంటాను. తరువాత ఆమెకు ఇద్దరు కుమార్తెలు. ఆమె తండ్రి బ్రహ్మ సమాజానికి చెందినవాడు గనుక ఈ పునర్వివాహానికి అభ్యంతరం చెప్పలేదు.

బొంబాయిలో వుంటున్నప్పుడు లైలా అన్నలు కూడా వచ్చిపోతుండేవారు. అంతా కలిసే వుండేవాళ్ళు. లైలా తల్లే వాళ్ళను కూడా చదివించింది. మొత్తం మీద లైలా కుటుంబం సాంఘికంగా పురోగామి కుటుంబమనే చెప్పాలి. ఇక లైలా విషయానికొస్తే తన మాతృభాష మరాఠీ, గుజరాతీ కూడా వచ్చు. హిందీ బాగా అర్థం చేసుకుంటుంది. రాస్తుంది. ఏ భాషనైనా సరే త్వరగా వంట పట్టించుకోగలదు. వివాహం అయిన కొద్ది కాలానికే తెలుగు బాగా నేర్చుకున్నది. బెంగాలీలో చదువనూ, రాయనూ గలదు.

మా పెళ్ళికి ముందు మా పరిచయం విషయం కొంత చెప్తాను. నేను మిద్దె మీద ఆరుబయట పడుకొనేవాణ్ణి. రాత్రి పదో పదకొండో – నా పని పూర్తయిన తర్వాత వెళ్ళి అక్కడే ఒక చాప వేసుకొని పడుకొనే అలవాటు. ఆ ప్రాంతమంతా ఎవరో ఊడ్చి శుభ్రం చేస్తున్నట్లుగా కొంతకాలంగా గమనిస్తున్నాను. ఎవరా? అని కొంచెం పరిశోధించేసరికి లైలా ఆ పని చేస్తున్నది. "ఎందుకు ఇదంతా శుభ్రం చేస్తున్నావు, అవసరం లేదే – అని అడిగాను'. 'మీరిక్కడే గదా పడుకొనేది. పైగా ఉదయమే లేచి వ్యాయామం, యోగాసనాలు వేస్తారు గదా' అని అన్నది. ఈమెకు నేనంటే ఇష్టమల్లే వుంది అని అర్థం చేసుకున్నాను. అంతకుముందే

ఆమె పట్ల నేను ఆకర్షితుణ్ణయి వున్నానని చెప్పాను కదా! అందుకని 'నిన్ను పెళ్ళి చేసుకోవడం నాకిష్టం... నన్ను పెళ్ళి చేసుకోవడం నీకిష్టమేనా' అని అడిగాను. ఒక ఐదు రోజులు వ్యవధి తీసుకొని ఇష్టమేనని చెప్పింది.

మా వివాహం అవడంతోటే ఆమెను పార్టీలో పూర్తికాలం కార్యకర్తగా పనిచేయమని కోరాను. అప్పటికింకా రెండేళ్ళు ఆగినట్లయితే ఆమెకు మరింత పెన్షన్, ప్రావిడెంట్ ఫండ్ వగైరా వచ్చి వుండేవి. "ఇప్పుడు వాటన్నింటిని గురించి ఆలోచించడం దేనికి. ఇద్దరం పార్టీలో పనిచేస్తుంటాం కదా" అని చెప్పాను. నా సలహా విని ఆమె ఉద్యోగం మానేసి పార్టీ పూర్తికాలం కార్యకర్తగా వచ్చేసింది. నా వివాహం అవడంతోటే మా అమ్మకు ఉత్తరం రాశాను. ఇట్లా పెళ్ళి చేసుకున్నానని, త్వరలోనే వచ్చి నా భార్యను చూపిస్తానని.

నా ఉత్తరం చదివి మా అమ్మ అమ్మాయి ఎర్రగా వుంటుందా, అందంగా వుంటుందా అని ఆత్రుతపడిపోయింది. ఆ తర్వాత నేను లైలాను తీసుకొని మా వూరు పోయినపుడు మా అమ్మ మమ్మల్నెంతో సాదరంగా ఆహ్వానించింది. తర్వాత నన్ను పక్కకు పిలిచి "పిల్ల నల్లగా వుంటుందని, ఏదేదో రాశావు గదా! చక్కగా వుంది. నమ్రతగా వుంది. లక్ష్మీదేవిలా వుంది అంటూ "అబద్ధాలు ఎప్పటి నుంచి నేర్చుకున్నావు" అని నవ్వుతూ మందలించింది. ఏమైతేనేం మా అమ్మ ఇష్టపడటం కూడా మంచిదే కదా!

అప్పటి లైలానే ఇప్పుడు 'లీల' అని పిలుస్తున్నాము. మేమిద్దరం దంపతులమైనందులకు ఈ 42 ఏళ్ళ తర్వాత వెనక్కి తిరిగి చూసుకుంటే సంతోషించవలసిందే వున్నది. ఒకరికొకరం సాధ్యమైనంత వరకు మా కార్యక్రమాలలో సహకరించుకుంటూనే వున్నాం. ఆమె అప్పుడప్పుడూ అంటూ వుండేది. "నన్ను కూడా మీతోపాటు వుండే కామ్రేడ్‌గా అభివృద్ధి చేయకపోతే మీకు తగిన జీవిత భాగస్వామిని కాలేను" అని. "నీకు సాహిత్యమన్నా, సంగీతమన్నా, నృత్యమన్నా చాలా ఇష్టం. వాటిల్లో నీకు నేను చేయగల్గిన సహకారం పెద్దగా ఏమీ లేదు. నీవు గనుక నా పర్సనల్ సెక్రటరీలాగా వుండేటట్లయితే కొంతవరకు నీకు నేను సహకరించగలను" అని చెప్పేవాడిని.

ఆ తర్వాత ఆంధ్ర దేశానికి మేమిద్దరం వచ్చిన సందర్భంలో ఇక్కడ ప్రజలతో కలిసిపోయేందుకు, పరిస్థితుల్ని అవగాహన చేసుకునేందుకు, వారితో సంభాషణ నెరిపేందుకు తదితర అంశాల్లో ఆమెను నేను తోడ్పడ్డాను.

ఏదిఏమైనా నాకున్న పని ఒత్తిడిలో ఆమె కోరుకున్నంతగా గాని లేక నేను చేయగల్గినంతగా గాని ఆమెకు సహకరించలేకపోయాను. సరే ఇప్పటికి చాలాకాలం గడిచిపోయింది. అలాంటి పొరపాటు ఏదన్నా వుంటే సరిదిద్దుకోవడం ఇక సాధ్యం కాదు. ఆమె, ఏ మేరకు అభివృద్ధి అయినా ప్రధానంగా అది ఆమె స్వయంకృషే అని చెప్పాలి.

నేను 1945లో అంటే పెళ్ళయిన 2 సంవత్సరాలకు సంతానం కలగకుండా 'వేసెక్టమీ' ఆపరేషన్ చేయించుకున్నాను. కొంతమంది పెళ్ళి కాకముందే నేను ఆపరేషన్ చేయించుకున్నానని



చెప్పుకుంటుంటారు. కాని అది ఎప్పుడు అన్నది ప్రధానమైన ప్రశ్న కాదు. ఉభయులం కలిసి చర్చించుకుని, ఇక సంతానం వద్దని నిర్ణయించుకున్న తర్వాతనే నాకు ఆపరేషన్ జరిగింది. పిల్లలున్న తర్వాత వారిని సరిగ్గా పెంచడం తదితర బాధ్యతలు వుంటాయి. అవి నిర్వర్తించగల సమయం, అవకాశం మాకు ఉండటం సాధ్యం కాదని మేము భావించాము. దీనికితోడు అనువంశికంగా కూడా మా కుటుంబంలో మానసిక వ్యాధి వున్నది. పిల్లలు వద్దనుకోవడానికి అది చిన్న కారణమే అయినా, అది కూడా నా మనస్సులో పనిచేసింది. ఏదిఏమైనా, వీలున్నంత తక్కువ సంసార బాధ్యతలు వుండాలని నేను సూచించడం, ఆమె అంగీకరించడంతో మేమా నిర్ణయానికి వచ్చాము.

ఇక్కడొక విషయం చెప్పాలి. పిల్లలు వుండాలా? అక్కరలేదా? అన్న తుది నిర్ణయం తీసుకోవలసింది పురుషుడికన్నా స్త్రీయే. ఎందుకంటే ఫలితం స్త్రీ మీదే ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. పైగా పురుషుడి కన్నా, ఒక విధమైన సహజమైన సంతృప్తి, అంతకుమించిన ఆప్యాయత సంబంధం బిడ్డలతో వుండేది తల్లికే. ఎవరన్నా మేము కూడా సుందరయ్యలాగే చేస్తాము అనుకుంటే వారికొకటి చెప్పదలచుకున్నాను. ముందు భార్య ఏమనుకుంటున్నదీ, ఆమెకు బిడ్డలు కావాలి అనుకుంటే ఖచ్చితంగా అందుకు అంగీకరించాలి. ఒక విధంగా తల్లి అవడం అనేది స్త్రీకి శారీరక, మానసిక సహజమైన హక్కు అని మనం గుర్తించాలి. ఆమె గనుక బిడ్డలు వద్దనుకున్నా, ఈ బిడ్డలు లేకపోవడం వలన ఇతర సమస్యలేమీ రావని నిర్ధారించుకున్నా, ఒకటికి రెండుసార్లు చర్చించి తదనుగుణంగా నిర్ణయం తీసుకోవచ్చు. మా విషయానికొస్తే, లీల తాను సంతానవతిని కావాలి అనే ఒక సహజమైన వాంఛ నుండి బయటపడగలిగింది. అందరి విషయమూ అట్లా వుంటుందని భావించలేము.

ఇక్కడే ఒక చిన్న విషయం చెప్తాను. నేను పెళ్ళి చేసుకోవద్దని తోటి కార్యకర్తలకు చెప్పేవాడినని, పిల్లల్ని కనవద్దని సలహా ఇచ్చేవాడినని నా గురించి చాలా అరుదుగానైనా అనుకుంటున్న వాళ్ళున్నారు. నేనెప్పుడూ, ఎవరికి అలాంటి సలహా ఇవ్వలేదు. తద్భిన్నంగా వివాహం చేసుకుని, పరిమితంగా బిడ్డల్ని కనమని ప్రోత్సహిస్తుండేవాడిని.

మా తమ్ముడు 'రామ్' 1940లో మెడికల్ కాలేజీలో తన సహాధ్యాయినినే పెళ్ళి చేసుకున్నాడు. అమ్మాయివాళ్ళు బ్రాహ్మణులు. మొదట్లో వారి తల్లిదండ్రులు ఈ వివాహానికి అంగీకరించలేదు. అయితే, ఘాటే "ఈ వివాహాన్ని మీరెందుకు వ్యతిరేకిస్తున్నారో నాకర్థం కావడం లేదు. తక్కువ కులం వాళ్ళని ఏమీ ఆలోచించనక్కరలేదు. 'రామ్' వాళ్ళు మంచి సంస్కారవంతులు, ధనవంతులు. 'రామ్' మంచి తెలివిగలవాడు కూడా. కనుక మీరడ్డం రావద్దు" అని నచ్చచెప్పాడు. ఏమైతేనేం వారి పెళ్ళి జరిగింది.

అయితే, 'రామ్' ఎప్పుడూ ఒక పద్ధతి ప్రకారం పనిచేసేవాడు కాదు. ఒక్కొక్కప్పుడు చాలా ఎక్కువగా పనిచేసేవాడు. మెడికల్ కాలేజీలో చదివేటప్పుడు కూడా క్లాసులకు మాత్రం విధిగా హాజరయ్యేవాడు. శ్రద్ధగా వినేవాడు. ఇక ఆ తర్వాత తన విద్యార్థి ఉద్యమం, చర్చలు

వీటితో సరిపోయేది. కానీ, చాలా తెలివిగలవాడు. అందువల్ల అదే సరిపోయేది. 'రామ్'కి మెడికల్ కాలేజీలోను, ఇంజనీరింగ్‌లోను రెంటిలోను సీటు వచ్చింది. మా బావగారు ఇంజనీరు చదవమన్నారు. అయితే 'రామ్' మాత్రం సుందరయ్య చెప్పినట్లు చేస్తానన్నాడు. ఇంజనీరింగ్ వృత్తి కూడా తక్కువైనదేమీ కాదు గాని, వైద్యవృత్తిలో వున్నంత ప్రత్యక్షమైన ప్రజాసేవకు అవకాశం ఇంజనీరింగ్ వృత్తిలో లేదు. నిజానికి నేను ఈ విధంగా అవకపోయివున్నట్లయితే వైద్యుణ్ణి అయివుండేవాణ్ణి. అందుకని రామ్‌ని వైద్యమే చదవమన్నాను. డబ్బు ఎక్కడైనా వుండి సంపాదించవచ్చు. కాని, అత్యంత ఉత్తమమైన వృత్తుల్లో వైద్యవృత్తి ఒకటి.

సుగుణ, రామ్ ఇద్దరూ నెల్లూరులో ప్రాక్టీస్ ఆరంభించారు. ప్రాక్టీస్ బాగుంది. ఈ లోపల సుగుణ గర్భవతి అయి రామ్‌కు తెలియకుండానే గర్భం లేకుండా చేసుకుంది. రామ్‌కు చాలా కోపం వచ్చింది. 'రామ్' అప్పుడప్పుడు పిచ్చిగా ప్రవర్తించేవాడు. అనువంశికంగా కూడా ఇది వుందని చెప్పాను కదా! అందుకనే తనకు ఎప్పుడైనా అలా వస్తే ఆసుపత్రిలో చేరి వైద్యం చేయించమని కూడా రామ్ సుగుణతో చెప్పాడు.

రామ్‌కు పిల్లలు కావాలని వుండేది. సుగుణకు మాత్రం ఈ మానసిక వ్యాధి, అప్పుడప్పుడు రామ్ ప్రవర్తన చూసి పిల్లలు వద్దనిపించేది. అదీగాక కోపంలో రామ్ సుగుణపై దురుసుగా ప్రవర్తించేవాడు. ఇద్దరి మధ్య సయోధ్య పోయింది.

రామ్ ఆ వ్యాధి సందర్భంలో ఎలా ప్రవర్తించినా విడిగా చాలా దయార్ద్ర హృదయంతో వుండేవాడు. కొన్నాళ్ళ పాటు ఆసుపత్రి వదిలి, దేశాలు పట్టుకు తిరిగేవాడు. కాని మళ్ళీ వచ్చిన తర్వాత చాలా సేవాభావంతో ప్రవర్తించేవాడు. తన వ్యాధి వల్ల ఎప్పుడూ రోగులకు ఏ ఇబ్బందీ కలిగించేవాడు కాదు. మంచి వైద్యుడు. మంచి సర్జన్. అంతేగాక సంఘసేవా కార్యకలాపాల్లోనూ, రాజకీయాల్లోనూ ఎంతో శ్రద్ధ చూపేవాడు.

ఒకసారి నెల్లూరులో హిందూ – ముస్లిం కొట్లాటలు జరిగాయి. అప్పుడు నేను రహస్య జీవితంలో వున్నాను. నెల్లూరు వచ్చి రామ్‌తో మాట్లాడి కొన్ని సలహాలు యివ్వాల్సి వుంది. కొంత పైకము అవసరమైంది. అనుకున్న నిర్ణీత ప్రదేశంలో కలుసుకున్నాం. రామ్ ఏదో మాట్లాడుతున్నాడు. సందర్భ శుద్ధి లేదు. "ఏమిటలా మాట్లాడుతున్నావ్? బాగున్నట్లు లేదు నిద్రపో" అని చెప్పాను.

సుగుణ వెంటనే ఆసుపత్రిలో జేర్పించలేదు. చూద్దాం అని వేచి వుంది. కాని మద్రాసులో హాస్పిటల్‌లో చేర్పించక తప్పలేదు. హాస్పిటల్‌లో ఎందుకు చేర్పించావని సుగుణతో రామ్ తగాదా వేసుకున్నాడు. ఇక సుగుణ రామ్‌తో కలిసి వుండటం కష్టసాధ్యం అని భావించింది. మిలటరీ ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకుంది.

నాతో మాత్రం అన్నీ చెప్పేది. నేను స్త్రీల కోసం పోరాడేవాణ్ణి అని ఆమె కూడా గుర్తించినట్లుంది. నేను ఆ విధంగా దూరంగా వుండటం యిరువురికీ మంచిది కాదని చెప్పి



ఆమెలో గనుక ఓపిక నశించిపోయినట్లయితే తన యిష్టం వచ్చినట్లు చేయమన్నాను. ఆమె మిలటరీలో చేరింది. ఆ తర్వాత రామ్‌ను విడాకులు అడిగింది.

దాంతో రామ్ పరిస్థితి మళ్ళీ క్షీణించింది. ఆ వ్యాధి మళ్ళీ మొదలైంది. ఎట్టి పరిస్థితిలోనూ విడాకులు యివ్వనని పట్టుపట్టాడు. నేను కొంచెం సముదాయించి చెప్పబోయాను. ఆ రోజుల్లో ఒకసారి నేనూ, మా అమ్మ కారులో వెళ్తున్నాం. రామ్ కారు నడుపుతున్నాడు. నేను తనతో పూర్తిగా ఏకీభవించడం లేదని వున్నట్లుండి గుర్తు వచ్చినట్లుంది. కారు ఆపి నన్ను దిగి వెళ్ళిపొమ్మన్నాడు. తాను కారు నడపలేనని చెప్పాడు. ఆ తర్వాత క్రమేపీ కోలుకుని తన పొరపాటు గ్రహించి సుగుణకు విడాకులు ఇచ్చేందుకు అంగీకరించాడు.

నెల్లూరులో హిందూ – ముస్లిం కొట్లాటల సందర్భంగా రామ్ చాలా ధైర్యంగా ఆ కొట్లాటలు నివారించే సందర్భంలో ముందుండి కృషి చేశాడు. ముస్లిం నివాస ప్రాంతాలకు వెళ్ళి వాళ్ళకు ధైర్యం చెప్పి వోదార్చేవాడు. అందుకే ముస్లిం ప్రజలు రామ్ అంటే ఎంతో అభిమానంతో వుండేవాడు.

రామ్ ఆ తర్వాత రాజ్యలక్ష్మిని వివాహం చేసుకున్నాడు. రాజ్యలక్ష్మి సుగుణ మిత్రురాలు. సుగుణ విషయం ఆమె, రామ్ మాట్లాడుకునే సందర్భాలలో దగ్గరయినట్లున్నారు. సుగుణ ఆ తర్వాత వేరే యింకొకర్ని వివాహం చేసుకుంది.

నేను తెలంగాణా పోరాటంలో సంపూర్తిగా నిమగ్నమై వుండగా 1949లో మా పెద్ద అన్న చనిపోయాడు. 1949 – 50 సంవత్సరాలలో ప్రభుత్వ దమనకాండ తీవ్రంగా వుంది. పట్టుకున్న వాళ్ళను పట్టుకున్నట్లుగా కాల్చివేస్తున్నారు. నన్ను ఏ విధంగానైనా పట్టుకోవాలని 1947 నుండి ప్రభుత్వం తీవ్రంగా గాలిస్తున్నది. ఆ సందర్భంగా ఎలాంటి అవకాశం ప్రభుత్వానికి ఇవ్వడం సాధ్యం కాదు. మా అమ్మ కూడా ఆ మధ్యనే చనిపోయింది.

ఈ యిరువురి మరణాల విషయం కూడా నేను 1951 తర్వాత బయటకు వచ్చినప్పుడు తెలిసింది.

'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' పుస్తకాన్ని గూర్చి కూడా ఒక మాట చెప్తాను. చాలామంది ఆ పుస్తకం బాగుందని ప్రశంసించారు. నేను రాజ్యసభలో వుండగా డాక్టర్ రాధాకృష్ణన్ ఆ పుస్తకం చాలా బాగుందనీ, విశాలాంధ్ర ఎలా స్వర్ణయుగంలా అభివృద్ధి చేయవచ్చునో మంచి స్వప్నాన్ని మన ముందుంచుతుందనీ అన్నారు. అలాగే మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జిగా పనిచేసే రిటైరైన రాఘవరావు కూడా ప్రతి రాష్ట్రం కూడా 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' లాంటి ఒక పథకాన్ని సిద్ధం చేసుకోవాలనేంత ఆదర్శప్రాయంగా వుందని అన్నారు.

# తెలంగాణా పోరాట ప్రారంభం

యుద్ధానంతర పోరాట వెల్లువలో భాగంగా ఆంధ్రప్రదేశ్ అంతటా రైతాంగ పోరాటాలు చెలరేగాయి. కృష్ణాజిల్లాలో చల్లపల్లి జమిందారు వ్యతిరేక పోరాటంలాంటి వాటిని వుదాహరణగా చెప్పుకోవచ్చు.

ఇక తెలంగాణాకు వస్తే అంతకుముందు 'బాధ్యతాయుత ప్రాతినిధ్య ప్రభుత్వం కావాలని' నినాదమిచ్చాము కదా! దాని బదులు వెట్టి రద్దు కావాలనీ, 'దున్నేవానికే భూమి కావాలనీ', 'బలవంతంగా బేదఖళ్ళు చెయ్యరాదనే' నినాదాలతో పాటు 'నిజాం రాజరికం రద్దు కావాలి' అన్నది కూడా జోడించాము.

1946లో తెలంగాణాలో ఎన్నికలకు ముందు ఆంధ్ర మహాసభ సభ్యత్వం ఒక లక్ష దాటింది. అప్పుడు వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో భాగాలను కూడా కలుపుకుని నల్గొండ జిల్లా వుండేది. అది మనకు చాలా బలమైన కేంద్రం. అప్పటికే దుర్మార్గులైన దేశ్‌ముఖ్‌లకు, వారి గూండాలకు వ్యతిరేకంగా వెట్టి తదితర ప్రజా పీడనలకు వ్యతిరేకంగా తెలంగాణాలో వివిధ ప్రాంతాలలో ప్రతిఘటనలు జరుగుతున్నాయి. అవన్నీ ఆంధ్ర మహాసభ నాయకత్వాన్నే! దానిపై నిర్బంధం కూడా తీవ్రంగా వుంది. ఉదాహరణకు కామ్రేడ్ భీంరెడ్డి నరసింహారెడ్డిని, ఆరుట్ల రామచంద్రారెడ్డిని అరెస్టు చేసి తప్పుడు కేసు బనాయించారు. అంతేకాదు వారు కోర్టుకు వెళుతుండగా దారిలో అడ్డగించి దాడి చేసి, చిత్రహింసలు పెట్టి, చివరకు బలవంతంగా నోళ్ళు తెరిపించి మూత్రం పోశారు.

విసుమారు రామచంద్రారెడ్డి, దేశ్‌ముఖ్ గూండాలు ప్రజలపై దాడి చేశారు. కాల్పులు జరిపారు. అది 1946 జూలై 4. ఆ రోజున దొడ్డి కొమరయ్య ఆ కాల్పులలో అసువులు బాశారు. అది తెలంగాణా పోరాటానికి ఆరంభ దినంగా భావిస్తున్నాము. అంతకుముందు ఆ పరిస్థితిలోనే మనల్ని మనం ఎలా రక్షించుకోవాలి? అన్న ప్రశ్న వచ్చింది. కర్రలు, వడిశలు వంటి వాటితో ఆత్మరక్షణకు సిద్ధపడాలి అనుకున్నాం.



గూండాల కాల్పులతో దొడ్డి కొమరయ్య మరణానికి నిరసనగా, చుట్టుపక్కల గ్రామాల నుండి వేల సంఖ్యలో ప్రజలు బయటకు వచ్చారు. దేశ్‌ముఖ్ గూండాలను తరిమేశారు. విసునూరి దేశ్‌ముఖ్ భవనాన్ని గడీ అంటారు. దాన్ని పూర్తిగా ఆక్రమించుకున్నారు.

1946లోనే దేశంలో అధికార బదలాయింపుకై చర్చలు జరుగుతున్నాయి. రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలో వున్నాయి. ఇంకా స్వాతంత్ర్యం రాలేదు. ప్రకాశం ప్రభుత్వం రాష్ట్రంలో వుంది. యుద్ధం ముగిసిన నాటి మేము అందరం బహిరంగంగానే వుంటున్నాము. యుద్ధకాలంలో కాంగ్రెస్ నాయకులను విడుదల చేయమని డిమాండు చేస్తున్న సందర్భంలో బ్రిటిష్ ప్రభుత్వం నిర్బంధించిన వాళ్ళు కొందరు ఇంకా జైళ్ళలోనే వుంటున్నారు. తమాషా ఏమంటే, ఆ కాంగ్రెస్ వారందరూ విడుదలైనారు.వారిని విడుదల చేయమని కోరినవారు జైళ్ళలో వున్నారు!

1947 జనవరిలో ప్రకాశం ప్రభుత్వం ఒక ఆర్డినెన్సు విడుదల చేసింది. ఆంధ్ర, కేరళ, తమిళనాడు - ఇక్కడంతా రైతాంగ పోరాటాలు జరుగుతున్నాయి కదా? ఆ పోరాటాలకు నాయకులను, కమ్యూనిస్టులను ఆ ఆర్డినెన్స్ ద్వారా అరెస్టు చేయడం ప్రారంభించారు. అందుకని మళ్ళీ కొద్దికాలం రహస్య జీవితం గడిపాను.

ఆ సమయంలోనే పార్టీ కేంద్రకమిటీ జరిగింది. అప్పట్లో పార్టీలో ఒక చర్చ వుంది. ఈ ఆర్డినెన్స్ ప్రకాశం పంతులుగారు జారీ చేశాడా, లేక అంతకుముందు నుండి వున్న ప్రభుత్వ అధికార యంత్రాంగం జారీచేస్తే దాన్ని ప్రకాశం సమర్థిస్తున్నాడా అని, ప్రకాశం గారికి తెలియకుండా అధికారులు ఈ ఆర్డినెన్స్ జారీ చేశారు గనక ప్రకాశం గారు దీన్ని ఉపసంహరించుకుని, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలి అన్న డిమాండ్ మేము తీసుకున్నాము. ఏమైనా ఆర్డినెన్స్ ఉపసంహరింపబడలేదు.

ఈ సందర్భంలోనే పార్టీలో అభిప్రాయ భేదాలొచ్చాయి. ఒక వాదనకు కామ్రేడ్ జోషి నాయకుడు. నేను కూడా ఈ వాదనలోనే వున్నాను. కాంగ్రెస్‌లోని అభివృద్ధికాముక శక్తులను కలుపుకొని కాంగ్రెస్‌లోకి వచ్చిన మితవాద శక్తులను వంటరి చేస్తూ - గతంలోని ఫాసిస్టు వ్యతిరేక సంఘటనను కొనసాగిస్తూ పోరాడాలి అన్నది మా వాదన. నిజానికి కాంగ్రెసు అప్పటికే ఫాసిస్టు వ్యతిరేక కూటమిని వదిలేసింది. రెండో వాదనకు కామ్రేడ్ బి.టి.ఆర్, అధికార నాయకులు. పోరాటం ఆగదనీ, కేంద్రాన్ని స్వాధీనం చేసుకునేవరకూ సాగుతుందనీ, యుద్ధానంతరం వెల్లువలో పోరాటాన్ని తీవ్రతరం చేసి సార్వత్రిక సమ్మె సాయుధ తిరుగుబాటు ద్వారా అధికారాన్ని చేజిక్కించుకోవాలనీ వారి వాదన.

ఈ రెండు వాదనలూ కూడా వాస్తవానికి పొరబాటే! సాధారణ సమ్మె, సాయుధ తిరుగుబాటు - వీటికి అసలు పరిస్థితి పరిపక్వంగా లేదు. అలాగే కాంగ్రెస్‌లోని అభివృద్ధి కాముకులు అనుకుంటున్న వాళ్ళే అభివృద్ధి నిరోధకులతో పోరాటానికి సిద్ధంగా లేరు. కనుక, రెండు అభిప్రాయాలూ సరైనవి కావు. కానీ 1946లో కేంద్రకమిటీ పి.సి.జోషి విధానాన్ని మెజారిటీగా బలపరిచింది. ఈ విధానం స్వాతంత్ర్యం వచ్చేదాకా కొనసాగింది.

ప్రకాశం ఆర్డినెన్స్ వుంది. అయినా మా అంచనా ఏమిటి "పాత బ్రిటిష్ ప్రభుత్వం పోయింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వారందరికీ పండుగ సమయంగా వున్నప్పుడు నిర్బంధం కొనసాగకపోవచ్చు. అందుకని రహస్యంగా వెళ్ళనవసరం లేదు" అని! స్వాతంత్ర్య సముపార్జన సందర్భంలో మేము కూడా జాతీయ జెండా ఆవిష్కరణ ఉత్సావాల్లో పాల్గొనాలనీ, మనం కూడా జాతీయ జెండాలు ఎగురవెయ్యాలన్నదీ పార్టీ విధానం. దీనిపై కూడా విభేదాలు వున్నా మెజారిటీ కేంద్రకమిటీ ఈ విధానాన్ని ఆమోదించింది.

తెలంగాణాలో పోరాటం ఆరంభమైంది. భారతదేశంలో కలవమని నిజాంపై వత్తిడి వస్తున్నది. స్థానిక కాంగ్రెస్ కూడా ఆ వత్తిడి తెస్తున్నది. అయితే నిజాం భారతదేశంలో కలిసేందుకు సుముఖంగా లేదు. స్వతంత్రదేశంగా వుండిపోవాలని కలలు కంటున్నాడు. కనుక పోరాటం కొనసాగుతూనే వుంది.

ఇక ఆ దశలో తెలంగాణాలో దేశముఖ్‌లకు, జాగీర్దార్లకు మాత్రమే కాకుండా నిజాంకు వ్యతిరేకంగా కూడా ఆ పోరాటం జరగాల్సి వుంది. కనుక దేశ్‌ముఖ్‌ల గూండాలేగాక, నిజాం సైన్యం కూడా ప్రత్యక్షంగా రంగంలో దిగింది. అలాంటప్పుడు, మనం జనసమీకరణ మీదే ఆధారపడలేము. శత్రువు తుపాకులు వాడుతున్నాడు. ప్రజలు కర్రలు వడిశలు తీసుకుని పోగైనా, తుపాకుల ముందు బెదిరిపోతున్నారు గనుక మనం కూడా ఆయుధాలు, బర్మార్ లాంటివి అయినా తీసుకోకపోతే వుద్యమం ముందుకుపోదు. ఆత్మరక్షణ సాధ్యం కాదు అన్న నిర్ణయానికి వచ్చాము.

ఇందుకై కేంద్రకమిటీ అనుమతి అవసరం. ఆత్మరక్షణకే అయినా, ఆయుధాలు తీసుకోవడం ఆరంభిస్తే దాని పరిణామాలు వివిధ రకాలుగా దేశ వ్యాపితంగా వుంటాయి. ఆయుధాలు తీసుకోవడం ఆరంభమయితే, నిజాం పోలీసులను కూడా స్తంభింపజేసి వారివద్ద ఆయుధాలు కూడా తీసుకోవడం అవసరం అవుతుంది. దేశముఖ్‌ల, జాగీర్దార్ల, గుండాల వద్దనున్న ఆయుధాలు కూడా లాక్కోవాలి. పార్టీ కేంద్రకమిటీ ఐక్యంగానే మా ప్రతిపాదనను అంగీకరించింది.

అలాగే భూమిని స్వాధీనం చేసుకునే విషయంలో కూడా కేంద్రకమిటీ అనుమతి కావాలి! గతంలో ఇలాగే జమీందార్ల భూమిని స్వాధీనం చేసుకున్నాము. అయితే, కాంగ్రెస్ జమిందారీకి వ్యతిరేకంగా ఆ రకంగా రంగంలోకి వచ్చేందుకు సిద్ధపడలేదు. ఫలితంగా, జాతీయోద్యమానికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్‌కూ, మాకు మధ్య వైరుధ్యం వచ్చింది. అందుకని మానేశాము. దానిమీద అప్పట్లో కొన్ని విభేదాలు వున్నా చివరకు అలా స్వాధీనం చేసుకోవద్దనుకున్నాము. పైగా అక్కడక్కడ కొన్ని ప్రదేశాలలో అలా భూమిని స్వాధీనం చేసుకున్నా నిలుపుకోవడం అంత తేలికైన విషయం కాదు. ఈ విషయంలో కాంగ్రెస్‌పై వత్తిడి తెచ్చి యేదో చర్య తీసుకునేట్లు చూడగలంగానీ, మనంతట మనమే అంతపని చెయ్యలేము అన్నది అవగాహన.



కాని యిప్పుడు తెలంగాణాలో భూమి స్వాధీనాన్ని కొనసాగించాలనుకున్నాము. కనుక అనుమతి అవసరమైంది. అనుమతి లభించింది.

ఈ కర్తవ్యాలు నిర్వహించేందుకు దళాలను ఏర్పాటు చేసుకున్నాం. అయితే ఈ దళ సభ్యులలో చాలామందికి యేమీ తెలియదు. సాయుధ పద్ధతులలో అనుసరించవలసిన కనీస, ప్రాథమిక పద్ధతులు కూడా తెలియవు. కనుక "శిక్షణ" యేర్పాటు చేశాము. నైజాం ప్రాంతాల్లో ఆ శిక్షణకు అప్పుడు అవకాశం లేదు గనుక కొండపల్లి కొండల్లో శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పాము.

మావద్ద చాలా తక్కువే అయినా కొన్ని తుపాకులున్నాయి. తుపాకిని సరిగా గురిపెట్టడం, కాల్చడం, డైనమైట్లు వాడడం, తుపాకి మందుతో మొరటు బాంబులను తయారుచేయడం, దాడిచేసి పారిపోవడం, రక్షణ తీసుకోవడం – వంటివి నేర్పాము.

1942 –43 సమయంలో నేను కూడా అలా శిక్షణ పొందానని తెల్పాను కదా! అయితే అంత నిష్ణాతుణ్ని కాదు. శిక్షణ యిచ్చేవారు వేరే వుండేవారు. నేను పర్యవేక్షణ చేసేవాణ్ని. అయితే అలా శిక్షణ పొందినవారు పోరాటంలో పాల్గొంటూ, ఆ తర్వాత తమ యెత్తుగడలను యెంతగానో అభివృద్ధి చేసుకున్నారు. ఒక్కటి మాత్రం నిజం. ఆయుధాలు వాడడంలో, సాయుధ ఘర్షణలో అవసరమైన కనీస ప్రాథమిక జ్ఞానం కూడా లేకపోతే ధైర్యసాహసాలు ఎంతగావున్నా ప్రయోజనం శూన్యం. మిలటరీలో జేరి తిరిగివచ్చిన సిపాయిలు గ్రామాల్లో వుండేవారు. వారిలో కొందరు మనతో వచ్చారు. అందరికన్నా బాగా గురి చూసి కొట్టటంలో వారిదే అగ్రస్థానంగా వుండేది. కానీ వారికి రాజకీయ శిక్షణ దాదాపు లేదు. కనుక వారిని అదుపులో వుంచడం కష్టతరమయ్యేది. మేమిచ్చిన ఈ శిక్షణ ఎంత ప్రాథమికమైనదయినప్పటికీ ఎంతో ఉపయోగించింది. ఉద్యమం ముందుకు వెళ్ళేందుకు దోహదపడింది.

నేను "తెలంగాణా" పుస్తకంలో వివరంగా రాశాను. కాంగ్రెస్ సత్యాగ్రహం సాగిస్తూ జెండా ఎగురవేసేది. మొదట్లో మేమూ వారితో కలిశాము. ఆ తర్వాత ఆ జెండాతోపాటు ఎర్రజెండా కూడా ఎగురవేద్దామని నిశ్చయించుకున్నాము. ఆ సందర్భంలో పెద్ద సమీకరణజేసేవాళ్ళం. కాంగ్రెసు కూడా కాదనే స్థితిలో లేదు.

మనం గనుక పెద్ద శక్తిగా తయారైతే మొత్తం ఉద్యమానికి మనమే నాయకత్వం వహించగలం. కాంగ్రెసు పెద్ద శక్తియై మనం మరీ తక్కువగా వుంటే మనకు నాయకత్వ స్థానం రాదు. కనుక కాంగ్రెసువాళ్ళు ఎక్కడా లేరా అన్నంత పెద్ద జనసమీకరణ చేసేవాళ్ళం.

కాంగ్రెసు ఏదో చిన్న చిన్న పోరాట రూపాలకు సంసిద్ధమయ్యేది. ఉదాహరణకు కల్లు ఇచ్చే తాటి, ఈతచెట్లను నరకడం, కల్లు దుకాణాలవద్ద పికెటింగ్‌లను చేయడం లాంటివి. అదీ ఏదో చేశామంటే చేశామన్నట్లు చాలా తక్కువస్థాయిలో నిర్వహించేవాళ్ళు. ఆ కార్యక్రమాన్నే మేమందుకొని చాలా హెచ్చు స్థాయిలో నిర్వహించేవాళ్ళం. ఇలాంటి కార్యక్రమంలో మాకొచ్చిన అనుభవాలన్నీ దృష్టిలో వుంచుకొని ఆ తర్వాత ఆ కార్యక్రమానికి కొన్ని మార్పులు

చేశామనుకోండి. నిజాం సైన్యం పెద్ద సంఖ్యలోనే రంగంలోకి దిగేది. ఇక గ్రామాల్లో వుండటం సాధ్యమయేదికాదు. కాంగ్రెసువారు, నిజాం సరిహద్దులను దాటివచ్చి ఆంధ్రప్రాంతంలో రక్షణ తీసుకుంటూ, ఏవో చిన్న చిన్న కార్యక్రమాలు చేసేవారు. మేము మాత్రం సరిహద్దు ప్రాంతాల్ని అవసరమైతే వెనక్కి తగ్గేందుకు రక్షణ స్థావరాలుగా మాత్రమే వుంచుకొనేవాళ్ళం. కానీ, మా దళాల్లో ఎక్కువ భాగానికి "మిమ్మల్ని మీరు అక్కడే వుండి రక్షించుకోవాలని, దాడులు ఆరంభమైతే మీరే ఎదురుదాడికి సిద్ధపడాలని" చెప్పాము. నిజమైన గెరిల్లా పోరాటాన్ని ఆరంభించేందుకు శతృపోలీసులను పొంచి అటకాయించి, బెదిరించి వారివద్ద ఆయుధాలు గుంజుకోమని చెప్పి అందుకు సన్నద్ధం చేసేవాళ్ళం.

నిజామ్ ఆంధ్రలో భాగం కాదు గనుక సరిహద్దులవద్ద "కస్టమ్స్" వారు వుండేవాళ్ళు. ఈ కస్టమ్‌వారు ఉండే చోట్ల చెదురు మదురుగా అక్కడక్కడా వుండేవి. వారివద్ద కూడా అడపాదడపా ఆయుధాలు వుండేవి. అందుకని దారికాచి వారిని నిలవరించి ఆయుధాలు గుంజుకోవడం తేలికయ్యేది.

గ్రామాలలో గ్రామదళాలు వుండేవి. శతృవు రాకపోకలను పసికట్టడం, అవసరాన్ని బట్టి తాత్కాలికంగా ఆత్మరక్షణ చేసుకోవడం, గ్రామాన్ని రక్షించడం వాటిపని, ఇవిగాక మరింత శిక్షణాయుతమైన కొంచెం మంచి ఆయుధాలు కలిగిన రెగ్యులర్ గెరిల్లా దళాలు వుండేవి – ఇదీ స్థూలంగా నిర్మాణ స్వరూపం.

తెలంగాణా పోరాటం, ప్రజలపాత్ర, అలాగే వివిధ నాయకుల పాత్ర అలాగే ఆ పోరాట సమయంలో నా పాత్ర గురించి వివరంగా తర్వాత చెప్తాను. ఇక్కడ ప్రస్తుతం పైపైన ఆ పోరాటానికి సంబంధించిన కొన్ని విషయాలు స్థూలంగా తడుముతున్నాను.

1948 సెప్టెంబర్ 13న భారత సైన్యాలు నైజాంలో ప్రవేశించాయి. అప్పటికి దాదాపు 3వేల గ్రామాలకు తెలంగాణా పోరాటం విస్తరించింది. ఆ గ్రామాల్లో భూస్వాముల్ని తరిమెయ్యడం, నిజాం పోలీసుల్ని, పట్వారీలను కూడా తరిమేసి పాలనా యంత్రాంగాన్ని స్తంభింపజేయడం జరిగింది. గ్రామ కమిటీలే పాలనా వ్యవహారాలు నిర్వహించేవి. అయితే నిజాం ప్రభుత్వానికి కూడా పట్టణాలు, పెద్ద గ్రామాలు బలమైన స్థావరాలుగానే వుండేవి.

ఇక్కడ ముఖ్యమైన విషయమేమిటంటే 1947 ఆగష్టు నుండి ఒక నాలుగు నెలలపాటు మాకు బహిరంగంగా పనిచేసే అవకాశం వచ్చింది కదా! తెలంగాణా కామ్రేడ్స్‌కు మటుకు అలాంటి అవకాశం లేదనుకోండి. అందుకని వివిధ ప్రాంతాలనుండి తెలంగాణా దళాలు విజయవాడ ప్రజాశక్తి నగర్‌కి చేరేవి. నిజాం వ్యతిరేక పోరాటం సాగుతున్నంతవరకు కాంగ్రెస్‌వాళ్ళు కూడా మాకు మద్దతునిచ్చేవాళ్ళు. ఉదాహరణకు ఆయుధాలు కొనేందుకు డబ్బు అవసరమైనపుడు మాతోపాటు కాట్రగడ్డ మధుసూదనరావు కూడా చందాలు పోగుచేస్తూ



తిరిగారు. ప్రజల్లో మంచి ఆదరణ లభించింది. ఆ రోజుల్లో రెండు మూడు రోజుల్లోనే 30–40 వేల రూపాయలు చందాలు పోగుచెయ్యగలిగాము. దానర్థం నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా మేము పోరాడుతున్నామన్న సానుభూతి ప్రజానీకంలోను, కాంగ్రెస్‌వారిలోను కూడా వుంది. ఆనాడు భారత ప్రభుత్వం నైజాంలో జోక్యం చేసుకోవాలి అన్నది మా డిమాండ్.

మేము సాయుధులమై నిజాం సైన్యానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామని చెప్పడం ఒక ఎత్తు. నిజంగానే పోరాటంలో ఆ సైన్యాల్ని ఓడించడం మరో ఎత్తు. ప్రజల దగ్గర ఎన్ని ఆయుధాలు వున్నా క్రమశిక్షణ కరువైతే లేదా మంచి క్రమశిక్షణ కల్గిన రెగ్యులర్ దళాలు లేకపోతే అది సాధ్యం కాదు. కేవలం ధైర్య సాహసాలు, పురాతన ఆయుధాలు – వీటితో తాత్కాలికంగా శత్రువును తరిమేయవచ్చునేమోగాని అధికారాన్ని హస్తగతం చేసుకోవడం, నిలబెట్టుకోవడం అసాధ్యం. అప్పుడున్న పరిస్థితిలో కొందరికేవో పురాతన ఆయుధాలిచ్చి, చాలా పెద్ద జన సమీకరణ చేసి శత్రువుకు ఎదురుగా నిలబెట్టాము కాని, శత్రువుకున్న ఆయుధ సంపత్తి ముందు నిలబడలేకపోయేవాళ్ళం. ఇలాంటి ప్రతిఘటనలో చాలామందిని కోల్పోయాము కూడా.

అదీగాక, బ్రిటీష్ వాళ్ళతో నైజాంకు వున్న ఒప్పందం కూడా వున్నది. బ్రిటిష్‌వాళ్ళు భారతదేశాన్ని వదిలివెళ్ళే సందర్భంలో వారికి నైజాం వంటి వారితో వున్న ఒప్పందాల విషయంలో కూడా కాంగ్రెసు ప్రభుత్వం రాజీకి వచ్చింది. దాని ప్రకారం కొన్ని ఆయుధాలు నైజాం సైన్యానికి దక్కుతూ వుండేవి. అప్పుడు మున్షీ కమిషనరుగా వున్నాడు.

కాంగ్రెసు కూడా భారతదేశంలో అంతర్భాగం కమ్మని నైజాంపై ఒత్తిడి తెస్తున్నది. అయితే నిజాం అందుకు అంగీకరించడం లేదు. స్వతంత్ర రాజ్యం కావాలని కోరుకుంటున్నాడు. కాంగ్రెసు ప్రభుత్వానికి, నిజాంకు మధ్య చర్చలు సాగుతున్నాయి. అందువల్ల నిజాంకు వ్యతిరేకంగా కాంగ్రెసు ప్రభుత్వం ఏవిధమైన చర్య తీసుకోవాడానికి అప్పటికి సిద్ధంగా లేదు. పైగా గాయపడి మునగాలలో రక్షణ తీసుకుంటున్న దళాలు కోదాడను దాటుతుండగా నిజాం పోలీసులు నిర్బంధించి తీసుకుపోయారు. ఇలాంటి సందర్భాలలో కూడా కాంగ్రెసు ప్రభుత్వం ఎలాంటి చర్యా తీసుకోకపోగా చర్చలే కొనసాగిస్తున్నది. ఇక మనకు కాంగ్రెసు రక్షణ ఇస్తుందనిగానీ, నిజాం సైన్యాలు దాడిచేసిన సందర్భంలో కూడా మనకు అండగా వుంటుందేమోనన్న భ్రమలకు గానీ ఎలాంటి తావూమేమివ్వదలచుకోలేదు. మా ఏర్పాటేదో మేము ప్రత్యేకంగా చూసుకోవాల్సిందేనన్న నిర్ణయానికి వచ్చాము.

అందువల్ల మేము మరింతగా మా శిక్షణా స్థాయిని పెంచడం, మరింత ఆధునాతనమైన ఆయుధాలు సమీకరించడం తప్పదని అందుకై ముందుకుపోసాగాం. ఈ కార్యక్రమాల్లో నేను, రాజేశ్వరరావు తదితరులు ప్రధానంగా బాధ్యతల్లో వున్నా మొత్తం

పార్టీ కమిటీయే ఈ కర్తవ్యాలను తీసుకున్నది. అందువల్ల తక్కువ సంఖ్యలో అయినా మంచి ఆయుధాలనే సంపాదించగలిగాము. ఎక్కడ? ఎలా? అన్న ప్రశ్నలు అలా వుంచుదాం. మొత్తం మీద ఆ ఆయుధాలు బాగా ఉపయోగపడ్డాయి.

మా దగ్గర ఎన్ని ఆయుధాలు వున్నాయో నిజాంకు తెలియదు గదా! అందుకని హడలెత్తిపోయి, తన సైన్యాన్ని చాలా ఎక్కువ సంఖ్యలో రంగంలోకి దించాడు.

కేంద్రకమిటీలో రాజకీయాధికారం బదలాయింపుపట్ల విభేదాలున్నాయని చెప్పాను గదా! మెజారిటీ బి.టి.ఆర్. విధానానికి వున్నది. ఇది స్వాతంత్ర్యం కానే కాదని, స్వాతంత్రోద్యమానికి ఇది వెన్నుపోటని, ఆ అధికార బదలాయింపు అన్నది బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రభుత్వానికి ఒక ముసుగు మాత్రమేనని, కనుక మన పోరాటాన్ని ఉధృతం చేయాలన్నది ఆయన విధానం.

అయితే జోషి 1948లో అఖిల భారత పార్టీ రెండవ మహాసభ జరిగేవరకు కార్యదర్శిగానే ఆ మహాసభకు ఏర్పాట్లు చేస్తూ కొనసాగాలనుకున్నాము. ఆ మహాసభకు ముందుగా బుద్ధవరంలో 1948 జనవరిలో రాష్ట్ర పార్టీ మూడవ మహాసభ జరిగింది.

నేను మొదట్లో జోషి విధానంతోనే అంగీకరించాను. ఆ తర్వాత ఆ విధానం సంపూర్తిగా సరికాదని నిర్ణయానికి వచ్చాను. అయితే బి.టి.ఆర్. విధానం మాత్రం మధ్య తరగతి బూర్జువా వర్గాన్ని, ధనిక రైతులని దూరం చేసుకోవడానికే తోడ్పడుతుంది. గనుక, ఆ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తూ వున్నాను. ఏమైనా కేంద్రకమిటీ స్థానంలో నూతన విధానం వచ్చింది.

కాంగ్రెసు స్వభావాన్ని గురించి అది అభివృద్ధికరమైందా! కాదా? నాయకత్వ స్వభావాన్ని గురించి, వల్లభాయ్‌పటేల్ లాంటి వాళ్ల అభివృద్ధి నిరోధకత్వం గురించి, గాంధీని గురించి, గాంధీకన్నా నెహ్రూ అభివృద్ధికాముకుడు అన్నదాన్ని గురించి చర్చలు జరుగుతూ వున్నాయి. నేను 1946 లో పి.సి. జోషీ తీసుకున్న విధానాన్ని బలపరుస్తూ పెద్ద వివరణ నోట్‌రూపంలో సమర్పించాను. కాంగ్రెస్‌ని అభివృద్ధి కాముకులతో కలిసి, అభివృద్ధి నిరోధకులను ఒంటరితనం చేయడానికి పోరాడాలి అన్నది ఆ నోట్ సారాంశం. అతి తిరస్కరించబడింది. ఆ తర్వాత బి.టి.ఆర్. విధానాన్ని సంపూర్తిగా తిరస్కరిస్తూనే మధ్య తరగతి బూర్జువా వర్గాన్ని, ధనిక రైతాంగాన్ని దూరం చేసుకోకుండా పోరాటాన్ని మటుకు ఉధృతం చేయాలి అన్న అభిప్రాయానికి వచ్చి అదే అభిప్రాయాన్ని వెలిబుచ్చాను.

కనుక, తాత్కాలికంగా కొన్ని తేడాలున్నా ఆంధ్రలో పార్టీ నాయకత్వం మటుకు ఈ అంశంపై ఐక్యంగానే వుంది.



1948 ఫిబ్రవరిలో పార్టీ రెండవ అఖిలభారత మహాసభ జరిగింది. ఆంధ్ర, కేరళ, తమిళనాడులలో పార్టీ నిషేధంలో వుంది. ఈ మహాసభలోని రాజకీయ తీర్మానంలోని మంచి, చెడుల పరిశీలనలోకి వెళ్ళడం లేదు. పార్టీ చరిత్ర రాసే సందర్భంగా అవన్నీ చూడాలి. ఎటూ 1951లో 1948 తీర్మానంలోని లోటుపాట్ల గూర్చిన పరిశీలనవుంది.

పి.సి.జోషిని కేంద్రకమిటీ ప్యానల్‌లో వుంచారు. ఎన్నిక సమయంలో మోహన్‌కుమార మంగళం, పి.సి.జోషీ స్థానంలో రావి నారాయణరెడ్డిని ప్రతిపాదించాడు. తెలంగాణా పోరాటానికి వున్న పేరు ప్రతిష్టలవల్ల రావి నారాయణరెడ్డి ఎన్నికయ్యాడు. ఆ మహాసభలో రావి నారాయణరెడ్డి కన్పించలేదు. అప్పటి నిబంధనావళి ప్రకారం ఆ సభ్యుడు తనకు తానుగా పోటీనుండి విరమించుకుంటున్నానని చెప్తే తప్ప పోటీలో వున్నట్లే లెక్క కనుక జోషికి బదులు ఆ స్థానంలో రావినారాయణరెడ్డి ఎన్నికైనాడు. తర్వాత పార్టీ మూడవ మహాసభలో మళ్ళీ కామ్రేడ్ జోషిని తీసుకున్నారు. రావి నారాయణరెడ్డి ఎన్నిక తెలంగాణా పోరాట ప్రతిష్టకు చిహ్నం. 'తెలంగాణా మార్గం – భారతదేశ మార్గం' అన్న నినాదం ఉధృతంగా వుండేది.

అయితే పి.సి.జోషి తన ఓటమిని భౌతిక పరిస్థితులను బట్టి ఆలోచించకుండా స్వీయ మానసిక దృక్పథంతో తీసుకున్నాడు. ఎంతో ఆవేదనగా తన తప్పులను మరీ ఎక్కువ చేసుకుని అంగీకరించాడు. అదే సమయంలో తనను కావాలని కేంద్రకమిటీ నుండి తొలగించారని ఆరోపించాడు.

"ఇప్పుడేమయింది. కేంద్రకమిటీలో లేకున్నా పార్టీ ఇచ్చిన కార్యక్రమాల్ని శాయశక్తులా నిర్వహించండి. మీ పనినిబట్టి మళ్ళీ కేంద్రకమిటీలోకి వస్తారు కదా" అని నేను జోషికి నచ్చచెప్పాను. కానీ ఆయన అదేపనిగా ఇతరులపై ఆరోపణలు కొనసాగిస్తూనే వచ్చాడు.

కొత్త పోలిట్‌బ్యూరో ఏర్పడింది. ఆంధ్ర నుండి రాజేశ్వరరావు, బసవపున్నయ్య పి.బి.లో వున్నారు. ఇది కూడా తెలంగాణా పోరాట ప్రతిష్టకు చిహ్నమే.

తెలంగాణా పోరాట భవిష్యదభివృద్ధిలో ఈ పరిణామాలను కూడా దృష్టిలో వుంచుకొని చూడాలి! నేను తిరిగి వచ్చేసరికి తెలంగాణా పోరాటం మరింత ఉధృతంగా వుంది. నేను రాష్ట్ర పార్టీ కార్యదర్శిని కాదు. ఎలాగూ గతంలో ఆ పోరాటానికి, గెరిల్లా శిక్షణ ఏర్పాట్లలో, పథకాలలో నా పాత్ర వుంది.కదా! అందుకని నన్ను ఆ రంగానికే కేటాయించమని అడిగాను. అది అంగీకరింపబడింది. అక్కడనుండి తెలంగాణా పోరాటానికి ప్రత్యక్షంగా తగుసూచనలు, సలహాలతో మార్గదర్శకత్వం వహిస్తూ వచ్చాను. అయితే ప్రతి ముఖ్యమైన అంశమూ ఆంధ్ర కమిటీ కార్యదర్శి వర్గంలో క్షుణ్ణంగా చర్చించబడి నిర్ణయింపబడేది. నా కవి ఆధారం.

1934 నుండి నేటివరకు (1985) కేంద్రకమిటీలో కొనసాగుతున్నది బహుశా నేనొక్కణ్ణే అనుకుంటాను. ఆంధ్ర సెక్రటేరియట్ ఆధ్వర్యంలో తెలంగాణా పోరాట మార్గదర్శిక బాధ్యత స్వీకరించాను. ఈ పోరాటాన్ని గూర్చి చెప్పుకుందాం.

* * *

# పోలీసు చర్య - పోరాటం కొనసాగింపు

నేను కోరుకున్నట్లుగానే తెలంగాణా పోరాటానికి గైడెన్స్ యిచ్చి నాయకత్వం వహించే పాత్ర నాకిచ్చారు. అంతేగాక అంతకు ముందు నుండి కూడా ఆ పోరాటంతో, గెరిల్లా దళాలతో ప్రత్యక్ష సంబంధంలో వుండేవాణ్ణి. వాస్తవానికి ప్రతి అంశమూ ఆంధ్ర సెక్రటేరియట్ చర్చించేది.

1934 నుండి నేటి వరకూ కేంద్ర కమిటీలో కొనసాగుతున్నవారు మీరు ఒక్కరేనా అని ఇటీవల ఎవరో అడిగారు. నాకుసరిగా జ్ఞాపకం లేదు. పార్టీ మొదట మహాసభలో కామ్రేడ్ ఇ.ఎం.ఎస్.ను ఎన్నుకున్నారు. కామ్రేడ్ సూర్జిత్, కామ్రేడ్ బసవపున్నయ్య 1934కు ఇంకా పార్టీలోకి వచ్చినట్టులేదు. ఇతర రాష్ట్రాల్లో యెవరన్నా వున్నారేమో చూడాలి. బహుశ అప్పటి నుండీ నేనే వున్నాననుకుంటాను.

ఆంధ్ర సెక్రటేరియట్ మార్గదర్శకత్వంలో తెలంగాణా పోరాట నిర్వహణ నా ప్రధాన బాధ్యత అయింది. మా కేంద్ర కార్యాలయం కృష్ణాజిల్లాలో సరిహద్దు గ్రామాల్లో వుంటుండేది. రహస్య జీవితం గడిపే సందర్భాల్లో తరచుగా నివాసాలు మారుస్తుండాలి. వీర్లపాడు, పిండిప్రోలు, అనిగెళ్ళపాడు, పెనుగ్రంచిప్రోలు, కంచర్ల, చింతల, గన్నవరం పరిసరాల్లో యిలా మారుస్తూ వుండేవాళ్ళం.

1948 జనవరి 30న గాంధీజీ సాయంత్రం 5 గంటలకు హత్యగావింపబడ్డారు. ఆ వార్త 6 గంటలకల్లా రేడియో ద్వారా దేశానికంతటికీ తెలిసింది. 'ప్రజాశక్తి'ని రెండు పేజీలతో ప్రత్యేక సంచిక తీసుకువచ్చాం. రాత్రి 10 గంటలకు బహిరంగ సభ ఏర్పాటు చేశాం. చాలా మంది జనం వచ్చారు. అందరూ కోపోద్రిక్తులై వున్నారు. ఆర్.ఎస్.ఎస్. వాళ్ళు కూడా వచ్చారు. ఆ తర్వాత ప్రజలకు, ఆర్.ఎస్.ఎస్.కు మధ్య కొట్లాట జరిగింది.

ఆ కొట్లాటలకు మేమే బాధ్యులమని ప్రభుత్వం ఆరోపించింది. నిజానికి ఆర్.ఎస్.ఎస్. వాళ్ళు మాపై దాడి చేస్తే మేము తిప్పికొట్టాం. అంతే కానీ, ప్రభుత్వం యేదో 'సాకు' చూపించాలికదా! తెలంగాణా పోరాటానికి మద్దతునిస్తున్న వాళ్ళను నిర్బంధించాలన్నది వాళ్ళ



కోరిక. ఈ వంకతో కక్షతీర్చుకోదలచారు. శాంతిభద్రతలకు భంగం కల్పించామని జనవరి 22న ప్రభుత్వం ఈ విషయమై ప్రకాశం తెచ్చిన ఆర్డినెన్స్‌గాక మరో ఆర్డినెన్స్ మిషతో మాపై దాడికి పూనుకున్నారు.

అయితే ప్రభుత్వం ఏదో కారణంతో మమ్మల్ని అరెస్టు చేయవచ్చుననీ, అందువల్ల ఏ క్షణాన అయినాసరే తప్పుకునేందుకు సిద్ధంగా వుండాలనీ అంతకు ముందే చర్చించి నిర్ణయించుకుని వున్నాము. ఎవరెవరు అవసరాన్ని బట్టి రహస్యంగా ఉండి తీరాలన్నది కూడా నిర్ణయమైంది. కనుక బహిరంగసభ జరుగుతుండగానే కొందరు తప్పుకున్నారు.

మొగల్రాజపురం బ్యారన్‌ల మధ్యగా పారిపోయాం. పోలీసులు వెంటపడ్డారుగానీ నాయకులెవ్వరూ దొరకలేదు. అయితే మా నిర్ణయాన్ని పట్టించుకోని వాళ్ళు కొందరు దొరికారు. వాళ్ళని రాజమండ్రి జైల్లో పెట్టారు. ఆ జైలు నుండి కొందరు తప్పించుకున్నారు.

తెలంగాణా పోరాట నిర్వహణ అంటే చాలా అంశాలుంటాయి. ఆయుధాలు కొనాలి. మందుగుండు కావాలి. మందులు కావాలి. వాటిని చేర్చవలసిన చోటుకు చేర్చాలి. దళాలు, నిర్మాణము, వాటి కదలిక అవన్నీ క్రమబద్ధంగా వుండాలి. ఈ దళాలే వారి అవసరాలన్నింటినీ మోసుకువెళ్ళాలి. వీటన్నింటి సంగతి అటుంచుదాం.

తెలంగాణాలో 'పోలీస్‌చర్య' జరగవచ్చునని కొంచెం ముందుగానే ఊహించ గలిగాము. వివిధ మార్గాల ద్వారా ఆ విషయమై సమాచారం మాకు చేరింది. ఎప్పుడు అన్నది ఖచ్చితంగా చెప్పలేకపోయినా త్వరలోనే అలాంటి అవకాశం వుందని మా దృష్టికి వచ్చింది. అందుకని 'పోలీసు చర్య' జరిపితే మన వైఖరి ఎలా వుండాలి అని ముందుగానే చర్చించుకున్నాం. నేను, బసవపున్నయ్య, రాజేశ్వరరావు, చంద్రం, దేవులపల్లి, హనుమంతరావు అనుకుంటాను. అవి రహస్య దినాలు కనుక, అంతకన్నా పెద్ద కార్యదర్శి వర్గం వుండటం అసాధ్యం. పోలీస్ చర్య జరిగితే మా వైఖరి ఎలా వుండలి అన్న విషయంపై అభిప్రాయ భేదాలు ఏమీ మాలో లేవు.

స్వతంత్ర భారతదేశంలో విలీనానికి నైజాం అంగీకరించడంలేదు. భారత సైన్యం జోక్యం చేసుకుని, నిజాం రాజరికాన్ని తోసివేసి, భారతదేశంలో నైజాం సంస్థానాన్ని కలిపివేయాలి అని మేము డిమాండు చేస్తున్నాము. నిజాం నిరంకుశత్వం అంతం కావాలి. భారత సైన్యాలు రంగప్రవేశం చేసి నిజాంను కూలదోస్తే నిజాం పాలనలో తీవ్రమైన అణచివేతకు గురవుతున్న ప్రజలు స్వాగతం చెప్తారు. అదీగాక అప్పటిదాకా మేము పోరాడుతున్నది నిజాంతోనూ, రజాకార్లతోనూ. ఇవన్నీ దృష్టిలో వుంచుకునే భారత ప్రభుత్వం నైజాంను భారతదేశంలో విలీనం చేసేందుకై సాయుధ చర్యకు పూనుకోవాలని డిమాండు చేశాం.

అయితే రాజబహదూర్ గౌడ్ ఒక ప్రకటన చేశాడు అదీ హైదరాబాద్ సిటీ కమిటీ తరపున. 'హైదరాబాద్ సంస్థానం స్వతంత్రంగా వుండాలి. భారత సైన్యం జోక్యం చేసుకోరాదు.

భారతదేశంలో హైదరాబాద్ విలీనం కారాదు. ఎందుకంటే, భారత ప్రభుత్వము దోపిడీ ప్రభుత్వం. మనం కోరుతున్నది ప్రజల రాజ్యం. హైదరాబాద్‌లో ప్రజారాజ్యం’. ఇదీ ఆ ప్రకటన సారాంశం. ఈ అవగాహన సరిగ్గా మనల్ని తీసుకువెళ్ళి ముస్లిం మత ఛాందసుల సరసన చేరుస్తుంది. ఇది తప్పు అవగాహన అని మా అభిప్రాయము. మేమేకాదు, ముగ్దుం మొహిద్దీన్ కూడా మా మాదిరే రాజబహదూర్ గౌడ్ ప్రకటన తప్పు అనే అభిప్రాయపడుతున్నాడు. అయితే, ఆ ప్రకటన యిచ్చే సమయానికి ఆయన ఊళ్ళోలేడు. ఆ ప్రకటనల వంటివి సాకుగా చూపి ఇప్పటికీ ప్రభుత్వ అధికారయుత చరిత్రలో మాత్రం కమ్యూనిస్టులు రజాకార్లతో చేతులు కలిపారనే రాస్తుంటారు. ఆ ప్రకటనను పార్టీగా మేము ఖండించాము.

కానీ భారత సైన్యం దిగితే, అది కేవలం ‘నిజాం’ను కూలదోసేందుకే కాదు, మనపై కూడా దాడికి సిద్ధమయ్యే వస్తుంది అన్న అవగాహన కూడా మాకు లేకపోలేదు. సరే! ముందు భారత సైన్యం వచ్చి నిజాంతో తలపడి, రజాకార్లను అణిస్తే ఆ మేరకు మనకు మంచిదే! మనకు భౌతికంగానేగాక అందువల్ల నైతికబలం కూడా వొనగూడుతుంది. కనుక ప్రత్యక్షంగా నెహ్రూ సైన్యాలతో తలపడవద్దు. అదీగాక ఈ అవకాశం తీసుకుని నిజాం సైన్యం మీద, రజాకార్ల మీద దాడి సాగించి వీలైనన్ని ఆయుధాలు సంపాదించు కుందాం. ఆ విధంగా మనమూ సన్నద్ధమైవుంటే భారత సైన్యాలు మనపై తుపాకులు తిప్పినప్పుడు రైతుల, ఇతర మిత్రవర్గాల రక్షణ కోసం నిలబడగలుతాము అన్న అవగాహన కూడా వున్నది.

మనం బలంగా వున్నచోట్ల రజాకార్లను, నిజాం సాయుధ దళాన్ని ఎదుర్కొంటే, నిజాం సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చెయ్యాలనుకుంటున్న ప్రభుత్వ కర్తవ్యమూ సులభతరమవుతుంది. మనకూ ఆయుధాలు లభ్యమౌతాయి. కనుక భారత ప్రభుత్వ చర్యకు డిమాండు చేస్తూనే ఆయుధాలను వదిలెయ్యరాదనీ, మన దళాలను రద్దు చేసి ఎక్కడివాళ్ళను అక్కడకు పంపించరాదనీ నిర్ణయం తీసుకున్నాము. ఈ విషయంలో మాకు అంగీకృతమైన, స్పష్టమైన అవగాహన వుంది.

నిజాంను లొంగదీసుకున్న తర్వాత భారత సైన్యం తన దాడిని ఎక్కుపెట్టేది మా మీదనే. మేము సాగిస్తున్న భూ పోరాటానికి, స్థాపించిన ప్రజాస్వామ్య విధానానికి అది మద్దతునివ్వడం జరగదు. గ్రామీణ ప్రజానీకానికి వ్యతిరేకంగా తయారై, మళ్ళీ ‘దొరలను’ తీసుకువచ్చి గ్రామాల్లో నిలబెడతారు. దాంతో ప్రజలలో భ్రమలు పటాపంచలౌతాయి. ప్రజల రక్షణకై మనం పోరాడాలి. అయితే వెన్వెంటనే ప్రత్యక్షంగా నెహ్రూ సైన్యాలతో ఘర్షణకు దిగరాదు. ఒకవేళ మనకు మరిన్ని ఆయుధాలు చేకూరినా ఆ పని చెయ్యకూడదు. నెహ్రూ సైన్యాలను ప్రత్యక్షంగా ఎదుర్కొనడానికి తగినట్లు సరుకూ, సరంజామాతోలేము. మనం గెరిల్లా ఎత్తుగడలనే అవలంబించాలి. ఈ అంశాలన్నీ ముందే చర్చించుకొని వున్నాం.

నేను పిండిప్రోలులో వుండగా సెప్టెంబరు 13న ‘పోలీస్ చర్య’కు భారత సైన్యం కదిలి వస్తున్నదన్న వార్త తెలిసింది. నాతోపాటు కామ్రేడ్ చిర్రావూరి లక్ష్మీనరస్యయ్య అక్కడే వున్నారు. వెన్వెంటనే పైన చెప్పిన అవగాహనతో ఒక సర్క్యులర్ తయారు చేశాము.



దానితోపాటు మన దళాలను విచ్ఛిన్నం కానీయవద్దనీ, ఆయుధాలు పోగేసు కుంటూనే ప్రత్యక్షంగా నెహ్రూ సైన్యంతో తలపడకుండా గెరిల్లా ఎత్తుగడలననుసరిస్తూ, ఎలాంటి దాడి జరిగినా సిద్ధంగా వుండాలనీ, నెహ్రూ సైన్యం రాకతోనే మనం కోరిన డిమాండు నెరవేరింది, కనుక విముక్త మైనట్లు భావించడం పొరపాటనీ– ఇవన్నీ వివిధ ప్రాంతాలకు వెళ్ళి వివరించాలి. వారి కార్యక్రమాన్ని పర్యవేక్షించాలి అని నిర్ణయించుకున్నాం.

అప్పుడు సౌలభ్యాన్నిబట్టి ప్రాంతీయ కమిటీలుగా నిర్ణయించాము. ఉదాహరణకు సూర్యాపేట, ఖమ్మం ఇవి ఒక కమిటీ. ఈ ప్రాంతీయ కమిటీకి ఆ ప్రాంతం మొత్తానికి ఒక నాయకత్వం వుండేది.

మా కొత్త ఎత్తుగడలు వివరించేందుకై నేను పిండిప్రోలు నుండి బయలుదేరాను. అంతా కాలినడకనే. ముందుగా కొత్తగూడెం వెళ్ళాను. అక్కడ కామ్రేడ్ బి.ఎన్. కొండలరెడ్డి వున్నారు. కొత్తగూడెం నుండి జనగాం ప్రాంతంలోని కేశవాపురం వెళ్ళాను. అక్కడ నాయకత్వం ఎస్.వి.కె. ప్రసాద్‌ది. అక్కడ నుండి రామన్నపేట వెళ్ళాను. అక్కడ ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి కట్కూరి రామచంద్రారెడ్డి వున్నారు. అక్కడ నుండి భువనగిరి వెళ్ళాను. పెద్దన్న, పిచ్చిరెడ్డి, కోదండరామిరెడ్డి, రామచంద్రారెడ్డి నాయకులు. అక్కడి నుండి హైదరాబాద్ చేరేసరికి నెలరోజులు పట్టింది.

నాకొక విషయం అర్థమయింది. రజాకార్లను, నిజాం పోలీసులను, భూస్వాములను తరిమివేసిన తర్వాత మన జనంలో కొంచెం ఉపేక్ష పెరిగింది. ఇది ఒక అంశం. రెండో అంశం ఏమంటే, కొంత మంది దళనాయకులు, గ్రామ పార్టీ నాయకులు నిజాం పోయాడు. రజాకార్లు లేరుగనుక ఇక పోరాడవలసిన పనిలేదని భావించారు. దళాలను రద్దు చేసి, దళ సభ్యులను ఎవరి ఇళ్ళకు వాళ్ళను పంపించివేశారు.

కనుక మళ్ళీ దళాల నిర్మాణం చేయడం అవసరమైంది. నాయకత్వం వహించే మన క్యాడర్ అయినా అవసరమైన చర్యలుగైకొని భారతసేనలు మనపై దాడికి పూనుకున్నప్పుడు సంసిద్ధంగా వుండేట్లు చేయవలసిన అవసరం వుంది. ఆ కృషి చేశాను. కానీ హైదరాబాద్ చేరుకునేసరికి నిర్బంధం పెరిగింది. వేల మంది రైతాంగాన్ని, మన వాళ్ళనూ ప్రభుత్వం నిర్బంధిస్తున్నది. భూస్వాములు తిరిగి గ్రామాలకు చేరుకుంటున్నారు. ‘ఇప్పుడు ఇవ్వవలసిన పిలుపు ఏమిటి?’ ఈ విషయం చర్చించేందుకే నన్ను విజయవాడ రమ్మని కబురు వచ్చింది. మా కార్యదర్శి వర్గం విజయవాడలో వుంది. రాత్రిపూట రైల్లో ప్రయాణం చేసి విజయవాడ స్టేషన్ రాకముందే దిగి, చీకటిలోనే చేరవలసిన చోటుకు చేరాను.

పరిస్థితిని క్షుణ్ణంగా అధ్యయనం చేశాం, చర్చించాం. పోరాటాన్ని కొనసాగించాలనే నిర్ణయించుకున్నాము.

# రణదివె వాదనలు - అంతర్గత పరిణామాలు

1948 నాటికి పార్టీ కేంద్ర ఆఫీసు బొంబాయిలో వుంది. అక్కడ కూడా నిర్బంధం ప్రారంభమయింది. కామ్రేడ్ అధికారి ఆధ్వర్యంలో అతికొద్ది మందితో కేంద్ర ఆఫీసు వున్నదంటే వున్నదన్నట్లు పని చేస్తున్నది. అంతకుముందు వున్న 'ప్రజాయుద్ధం' పత్రిక స్థానంలో 'న్యూయేజ్' వచ్చింది. ఆ తర్వాత 1948 రహస్య కాలం అంతా, న్యూయేజ్ ఆగిపోయి 'క్రాస్‌రోడ్స్' పత్రిక వస్తుండేది. దానికి రమేష్ థాపర్ లీగల్ సంపాదకుడు.

ఆ తర్వాత కేంద్రాన్ని కలకత్తాకు మార్చారు. అక్కడే బి.టి.ఆర్, భవానిసేన్ ఉన్నారు. ఆ తర్వాత అధికారి కూడా అక్కడకు చేరాడు. పి.బి.లో రాజేశ్వరరావు, బసవపున్నయ్య వున్నారు. ఈ పోరాటాన్ని ఎలా తీవ్రతరం చేయాలి అన్న చర్చ సాగింది. బి.టి.ఆర్. తన వొంటెత్తు పంథాని ప్రవేశపెట్టారు. దేశ వ్యాపితంగా సాయుధ తిరుగుబాటు, దానికితోడు సార్వత్రిక సమ్మెకు పిలుపు ఇవ్వాలన్నది ఆ పంథా. రైల్వేల సమ్మె జరగాలని పిలుపు. కాని ఆ సమ్మె పూర్తిగా విఫలమైంది. పిలుపు బాగానే వుంది. ప్రజాసంసిద్ధత ఏది? మామూలు ఆర్థిక సమ్మెలకు పరిస్థితి అనువుగానే వుంది. కానీ సార్వత్రిక సమ్మె సాధ్యంకాదు.

ఇక్కడొక ప్రధాన విషయం గమనించాలి. రెండవ ప్రపంచ యుద్ధానంతర తక్షణ పరిస్థితిలో పెట్టుబడిదారీ వర్గానిది పై చేయిగా వుంది. అలాంటి దశలో అదంతా సంక్షోభాలలో వుందనీ, విప్లవ పరిస్థితి పరిపక్వంగా వుందనీ, కనుక మనదే ఆలస్యమనీ అనుకోవడం సరికాదు. కామ్రేడ్ బి.టి.ఆర్. వాదన అర్థం, మొత్తం పెట్టుబడిదారీ వర్గాన్నంతటినీ ఎదిరించాలి. ప్రజాతంత్ర విప్లవానికి బదులు, జనతా ప్రజాతంత్ర విప్లవం తీసుకురావాలి. సోషలిస్టు విప్లవం, జనతా ప్రజాతంత్ర విప్లవం సమ్మిళితమౌతాయి. ఆయనొక్కడే అలా తలపోస్తున్నాడని చెప్పజాలం. సమ్మిళితమయ్యే మాట నిజమే. కానీ ఎప్పుడు? ఏ దశలో? జనతా ప్రజాస్వామ్యాన్ని ఏర్పరచి, స్థిరపరచుకుంటున్న దశలో, అప్పుడు జనతా ప్రజాస్వామ్య విప్లవంతోనే ఆగిపోము. తర్వాత శ్రామికవర్గ నియంతృత్వం, తద్వారా సోషలిజం స్థాపించవలసి వుంటుంది. కానీ, ఇప్పుడే రెండూ ఒకటేనని మొత్తం ధనికులకు, పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా ఎక్కు పెట్టడం సాధ్యంకాదు.



మొదట్లో ఆయన వాదన, యిక్కడున్నది ఒక తొత్తు ప్రభుత్వమనీ, కనుక సామ్రాజ్యవాదమే ప్రధాన శత్రువు అనీ. పిదప అత్యధిక సామ్రాజ్యవాదం వెనక్కి పోయింది. యిక్కడ పెట్టుబడిదారీ వర్గమే ప్రధాన శత్రువు కనుక, ఇక్కడున్న పెట్టుబడిదారీ వర్గం మొత్తంగా వచ్చి అభివృద్ధి నిరోధకమైనది. కనుక మొత్తంగా పెట్టుబడిదారీ వర్గాన్ని తోసి రాజనాలి. గ్రామీణ ప్రాంతాలలో పెట్టుబడిదారీ వర్గం అంటే ధనిక రైతు. అంటే మొత్తం పెట్టుబడిదారీ వర్గానికి, ధనిక రైతాంగానికి – భూస్వాములు సరేసరి – వారికి వ్యతిరేకంగా విప్లవం అన్న మాట ఆ సిద్ధాంతసారం.

పైగా అక్కడక్కడ రైతాంగ పోరాటాలున్నాయి. త్రిపురలో, కాక్‌ద్వీప్‌లో, ఉత్తర ప్రదేశ్‌లో ఒకటి రెండుచోట్ల వీటిని చూపించి రైతాంగం సాయుధ పోరాటంలో వున్నది. కనుక సార్వత్రిక సమ్మెద్వారా యీ పోరాటాలకు మద్దతు యిచ్చి విజయం సాధించాలి. రైతాంగ పోరాటాలగూర్చి ప్రత్యేకించి శ్రద్ధ కనపరచలేదు.

ఇక ఆంధ్రలో మా డాక్యుమెంటు వుండనే వున్నది. చైనా అనుభవం, మావోగారి ఉద్ఘాటనలు – వీటిని దృష్టిలో వుంచుకుని తెలంగాణా పోరాటం "యానాన్" యిలా పోల్చుకుంటూ దీర్ఘ కాలిక సాయుధ పోరాటంగా భావిస్తున్నాము. అయితే బి.టి.ఆర్. గారి విమర్శ ఈ రోజు మనం విమర్శ చేసుకుంటున్న ధోరణిలోకాదు. ధనిక రైతాంగాన్ని కూడా మనతోనే వుంచుకుని, కార్మిక వర్గం లేకుండా గెరిల్లా పోరాటం ఎలా సాధ్యం అన్నది ఆయన విమర్శ. మీ అవగాహనంతా తప్పు అని మమ్మల్ని అంటున్నారు. అంతేకాకుండా హైదరాబాద్ సంస్థానాన్ని విచ్ఛిన్నం చేసి, భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేయాలన్న మా నినాదం కూడా బూర్జువా జాతీయ దురహంకారం నుండి ఉత్పన్నమైనదని మరో విమర్శ.

మాట వరసకు అంగీకరించినా జాతీయ సమగ్రత ప్రాధాన్యత అర్థం కాకపోవడంవలన ఆ విమర్శ వచ్చింది. అఖిలభారత కార్మికవర్గం అనడం బాగుంటుంది. తేలికే, కానీ, వాస్తవ పరిస్థితి ఏమిటి? వివిధ భాషలకు, జాతులకు చెందిన వారం మనం. ఒక రాష్ట్రంలో కూడా కులం, మతం యిలాంటి వానివల్ల కార్మిక వర్గంలోనే చీలికలు వుంటున్నాయి. వీటన్నింటినీ మనం అధిగమించాలి. ఎట్లా అధిగమించాలి అన్నది వేరే ప్రశ్న. కానీ అసలీ వాస్తవాన్ని మాత్రం గమనంలో వుంచుకోవాలి.

1949 ఆరంభంలో ఎత్తుగడల పంథాపై పొలిట్‌బ్యూరో నుండి డాక్యుమెంటు వచ్చింది. మొత్తం విమర్శ అంతా అందులో వుంది. బి.టి.ఆర్. ఒకటి అంటుండేవారు."మీరు తెలంగాణా పోరాటం సాగించండి. కానీ అదేదో సాయుధ విముక్తి మార్గం అవుతుందన్న భ్రమను తొలగించుకోండి. రైతులను పోరాడనివ్వండి. కార్మికులు రంగం మీదకు వచ్చి తర్వాత నాయకత్వం వహిస్తారు. మీ పోరాటం విప్లవోద్యమానికి ఉత్తేజాన్నిస్తుంది. మీ పోరాటమేమీ ప్రత్యేకంగా గొప్పది కాకపోయినా, అసలు సాయుధ పోరాటం యెక్కడ, ఎవరు చేస్తున్నా అది ఉత్తేజపరుస్తుంది". ఇదీ ఆయన చెప్పిన విషయం.

1949–50 మధ్య కాలానికి సంబంధించి 1500 పేజీల పుస్తకం ఒకటి వచ్చింది. అందులో కామ్రేడ్ బి.టి.ఆర్. వాటి సిద్ధాంతం, మా డాక్యుమెంటు, బి.టి.ఆర్. పంథా తిరస్కరింపబడినప్పటి విమర్శ, ఆ సమయంలో తాత్కాలికంగా ఏర్పడిన కేంద్ర కమిటీ, మాస్కోకు ప్రతినిధివర్గం వెళ్ళడం, నాయకత్వంలోనూ, పంథాలోనూ మార్పులు – యివన్నీ వున్నాయి.

ఇంతకీ చెప్పొచ్చేదేమంటే, కేంద్ర నాయకత్వంతో మా ఆంధ్ర కమిటీకి విభేదం వుంది. ఈ విషయంలో ఆంధ్ర కమిటీ ఐక్యంగా వుంది. రాజేశ్వరరావు విషయాలు చర్చించేందుకు కలకత్తా వెళ్ళాడు. అక్కడ వారి వాదనతో ఈయన అంగీకరించలేదు. కానీ అంగీకరించానని చెప్పివచ్చాడు. "కేంద్ర నాయకత్వ అవగాహన మొత్తమే తప్పు అయితే అంగీకరించానని నువ్వెట్లా చెప్పి వచ్చా"నని బసవపున్నయ్య రాజేశ్వరరావుని నిలేశాడు.

ఈ లోపల ఆనాటి నాయకత్వంలో ఒకదాని తర్వాత ఒకటిగా శిక్షణా చర్యలు, కమిటీలు రద్దు చేయడం జరుగుతున్నది. అదొక నిరంకుశ ధోరణి. ఇదే సమయంలో ఆంధ్రలో అరెస్టులు సాగుతున్నాయి. కేంద్ర డాక్యుమెంటు రాకముందే చండ్రం అరెస్టయ్యాడు. మేము డాక్యుమెంటును చర్చించి, తిరిగి రహస్య స్థావరానికి వెళ్ళేదారిలో హనుమంతరావు అరెస్టయినాడు. మిగతా వారు రహస్యంగా వున్నారు. నిర్బంధ విధానం తీవ్రమవుతున్నది. మేము చాలా తరచుగా మా స్థావరాలను మార్చాల్సి వస్తున్నది. రహస్య కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు గ్రామాలు అంత అనువుగాలేవు. మధ్యప్రదేశ్, ఒరిస్సా, హైదరాబాద్, ఇలా వెళ్ళాం.ఆ తర్వాత మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు కూడా వెళ్ళివుండాల్సి వచ్చింది.

కామ్రేడ్ బి.టి.ఆర్. తెలంగాణా పోరాట ప్రాధాన్యతను గుర్తించలేదు. ఏదో పోరాటం సాగుతున్నది, సాగనియ్. ఉత్సాహపడిన మేరకు ఉపయోగమే కదా అన్నదే ఆయన ధోరణి. కార్మికవర్గం వెంటనే కదిలి రంగంలోకి రాకున్నా రైతాంగం గెరిల్లా పోరాటం సాగిస్తూనే వుండాలి. ఆ తర్వాత కార్మికవర్గం వచ్చి చేరుతుంది. అని చైనా కమ్యూనిస్టు పార్టీ, మావో చెబుతున్నారు గదా అంటే, ఆ చైనా వాళ్ళదంతా బోగస్ 'చైనా మార్గం' అంటూ లేదు. ఉన్నదొకటే మార్గం – మార్క్స్, ఏంగిల్స్, లెనిన్, స్టాలిన్‌లను ప్రామాణికంగా తీసుకోవచ్చుగానీ, మావోను లెక్క చేయవలసిన పనిలేదు అని బి.టి.ఆర్. ఆనాటి విమర్శ. ఇప్పుడు మనం సోషలిస్టు విప్లవదశలో వున్నాం. మీరేదో యింకా వేరే దశలు చెప్తున్నారు. మీది రివిజనిజం అని వాదించేవారు. నా అభిప్రాయం సైద్ధాంతికంగా యిది. సోషలిస్టు విప్లవ దశే అయినా మొత్తం పెట్టుబడిదారీ వర్గాన్ని, ధనిక రైతాంగాన్ని కూడా శత్రువులుగా పోరాడడం కాదు. ఇది సోషలిస్టు విప్లవంలో తొలిమెట్టు సరే, పేరు సంగతి అలా వుంచినా ఈ దశలో మనం ధనిక రైతును, మధ్య తరగతి పెట్టుబడిదారీ వర్గాన్ని మనతోనే వుంచుకోవాలి. అలాగే సార్వత్రిక సమ్మె, రష్యా మార్గం పనికిరాదు. మనది చైనా మార్గం. రాజేశ్వరరావు, బసవపున్నయ్య – ఇది సోషలిస్టు విప్లవమూ, మళ్ళీ అందులో తొలిదశ – ఈ రెండూ కూడా కాదు అనే వారు.

స్థూలంగా చెప్పాలంటే, మన ఆంధ్ర కామ్రేడ్స్ అభిప్రాయం ప్రకారం మనది 'చైనా మార్గం' బి.టి.ఆర్., దృష్టిలో 'చైనా మార్గం' అంటూ లేదు. "మీరు మీ పోరాటం సాగించండి,



కార్మికవర్గాన్ని రంగంలోకి తెచ్చేందుకు అది 'హొత్తి'లాగా ఉపయోగపడుతుందేమోగానీ, అసలా విధంగా విప్లవం అసాధ్యం" అని.

"విశాలాంధ్రలో ప్రజారాజ్యం" పుస్తకం గూర్చి కొందరు పెద్దగా పట్టించుకోలేదు. భాషా ప్రయుక్త రాష్ట్రాలను వారు తీవ్రంగా వ్యతిరేకించారు అనిగాదు, ఇవన్నీ ఉపాంగాలు. అసలు విషయం అఖిలభారత కార్మికవర్గం అన్నది. ఒక ముఖ్య అభిప్రాయం. అయితే కేంద్ర కమిటీ మెజారిటీ భాషా ప్రయుక్త రాష్ట్రాలను వ్యతిరేకించలేదు.

ఒంటెత్తు విధానం అంటే ఎలా వుంటుందంటే, జైల్లో వున్నాసరే సామ్రాజ్య వాదాన్ని ఎదిరించాలి అనేవారు. ఎలా అంటే, జైలు ఉద్యోగులపై దాడి చేయడం. లోపల వుండే సత్యాగ్రహాలు వంటి పోరాటాలు చెయ్యడం. చెయ్యకపోతే పిరికితనం కింద జమ. ఈ విధానమే అన్ని జైళ్ళకూ పార్టీ లైనుగా పంపబడింది. ఏదన్నా న్యాయమైన కోర్కెపై పోరాటం వస్తే వేరే విషయం. కానీ, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం పేరుతో అలా సాగించడానికి మేము వ్యతిరేకం. కానీ పార్టీ లైనుకదా. అందుకని కడలూరు జైలు, పేలం జైలు వంటిచోట్ల దాన్ని అమలు చేశారు.

అసలే ఏదో వంకతో జైల్లో కూడా క్రూర నిర్బంధాన్ని సాగించాలని ప్రభుత్వం చూస్తున్నది. ఇంకేం. కడలూరులో కామ్రేడ్ అనుమర్లపూడి సీతా రామారావు యిలాంటి పోరాటంలో పోలీసు కాల్పుల్లో మరణించాడు. ఏదో విధంగా యుద్ధరంగం తెరవాలి అన్నదే అవగాహన. ఇక్కడ జైలు రంగం అన్నమాట. కడలూరు ఘటనపట్ల బయట రహస్యంగా వున్న ఆంధ్ర కామ్రేడ్స్‌ల ఆగ్రహోదగ్రులమైనాము. కానీ కడలూరు జైలు మా పరిధిలో లేదు. తమిళనాడు పరిధిలో వుంది. వాళ్ళు పై నుంచి వచ్చిన లైను ప్రకారం ఆలోచించకుండా ప్రవర్తిస్తున్నారు. సుదీర్ఘమైన సత్యాగ్రహాలు.

ఇదంతా ఆత్మహత్యా సదృశ్యం అని నేను భావించాను. జైలు నాల్గు గోడల మధ్య వుండి మనం చేయగలిగిందేమిటి? ప్రజలను సమీకరించి, సమాయత్తం చేసి, జైలు గోడలు బద్దలు కొట్టించలేముకదా. మరి ఈ దీర్ఘ కాలంసాగే సత్యాగ్రహాల పర్యవసానం ఏమిటి? మహా అయితే కోపంతో, నిస్పృహతో, గొంతు బొంగురు బోయేవరకూ, సామ్రాజ్యవాద వ్యతిరేక నినాదాలు ఇవ్వగలం. ఈ దీర్ఘకాల సత్యాగ్రహాలతో అసలే అంతంత మాత్రంగా వున్న ఆరోగ్యాలు మరీ చెడిపోతాయి. అయినా మనకు జైలు గూర్చి అనుభవాలు తక్కువా? జాతీయ విప్లవకారులు, గదర్ వీరులు అండమాన్‌లో వున్నారు. వాళ్ళూ జైళ్ళలో పోరాడారు. కానీ, దాన్ని ఒక విప్లవ పోరాటంగా భావించికాదు. ఇలాంటి అభిప్రాయాలు చెప్పిన వారిని పిరికివారని, పనికిమాలిన వారని ముద్రవేసేవారు. కేంద్ర పార్టీపట్ల విధేయత, క్రమశిక్షణ వుండాల్సిందే, కానీ ఇక్కడ భౌతిక పరిస్థితులను విమర్శనాత్మకంగా విశ్లేషించే బదులు అది ఒక రకమైన విచక్షణా రహితంగా అమలయింది. ఇది మాకు ఇష్టంగా లేదు.

ఇదిలా వుండగానే కేంద్ర డాక్యుమెంటు వచ్చింది. సరే, మా అభిప్రాయం ఏదో మేము చెప్పాం. మా తెలంగాణా పోరాటం సాగిస్తున్నాము. 1950 ఆరంభంలో కొమింటర్న్

జర్నల్‌లో "సంపూర్ణశాంతి, జనతా ప్రజాస్వామ్యం కోసం" అన్న సంపాదకీయం వచ్చింది. అది సద్విమర్శనాత్మకంగా వుంది. సహజంగా బి.టి.ఆర్. పంథాకి వ్యతిరేకంగా వుంది. అంతకు ముందు డైకోన్ వ్యాసాలు అవీ వచ్చాయి. వానిలో జాతీయ విముక్తి పోరాటాలు, సాయుధ పోరాటాలు–వీటిని గూర్చి వుండేవి. చైనా వారు వీటిని మరింత పెద్దవి చేసి చెప్పే వారు. అవన్నీ మమ్మల్ని వుత్తేజపరచాయి. ఓహో మన పోరాటం కూడా సక్రమ మార్గంలోనే వుందని భావించాము. మేము పోరాటంలో వున్నాముగనుక మాకు అనుకూలంగా వున్న వ్యాసాలన్నింటినీ పోగేసుకుని స్వీకరించేవాళ్ళం. కానీ ఈ సంపాదకీయం అచి తూచినట్లు వుంది. అలాంటి విప్లవ పరిస్థితులు లేవని విశ్లేషించింది.

కనుక సహజంగానే ఈ లైనును చర్చించవలసి వుంది. కేంద్ర కమిటీ సమావేశం పిలిచారు.

ఇక్కడే యింకో విషయం కూడా చెప్పాలి. 1949 జూన్, జులైలో తెలంగాణా సాయుధ పోరాటాన్ని ఆంధ్ర ప్రాంతానికి కూడా విస్తరించాలనుకున్నాం. ఒక విధంగా తెలంగాణా కామ్రేడ్స్ నుండి వొత్తిడి వస్తున్నది. "మేమే ఆయుధాలు తీసుకు పోరాడాలా? ఆంధ్ర ప్రాంతంలో మన పార్టీ నిర్మాణయుతంగా వుంది కదా. ఈ పోరాటాన్ని ఆ ప్రాంతానికి కూడా ఎందుకు విస్తరించకూడదు?" అని వొత్తిడి తెస్తున్నారు. ఇక్కడ కూడా భూస్వాములు, గూండాలు పార్టీ కార్యకర్తలపై దాడులు సాగిస్తున్నారు. కామ్రేడ్స్ రహస్య జీవితాలు గడుపుతున్నారు. నిజానికి తెలంగాణాలో పోలీస్ యాక్షన్‌కు కొద్ది రోజులు ముందు నుంచి ఇక్కడ తీవ్ర నిర్బంధం వుంది. అందుకని దాన్ని తిప్పికొట్టాలి. ఇదీ ఆలోచన. కానీ వారు వాదనను వ్యతిరేకిస్తున్నాము. దేవులపల్లి మాతో వున్నాడు. అయినా వత్తిడి వుంది దానికన్నా ఎక్కువ ఇక్కడ కూడా ఎందుకు తిరగబడకూడదు? అన్న ప్రశ్న వచ్చేది అక్కడ పరిస్థితి ఇక్కడలేదు అని కొంత వరకు చెప్పి చూసి ఆ వాదనను పక్కన పెట్టగలిగాము. ఆ వాదనకు లొంగి, ఆ తర్వాత మేమే పంటికి పన్ను – కంటికి కన్ను అన్న నినాదం ఇచ్చాము. ప్రతీకారం తీర్చుకునేందుకు తెలంగాణాలో పోరాడుతున్న మన కామ్రేడ్స్‌కు అండగా ఇక్కడ కూడా పోరాడాలి అని చెప్పాం. అక్కడ తెలంగాణాలో ప్రజలున్నారు, ఆయుధాలున్నాయి. ఇక్కడ ప్రజలూ లేరు, ఆయుధాలూ లేవు. సరే ఆయుధాలంటే కొన్ని సంపాయించాము. కానీ ప్రధానమయింది ప్రజలు. తీవ్ర నిర్బంధమెదురైంది. 1949 అక్టోబరు నుండి 50 మే వరకూ కామ్రేడ్స్‌ను పట్టుకోవడం, కాల్చి చంపడం. తెలంగాణాలో అయితే అడవుల్లోకి పోయారు. ఆయుధాలతో రక్షించుకున్నారు. ఇక్కడ ఆ వీలు లేదు. చాలా తక్కువ ఆయుధాలున్నాయి.

రహస్యంగా వున్న వాళ్ళ జాడ తెలియడంతోనే అరెస్టు చేసేవాళ్ళు. ఆ తర్వాత కాల్చి చంపేవారు. అదేమంటే ఎన్‌కౌంటర్లు. ఈ ఎన్‌కౌంటర్లేమీ కొత్తకాదు. ఆ రోజుల్లోనే వున్నాయి. మొదటిసారి ఇలా బలైంది పశ్చిమగోదావరి జిల్లా, కొవ్వూరు తాలూకా కామ్రేడ్ సుబ్బారావు అయినా అయివుండాలి. లేదా యిక్కడ గన్నవరం ప్రాంతంలో కామ్రేడ్ చింతపల్లి పాపారావు అయినా అయి వుండాలి. అరెస్టు చేసి కాల్చి చంపారు. ఆ తర్వాత చాలా జరిగినాయి. దానితో ఈ దళాలను రద్దు చేశాము.



1950 జనవరిలో కాబోలు పైన చెప్పిన దీర్ఘకాల శాంతికోసం, జనతా ప్రజాస్వామ్యం కోసం అన్న సంపాదకీయం వచ్చింది. ఈ లోపలే పార్టీ కమిటీలను రద్దు చేయడం, నాయకత్వాన్ని మార్చడం, విమర్శ ఆత్మవిమర్శల పేర గందరగోళం. ఒకవిధంగా పార్టీలో నిరంకుశత్వం చోటు చేసుకుంది. ఈ సంపాదకీయం వచ్చిందిగదా. పోరాటం చేస్తున్నది మేమేగదా. అందుకని మమ్మల్ని కలకత్తా రమ్మని కబురంపారు. రహస్యంగా కేంద్ర కమిటీ సమావేశం జరిగింది. మేము మా వాదన పెట్టాము. బి.టి.ఆర్. తన వొంటెత్తు పోకడను అంగీకరించారు. కొత్త కేంద్ర కమిటీని, కొత్త పొలిట్ బ్యూరోను ఎన్నుకోవలసి వచ్చింది. మన భవిష్యత్ కార్యక్రమం ఏమిటో కూడా నిర్ణయించుకోవాలి.

అప్పటికి ఘాటే, అజయ్‌ఘోష్, డాంగేలు జైలులో వున్నారు. నేనూ, బసవపున్నయ్య, రాజేశ్వరరావు ఆ తర్వాత దేవులపల్లి కూడా వచ్చాడనుకుంటాను. ఆ కొత్త కేంద్ర కమిటీలో బి.టి.ఆర్. లైనును పూర్తిగా భుజాన వేసుకున్న వారిని వుంచరాదని, దీనికి భిన్నంగా చెప్పి, యిబ్బందులకు గురైన వాళ్ళు వుండాలని అనుకున్నాం. అయితే కేంద్ర కమిటీ ప్రతిసారి సమావేశం అవడం సాధ్యంకాదు. ఒక పొలిట్ బ్యూరోను కూడా ఎన్నుకోవాలి. పని జరగాలి కదా. ఆ పి.బి.లో కామ్రేడ్ సోమనాథ్ లాహిరి వున్నట్లు గుర్తు, ఆయన కూడా బి.టి.ఆర్. ఆలోచనతోనే వున్నాడు. కానీ ఏవో కొన్ని తేడాలు కూడా వారిద్దరి మధ్య వున్నాయి. భవాని సేన్‌ను కేంద్ర కమిటీలో వున్నాడుగానీ తర్వాత తొలగించాము. కేంద్ర కమిటీలోకి బి.టి.ఆర్.ను ఎన్నుకోలేదు. ఆ విధానానికి ఆయన ప్రధాన రూపకల్పన చేసినవాడు కనుక. ఆయనను పార్టీ నుండి తొలగించాలని కూడా డిమాండ్ వచ్చింది. దాన్ని మేమే వ్యతిరేకించాము.

కనుక కొత్త కొత్త పి.బి.లో రాజేశ్వరరావు, బసవపున్నయ్య, లాహిరి, బిరేన్ మిశ్రా (అస్సాం) వున్నారు. అధికారి లేడనుకుంటాను. కేంద్ర కమిటీలో వున్నాడు. ఇలా కొత్త పి.బి. ఏర్పడింది. రాజేశ్వరరావు, బసవపున్నయ్య కేంద్రంలో వుండి కార్యకలాపాలు నిర్వహించాలనీ, నేను మళ్ళీ వెనక్కి వచ్చి యిక్కడ పని చూసుకోవాలనీ అనుకున్నాం.

ఇప్పుడొక కొత్తనినాదం 'తెలంగాణా మార్గమే మన మార్గం' అన్నది. మళ్ళీ యిదొక పొరపాటు ధోరణి. పక్కనే వున్న సరిహద్దుల్లో ఆంధ్రలోనే ఆ పోరాటం విస్తరించలేకపోయాము. మరి అపరిపక్వత అంటే ఇదే. ఆ సైద్ధాంతిక అపరిపక్వతే అలాంటి ధోరణులకు తావిస్తున్నది. తాత్కాలికంగా అప్పుడు చేయవలసిందల్లా తెలంగాణాలో ఆయుధాలు దించకుండా వుండడమే. సాయుధ పోరాటానికి పిలుపు యివ్వగానే రాష్ట్రమంతటా ఒక్కసారి పోరాటం విజృంభిస్తుందని అర్థం కాదు క్రమేపి పరిస్థితులు అనుకూలమయ్యేకొద్దీ సాయుధపోరాటం కొనసాగించాలి. పోరాటం సాగుతున్నకొద్దీ ఫలితాలు వస్తాయి. చైనాలో 30 సంవత్సరాలు సాగింది.

ఇక్కడింకో ఆలోచన వుంది. ప్రజలు వారి పోరాట సంసిద్ధత అన్నది. 'తెలంగాణాలో పోరాటం సాగుతున్నదికదా మిగతా చోట్ల ఎందుకు సాగదు?' అంటే తెలంగాణాలో మంచి తిరుగులేని నాయకత్వం వుంది. మిగతా రాష్ట్రాలలో నాయకత్వం అంతా కార్మికవర్గ

పోరాటాలంటున్నారు. అది కార్మికవర్గం నుంచి వచ్చిన నాయకత్వం. వాళ్ళు రైతాంగ పోరాటపటిమను చూడలేకపోతున్నారు. ఎందుకంటే ఆ సమయంలోనే పశ్చిమ బెంగాల్‌లో కాక్‌దీవ్, త్రిపుర, ఉత్తరప్రదేశ్‌లో కొన్ని చోట్ల ఇలా 'రైతాంగపోరాటాలు వచ్చినవిగదా. అంతకుముందుగానే అనుకోండి తెభాగా, వున్న ప్ర–వాయిలార్ పోరాటాలు వచ్చాయి. కనుక నాయకత్వం కొంచెం ముందుగా మేల్కొని రైతాంగానికి పిలుపు యిచ్చి వుండాల్సింది. కార్మిక వర్గం ఆ తర్వాత వచ్చి అనుకూల సమయంలో చేరేది. ఈ అవగాహన కూడా వుంది.

తెలంగాణా పోరాటం సాగుతూనే వున్నది కదా. భారతసైన్యం ప్రవేశించి రెండు సంవత్సరాలు దాటినా పోరాటం సాగుతూనే వున్నది. భారత సైన్యాలు మనలను మించిపోయేంతగా వున్నాయన్నది వేరే సంగతి. ఇక ఇప్పుడేం చెయ్యాలి. ఆయుధాలు దించుదామా అంటే శత్రువు వూచకోతకోస్తాడు. కనుక యింకా ప్రజానీకం కలిసివచ్చే దాకా పోరాటం కొనసాగించాల్సిందే. ఎంత కాలమని ఒక్క తెలంగాణాలోనే పోరాటం సాగించగలం. ఇతర ప్రాంతాలు కూడా తెలంగాణాలోలాగా ఆయుధాలు తీసుకోవాలి.

ఇక్కడ సహజంగా నన్నొక ప్రశ్న అడుగుతుంటారు. ప్రత్యక్షంగా తెలంగాణా పోరాటాన్ని నిర్వహిస్తున్న ముఖ్యులలో మీరు అంటే నేను ముఖ్యులు కదా. కొత్తగా ఎన్నికైన పొలిట్‌బ్యూరోలో మీరెందుకులేరు అని. నేను జోషీ పంథాను వ్యతిరేకించలేదని చెప్పానుగదా. పైగా మొత్తం భారతదేశ వుద్యమాన్ని ఆంధ్ర కామ్రేడ్స్ నిర్వహించలేరు. కనుక పి.బి.లో ఇతరులు కూడా వుండాలి.

ఈ లోపల 1950లో రిపబ్లిక్ ఏర్పడింది. ఆ సందర్భంగా కామ్రేడ్స్‌ను విడుదల చేయడం ఆరంభించారు. పైగా ప్రభుత్వానికి కూడా యీ విభేదాలు. చర్చలూ తెలుస్తున్నాయి. డాంగే, అజయ్‌ఘోష్ మొదలైన వాళ్ళు జైలు నుండే బి.టి.ఆర్. విధానాన్ని వ్యతిరేకిస్తూ వుత్తరాలు రాశారు. అవి కూడా ఈ విడుదలకు దోహదం చేశాయి.

అజయ్‌ఘోష్, డాంగే, ఘాటే వాళ్ళు వచ్చిన తర్వాత "తెలంగాణా మార్గమే మన మార్గం" అన్న నినాదాన్ని ఖండించారు. ముగ్గురి 'శాంతి' డాక్యుమెంటు అని దాన్ని పిలిచేవాళ్ళు. డాంగేకు లండన్‌లో పామీ దత్తుతో ఒక విద్యార్థి ద్వారా సంబంధం వుంది. పామీ దత్తు ఈ మొత్తం 'తెలంగాణా మార్గమే మన మార్గం' అనే సిద్ధాంతాన్ని తప్పు అని విమర్శించారు. ఆయన రాసిన ఉత్తరాన్ని బి.టి.ఆర్. కేంద్ర కమిటీకి పరిశీలించమని పంపాడు. అయితే ఆ ఉత్తరం ముందు అజయ్‌ఘోష్‌కు అందింది. అది తమ ధోరణికి అనుకూలంగా వుంది. అందుకని వాళ్ళు దాన్ని ప్రచురించారు.

దాని ప్రత్యక్ష ప్రభావం తెలంగాణా పోరాటం మీద వుండడం సహజం. మేము పామీ దత్తు ఉత్తరంలోని అంశాలను తిరస్కరించాము. పామీ దత్తుకు ఇక్కడి పరిస్థితులు అర్థం కాలేదు. కనుక యిలా రాశాడని కొట్టిపారేశాము. కానీ వాళ్ళూ ఆ విధానంలోనే వున్నారు కదా. అందుకని పార్టీలో కొంత వరకూ బాహాటంగానే అంతర్గత చర్చ జరిగింది.



ప్రధాన అంశం ఏమంటే, బి.టి.ఆర్. ఒంటెత్తు విధానం "దాన్ని వ్యతిరేకిస్తూ మా విధానం "తెలంగాణా మార్గం". దీన్ని కాదంటూ డాంగే, అజయ్ ఘోష్, ఘాటేల వాదన పార్టీలో అంతర్గత పోరాటం తీవ్రంగానే ఆరంభమైంది.

తెలంగాణా పోరాటం సాగుతూనే వున్నది. నిర్బంధం తీవ్రమైంది. కామ్రేడ్స్‌ను కాల్చేస్తున్నారు. భారత సైన్యాలు ప్రవేశించిన తర్వాత రావి నారాయణరెడ్డి, ఎల్లారెడ్డి మొదలైన నాయకులలో తెలంగాణా పోరాటం సాగించడంపట్ల వ్యతిరేక అభిప్రాయం వుంది. "భారత సైన్యాలు వచ్చాయి. మన దళాలు నిలువ లేకపోతున్నాయి. ఇక పోరాటాన్ని సాగించడం కష్టసాధ్యం కనుక పోరాట విరమణ చెయ్యాలి'' అన్నది వారి వాదన. ఆ వాదన తిరస్కరింపబడింది.

కానీ వాళ్ళు తమ వాదన మాత్రం వదులుకోలేదు. మెజారిటీ నిర్ణయానికి కట్టుబడి పని చేస్తున్నారు. ఎల్లారెడ్డి 1949లో అరెస్టు అయినాడు. నారాయణ రెడ్డి రహస్య జీవితంలో వుంటున్నాడు. ఆ తర్వాత నిర్బంధం మరీ ఎక్కువైంది. మానుకోట ప్రాంతంలో బి.ఎన్. వున్నాడు. అక్కడేవో గొడవలు వచ్చాయి. అనుమానంపై దళంలో వాళ్ళనే కాల్చడం ఇలాంటిది. అనుమానంపై ఎవర్నీ అంతం చేయకూడదు. వాళ్ళని దూరం చేయాలి అన్నది విధానం. రాజేశ్వరరావు వాళ్ళవాదన ఏమంటే, అలాంటి వాళ్ళను దూరం చేస్తున్నామని, వదిలిపడితే పార్టీకే ప్రమాదకరంగా పరిణమిస్తారు కనుక వుంచకూడదు అని. అయినా మేము చెప్పిందే అంగీకరించినా ఒకటి రెండు ఘటనలు అలా జరిగాయి.

రావి నారాయణరెడ్డి ఈ పోరాటం సాగించడం తప్పు అంటూనే వున్నాడు. పైగా ఎంతో నష్టపోతున్నాం. ఇలాంటి ఘటనలు కూడా తోడైనాయి. పోరాటం విరమించేట్లు కనబడడంలేదు. ఇక లాభం లేదనుకుని ఆయన మాకెవ్వరికీ చెప్పకుండానే రహస్య స్థావరాన్ని వదిలి వెళ్ళిపోయారు. ఆయన వెళ్ళిన తర్వాత తాను బొంబాయి వెళ్ళి ఈ తెలంగాణా పోరాటం సాగించే లైను మార్పించేందుకు వెళ్తున్నానని అక్కడ ఒక చీటీ చూశాము.

ఆయన అలా వెళ్ళడంలో కూడా ప్రమాదం లేదా అంటే వుండొచ్చు. కానీ రావి నారాయణరెడ్డి అంతటివాణ్ని కాల్చేస్తే వచ్చే ప్రతిస్పందన కూడా ప్రభుత్వం గమనంలో వుంచుకుంటుంది. ఉదాహరణకు రాజ్‌బహదూర్ గౌడ్‌ను, యింకో ఇద్దరు దళ సభ్యులను కలిపి ప్రభుత్వం అరెస్టు చేసింది. మిగతా యిద్దర్నీ కాల్చేశారు. రాజ్‌బహదూర్‌గౌడ్‌ను మాత్రం కాల్చలేదు. ఆయన ప్రభుత్వానికి లొంగిపోయాడేమో అంటారు. కావచ్చు, కాకపోనూ వచ్చు. ప్రభుత్వమే రాజబహదూర్ గౌడ్ స్థాయి చూసి, తర్వాత పరిణామాలను దృష్టిలో వుంచుకుని ఆగివుండవచ్చు. ఎవరం ప్రత్యక్ష సాక్షులం లేముకదా.

సరే రావి నారాయణరెడ్డి వెళ్ళిన తర్వాత ఒక డాక్యుమెంటు వెలువరించాడు. తెలంగాణా పోరాటం అంతా దుందుడుకువాద చర్యలుగా మిగిలిపోయిందనీ, ప్రజామద్దత్తులేదనీ, దళాలు సృష్టిస్తున్న బీభత్సమేననీ, పై పెచ్చు ఎవరన్నా ఆ విధానాన్ని వ్యతిరేకిస్తే సహించే

స్థితిలో లేరనీ, వాళ్ళని కూడా ఖతం చేసే పరిస్థితులు వున్నాయనీ ఇలా వుంది. బసవపున్నయ్య రాసిన "తెలంగాణా సాయుధ పోరాటం వాస్తవాలు" అన్న పుస్తకంలో ఆ డాక్యుమెంటూ, దానికి ఆయన సమాధానమూ వుంది. 1950 చివర్లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో ఆయనను కేంద్ర కమిటీ సభ్యత్వం నుంచి తొలగించారు. ఆ తర్వాత మళ్ళీ ఆయన అలా రాయడం తప్పు, అయినప్పటికీ అప్పుడున్న పరిస్థితులలో ఆయన అలా రాశాడు. కనుక తిరిగి కేంద్ర కమిటీలోకి తీసుకోవచ్చుననుకున్నారు.

పార్టీలో అంతర్గత విభేదాలు తీవ్రస్థాయిలో వున్నాయి. ఎలా పరిష్కరించుకోవాలి. అందుకని ఇక్కడ నుండి ఒక ప్రతినిధి వర్గాన్ని మాస్కో పంపి, స్టాలిన్ సలహా తీసుకోవాలని నిర్ణయించుకున్నాం. 1951 మధ్య భాగంలో మన ప్రతినిధి వర్గం రష్యా వెళ్ళి స్టాలిన్ తదితరులతో చర్చించి వచ్చారు. ఆ ప్రతినిధి వర్గంలో బసవపున్నయ్య, రాజేశ్వరరావు, అజయ్‌ఘోష్, డాంగే వెళ్ళారు. ముగ్గురి 'శాంతి' డాక్యుమెంటు వుండనే వుంది. ఘాటే నిజాయితీ, క్రమశిక్షణ వున్నప్పటికీ ఆ స్థాయిలో వాడు కాదుగనుక వెళ్ళలేదు. అక్కడ చర్చల వివరాల జోలికి వెళ్ళబోవడంలేదు. వాళ్ళు చర్చించి వచ్చారు.

తెలంగాణా పోరాటం అన్నింటిలోనూ ప్రధానమైన అంశం. ఆ పోరాటం సాగించాలా? వద్దా? తెలంగాణా పోరాటాన్ని విముక్తి పోరాటంగా భావించడం పొరపాటు అన్నది అందరూ అంగీకరించారు. అది పాక్షిక సాయుధ గెరిల్లా పోరాటం మాత్రమే.

అప్పుడున్న శక్తుల బలాబలాలను దృష్టిలో వుంచుకుని వున్నంతలో ఉత్తమమైన పరిష్కారానికి సర్వవేళలా సన్నద్ధంగా వుండాలి – యిదీ అవగాహన. కనీస షరతులు ఎలా వుండాలి? మనం అనుకున్న షరతులను సాధించుకునే వరకూ, ప్రభుత్వం అందుకు లొంగి వచ్చేవరకూ పోరాటం సాగించాలా? లేదా పోరాట విరమణ చెయ్యాలా అన్న ప్రశ్న వచ్చింది. పోరాట విరమణ అంటే మన రహస్య స్థావరాలలో వుండి పోరాటం విరమించామని ప్రకటించడం కాదు. పోరాడుతున్న కార్యకర్తలను విశ్వాసంలోకి తీసుకుని, వారిని ఒప్పించాలి. విముక్తి పోరాటం అన్నది యింత సువిశాల దేశంలో ఏదో చిన్న ప్రాంతంలో సాగించవలసింది కాదు కనుక మనం కొన్ని షరతులతో పోరాట విరమణ చెయ్యాలి. ఏమిటా షరతులు. ఇవన్నీ ఆంధ్రకు తిరిగి వచ్చి కామ్రేడ్స్‌తో చర్చించి ఒప్పించాలి. అందుకై నేనూ, దేవులపల్లి తిరిగి వచ్చాము. పునర్నిర్మింపబడిన పి.బి.కి అజయ్‌ఘోష్ కార్యదర్శి బసవపున్నయ్యకూడా పి.బి.లో వున్నాడు. కాని ఆంధ్రకు వచ్చి, ఈ విషయంపై సహకరిస్తూ, సూచనలిస్తూ వుండాలి కనుక ఆయన కూడా తిరిగి వచ్చాడు. రాజేశ్వరరావు ఆంధ్ర తరపున పి.బి.లో కేంద్రంలో వుండాలి.

ఇక్కడకు వచ్చిన తర్వాత దళాల వద్దకు వెళ్ళాలి. ఈ నూతన అవగాహన వారికి విడమర్చి వివరించాలి. ఏ షరతులతో విరమించాలో వారితో చర్చించి నిర్ణయించుకోవాలి.



దాన్నిబట్టి పార్టీ కేంద్రం, ఏ ఏ అంశాల మీద కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలో కేంద్రానికి తెలియజేయాలి. అప్పుడు వాళ్ళు చర్చలకు పూనుకోగలరు. 1951 మే ఆ ప్రాంతాలలో ఈ నిర్ణయానికి వచ్చామనుకుంటాను.

ఈ లోపల రావి నారాయణరెడ్డి వాళ్ళు తక్షణ పోరాట విరమణ గూర్చి ప్రచారం సాగిస్తూనే వున్నారు. తక్షణ పోరాట విరమణ అన్నది కేంద్ర కమిటీ విధానం కూడా కాదు. మనం దళాల వద్దకు, ప్రజల వద్దకూ వెళ్ళాలి. వారికి పరిస్థితి వివరించాలి. ప్రజలు ఈ పోరాటంలో సాధించుకున్న భూములను అనుభవించే హక్కు పొందడం, ప్రజాస్వామ్య హక్కులు సాధించుకొనడం – ఇవన్నీ జరగాలి. మన దళాలకు తగిన రక్షణ గ్యారంటీ పొందకుండా, జైళ్ళలో వున్న వారిని విడుదల చేయించుకోకుండా పోరాట విరమణ చెయ్యడం అంటే ఏకపక్షంగా మనం పోరాట విరమణ చేసినట్లు అప్పుడంతా ప్రభుత్వం దయాదక్షిణ్యాలపై ఆధారపడి వుంటుంది.

అందుకని, అంత వరకూ ప్రతిఘటన సాగించాలి. మనంత మనముగా దాడికి పూనుకునే సమస్యకాదు. అంటే ఆత్మరక్షణకై ప్రతిఘటన చేసుకోవాలి. ఈ విషయం ప్రజలకు వివరించాలి. క్రమపద్ధతిలో వెనక్కి తగ్గాలి. అది చాలా ముఖ్యం. ఆరుట్ల రామచంద్రారెడ్డి, ముగ్దుం, దేశపాండే, చందుచౌదరి మొదలైన వారు జైళ్ళలో ఉన్నారు. వాళ్ళు చాలా హడావిడి పడుతున్నారు. తక్షణం పోరాట విరమణ జరగాలనీ, ఇదంతా టెర్రరిజం తప్ప మరొకటి కాదనీ జైళ్ళ నుండి ఉత్తరాలు రాయసాగారు. మనం వారి వైఖరిని ఖండించాం. తెలంగాణా పోరాటం గూర్చి నిర్ణయించే హక్కు వారికిలేదని ప్రకటించాం. మరొక కమిటీని కూడా వేరే వేసుకున్నారు. దాన్ని మేం గుర్తించలేదు.

ఈలోగా అజయ్‌ఘోష్ "మీరింకా పోరాటం సాగిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. మీరు తక్షణం పోరాట విరమణ చేసినట్లు ప్రకటించాలి. లేకపోతే మీతో మాకెలాంటి సంబంధంలేదని మేము కేంద్రం నుండి ప్రకటించాల్సి వస్తుంది" అని అన్నాడు. దాని మీద చంద్రానికి బాగా కోపం వచ్చింది. "నిర్ణయమేమో వెళ్ళి దళాలకు పరిస్థితి వివరించాలని. ఆ పని చేసేందుకు తగిన సమయం కూడా యివ్వకుండా కూడా మాకేమీ మీతో సంబంధంలేదని ప్రకటిస్తామంటే సరే ప్రకటించండి. మీతో మాకూ ఏమీ సంబంధంలేదని మేమూ ప్రకటిస్తాము. మా పోరాటం కొనసాగిస్తాం. ఎప్పుడు ఎలా పోరాట విరమణ చెయ్యాలన్నది యిక్కడి పరిస్థితిని బట్టి మేము నిర్ణయించుకోవాలి. అక్కడ కూర్చుని తాఖీదులు పంపితే జరిగే పనికాదు. అలా మీరు ప్రకటిస్తే పోరాడుతున్న ప్రజలకు ఆగ్రహం తెప్పించిన వారవుతారు. మీ ప్రకటనతో మాకేమీ సంబంధంలేదని మేము ప్రకటిస్తాము" అని అన్నాడు. దాంతో అజయ్ ఘోష్ చల్లబడ్డాడు.

# దళాల దగ్గరకు...

దళాలకు చెప్పి వొప్పించటం చాలా కష్టమైంది. అయితే, నాయకత్వం ఒక నిర్ణయాన్ని చేసిన తర్వాత దానికి భిన్నమైన నిర్ణయంపట్ల వారికి ఎంతో విశ్వాసం వుంటే తప్ప నాయకత్వ నిర్ణయాన్ని త్రోసిపుచ్చరు. మేదరమెట్ల సీతారామయ్య, అరిబండి లక్ష్మీనారాయణ, కె. నారాయణ వంటి వాళ్ళు 'పి.ఎస్. వచ్చి చెప్పాడుగనుక, ఆయనపై మాకుగల భక్తి విశ్వాసాలతో, అది సరైన నిర్ణయం అయివుంటుందన్న నమ్మకంతో అంగీకరించాముగానీ లేకపోతే వొప్పుకునే వాళ్ళంకాదు, అని ఆ తర్వాత అన్నట్లు తెలిసింది. అలాంటి దళ నాయకులకు సహజంగానే ఒక అభిప్రాయం వుంది. సరే పోరాట విరమణ చేద్దాము, మరి మన దళాలకు రక్షణ గ్యారంటీ ఏది? ఇంత పోరాటం జరిపిన తర్వాత విరమణ చెయ్యమనంగానే విరమణ చేయడం అంత తేలిగ్గా వుండదు. వారందరికీ తగిన రక్షణ వుంటుందని, కేంద్ర ప్రభుత్వ హామీ వుంటుందనీ, అలా వుండే వరకూ ఆయుధాలు దించనక్కరలేదనీ విశ్వాసం కల్గించగలగాలి. వాళ్ళకూ ఒక విషయం స్పష్టంగానే వుంది. ఇక ఈ ధోరణిలో పోరాటాన్నీ కొనసాగించలేము. ఇప్పటికే గ్రామాలు వదిలి అడవులలోకి తరిమి వేయబడ్డాము. తీవ్ర నష్టాలకు గురవుతున్నాము. అయినా వారికి సహజంగా వుండే సందేహాలు అనుమానాలు వుంటాయిగదా.

సాయుధ పోరాటమనేగాదు, ఏ పోరాటంలో అయినా వెనక్కి తగ్గాల్సి వచ్చినప్పుడు కొన్ని కనీస హామీలు పొంది వెనక్కి తగ్గుతాము. ఉదాహరణకు ఒక సమ్మె తీసుకుందాం. సమ్మె ఆరంభంలో కొన్ని కోర్కెలు ప్రభుత్వం ముందో, మేనేజిమెంటు ముందో వుంచుతాము. కానీ ఏవో కారణాలవల్ల సమ్మె విఫలం అవుతుంది. అప్పుడు కనీసం సమ్మె చేసే వారి ఉద్యోగహక్కు వంటివి అన్నా ప్రభుత్వం హామీ ఇవ్వకుండా సమ్మె విరమించలేము. ప్రతీకార చర్యలు ప్రభుత్వం వైపు నుండిగానీ, మేనేజిమెంటు వైపు నుండిగానీ ఉండవు అన్న కనీస హామీ పొందేవరకైనా సమ్మె సాగించాలి. రైతాంగ పోరాటాలైనా అంతే.

కనుక అలాంటి సందర్భాలలో నాయకత్వం చెయ్యాల్సిందేమిటి? ఓర్పుగా కార్యకర్తలు చెప్పేది వినాలి. కనీస హామీలు పొంది మాత్రమే పోరాట విరమణ జరుగుతుందన్న విశ్వాసం



వారిలో కలిగించాలి. అదీ సాధ్యంగాక పోరాట విరమణ చెయ్యాల్సి వస్తే పార్టీ వుంది, ఆదుకుంటుంది. తమను నట్టేట్లో ముంచదు అన్న ధైర్యం పార్టీ వారికి యివ్వగలగాలి.

మనకు రెండు ప్రధాన కేంద్రాలున్నాయి. నల్లమల్ల అడవి ప్రాంతంలో ఒకటి. దానిని అమరాబాద్ ఏరియా అనేవాళ్ళం, కృష్ణానదిని ఆనుకొని వున్న నల్గొండ, మహబూబ్‌నగర్, గుంటూరు, కర్నూలు ఈ ప్రాంతంలో వుండేవి. గోదావరి ప్రాంతంలో రెండు ఏరియాలున్నాయి. ఒకటి ఖమ్మం ప్రాంతం అక్కడ గిరి ప్రసాద్, బొంబే ప్రసాద్ తదితరులు వుండేవారు. దానితో అంతకుముందు ఒక సంవత్సరంగా సంబంధాలు తెగిపోయినాయి. రెండోది నల్గొండ, కొంత భాగం వరంగల్. వాళ్ళు మానుకోట ఏరియాకు వెళ్ళి, అక్కడ నుండి సిరిపూర్ కాగజ్ నగర్ ఏరియాకు వెళ్ళారు. ఆ మానుకోట ఏరియా అయితే కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఏరియా మరొక ఉప ఏరియాగా వుండేదిగానీ, దానితో మానుకోట – వరంగల్ ఏరియాకు, మాకూ సంబంధాలు వున్నాయి. అక్కడ ఏసిరెడ్డి నర్సింహారెడ్డి వాళ్ళు వుండేవారు. ఏమైనా మానుకోట, వరంగల్ ఏరియా మన ప్రధాన శక్తి.

మానుకోటలో మన వాళ్ళలోనే భేదాలు, అనుమానాలు వుండి కాల్చుకునే దాకా వెళ్ళారని చెప్పానుగదా. అక్కడికి భీమిరెడ్డి నర్సింహారెడ్డిని పంపాము. వారిలో అంతఃకలహాలను పోగొట్టి ఐక్యపరిచేందుకు బి.ఎన్. వెళ్ళేవరకూ అంత గుర్తింపు పొందిన నాయకుడు అక్కడ లేడు.

కేంద్ర కమిటీ నిర్ణయం తీసుకున్న తర్వాత ఈ ప్రాంతాలకు ఎవరిని పంపాలి అనుకుని, అమరాబాద్ ప్రాంతం నేను వెళ్ళాను. దేవులపల్లిని మానుకోట, వరంగల్ ప్రాంతానికి పంపాము. అక్కడకు వెళ్ళి పరిస్థితిని, అవగాహనను వివరించి ఏ షరతులు సాధించాలో చర్చించాలి. ఏమైనా పోరాట విరమణ చేయాల్సి వుంటుందని కూడా నచ్చచెప్పాలి. ఫలానా తేదీకల్లా తిరిగి వచ్చి చర్చల వివరాలను పరస్పరం చర్చించుకొని నిర్ణయానికి రావాలి. అందుకు తేదీ కూడా నిర్ణయించుకునే వెళ్ళాము.

ముజఫర్ అహమ్మద్, అజయ్‌ఘోష్ తదితరులు పార్టీ కేంద్రం నుండి కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని కూడా నిర్ణయమైంది. మేము సూచించిన కనీస హామీలు పొందేట్లు వారు కృషి చేయాలి. అలాగే తెలంగాణా పోరాటాన్ని దేశ వ్యాపిత విముక్తి ఉద్యమంగా భావించరాదనీ, కొన్ని పాక్షిక కోర్కెలపై ప్రజానీకం సాగించిన పోరాటమనీ, ఆ కోర్కెలను ప్రభుత్వం అంగీకరించాలని, కేంద్ర విధానానికి అనుగుణంగా ప్రచార కార్యక్రమం సాగించాలి. ఎన్నికలలో పాల్గొనాలని కూడా నిశ్చయించాము. ఎన్నికలలో పాల్గొనాలంటే అందుకు అనువుగా బహిరంగంగా పని చేయగల రాజకీయ వాతావరణం పునరుద్ధరింపబడాలి.

అక్టోబరులోగా మన పార్టీ నిర్ణయం తెలియజేయాలి. అంటే జులై, ఆగస్టు, సెప్టెంబరు ఈ మూడు నెలలు కీలకమయినవి. ఈలోగా మనం మన కార్యకర్తలకు వివరించి నిర్ణయాలు గైకొనాలి.

నేను అమరాబాద్ ప్రాంతానికి, దేవులపల్లి మానుకోట, వరంగల్ ప్రాంతానికి ఆ పనిపై వెళ్ళామని చెప్పానుకదా. దేవులపల్లిది వాస్తవాలపై ఆధారపడి మాట్లాడేస్వభావం కాదు. ప్రజా నాయకుడుకాదు. ఏమైనా నాకు మాత్రం ఆయనంటే గౌరవం వుండేది కాదు.

తెలంగాణా పోరాటంపై దేవులపల్లి రాసిన దానికి సమాధానం రాశాను. కాని మన బి.ఎన్.కు ఆ సమాధానం అంతగా నచ్చలేదు. "మీరు ఆయన లేవనెత్తిన అంశాలకు సమాధానం యివ్వడంతోనే సరిపుచ్చుకున్నారు. అసలు ఆయన పాత్రను ఎండగట్టలేదు. విజయాలు వస్తే తనవల్లననీ, అపజయాలు వస్తే మిగతా వారి వల్లననీ అనే తత్వం ఆయనది. అదీగాక ఆ సమాధానంలో గెరిల్లా దళాలు నిర్వర్తించిన ఉజ్వల పాత్ర గూర్చి, నా (బి.ఎన్) పాత్ర గూర్చి చెప్పలేదు" అన్నది బి.ఎన్. వాదన. నిజమే బి.ఎన్. రంగం మీద కమాండర్.

బి.ఎన్. ఏదో రాస్తాడని అనుకుంటున్నాను. అంత తేలిక కాదు. బి.ఎన్. తదితర కామ్రేడ్స్ వీరోచితకృత్యాలు నా "వీర తెలంగాణా విప్లవ పోరాటం – గుణపాఠాలు" పుస్తకంలో రాయాలని బి.ఎన్. అభిప్రాయం.నిజమే కానీ 1952 నుండి మనం బహిరంగంగా పని చేస్తున్నాం. అవన్నీ రాయడంలో కొన్ని చిక్కులు వున్నాయి. నేను చనిపోయిన వారిని గురించో, ఉద్యమానికి ద్రోహం చేసిన వారిని గురించో మాత్రమే రాయగలను. ద్రోహం చేసిన వారిని గూర్చి గొప్పగా రాయలేనుకదా.

అలాగే హనుమంతరావు, గంగాధరరావు "మీరు రావి నారాయణరెడ్డికి ఎల్లారెడ్డికి అనవసరమైన పొగడ్త యిచ్చారని" అన్నారు. వాళ్ళు అర్హులు అనుకున్నంత వరకూ ఇచ్చాను. మనం ఏది రాసినా సమతూకంలో రాయాలి. వాళ్ళు తెలంగాణా పోరాటంపట్ల తీసుకున్న వైఖరిపై విమర్శ కూడా నా పుస్తకంలో వుంది. నిజానికి నారాయణరెడ్డి, ఎల్లారెడ్డి మధ్య కూడా తేడా వుంది. ఎల్లారెడ్డి జైల్లో వున్నాడు. జైలు నుండి ప్రకటన యిచ్చేందుకు ఆయన నిరాకరించాడు. జైలు అధికార్లు వొత్తిడి తెచ్చినా "నా విభేదాలు నాకున్నాయి. కానీ ప్రకటన చేసే అర్హత నాకులేదు. నేను ప్రకటన చేస్తే బయట వున్న కామ్రేడ్స్, ఉద్యమమూ నష్టపోతుంది. ప్రకటన చేయాల్సి వచ్చినా వాళ్ళు చెయ్యాలి. నేను కాదు" అని ఖండితంగా చెప్పాడు.

దేవులపల్లి మానుకోట, వరంగల్ కామ్రేడ్స్‌కు నచ్చజెప్పడంలో విఫలమైనాడు. అక్కడ బి.ఎన్. వున్నాడు. బి.ఎన్. పలుకుబడి అక్కడ ఎక్కువ. ఆయన వొప్పుకోవాలి. ముందు చంద్రం, బసవపున్నయ్య రాష్ట్ర కేంద్రంలో వుండి సమన్వయం చేస్తున్నారు. రాజేశ్వరరావు సంప్రదింపులలో వున్నాడు. వీటి మధ్య సంబంధాలు కూడా సక్రమంగా కొనసాగేవికావు. ఒక్కొకప్పుడు తెగిపోయేవి.

ఏది ఏమైనా, ఒక నిర్ణయం అక్టోబరులోగా తీసుకోవాలి. అందరం, రహస్య కేంద్రంలో కలుసుకున్నాం. దేవులపల్లి వెళ్ళిన ప్రాంతానికి నేను తర్వాత వెళ్ళవలసి వచ్చింది. అది వేరే విషయం, తర్వాత చెప్తాను.



ఆ లోపల డాక్టర్ జయసూర్య ద్వారా జోక్యానికై నెహ్రూ యత్నించారు. ముందు మీరు పోరాటం విరమించండి. ఆ తర్వాత ఎవరికీ ఉరిశిక్షలు, యావజ్జీవ కారాగార శిక్షలు పడకుండా హామీ యిస్తాను. రైతాంగం సాధించుకున్న భూములు" వాటి సంగతి సానుకూలంగా పరిశీలిస్తాను. ఎన్నికలు ఎటూ పెడుతున్నాం కదా. పౌర హక్కులు అవీ పునరుద్ధరింపబడతాయి. ఏమైనా, ముందు మీరు పోరాట విరమణ చేయండి" ఇదీ నెహ్రూ పదేపదే చెప్పే సంగతి.

"ఆ హామీలన్ని యిస్తామని మీరు ప్రకటించకుండా ఎలా విరమిస్తామని" పదేపదే మా మాట.

కాగా పార్టీ నాయకత్వం నుండి, జైల్లో నుండి విరమణకు వొత్తిడి పెరగసాగింది. కనుక దేవులపల్లి రాకుండానే మేము నలుగురం – నేను, చంద్రం, బసవపున్నయ్య రాజేశ్వరరావు సమావేశమై పోరాట విరమణ నిర్ణయం తీసుకోవలసి వచ్చింది. నేను అమరాబాద్ వెళ్ళి, అక్కడ కామ్రేడ్స్‌కు నచ్చచెప్పి, వొప్పించి వచ్చానుగదా. దేవులపల్లి వొప్పించలేదని తెలుసు. బి.ఎన్. మొదలైన వాళ్ళు దేవులపల్లి చెప్తే అంత సులభంగా అంగీకరించరు. ఆదిలాబాద్, కరీంనగర్ ఏరియా నుండి వాసుదేరావు వాళ్ళని వొప్పించివచ్చాడు. ఖమ్మం వాళ్ళతో సంబంధాలు లేవు. ఎల్లమందారెడ్డి తన దళంతో నెల్లూరు వెళ్ళిపోయాడు. మేం అడిగాం "మా అనుమతి లేకుండా దళాలతో ఎందుకు పోరాటం విరమించి వెనక్కి వెళ్ళారు. రక్షణ కోసం అడవులలోకి వచ్చాం. మరి యిప్పుడు రక్షణ ఎలా? ఇదేం చూసుకోకుండా ఎన్నికలకు సమాయత్తం అవుదామనా?" అని కానీ, అంతకన్నా ఏం చేయగలం? దళాలు వెళ్ళి పోయినాయి కదా. అంటే, తెలంగాణా పోరాటానికి ద్రోహం చేయడమే.

అక్టోబరు 18 తేదీన కలుసుకున్నాం. ఈలోగా కేంద్రం నుండి వొత్తిడి. "మీరు నిర్ణయాన్ని ఆలస్యం చేస్తున్నారు." అని. దానికితోడు జైల్లో వున్న ముగ్దుం, రాజబహదూర్‌గౌడ్ తామే కమిటీ అని ప్రకటించుకున్నారని చెప్పానుగదా. ఆ కమిటీని అజయ్‌ఘోష్ గుర్తిస్తున్నాడు. అలా గుర్తించటాన్ని మేము వ్యతికిస్తున్నాం. అది లీగల్‌గా వుంటున్న కమిటీ కదా అని ఆయన వాదన. నిజమే లీగల్‌గా వుంటున్నది. అయినా మా ఆధ్వర్యంలో అది పని చెయ్యాలిగాని, దాన్ని ప్రత్యేకంగా మానెత్తి మీదగా గుర్తించడం ఎలా సబబు అని మేము. మరి లీగల్ పనికి ఏదో కావాలి కదా అనే వాడు అజయ్‌ఘోష్. ఏదో కావాలంటే ఆ కమిటీనా గుర్తించేది? అయినా ఆయన దాన్ని గుర్తించేవాడు.

వాస్తవంగా అడవుల్లో, గ్రామాల్లో, రహస్యంగా వుంటున్న వాళ్ళు, పోరాడుతున్న వాళ్ళు వున్నారు. వాళ్ళ సహకారం లేకుండా, ఈ లీగల్ ప్రకటనలూ, అవి చేసినంత మాత్రాన పోరాటం ఆగుతుందా? అలాగే లీగల్ వాళ్ళ సహకారం లేకుండా ఆ పోరాటమూ, కామ్రేడ్స్ రక్షణా సాధ్యం కాదు. రెండు అంశాలూ వున్నాయి.

అయినా పోరాటాన్ని విరమిస్తున్నట్లు కేంద్ర నాయకత్వం కేంద్ర ప్రభుత్వంతో చెప్పింది. "మీరు సరే. ఆ బెజవాడ ముఠా విరమిస్తున్నారా? వాళ్ళు విరమిస్తున్నట్లు ప్రకటించకుండా మీరు ప్రకటించి ఏం ప్రయోజనం? వాళ్ళ ఆయుధాలు, వాళ్ళ రహస్య స్థావరాలు వారికుంటున్నంత కాలం, మిమ్మల్ని తిప్పలు పెడుతూనే వుండగలరు. గత మూడేళ్ళుగా అదే పని చేస్తున్నారు" అని కేంద్ర ప్రభుత్వం అజయ్‌ఘోష్, డాంగే వాళ్ళని అడిగేది.

అయితే, ఈ పరిస్థితి ఏర్పడిందంటేనే, పోరాటం కొనసాగించడం ఎంత కష్టంగా వుందో అర్థం అవుతుంది. అప్పుడే ఎన్నికలు, ఆ భ్రమలు వచ్చాయన్న మాట. భ్రమల సంగతి అటుంచుదాం. పోరాటం మాత్రం ఎలా కొనసాగించగలం?

ప్రధాన సమస్య, దళాలకు కేంద్ర కమిటీ విధానాన్ని నచ్చచెప్పి వొప్పించడం. అదంత తేలికైన పని కాదు. నేను రెండుసార్లు అమరాబాద్ ప్రాంతానికి వెళ్ళవలసి వచ్చింది. జులైలో మొదటిసారి. నిర్ణయం తీసుకున్న తర్వాత రెండవసారి ఎంతో ఓర్పుగా చెప్పాలి. వాళ్ళ సందేహాలు సంశయాలు అన్నీ వినాలి. మొదట్లో జులైలో వెళ్ళగానే నేను "ఇది కేంద్ర కమిటీ నిర్ణయం, అమలు జరపాలి. కనుక పోరాటం విరమించండి అని చెప్పలేనుకదా. ఇదిగో పరిస్థితులివి. దానిపై ఇంత చర్చ జరిగింది. అన్ని కోణాలు ఆలోచించాము. మన విజయాలు నిలుపుకునేందుకు తగిన హామీలు ప్రభుత్వం నుండి పొందుతున్నాము. అంతవరకూ ఆత్మరక్షణ చేసుకొంటూనే వుందాము. పైగా యిది విముక్తి పోరాటం కాదు. కిషన్ డాక్యుమెంటు వచ్చింది. ఇది పాక్షిక కోర్కెలపై జరుగుతున్న పోరాటం. ఏ హామీలు లేకుండా, పోరాట విరమణ చేయమని చెప్పము. పార్టీ మిమ్మల్నెప్పుడు నట్టేట్లో ముంచదు. సైద్ధాంతికంగా, ఆచరణాత్మకంగా ఆలోచించండి' అని నచ్చచెప్పాలికదా.

అంతేకాదు, "మీ అభిప్రాయాలన్నీ జాగ్రత్తగా పరిశీలిస్తాము. ఆ తర్వాతనే నిర్ణయం తీసుకుంటాము. తీసుకున్న తర్వాత మళ్ళీ వచ్చి రక్షణ కోసం ఏం చేయాలి, ఎటు మనం వెనక్కి తగ్గాలి. ఎలా తగ్గాలి. మన తదుపరి కార్యక్రమం ఏమిటి? ఎన్నికలలో ఏమి చేయాలి? ఇవన్నీ నిర్దిష్టంగా మీ ముందుంచుతాం. ఈ లోపల మీరు దాడులకు పూనుకోవద్దు. ఆత్మరక్షణ మాత్రం చేసుకోండి" అని చెప్పాను.

ఎన్నికల తర్వాత మేము ఒక మహాసభ జరిపాం. సుమారు 60, 70 మంది కామ్రేడ్స్ హాజరైనారు. తెలంగాణా పోరాటానికి సంబంధించిన విభేదాలు వున్నాయిగదా. అప్పటికీ చాలా మంది రహస్య జీవితం గడుపుతున్నారు. పోలీసులకు దొరికితే కాల్చేసేవారు. ఖమ్మం కామ్రేడ్స్‌ను అంతకుముందు కలవలేక పోయామని చెప్పానుకదా. అక్కడ కలిసి



మాట్లాడినప్పుడు ఆ కామ్రేడ్స్ చెప్పిందేమంటే, అప్పటికే పోరాటంలో వారు అలసిపోయారనీ, ఈ కేంద్ర కమిటీ లైను వాళ్ళకు ఆమోదయోగ్యమైందనీ గిరిప్రసాద్, బొంబే ప్రసాద్ లాంటి వాళ్ళు చెప్పారు.

మానుకోట ఏరియాలో కామ్రేడ్స్‌కు నచ్చచెప్పి వొప్పించేందుకు మేము నిర్ణయం తీసుకున్న తర్వాత రాజేశ్వరరావు వెళ్ళాడు. ఏదో మొక్కుబడిగా దేవులపల్లి వెళ్ళాడులే అని వూరుకుంటే కాదుగా ఏ యే రక్షణ చర్యలు తీసుకోవాలో అన్నీ చర్చించాలి. కామ్రేడ్స్‌ను విశ్వాసం కలిగించాలి. నిజానికి దేవులపల్లి కూడా అవసరమైన సహకారం అందించి ఈ నిర్ణయం అమలు జరిగేట్లు చూడాలి. అక్కడికి వెళ్ళిన తర్వాత రాజేశ్వరరావు తిరిగి వచ్చి కేంద్రానికి వెళ్ళాడు. మళ్ళీ ఎన్నికల ముందు వచ్చినట్లున్నాడు.

ఈ రోజు దేవులపల్లి తాను పోరాట విరమణకు వ్యతిరేకం అని చెప్పడం అబద్ధం. అంతకన్నా అబద్ధం స్టాలిన్ చెప్పనిమాట పోరాట విరమణ విషయంలో చెప్పినట్లు స్టాలిన్ నోట్లో మేమీమాటను మేముగా వుంచామని, ఇవన్నీ శుద్ధ అబద్ధాలు. పోరాట విరమణ నిర్ణయం తీసుకొనే సమయంలో దేవులపల్లి లేనిమాట మాత్రం నిజం. స్టాలిన్ ఏం చెప్పాడు? 'ఇది విముక్తి పోరాటం' అని మీరనుకోవటం పొరపాటు. ఇది పాక్షిక పోరాటమే అని. పాక్షిక పోరాటం అంటే విముక్తి అయ్యేంత వరకూ పోరాటమని అర్థం కాదుగదా. ఎప్పుడో సమయం చూసి బలాబలాలనుబట్టి వీలైనన్నీ షరతులు విధించి, హామీలు పొంది, పోరాట విరమణ చెయ్యాలి. ఆయన వెంటనే వెళ్ళి పోరాట విరమణ చెయ్యమని చెప్పలేదు. నిజానికి స్టాలిన్ అలా అననేలేదు. ఏ కమ్యూనిస్టు తక్షణమే వెళ్ళి పోరాట విరమణ చెయ్యమని చెప్పాడు. చెప్పనేలేదు. అది స్టాలిన్ పనికాదు. సాధారణంగా పోరాట స్వరూప స్వభావాలు విశదీకరించి ఎప్పుడు ఎట్లా విరమించాలో నిర్ణయించుకోండి అని ఆయన చెప్పాడు. ఆ మాటకొస్తే కేంద్ర కమిటీ కూడా మరుక్షణం పోరాట విరమణ చెయ్యమని చెప్పలేదు. ఎప్పుడు పరిస్థితిలో ఏ సదుపాయాలు, హామీలు సాధించి, పోరాట విరమణ చెయ్యాలన్నది. పోరాడుతున్న తెలంగాణా కామ్రేడ్స్ నిర్ణయించుకోవాలని చెప్పింది. మేము కూడా విముక్తి పోరాటం కాని దాన్ని అలాగే చివరి దాకా, అంటే విముక్తి దాకా సాగలాగటం కూడదనీ, అలా లాగలేమని, కనుక ఎలా పోరాట విరమణ చెయ్యాలన్న దానిని గురించే ఆలోచిస్తున్నాం.

విరమణ చెయ్యాలి. ఎవరెవరు, ఎలా వెనక్కి తగ్గాలి నిర్ణయించామని ప్రకటించి ఒకసారిగా బజార్న పడలేముకదా. ఎవరి మీద ఎలాంటి కేసులున్నాయి. యిలాంటివన్నీ నిర్ణయించుకోవాలి. పైగా ఎన్నికలలో పాల్గొనాలి. సరే విరమించాం. మమ్మల్ని ఏం చెయ్యమంటారు? అలాగే, ఎవరి కోసం పోలీసులు వెతుకుతున్నారు? తెలంగాణాలో వుండటం సాధ్యంకాని వారెవరు? ఎవర్ని ఎక్కడ వుంచాలి. యిలాంటి ప్రశ్నలన్నీ వుంటాయి.

ఈ సందర్భంలోనే కమిటీలో చర్చలు వచ్చాయి. బహిరంగంగా వున్న కమిటీ, మాతో సంప్రదించి నిర్ణయాలు తీసుకోవాలి. ఇంకా చెప్పాలంటే, మా మార్గదర్శక సూత్రాల కిందే అది పని చెయ్యాలి. అంతేగానీ, వారే కమిటీ అన్నట్లు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోకూడదు.

ఇందులో కొందరు తాము తమ వ్యక్తిగత పూచి మీద ఎక్కడికో వెళ్లి వుండగలం అన్నారు. కొందరికి కనపడితే చాలు పోలీసులు కాల్చేసే పరిస్థితి వుంది. రాజేశ్వరరావు మానుకోట ఏరియా వెళ్ళే సందర్భంలో ఆయనను, ఆయన వెంట వున్న వారి పోలీసులు చుట్టుముట్టి, కాల్పులు సాగించారన్న వార్త వచ్చింది. మేము చాలా ఆందోళన చెందాం. కానీ చివరికి తేలిందేమంటే అలాంటి పరిస్థితి వచ్చింది గానీ, కాల్పుల దాక వ్యవహారం వెళ్ళలేదని.

దేవులపల్లి మానుకోట ఏరియాకు వెళ్ళి వాళ్ళకు నచ్చచెప్పి నొప్పిచలేకపోయాడు. నచ్చచెప్పి ఒప్పించేందుకే ఆయనా వెళ్ళాడు ఇదీ వాస్తవం.

నేను ఫలానా పై కమిటీ సభ్యుణ్ణి, నన్ను గౌరవించండి అంటే ప్రజలు కూడా గౌరవించరు. నీవు నచ్చచెప్పే ధోరణి, వారితో మాట్లాడే తీరు ఇవన్నీ వారిపై ప్రభావాన్ని కలిగిస్తాయి.

మాస్కోలో రాజేశ్వరరావు, బసవపున్నయ్య స్టాలిన్‌తో మాట్లాడిన అనంతరం యిక ఈ తెలంగాణా పోరాటాన్ని కొనసాగించలేము అని నిర్ణయానికి వచ్చారు. కనుక ఎంత త్వరగా విరమిస్తే అంత మంచిది అనుకున్నారు. కానీ, యిక్కడ మేము అందుకు సిద్ధంగా లేము. అంటే స్టాలిన్ చెప్పిన అంశంతో విభేదించే ప్రశ్నలేదు. దానిపై వేరే చర్చ కూడా లేదు. దేశ వ్యాపితంగా మాకు సహకారం దొరికితే పాక్షిక పోరాటంగా మరిన్ని హక్కులు, హామీలు లభ్యమయ్యే వరకూ సాగిస్తామని. వెంటనే విరమించాలన్నది డాంగే, అజయ్‌ల వాదన. అది సాధ్యం కాదు కొన్ని కనీస హామీలు, హక్కులు పొందే వరకూ సాగించాలి అన్నది మా వాదన. కేంద్ర కమిటీలో స్థూలంగా విరమణను అంగీకరిస్తూనే మేము కోరినట్లు చేయాలని మెజారిటీ వొప్పుకుంది.

ఇక్కడ రాజేశ్వరరావు – బసవపున్నయ్యతో కలిసి, వ్యవహరించి వుండాల్సింది. అలా కాకుండా, చాలా దీర్ఘకాలం సాగించాలని ఆయన అన్నారు. బసవపున్నయ్యకు కోపం వచ్చింది. “అదేమిటి, అక్కడ నువ్వు ఏమన్నావు? ఇప్పుడిలా అంటావేమిటి?” అని “అదేం లేదు మరిన్ని మంచి హామీలు పొందేందుకే” అని రాజేశ్వరరావు అన్నారు. సరే ఆ తగాదా అటుంచుదాం. ఏమైనా, తెలంగాణాలో పోరాడుతున్న వారికి నచ్చచెప్పి వొప్పించడం అన్నది ప్రధానం.



ఇవన్నీ చెబుతుంటే వ్యక్తిగతంగాగాని, మీకు తెలిసిన ఘట్టాలుగాక, ఆ అడవుల్లో కష్టాలు లేదా ఉత్తేజం కలిగించే సన్నివేశాలు ఏమన్నా చెప్పండి అని కామ్రేడ్స్ అడుగుతారని నాకు తెలుసు. ముందు ప్రధానమైన రాజకీయ విషయాలు చెప్పుకుందాం. అలాంటి ఘట్టాల గూర్చి కూడా తర్వాత చెబుతాను. ఎందుకంటే, వాటిల్లోకెళ్తే ఈ రాజకీయ విషయం మరుగున పడవచ్చు.

మేము అందరం బహిరంగంగా రాగల పరిస్థితి రాలేదు. వస్తే మమ్మల్నందర్ని అరెస్టు చేస్తే, మిగతా కార్యక్రమం నిర్వహించేందుకు ‘తలలేని కమిటీ’ అవుతుంది. కనుక అంతగా పోలీసుల నోళ్ళలో నాననివాళ్ళు ముందురావాలి. ఆ తర్వాత క్రమేపీ పరిస్థితులను బట్టి, బాగా ప్రజల దృష్టిలో, పోలీసుల దృష్టిలో ఉన్న వాళ్ళు ఒక్కరొక్కరుగా రావాలి. ఏం జరుగుతుంది. అన్నదాన్ని బట్టి ముందు వెనుకలు చూసుకోవాలి. స్థూలంగా అనుకున్నదిది.

# ఎన్నికలు - ఘన విజయాలు

ఎన్నికలు వచ్చాయి. బహిరంగంగా పని చేస్తున్న కమిటీ అభ్యర్థులను నిర్ణయిస్తున్నది మేము. వాటిని ధృవీకరిస్తున్నాము. పెద్దగా అభ్యంతరం చెప్పవలసింది వుండేది కాదు. కాకపోతే, వి.డి. దేశపాండే లాంటివాళ్ళను తీసుకువస్తేనే అభ్యంతరం. ఎందుకంటే దేశపాండే ఈ పోరాటాన్ని మొత్తంగా, తీవ్రంగా వ్యతిరేకించిన వాడు. అలాంటివానికి, మనకు చాలా బలమున్న జనగాం లాంటిచోట అభ్యర్థిగా నిలబెట్టడం చాలా అభ్యంతరకరంగా వుండేది. ఇలాంటివే తప్ప, మొత్తంగా చూస్తే దాదాపు మొత్తం అంగీకరించాము. రహస్య జీవితం గడుపుతున్న వాళ్ళను అభ్యర్థులుగా నిర్ణయించలేము. అందుకని అభ్యర్థులే తక్కువయ్యారు. ఉదాహరణకు, పెండ్యాల రాఘవరావును మూడు శాసనసభ స్థానాల్లనూ, ఒక పార్లమెంటు స్థానంలోనూ నిలబెట్టాం. కమ్యూనిస్టు పార్టీ పేరు మీద కాదు. కమ్యూనిస్టు పార్టీ నిషేధంలో వుంది. అందుకని పి.డి.ఎఫ్. (పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్) పేరుతో నిలబెట్టాము.

అభ్యర్థులు లేరు అంటే, కాస్త పేరు ప్రతిష్టలున్న వాళ్ళు అని అర్థం. అలాంటి వాళ్లలో ఎక్కువ మంది యింకా రహస్య జీవితమే గడుపుతున్నారు. ఎవర్ని పడితే వాళ్ళని పెట్టలేముకదా. అయితే తర్వాత ఫలితాలలో తేలిందేమంటే ఎవరో ఒకర్ని పెట్టినా గెల్చేవాళ్ళమని, పెండ్యాల రాఘవరావు రెండు అసెంబ్లీ సీట్లల్లోనూ, ఒక పార్లమెంటు సీటులోనూ గెల్చాడు.

అప్పుడు షెడ్యూల్డు కులాల సంఘంతోనూ, సోషలిస్టు పార్టీ వారితోనూ ఎన్నికల ఒప్పందం చేసుకున్నాం. అది కూడా ఉపయోగపడ్డది. నల్గొండ, వరంగల్ ఖమ్మంలలో వున్నంత లోతుగా కరీంనగర్‌లో మన పోరాటం, ఉద్యమం లేకపోయినా కరీంనగర్‌లో సోషలిస్టులు గెల్చేందుకు మన సహకారం కారణమైంది. ఏ రకం సోషలిస్టులు అన్నది వేరే ప్రశ్న. అలాగే వారి సహకారం కూడా మనకు ఉపయోగించి వుండవచ్చు. డాక్టర్ జయసూర్య పి.డి.ఎఫ్. తరపున పోటీ చేశాడు.

హైదరాబాద్ నగరంలో ఓడిపోయాము. కానీ చుట్టుపక్కల, మెదక్ అక్కడా గెల్చాము. ముగ్దుం హైదరాబాద్ నగరంలో ఒక్కచోటే నిలబడ్డాడు. ఓడిపోయాడు. అలాగే, వరంగల్



పట్టణంలో ఒక సీటు ఓడిపోయాము. మొత్తం మీద చెప్పాలంటే, బహిరంగ కమిటీ ఎంపిక చేసిన అభ్యర్థుల విషయంలో మేము అభ్యంతరమేమీ చెప్పలేదు. అప్పుడున్న స్థితిలో క్యాండిడేట్లే తక్కువ. రావి నారాయణరెడ్డి, ఎల్లారెడ్డి వాళ్ళలాంటి వాళ్ళు ఈ దేశపాండే లాంటివాళ్ళను మన బలమైన చోట్ల పెట్టినందుకు అభ్యంతరం చెప్పినా చెయ్యగలిగిందీ లేదు. అంతకన్నా ఆ స్థితిలో వేరే మనుషులూ లేరు.

మా కమిటీ మొత్తం ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించింది కదా! అయితే తమ్మారెడ్డి లాంటి వాళ్ళు. ఈ కమిటీ తీసుకున్న ఒంటెత్తు పోకడతో అసలీ పోరాటాన్ని ఎత్తుకుని సాగించడంవలన, చాలా నష్టాలు జరిగినాయి. కనుక కమిటీని మార్చాలి అని మొదలెట్టారు. పొరపాట్లు జరగలేదని కాదు. మొత్తం మీద చూసుకుంటే ఈ పోరాటాన్ని నిర్వహించడం చాలా గొప్పపని. ప్రజలను రంగంలోకి దించి పోరాటం చేయించగలిగాము. ఆ సందర్భంలో తీవ్ర నిర్బంధానికి కూడా వాళ్ళు తట్టుకున్నారు. పార్టీలోంచి తీసెయ్యవలసి వస్తే, నిర్బంధానికి తట్టుకోలేక భయపడి పోలీసులకు లొంగిపోయి, రహస్యాలు జేరవేసినవాళ్ళని తొలగించాలి. తట్టుకోలేకపోతే పారిపో, ఎక్కడికైనా వెళ్ళి రహస్య జీవితం గడుపు. అంతేగానీ, పోలీసులకు లొంగడం ఒకటి, ఆపైన రహస్యాలు చెప్పడం మరొకటి. ఉదాహరణకు వేములపల్లి శ్రీకృష్ణ లాంటి వాళ్ళు. అలాంటి వాళ్ళకు పార్టీలో స్థానం లేదని మా వాదన.

అభిప్రాయ భేదాలున్న వాళ్ళని, అంతమాత్రానే పార్టీలోంచి ఎవర్నీ తొలగించలేము. అయితే, అలా పోలీసులకు లొంగి రహస్యాలు చెప్పినవాళ్ళని కూడా క్షమించి, మళ్ళీ పార్టీలో యిముడ్చుకోవాలన్న వాదనతో మేము ఏకీభవించలేదు. అలా వాదించే వాళ్ళనేది ఏమంటే, అసలీ పోరాటంవల్లనే కదా నిర్బంధం వచ్చింది. ఆ నిర్బంధానికి కదా వాళ్ళు భయపడి ఆ పని చేసింది. కనుక క్షమించి పార్టీలో వుంచమంటే అది కుదరదన్నాము.

సరే మేము రహస్యంగా వుండి అంచనా వేసుకున్నాము. ఆంధ్రలో 20 నుండి 25 సీట్లు మనం గెలుస్తామని, కానీ 40 సీట్లకు పైగా గెల్చాము. ఉదాహరణకు నెల్లూరు, కోవూరు సీట్లను గెలుస్తామని ఎన్నడూ అనుకోలేదు. కానీ గెల్చాం. ప్రజల మనోభావాలు అలా వున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించి మనం ఎన్నో త్యాగాలు చేశాము. ఇది ఒక భాగం. రెండో విషయం కాంగ్రెస్ చీలిపోయి వుంది. ప్రభుత్వం మనలనేకాదు, మామూలు జనాన్ని కూడా చావచితకబాదింది. మనకు సుమారు 33 శాతం ఓట్లు వచ్చాయి. 1955లో కూడా దాదాపు అంతే శాతం వచ్చాయి.

అయితే కాంగ్రెస్ చీలింది. ప్రకాశం, రంగా కాంగ్రెస్ నుండి వెలుపలికి వచ్చి కె.ఎం.పి. అని, కె.ఎల్.పి. అని పోటీ చేశారు. సోషలిస్టులు విడిగా పోటీ చేశారు. ఒక విధంగా అది త్రిముఖ పోటీ. వాళ్ళ ఓట్లు కూడా కాంగ్రెస్‌కు పడితే వేరే విషయం. అందువల్ల 140 సీట్లున్న ఆంధ్ర ప్రాంతంలో 42-45 సీట్లు ఖచ్చితంగా ఎన్నో గుర్తులేదు గెల్చాము. దాదాపు 100 సీట్లున్న తెలంగాణాలో 45 సీట్లు పొందగలిగాం. మొత్తం 237 సీట్లలోనూ 35

మన బలం. 84 కాంగ్రెస్ బలం. మిగతావి కె.ఎం.పి., కె.ఎస్.పి. సోషలిస్టులు, షెడ్యూల్ కులాల సంఘటన వంటివి. తెలంగాణా ప్రాంతంలో 6 సీట్లు, ఆంధ్రలో 11 పార్లమెంటు సీట్లు గెల్చుకున్నాం. మొత్తం 29-30 సీట్లు గెలుచుకోగలిగాం.

ఆంధ్రలో మన గెలుపుకు కారణం ప్రభుత్వ నిర్బంధ విధానం, మన కృషి, త్యాగాలు - వీటితోపాటు కాంగ్రెస్ చీలిక కూడా. కానీ తెలంగాణాలో విజయానికి మాత్రం మన పోరాటమే అసలు కారణం. కాంగ్రెస్ వుంది. మనం తరిమేసిన భూస్వాములు కాంగ్రెస్‌కు పునాది. పైగా నెహ్రూ - ఆయన సైన్యాలు వచ్చి తెలంగాణాను విముక్తం చేసి భారతదేశంలో విలీనం చేశాయి. అనే అంశం ప్రధానంగా కాంగ్రెస్ ప్రచారం.

కానీ, తెలంగాణాలో కాంగ్రెస్ ఎదుర్కొనవలసింది తెలంగాణా పోరాటం నడిపిన కమ్యూనిస్టులను. అందుకనే ఆంధ్రలో తక్కువ మెజారిటీలతో గెల్చాము. తెలంగాణాలో చాలా పెద్ద మెజారిటీలతో గెల్చాము. తెలంగాణాలో ముక్కోణపు పోటీలేదు. అయినా బ్రహ్మాండమైన విజయం సాధించాము. చాలా చోట్ల కాంగ్రెస్‌కు డిపాజిట్లు పోయాయి.నల్గొండ జిల్లాలో ఒక్కటంటే ఒక్కసీటు కూడా కాంగ్రెస్ గెలవలేదు. ఖమ్మంలో ఒక్కటి గెల్చారు.

పైగా తెలంగాణాలో ఎన్నికల నాటికి నెల మాత్రమే వుంది. ప్రజలుపోరాటంలో తరిమేసిన అందరు భూస్వాములు యింకా తిరిగి రాలేదు. ఇంకా మన దళాలు రహస్యంగా వున్నాయి. కనుక వారు భయపడి రాలేదు. కనుక జనం స్వేచ్ఛగా ఓటు చేయగలిగారు. అన్నిటికీ మించి దాదాపు రెండు సంవత్సరాలపాటు పోరాట సమయంలో ప్రజలు పోరాట సత్ఫలితాలు చవిచూశారు. వారివంట వారిదే. పోలీస్, భూస్వామ్య, గ్రామీణ తదితర అధికార నిర్బంధంలేదు. అందువల్లనే బ్రహ్మాండమైన విజయాలు సాధించాం. ఏవన్నా చిన్నచిన్న పొరపాట్లు జరిగినా లేదా నిర్ణయాలలో పొరపాట్లు చేసినా ప్రజలు వాటిని పట్టించుకొనేలేదు. మొత్తం మీద పోరాట సత్ఫలితాలను ప్రజలు గ్రహించారు.

భూపంపకం చాలా ప్రధానమైన విషయంగా ప్రజలు అభినందించారు. వెట్టిచాకిరి నిర్మూలన, యివన్నీ ఎంతగానో ప్రజలను ప్రభావితం చేశాయి. అదీగాక మన పార్టీ కార్యకర్తలు, నాయకులు వెనుకబడిన తరగతుల వారిలో, తక్కువ కులాలుగా భావింపబడిన వారితో కలిసి మెలసి తిరిగిన తీరు - ఎందుకంటే మన ప్రధాన నాయకత్వం అంతా పై కులాల నుండి వచ్చిందే అయినా, వారు నీళ్ళలో చెపల్లా ప్రజానీకంలో కలిసిపోయారు. ఇది అందరి మన్ననలు చూరగొంది.

ఆంధ్రప్రాంతంలో 1942, 43లలో మన కార్యకర్తలు, భూములమ్మి పార్టీకి యిచ్చారు. ఆ ప్రశ్న తెలంగాణాలో రాలేదు. కానీ, భూపంకం అమలు జరిపే సందర్భంలో మన నాయకుల భూమి కూడా కొంత పంపకం అయింది. ఆ తర్వాత పోరాట విరమణ జరిగినా, తర్వాత మళ్ళీ కొంత భాగం తిరిగి వచ్చినా, తీసుకున్నా, అది ప్రధానమైందికాదు. మన నాయకుల



భూమి కూడా చాలా భాగం పంపకం అయింది. రక్షిత కౌల్దారీ చట్టం తెలంగాణా పోరాట ఫలితం. ఇంకే రాష్ట్రంలోను అలాంటి చట్టం రాలేదు. నిజంగా అది చారిత్రాత్మకమైన చట్టంగా చెప్పవచ్చు.

మొదట్లో ఇలాంటి చట్టం విషయాలు పోరాట విరమణకు షరతుగా ప్రభుత్వం అంగీకరించలేదు. అయినా పోరాటం విరమించాము. ప్రజా ఉద్యమం ఒత్తిడి ఫలితంగా ఈ చట్టం ప్రభుత్వం చెయ్యక తప్పలేదు. ఎన్నికల తర్వాత కూడా అందరు కామ్రేడ్స్ బహిరంగంగా రాలేదు. ఉదాహరణకు ఎన్నికల ప్రచారానికి వెళ్ళి ఆ రాత్రి మిర్యాలగూడెంలో నేను చల్లా సీతారాంరెడ్డిని కలుసుకున్నాను. ఆయనింకా రహస్యంగానే వున్నాడు. ఆయుధాలు కూడా వున్నాయి. అయితే దళాలుగా లేవు. వ్యక్తులుగా వున్నారు.

అందుకే నెహ్రూ గవర్నమెంటు అంటుండేది.పోరాట విరమణ, ఎన్నికలు అయినా మీ వాళ్ళింకా ఆయుధాలు తీసుకునే తిరుగుతున్నారు. నేనప్పటికి రాజ్యసభ సభ్యుణ్ణి. "ఏం చేస్తారు మీరు కేసులు అవీ ఎత్తివేయకుండా, అరెస్టులకు, నిర్బంధాలకు సిద్ధపడి వుంటే. మీరు కేసులు అవి ఎత్తేయండి. నిర్బంధం వుండదని హామీ యివ్వండి" అనేవాణ్ని. రాజ్యసభ సభ్యుడిగా నా బాధ్యతల్లో తెలంగాణా ఒకటి. నేను తెలంగాణా తరపున వాదిని.

నేను కమిటీ కార్యదర్శిని కూడా. అప్పుడు కూడా తెలంగాణాకు వేరే కమిటీ కావాలన్న వాదన వచ్చింది. అలా వీలుకాదని అన్నాము.

# తెలంగాణా పోరాటం
# నా అనుభవాలు గుణపాఠాలు

**మొ**త్తం తెలంగాణా పోరాట సమయాన్ని గూర్చి చెప్పేటప్పుడు, నా జ్ఞాపకాలను నెమరు వేసుకుంటున్నప్పుడు వానివల్ల ప్రధానంగా నేర్చుకోదగిన గుణపాఠమేమిటి? అన్న ప్రశ్న ఎదురౌతుంది.

ప్రజానీకం తమంత తాముగా ఉద్యమాల్లోకి వస్తున్నప్పుడు, పురోగమిస్తున్నప్పుడు ఆ ఉద్యమ ఔన్నత్య స్థాయికి వారు ఎదుగుతారు అన్నది మొదటి విషయం.

ఆ రోజుల్లో సామ్రాజ్యవాద వ్యతిరేక వాతావరణం భూమిక. అందులోనూ నిజాంపట్ల ప్రజానీకంలో వున్న ద్వేషం, వేల సంఖ్యలో వారి కదలిక యివన్నీ వున్నాయి. సహజంగా దేశభక్తి ప్రపూరిత శక్తుల సహకారమూ వుంది. కానీ, ఆయుధాల చట్టంవల్ల ఆచరణకు వచ్చేసరికి ఏ మాత్రం సాయుధ శిక్షణలేని పరిస్థితి. మేము చేసిన దానిలో ఒకటి ఆయుధాలు సమకూర్చడం. అదంత తేలికైన పనికాదు. దక్షిణాదిన సైనిక ఆయుధ గిడ్డంగులేమీ లేవు.

మాకున్న కొద్ది పరిచయాలతోనూ ఆయుధాలు పోగేసే యత్నం చేశాం. ఆంధ్ర ప్రాంతంలో వున్న నౌకా స్థావరాలు, గనుల ప్రాంతాలు యిలాంటి చోట్ల నుండి కొన్ని. అంతకన్నా తక్కువకానిదొకటుంది. పోరాడే ప్రాంతాలలో వ్యవసాయ కార్మికులున్నారు. వాళ్ళు దొరలవద్ద జీతానికి వుంటుంటారు. తమ భూస్వాములు ఎక్కడ తుపాకి వుంచేదీ లేదా రివాల్వర్ దాచేది వారికి తెలుసు. వాళ్ళు అక్కడి నుండి దొంగిలించుకు తీసుకు వచ్చి యిచ్చేవారు లేదా మనమే స్వాధీనం చేసుకునేవాళ్ళం.

కొన్ని సందర్భాలలో మొరటుగా బాంబుల లాంటివి మనమే చేసుకునే వాళ్ళం. తుపాకిమందు తేవడం – కొబ్బరి టెంకెలు లేదా మరచెంబులు వాటిలో దట్టించడం. సున్నిత పరికరాలంటూ లేవు. వాటికే కంత ఏర్పాటు చేయడం – ఇతర సాధన సంపత్తి సమకూర్చడం చేస్తుండేవాళ్ళం. తర్వాత దశలో క్రమేపీ వాటిని మెరుగు పరుచుకున్నాం. అసలు చిన్నచిన్న కర్మాగారాల లాంటివి ఏర్పాటు చేసుకున్నాం కూడా. ఈ పనికి గ్రామాలలో వున్న కమ్మరులు,



కంసాలులు, వీళ్ళ సహకారం బాగుండేది. మామూలు తుపాకి గొట్టాలు కూడా చేయించే యిచ్చేవాళ్ళు. అవన్నీ చాలా మొరటుగా వుండేవి.

పోరాడే దళాలకు ఎన్నో సరఫరాలు కావాలి. వాటిని ఏర్పాటు చేసుకోవడం, ఈ సరఫరాలను సమన్వయం చేసుకోవడం ఇదంతా పెద్దపనే. కానీ యీ పని జరగకుండా పోరాటం లేదు. కృష్ణాజిల్లాల్లో గ్రామాలు యిందుకెంతగానో సహకరించాయి. అక్కడ దాదాపు పార్టీ మొత్తంగా ఈ కృషిలో నిమగ్నమై వుందని చెప్పాలి. పోరాడే దళాలు వెనక్కు తగ్గేందుకు ఈ గ్రామాలు వెన్నుతట్టు ప్రాంతాలుగా వుండేవి.

నాకు ప్రత్యేకించి బాడీగార్డులు వుండేవారు. అలాగే కొరియర్లుకు. ఈ కొరియర్లు కొంత దూరం వెళ్ళిన తర్వాత మారేవాళ్ళు, కొత్తవాళ్లు వచ్చేవాళ్ళు. సహజంగా రాత్రి సమయంలోనే ప్రయాణం వుంటుండేది. బస్సులూ అవీ వుండడమే తక్కువ. ఉన్న వాటిని ఉపయోగించుకోవడం కూడనిది. అలాగే, సరఫరాలు జరిపేందుకు మాత్రం చాలా అరుదుగా లారీలు వినియోగించేవాళ్ళం. అది కూడా ప్రమాదమే. దారిలో ఆపి, వాటిని ప్రభుత్వం తనిఖీ చేసే అవకాశం వుంది.

కనుక ఎక్కువ భాగం నడక లేదా సైకిలు. రహస్య స్థావరాలను గూర్చి తెలుసుకొనేందుకై ప్రభుత్వం వేట సాగించేది. కృష్ణాజిల్లా గ్రామాలు కొన్ని సందర్భాలలో గుడివాడ వరకూ కూడా మా రహస్య స్థావరాలుండేవి. ప్రభుత్వదాడుల ప్రమాదంవల్ల తరచుగా స్థావరాలు మార్చాల్సి వచ్చేది.

ఎంతో జాగ్రత్తగా ఆ స్థావరాలలో వుండాల్సి వచ్చేది. యిరుగుపొరుగు వాళ్ళకు ఏ మాత్రం అనుమానం రాకూడదు. మనం అసాధారణంగా వుండకూడదు. పట్టణాలలో కొంత వరకూ ఫర్వాలేదు. పల్లెటూళ్ళల్లో మనం ఎంత జాగ్రత్తగా వున్నా తెలిసిపోయేది. ఇక్కడేదో జరుగుతున్నదని. అయినా ఆ రోజుల్లో చాలా గడ్డు సమయంలో కూడా సామాన్య ప్రజానీకానికి కమ్యూనిస్టులు తమ మధ్య వుంటున్నారని తెలిసినా ఎవ్వరికీ చెప్పేవారు కాదు. పోలీసులకసలు చెప్పేవారు కాదు. పైగా పోలీసులు ఆ గ్రామానికి, ఈ రహస్య స్థావరాల వెతికేందుకై వస్తున్నారని తెలిస్తే మాత్రం, మేమున్న ఇంటి యజమానుల వద్దకు వచ్చి తమకు తెలిపిన సమాచారం చెప్పే వాళ్ళు. వెంటనే మేము మరోచోటు చూసుకునేవాళ్ళం. నా వరకు నాకే యిలాంటి సందర్భాలెన్నో తగిలాయి.

ఒక ఉదాహరణ చెప్పాలంటే, ఆ రోజుల్లో వాసిరెడ్డి రామారావు సోదరుడు నా కొరియర్. ఆయన చదువుకున్నవాడు. నాతో వుండేవాడు. ఏమన్నా సామానులు అవీ మోసుకు వచ్చేవాడు. అలాగే కాట్రగడ్డ వెంకట్రాయుడు. ఆయన్ని 1949 చివర్లో కాల్చి చంపేశారు. సావరిగూడేనికి చెందిన రంగారావు వీళ్ళు నా కొరియర్లుగా వుండేవారు. ఈ కామ్రేడ్స్ ఎంతో కష్టపడి పని చేసేవారు. ప్రయాణాలప్పుడు నాతో మందులపెట్టె, ఉత్తర ప్రత్యుత్తరాలు, డాక్యుమెంట్లు, సరే నాకు అవసరమైన దుస్తులు, దుప్పటి వంటివి వుండేవి. ఇవన్నీ నీళ్ళకు

తడవని కాన్వాస్ సంచీలో వేసుకునేవాణ్ని. మామూలుగా నా సంచీ నేనే మోసుకునేవాణ్ణి. అంతా కలిపి, మహా అయితే 10-15 కేజీలు బరువుండేది. ఇతరులను మొయ్యనిచ్చే వాణ్ణికాదు. రాత్రిళ్ళు ప్రయాణం చేసేటప్పుడు ఏదో మార్చుకోవలసి వచ్చి, నా సంచీ, నా పక్కనున్న కొరియర్‌కు యిచ్చాను. ఆ కామ్రేడ్ అది మోస్తూ "బట్టె దూడంత బరువుంది. మమ్మల్నెందుకు మొయ్యనివ్వరు?" అని అడిగాడు. "నువ్వు మొయ్యగలిగింది. నేను మొయ్యలేనా? నీకన్నా శరీర ధారుద్యంలోనేను ఏం తీసిపోయానని" అని అనేవాడిని. ఈ రకంగా పరస్పరం సహకరించుకోవాలన్న భావన మాలో వుంటుండేది.

సహజంగా ఊరు మధ్య ఇళ్ళలో వుండేవాళ్ళం కాదు. ఊరు చివరి, విసిరేసినట్లు పొలాల్లో వుంటున్న యిళ్ళలో వుండేవాళ్ళం. చేలకు అడ్డంపడి రాత్రిపూట ఆ యింటి వద్దకు చేరేవాళ్ళం. కొరియర్ వెళ్ళి తలుపు తట్టేవాడు. నేను దూరంగా వుండేవాణ్ణి. అంతా సవ్యంగా వుందనుకుంటే నేను వెళ్ళేవాణ్ణి. ముందుగా కబురు చేయడం మామూలుగా జరిగేది కాదు. ఏదో ఉబుసుపోక కబుర్లలోనో, తదితరంగానో బయటపడుతుందని లేదా యిలా వస్తున్నామని తెలిస్తే, మరింతగా జాగ్రత్తల కోసం అతిగా వ్యవహరించి, అనుమానానికి తావివ్వడం జరుగుతుందేమోనని గోప్యంగా వుంచేవాళ్ళం.

ఒకోసారి గన్నవరం పరిసర ప్రాంతాలలో ఆగి, కృష్ణాజిల్లా సరిహద్దు ఒక్క రాత్రిలో దాటాల్సివచ్చేది నడక లేదా సైకిలు. మామూలు రైతుమాదిరి, పంచ, చొక్కా, నిక్కరు వేసుకునే ప్రశ్న ఆ రోజుల్లోలేదు. రహస్య జీవితం గడపడంలో ప్రథమంగా నేర్చుకోవలసింది. మన వస్త్రధారణలో, నడవడికలో, అలవాట్లలో మిగతా అక్కడి జనం, ఎలా వుంటారో అలా వుండాలి. ప్రత్యేకంగా కన్పించకూడదు.

ఒకసారి కంచికచర్ల మీదుగా వీరులపాడు వెళ్ళాల్సి వచ్చింది. అంతా సద్దుమణిగిన తర్వాతనెగదా ప్రయాణం. సైకిలుపై చేరేసరికి అర్ధరాత్రి దాటింది. కొరియర్ వెళ్ళి తలుపు తట్టారు. ఇంటామె లేచి తలుపు తీసింది. ఆ రోజుల్లో పోలీసులు అర్ధరాత్రిళ్ళు వచ్చి దాడి చేసేవాళ్ళు. అందువల్ల అర్ధరాత్రి తలుపు తడితే కొందరు స్త్రీలు పోలీసులే అయివుంటారని భయపడేవాళ్ళు. ఈ కొరియర్ సుందరయ్య వచ్చాడని చెప్పాడు. ఆమె నమ్మలేదు. కేకలు వేయడం ఆరంభించింది. 'సుందరయ్య వచ్చాడట" అంటూ నమ్మని వెటకారంతో సుందరయ్య చాలా పెద్ద నాయకుడు కదా ఈ వేళప్పుడు, యిక్కడికెందుకు, ఎలా వస్తాడని ఆమె అభిప్రాయం. కొరియర్ తిరిగి నా దగ్గరకు వచ్చి, ఆమె కేకలు వేస్తున్నదని చెప్పాడు. అతని రూపురేఖలను ఆమె గుర్తించలేదు.

"నేను వెళ్ళి కనపడతాను. చూద్దాం. నన్ను గుర్తు పట్టుందేమో" అని కొరియర్ని వెంటపెట్టుకుని నేను వెళ్ళాను. "నేను సుందరయ్యనని" చెప్పాను. ఆమె గుర్తించలేదు. "సరే గుర్తించకపోతే గుర్తించకపోయావు. వూరికే అల్లరి చేయకు. మా దారిన మేము వెళ్తాము" అని ఇక ఆ వూళ్ళో ఆగకుండా ప్రయాణం సాగించాము. ఇదుగో అలాంటి సందర్భాలలో



చిక్కుల్లో యిరుక్కుంటాం. ఆమె యింకా గోలచేసినట్లయితే, చుట్టుపక్కల వాళ్ళు లేవడం... అంతా జరిగేదికదా.

ఆ తర్వాత 'మేము వెళ్ళాల్సిన తెలంగాణా సరిహద్దు ప్రాంతానికి బయలుదేరాము. మా ఇరువురికి ఆ చీకటిలో సరిగ్గా దారి దొరకలేదు. మేము వెళ్ళాల్సిన ప్రాంతం ఎటువైపు వుందో చూచాయిగా తెలుసు. సైకిళ్ళు పొలాల కడ్డంపడి నడపలేము కదా. దారి తెలియదు. అవస్థపడ్డాము. నేను చేరాల్సిన చోటు ఎలాగో తిప్పలుపడి చేరిన తర్వాత అతణ్ణి పంపి, "రాత్రి ఎవరో యింటికి వచ్చి తలుపు తట్టారనీ, సుందరయ్యనని చెప్పాడనీ, ఈ విషయమేమీ బయటకు పొక్కనీయవద్దని నా కొరియర్ కామ్రేడ్‌తో వాళ్ళింటికి కబురు చేశాను" లేకపోతే అంతా అల్లరి అవుతుందేమోనని ఈ కామ్రేడ్ వెళ్ళేసరికి ఆ యింటిగలాయిన యింట్లోనే వున్నాడు. ఆ రోజుల్లో మన కామ్రేడ్స్ రాత్రిళ్ళు యిళ్ళల్లో పడుకునే వారు కాదు. ఆయనకు విషయం తెలిసింది. భార్యాభర్త యిద్దరూ చాలా నొచ్చుకున్నారట. "సుందరయ్యగారని కొంచెం ముందుగా తెలిసినట్లయితే యింత జరిగేది కాదు. ఆయన కోసం ప్రాణాలైనా యివ్వమా" అన్నారట. ఈ సంగతి ఆ కొరియర్ ద్వారా తర్వాత తెలిసింది. సరే, రహస్య జీవితంలో యిలాంటి పరిస్థితుల్లో యిది మామూలేలే, బాధపడవద్దని చెప్పి పంపాను.

ఒకసారి నేను వీరులపాడు చేరేసరికి తెల్లవారుజామున నాలుగు గంటలయింది. మల్లారెడ్డి, జానకిరామయ్య అనే రైతులుండేవారు. ఈ కామ్రేడ్ జానకి రామయ్య పార్టీ స్థానిక నాయకుడు, మల్లారెడ్డి పార్టీకి మంచి సానుభూతిపరుడు. మల్లారెడ్డి యింట్లో వుంటూ, మల్లారెడ్డిని 'పార్టీ సభ్యత్వం ఎందుకు తీసుకోవు' అని అడిగాను. "నాకు కొన్ని వ్యసనాలున్నాయండీ, పార్టీ సభ్యుడిగా పనికిరాను' అన్నాడు. "పార్టీ కోసం యింత జేస్తావుకదా, ఆ వ్యసనాలు మానుకోవచ్చు కదా" అని అడిగాను. "అంత తేలిగ్గా మానుకోగలిగితే వ్యసనా లెందుకవుతాయండీ... అయినా మానుకోవాలన్నా కొంత టైమ్ పడుతుంది కదా. అప్పటి వరకూ యిలాగే వుండి నేను చేయగలిగింది చేస్తాను" అన్నాడు. చాలా కట్టుదిట్టంగా రక్షణ ఏర్పాట్లు చేసేవాడు. వాళ్ళ ఎడ్లబండి తోలుకుంటూ, సామాన్య రైతు మాదిరి పగటిపూట కూడా ఎక్కడికన్నా వెళ్ళగలిగేవాణ్ని. బండితోలే రైతు ఎలా కూర్చుంటాడో పగ్గాలు పట్టుకుంటాడో, ఎలా ఎడ్లను అదిలిస్తాడో యివన్నీ నాకు కొత్తకాదు కదా. చిన్నప్పుడు నేర్చుకున్నవే.

వీరులపాడు పార్టీకి ఎంతో అండగా వుండే గ్రామం. స్త్రీ పురుషులందరూ పార్టీపట్ల ప్రేమానురాగాలతో, భక్తి శ్రద్ధలతో వుండేవారు. వ్యవసాయ కార్మికులలో ఎక్కువ మంది హరిజనులు. వ్యవసాయ కార్మికుల యింట్లో ఎవరైనా కమ్యూనిస్టులం వున్నా, ఒక్కరన్నా చివరికి పిల్లలతో సహా మేము ఉన్నట్లు ఎక్కడా అనేవారుకాదు. అయితే వ్యవసాయ కార్మికుల ఇళ్ళు మరీ చిన్న చిన్న గుడిసెలు. అక్కడ నల్గురైదుగురం కూర్చొని మాట్లాడుకోవడం లేదా, ఇతర రహస్య కార్యకలాపాలు చేసుకోవడం సాధ్యమయ్యేది కాదు. అందుకని చిన్న లేదా మధ్యతరగతి

రైతుల ఇళ్ళు ఎంచుకునేవాళ్ళం. ధనిక రైతులు కూడా, సానుభూతిపరులుగా వున్న వాళ్ళు మనకు రక్షణయిచ్చేవారు.

నున్న, దుగ్గిరాలపాడు లాంటి విజయవాడ పక్కన వున్న గ్రామాలలో కూడా మాకు రక్షణ యిచ్చే సానుభూతిపరుల ఇళ్ళు వూరుబయటగా వుండేవి. విజయవాడ పట్టణంగుండా వెళ్ళడం మంచిదికాదు గనుక అలా పక్కగా, ఆ వూళ్ళ మీదుగా వెళ్ళేవాళ్ళం. రక్షణ ఇస్తున్నారంటే వాళ్ళు పెద్దగా రాజకీయాలు తెలిసిన వాళ్ళని కాదు. ఆశయం మీద గురి, నాయకునిపై గౌరవం, వాళ్ళ కుటుంబాలపట్ల విధేయత ఇవి ప్రధానంగా పని చేసేవి.

ఒకసారి తెల్లవారుజామున 3 గంటలప్పుడు వీరులపాడు వెళ్ళాను. జానకిరామయ్య ఇల్లు ఊరి బయటగా వుండేది. నాతోపాటు కొరియర్ కూడా లేడు. కొరియర్‌ను ఎక్కడికో పంపినట్లున్నాను. నేను వెళ్ళేసరికి జానకిరామయ్య ఇంట్లో లేడు. నిండు గర్భిణితో వున్న ఆయన భార్య మాత్రమే వుంది. వాళ్ళింటికి అంతకు ముందు చాలాసార్లు వెళ్ళాను కదా. కొత్తఏమీలేదు. ఇలాంటి సమయాల్లో ఎలా వుండాలో అన్నీ తెలిసిన ఆమె. నేను బాగా అలిసిపోయాను. “చూడమ్మా ఇక్కడ ఒకటి రెండు గంటలు నిద్రపోతాను. 5 గంటలకు మళ్ళీ బయలుదేరి వెళ్ళాలి. అయిదు గంటలకల్లా నేను లేవాలి. ఒక వేళ లేవకపోతే నువ్వైనా నిద్రలేపు” అని చెప్పి పడుకున్నాను.

నాకు నా మనోగడియారం వుందికదా! అది పని చేస్తూనే వుంటుంది. సహజంగా లేవాలనుకున్న సమయానికి కొద్ది నిమిషాల ముందు మెలుకువ వస్తుంది. అలాగే లేచాను. ఆమె ఏదో తనపని మీద కోడిపెట్టలను వెతుకుతున్నట్లు ఎవరికీ అనుమానం రాకుండా యింటి చుట్టూ తిరుగుతూ కాపలాకాస్తున్నది. నాకు సంభ్రమాశ్చర్యాలు కలిగాయి. ఇంకా కొద్ది రోజుల్లో పురుడు వచ్చే మనిషి. “ఏమ్మా, నేను పడుకున్న లగాయితూ యిలాగే తిరుగుతున్నావా. నువ్వు యిప్పుడే లేచావా?” అని అడిగాను. ఆమె చిన్నగా నవ్వి వూరుకుంది. ఇట్లా మన కామ్రేడ్స్ యిళ్ళల్లో స్త్రీలు కూడా ప్రత్యేక శ్రద్ధతో ప్రవర్తించేవారు.

ఇంకోసారి నేను మునగాల పరగణా వెళ్ళాల్సి వచ్చింది. కృష్ణాజిల్లా సరిహద్దు గ్రామం బహుశా అనిగెళ్ళపాడు అనుకుంటాను. అక్కడ నుండి చెరువు మాధవరం, మునగాల, సిరిపురం అట్లా వెళ్ళాలి. అక్కడొక స్థానిక కేంద్రం వుంది. అక్కడకు వెళ్ళి అవసరమైన సమాచారం సేకరించి సూచనలిచ్చి తర్వాత కార్యక్రమం నిర్ణయించుకోవాలి. నాతోపాటు పుల్లయ్య అని ఒక కామ్రేడ్ రహస్య జీవితంలో పెరు అనుకుంటాను. ఇంకో కామ్రేడ్ దెందుకూరు గోపయ్య – మేము ముగ్గురం బయలుదేరాము.

మామూలుగా జనం నడిచే మార్గాలకుండా వెళ్ళకూడదు. ఊళ్ళో ఆగాల్సిన పనిలేకపోతే చుట్టు దారిన వూరుదాటి వెళ్ళాలి. అది ఒక సరిహద్దు గ్రామం – అందుకని



అక్కడ ‘తనిఖీ ఆఫీసు’ వుంది. ఆఫీసు వూరికి ఆ చివర వుంది ఆ సంగతి మాకూ తెలుసు. ఈ వూరు తనిఖీ ఆఫీసు దాటి ఆ తర్వాత మళ్ళీ తోవకు చేరాలి.

వాళ్ళిద్దరూ ముందు. వారికి ఒక 50 గజాలు వెనుకగా నేను. ఊరు దాటవేశారుగాని, ఆ చీకట్లో తీరా వెళ్ళి వెళ్ళి ఆ తనిఖీ ఆఫీసు ముంగిట తేలారు. ఆ వుద్యోగులను చూసి, ఈ ఇద్దరు కామ్రేడ్స్ వెనక్కి పరుగెత్తసాగారు. వీళ్ళవెంట పోలీసులు పడ్డారు వాళ్ళ వద్ద తుపాకులు, రివాల్వర్లు వుంటుండేవి. సరిహద్దు వెంట స్మగ్లింగ్ జరక్కుండా వాళ్ళు చూడాలి. కామ్రేడ్స్ నెత్తిన మూటలు కూడా వున్నాయి కదా. వాళ్ళు పరుగెత్తడం చూసి, నేనూ వెనక్కి పరుగెత్తసాగాను. నా వద్ద కాన్వాస్ సంచీ ఒకటి వుంది. బరువుగానే వుంది అయినా తప్పదు.

నా వద్ద రివాల్వర్ వుంది. కానీ ఆ సమయంలో, పరుగెత్తి పారిపోయే అవకాశం వున్నప్పుడు దాన్ని వాడడం అంటే ఆ పోలీసులందర్నీ మన మీదకు రప్పించుకోవడమే. మరీ తీవ్రమైన ప్రమాదం వుంటే తప్ప రివాల్వర్ వాడడం మంచిది కాదు. వీలైనంత వరకూ వాడకుండా తప్పుకోవాలి. ఇక పరుగెత్తసాగాను. నావెంట ఆ పోలీసొకడు పడ్డాడు ఒక కంచ దూకి అక్కడేవో మొండి గోడలు వుంటే వాటి చాటున నక్కి వున్నాను. ఆ పోలీసు దాదాపు నాపై దూకినంత పని చేశాడు. నాకు వేరే మార్గం లేదు. సంచి కింద పడేసి, రెండు చేతులతో వాడి గొంతు పట్టుకుని గట్టిగా నొక్కాను.

“నా దగ్గర రివాల్వర్ వుంది అరిస్తే కాల్చేస్తాను” బెదిరించాను. అతడు వుక్కిరి బిక్కిరవుతున్నాడు. “నేనేమీ అరవను, మీకు పుణ్యం వుంటుంది. వదిలిపెట్టండని” వేడుకున్నాడు. ఆ పోలీసులు నిజానికి కాపలాదార్ల వంటి వారు. ఏవన్నా సరుకులు సరిహద్దు దాటుతున్నట్లు అనుమానంగా వుంటే పట్టుకోవడం, లంచం తీసుకుని వదిలిపెట్టడం యిదీ పని. నాకూ ఇంకా ఆ దృశ్యాన్ని పొడిగించడం యిష్టం లేదు. ఎంత త్వరగా వీడు పారిపోతే అంత మంచిది. అందుకని ఒక్క తోపుతో వదిలేశాను. అతడు పరుగు లంకించుకున్నాడు.

నా దగ్గర మూటలో ఏవో దొంగ సరుకులు వున్నాయని వెంటపడి, బెదిరించి లంచం తీసుకోవాలని అనుకుని వుంటాడు. నా సంచిలో కరపత్రాలు వున్నాయి. నా ఆలోచన నాది అతడు పారిపోయిన  తర్వాత మళ్ళీ ఆ చీకట్లో కొండ గుర్తులుంటాయే అలా దిక్కులు వెతుక్కుంటూ, రాత్రిపూట మేము ఆగిన యింటికి జేరాను. ఇంట్లో ఆయన లేడు. ఇల్లాలు వుంది. ఆమెకు జరిగిందంతా చెప్పాను. ఆమె ఏమీ కంగారుపడకుండా తగిన రక్షణ జాగ్రత్తలు తీసుకుంది. తెల్లవారుజాముకు నాతోపాటు వచ్చిన కామ్రేడ్స్ కూడా తిరిగి అక్కడికి చేరారు. అప్పుడు పారిపోయి, మెల్లిగా దారివెతుక్కుని తనిఖీ ఆఫీసుదాటి అవతలవైపు చేరి నా కోసం వస్తానేమోనని చూశారట. నేను వెళ్ళలేదుకదా. వాళ్ళ వెళ్ళి ప్రయోజనం లేదు. అందుకని తిరిగి వచ్చేశారు. అక్కడ నన్ను చూసి వాళ్ళు సంతోషించారు.

నా ప్రయాణాలలో అలాంటి సందర్భాలు ఎన్నో ఎదురైనాయి. కావలసింది సమయస్ఫూర్తి, గుండెబలం, పిక్కబలం, వూరికే హడావిడిచేసి, అల్లరి చేసుకోవడం కాదు. తర్వాత ఒక సంవత్సరానికి ఆ గ్రామంపై పోలీసులు చేసిన దాడిలో దెందుకూరి గోపయ్య దొరికాడు. అతణ్ని పోలీసులు అరెస్టు చేసి కాల్చి చంపారు. ఈ పుల్లయ్య ఆ తర్వాత ఒకసారి నిజాం సైన్యంపై దాడి చేసిన సందర్భాలలో గాయపడి కోలుకున్నాడని, మళ్ళీ దళాల్లో వుండగా కాల్చి చంపివేయబడ్డాడని నాకు గుర్తు. ఏమైనా ఒకసారి ఆ తెలంగాణా రికార్డులు పరిశీలిస్తేగాని నిర్ధారణగా చెప్పలేను.

ఈ సరిహద్దు గ్రామాలు దాటిన తర్వాత బాణాపురం, మక్తాపురం, బోదలబండ, గోకినేపల్లి, నేలకొండపల్లి ఈ గ్రామాల మీదుగా తర్వాత స్థానంలోకి చేరుకోవాలి. ఆ ప్రాంతాలలో మచ్చా వీరయ్య నాయకత్వాన దళం వుండేది. మేము మాత్రం ఎంతో అవసరమైతే తప్ప ఈ గ్రామాలలో ఆగేవాళ్ళం కాదు. ఒకోసారి అక్కడ స్థానికంగా వున్న దళానికి కూడా నా రాక తెలిసేదికాదు. అయితే అవసరాన్నిబట్టి నాకు రక్షణగా కూడా 'దళం' నా వెంటరావడం జరిగేది. పైగా నేనూ దళాలు ఎట్లా వున్నాయి? వాటి పరిస్థితులేమిటి? తెలుసుకోవాలి.

మచ్చా వీరయ్య దళంలో దాదాపు పది మంది దాకా వున్నారు. అందులో ఇద్దరు ముగ్గురు కృష్ణా, గుంటూరు జిల్లా వాళ్ళు వున్నా మిగతా వారు స్థానిక వ్యవసాయ కార్మికులు, రైతులు. ఆ దళ సమావేశం వేసుకున్నాము. వాళ్ళేం యిబ్బందులు పడుతున్నారు? రైతుల మద్దతు ఎలా వుంది? ఇలాంటి అంశాలన్ని తెలుసుకోవాలి కదా. అలాంటి చర్చలలో, దళ సభ్యులు ఆ సమావేశాల్లో మనం ఎక్కడెక్కడ లోపాలు చేస్తున్నాం అని విమర్శనాత్మకంగా చెప్పేవారు.

మచ్చా వీరయ్య వాళ్ళ విమర్శలు శ్రద్ధగా వినేవాడు. సహేతుకంగా వుంటే అంగీకరించేవాడు. లేకుంటే కామ్రేడ్స్ ఇది సరియైన విమర్శకాదని నచ్చచెప్పేవాడు. అతణ్ని అందరూ గౌరవించేవారు. తాను ధనికవర్గం నుండి వచ్చినా అందరితో కలిసిపోయేవాడు. నిర్బంధం తీవ్రంగా వున్నా ఎప్పుడూ పారిపోయే యత్నంగాని, దాటవేసే ప్రయత్నంగానీ చేసేవాడు కాదు. ధైర్యంగా ఎదుర్కొని అక్కడే వుండేవాడు. కానీ జానకిరామయ్య అట్లాకాదు ఆయన అత్తవారి ఊరుకు వెళ్ళి అక్కడ వుండేవాడు. ఘర్షణ జోలికి వచ్చేవాడు కాదు. ఒకసారి ఇలా నువ్వు పోరాట సందర్భంలో తప్పుకు తిరిగేట్లయితే బాధ్యతాయుత స్థానాల నుండి తొలగించాల్సి వస్తుందని కూడా జానకి రామయ్యను హెచ్చరించాల్సి వచ్చింది. ఈయన 1952 ఆ ప్రాంతాల్లో బహిరంగంగా వున్న కమిటీలో వున్నాడు. మచ్చా వీరయ్యను పోలీసులు కాల్చి చంపారు.



ఆ ప్రాంతాలలో నేను వెళ్ళేటప్పుడు నాతో ఇద్దరు దళసభ్యులు వచ్చేవాళ్ళు. అటు నుండి పిండిప్రోలు వెళ్ళేటప్పుడు వాగు దాటాల్సి వుంది. అక్కడే తిరుగుతున్నారు గనుక ఎక్కడ ఊబి వున్నదో ఈ కామ్రేడ్స్‌కు తెలిసేది. లేకపోతే కూరుకుపోవడమే అవి చాలా ప్రమాదకరమైనవి. ఎంతో జాగ్రత్తగా వెళ్ళాలి. రాత్రిళ్ళు మరీను.

పగటిపూట అయితే ఎవరన్నా సెంట్రీని పెట్టుకుని, ఈతచెట్లు వాటిని వాళ్ళు వనాలంటారు. అక్కడ వుండేవాళ్ళం. ఆ సెంట్రీ ఒక ఫర్లాంగు దూరంలో అంతా గమనిస్తూ వుండేవాడు. రాత్రిళ్ళు అయితే అక్కడ వుండటం సాధ్యంకాదు. ఏదన్నా ఒక గుట్టలాంటిది చూసి అక్కడకు వెళ్ళి దుప్పటి పరుచుకు పడుకునే వాళ్ళం అప్పుడు కూడా వంతుల వారీగా సెంట్రీ పని వుండాలి.

ఈ సందర్భాలలో అక్కడక్కడ పాములు తటస్థపడుతుండేవి. ఎఱ్ఱా సత్యం అని హుజూర్‌నగర్ కామ్రేడ్, దళ నాయకుడు కూడాను. పాము కరిచింది. ఆయనను కేంద్రానికి తీసుకువచ్చారు. ఎందుకంటే అక్కడ పాము విషం విరుగుడు వాక్సీను ఉంది. ప్రతి దళం దగ్గరా వుంచగలిగినంత లేదు. బొంబాయి నుండి తెప్పించేవాళ్ళం. ఒక వేళ ప్రతి దళానికీ యిచ్చినా, ఇంజెక్షను యివ్వగల కామ్రేడ్ వుండొద్దూ. సరే, ఈ సత్యం వచ్చేసరికి చాలా ఆలస్యమయింది. తానిక బతకడం అసాధ్యం అని ఆ కామ్రేడ్‌కూ అర్థమయింది. "ఇప్పటికే సమయం మించిపోయింది. నేను బతకను. ఇదుగో తుపాకి, తీసుకుని సద్వినియోగం చెయ్యండి" అని యిచ్చాడు. అమరాబాద్ అడవుల్లో, మన కృష్ణమూర్తి నాయకులలో ఒకడుగా వుండేవాడు. ఏ మాటకామాటే చెప్పాలి. ఆయన అన్నింట్లోనూ వుండేవాడు. ఒకసారి అక్కడ దళ సభ్యుని కొకనికి ఏదో పాము పింజర అల్లే వుంది, కరిచింది చెయ్యంతా వాచిపోయింది. ఈ కృష్ణమూర్తే పెన్సిలిన్, యిట్లాంటివేవో వాడాడు. మొత్తం మీద ఆ కామ్రేడ్ కోలుకున్నాడు. అలాంటి సందర్భాలలో ఆ కామ్రేడ్స్‌ను ఎంతో జాగ్రత్తగా చూసుకునేవాళ్ళు. ఒక్కోసారి మామూలుగా మనం చెప్తుంటామే. అలాగే పాము కరిచిన చోటుకు కొంచెం పైన కోసి, నెత్తురు పిండేయడం చేసేవాళ్ళు. సరే ఎంతసరిగా చేశారు, లేదా అన్నది వేరే విషయం. ఆ తర్వాత మామూలుగా కట్టుకట్టడం, కాపడం పెట్టడం చేస్తూండేవాళ్ళు. ఇలాంటి సందర్భాల్లో తోటి దళ సభ్యులు, దళనాయకులు, వాళ్ళు చూపించే శ్రద్ధ, ఆదరణ దళాల్లో మరింత స్నేహభావాన్ని, గౌరవాన్ని పెంపొందించేవి.

సరే నేను పిండిప్రోలు చేరాను. అక్కడ చిర్రావూరి లక్ష్మీనరసయ్య వున్నారు. సూర్యాపేట దళాలు కూడా నిర్బంధం తీవ్రమై అక్కడకు వచ్చాయి. దేవులపల్లి వెంకటేశ్వరరావు, బి.ఎన్. స్వరాజ్యం, తిరుమలరావు యిలా కొందరు నాయకులుండేవారు. అది స్థావరం. అక్కడ అన్ని విషయాలు – నిర్మాణ, రాజకీయ, ఆచరణ సంబంధమైనవన్ని చర్చించబడేవి.

నిర్ణయాలు తీసుకుని వెళుతుండేవారు. ఆ ఊరుకు మైలు, రెండు మైళ్ళ దూరంలో ఒక చిన్న నది వున్నది. అందువల్ల వుండడానికి అనువుగా వుండేది జనానికి కూడా మేము అక్కడ వుంటున్నామని తెలుసు. కానీ, ఎవ్వరూ ఎవరికీ చెప్పేవారు కాదు. నిజాం సైన్యాలకు కూడా తెలుసు. కానీ దాడి చేయడానికి వాళ్ళకు ధైర్యం చాలేదికాదు. అధునాతన ఆయుధాలతో వున్న నెహ్రూ సైన్యమే అయినట్లయితే, ఈ క్యాంపును ధ్వంసం చేసేందుకు ఎక్కువ కాలం పట్టేది కాదు.

ఒకసారి ఏమి జరిగిందంటే, యిద్దరు కొత్త వ్యక్తులు వచ్చారు. 'మేం దళంలో జేరతాము, చేర్చుకోండి' అన్నారు. వాళ్ళెవరో మాకు తెలియదుకదా. "మేమిక్కడ వున్నట్లు ఎవరు చెప్పారు? మీరు శత్రువులు పంపినవాళ్ళు కారని నమ్మకం ఏమిటి?" అని అడిగాను. వాళ్ళు యేవో, ఆనవాళ్ళు – అవీ చెప్పారు. ఆ రోజుల్లో గ్రామంలో పేదలు బాధలు భరించలేక, పోరాడేందుకు సిద్ధంగా వున్నామని వచ్చి, దళాల్లో చేరేవారు. స్థానికంగా వున్న కామ్రేడ్స్ అయితే, ఈ చేరే వాళ్ళ పుట్టుపూర్వోత్తరాలన్నీ తెలుసుకోగలుగుతారు. కానీ, మేము కేంద్రంలో వున్నాము కదా. మాకెలా తెలుస్తుంది?

అలాంటి వాళ్ళు వచ్చి ఒక్కోసారి మనతోచేరి ద్రోహం చేసేవాళ్ళు. వీళ్ళ విషయంలో అనుమానంగానే వుంది. అందుకని వీళ్ళని దళాల్లోకి తీసుకోవద్దు. కాని తొందరపడి ద్రోహులని నిర్ణయానికి వచ్చి వాళ్ళకేమీ ఆపద తలపెట్టకూడదు అనుకున్నాం. ఏమైనా ఈ స్థావరం మార్చాలని కూడా భావించాము. అయితే వాళ్ళను వదిలిపెట్టినా ప్రమాదమే. ఏ దురుద్దేశం లేకపోయినా ఏదో ఉబుసుపోక కబుర్లతో మా విషయాలు బయటపెట్టవచ్చు. అందుకని వాళ్ళెక్కడికీ పోకుండా జాగ్రత్తగా వాళ్ళని కనిపెట్టి వుండేందుకై ఒక దళంలో వుంచాము. మనం స్థావరం ఎత్తేసేటప్పుడు వాళ్ళని పంపించేయవచ్చునని.

ఈ సందర్భాలలో మేము నాయకులం గనుక ప్రత్యక్షంగా శత్రుసైన్యంతో తలపడలేదు. కామ్రేడ్ బి.ఎన్. చాలా చెప్పగలడు. కామ్రేడ్ వి.ఎన్. కూడా. ఆయన దళ కమాండర్. కామ్రేడ్ రాయలవీరయ్య బయటి సమాచారం తీసుకువచ్చి మాకు చెప్పేవారు.

మేమక్కడ వుండగానే భారత సైన్యాలు నైజాంలో ప్రవేశించాయనీ, సూర్యాపేట వైపుగా వస్తున్నాయని తెలిసింది. ముందు మన దళాలను అక్కడ నుండి పంపించాలి. నేను, వీరయ్య కలిసి ఆ దగ్గర్లో అడవి, కొండ ప్రాంతాలు చూసి వచ్చాము. ఒక రోజు పట్టింది. అక్కడొక కొండ వుంది. అది ఈ పిండిప్రోలు క్యాంపు కన్నా రక్షిత ప్రాంతమే. కానీ అక్కడకు సరఫరాలు రావడమూ కష్టమే. చుట్టుముట్టి శత్రువు దాడిచేస్తే తప్పుకోవడమూ కష్టమే. కనుక ఇంకా బాగా అడవిలోకి చొచ్చుకుపోవాలి అనుకున్నాం.

కొన్ని వ్యక్తిగత సమస్యలు కూడా పరిష్కరించాల్సి వచ్చింది. బలపాల గ్రామంలో



శేషారెడ్డి అని ఒక కామ్రేడ్ వుండేవాడు. ఆయన భార్య అతనికి విడాకులిచ్చి, ఆ తర్వాత మోహనరావు అని ఒక వరంగల్ కామ్రేడ్‌ను వివాహం చేసుకుని వరంగల్‌లో స్థిరపడింది. ఆ శేషారెడ్డి ఆమెను తిట్టేవాడు, కొట్టేవాడు. ఆమె ఎదురుతిరిగేది. ఒక విధంగా మన ప్రభావంలో వున్న స్త్రీలు తమ హక్కులను నిల్పుకోవాలని ప్రయత్నించేవారు. అతనికి చెప్పిచూశాం. హెచ్చరించాం. కానీ అతడు మారలేదు. ఆమెను విడాకులు తీసుకోమన్నాం. భార్యాభర్తల తగాదా సందర్భాలలో ముందుగా వాళ్ళిద్దర్నీ కలిపి వుంచేందుకు యత్నించే వాళ్ళం. సాధ్యం కాకపోతే విడాకులు తీసుకోమని చెప్పేవాళ్ళం.

అలాగే స్వరాజ్యం ఆమె భర్త విషయంలో అతడి ప్రవర్తన బాగుండేది కాదు. ఎప్పుడు కోప్పడినా 'ఇక బుద్ధిగా వుంటాను. నా ప్రవర్తన మార్చుకుంటాను' అనేవాడు. కానీ మళ్ళీ మొదలు. ఇక స్వరాజ్యం విడాకులు తీసుకోక తప్పలేదు. ఆ తర్వాత చాలా విషయాలు జరిగాయి. దళాల్లోకి వచ్చే స్త్రీల విషయంలో కొన్ని యిబ్బందులుండేవి. భర్తల నుండి వారికి సహకారం లేకపోగా ఆటంకాలు వుండేవి. ఆమెతో సవ్యంగా వుండమని భర్తను హెచ్చరించేవాళ్ళం. అయినా అతడు తగాదాలు పడుతుంటే ఇంక చేయాల్సిందేముంది ఆ స్త్రీ వైపు నిలబడి విడాకులు తీసుకోమని చెప్పి పార్టీ అండగా వుంటుందని చెప్పాల్సివచ్చేది.

నేను అడవుల్లోకి వెళ్తున్నాను కదా. నా వద్ద ఒక బరువైన బ్యాటరీగల రేడియో వుండేది. జెనిత్: ఇప్పుడు జోగారావు వద్ద వున్నదనుకుంటాను. నా సామానుతోపాటు దాన్ని మోసుకెళ్ళేవాడిని. పత్రికలను ఆ అడవుల్లోకి క్రమం తప్పకుండా తెప్పించుకోవడం సాధ్యం కాదుగదా. బయట ప్రపంచంలో ఏం జరుగుతున్నదీ తెలుసుకునేందుకు ఈ రేడియో వార్తలే ప్రధానంగా వుపకరించేవి. ఆ తర్వాత ఇంకా చిన్నచిన్న రేడియోలు కావలసివచ్చాయి. దళాలు కూడా అడుగుతూ వుండేవి.

అక్కడ దాయం రాజిరెడ్డి వాళ్ళ దళం వుంది. ఇంకొందరు ముఖ్యులు కూడా వున్నారు. రాజిరెడ్డికి ప్రత్యేక కొరియర్ వుండేవాడు. ఈ కొరియర్‌లు సామాన్యంగా వ్యవసాయ కార్మికులు, పేదరైతులు. ఆ తర్వాత దళాల్లో వుండి కొంత నేర్చుకున్నా, మొదట్లో చదువు వుండేదికాదు. నాయకత్వంలో వున్న కామ్రేడ్స్ ధనికరైతులు, మధ్యతరగతి వాళ్ళు ఎక్కువగా వుండేవాళ్ళు. ఎప్పుడూ ఖచ్చితంగా పరిశీలన జరపలేదనుకోండి. వాళ్ళకు చదువు వచ్చి వుండేది.

కొత్తగూడెం గ్రామానికి వెళ్ళాము. అక్కడ బి.ఎన్., కొండలరెడ్డి వీళ్ళంతా వున్న దళం వుంది. వారు వూరుబయట కొట్టాల్లో వున్నారు. అప్పటికే బాగా పొద్దుపోయింది. వాళ్ళు భోజనాలు అవీ ముగించారు. మమ్మల్ని చూడగానే మళ్ళీ వండుతామన్నారు. అవసరంలేదు. ఏముంటే అదే తింటాము అన్నాను. అన్నం మాత్రం కొంచెం వుంది. కూరలు అవీ లేవన్నారు. ఫర్వాలేదు. అందులో కాస్త ఉప్పు కలుపుకుని, నీళ్ళు పోసుకు తింటే సరిపోతుంది అన్నాను.

'అదెట్లా' అని వాళ్ళంటే లేకుంటే యింటి దగ్గర మాదిరి అన్ని వంటకాలతో తినాలనుకునేందుకు మనం పోరాటంలో వున్నామన్న విషయం మర్చిపోతున్నారా అని నవ్వుతూ వారించాను.

అలాంటి విషయాలు నా వరకు చాలా మామూలుగానే వుండేవి. అక్కడ ఒకటి రెండు రోజులు వుండి, అక్కడ నుండి భువనగిరి వెళ్ళాలి. నేను మజిలీలు చేస్తూ దారిలో, దళాల్ని, కేంద్రాల్ని చూసుకుంటూ హైదరాబాద్ చేరాలి. అందుకని వివిధ ప్రాంతాల్లో ఆగేవాణ్ని. ప్రాంతానికి ఒక కమాండర్ వుండేవాడు. తర్వాత ప్రాంతం చేరే దాకా నాకు ప్రత్యేక రక్షణ దళాన్ని యిచ్చి పంపేబాధ్యత అంతకుముందు నేను వెళ్ళిన ప్రాంత కమాండర్ మీద వుండేది. దళాలను కలుసుకుంటూ, ప్రాంతీయ నాయకత్వంతో చర్చిస్తూ హైదారబాద్ వెళ్ళాలన్నమాట. అక్కడ ఉన్న కామ్రేడ్స్‌తో కూడా మాట్లాడాల్సి వుంది.

పోలీస్ యాక్షన్ జరిగింది కదా, ఇక దళాలు అక్కర్లేదని కామ్రేడ్స్ భావించవచ్చు. ఈ ప్రయాణంలో నాయకత్వానికంతటికి పరిస్థితి వివరించి, దళాలను అలాగే అట్టిపెట్టి వుంచామని చెప్తూ వెళ్తున్నాను. హైదారబాద్‌లో కొందరు నాయకులు వున్నారు. వాళ్ళకూ అదే విషయం వివరించాలి? సరే, సర్క్యులర్లూ అని అక్కడే తయారవ్వాలి.

కొండలరెడ్డి ఇద్దరు ముగ్గురు దళసభ్యులతో నన్ను భువనగిరి చేర్చేందుకు వస్తున్నారు. మరీ ఎక్కువ అయితే హడావుడి వుంటుంది. నాతో అంతకు ముందు నుండీ వస్తున్న దాయం రాజిరెడ్డి కొరియర్ వున్నాడు. రేడియో, గుడ్డలు, రగ్గు, పుస్తకాలు యితర కాగితాలు, వాటితో నా సంచీ బరువుగా వుంది. కొంత దూరం వెళ్ళిన తర్వాత రాజిరెడ్డి కొరియర్‌తో ఈ సంచీ కొంచెం దూరం తీసుకురా అన్నాను. సహజంగా నా సంచీ నేనేమోసుకునే వాణ్ణి 'అతడు మోసుకొచ్చేందుకు అభ్యంతరం ఏమీ చెప్పలేదుగాని, కొండలరెడ్డి ఎందుకు మోయకూడదు? అని అడిగాడు. కొండలరెడ్డి కొరియర్ కాదుగదా. అందుకని అతనేమీ అనలేదు. 'సరే నాకివ్వండి నేను మోసుకొస్తాను' అన్నాడు. "అక్కర్లేదు. నేనే మోసుకుంటాను. కాకపోతే ఆ కొరియర్ వద్ద పెద్దగా బరువులేదని, అతణ్ని తీసుకోమని చెప్పాను." అని నేనే సంచీ తీసుకున్నాను. ఆ తర్వాత ఆ కొరియర్ తనకే సంచీ యివ్వమన్నాడు. నేను అంగీకరించలేదు. "నాయకులు కేవలం మీమీదే ఆధారపడి పని చెయ్యాల్సి వస్తే చాలా కష్టసాధ్యం అవుతుంది. ఏం ఫర్వాలేదు – నీకు తెలియాలి. నువ్వు మొయ్యనన్నంత మాత్రాన సంచిని యిక్కడ వదిలి వెళ్ళననీ నేనే మోసుకుంటాను" అని చెప్పి నేను మోసుకెళ్ళాను. కొంచెం దూరం వెళ్ళిన తర్వాత "నేను పొరపాటు చేశాను. నాకాసంచీ యివ్వండి, మోసుకొస్తాను" అని కొరియర్ బతిమలాడసాగాడు. నేనుససేమిరా వొప్పుకోలేదు. 'నా బరువు నేను మోసుకోగలనని, నీకు తెలిసిందికదా. ఇకనువ్వు కొండలరెడ్డికి యివ్వమన్నంత మాత్రాన యివ్వనని తెలిసింది కదా. అని నేనే పంతంగా చివరిదాకా నా సంచీ మోసుకున్నాను. ఇలాంటి ఘటనలు చాలా చిన్నవిగా కన్పిస్తాయిగానీ,



కామ్రేడ్స్‌పై ఎంతో ప్రభావాన్ని కలిగిస్తాయి. సరే యిలాంటి గుణపాఠాలు చెప్పాలంటే ముందు మన వంట్లో సత్తువ వుండాలి. అది వేరే విషయం.

నేను రామన్నపేట ప్రాంతం వెళ్ళాను. అక్కడ నుండి కొండల రెడ్డి దళం నా కొరియర్ తిరిగి వెళ్ళారు. అక్కడ కట్కూరి రామచంద్రారెడ్డి, ఆయన భార్య సుశీల తదితరులు, ఇతర దళ సభ్యులు వున్నారు. 'ఈ బరువంతా ఎక్కడ మోసుకెళ్తారు. ఏదన్నా ఎడ్లబండి ఏర్పాటు చేద్దాం అని రామచంద్రారెడ్డి అన్నారు అదిసరేగానీ స్త్రీలనెందుకు యిక్కడ వుంచారు. వాళ్ళాదళాల్లో వుంటేసరే. ఏదో పోరాటానికి సహాయకారులుగా అవసరం అయితే సరే. కానీ భార్యగదా యిక్కడే వుంటుంది అనుకోవడం పొరపాటు. వాళ్ళకు ఇళ్ళవద్ద ప్రమాద పరిస్థితి వుంటే, ఎక్కడకన్నా పంపించాలి. మరీ తప్పకపోతే మనతో తెచ్చుకోవాలి. ఇలా నాయకులు భార్యలతో వుంటుంటే మామూలు దళ సభ్యులలో 'మేం కూడా మా కుటుంబాలతో వుండకూడదా, ఆయన భార్యను తెచ్చుకోలేదా' అన్న అభిప్రాయ భేదాలొస్తాయి అని చెప్పాను. పైగా, అనవసరంగా జనం ఎక్కువయిన కొద్దీ, అవసరాలు పెరగడం, సమాచారం శత్రువుకు చేరే అవకాశాలు పెరగడం జరుగుతాయి జాగ్రత్తగా వుండండి అని హెచ్చరించాను. ఆ తర్వాత కొద్ది రోజులకే రామచంద్రారెడ్డి అరెస్టయ్యాడు.

అలాగే దారిలో ఎస్.వి.కె. ప్రసాద్ దళాన్ని కూడా కలుసుకున్నాను. అయనొక చిన్న అడవిలో వుంటున్నాడు. రక్షణ సరిపోయినంతగా లేదనిపించింది. నువ్వు ఇక్కడనే ఉండి యింకా దట్టమైన అడవిలోపలికి వెళ్ళి తగిన రక్షణతో వుండాలని హెచ్చరించాను. అక్కడ నుండి భువనగిరి వెళ్ళాను. భువనగిరి వెళ్ళిన తర్వాత ఎస్.వి.కె. ప్రసాద్ అరెస్టయ్యాడని తెలిసింది. మామూలు సరుకుల కోసం వూళ్ళోకి మనిషిని పంపాడట. వూళ్ళో ఎవరో పోలీసులకు సమాచారం చేరవేసే వాడున్నాడు. అతడు ఆ మనిషిని వెంబడించి, వీళ్ళుండే చోటు కనుక్కుని పోలీసులకు చెప్పాడు. పోలీసులు చుట్టుముట్టారు. ఎస్.వి.కె. వాళ్ళు ప్రతిఘటించినా చిక్కారు. వాళ్ళని హైదరాబాద్ తీసుకువచ్చి పోలీసులు చాలా చిత్రహింసలు పెట్టారు.

అయితే ఒక జాగ్రత్త వుండేది. ఎవరికీ తన పరిసరాలలో వున్న దళాన్ని గూర్చి తప్ప బయట సమాచారం పెద్దగా తెలిసేదికాదు. దానివల్ల దొరికిన వాళ్ళు చిత్ర హింసలకు తట్టుకోలేక సమాచారం చెబుదామన్నా వాళ్ళు చెప్పగలిగిందే చాలా తక్కువ. ఈ ముందు జాగ్రత్త చర్య మాకు చాలా సహకరించింది.

చాలా సందర్భాలలో చిత్రహింసలను భరించేవాళ్లేగానీ, పోలీసులకు వివరాలు చెప్పేవారుకాదు. అథవా చెప్పినా వాళ్ళకు తెలిసిందే తక్కువ. అందువల్ల ఆ రోజుల్లో ముఖ్యంగా అడవి ప్రాంతాల్లో పెద్దగా నష్టం జరిగిందని చెప్పలేము.

ఆ తరువాత ప్రయాణంలో నంద్యాల శ్రీనివాసరెడ్డి దళాన్ని కలుసుకున్నాను. ఆయన మాత్రం "మీరిలా దళాలను కూడా కలుసుకుని వాళ్ళకు వివరించి వుత్సాహపరిచి వెళ్ళడం మంచిదే. కానీ, చాలా ప్రమాదం. దాదాపు బహిరంగంగా తిరిగినట్లే ఉన్నది" అని హెచ్చరించాడు. "ఏం చేయమంటావ్. అసలు దళాలకు విషయాలు తెలియకుండా, వుత్సాహంగా వారు నిలబడకుండా చేసేదేముంటుంది. సరే నాకు తోచిన జాగ్రత్తలు నేను తీసుకుంటున్నాను. అందుకే చక, చకా స్థావరాలు మారుస్తున్నాను" అని చెప్పాను.

ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమల వాళ్ళను కూడా కలుసుకున్నాను. వాళ్ళకు ప్రజల్లో పలుకుబడి వుంది. ఇరువురూ చాలా కష్టపడి పని చేసేవాళ్ళు. వాళ్ళు సామాన్య ప్రజానీకంలో కలిసిపోయిన తీరు నాకెంతగానో వచ్చింది. ప్రజలు కూడా వాళ్ళని ప్రేమాభిమానాలతో చూసేవాళ్ళు.

అక్కడ సీతాఫలం పళ్ళుబాగా వున్నాయి. చాలా తిన్నాను. మాటల్లో కమల బంధువుల వద్దనున్న తన రెండేళ్ళ కొడుకుని ఆ మర్నాడు తీసుకువచ్చి చూపించి తీసుకెళ్ళమన్నానని చెప్పింది. అప్పటిదాకా వాళ్ళకెంతమంది పిల్లలో నాకు తెలియదు. "రెండేళ్ళ పిల్లణ్ని వదిలి వచ్చానన్నమాట. మంచిది. నీ కొడుకును చూడాలనుకోవడంలో తప్పులేదు. కానీ, జాగ్రత్తగా వుండాలి. ఎవరన్నా వెంబడించవచ్చు" అని చెప్పాను.

అక్కడ నుండి మరో రక్షిత దళాన్ని, కొరియర్‌ను తీసుకుని బయలుదేరి పద్మారెడ్డి, రామచంద్రారెడ్డి, కోదండరామిరెడ్డి వీళ్ళని బ్రహ్మణపల్లి వద్ద కలుసుకున్నాను. అంటే బి.బి.నగర్ ప్రాంతమన్న మాట. వాళ్ళతో చర్చించాను. ఈ కోదండ రామిరెడ్డిని కూడా ప్రజలు ఎంతగానో అభిమానించేవాళ్ళు. అప్యాయంగా 'పెద్దన్న' అని పిలుచుకునే వాళ్ళు. అక్కడ నుండి హైదరాబాద్‌కు కొరియర్‌ను యిచ్చి ఆయన పంపాడు.

1948 సెప్టెంబరు – నవంబరు మధ్య కాలం. నవంబర్ నాటికే బాగా చలిగా వుంది. గడ్డిగాని, జొన్న చొప్పగానీ కింద వేసేవాళ్ళు. నా రగ్గు నాకు ఎట్లాగూ వుంది. ఎవరైనా కామ్రేడ్స్ సరిగా కప్పుకునేందుకు లేక వణుకుతుంటే నా రగ్గులోకి రమ్మని పిలిచేవాణ్ణి. తెలంగాణా రైతాంగం సహజంగానే ముతకరగ్గు నొకదాన్ని భుజాలపై వేసుకు తిరుగుతారు. చలి నుండే కాదు, వాన నుండి కూడా మంచి రక్షణ ఇస్తుందారగ్గు. వాన చినుకులు చొచ్చుకురాలేవు.

హైదరాబాద్‌లో మహేంద్ర అన్నీ చూస్తుండేవాడు. కొందరు రైల్వే కార్మికులు వుండేవారు. వారు మహేంద్ర దగ్గరకు వచ్చేవారు. మహేంద్ర భార్య కూడా రహస్య జీవితం గడుపుతుండేది. రాజ్‌బహదూర్ గౌడ్, బ్రిజ్‌రాణి కూడా వుండేవాళ్ళు. అప్పటికింకా వారికి



వివాహం కాలేదు. రంగాచారి అని ఒక చిత్రకారుడు కూడా వుండేవాడు. ఆ రంగాచారి 1946లో అరెస్టయ్యాడు. రాజిరెడ్డి అని యింకో అతను, వీళ్ళిద్దర్నీ జైలు నుండి తీసుకువెళ్ళి ఆ తర్వాత కాల్చేశారు.

ఇక్కడకు వచ్చేదారిలోనే భువనగిరి దగ్గర్లోనే నరసింహారెడ్డిని కలుసుకున్నాను. ఆయన మధ్యతరగతి రైతు రహస్య జీవితంలో పేరు రాజన్న అందరికీ తలలో నాలుకలా వ్యవహరించేవారు.

వెంకట నర్సింహారెడ్డి నాకెంతో నచ్చాడు. అందరూ ఆయనను గౌరవించేవారు. రామచంద్రారెడ్డి, పిచ్చయ్య అని పిలిచేవాళ్ళు. పద్మారెడ్డి ఆజాను బాహుడు. వీళ్ళను నేను కల్సుకున్నాను. రాచకొండ ప్రాంతాలలో వుండేవాళ్ళు. ఆ తర్వాత నిర్బంధ విధానం పెరిగిన తర్వాత నల్లమలై అడవులలోకి వెళ్ళారనుకోండి. అయినా కొన్ని దళాలు అక్కడ వుండేవి. హైదరాబాద్ నగరానికి, నల్లమలై అడవులకు మధ్య అనుసంధానికిగాను ఉపయోగపడేవి. కృష్ణమూర్తి దళాలతో ఇబ్రహీంపట్నం ప్రాంతంలో వుండేవాడు. అమరాబాద్ ప్రాంతానికి అనుసంధానంగా కృష్ణమూర్తి వుండేవాడు. అయితే, అక్కడ రాజన్న అని మరో కామ్రేడ్, కృష్ణమూర్తికన్నా పెద్ద. ఆయన మంచి క్రమశిక్షణ గలవాడు, ప్రజాభిమానం చూరగొన్నవాడు. ఇద్దరూ సమర్థులే. అయితే రాజన్న మరింత అనుభవం గలవాడు.

ఈ ఏర్పాట్లన్నీ చూసుకుంటూ, నేను హైదరాబాద్‌లో వుండేవాణ్ణి. నేను వున్నది ప్రధాన రహస్య స్థావరం. మహేంద్ర ఆ స్థావరానికి బాధ్యుడు. ఇంకా కొన్ని రహస్య స్థావరాలుండేవి. మా స్థావరం మహేంద్రుకు, అతని కొరియర్‌కూ తప్ప వేరే ఎవరికీ తెలియదు. అందుకని మమ్మల్ని కల్సుకోవాలంటే, ఎవరూ స్థావరానికి సరాసరి వచ్చే అవకాశం లేదు. బయట వేరేచోట వాళ్ళు వేచివుంటే, మహేంద్ర లేకపోతే అతడి కొరియర్ మాత్రం వెళ్ళి కల్సుకుని సమాచారం జేరవేసే వారు ఈ జాగ్రత్త చాలా అవసరం. మేమే ఎవరన్నా కలుసుకోవాలంటే సాధ్యం. కాని, మమ్మల్ని ఎవరూ తమంత తాముగా కల్సుకోలేదు. అలా కాకపోతే మా స్థావరం బయటపడిపోతుంది. ఎవరన్నా కల్సుకోవాలంటే, మహేంద్ర ఏర్పాటు చేసిన స్థలానికి మేము వెళ్ళేవాళ్ళం. మహేంద్ర లేకపోతే అతడి కొరియర్ అజాగ్రత్తవల్ల తప్ప మా స్థావరం బయటపడడం అసాధ్యం.

ఒకవేళ మమ్మల్ని కలుసుకున్న కామ్రేడ్ నిర్బంధింపబడినా, ఎంత చిత్రహింసలకు గురైనా, మా స్థావరం గూర్చి తెలియజేయలేడు. అతనికే తెలియదు కదా. హైదరాబాద్ ప్రత్యేకంగా వుండాలనే వాదన వుందని చెప్పాను కదా. అది చాలా ప్రమాదకర నినాదం అని మేము చెప్పాము. అది వేరే సంగతి. అలా వాదించిన కామ్రేడ్స్‌లో ఒకరు రంగాచారి. ఆ తర్వాత అతణ్ణి పోలీసులు అరెస్టు చేసి, కాల్చి చంపారు. ఈ రోజు మహేంద్ర, వాళ్ళ కుటుంబం ఎలా

వున్నదీ, రాజకీయాలేమిటి అన్న ప్రశ్న ఎలావున్నా, ఆ రోజుల్లో వాళ్ళు పార్టీకి ఎంతో అండగా వుండేవాళ్ళు. ఆ తర్వాత ఆయుధాలు సేకరించడంలో కూడా ఎంతగానో తోడ్పడ్డారు చాలా ధైర్యసాహసాలు ప్రదర్శించారు.

హైదరాబాద్‌లో వుండగా కోదండరామిరెడ్డి దళం పోలీసులచే చుట్టుముట్టబడిందనీ, కోదండరామిరెడ్డి పోరాడుతూ మరణించాడనీ తెలిసింది. మూసీనది దాటుతుండగా దళాన్ని పోలీసులు చుట్టివేశారనీ, తిరుమలరెడ్డి కూడా పోరాడుతూ మరణించాడనీ, తిరుమలరెడ్డి, పద్మారెడ్డి కూడా తన దళం పోలీసు వలయాన్ని ఎదుర్కొని, కాల్పులు జరుపుతూనే హతుడైనాడనీ తెలిసింది. ఇక్కడొక విషయం చెప్పాలి. ఈ కామ్రేడ్‌లాగానే చాలా మంది మరణించారు. అయితే మేకపోతులల్లే కాదు, తమ తుపాకులతో పోరాడుతూనే కొంత మంది దళ సభ్యులు నిరాయుధులుగా దొరికితే పోలీసులు వాళ్ళని అరెస్టు చేసి, వెన్వెంటనే కాల్చి చంపారు. జైళ్ళకు పంపడం, విచారణ – అలాంటివేమీ ఆ దశలోలేవు.

పైగా పోలీసులకు చిక్కితే పరిస్థితి మరీ దుర్భరం. ఆ చిత్రహింసలూ, అవీ ఎలాగు పోలీసులు చంపడం ఖాయం. అందుకే ఆయుధాలు తమ వద్ద వుండగా ప్రాణాలతో పోలీసులకు దొరికిన వారు చాలా అరుదు. వీళ్ళ ధైర్యసాహసాలకు పోలీసులే ఆశ్చర్య పోయేవాళ్ళు.

ఇవన్నీ జరుగుతున్నాయి కనుక మా రాష్ట్ర కమిటీ సమావేశమై పరిస్థితిని సమీక్షించాలని భావించాము. అప్పటికే అరెస్టులు ఎక్కువైనాయి. ఇది 1949 చివర్లో అనుకుంటాను. అరెస్టులే కాలేదు పోరాటం జరుగుతున్న ప్రాంతాలలో కాల్చివేయడాలు అధికమైనాయి.

ఆ సమావేశంలో పోరాటం కొనసాగించాలనీ, తెగిపోయిన సంబంధాలను పునరుద్ధరించాలనీ నిర్ణయం తీసుకున్నాం. రహస్యంగా కదా సమావేశం జరిగింది. ఆ సమావేశం జరిగే సమయంలోనో జరిగిన వెంటనే కాబోలు నాకు టైఫాయిడ్ వచ్చింది. కొన్ని రోజులు తాత్కాలికంగా మా కేంద్రాన్ని రాజమండ్రికి మార్చాము. డాక్టర్ రాజారావు నాకు వైద్యం చేశాడు. ఆ తర్వాత వైజాగ్‌కు మార్చాము. అక్కడ నుండి కూడా ఆ తర్వాత మార్చాము.

1950లో అఖిలభారత కేంద్రం ఏర్పడింది. రాజేశ్వరరావు అక్కడ వుండేవాడు. అంతకుముందు రాజేశ్వరరావు, బసవపున్నయ్య, చంద్రం అందరూ రహస్యంగా యిక్కడే వుండేవాళ్ళు 1948 ఫిబ్రవరిలో పార్టీ రెండవ అఖిలభారత మహాసభ జరిగింది. ఆ తర్వాత నుండి వాళ్ళక్కడే 1950 వరకూ వున్నారు.

చంద్రాన్ని తర్వాత పోలీసులు బూతుమిల్లిపాడులో అరెస్టు చేశారు. ఆయన ఆ ఊళ్ళో వున్నట్లు పోలీసులకు ఆచూకీ దొరికింది. ఊరు చుట్టుముట్టేశారు. చంద్రం పార్టీకి సానుభూతిపరులైన వాళ్ళ ఇంట్లో వుంటున్నాడు. ప్రతి ఇల్లూ వెతుకుతారని ఆయనకు తెలుసు.



తను ఇంట్లో వుండి అరెస్టయితే, ఆతిథ్యం యిచ్చిన కుటుంబానికి కూడా తిప్పలు తప్పవు. అందుకని, ఇంట్లోంచి బయటకు వచ్చాడు రోడ్డుమీద ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. మనకు ప్రమాదం ఏర్పడితే, వీలైనంత వరకూ మనకు అతిథ్యం యిచ్చిన వారికి, మన వలన కష్టాలు కలుగకుండా చూడాలన్నది నాయకత్వ అభిప్రాయం. దానికనుగుణంగానే చంద్రం వ్యవహరించాడు. అటువంటి ఘటనలవల్ల కూడా ప్రజలకు, నాయకులపై గౌరవం, అభిమానం యినుమడించేవి.

ఆయనను తమకు అనుకూలంగా లొంగిపొమ్మని పోలీసులు వత్తిడి తెచ్చారు. లొంగిపోయే ప్రశ్నేలేదు. కావాలంటే కాల్చుకోమని చంద్రం ధైర్యంగా నిలబడ్డాడు. అప్పటికింకా యిలా కన్పడితే కాల్చేయడాలు ఆరంభం కాలేదు. ఆయనను రాజకీయ ఖైదీగా నిర్బంధించారు. 1950 చివరి వరకూ జైల్లో వున్నారు. 1950 చివర్లో ఆయన తల్లి, నాయనగారు మరణించారు. ఆయన పెరోల్‌పై వచ్చి, అటునుండే తప్పించుకుని రహస్య జీవితంలోకి వచ్చాడు.

# రహస్య యంత్రాంగం - నాటి సహచరులు

రహస్య యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవడం, రహస్య స్థావరాలు కొరియర్‌లు, వాటి మధ్య సమన్వయం, ఉత్తరాలు పంపుకునేందుకై మారు అడ్రస్‌లు వీటన్నింటినీ ఏర్పాటు చేసుకోవడం ఒక ముఖ్యమైన పని. 1950 మే తర్వాత కామ్రేడ్ జయపాల్‌సింగ్ వచ్చాడు. ఒక ఏడాదిపాటు మాతో ఉన్నాడు. ఆయన, ఈ రహస్య యంత్రాంగ నిర్మాణాన్ని చూసి చాలా ఆశ్చర్యపోయాడు. పైగా రహస్యంగా వుంటూనే పత్రిక వెలువరించేవాళ్ళం.

1949 ఆరంభంలో కామ్రేడ్ ఎస్.వి. భాస్కరరావు నా ప్రత్యేక రహస్య స్థావరానికి బాధ్యుడుగా వుండేవాడు. వాళ్ళ అమ్మగారు అతడు కలిసి. భాస్కరరావుకు 18 సంవత్సరాలుండేవి. అప్పటి నుండి రహస్యకాలం అంతా అతడే బాధ్యతలో వుండేవాడు. బసవపున్నయ్య అప్పుడప్పుడు కేంద్రానికి వెళ్ళి వస్తుండేవాడు. ఆయన స్థావరం వేరే వుండేది. గోళ్ళ రాధాకృష్ణమూర్తి ఆ స్థావరానికి బాధ్యుడు. బసవపున్నయ్య ఒకోసారి వేరే స్థావరంలో వుంటూ, ఈ కార్యక్రమాన్నంతా సమన్వయం చేసేవాడు. చాలా ప్రమాదమైన పని.

ఈ భాస్కరరావుగాని, రాధాకృష్ణమూర్తిగాని యివ్వాళ్టి వాళ్ళుకారు. 1949 చివరికి వచ్చేసరికి ఈ ప్రాంతంలో కూడా కాల్చి చంపడాలు ఆరంభమైనాయి. హైదరాబాద్ నగరంలోనే కాదు. చాలా పట్టణాల్లో, ఈ రహస్య స్థావరాలు ఏర్పాటు చేసుకోవలసివచ్చేది. ఆ రోజుల్లో పట్టణాల్లో ఎవరన్నా కొత్తగా అద్దెకు దిగారేమోనని పోలీసులు సమాచారం సేకరిస్తూ వుండేవాళ్ళు. వారిపై నిఘా వేసివుంచేవారు. వాళ్ళు తెలివితక్కువ వాళ్ళేంకాదు. ఇలాంటి విషయాల్లో అనుభవం వున్నవాళ్ళు.

పగటిపూట తిరగడం సాధ్యమయ్యేదికాదుగదా. రాత్రిపూట బయటకు వెళ్ళాలి. పోలీస్ నిఘా వుండేది. నిఘా వున్నట్లు తెలియనిచ్చే వాళ్ళుకాదు. అయినా మా అనుభవం మాకు వుంది కదా. ఆ పోలీస్‌పై మా నిఘా మేము వేసేవాళ్ళం. ఇలా చాలా జాగ్రత్తలు



తీసుకునేవాళ్ళం. పోలీసులకు ఫలానా యింటిపై అనుమానం ఏర్పడినా వెంటనే దాడి చేసేవారు కాదు. అక్కడి నుండి బయటకు వచ్చిన వారిని చాటుగా వెంబడించి ఇతర సంబంధాలు, స్థావరాలు కూడా తెలుసుకుని ఒక్కసారే స్థావరాలపై దాడి చేసేవారు.

మేము ఎక్కడన్నా యిల్లు అద్దెకు తీసుకుని స్థావరంగా కొనసాగించడం అంత సులభంగా వుండేది కాదు. మొదటిది నిజంగానే ఏదో ఆస్పత్రి పని మీదో, దేనిమీదో వచ్చి నివసిస్తున్న కుటుంబంలాగా ఏ మాత్రం వింతగా కన్పడకుండా సహజంగా వున్నట్లు నటించాలి. రెండోది చాలా డబ్బు కూడా ఖర్చయ్యేది. అయితే ఉద్యమం వుంది. అక్కడ దళాలు రంగంలో వున్నాయి. డబ్బుకు ఇబ్బంది పడలేదని చెప్పలేముగాని సరిపోయేదే. సానుభూతిపరులు యిచ్చేవాళ్ళు. తెలంగాణా పోరాట దళాలకు అవసరమైన సరఫరాలను కూడా సమకూర్చి పంపడం ఒక ప్రధానమైన పనిగా వుండేది.

తెలంగాణా ప్రాంతంలో భూస్వాములపైన తదితర వ్యాపారస్తులపైన పన్ను వేసేవాళ్ళం. అదీగాక సామాన్య ప్రజలు ప్రేమతో యిచ్చేవారు. మొత్తానికి తెలంగాణా నుండి బాగానే పైకం వచ్చేది. అయితే ఆ పైకాన్ని ఎక్కడో ఒక్క చోటగా దాచేవాళ్ళం కాదు. దళాలయితే అరసంచికి సరిపోను తమ వద్ద వుంచుకుని మిగతాది దాచుకునే ఏర్పాటు చేసుకునేవారు. మేము కూడా చాలా చోట్ల పైకం దాచేవాళ్ళం. సానుభూతిపరుల వద్ద ఒక్కరి దగ్గర వుంచేవాళ్ళం కాదు. ఒక విధంగా వికేంద్రీకరణ అన్నమాట. నేను మామూలుగా వందలనుమించి వేలల్లో పైకం వుంచుకుని తిరిగేవాణ్ణికాదు. ఈ రహస్య యంత్రాంగాన్ని కొనసాగించడం, బాగా ఖర్చుతో కూడినపని అని కామ్రేడ్స్ తెలుసుగనుక కేంద్ర నిర్వహణకు అవసరమైన పైకం తెలంగాణా కామ్రేడ్స్ నుండి, అలాగే ఇతరత్రా సానుభూతిపరుల నుండి వచ్చేది.

ప్రజలు యిచ్చిన విరాళాలే ప్రధానమైనవి. మనం వారి కోసం పని చేస్తున్నామని వారు గ్రహిస్తే యిస్తారు. ఈ పోరాటం మొత్తానికి అవసరమైన డబ్బు మొత్తం మన రాష్ట్రం నుండే వచ్చింది. ప్రభుత్వం మాత్రం రష్యా వాళ్ళు పైకం పంపుతున్నారంటూ ప్రచారం చేసేది. అంతా శుద్ధ అబద్ధం. 1933-34 నుండి నాకు తెలుసు. రష్యా డబ్బు అంటూ ఎప్పుడూ అందుకోలేదు. పార్టీ కేంద్రం కూడా పెద్దగా ఆర్థికంగా సహాయం చేయగల స్థితిలో వుండేది కాదు. ఎప్పుడన్నా కొత్తలో మరీ అవసరమయి మూడొందలు, నాలుగొందలు అట్లా తీసుకున్నా మేమోగానీ, కేంద్రం నుండి క్రమబద్ధంగా పైకం తీసుకోవలసిన అవసరమేర్పడలేదు. పైగా పార్టీ కార్యాలయాలు మద్రాసులో, బొంబాయిలో, ఢిల్లీలో ఏర్పాటు చేయవలసి వచ్చినప్పుడు మేమే కేంద్రానికి అధికంగా కూడా సాయపడేవాళ్ళం.

నేను పార్టీలోకి వచ్చిన తొలి దశలో, పార్టీ కేంద్ర కార్యాలయం కలకత్తాలో వుండేది. ఒకసారి కలకత్తా నుండి వస్తున్నాను. నా వద్ద మూడు వందల రూపాయలు వున్నాయి.

మద్రాస్ మెయిల్‌లో వస్తున్నాను. తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకై కక్కసుకు వెళ్ళాను. నా జేబులో పర్సు జారి కంతలోగుండా రైలు పట్టాలపై పడిపోయింది. నేను గొలుసు లాగాను. వెంటనే రైలు ఆగలేదు, మళ్ళీలాగాను. చాలా దూరం వెళ్ళి ఆగింది.

రైలెందుకాపావని, రైల్వే పోలీసులు వచ్చి అడిగారు. ఇట్లా పర్సుపోయింది. నాకున్నదే ప్రస్తుతానికి అది అని చెప్పాను. సరే వెనక్కి వెళ్ళిపట్టాల మీద వెతికాను. పర్సు మాత్రం వుంది. పైకం మాత్రం అప్పటికే కొట్టేశారన్న మాట. రైల్వే వాళ్ళు ఫిర్యాదు నమోదు చేసుకున్నారు. ఆ తర్వాత నేను జైల్లో వుండగా, ఇద్దరు కానిస్టేబుల్స్ వచ్చి నన్ను తీసుకువెళ్ళి 50 రూపాయలు దొరికినాయని యిచ్చారు. నాకు గుర్తున్నంతలో నేను కేంద్రం నుండి ఆ 300 తప్ప తీసుకున్న గుర్తులేదు.

1950 మధ్య వరకు హైదరాబాద్‌లో నేను, దేవులపల్లి, బి.ఎన్. విడివిడిగా ప్రత్యేక స్థావరాలలో వుంటుండే వాళ్ళం. బి.ఎన్.ను ఆ తర్వాత మళ్ళీ అడవుల్లోకి పంపాము. అంటే ప్రత్యేకంగా తెలంగాణాకు కమిటీ అంటూ ఏర్పడలేదు. 1952 తర్వాత ఏర్పాటయింది. అయినా పోరాట నిర్వహణ సౌలభ్యం కోసం అక్కడ వుంటూ మేము సమన్వయం చేసుకుంటూ కమిటీగా వ్యవహరించేవాళ్ళం.

కామ్రేడ్ లీల ఈ రహస్య కాలంలో మాతో స్థావరాల్లోనే వుండేది. అక్కడి కామ్రేడ్స్‌కు చేదోడువాదోడుగా వుండేది. నేను అడవులలోకి, దళాల వద్దకు వెళ్ళే సందర్భాలలో తప్ప, మా రహస్య స్థావరాలలో మాతోనే వుండేది. ఈ యంత్రాంగం నిర్వహించడంలో చురుకుగా జాగ్రత్తగా తోడ్పడేది.

1949 నుంచి 52 వరకు రహస్యకాలం ముగిసిన పిదప నాతోపాటు ఢిల్లీ వచ్చింది. పార్లమెంటరీ ఆఫీసు నిర్వహణలో తోడ్పడేది. ఆ తరువాత 55లో నేను తిరిగి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చినప్పుడు నాతోపాటు వుంటూ ఎంతో సహకరించేది. ఇంత చేస్తున్నా తానెప్పుడూ ప్రత్యేకంగా గుర్తింపు పొందాలని ఆశపడలేదు, ప్రయత్నించలేదు. ఇవన్నీ ప్రత్యేకించి లీల గురించి చెప్పడం కొంచెం ఎబ్బెట్టుగా అనిపిస్తుందిగాని ఆమె చాలా వరకు సర్దుకుపోయేది. కామ్రేడ్స్‌ను ఎంతో ఆదరంగా చూసేది. పిల్లలంటే మరీ ఆపేక్షగా వుండేది. పిల్లలు కూడా ఆమెంటే ఎంతో ఇష్టపడేవారు. ఆ రోజుల్లో రహస్యంగా కొంత మంది కామ్రేడ్స్‌కు సాయుధ శిక్షణ గరిపాం. లీల వారందరిపట్ల ఎంతో ఆప్యాయతతో వుండేది. వేరే రాష్ట్రం నుండి వచ్చిన లీల మన కామ్రేడ్స్‌తో కలిసిపోయిన తీరుకు వారెంతో ప్రశంసించేవారు.

ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటే లీల కష్టపడి పని చేసే స్వభావం కలదనీ, మన కామ్రేడ్స్‌కు సహాయపడే సుగుణం ఉన్నదనీ, ప్రత్యేకించి నాకెంతగానో తోడ్పడిందని మాత్రం చెప్పగలను.



కామ్రేడ్ రాజన్న గురించి ఇంతకు ముందు చెప్పానుకదా. ఆయనకు లీల పట్ల ప్రత్యేక అభిమానం వుండేది. రాజన్న చాలా మంచి కామ్రేడ్. డబ్బుల విషయంలో ఎంతో పొదుపు. ఆయన తోటి కామ్రేడ్స్‌తో ఎంతో స్నేహంగా మెలిగేవాడు. వారెవరన్నా పొరపాటు చేస్తే కూర్చోబెట్టి ఓపిగ్గా నచ్చచెప్పేవాడు. ఎవరిపైనా ఎప్పుడూ ఆయన కోపించినట్లు తెలియదు. రాజన్న ఇప్పటికీ బతికే వున్నాడు. ఆయన కొడుకు ఇ.సి.ఐ.ఎల్.లో ఉద్యోగం చేస్తున్నాడు. మన పార్టీ శాఖా కార్యదర్శి. ఆయన కూతుర్ని వరంగల్ జిల్లాలోని మనపార్టీ సభ్యుడొకతను వివాహం చేసుకున్నాడు. మొత్తం కుటుంబం పార్టీతోనే వుండేది. ఆ తరువాత వారెన్నో కష్టాలు అనుభవించారు. ధనిక రైతు కుటుంబం నుంచి వచ్చినా తమకు పార్టీవల్ల ఇన్ని కష్టనష్టాలు వచ్చాయని ఎన్నడూ బాధపడి ఎరుగడు నేనే రహస్య పరిస్థితి అయిపోయిన పిదప వాళ్ళ కుటుంబ అవసరాలు ఏమిటి అని పరామర్శిస్తుండేవాడిని. పెద్దగా ఆర్థిక సహాయం చేసింది కూడా ఏమీలేదు. తరువాత కొడుకులు ఎదిగి వచ్చి ఉద్యోగాల్లో స్థిరపడిన తర్వాత ఇప్పుడు ఆ కుటుంబం కొంచెం స్థిరపడ్డది.

ఆ రోజుల్లో చాలా జాగ్రత్తలు తీసుకునేవాళ్ళం. అయినా ఎక్కడో ఓ చోట రహస్యం బయటపడేది. కామ్రేడ్స్ కాల్చివేయబడేవారు. అప్పుడు మన ముద్రణాలయానికి మేనేజరుగా నాగులపల్లి కోటేశ్వరరావు ఉండేవాడు. పార్టీ రాష్ట్ర కేంద్ర స్థావరానికి, బయటకు ఆయన అనుసంధానం చేసేవాడు. ఒకసారి మేమున్న చోటుకు వద్దామని బయలుదేరాడు. మేము ఎక్కడ వుండేది ఖచ్చితంగా ఆయనకు తెలియదు. ఆ ప్రాంతం మాత్రం తెలుసు. మా కోసం అక్కడకు వచ్చి వెతుకుతున్న సందర్భంలో పోలీసులు అరెస్టు చేశారు. తీవ్రమైన చిత్రహింసలకు గురి చేశారు. అయినా ఆయన నుండి ఒక్కమాట కూడా రాబట్టలేకపోయారు. చివరకు కాల్చి చంపేశారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లాలో మృత్యుంజయుడు, నర్రా ఆంజనేయులు, ఈడ్పుగంటి రామచంద్రరావులు కూడా కాల్చివేయబడ్డారు. తూర్పుగోదావరి జిల్లాలో కందిగట్ల నాగభూషణం, అనంతం, సి. హెచ్. సత్యనారాయణరాజు, దాసు వీరు కూడా పోలీసుల చేతుల్లో హతమయ్యారు. మా దగ్గరకు వచ్చి మాట్లాడి వెళుతుండగా దారిలో పోలీసులు వారిని అరెస్టు చేసి కాల్చి చంపారు. ఈ కామ్రేడ్స్ మరణమన్నది పార్టీకి చాలా తీవ్రమైనలోటు. ఇప్పటికి కూడా ఆ లోటును సంపూర్ణంగా పూడ్చుకోలేక పోతున్నాం. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో నేటికి ఆ కొరత కనిపిస్తూనే వున్నది. యువకులు రావాలి. అమరవీరులు వదిలి వెళ్ళిన స్థానాన్ని భర్తీ చేయాలి.

ఆ మాటకొస్తే కృష్ణాజిల్లాలో కూడా తక్కువ నష్టం జరగలేదు. దివి తాలూకా, గన్నవరం తాలూకా, విజయవాడ తాలూకాల్లో కూడా చాలా మంది కామ్రేడ్స్‌ను మనం కోల్పోయాం. అనుమర్లపూడి సీతారామారావు జైల్లో కాల్చివేయబడ్డాడు. విజయవాడ తాలూకాకు చెందిన 9 మంది ఒక దళంలో వుండేవారు. ఆ తొమ్మిది మంది కాల్చివేయ బడ్డారు. గుంటూరు

జిల్లాలో కూడా ఈమని మల్లిఖార్జున శర్మ, సత్తెనపల్లి ప్రాంతంలో దండా నారాయణస్వామి, బాపట్ల ప్రాంతంలో చివుకుల శేషశాస్త్రి, కంఠంనేని వెంకటరత్నం – యిలా ఆణిముత్యాల్లాంటి కామ్రేడ్స్ పోలీసులు చేతుల్లో హతులైనారు. ఇలా మళ్ళీమళ్ళీ దెబ్బలు తగులుతూ వుండేవి. మరింత జాగ్రత్తలు తీసుకుంటూ సాగిపోతుండే వాళ్ళం. మాలాంటి కామ్రేడ్స్ కూడా –నేను, రాజేశ్వరరావు లాంటి వాళ్ళం – చాలా జాగ్రత్తలు తీసుకొని వ్యవహరించేవాళ్ళం.

రాజేశ్వరరావు, బసవపున్నయ్య యిక్కడున్నంత వరకు వీటన్నింటా వారి పాత్ర కూడా ఎంతగానో వుంది. వాళ్ళు కేంద్రానికి వెళ్ళింతరువాత నేను ప్రత్యేకంగా బాధ్యత తీసుకోవలసి వచ్చింది. ఈ ప్రాంతాల్లో కామ్రేడ్స్ నివసించడమే కష్టమయ్యేది. కాస్తయినా రక్షణ లభిస్తుందని కొందరు అడవుల్లోకి వెళ్దామని భావించారు. కొంతమంది తలదాచుకొనేందుకై రాయఘర్, పూనా, నాగపూర్ యిలా తమకు ఇష్టమొచ్చిన చోటికి వెళ్ళారు. వారందరితో సంబంధాలు పెట్టుకోవాలి. అక్కడ కూడా వారికి రక్షణ కల్పించాలి. ఇందులో కొంచెం జాప్యం జరిగినా వాళ్ళక్కడ దొరికిపోయేవారు. కొందరు కాల్చివేయబడ్డారు కూడా. చలసాని జగన్నాథరావు, బోగాగుల రామారావు లాంటివాళ్ళు, అప్పటికే వారిని కలుసుకొని సురక్షిత ప్రాంతాలకు చేర్చమని ఒక కామ్రేడ్‌కు నేను వివరాలు అన్నీ యిచ్చాను. ఆ కామ్రేడ్ తనకేదో చిన్న పని వుందని, అది పూర్తి చేసుకుని వెళ్దామని 4–5 రోజులు ఆలస్యం చేశాడు. నేనింతలో కొరియర్‌ను కూడా పంపాను. కాని కొరియర్ ఆ కామ్రేడ్ దగ్గరకు వెళ్ళేసరికి వారు అరెస్టు అయినట్టు తెలిసింది. ఇక మనం వెళ్ళి ప్రయోజనంలేదు, వాళ్ళనెటూ కాల్చివేస్తారు అని ఆ కొరియర్ భావించాడు. అనుకున్నట్టే వాళ్ళను కాల్చివేశారు.

రహస్య స్థావరాలను గురించి సమాచారం బయటకు పొక్కుతూనే వుండేది. మా స్థావరాలను తరచు మారుస్తూ వుండేవాళ్ళం. ఆ రోజుల్లో ఈ ప్రాంతం నుండి కామ్రేడ్స్‌ను రాజమండ్రి, విశాఖపట్నం ప్రాంతాల్లోని కొండల్లోకి, అడవుల్లోకి పంపి ప్రయోజనం లేదు. ఎందుకంటే అక్కడ మనకు ఏమి ఉద్యమం వుంది గనుక, వాళ్ళను వికారాబాద్, అమరాబాద్, కరీంనగర్ ప్రాంతాలకే పంపాలి. అక్కడ మన దళాలున్నాయి. ఉద్యమంముంది కేవలం కొండలు, అడవులు వుండి వుపయోగంలేదు. మనల్ని ఆదరించి, ఆదుకునే ప్రజలుండాలి. తెలంగాణాలో ఉన్నది అదే. ఇక్కడ లేనిదీ అదే ముఖ్యమైన కామ్రేడ్స్ అందర్నీ ఒక పద్ధతి ప్రకారం రక్షణ కోసం అడవుల్లోకి పంపుదామని నిర్ణయించుకున్నాం. కాని మేము పంపేలోపలే అంటే 1950 మే ఆనాటికే చాలా మంది కామ్రేడ్స్‌ను పోలీసులు పట్టుకోవడం, కాల్చివేయడం జరిగింది. వారు బతకాలి, దానితోపాటు ఉద్యమానికి దోహదం చేయాలి అన్నది మా ఆశ. అందుకే వారిని మన దళాలున్న ప్రాంతాలకు పంపాలని అనుకున్నాం.

హనుమంతరావు 1949లో అరెస్టు అయ్యాడు. గంగాధరరావును మేమే ఆ తరువాత అమరాబాద్ ప్రాంతానికి పంపాము దళాలతోపాటు వున్న వారు బతగ్గలిగారు. మృత్యుంజయుడిని కూడా ఖమ్మం ప్రాంతానికి పంపిద్దామని నిర్ణయించుకున్నాం. కాని అక్కడ ఖమ్మం దళాలతో



సంబంధాలు పెట్టుకుని ఇట్లా ఒక కామ్రేడ్ వస్తున్నాడని తెలియజేసే సరికి కొద్ది రోజులు పట్టింది. ఈ లోపలే మృత్యుంజయుడ్ని పోలీసులు కాల్చి చంపారు. అలాగే తోలేటి లక్ష్మణరావును కూడా. కొంతమంది నిర్బంధానికి తట్టుకోలేక పోలీసులకు లొంగిపోయిన వాళ్ళు వున్నారు. వారి సంగతి చెప్పుకోవడం దేనికి. నండూరి ప్రసాదరావు ఖమ్మం ప్రాంతంలో వుండే వారు. దాదాపు పోరాట విరమణదాకా ఆయన అక్కడే వున్నారు ఇప్పుడున్న భార్యతో ఆయనకు పరిచయం ఏర్పడింది అక్కడే. ఆమె కాల్చి వేయబడిన అనిరెడ్డి గంగారెడ్డి భార్య. అక్కడే పెళ్ళి జరిగింది. అప్పటికే ప్రసాదరావు పెద్ద నాయకుడు. ఖమ్మం అడవులకు చేరబోయేముందు రహస్య జీవితం గడుపుతూ చాలా ప్రాంతాలలో ఉద్యమానికి సలహాదారుడిగా ఉండేవాడు. ఆయన కేంద్రీకరణ ప్రధానంగా మానుకోట ప్రాంతం మీద దళాలకు అవసరమైన మందులు, అవీ ఇక్కడ నుంచే పంపేవాళ్ళం ఆ అడవుల్లో గ్రామాల్లో దొరకవు కదా. అట్లాగే తుపాకీ మందు కూడా అడవుల్లోని మన దళాలకు సరఫరా చేయాలి. వీటిని సంపాదించడం, అక్కడకు జేరవేయడం అంత తేలికైన పనిగా వుండేది కాదు. రహస్యంగా ఈ పని చేయాలంటే ఎన్నో జాగ్రత్తలు తీసుకోవలసి వచ్చేది. మా సమావేశాలు సామాన్యంగా ఎవరి ఇళ్ళల్లోనూ జరిగేవి కావు. రోడ్డు మీద నడుస్తూనో, పార్కులోనో ఒకరిద్దరంగా ఒక గంటా గంటన్నర కలుసుకుని, విడిపోతూ చర్చలు సాగిస్తూ వుండేవాళ్ళం.

ఈ మాట్లాడుకోవడం కూడా రాత్రి 8–10 గంటల మధ్యనే జరగాలి. మరీ రాత్రి అయితే ప్రమాదం. నాకు దాదాపు మన పట్టణాలన్నింటిలోనూ బజార్లు, సందులు వివరంగా తెలుసు. చాలా మంది కామ్రేడ్స్‌కు హైదారబాద్ పాతబస్తీ అంతా గందరగోళంగా వుంటుందని అనిపించేది. ఎందుకంటే ఆ ప్రాంతానికి తరచు వెళ్ళేవాళ్ళం కాము. మిగతా హైదరాబాద్ నగరమంతా చిన్న సందులతో సహా నాకు క్షుణ్ణంగా తెలుసు.

తుపాకిమందు చేరవేయడంలో కొందరు చాలా చొరవ చూపించేవారు. ఉదాహరణకు కోదండరామిరెడ్డి కాల్చివేయబడిన తరువాత అతని భార్య తన తమ్ముడితో సహా వచ్చి ఒక స్థావరాన్ని చూస్తూ వుండేది. ఈ తుపాకి మందు చేరవేసే వారికి, రహస్య స్థావరాలు నిర్వహించే వారికి వీలైనన్ని ఎక్కువ సంబంధాలు వుండేటట్లుగా చూసేవాళ్ళం. నేనొకసారి కోదండరామిరెడ్డి బావమరిదిని హెచ్చరించాను కూడా. నీవు మరీ దుడుగ్గా తగిన జాగ్రత్తలు తీసుకోకుండా ఈ మందుగుండు రవాణాలో వ్యవహరిస్తున్నావు జాగ్రత్త అని.

కాల్చివేయబడిన కోదండరామిరెడ్డి భార్య ఆయన చనిపోయిన తరువాత ఇంకో దళనాయకుడిని ప్రేమించి పెళ్ళి చేసుకుంది. తెలంగాణా పోరాటం పుస్తకంలో నేను చెప్పిన కథలోని పద్మ ఈమే అలాగే కోదండరామిరెడ్డి చెల్లెలు సుగుణ ఆ తర్వాత ఎస్.వి.కె. ప్రసాద్‌ను వివాహమాడింది. మరోచెల్లెలు కరీంనగర్ ప్రాంతానికి చెందిన నర్సింహారెడ్డి అని మరో రహస్య

బాధ్యుణ్ని పెళ్ళి చేసుకున్నది. వారందరూ పార్టీ అంటే ప్రేమతో, ధైర్యంగా, చొరవగా పార్టీకి సహకరించేవారు. ఈ విషయంలో రావి నారాయణరెడ్డి కోదండరామిరెడ్డి చనిపోయిన తర్వాత అతడి భార్యను వితంతువుగానే జీవితాంతం గడపనవసరం లేదని ధైర్యం చెప్పాడు. ఏం? తప్పేముంది గనుక? పాత ఫ్యూడల్ సాంప్రదాయాలనే పట్టుకు వేళ్ళాడాలని ఎక్కడుంది? అని ఆమె పునర్వివాహ సందర్భంగా ఆ యిరువురుని ప్రోత్సహించాడు.

ఈ స్త్రీలు రహస్య స్థావరాలలో బాధ్యతలు నిర్వహించేవారు. చాలా సమయస్ఫూర్తిని, ధైర్యాన్ని ప్రదర్శించేవారు. స్థావరం నుండి బయటకు వెళ్ళే కామ్రేడ్ ఫలానా సమయానికి వస్తాను అంటే ఖచ్చితంగా ఆ సమయానికి వచ్చి తీరాలి. మహా అయితే ఒక అరగంట ఎదురుచూడాలి. అప్పటికీ రాకపోతే ప్రమాదాన్ని శంకించి, మిగతా వారందరినీ స్థావరం నుండి ఖాళీ చేయించాలి. ఇలాంటి ఆపద రావచ్చునని, ముఖ్యమైన కామ్రేడ్స్ కోసం, వేరే స్థావరాలను రెండు మూడింటిని ప్రత్యేకంగా అట్టిపెట్టి వుంచేవారు అక్కడకు చేర్చాలి. గృహిణి ఒక్కతే వుండాలి. ఏదన్నా ప్రమాదం జరిగిందనో, ఈ స్థావరానికి సంబంధించిన కామ్రేడ్ ఎవరన్నా నిర్బంధింపబడినాడనో రూఢిగా తెలిస్తేమటుకు తనతోసహా స్థావరాన్ని పూర్తిగా ఖాళీ చేయాలి. ఈ ప్రమాదం విషయం తెలియని కామ్రేడ్ ఎవరన్నా బయట నుండి రావచ్చు. అందుకని "ఈ స్థావరం ప్రమాదంలో చిక్కుకున్నది. ఎవ్వరూ రాకూడదు" అని అర్థమయ్యేట్లుగా ఒక సంకేతాన్ని దూరం నుండి కనపడేట్లుగా ప్రస్ఫుటంగా వుంచాలి.

ఈ విషయాలన్నింటినీ స్థావరాలు సాగించే స్త్రీ కామ్రేడ్స్ అందరికీ చెప్పివుంచే వాళ్ళం. వాళ్ళు సాహసవంతంగా వ్యవహరించి, అమలు జరిపేవారు. ఆ సంకేతం కూడా స్థావరానికి సామాన్యంగా వచ్చే కామ్రేడ్స్‌కుతప్ప బయట వారికి ఏమీ ప్రత్యేకంగా కన్పడకూడదు. డాబావుందనుకోండి. డాబామీద బట్టలార వేసుకోవడం, ఆరిన తర్వాత తీసివేయడం సహజం. స్థావరం, సక్రమంగా వుంది. అంటే 24 గంటలూ కనీసం రెండు మూడు బట్టలు డాబాపైన తాడుపై ఆరేసే వుండాలి. స్థావరానికి ప్రమాదం ఏర్పడిందని తెలియజేసేందుకు ఈ స్త్రీలు పైన ఆరేసిన బట్టలన్నీ తీసేసేవాళ్ళు. చుట్టుపక్కల వాళ్ళకు ఈ విషయం కొత్తగా ఏమనిపిస్తుంది. ఇలాంటి పద్ధతులెన్నో. వీలైనంత దూరం నుండి ఆ సంకేతం కనపడాలి. ఇంటి ముందు దాకా వచ్చి సంకేతాన్ని చూసి, వెనక్కి మళ్ళడం మంచిదికాదు.

ఆ రోజుల్లో హైదరాబాద్‌లో యిలాంటి స్థావరాలు చాలా వుండేవి. పల్లెటూళ్ళ నుండి భూస్వాములు పారిపోయి హైదరాబాద్ చేరుతున్నారు. అలాగే చేరుతున్న వాళ్ళల్లే నటించి, ఇళ్ళను అద్దెకు తీసుకునేవాళ్ళం. ఆ యింటి యజమానికి మరో పది రూపాయలు ఎక్కువ వస్తేసరి. ఎవరు? ఏమిటి? యివన్నీ పట్టించుకునే వాళ్ళేకాదు. ఇరుగు, పొరుగుకు అనుమానం కలుగకుండా వ్యవహరించాలి. ఏవో కథలు సృష్టించేవాళ్ళం. మొత్తం మీద మామూలు గృహస్థులమే అనుకునేట్లు చాలా అరుదుగానే అయినా, మామూలు మాటలతోనే వాళ్ళతో గడిపేవాళ్ళం.



పారిపోయి వచ్చిన భూస్వాములం కదా. ఇళ్ళు కూడా కాస్త మంచివిగా ధనవంతులు నివశించే ప్రాంతాలలో తీసుకునే వాళ్ళం. డబ్బుకు పెద్దగా యిబ్బంది పడిందిలేదు. పోరాట ప్రాంతాలలో దళాలు భూస్వాములపై పన్నులు వేసేవి. ప్రజలు స్వచ్ఛందంగా యిచ్చేవారు. ఇక్కడ నగరంలో ఇలాంటి ఖర్చులుంటాయని, ముందుగా పోరాడే కామ్రేడ్స్ కేంద్రానికి పైకం పంపేవారు. తమ అవసరాలు తర్వాత చూసుకునేవారు. తాము ఇబ్బందులు పడుతున్నా ఈ కేంద్రాలు కొనసాగాలంటే డబ్బు అవసరం అని ముందుగా ఇక్కడకు పైకం చేరేది. బయట ప్రపంచాన్ని నమ్మించడం కోసం, కొన్ని సందర్భాలలో చాలా విలాసంగా జీవిస్తున్నట్లు స్థావరాలు నిర్వహించే వాళ్ళం. అలా కన్పించక తప్పదు. కానీ కుటుంబాలు ప్రతి పైసా ఖర్చు పెట్టడంలో చాలా జాగ్రత్తగా వుండేవాళ్ళం. నగరాల్లో వుంటున్న ప్రతి కామ్రేడ్ అలా చాలా పొదుపుగా వుండేవాడు. స్థావరాల ఏర్పాటు, యితర సాంకేతిక అవసరాలు – వీటి కోసం ఖర్చు పెట్టేందుకు వెనకాడే వాళ్ళం కాదు. కానీ వ్యక్తిగతంగా చాలా పొదుపుగా జీవించేవాళ్ళం.

స్థావరాల విషయంలో ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఒకోసారి పొరపాట్లు జరుగుతుండేవి. మహేంద్ర ఒకసారి తాను తిరిగివస్తానన్న సమయానికి రాలేదు. అతడి భార్య పేరు ప్రేమతాయ్, సంకేతం జాగ్రత్తగానే అమర్చింది. ఒక ముఖ్యమైన కామ్రేడ్ పరధ్యానంగా, ఆ సంకేతం చూడకుండా వెళ్ళాడు. అప్పటికే పోలీసులు వచ్చివున్నారు. ఆ కామ్రేడ్‌ను నిర్బధించారు.

ఈ విషయం వెన్వెంటనే, నేను వేరే స్థావరంలో వుంటే నాకు తెలియజేయబడింది. గోళ్ళ రాధాకృష్ణమూర్తి, వి. హనుమంతరావు నాకు సంబంధంలో వుండేవారు. అయితే మామూలుగా నేనున్న స్థావరానికి వారు రాకూడదు. (అత్యవసరం అయితే తప్ప). ఆ రోజుల్లో ఎవరన్నా కామ్రేడ్ అరెస్టు అయితే ఆ కామ్రేడ్‌కు తెలిసిన స్థావరాలన్నింటినీ, వార్త తెలిసిన వెంటనే ఖాళీ చేసేవాళ్ళం. అతడు చిత్రహింసలకు గురౌతాడో. గుర్రై తట్టుకుంటాడా, లేదా యివన్నీ తర్వాత ప్రశ్నలు, కామ్రేడ్స్‌కు ఇలా చెప్పేవాళ్ళం కూడా "చూడు తీవ్ర చిత్రహింసలకు గురవుతున్నప్పుడు, ఎంత చెప్పకూడదన్నా చైతన్యంతో వున్నా, అనుకోకుండా రహస్యాలు చెప్పే అవకాశం వుంటుంది. కానీ, మీకు చేతనయినంత వరకూ, కనీసం కొన్ని గంటలయినా చిత్రహింసలకు తట్టుకుని, పెదవిదాటి మాటరాకుండా జాగ్రత్తపడండి. అసలు ఏమీ నోరు మెదపకుండా భరించగలిగితే గొప్ప. అలా భరించే యత్నం చేయండి. కనీసం కొన్నిగంటల వ్యవధి దొరికినా, ఇక్కడ రహస్య స్థావరాలలో కామ్రేడ్స్ తప్పుకునే అవకాశం వుంటుంది" అని చెప్పే వాళ్ళం. చాలా మంది కామ్రేడ్స్ పోలీసులకు చిక్కినా, ఈ నియమాన్ని పాటించారు. ఎన్ని రకాల చిత్రహింసలు చేసినా, పోలీసులు కొందరి నుండి ఒక్క ముక్క కూడా రాబట్టలేకపోయారు. రాధాకృష్ణమూర్తి వచ్చి ఆ స్థావరాన్ని పోలీసులు చుట్టుముట్టారని, ఏడుగురు కామ్రేడ్స్‌ను నిర్బంధించారని చెప్పాడు.

నర్సింహారెడ్డి స్థావరంలో కొందరు కామ్రేడ్స్ వున్నారు. వాళ్ళంతా హైదరాబాద్ నగరం ఎరగనివాళ్ళు. పైగా అప్పుడు సాయంత్రం 4 గంటలు. వీళ్ళందర్నీ ఎటువాళ్ళటు తప్పుకోండి అని చెప్తే, ఎక్కడికి తప్పుకుంటారు? ఎటో అటు పారిపోతే మళ్ళీ కలిసేదెట్లాగు? ఆలోచించే వ్యవధి కూడాలేదు. అందుకని నేనే యింకో రెండు గంటలు వాళ్ళనక్కడే వుండమనీ, ఆ తర్వాత ఎటు మార్చేదీ తెలియజేస్తానని రాధాకృష్ణమూర్తితో చెప్పి పంపాను. కొత్తవాళ్ళను ఏ ఏర్పాటు లేకుండా బయటపెట్టలేము. అందుకని ఆ నిర్ణయం తీసుకోక తప్పలేదు. ఆ నిర్ణయంలో ప్రమాదం వుంది. కాని, దాన్ని దృష్టిలో వుంచుకునే ఆ నిర్ణయమే తీసుకున్నాను. ఆ తర్వాత నేను ఆ స్థావర ప్రాంతానికి వెళ్ళాను. నాకు సరిగ్గా ఆ ఇల్లు తెలియదుగానీ, ఆ సందు తెలుసు. అప్పటికే పోలీసులు వచ్చారు. కామ్రేడ్స్‌ను అరెస్టు చేశారు. బరువెక్కిన హృదయంతో నా స్థావరానికి తిరిగి వచ్చాను.

ఆ తర్వాత అసలా ప్రాంతాలకు ఎందుకు వెళ్ళారని రాధాకృష్ణమూర్తి అడిగాడు. నిజమే. వెళ్ళి వుండవలసింది కాదు. కామ్రేడ్స్‌కు ఏమైందో అన్న ఆదుర్దాకొద్దీ వెళ్ళాను. అయినా పని జరగలేదు కదా అని ఏదో చెప్పాను. కానీ అలా వెళ్ళివుండవలసింది కాదు. అప్పటికి నిర్బంధించి, కాల్చివేయడాన్ని ప్రభుత్వం మానుకున్నది. కనుక ఈ కామ్రేడ్స్‌ను జైల్లో పెట్టింది. ఆ తర్వాత విడుదలై వచ్చారు.

మేజర్ జైపాల్‌సింగ్‌కు గంగాధరరావును తోడిచ్చి, దళాల వద్దకు పంపాము. మొదటిసారి వెళ్ళినప్పుడు సరైన సంబంధం దొరకలేదు. తిరిగి వచ్చారు. ఆ తర్వాత మళ్ళీ సంబంధం ఏర్పాటు చేసి పంపాము. 'జైపాల్ ఆత్మకథ' పుస్తకంలో ఆ భాగాలన్నీ వున్నాయి.

రావి నారాయణరెడ్డి ఆ దశలోనే రహస్య స్థావరాన్ని వదిలి వెళ్ళాడు. పోరాటం కొనసాగించడంపట్ల అనుమానాలు, వ్యతిరేకతలు వస్తున్నాయి. తీవ్ర నిర్బంధం వస్తున్నప్పుడు పోరాటం మానుకోవాలి. పోలీసులకు లొంగిపోవాలి. అంతకన్నా ఏం చేయగలం? ఇదీ ఆయన వాదన. రాజకీయ అవగాహనతో కాదు. దొడ్డా నర్సయ్య లాంటి వాళ్ళు ఈ వాదన చేసే వాళ్ళు. కానీ, పోరాటంలో మొలలోతు కూరుకుపోయి వున్నారు. కానీ వేములపల్లి శ్రీకృష్ణ అలా వాదించడమే కాదు, తనకు తానుగా వెళ్ళి పోలీసులకు లొంగిపోయాడు.

ఇలాంటి చర్చ జరుగుతున్నప్పుడు వారికి సమస్య అవగాహన అయ్యేట్లు నచ్చజెప్పేవాళ్ళం అయినా కొన్ని నష్టాలు జరుగుతున్నాయి. ధైర్యవంతులుగా వుండి పోరాటం సాగిస్తూ వున్న కామ్రేడ్స్ పోలీసు కాల్పులకు గురై మరణిస్తున్నారు. కొంతమందేమో పోయి పోలీసులకు లొంగిపోతున్నారు. పైగా "ఈ పోరాటం లైను తప్పినందువల్ల ఈ పరిస్థితి వచ్చింది. కనుక లొంగిపోతున్నాము". అని చెప్తున్నారు. లొంగిపోవడం ఏం నిర్ణయం? ఏం నిర్మాణం? ఏం రాజకీయ పోరాటం. తప్పయితే రాజకీయంగా ఆ వాదన పెట్టి మెజారిటీ సాధించి,



వొప్పించుకోవాలి. అంతేగాని, ఎవరికివారుగా లొంగిపోవడంవల్ల పార్టీ ప్రతిష్ట సంగతి అలా వుంచినా, ఎత్తుగడల రీత్యానూ, రాజకీయంగానూ తప్పు అనివాదించే కామ్రేడ్స్ కూడా ఎక్కువ సంఖ్యలోనే వున్నారు. కొందరు పోలీసుల వద్దకు వెళ్ళి లొంగిపోయే వారు కాదుగానీ, అడవులలోకి వెళ్ళి రక్షణ తీసుకోమంటే నిరాకరించి, పట్టణాల్లోనే వుంటూ, అజాగ్రత్తగా వుంటూ పోలీసులకు దొరికిపోయేవారు. పులుపుల శివయ్య అలాంటి వాళ్ళలో ఒకడు. ఇంకా చాలా మంది వున్నారు. లొంగిపోవడం లాగానే ఇలా చేయడాన్ని వుద్యమానికి ద్రోహంగానే భావించాలి.

అలా చూస్తే రాయలసీమ కామ్రేడ్ నాగిరెడ్డి గట్టిగానే నిలబడ్డాడు. రహస్య జీవితానికి వెళ్ళాడు. రాజశేఖరరెడ్డి బెంగుళూరు వెళ్ళాడు. ఆ తరువాత మద్రాసు సమీపంలో పోలీసులు అతణ్ణి అరెస్టు చేశారు. చిత్రహింసలూ అవీ జరుగుతాయని భయపడ్డాడు. సంజీవరెడ్డి జోక్యం చేసుకోవడానికి నిరాకరించాడు. ఏదో చేస్తున్నాడుగా చెయ్యనివ్వండి అని. రాజశేఖరరెడ్డి ఈ పోరాటం సరైనదని తాను భావించడం లేదనీ, ఇక ముందు రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొననీ ప్రకటన చేశాడు. దానికితోడు మరెవరో పలుకుబడిగల నాయకుడు జోక్యం చేసుకున్నాడు. రాజశేఖరరెడ్డి క్షేమంగానే వున్నాడు. ఆ తర్వాత కొన్నాళ్ళు రాజకీయ జీవితం నుండి తప్పుకున్నాడు. సరే జరిగిందేదో జరిగింది అనుకున్నాం. ఆయన అలా ప్రకటన చేయడం తప్పని రాసిచ్చాడు. తిరిగి పార్టీలోకి వచ్చాడు. ఇప్పుడు సి.పి.ఐ.లో అఖిల భారతస్థాయి నాయకుడు.

1963లో నేను జైలు నుండి సరాసరి కామ్రేడ్ డి.వి. సుబ్బారావు యింటికి వెళ్ళాను. అప్పటికే సుబ్బారావుపై బయట వున్న నాయకత్వం ఛార్జిషీటు పెట్టింది. ఇంతకీ 1963లో కార్యదర్శిగా వున్న రాజశేఖరరెడ్డి 'పార్టీ క్రమశిక్షణ చర్య తీసుకోబోతున్న కామ్రేడ్ యింటికి ఎందుకు వెళ్ళారని' నన్ను అడిగాడు. నాకు బాగా కోపం వచ్చింది. "మరి ఎక్కడ కెళ్ళాననుకున్నావ్? పోలీసులు అరెస్టు చేయగానే కాళ్ళు చల్లబడి ఏ చిత్రహింసలకు గురికాకుండానే బహిరంగ ప్రకటనలు చేసిన వాళ్ళ దగ్గరకా? 1948 నుండి పార్టీతో వుంటూ తీవ్రమైన చిత్రహింసలకు గురైె కూడా శత్రువుకు ఏ ఒక్క రహస్యమూ చెప్పని కామ్రేడ్ సుబ్బారావు దగ్గరకా? ఎక్కడ నేనుండాల్సిన చోటు" కావాలనే నేను వెళ్ళాను. సుబ్బారావు 1948లోనే జైల్లోపడి తీవ్రంగా దెబ్బలు తిన్నాడు. అతడు చనిపోయే వరకూ ఆ దెబ్బలు అతని జీవితాన్ని కుదించాయని నాకు తెలియదు. ప్రధానమైంది హడ్జికిన్స్ క్యాన్సర్ అనుకోండి. పార్టీ కోసం త్యాగాలు చేసిన వాళ్ళని పార్టీ మర్చిపోదని, వారిని గౌరవిస్తుందని తెలియజేసేందుకే వెళ్ళాను. ఇదే విషయం ఆ తరువాత పత్రికలో కూడా రాశాను.

ఏ చిత్రహింసలకు గురికాకుండానే లొంగిపోయిన ప్రబుద్ధులు నన్ను ప్రశ్నిస్తున్నారు. చిత్రహింసలకు గురై నోరుజారిన వారిని ఆ కోవలో కట్టలేము. ఆ విధంగా కొంత కాలం

పాటైనా చిత్రహింసల్ని భరించి కూడా రహస్యాలు చెప్పని వారు చాలా మంది వున్నారు. రాజకీయంగా విభేదించినా సరే వారలా నిలబడగలిగారు. ఉదాహరణకు కామ్రేడ్ పురుషోత్తమ్. ఆయన రహస్య స్థావరం పోలీసులకు తెలిసిపోయి ఆయనను అరెస్టు చేశారు. రెండు మూడు రోజులపాటు నానా చిత్రహింసలూ పెట్టారు. అయినా ఆయన ఏమీ బయటకు పొక్కలేదు. కాని ఆ తర్వాత ఇక బాధలు భరించలేక కొన్ని విషయాలు చెప్పాడు. అయితే రెండు మూడు రోజులు ఆయన అలా నిలదొక్కుకోబట్టి వెంకటాచారి లాంటి కామ్రేడ్స్ తప్పించుకోగలిగారు. చారి రహస్యంగా ఉండేవాడు. ఇప్పుడు మన హైదరాబాద్ పార్టీ ఆఫీసులో ఉంటున్నాడు.

తెలంగాణా ప్రాంతంలోనూ, ఆంధ్ర ప్రాంతంలోనూ కూడా ఈ పోరాటాన్ని యిక సాగించలేమన్న అభిప్రాయం కొంత మంది కామ్రేడ్స్‌లో చోటు చేసుకుంది. సాగించాలన్న కోరిక మాకుంది. కేంద్ర నాయకత్వం కూడా సాగించమనే చెప్తున్నది. ఈ పోరాటం సాగుతూ ఉంటే మిగతా ప్రాంతాలలో పోరాట జ్వాలలను రగిలించేందుకు ఇది దోహద పడుతుందని వారి అభిప్రాయం. పోరాటం సాగిస్తున్న కామ్రేడ్స్ ఏమిటి? దేశంలో మిగతాచోట్ల ఎందుకు పోరాటాలు చెలరేగటంలేదు? అక్కడ మన కామ్రేడ్స్ ఎందుకు పోరాటాలు లేవదీయరు? అని మమ్మల్ని పదేపదే ప్రశ్నిస్తున్నారు. 'అక్కడ పరిస్థితులింకా మనకున్నంత అనుకూలంగా లేవు' అని నచ్చచెబుతున్నాము.

ఈ లోపల బంగారం వంటి కామ్రేడ్స్ ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. గ్రామాలలో అదివరకంతటి తరచుగా సంబంధాలు కొనసాగించలేకపోతున్నాము. కాని భూస్వాములు మాత్రం గ్రామాలలోనికి తిరిగి వచ్చేందుకు జంకుతున్నారు. మూడు నెలలకు, ఆరు నెలలకు ఒక్కసారి దాడి చేసినా అది చాలు వారిని భయపెట్టేందుకు. ఒక్క మాటలో చెప్పాలంటే, సాయుధమైన మన దళాలు అడవులలో ఉంటున్నంత కాలం భూస్వాములు తిరిగి తమ గ్రామాలలో కాలుపెట్టేందుకు సాహసించలేదు.

భూస్వాములు ఊళ్ళో లేనంతకాలం పోలీసు క్యాంపులు వున్నప్పటికీ ప్రజానీకం తాము స్వాధీనం చేసుకున్న భూమిని సాగు చేసుకుంటూనే వున్నారు. 1948-50 ప్రాంతాల కొచ్చేసరికి మిగులు భూమిలో దాదాపు సగం వరకు మనం పంచాం. పోరాట విరమణ చేసిన పిదప, మనం ఆయుధాలు దించిన తరువాత మాత్రమే తిరిగి భూస్వాములు గ్రామాలలోకి వచ్చి ఇన్నాళ్ళుగా పేదలు సాగు చేసుకుంటున్న భూములను తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు ప్రయత్నాలు సాగించగలిగారు. ఇక ఆ తరువాత క్రమేపీ భూస్వాములు తిరిగి గ్రామాలలో పాతుకుపోగలిగారు. రెండు సంవత్సరాలు మాత్రమే అయినా లక్షలాది ప్రజానీకం తమ శ్రమ ఫలితాన్ని తామే అనుభవించగలిగారు. ఇది అత్యంత ప్రధానమైన విషయం.



అందువలనా, దానితోపాటు వర్గపోరాటం తీవ్రస్థాయిలో జరిగినందువల్లనూ నేటికి ఆ ప్రాంతాలలో మన పునాది అలాగే నిలబడి వుంది. అక్కడేదో ప్రజానీకం బాగా రాజకీయంగా చైతన్యవంతులైనందువల్ల, లేకుంటే అక్కడ నాయకత్వానికి ప్రత్యేకించి గొప్ప రాజకీయ చైతన్యం అబ్బినందువల్లాకాదు. నిజానికి పరిస్థితుల కనుగుణంగా తగినంత మందికి మంచి రాజకీయ శిక్షణ జరిపి మారిన పరిస్థితులకు ధీటైన రాజకీయ నాయకత్వాన్ని అందించలేక పోయామనే చెప్పాలి.

సరే ఇప్పుడేం చేయాలి? అనే ప్రశ్న వెంటాడుతూనే వున్నది. ఈ దశలోనే శాశ్వత శాంతికోసం, సంపాదకీయం రాయడం, దానిపై చర్చోపచర్చలు, తెలంగాణా కామ్రేడ్స్‌కు వచ్చిన అనుమానాలు, వారి ప్రశ్నలు, ఆ వివరణ, నమాధానాలు వీటన్నిటి గూర్చి నేను 'తెలంగాణా పోరాటం' పుస్తకంలో రాశాను. అంతకు మించి కొత్తగా చెప్పగలిగింది ఏమీ లేదు. అఖిల భారతస్థాయిలో నాయకత్వంలో ఉన్న విభేదాలు, ఇరుపక్షాల వాదనలు – ఇవన్నీ సైద్ధాంతికంగా ఎంతో ముఖ్యమైనవి. నా పుస్తకంలోను, బసవపున్నయ్య రాసిన "తెలంగాణా పోరాటం-వాస్తవాలు" అన్న పుస్తకంలోను, డాక్యుమెంటరీలతో సహా వివరించబడి వుంది.

# అడవులలోకి ప్రయాణం : దళాలతో ముఖాముఖి

**అ**ప్పుడు అడవులలోకి వెళ్ళి దళాలను కలుసుకుని పరిస్థితిని వివరించే అవసరం ఏర్పడింది. ముందుగానే దళాలకు ఒక ముఖ్యమైన కామ్రేడ్ వస్తున్నట్లుగా కబురు చేశాం. అయితే ఆ ముఖ్యమయిన కామ్రేడ్‌కు అడవులలోకి పోయేందుకు కొన్ని అర్హతలుండాలి. ఒక రాత్రల్లా విరామం లేకుండా అడవుల్లో నడవగలిగి ఉండాలి. మహా అయితే ఎక్కువ నడవక్కరలేకుండా దగ్గర దారులు వెతగ్గలరేమోగాని ముప్పై నలభై మైళ్ళ నడకమటుకు ఎటూ తప్పదు. అంతేకాదు, అవసరమైతే ఆగకుండా నాలుగైదు మైళ్ళు పరిగెత్తగలిగి ఉండాలి. ఈ మాట విన్నప్పుడు పక్కనున్న కామ్రేడ్స్ నవ్వారు. అసలు అంత దూరం ఎందుకు పరిగెత్తాల్సి వస్తుంది ఎవరికైనా? రెండు మూడు ఫర్లాంగులు దాటేసిన తర్వాత తప్పుకోవచ్చునుగదా? తప్పుకునేందుకు వీలులేని మైదాన ప్రదేశాలలో పరిగెత్తాల్సి రావచ్చును గదా? ఇలాంటి వివరాలన్నీ ఆ ముఖ్యమైన కామ్రేడ్‌కు తెలియచేయమని అడవి నుండి కామ్రేడ్ కబురు చేశారు.

నేను హైదరాబాద్ నుంచి బయలుదేరాను. మొదటి మజిలీ ఇబ్రహింపట్నం వద్ద ఒక చిన్న గుట్ట వుంది. అక్కడ మొదటి దళం కలుసుకుంది. దగ్గరి దోవన వెళితే పాతిక మైళ్ళు మించి వుండదు. ఖటకేశ్వర్ వద్ద కొన్ని చిన్న చిన్న గుట్టలు వున్నాయి. నన్ను దళం దగ్గరకు తీసుకు వెళ్ళవలసిన కామ్రేడ్ అక్కడ నన్ను కలుసుకొన్నాడు. ఇబ్రహీంపట్నం వద్దనున్న గుట్టమీద నేను పగలల్లా గడపవలసి వచ్చింది. చీకటి పడితేగాని మళ్ళీ ప్రయాణం చేయలేము గదా అక్కడికి స్థానికంగా ఆ ప్రాంతము, ప్రజలతో పరిచయం వున్న కామ్రేడ్ వచ్చాడు. అక్కడ నుండి రాచకొండకు అడవులలో గుండా వెళ్ళాలి. నేను చెప్పేటప్పుడు మజిలీల విషయంలో కొంత అటూ యిటూ వుండవచ్చు. ఎందుకంటే మొత్తం మూడుసార్లు నేను ప్రయాణం చేశాను. కనుక చెప్పడంలో కుడి ఎడమలు ఏమివున్నా, ప్రధానంగా నేను చెప్పదలుచుకున్న అంశాలకు అడ్డురావు. రాచకొండ ప్రాంతంలో కామ్రేడ్ రాజన్న, కృష్ణమూర్తి వాళ్ళ దళాలను కలుసుకొచ్చాను. పరిస్థితి వివరించి వారితో చర్చలు జరిపాను. అక్కడి నుండి మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి ప్రాంతంలో వున్న అడవులకు వెళ్ళాలి. దారిలో నల్లరాతి గుట్టలు చిన్న చిన్నవి చాలా వున్నాయి. వాటిని ఈనెలు అంటారు. అన్నీ ఒకే రకంగా కన్పిస్తాయి. అందువల్ల దారి తప్పకుండా



వెళ్ళడం అంత తేలికేం కాదు. ఎలాగైతేనేం ఉదయానికల్లా ఆ ఈనెలు దాటాం. అక్కడే ఒక చిన్న గుహ లాంటిది వుంటే, నాకు, నాకు రక్షణగా వస్తున్న దళానికి పడుకునేందుకు కావలసిన సామగ్రిని ఒక దళ సభ్యుడు వెళ్ళి తీసుకువచ్చాడు. గుహలోనే పగటిపూట సెంట్రీని పెట్టుకొని గడిపాము. అక్కడ నుండి దేవరకొండకు వెళ్ళాలి. ఒకచోట నుండి ఒక చోటకు వెళ్ళడం కాదు ప్రశ్న. ఒక సంబంధం దగ్గర నుండి మరొక సంబంధం దగ్గరకు వెళ్ళడం. ఆ పథకం ప్రకారం నేను చేరవలసింది అమరాబాద్ ప్రాంతం.

అమరాబాద్ వెళ్ళాలంటే దిండినది తగులుతుంది. దిండినది ప్రవహించే సొరంగం గుండా నడిచివెళ్ళాలి. అట్లా నడిచేటప్పుడు నా జేబులో ఉండే గడియారం నీళ్ళలోపడింది. కామ్రేడ్స్ దానిని వెదికితీసి దేవరకొండలో బాగుచేయిస్తామన్నారు. అక్కరలేదు మళ్ళీ కొనుక్కోవచ్చు అని చెప్పి మేం నడక సాగించాం. దేవరకొండలో రాత్రి 8 గంటలకు బయలుదేరితే కొల్లాపురం ప్రాంతంలో దట్టమైన అడవికి చేరేసరికి ఉదయం 6 గంటలయింది. అక్కడ నిటారుగా ఉన్న ఒక కొండ ఎక్కి అవతలివైపుకు చేరాలి. ఆ ప్రయాణంలో ఈ భాగం మాత్రం కష్టమే అన్పించింది. అమరాబాద్ శ్రీశైలానికి ఎదురుగా నది ఇవతల ఉంటుంది. ఈ కొండమీద మన ప్రాంతీయ కేంద్రం వుంది. ఆ కొండవద్దకు చేరేసరికి నేను బాగా అలసిపోయాను. వంట్లో చిన్నఎత్తు సత్తువ వున్నట్లులేదు. నిజానికి మిగతా అందరూ అలాగే ఉన్నారు. అక్కడ అన్నం వండుకుతినాలి 'మీరు వండిపెట్టండి నాకు ఓపికలేదు' అని చెప్పటం బాగుండదుగదా. కామ్రేడ్స్‌కు అది మంచి ఆదర్శంకాదు. అందుకని లేని ఓపిక తెచ్చుకొని వంటపనిలో సహాయపడ్డాను. అక్కడే అన్నంతిని కాసేపు విశ్రమించాము. అన్నం అంటే చింతపండుతో చేసిన పచ్చిపులుసు, ఏదో యింత కారం, ఉప్పో అంతే. కూరగాయల ప్రసక్తి లేదు. అయితే నా కోసం చుట్టుపక్కల గ్రామాల్లో వెదికి సాధ్యమైతే పాలో, మజ్జిగో తెచ్చియిచ్చేవారు. మేము మజిలీచేసిన ప్రదేశము రక్షణ రీత్యా చాలా మంచిది. దట్టమైన అడవి, పెద్ద కొండ. అంతేగాక ఈ ప్రదేశానికి తరచుగా పశువుల కాపరులు కూడా వచ్చేవారు కాదు. అందువల్ల నాలుగైదు గంటలు వళ్ళు మరచి నిద్రపోగలిగాం. ఆ తరువాత నాతోవచ్చిన దళ నాయకుడు ప్రాంతీయ కమాండర్‌ను కలుసుకున్నప్పుడు 'ఈ కామ్రేడ్ చాలా మంచివాడు మాతో కలిసిపోయాడు. ఎంతో ఓపిగ్గా చివరికి మా వంటపనుల్లో సైతం సాయపడ్డారు' అని నా గూర్చి ప్రశంసాపూర్వకంగా చెప్పాడు. నిజానికి నేను చేసింది పెద్దగా ఏమీ లేదుగాని అలాంటి చిన్న చిన్న సంఘటనలే కామ్రేడ్స్‌లో నాయకులపట్ల సద్భావాన్ని కలిగిస్తాయి.

అంతేగాక ఈ ప్రయాణంలోనే నడుస్తూంటే పక్కనే ఉన్న చిన్నరాయి పెళ్ళ మోకాలికి తలిగింది. అప్పుడేమీ పెద్ద బాధనిపించలేదు. కాని కొంత దూరం నడచిన తరువాత కాలు బాగా నొప్పి చేసింది. మోకాలు చిప్ప కొంచెం వాచింది కూడా, కుంటసాగాను. దళనాయకుడు గమనించి వివరం తెలుసుకొని కామ్రేడ్ మీరు నడవలేకపోతే ఇక్కడే విశ్రాంతి తీసుకుందామన్నాడు. కాదు, నేనెలాగో నడుస్తాను. నా ఒక్కడి కోసం మీరందరూ ఆగడం అనవసరం అని చెప్పి నేను నడకసాగించాను. దళ సభ్యులొకరు వెళ్ళి తన తుండుగుడ్డను

నీళ్ళలో తడిపి నా కాలుకు గట్టిగా చుట్టారు. తాత్కాలికంగా కొంత ఉపశమనం అనిపించింది. ఆ మర్నాడుకల్లా మోకాలు బాగానే వాచింది. మరీ అంత ఎక్కువగా కాదనుకోండి. దళ నాయకుడు చూచి "కామ్రేడ్ ఇంత బాధతో ఎలానడవగలిగారు?" అని అడిగాడు. నేను నవ్వి ఊరుకున్నాను. ఇలాంటి చిన్న చిన్న విషయాలవల్లనే నేను వాళ్ళ ప్రేమాభిమానాలు చూరగొనగలిగాను.

నన్నేకాదు. పై కమిటీ నుంచి వచ్చిన ఏ కామ్రేడ్‌నయినా దళాలు ఎంతో గౌరవంగా చూశాయి. ప్రతి దళానికి రాజకీయ విభాగం చూసే ఒక రాజకీయ సంధానకర్త ఉండేవాడు. అతడు చెప్పినట్టు దళం నడుచుకోవాలి. పోరాడటం, తుపాకులను గురిపెట్టి కాల్చడంలో నైపుణ్యం ఇవన్నీ ఉన్నా రాజకీయ విభాగం పై చేయి, ఆ క్రమశిక్షణతోనే రాజకీయ నాయకులను ఎంతో గౌరవంగా చూసేవారు. దానికి తోడు మా ప్రవర్తన, వారితో కలిసి పోగలగడం ఇవన్నీ తోడై మరింత ప్రేమాభిమానాలు పొందగలిగేవాళ్ళం.

మొదట నుండి కూడా రాజకీయాలపై తుపాకి నెప్పుడు పై చేయి కానివ్వలేదు. అలా శిక్షణ గరిపాము. నేనెవరో మొత్తం మీద పెద్ద నాయకుణ్నని మటుకు దళాలకు తెలిసి వుంటుంది. సుందరయ్య అనే ఆయన పెద్ద నాయకుడని కూడా తెలుసు. కాని నేను సుందరయ్యనని మాత్రం వారికి తెలియదు. ముఖ్య నాయకులుగా ఉన్న కామ్రేడ్ రాజన్న, చల్లా సీతారామిరెడ్డి, దొడ్డా నరసయ్య, మేదరమెట్ల సీతారామయ్య వాళ్ళకు మాత్రం నేనెవరినో తెలుసు. కలిసి నడిచేటప్పుడు కూడా నేనెవర్ని అని గాని, ఎక్కడి నుండి వస్తున్నాననిగాని, ఎక్కడికి వెళ్ళాల్సి ఉందనిగాని ఎవరూ అడిగేవారు కాదు. నేనే దళాలు ఎట్లా పని చేస్తున్నాయి? వారి కష్టసుఖాలేమిటి? ఈ ప్రాంతాలలో పరిస్థితి ఎలా వుంది. అడిగి తెలుసుకునేవాడ్ని. వాళ్ళ ముఖ్య నాయకులందరు నాకు చూపిస్తున్న గౌరవాన్ని బట్టిగాని, నా ఎడల చూపిస్తున్న వినయ విధేయతలబట్టిగాని నేనెవరో పెద్దనాయకుణ్ని అయి వుండాలని వాళ్ళు ఊహించి ఉండవచ్చు. కొద్దిమంది బహుశా నేనే సుందరయ్య అని అనుకొని ఉండవచ్చు. అంతేగాని ఖచ్చితంగా తెలిసేందుకు అవకాశం లేదు.

మొత్తం మీద దళాలలో క్రమశిక్షణ మాత్రం ఉన్నతస్థాయిలో ఉండేది. దళ నాయకుడు చెప్పిన దానిని తు.చ. తప్పకుండా పాటించటమే కర్తవ్యంగా భావించేవారు. సైన్యంతో తలపడి సాయుధ పోరాటం జరిపేటప్పుడు ఆ సైనిక క్రమశిక్షణ తప్పకుండా అమలు జరపాల్సిందే. అందుకని నేనెవర్నో తెలిసిన వారున్నా ఒకరికొకరు చెప్పుకొనేవారు కాదు. ఈ అమీరాబాద్ ప్రాంతంలోనే ఇంకో స్థావరంలో గంగాధరరావు వుండేవారు. పొరపాటున ఒక సెంట్రీ తుపాకి పేలింది. ఆ గుండు గంగాధరరావు పాదం నుండి తొడదాకా మొత్తంగా దూసుకు వెళ్ళింది. దానికి వైద్యం చేసుకుంటూ విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఏమీ తెలియనట్టు కన్పించే కామ్రేడ్స్ కూడా ఎంతో మంది ఎంతో ధైర్యసాహసాలు, చొరవ ప్రదర్శించేవారు. ఉదాహరణకు హనుమయ్య అనే ఒక కామ్రేడ్ వుండేవాడు. చాలా అమాయకంగా చదువు రానివానిలాగా, కడు పేదవాడుగా కన్పించేవాడు. కాని చదువుకున్న మధ్యతరగతి రైతాంగం నుండి వచ్చాడు.



అడవులలో దారులు వెదకటంలో చాలా చురుగ్గా ఉండేవాడు. అతనిని చూస్తే ఒక్కోసారి ఈ అడవులలోనే పుట్టి పెరిగాడా అనిపించేది. తర్వాత ఈ హనుమయ్య సావిత్రి అనే ఆమెను వివాహం చేసుకున్నాడు. వాళ్ళకొక మూగ, చెవుడు ఉన్న కొడుకు ఉన్నాడు. నేను శాసనసభకు వెళ్ళిన తర్వాత ఆ అబ్బాయిని హైదరాబాద్‌లో వికలాంగుల పాఠశాలలో చేర్పించాను. ఇటీవలనే హనుమయ్య నన్ను కలిశాడు. నేను ఆనాడు వాళ్ళని బలవంతం చేసి ఆ స్కూలులో చేర్పించబట్టి ఈ రోజున ఆ పిల్లాడు ఉద్యోగం చేసుకుంటూ పెళ్ళి చేసుకొని కుటుంబాన్ని పోషించుకోవడమే కాకుండా తనకు కూడా సహాయ పడుతున్నాడని హనుమయ్య ఎంతో సంతోషంగా చెప్పాడు.

దళాలలో క్రమశిక్షణ అనేది ఒక ఎత్తు. వారు ఎంత కష్టపడి జీవించారో తెలుసుకోవడం మరొకటి. కొన్ని సందర్భాలలో నెలల తరబడి ఉప్పు లేకుండా కూడా గడపవలసి వచ్చేది. కడుపునిండా తిండి వుండేది కాదు. సజ్జలు కొంచ రాళ్ళ మీద నలగ గొట్టుకొని గంజి త్రాగేవారు. వంటపని కంతటికి ఒక కామ్రేడ్ బాధ్యతగా ఉండేవాడు. సెంట్రి కాపలాకాసి తిరిగి వచ్చిగాని తిండి తినే వాడుకాదు. ఈ వంట బాధ్యత చూసే కామ్రేడ్ తానెంత ఆకలిగా ఉన్నప్పటికి ఎదురుగా సెంట్రి వంతు తిండి ఉన్నా తినకుండా అట్టి పెట్టేవాడు. సరైన ఆహారమే లేదు. ఇక పోషకాహారం ప్రశ్న ఎక్కడిది? కామ్రేడ్స్ చాలా బలహీనపడ్డారు. నా వరకు నేను ఈ నెల రోజులలోనే చాలా చిక్కిపోయానని నేను హైదరాబాద్ తిరిగి వచ్చినపుడు అక్కడి కామ్రేడ్స్ అన్నారు. అడవుల్లో కుందేళ్ళు, ఎనుబోతులు ఇలాంటి వాటిని మేము అప్పుడప్పుడు కొట్టుకు తింటుండేవాళ్ళం. అడవులలో చెంచులు ఉండేవాళ్ళు. ఆవు మాంసం, ఎద్దుమాంసం తినేవాళ్ళమని మమ్ములను అనుమానంతో చూసేవాళ్ళు. అందుకని మన దళాలు వాటిజోలికి వెళ్ళేవారు కాదు.

నేను ఏలేశ్వరం (అది అమరాబాద్ ప్రాంత కేంద్రం) వెళ్ళాల్సి వుంది. మన కేంద్ర కమిటీ తీసుకున్న వైఖరిని వివరించి, నచ్చజెప్పి వారి మనోభావాలు తెలుసుకోవలసి వుంది. అడవిగుండా వెళుతున్నాను. నాతో ఒక దళం కూడా వుంది. ఆ అడవుల్లో ఒకసారి పగలే దోవ తప్పుతుంటాము. అది తెల్లవారుజాము. చాలా పెద్ద పోలీస్ క్యాంపు వున్న ఒక గ్రామం పక్కగా వెళ్ళాలి. వీలైనన్ని జాగ్రత్తలన్నీ తీసుకున్నాము.

అనుకోకుండా పెద్ద వాన వచ్చింది. చెట్ల కొమ్మలను విరిచి, వాటిపై దుప్పట్లు పరచి చెట్లకింద పడుకున్నాము. నీరు రాకుండా, త్వరత్వరగా చుట్టూ మట్టితో చిన్న కట్ట కట్టుకున్నాము. అంత వానలోనూ నిద్రపట్టింది. అలిసిపోయి వున్నాము కదా. సెంట్రీ ఒకతను మాత్రం మెలుకువతో వుండేవాడు. భారత వైమానిక దళం వాళ్ళు అప్పుడప్పుడు పై నుండి అడవులు సర్వే చేస్తుండేవాళ్ళు. పగటిపూట అయితే క్రింద ఎక్కడైనా వారికి పొగ వస్తున్నట్లు కన్పిస్తే అక్కడ బాంబులు వేసేవారు. అందుకని, ఎక్కడన్నా గుహలోనో లేదా పొగరాకుండా చూసుకునో వంటలు వండుకోవలసి వచ్చేది. ఎంత జాగ్రత్తగా వుండాల్సి వచ్చేదో తెలిసేందుకే ఇది చెబుతున్నాను.

మన కేంద్రానికి రక్షణగా వుండే దళాలు అంత తేలికగా కలుసుకోగలిగినట్లు వుండేవికాదు. కొండలెక్కడమో, నీళ్ళు దాటడమో చేయవలసి వచ్చేది. ఆ వెళ్ళేటప్పుడు కూడా జాగ్రత్తలు తీసుకునేవాళ్ళం. మామూలు నేల మీద నడిస్తే అడుగుజాడలు పడతాయి కదా. అందుకని, వీలైనంత వరకు గడ్డిమీదనో, బండ మీదనో నడిచేవాళ్ళం, అథవా మామూలు నేల మీద నడవాల్సి వస్తే బూట్లు, చెప్పులూ వేసుకునే వాళ్ళం కాదు. ఎవరన్నా గుర్తులు చూసినా, ఎవరో చెంచులో, కోయలో వెళ్ళివుంటార్లే అనుకునేట్లు జాగ్రత్తపడే వాళ్ళం. ఇవన్నీ దళాలు తమ అనుభవంలో తాము రూపొందించుకున్నవే. అంతేకాదు, మన కేంద్ర స్థావరంలో వున్న పరిసర ప్రాంతాలలో కాలకృత్యాలు తీర్చుకుంటే ఆ వాసన శత్రువుగాని, ఎవరన్నా పరాయివాళ్ళుగాని పసికట్టవచ్చు. అందుకని ఖచ్చితంగా మన్ను కప్పి రావాలి.

ఒకవేళ ఆ స్థావరం మార్చి యింకో చోటుకు వెళ్ళాల్సివస్తే, మనం విడిచిన స్థావరంలో, ఎవరూ నివశించిన జాడలు వీలైనంత వరకూ లేకుండా జాగ్రత్తపడే వాళ్ళం. ఆ రాత్రి గూర్చి చెబుతున్నాను కదా. తెలంగాణా రైతు వాడుతున్న ఆ గొంగళి ఎంత ఉపయుక్తమో అర్థమైంది.

ఏలేశ్వరంలో మన కేంద్రానికి వెళ్ళబోయేముందు దళాన్ని రెండుగా విభజించాము. ఒకటి : సరాసరి దిండి నది దాటి స్థావరానికి వెళ్ళాలి. రెండో దళం చుట్టూ తిరిగి రావాలి. అడవుల్లోనే అక్కడక్కడ తిండికి అవసరమైన పదార్థాలు వగైరా సామానులు దాచుకునే వాళ్ళం. ఈ చుట్టూ తిరిగి వచ్చే దళం, అలాంటి ఒక చోటుకు వెళ్ళి సామానులు తీసుకురావాలి. వీళ్ళు వెళ్ళారు. ఒకచోట దాదాపు అన్నీ అయిపోయినవి. అందుకని, యింకో చోటుకు వెళ్ళాల్సి వచ్చినది. దానికితోడు వాళ్ళు దారితప్పారు. వాళ్ళకు తిండిలేదు. కృష్ణకు వెళ్ళి నీళ్ళుతాగి కడుపు నింపుకున్నారు.

కానీ చాలా అలిసిపోయారు. ఎట్లాగో శక్తంతాకూడదీసుకుని ఆ రెండోచోటుకి వెళ్ళారు. వాళ్ళ దళంతో అనిరెడ్డి వెంకటరెడ్డి వున్నాడు. మేదరమెట్ల సీతారామయ్య వాళ్ళతో వున్నాడో, నాతోపాటు సరాసరి కేంద్రానికి వచ్చేదళంలో వున్నాడో గుర్తులేదు. సరే. అక్కడకు చేరేసరికి ఇంకొక్క అడుగుకూడా వేసేసత్తువ లేకుండా శోషవచ్చి పడిపోయారు.

అదృష్టవశాత్తు కేంద్ర స్థావరం నుండి కూడా ఒక దళం ఆహార పదార్థాల కోసం అక్కడికే వెళ్ళింది. వీళ్ళు కన్పించారు. పరిస్థితి అర్థమయింది. వెంటనే అక్కడ వున్న వాటితోనే గంజికాచి, ఉప్పువేసి వీళ్ళకిచ్చాము. అదృష్టవశాత్తు అని ఎందుకన్నానంటే ఆ 'స్టోర్స్' కనుక్కోవడం అంత తేలికకాదు. ఎవరో ఒకరిద్దరికి మాత్రమే తెలుసు. అన్ని సమయాల్లో గ్రామాలకు వెళ్ళి తెచ్చుకోవడం సాధ్యంకాదు. పోలీస్ వుంటుంది. అందుకని కొన్నిచోట్ల యిలా 'స్టోర్సు'గా దాచేవారు. ఒకోసారి తుపాకి తూటాలు వంటి మందుగుండు కూడా వుండేది. అలాంటప్పుడు మరీ జాగ్రత్తగా వుండేవాళ్ళు. తాత్కాలికమైన స్టోర్సు కూడా వుండేవి. ఇవన్నీ దళాలు తమ అనుభవంతో తాము ఏర్పాటు చేసుకున్నవే.



స్థానిక ప్రజానీకంలో, దళ సభ్యులలో సృజనాత్మకత, చొరవ చాలా విలువైన గుణపాఠాలనిచ్చేవి.

సరే, దిండినది దాటుతున్నప్పుడు ఒక దళ సభ్యుడు ఆల్వాల నరసింహారెడ్డిని భారత సైన్యాలు ఎలా వెంటాడయో చెప్పాడు. మంచి దళ నాయకులలో ఆయనొకడు. ఆ దిండి గట్టుమీద పశువులు నీళ్ళుతాగి మందలు మందలుగా పడుకునేవి.

ఒకసారి గొల్లవారి వేషంలో ఆల్వాల నర్సింహారెడ్డి ఈ పశువుల మంద వద్ద రక్షణ తీసుకుంటున్నాడు. సమాచారం ఎలాగో మిలటరీకి జేరింది. మిలటరీ చుట్టుముట్టింది. లొంగిపొమ్మని బెదిరించింది. సమాధానంగా నర్సింహారెడ్డి కాల్పులు జరిపాడు. వాళ్ళూ కాల్పులు సాగించారు. ఈ పశువులనడ్డం పెట్టుకొని నర్సింహారెడ్డి బయటపడదామని చూస్తున్నాడు. ఈ కాల్పుల చప్పుళ్ళకు పశువులు బెదిరి ఒక్కసారిగా చెల్లాచెదురుగా పురకసాగాయి. వాటి కాళ్ళ క్రింద పడి నర్సింహారెడ్డి కాలు ఒకటి నజ్జు నజ్జు అయింది.

అయినా ఎలాగో ఒక దున్నపోతును పట్టుకుని దిండి నది దాటి ఆవలి వొడ్డుకు చేరాడు. మిలటరీ వెళ్ళలేకపోయింది. ఆ తర్వాత ఆ దగ్గర్లో ఒక గ్రామంలో రక్షణ తీసుకుంటూ కాలుకు అందుబాటులో వున్న వైద్యం చేసుకుంటున్నాడు.

ఎవరో ద్రోహి సమాచారం అందిస్తే మళ్ళీ ఆ ఊరును మిలటరీ చుట్టేసింది. ఊరు బయటకు కుంటుకుంటూ పరుగెత్తి వెళ్ళాడు. మిలటరీ సమీపానికి వచ్చింది. ఒక పాడుపడిన గోడ చాటు చేసుకుని గురి చూసి మిలటరీపై కాల్పులు సాగించాడు. తూటాలు అయిపోతున్నాయి. చివరి తూటాతో తనను తాను కాల్చుకుని నర్సింహారెడ్డి కొనవూపిరితో వున్నాడు.

స్థానికంగా వున్న భూస్వాములు నర్సింహారెడ్డిపై తగని కక్షతో వున్నారు. నర్సింహారెడ్డి కొద్ది నిమిషాల్లో చచ్చిపోతున్నాడని తెలిసి అక్కడకు చేరారు. అప్పటికే నర్సింహారెడ్డి మరణించాడు. ఆ శవాన్ని కాళ్ళతో తన్నాలనీ, ఆ శవంపై వుమ్మివేయాలని వాళ్ళ వుద్దేశం. ఆ మిలటరీ కమాండర్ అంగీకరించలేదు.

"వీరుడిలాగా పోరాడుతూ మరణించాడు. వీరునికి అర్హమైన గౌరవ మర్యాదలతో అంత్యక్రియలు జరగాల్సిందేనని" అలాగే చేశాడు. ఆ విధంగా చాలా సందర్భాలలో భారత సైన్యం ప్రవర్తించింది. మిలటరీకి యిలాంటి సందర్భాలలో అలా చేయడం సాంప్రదాయం. అయితే ఆ మిలటరీ కమాండర్‌ను బట్టి కూడా వుంటుంది.

నర్సింహారెడ్డి ధైర్య సాహసాలగూర్చి జనం కథలు కథలుగా చెప్పుకునేవారు. అతనిపై చాలా పాటలు కూడా వుండేవి. అవన్ని జాగ్రత్త చేయాలి. ఇటీవలి 'వీర తెలంగాణా నాది' పాటలో ఆయనను గూర్చి కూడా వుంది.

సరే. ఏలేశ్వరంలో పెద్దకొండ ఎక్కాలి. పైగా నిటారుగా కూడా వుంటుంది. మైదానం నుండి ఎక్కడం మరీ కష్టం. మేము అవతలవైపు నుండి వచ్చాం గనుక మాకు అంత కష్టం అనిపించలేదు. అడవి వుంది గానీ పెద్ద చిట్టడివి కాదు. జూన్, జులై నెలలు కూడా వర్షాలు యింకా బాగా పడడంలేదు. దారి పొడుగునా కామ్రేడ్స్, నర్సింహారెడ్డి చేసిన వీరకృత్యాలలాంటివి గుర్తు చేస్తుండేవారు. సూర్యాపేట ప్రాంతంలో గోపాలరెడ్డిని గూర్చి కూడా అలాగే కథలుండేవి. సైసై గోపాలరెడ్డి అనే పాట యిప్పటికీ మన వాళ్ళు పాడుతుంటారు.

1952 తర్వాత నేను ఆల్వాల వెళ్ళి, నర్సింహారెడ్డి కుటుంబాన్ని పలకరించి వచ్చాను. చాలా పేదకుటుంబం. ఆ తర్వాత కలవడం పడలేదు. ఇక్కడే, వీర తెలంగాణా విప్లవం పోరాట గ్రంథంలో నేను రాసిన వెంకటాచలం పొంగిపొరుతున్న కృష్ణను దాటడం ఘట్టం జరిగింది. అలాగే కృష్ణానది అవతలివైపు గుంటూరు జిల్లా దళాలుండేవి. వీరతెలంగాణా పుస్తకంలో రాసిన కోటేరు సుబ్బారావును పోలీసులు అరెస్టు చేశారు. తీవ్ర చిత్రహింసలకు గురి చేశారు. చివరికి లాగులు కింద కట్టివేసి తేళ్ళను కూడా లోపలకు వదిలారు. అయినా ఒక్క రహస్యాన్ని కూడా అతని నుండి పోలీసులు రాబట్టలేకపోయారు. అతను చెప్పినట్లయితే ఎంతో నష్టం జరిగి వుండేది.

దళాలకు నచ్చచెప్పాను. మనం పోరాటం సాగిస్తాము. విముక్తి పోరాటం మాదిరి మనం దాడి చేయడం కాదు. ఆత్మరక్షణ చేసుకుంటూ వుండాలి. ఎప్పటి దాకా అంటే, సాయుధపోరాట విరమణకు అనుకూలమైన షరతులు సాధించేదాకా. దీన్ని కామ్రేడ్స్ అంగీకరించారు. కమ్యూనిస్టు పార్టీ చెప్పింది ఆచరించాలి అన్న దొక్కటే కారణం కాదు. తమ జీవితానుభవం కూడా అదే చెప్తున్నది. చాలా నష్టాలు పొందుతున్నారు. అదీ వారు గుర్తించారు. మరో అంశం ఏమంటే, సరే పోరాటం విరమణ చేస్తాము. తర్వాత ఏం చెయ్యాలి? బయటపడే మార్గం ఏమిటి? ఇలాంటి ప్రశ్నలు సహజంగా వస్తాయి, వచ్చాయి.

కొందరిపై హత్యా నేరాలు వున్నాయి. కొందరు రహస్యంగా వుంటున్నారు. వీళ్ళందరూ బయటకు వచ్చేదెట్టా? పైగా మనంగా మనం దాడి చేయవద్దంటున్నారు. శత్రువు చుట్టుముట్టితే ఎలా? ఇలాంటి ప్రశ్నలు అడగసాగారు. ఇక్కడ కూడా వుండడం సాధ్యంకాదు అనుకున్నవారిని యితర ప్రాంతాలకు, సర్కార్ జిల్లాలకు మారుస్తాం. ఎన్నికలూ అవి జరగాలి గదా. ఇంత తీవ్ర నిర్బంధం అక్కడ వుండదు అని చెప్పాం. ఇక్కడకు మీరు తిరిగి రాగలస్థితి ఏర్పడిన తర్వాతనే వద్దురుగానీ. ఒక వేళ ప్రభుత్వం ఎప్పటికీ రానివ్వకపోతే, వెయ్యిమందినైనాసరే కుటుంబాలతో సహా అక్కడే జీవించే ఏర్పాట్లు చేద్దాం అని చెప్పాం.

ప్రభుత్వానికి కూడా పోరాటాన్ని కేవలం సాయుధ బలంతోనే అణచడం సాధ్యంగాదని తెలుస్తూనే వుంది. నెహ్రూ సైన్యాలు వచ్చి మూడేళ్ళు దాటింది. కానీ, ఈ పోరాటాన్ని అణచడం వారికి సాధ్యం కాలేదు. గ్రామాల నుండి తరిమివేయబడిన లేదా పారిపోయిన భూస్వాములు తిరిగి వూళ్ళల్లోకి వచ్చేందుకు జంకుతూనే వున్నారు. పైగా ప్రభుత్వ పరువు మర్యాదల సమస్య



కూడా వుంది. ప్రజాభిప్రాయమూ ఈ విషయంలో ప్రభుత్వానికి అనుకూలంగాలేదు. వీటిని మించి, ప్రభుత్వానికి ఈ పోరాటాన్ని అణిచేందుకని ఎంత ఖర్చు అవుతున్నదని. మామూలు యుద్ధానికేమీ తీసిపోవడంలేదు.

కనుక మనం విధించే షరతులలో ముఖ్యమైన వాటిని ప్రభుత్వం అంగీకరించే అవకాశం వుంది. ఇలా చెప్పి, నచ్చచెప్పి వొప్పించాము. ఇక అక్కడ నుండి నేను పార్టీ కేంద్రానికి తిరిగి రావడం అంతకష్టమేమీకాదు.

పోరాట విరమణ నిర్ణయం తీసుకున్న తర్వాత ఇక అక్కడ దళాలకు సైనిక శిక్షణ సమస్యరాదుకదా. అందుకని మేజర్ జైపాల్‌సింగ్‌ను నాతో తీసుకువచ్చాను. అప్పటికి ఆర్నెల్లుగా ఆయన అక్కడ వుంటున్నాడు. సాయంత్రం 6 గంటలకు బయలుదేరాం. అడవిగుండా కొంచెం జోరుగా నడిచి, ఏమైనా దేవరకొండ దగ్గరకు చేరాలి. అదీ రాత్రిలోపలే దారిలో గ్రామాలను దాటేసి ప్రక్కగా వెళ్ళాలి. అడవిలో అయితే అప్పుడప్పుడు పగటిపూట ప్రయాణం చేసినా ఫరవాలేదు కాని అడివిదాటి మైదాన ప్రాంతాల్లో దాదాపు పగటి ప్రయాణం నిషిద్ధం. మనం వెళ్ళాలి. అనుకొన్న ఊరు చేరేసరికి ప్రొద్దెక్కుతుంది అనుకొంటే అడవిలోనే చీకటిపడే వరకు వుండి చీకటిపడ్డ తరువాతనే వూళ్ళోకి వెళ్ళేవాళ్ళము.

అడవిలో ప్రయాణముచేసేటప్పుడు పశువుల కాపర్లు, గొల్లవాళ్ళు చూసేవారు. అయితే వారికి దళాలు అడివిలో తిరుగుతున్నాయన్న సంగతి తెలుసు. వారికి దళాలపట్ల అభిమానమే ఉండేదిగాని ద్వేషము ఏమీ వుండేదికాదు. అందువల్ల బయటకు పొక్కేది కాదు. ఇక పోలీసులా: వాళ్ళు దళాలపై దాడిచేసేందుకు ముందుగా ఎంతగానో పథకం వేసుకొంటేతప్ప సాహసించేవారు కాదు. పథకం వేసుకోవాలన్నా ఏదారినవస్తామని? అసలు అడవుల్లో నిర్ణీతమైన దారులంటూ ఉండవు. అంతగా ఉన్నా వాటివెంట మేము నడిచే వాళ్ళం కాదు. మొత్తం అడవి నంతటినీ చుట్టుముట్టి దాడి చేయాలంటే కొన్ని వందలమంది పోలీసులు కావాలి. అంత సంచలనముంటే మాకెట్లాగు ముందే తెలిసిపోతుంది. అడవిలో నడిచేటప్పుడు కూడా మాకంటే రెండు మూడు వందల గజాల ముందుగా 'సెంట్రీ' ఒకతను నడుస్తూ వుండేవాడు.

మేజర్ జైపాల్‌సింగ్ కూడా నాతో వస్తున్నాడని చెప్పాను కదా. ఆయన బూట్లు వేసుకొని ఉన్నాడు. ఒక బూటు కాలికి సరిగా అమరినట్లులేదు. అది ఇబ్బంది పెడుతూ వున్నది. కాని ఆయన నాకు ఆ విషయం చెప్పలేదు. కొంత దూరం వెళ్ళిన తరువాత మేజర్ కుంటడం గమనించాను. ఏమైందని చూస్తే అప్పటికే చెప్పుకరచి కాలికి పుండు అయింది. "నువ్వు ముందే ఎందుకు చెప్పలేదయ్యా, ఎంత మిలిటరీ కెప్టెన్‌వు అయినా పుండుపడ్డ కాలుతో ఎట్లా నడవగలను అనుకొన్నావు" అని నవ్వుతూ మందలించాను. ఏదో ఒకటి చేసి మెల్లగానైనా మేము అనుకొన్నచోటుకు చేరాలిగదా. లేకపోతే మొత్తం మా కార్యక్రమం అంతా తల్లక్రిందులవుతుంది. పాపము ఆయన అంత బాధతోనూ మాతో నడిచాడు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో దేవరకొండ దగ్గరకు చేరాము.

కాని పగటిపూట అక్కడ గడపటము అంత మంచిది కాదనిపించింది. అందుకని చేలకడ్డంపడి ప్రయాణము సాగించాము. రాచకొండగుట్టలకు చేరాలన్నది మా గమ్యము. ఈ రాచకొండ గుట్టలు అడవుల ప్రాంతం. మనకు మరో ముఖ్యమైన కేంద్రము. హైదరాబాద్ నుంచే బయలుదేరి ఇబ్రహీంపట్నం, కొల్హాపూర్‌ల మీదుగా దిండి నది దాటి ఏలేశ్వరం చేరి అక్కడ నుండి దేవరకొండ మీదుగా ఈ రాచకొండ చేరామన్నమాట. ప్రయాణంలో మా వెంట మా రక్షణకు దళము, ఆయుధాలు ఉన్నాయి. మార్గ మధ్యంలో ఎక్కడన్నా కుంటవద్ద ఆగి అన్నము వండుకొని తిని బయల్దేరేవాళ్ళము.

ఇక్కడ మామూలుగా అయితే ఒకటి రెండు రోజులు ఉందామనుకున్నాము. కాని యూనియన్ సైన్యాలు వచ్చిన తరువాత దళ కేంద్రాలు కొన్ని ఎత్తివేసుకోవడము, మార్చుకోవడము జరిగింది. అందువల్ల దళాల్ని కలుసుకోవాలంటే వెతుక్కొంటూ వెళ్ళాలి. గనుక మరికొంత ఆలస్యము అయ్యేటట్లున్నది. ఈ నడకవల్ల మేజర్ కాలి పుండు పెద్దదై చాలా ఇబ్బంది పెడుతున్నది. అందుకని ఆయనను అక్కడే వుంచి నేను ఇంకో ఇద్దరు దళ సభ్యులను తోడు తీసుకొని వెళ్ళాలని నిశ్చయించుకొన్నాను. అది బాగా అనువైన ప్రాంతం శత్రువుకు తెలిసే అవకాశములేని ప్రాంతము కనుక జైపాల్ అక్కడ వుండవచ్చు. ఆయన కాలు పరిస్థితి కొంచెం మెరుగైన తర్వాత ఆయన బయలుదేరవచ్చు. నేను దళాలను కలుసుకొని ఆ తరువాత హైదరాబాద్ చేరతాను. ఇక అక్కడ నాకు ఎవ్వరూ తోడు అక్కరలేదు. నేను రహస్య కేంద్ర స్థావరానికి వెళతాను. కనుక నాతోపాటు ఎవ్వరూ ఉండటం కూడా మంచిదికాదు.

ఆ రోజుల్లో ఈ స్థావరాలు ఒక్కోసారి చెదిరిపోయేవని చెప్పాను కదా. అందుకని వెళ్ళవలసిన స్థావరానికి దూరంగానే ఉండి అది సరిగానే పని చేస్తున్నదా లేదా చెదిరిపోయినదా అని తెలుసుకొనే వాళ్ళం. అందుకు కొన్ని కొండగుర్తులు లాంటి సంకేతాలు వినియోగించే వాళ్ళము.

నేను వెళ్ళి మామూలు సంబంధాలు అవీ ఏర్పాటు చేసుకొన్న తర్వాత మేజర్ జైపాల్‌సింగ్ కూడా అక్కడకు చేరాడు. ఇక్కడ గమనించాల్సిందేమంటే విప్లవ కారులకు సైద్ధాంతిక బలము, దృఢమైన దీక్షలతోపాటు శారీరక శక్తి కూడా చాలా అవసరం. ఆ విషయంలో మేజర్‌ను ఆదర్శంగా చెప్పవచ్చు. మేజర్ అడవుల్లోకి వచ్చి అక్కడి దళాలకు శిక్షణ ఇవ్వడమే గాక వారితోపాటు కష్టమైన జీవితాన్ని సునాయాసంగా గడపగలిగాడు. ఆయనకు మన మేదరమెట్ల సీతారామయ్య తుపాకి కాల్చడంలో మంచి గురిగలవాడు అని అభిప్రాయముండేది. అలాగే రాములు అని మరో కామ్రేడ్ ఉండేవాడు. ఆయనను ఆ రోజులలో చంద్రయ్య అని పిలిచేవాళ్ళం. ఇప్పుడు ఆ రాములు మన పార్టీలో లేకపోగా మనకు బద్ధశత్రువుగా ఉన్నాడు.

మామూలు రాజకీయ పరిస్థితికి సంబంధించి ఇలాంటి ఘటనలు అంతగా ప్రాముఖ్యమనిపించకపోయినా పోరాటం నడపటానికి, వీటికి ఎంతో ప్రాధాన్యత ఉంది.



నేను హైదరాబాద్ జులై మధ్యలో చేరాను. అప్పటికి నిర్బంధం తీవ్రమైంది. పై పెచ్చు విచ్ఛిన్నమూ పెరిగింది. మన రహస్య స్థావరాలపై దాడులు ఎక్కువైనాయి. ఇక కేంద్ర స్థానము హైదరాబాద్‌లో ఉండటము సాధ్యము కాదని నిర్ణయించుకున్నాము. విజయవాడ ప్రసక్తి అప్పటికి లేదు. 1952 అక్టోబరు ఎన్నికల తరువాతనే విజయవాడ.

హైదరాబాద్‌లో సమావేశము వీలుగాదు. బొంబాయిలో కామ్రేడ్ పెరులేకర్ వర్లీ పోరాట సందర్భంగా రహస్య స్థావరాల్ని కొన్నింటిని కొనసాగిస్తున్నాడు. అందుకని అక్కడ సమావేశమవుదామనుకొన్నాము. పైగా ఆయన తెలంగాణా పోరాటాన్ని సమర్థిస్తున్న వారిలో ఒకరు. వాళ్ళు కూడా పోరాటంలో ఉన్నారు కదా.

చంద్రశేఖర్ అని ఒక కామ్రేడ్ ఉండేవాడు. ఇటీవలే ఆయన మాస్కోలో మరణించాడు. పెరులేకర్ ఈ సమావేశానికి ఎంతగానో సహకరించారు. మొత్తం అయిదారుగురం కలుసుకుని పోరాట విరమణ నిర్ణయం తీసుకోవాలి. బసవపున్నయ్య యిక్కడే వుండి మాకు సహకరిస్తూ సమన్వయం చేస్తూ వున్నారు. రాజేశ్వరరావు కేంద్రంలో వున్నాడు. చంద్రం రహస్య జీవితంలో వున్నారు. ఆయన వచ్చేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. నేను సరేసరి. దేవులపల్లి కూడా రావాలి. కబురు చేశాం! అయితే వస్తున్నదీ రానిదీ తెలియలేదు. ఒక పక్క ప్రభుత్వ నిర్బంధం, మరో పక్క దళాలను వదిలి వెళ్ళడం, విచ్ఛిన్నమూ ఎక్కువవుతున్నది. త్వరగా నిర్ణయం తీసుకోవాలి. అందువల్ల దేవులపల్లి రాకపోయినా నిర్ణయం తీసుకుందా మనుకున్నాము. అయిదుగురిలో నలుగురం అంగీకరించిన తర్వాత, దేవులపల్లి కూడా అంగీకరింపచేయగలము.

కరీంనగర్, ఆదిలాబాద్ ప్రాంతం, అమరాబాద్ ప్రాంతం ఎటూ అంగీకరించాయి. ఖమ్మం ప్రాంతంలో సంబంధాలు తెగిపోయాయి. మానుకోట-వరంగల్ ప్రాంతానికి వెళ్ళిన దేవులపల్లి రాలేదు. ప్రభుత్వం రాతపూర్వకంగా ఒక వొప్పందానికి సిద్ధంగా లేదుకానీ “మీరు పోరాట విరమణ చెయ్యండి. మీ షరతులను ఆమోదిస్తాము” అని విశ్వాస పాత్రులయిన వారి ద్వారా కబురు చేస్తున్నది. ఇక పోరాట విరమణ నిర్ణయం తప్పని పరిస్థితి. వేరే మార్గం లేదు. అయితే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఒక్కసారిగా అందర్నీ రహస్య జీవితం నుండి బహిరంగంగా రమ్మని చెప్పలేము. ప్రభుత్వానికి అప్పగించలేము. ముందు పెద్దగా ప్రభుత్వం దృష్టి పడని, ఎక్కువగా తీవ్రమైన నేరారోపణలు లేని మామూలు దళ సభ్యులను బహిరంగంగా రప్పించాలి. ప్రభుత్వం వాళ్ళను నిర్బంధిస్తే, దళ నాయకులను బహిరంగపరిచే ప్రసక్తేలేదు. ప్రభుత్వం వీళ్ళను ఏమీ చెయ్యలేకపోతే, క్రమేపీ దళ నాయకులను కూడా బహిరంగంగా రమ్మని చెప్పాలి.

స్థానికంగా భూస్వాములు కొందరు దళనాయకులపట్ల ఎంతో ద్వేషంతో వున్నారు. ప్రభుత్వం ఏమీ చేయకపోయినా వీరు గూండాలతో ఆ దళ నాయకులను చంపించవచ్చు. అలాంటప్పుడు వారిని వేరే ప్రాంతాలకు తరలించి, అక్కడ వుండమని, వారి వారి ప్రాంతాల్లో పరిస్థితులు మెరుగైన తర్వాత మళ్ళీ వారి ప్రాంతాలకు పంపే ఏర్పాటు చేయాలి. అట్లా

సుమారు నూటయాభై మందికి, కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో చాలా కొద్దిమందికి కర్నూలు జిల్లాలో ఆశ్రయం కల్పించాము.

ఈ ప్రాంతాల కామ్రేడ్స్ కూడా వారిని కుటుంబాలతో సహా వచ్చిన వారిని ఎంతో సాదరంగా చూశారు. అక్కడ వీరు కామ్రేడ్స్ రిలేషన్ అంటామే, కామ్రేడ్స్ మధ్య వుండే స్నేహ సౌహార్ద్రతలు స్పష్టంగా అనుభవించారు. ఎవరికీ కుటుంబ పోషణ కోసం డబ్బులు యివ్వలేదనే చెప్పవచ్చు. పరాయి ప్రాంతాలలో జీవనం గడుపుతున్న కామ్రేడ్స్ కూడా వ్యవసాయ పనులూ, చిన్న వ్యాపారాలు, చిన్న వుద్యోగాలు సాగిస్తూ తమ జీవనభృతి సంపాదించుకునేవారు. ఏదో ఆరంభంలో చాలా కొద్ది మొత్తం యిచ్చి వుంటాము.

అయితే రహస్యంగా వున్న వారిపైన, బయటకు వచ్చిన దళ సభ్యులపైన వున్న కేసులు, వాటిని నిర్వహించడం చాలా పెద్దపని అయింది. ఆర్థికంగా కూడా. నా అంచనా ప్రకారం లక్షరూపాయలకు తక్కువ ఖర్చయి వుండదు. దీన్ని మనమే, ఈ ప్రాంతంలోనే చందాల ద్వారా వసూలు చేసుకున్నాము. పార్టీ కేంద్రం సహకరించేందుకు, లాయర్లతో ఒక సహాయక కమిటీ హైదరాబాద్‌లో ఏర్పడింది. అందులో మనోహర్ రాజ్ సక్సేనా, డానియల్, లతీఫ్, సుప్రీంకోర్టు న్యాయవాది ఎ.ఎస్.ఆర్. చారి మొదలైన వాళ్ళున్నారు.

ఈ లీగల్ కమిటీ ఇంగ్లాండులో ప్రముఖ లాయర్ డి.ఎస్.ప్రిటీ సహకారాన్ని కూడా కోరింది. ఒక పదమూడు మందిపై ఉరిశిక్షలు వున్నాయి. ఆయన ప్రత్యేకించి, వారి తరపున వాదించేందుకు వచ్చాడు. ఆ శిక్ష నైజాం ప్రభుత్వం విధించింది. ఇప్పుడా ప్రభుత్వం పోయింది. భారత ప్రభుత్వం వచ్చింది కనుక నైజాం ప్రభుత్వం విధించిన శిక్ష చెల్లనేచెల్లదన్నది ఆయన ప్రధాన వాదన. ఆ పదముగ్గురికీ, మరణశిక్షలు రద్దయి, శిక్షలు పడ్డాయి. ఈ విధంగా బహిరంగంగా వచ్చిన వారిలో దాదాపు యాభై మందికి అలా శిక్షలు పడ్డాయి. నిజాం జమానాలో దీర్ఘకాల జైలు శిక్షలు, యావజ్జీవ కారాగార శిక్షలు అనుభవిస్తున్న వాళ్ళు ఉన్నారు. నేను రాజ్యసభకు ఎన్నికైన తర్వాత కూడా ఒకరిద్దరకు శిక్షలు పడ్డాయి. దాదాపు 5 సంవత్సరాలు అంటే 1958 నాటికి అత్యధిక భాగాన్ని విడుదల చేయించడంలో కృతకృత్యులమయ్యాము.

సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా వచ్చిన తర్వాత ఈ ఖైదీల విడుదల విషయంలో ధైర్యంగానే నిర్ణయం తీసుకొన్నారు. జైలులో వున్న వాళ్ళలో చివరి బ్యాచ్ నాకు రెండవసారి ఆపరేషన్ నిమిత్తం నేను మాస్కోలో వుండగా విడుదల అయ్యింది. 1960 జూన్, జులై ప్రాంతాలలో అనుకుంటాను. దీనికి సంబంధించిన విషయం నేను తెలంగాణా పోరాట పుస్తకంలో వివరంగానే రాశాను.

సరే బొంబాయిలో మీటింగు గురించి చెబుతున్నాను గదా. హైదరాబాద్‌లో కొన్ని రహస్య స్థావరాలు కొనసాగించడం అడవుల్లో వున్న దళాలకు, బయటకు మధ్య సంబంధాలు నెలకొల్పేందుకు బాగా ఉపయోగపడుతున్నాం.



తెలంగాణా కామ్రేడ్స్‌కు పార్టీలోని నాయకులందరిపైనా ప్రేమ, భక్తి, విశ్వాసాలున్నప్పటికీ మీపైన ప్రత్యేకమైన అభిమానం వారిలో ఎక్కువగా ఉంది అని కొంత మంది కామ్రేడ్స్ అడుగుతూ ఉంటారు. నిజానికి అంత ప్రత్యేకమైన అభిమానము పొందగలిగే అంత ప్రత్యేకత నాలో ఏమీలేదు. ఇంకా చెప్పాలంటే ఈ పోరాటం నడపటంలో బసవపున్నయ్య, రాజేశ్వరరావు వీళ్ళ పాత్ర కూడా నా కన్నా తక్కువయిందేమీ కాదు. కాకుంటే వీళ్ళకన్నా ఎక్కువసార్లు నేను అడవుల్లోని దళాలతో ప్రత్యక్షంగా కలిసి వున్నాను. ఆ లెక్కకు వస్తే దేవులపల్లి ఎక్కువ కాలము కేంద్రంలో గడిపాడు కాని బి.ఎన్. మాత్రం దాదాపు దళాలతోనే ఉన్నాడు. వారి కష్టసుఖాల్లో మిగతావారికన్నా నాకు ఎక్కువ సాన్నిహిత్యం ఉండటంవలనా, ఆ తరువాత వారి పునరావాస సందర్భంగా కృషి చేయడంలోను నేను కూడా ప్రధాన భాగస్వామి కావడంవలనా ఆ ప్రత్యేక అభిమానం ఉండి ఉండవచ్చు. అంతకుమించి ప్రత్యేకించి చెప్పవలసిందేమీ లేదు.

పోరాట విరమణ ప్రకటన 20వ తేదీన మేము విడుదల చేశాము. పత్రికల్లో 21వ తేదీ వచ్చింది. అయితే ప్రభుత్వము మా ప్రకటన కోసం చాలా అదుర్దాగా ఎదురు చూస్తోంది. అందుకని 20వ తేదీనే రేడియోలో మా ప్రకటన చెప్పారు. లిఖితపూర్వకంగా కాకపోయిన కొన్ని హామీలతో, షరతులతో మేము పోరాట విరమణ ప్రకటించాము. కాని ప్రభుత్వము ఆ విషయాన్ని చెప్పదుగదా. ఎట్టి షరతులూ లేకుండా మేము పోరాట విరమణ చేసినట్లే ప్రకటించినది. వివిధ ప్రాంతాల్లో అడవుల్లో ఉన్న దళాలకు మా మధ్య ఏమి చర్చలు జరిగినవి? ఏమి సాధించగలిగాము, ఇక ఇప్పుడు ఏం చేయాలి ఇవి అన్నీ వివరించాలి.

ఇంతకుముందు దళాలను కలుసుకొని పరిస్థితిని వివరించి, వారి అభిప్రాయాలూ, అనుమానాలు తెలుసుకొని వచ్చేందుకు నా పర్యటన దాదాపు రెండు నెలలు సాగింది. ఇప్పుడు ఈ నిర్ణయాన్ని వివరించడానికి అంత సమయం లేదు. దళాలన్నింటిని ఒకదాని తరువాత ఒకటిగా కలుసుకోవడం కష్టసాధ్యము. అందుకని మేము వస్తున్నామని పోరాట విరమణ ప్రకటన గురించి వివరిస్తామని దళ నాయకులతో, ప్రాంతీయ కమిటీ సభ్యులతో, ముఖ్యులతో మహాసభలాంటిది ఏర్పాటు చేయమని ముందుగానే కబురు చేశాము. ఆ మేరకు రాజేశ్వరరావు మానుకోట, వరంగల్ ప్రాంతానికి, నేను అమరాబాద్ ప్రాంతానికి వెళ్ళాలని నిర్ణయించుకొన్నాము. పైగా ఎన్నికలు కూడా రానున్నాయి. ఎవర్ని నిలబెట్టాలి. ఏ రకంగా కృషి చేయాలి యివి అన్నీ కూడా చర్చించాలి. అమరాబాద్ ప్రాంతంలో శ్రీశైలానికి దక్షిణంగాను, దేవరకొండకు ఉత్తరంగానూ ఒకచోట చాలా జాగ్రత్తలు తీసుకొని మహాసభ ఏర్పాటు చేశారు. గుట్టల మధ్య నది చీలినచోట ఒక పెద్ద మైదానము లాంటిది వున్నది. పైకి ఏమీ కనపడదు. దాదాపు 300 మంది వరకు విశ్రాంతిగా సామాన్యంగా ఎవరి దృష్టిలో పడకుండా సమావేశము జరుపుకునేందుకు అనువుగా వుంది. అక్కడ మహాసభ 3, 4 రోజులు గడిపేందుకు అవసరమైన సరంజామా కూడా అక్కడకు జేర్చారు.

మహాసభ జరిగినన్ని రోజులూ ఆ ప్రాంతానికి కొంత దూరంలో రెండు వలయాల్లో దళాలు వంతులవారీగా కాపలా కాస్తున్నాయి. ఎవరన్నా మహాసభ వద్దకు చేరాలంటే ఈ రెండు వలయాల్ని ఛేదించుకురావాలన్నమాట. మేము కూడా అవసరమైతే ఏ దాడినైనా ఎదుర్కొనేందుకు వీలుగా అవసరమైన ఆయుధాలతోను, ఒకవేళ తప్పించుకోవలసి వస్తే తగిన మార్గాల్ని ఎంచుకొని సర్వసన్నద్ధంగానే వున్నాము.

పోరాట విరమణ చేశాముగదా అని నిర్లక్ష్యముగా వుండేందుకు వీల్లేదు. ఏ షరతులూ లేని విరమణ కింద ప్రభుత్వము ప్రకటించింది కదా. కనుక తనుకేదీ అదనపు సమాచారం లేదనే నెపంతో భారత సైన్యము ఏక్షణాన్నైనా దాడి చేయవచ్చు. కనుక ఏ భ్రమలకూ లోనుకాకుండా తగు జాగ్రత్తలతోనే మహాసభను నిర్వహించాము.

పోరాట విరమణ అంటే ప్రభుత్వానికి లొంగిపోవటమని అర్థంకాదు. క్రమబద్ధంగా వెనక్కి తగ్గటం. పునరావాస ఏర్పాట్లు, పరిస్థితికి అనుగుణమైన కార్యక్రమము నిర్వహించడం. ఇంకా ప్రభుత్వము ఏ రకంగా వ్యవహరిస్తుంది అనేది కూడా స్పష్టంకాలేదు. ఇంతెందుకు పొంగి పొర్లుతున్న, కృష్ణానదిని సాహసోపేతంగా దాటిన కామ్రేడ్ ముత్తిరెడ్డి వెంకటాచలం గురించి చెప్పానుకదా. ఎన్నికల తరుణంలో ఒక గ్రూపు సమావేశంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ప్రసంగిస్తుండగా పోలీసులు చుట్టుముట్టి ఆయనను కాల్చి చంపారు. అప్పుడు అతనివద్ద తుపాకీ కూడా ఉన్నది. దానిని ఉపయోగించే సమయం లేకుండానే కాల్చి ఉంటారు. ఎన్నికలలోనే ఇలా చేసినవాళ్ళు ఈ మహాసభను జరగనిస్తారా.

మొత్తం మీద ఈ అడవులలో ఉన్న దళాల్లో ఏవో సమావేశాలు జరుగుతున్నాయని ప్రభుత్వానికి చూచాయగా తెలుసు. కాని ఎక్కడ, ఏమిటి అన్నది తెలియదు. మేము సమావేశము జరిపిన తరువాత అమరాబాద్ ప్రాంతీయసభ తీర్మానాలు అని ఒక ప్రకటన చేశాము. అందులో పోరాట విరమణ నిర్ణయము, మనము ఆమోదింప చేసుకొన్న షరతులు ఇవి అన్నీ ఉన్నాయి. బహుశా దానిని బట్టి ఇలాంటి మహాసభ జరిగినదని సభ అయిపోయిన తరువాత ప్రభుత్వానికి తెలిసి వుంటుంది. అయితే మానుకోట ప్రాంతం నుంచే రాజేశ్వరరావు రావటము ఆలస్యమయింది. కనుక ఆ తీర్మానాలు ప్రకటించబడలేదు. రాజేశ్వరరావు వచ్చేటప్పుడు ఖమ్మం మీదుగా వచ్చాడు. అప్పుడే ఆయనను మిలటరీ చుట్టుముట్టింది. కొద్దిలో ప్రమాదము తప్పి ఆయన బయటపడ్డాడు.

అమరాబాద్ విస్తృత సమావేశంలో అనుకొన్నట్లుగా అన్నీ వివరించాం. అయితే ఈ సందర్భంగా ఒక ఘటన చెప్పాలి. రాత్రిపూట ఒక సెంట్రీ తుపాకీ అనుకోకుండా పేలింది. వెంటనే అందరిలో కలవరం. ఇది ఏమన్నా శత్రువులు వస్తున్నారని హెచ్చరికగా పేల్చినదా అన్నది మొదట వచ్చిన అనుమానం. కొంత పరిశీలన జరిపినమీదట అదేమీ కాదని ఏదో పొరపాటున పేలిందని తేలింది. ఆ విషయాన్నే బయట రెండు వలయాలుగా రక్షణ ఇస్తున్న దళాలకు తెలియజేశాను. కంగారు పడవలసిందేమీ లేదని అయినా వారు మరింత జాగ్రత్తగా



ఉండాలని ఎందుకంటే ఈ శబ్దము గుట్టలు కనుక ప్రతిధ్వనించి శత్రువు చెవునపడవచ్చు. ఆ అవకాశము కూడా లేకపోలేదు. గుర్రాలమీద మన వాళ్ళు సామగ్రి చేర్చారు. ఆ తరువాత ఆ గుర్రాలు 5, 6 మైళ్ళ దూరంగా మేస్తూ ఉండగా పోలీసులు వచ్చి వాటిని తీసుకువెళ్ళారని తెలిసింది.

నేను వివరించే సందర్భంలో మేము తీసుకున్న నిర్ణయానికి మహాసభలో ఏమి వ్యతిరేకత రాలేదు. కాకుంటే కొన్ని అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమయినాయి. బహిరంగంగా ఉంటూ పోరాటానికి వ్యతిరేకంగా ప్రకటనలిచ్చిన వారిపట్ల మాత్రము క్రోధావేశాలు వ్యక్తమయినాయి. సహజమే, పార్టీలో విచ్ఛిన్నము రాకపోయినట్లయితే యింతకన్నా మంచి హామీలు పొందగలిగేవారమనిగాని, మంచి షరతులను సాధించుకొనే వారమనిగాని చెప్పజాలము. అయినా ఈ పోరాటానికి ద్రోహం చేసినవారిపట్ల మాత్రం ఇంకా పోరాడు వారికి ద్వేషముండటంలో ఆశ్చర్యమేముంది? ఆ మాటకొస్తే నేను తెలంగాణా పోరాట చరిత్ర రచన సందర్భంలో ఈ రోజు నాడు పోరాటానికి వ్యతిరేకంగా ఉన్న వారి గురించి స్థిమితంగా, సమతూకంగా చెప్పాలని అన్నప్పటికీ మనలో కొందరు అంగీకరించలేదు. పోరాట విరమణ చేయవలసివస్తే ఎందుకు చేయాలి, ఎలా చేయాలి అన్నది నచ్చచెప్పి నొప్పించటం ఒకత్తె' అంత మాత్రాన ప్రాణాలకు తెగించి పోరాడుతున్నవారిని "మీరు నడుపుతున్నది పోరాటం కాదు గూండాయిజం" అని నిందించిన వారిపట్ల ద్వేషము ఉండటం సహజమే.

# పార్టీలో అంతర్గత విభేదాలు

ఒక రకంగా చెప్పాలంటే పోరాటము సాగించమని చెప్పి ఒప్పించటం కన్నా ఈ పరిస్థితుల్లో పోరాట విరమణ చేయాలని కొన్ని హామీలు, షరతులు సాధించిన పిదపే అనుకోండి, నచ్చచెప్పడం కష్టం. 1951లో మాస్కో వెళ్ళి స్టాలిన్‌తో మాట్లాడివచ్చిన అనంతరం కేంద్ర కమిటీ జరిగిందని చెప్పాను కదా. ఆ కేంద్ర కమిటీ సమావేశంలో తక్షణమే పోరాట విరమణ చేయాలని కొందరు సూచిస్తే దానిని వ్యతిరేకిస్తూ “అది ఎలా సాధ్యము, తక్షణమే విరమించమని చెప్పేందుకు మనమెవరము. ఎప్పుడు, ఎలా విరమించాలని అన్నది అక్కడి ప్రజలు, ఆ పోరాటానికి నాయకత్వం వహిస్తున్న ఆ కార్యకర్తలు” అని వాదించిన వారిలో డాంగే కూడా వున్నారు.

అందుకనే అజయ్‌ఘోష్ “మీరు పోరాటాన్ని విరమించక పోయినట్లయితే మీతో మాకు సంబంధములేదని ప్రకటిస్తాను” అని అంటే చండ్రం ఉండి, “సరే మీరు అలాగే ప్రకటించండి. మీతో మాకు సంబంధములేదని మేమూ ప్రకటించుతాం” అని అనాల్సి వచ్చింది.

వీలైనంత తక్కువ నష్టాలతో, ఒక క్రమ పద్ధతిలో వెనక్కి తగ్గవలసి వస్తే తగ్గాలి. పరిస్థితిని అంచనా వేసి ఆ విధంగా నచ్చచెప్పి ఒప్పించలేనప్పుడు నాయకత్వ స్థానానికి అర్హులము కాము. సాయుధ పోరాటమనే కాదు మామూలు సమ్మెలాంటి పోరాటాలకు కూడా ఈ మాత్రమే వర్తిస్తుంది.

ఇక ఎన్నికలలో ఎవ్వరిని అభ్యర్థులుగా నిలబెట్టాలని అన్న ప్రశ్న వచ్చింది. రహస్య జీవితం గడుపుతున్న వాళ్ళను అభ్యర్థులుగా నియమించే ప్రశ్నరాదు. ఎందుకంటే నామినేషన్ వేసేందుకు వీరు స్వయంగా వెళ్ళి అధికారుల ముందు సంతకం పెట్టాలి కనుక కుదరదు. బహిరంగంగా ఉన్న వారినే అభ్యర్థులుగా నియమించగలము. అందుకనే ఆ ఎన్నికలలో గెలిచిన వారిలో చాలా తక్కువ మంది మాత్రమే. ఆ పిదప భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)లో మిగిలారు. నిజానికి 1964లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో చీలిక వచ్చినా. ఆ చీలిక బీజాలు 51 నాటికే వున్నాయని చెప్పాలి. లోలోపల అవి నివురుగప్పిన నిప్పులా వుంటూ, అప్పుడప్పుడూ



బాహాటంగా బయటపడి చివరకు సైద్ధాంతికంగా, రాజకీయంగా, నిర్మాణరీత్యా ఇక కలిసి వుండటము అసాధ్యమై 1964లో పార్టీ చీలింది. ఆనాడు పోరాటానికి వెన్ను చూపినవారు, పోరాటాన్ని బహిరంగంగా కించపరచి, ద్రోహం చేసినవారు అత్యధిక భాగము సిపిఐలో ఉండటాన్ని గమనించవచ్చు. ఆనాడు రహస్య జీవితం గడిపిన వారిలో పోరాటంలో ముఖ్యపాత్ర వహించినవారు అత్యధిక భాగము మార్క్సిస్టు పార్టీ వైపుకు వచ్చారు.

1953 నుండి కూడా పార్టీలో కొందరు ఈ రహస్య జీవితం గడిపిన వారు, పోరాటంలో ముఖ్యపాత్ర వహించినవారు కమిటీల్లోను, నాయకత్వ స్థానాలలోను వుండనక్కరలేదని వాదించేవారు. వారికేం తెలుసు, తుపాకి పట్టి గురి చూసి కొట్టడం తప్ప. ఈ పరిస్థితులలో ఆ విద్య ఎందుకూ పనికిరాదు. కనుక, వారు కమిటీలో దండగ అన్న వాదన దాదాపు 1964 దాకా కొనసాగింది అని చెప్పటంలో ఆశ్చర్యము లేదు.

ఏది ఏమైనా మనం గుర్తుంచుకోవలసింది పార్టీలో చీలిక అన్నది అప్పుడే మొదలైంది. ఇంకా చెప్పాలంటే, 1948లోనే నెహ్రూ సైన్యాలు నిజాంలో ప్రవేశించినప్పుడు పోరాటం సాగించాలా, నిలిపివేయాలా అన్న విభేదంతోనే మొదలైందని చెప్పాలి.

రావి నారాయణరెడ్డి విప్లవము వస్తేతప్ప మనం భూములు పంచరాదని, అలాంటప్పుడు 1948 తరువాత ఆ భూముల రక్షణ కోసం పోరాటం సాగించటం మరీ శుద్ధతప్పని కూడా వాదించాడు. “అంటే పాక్షిక పోరాటమంటూ లేనే లేదన్నమాట. నిజాం హయాంలోనే మనము భూములు పంచాము కనుక అది కూడా తప్పేనన్నమాట. ఇక అలాంటప్పుడు తెలంగాణా పోరాటం ఆరంభించడమే తప్పన్నమాట. అదేనా మీ ఉద్దేశ్యము” అని మేము చర్చల్లో నిలవేసినప్పుడు భూములు పంచడం తప్పు అన్న వాదనను రావి నారాయణరెడ్డి, యింకా అలాంటి వాళ్ళు వదులుకోక తప్పలేదు.

ఇవన్నీ యిలా వున్నా, బహిరంగంగా వున్న కమిటీ నిర్ణయించిన అభ్యర్థుల విజయానికి కృషి చేయవలసిందిగా రహస్యంగా పని చేస్తున్న కార్యకర్తలకు, దళాలకు చెప్పాము. ఫలితంగా ఎన్నికల్లో విజయం సాధించాము.

ఎన్నికల ఫలితాలు అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తాయి. అప్పటి దాకా ఈ పోరాటం అంతా పనికిమాలినదని దీన్ని నడుపుతున్న వారందరూ బందిపోటు దొంగలనీ ప్రచారం జరిగింది కదా. సీట్లు గెలవటమే కాదు, దాదాపు 33 శాతం పైగా ఓట్లు సాధించుకొన్నాము అన్న వాస్తవాన్ని శత్రువులు, మిత్రులు గుర్తించారు. అంతర్జాతీయంగా కూడా ఈ ఎన్నికల ఫలితాలు మంచి ప్రభావాన్ని కలుగజేసినాయి.

ఆంధ్ర ప్రాంతంలో 1955 ఎన్నికల్లో మనం అనూహ్యముగా ఓడిపోయాము. కాని ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో దాదాపు మూడవ వంతు ఓట్లు సంపాదించాము. 1956లో ఏదో మహాసభ సందర్భంగా ఫ్రెంచి కమ్యూనిస్టు నాయకులు “మీకు సీట్లు రాలేదు నిజమే

కాని ఒక బూర్జువా పాలనా యంత్రాంగంలో 3వ వంతు ఓట్లు రావడమన్నది చిన్న విషయమేమీ కాదు. చాలా గొప్ప విషయంగా మేము భావిస్తున్నాము. ఎందుకంటే ఎన్నో ఏళ్ళుగా కిందా మీదా పడుతున్నా మేము ఈ స్థాయికి చేరుకోలేదు” అని అన్నారు.

పార్లమెంటులో మొత్తం 29 మంది కమ్యూనిస్టు పార్టీ సభ్యులుంటే అందులో 11 మంది ఆంధ్రప్రాంతం వాళ్ళు, 6 గురు తెలంగాణా వాళ్ళు అంటే, 17 మంది మనమేనన్న మాట? ఇంక తెలంగాణా పోరాటంవల్ల ప్రజలకు దూరమైనాము అని ప్రచారము చేసేవారి నోళ్ళు మూతపడ్డాయి.

కనుక పోరాట సందర్భంలో కొన్ని పొరపాట్లు జరిగినాయి అని నిర్దిష్టంగా పేర్కొనటము వేరు. అంతేగాని పోరాటము మొత్తం ఒంటెత్తు పోకడలో సాగిందనో, ప్రజల నుంచి వేరు పడిందనో చెప్పడమంటే చరిత్రను వక్రీకరించినట్లే. ఆ తరువాత ఆ ఎన్నికల్లో సాధించిన విజయాల్ని సుస్థిరం చేసుకొని విస్తరించామా అంటే అది వేరే సంగతి. ఒకప్పుడు 33 శాతం ఓట్లు సంపాదించుకొన్న మనం నేడు 3-5 శాతాముల మధ్య ఉంటున్నాము. ఈ పరిస్థితిని నిర్దుష్టంగా అంచనా వేసుకోవాలి. ఇప్పుడు నేను దాని జోలికి వెళ్ళటం లేదు. ఎందుకిలా ఉన్నాము? కారణాలేమిటి, బాధ్యులెవరు ఇవి ఇతరత్రా చర్చనీయాంశాలు.

ప్రత్యేకంగా తెలంగాణాకు ఒక కమిటీ ఉండాలన్న వాదన ఒకటి తయారయిందని చెప్పాను కదా. తమ్మారెడ్డి సత్యన్నారాయణ లాంటివాళ్ళు ఈ విధమయిన విచ్ఛిన్నకర వాదనను ముందుకు తీసుకుని వచ్చారు. కనుక పార్టీని ఐక్యపరచవలసిన అవసరం ఎంతగానో ఏర్పడింది. తెలంగాణా, ఆంధ్ర కలిపి ఒకే కమిటీ ఉండాలనీ అంతగా అయితే తెలంగాణాకు వేరే సబ్ కమిటీ ఏర్పాటు చేసుకోవచ్చని మా అభిప్రాయము. పోరాడుతున్న కామ్రేడ్స్ రహస్య జీవితం గడుపుతున్న వాళ్ళు మాతో ఏకీభవించారు. కానీ బహిరంగంగా పని చేస్తున్న వారు మాత్రం ఆంధ్ర నాయకత్వానికి తెలంగాణా పరిస్థితి అర్థంకాదని అందువల్లనే ఈ దుందుడుకు ఎత్తుగడలూ, ఇంత నష్టమూ జరిగిందనీ కనుక ప్రత్యక్షంగా కేంద్ర కమిటీ కింద తెలంగాణాకు వేరే కమిటీ కావాలనీ వాదించసాగారు.

పార్టీని ఐక్య పరచాలంటే వారు కోరినట్లే తెలంగాణాకు వేరే కమిటీ ఏర్పాటు చేస్తేనే మంచిదని కేంద్ర కమిటీ అభిప్రాయపడింది. మేము మాత్రం అందుకు అంగీకరించలేదు.

దాదాపు రెండు మూడేళ్ళుగా ఈ చర్చ సాగుతున్నది. ఎన్నికలయిపోయినవి. అప్పటికే రెండు కమిటీలు. ఒకటి రహస్యంగా, ఒకటి బహిరంగంగా పని చేస్తున్నాయి. తెలంగాణాకు ప్రత్యేక కమిటీ కావాలన్న వాదన వస్తున్నది. ఎన్నికలలోనూ, ఎన్నికలు అయిపోయిన వెంటనే మొత్తం దాదాపు 12 మందిని కాల్చేశారు. ఉదాహరణ ఇందుర్తి గ్రామంలో దళ సభ్యుణ్ణి ఒకడిని పోలీసులు పట్టుకు కాల్చేశారు. ఆ తర్వాత 1957లో ఆ గ్రామానికి నేను అమరవీరుల స్మారక సభకు కూడా వెళ్ళాను.



పార్టీని ఐక్యం చేయాల్సిన అవసరం ఎంతో వుంది. కనుక తెలంగాణాలోని రహస్యంగా వున్న వాళ్ళు, బహిరంగంగా వున్న వాళ్ళు అందర్నీ కలిపి ఒక మహాసభ ఏర్పాటు చేయాలనుకున్నాం. పూనాదగ్గర్లో ఏర్పాటు చేశాము. దానికి ఆంధ్ర కామ్రేడ్స్‌లో ముఖ్యులు, అజయ్‌ఘోష్ వంటి కేంద్ర నాయకులు కూడా రావాలి. ఆ మహాసభ కూడా జాగ్రత్తగా ఏర్పాటు చేయాలి. ఆ బాధ్యత మేమే తీసుకున్నాము. అంతకుముందే రహస్య కామ్రేడ్స్ అందర్నీ కలిపి ఒక సమావేశం వేద్దాం అనుకున్నాం. కానీ, రహస్య స్థావరాలు అన్ని విధ్వంసం అయినాయి. మన గోళ్ళ రాధాకృష్ణమూర్తి కూడా ఆ సందర్భంలో అరెస్టయ్యాడు. వాటన్నింటినీ కాకున్నా, కొన్నింటినైనా పునరుద్ధరించుకోవలసివచ్చింది. అందువల్ల ఆ సమావేశం జరగలేదు.

ఈ సమావేశంలో ప్రధాన అంశం పార్టీ ఐక్యతను కాపాడాల్సిన అవసరం. తెలంగాణాకు ప్రత్యేకంగా, ఆంధ్రకు ప్రత్యేకంగా కమిటీలు వేయాలని నిర్ణయమైంది. అయితే ఒక విషయం అంగీకరించారు. కమిటీలో వుండే వారి విషయంలో తెలంగాణాలో పుట్టిన వాళ్ళే ఆ కమిటీలో వుండాలని లేదు, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని కమిటీ ఏర్పాటు చేయాలి అని.

ఆ మహాసభలో తెలంగాణా కమిటీకి నేను కార్యదర్శిగా ఉండాలని నిర్ణయమైంది. రహస్యంగా వున్న కామ్రేడ్స్ యింకొకర్ని అంగీకరించేందుకు సిద్ధంగాలేరు. రాజేశ్వరరావును కార్యదర్శి చేయవచ్చుగాని కొన్ని వివరాలు, రహస్య స్థావరాలు, ముఖ్య కామ్రేడ్స్ వగైరా ఆయనకు లోతుగా తెలియవు. నేను ఆ బాధ్యత స్వీకరించేందుకు అంగీకరించాను. కనుక నేను, బసవపున్నయ్య తెలంగాణా కమిటీలో వుండాలనీ, రాజేశ్వరరావు, చంద్రం ఆంధ్ర కమిటీలో వుండాలని తీర్మానమైంది.

తెలంగాణా సెక్రటేరియట్‌లో మేము ఇరువురమూగాక అంటే నేను, ఎం.బి.గాక రావి నారాయణరెడ్డి, ఎల్లారెడ్డి, దేవులపల్లి బి.ఎన్, ముగ్గురం వున్నాము. అయితే దానికి వాళ్ళు అభ్యంతరపెట్టారు. మెజారిటీ ప్రకారం నిర్ణయం అంటే పి.ఎస్., ఎం.బి. దేవులపల్లి బి.ఎస్. ఈ నల్గురిదీ ఒకే అభిప్రాయం.కనుక మేము ముగ్గురం వుండీ ప్రయోజనం వుండదు అని. కనుక కనీసం అయిదుగురి ఆమోదం వుంటే తప్ప ఏ నిర్ణయమూ తీసుకోరాదని తీర్మానించాం. అంటే ఆ ముగ్గురిలో ఒకరైనా మాతో అంగీకరిస్తేనే నిర్ణయం అవుతుంది. కమ్యూనిస్టు పార్టీలో నిజానికి ఇది పద్ధతి కాదు. కానీ ఐక్యత కోసం ఈ కొత్త నిబంధన జేర్చాల్సి వచ్చింది.

రావి నారాయణరెడ్డి తనను రహస్యంగా వున్న కామ్రేడ్స్ హత్య చేసే యత్నంలో వున్నారనీ, అడవులలో కొందర్ని అలా వదిలించుకున్నారనీ మహాసభలో చెప్పాడు. అయితే దాన్ని కేంద్ర కమిటీ నమ్మలేదు. అదే నిజమైతే నిన్ను రహస్య స్థావరం నుండి రానిచ్చేవారు కాదు. ఆ తర్వాత బతకనిచ్చేవారు కాదు. ఇలాంటి కట్టుకథలను నమ్మి అనుమానంతో, సందేహాలతో సంచరించడం మంచిదికాదని నారాయణరెడ్డికి కేంద్ర కమిటీ స్పష్టం చేసింది.

అదే సమయంలో, రహస్య కామ్రేడ్స్ రావి నారాయణరెడ్డిని ద్రోహి అనీ, తాను పంచిన భూముల్ని తిరిగి లాక్కుంటున్నాడనీ ఆరోపించారు. ఆ రెండో అంశం పూర్తిగా నిజంకాదు. అసలు పంచడమే అంతా పంచివుండరు. అజయ్‌ఘోష్ అప్పుడు జోక్యం చేసుకుని "నెహ్రూకన్నా అత్యధిక ఓట్లతో రావి నారాయణరెడ్డిని కమ్యూనిస్టుగా ప్రజలు గెలిపిస్తే, ఆయనను ద్రోహి అని ముద్ర వేయడం సమంజసం కాదు" అని అన్నారు. ఆయన పార్లమెంటుకు, భువనగిరి అసెంబ్లీ స్థానానికి రెంటికీ ఎన్నికైనాడు. ఆ తర్వాత, రెండింటిలో సభ్యుడుగా వుండరాదు గనుక ఒకటి వొదులుకోవాలి. దేన్ని వదులుకోవాలంటే, పార్లమెంటు అంటే ఏడు శాసనసభ స్థానాలు. ఇంత పెద్ద ప్రాంతంలో నేను పని చెయ్యలేను కనుక, పార్లమెంటు వొదులుకొని, అసెంబ్లీలో వుంటాను అని వాదించాడు. చివరకు పొలిట్ బ్యూరోకు తన వాదన తీసుకువెళ్ళాడు. పి.బి. కూడా ఆయన వాదనతో అంగీకరించలేదు.

కొన్ని వాస్తవాలను మనమూ కాదనలేం. ఆయనకు ప్రజలలో పలుకుబడి బాగా వుంది. అందుకనే, తర్వాత రావి నారాయణరెడ్డి అత్యధికంగా ఓట్లు తెచ్చుకున్న భువనగిరి అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో మనం వైశంపయనుడు అనే కామ్రేడ్‌ను నిలబెట్టాం. ఆయన వోడిపోయాడు. కనుక, ఎవరైనా గెల్చే వాళ్ళు అని మాటవరసకు అన్నా, సంపూర్తిగా వాస్తవంగాదు. 1957లో సంజీవరెడ్డి ఒక మాట అన్నారు. "రావి నారాయణరెడ్డిని, నాగిరెడ్డిని వోడించాలని తీవ్రంగా కృషి చేశాం. కాని సాధ్యం కాలేదు" అని. వాళ్ళ బదులు ఎవర్నైనా పెట్టవచ్చు గదా అంటే, పెడితే వోడిపోయేవాళ్ళం. అలాగే గన్నవరంలో నేను నిలబడ్డాను కనుక గెల్చాము. మన మెజారిటీ కేవలం 800 ఓట్లు మాత్రమే. అయితే, ఈ వ్యక్తిగత అంశం నిర్ణయాత్మకమైనది కాదు అన్న విషయం కూడా గమనంలో వుంచుకోవాలి.

కమిటీలు ఏర్పడ్డాయి. అప్పటి నుండే "రహస్య జీవితం గడిపిన కామ్రేడ్స్‌కు తుపాకి పట్టడమేతప్ప ఏమీ తెలియదు – వాళ్ళు కమిటీల్లో దండగ" అనే వాదన వచ్చింది. ఎత్తుగడలు, ప్రజాసమస్యలు అన్నింటి విషయంలో జిల్లా స్థాయి నుండి జాతీయసమితి వరకూ విభేదాలు వుంటూనే వచ్చాయి.

తెలంగాణా పోరాటం ప్రజా సమస్యలు, రాజకీయ, నిర్మాణ అంశాలు అన్నింటినీ రంగం పైకి తీసుకువచ్చింది.

ఏమైనా ఆ సమావేశం చారిత్రాత్మకమైంది. ఏర్పాట్ల విషయాలు రహస్యంగా వున్న మా కమిటీ పూర్తి బాధ్యత తీసుకుంది. తెలంగాణా పోరాటాన్ని వ్యతిరేకించిన వారిని ఈ సాంకేతిక అంశాల్లో వేలు పెట్టనివ్వలేదు. సరే, పెరులేకర్, గోదావరి, తదితరుల సహకారం వుంది. ఆ సమావేశం ఏర్పాట్లలో కామ్రేడ్ లీల కూడా ముఖ్య బాధ్యత తీసుకుంది. మరాఠీ భాష రావడంవలన, తనకుగా కొన్ని వ్యక్తిగత సంబంధాలు కూడా వుండడంవలన మొత్తం ఈ సమావేశ, భోజన వసతి ఏర్పాట్లను ఆమె పర్యవేక్షించింది.



ఎవరెవరు, ఏయే మార్గాలలో రావాలి? ఏ రైలుకు ఎవరు రావాలి ఎవరు వార్ని స్టేషన్ నుండి ఎక్కడకు తీసుకు వెళ్ళాలి? యెవర్ని ప్రత్యేకించి కార్లలో, యే మార్గం గుండా చేర్చాలి? ఎవర్ని ఎక్కడ వుంచాలి? వీటన్నింటి బాధ్యత మా రహస్య కమిటీదే. ఆ నిర్ణయాలను మిగతావారు ఖచ్చితంగా ఆమోదించాలి. వారు అంగీకరించారు. లేకపోతే ఆ పరిస్థితిలో ఆ సమావేశమే జరిగేది కాదు.

ఈ ఏర్పాట్లన్నీ కూడా నెలా పది రోజుల్లో చేశాము. 1952 ఫిబ్రవరిలో ఎన్నికలు అయిపోయాయి. మార్చి చివర్లోనో, ఏప్రిల్ మొదట్లోనో ఈ మహాసభ నడిపాం. ఆ తర్వాత పది రోజుల్లో, నేను రహస్య జీవితం చాలించి, బహిరంగంగా వచ్చాను. సరాసరి మద్రాసు వెళ్ళాను. రాజ్యసభకు పోటీ చేస్తున్నాను కదా.

అప్పుడు అజయ్‌ఘోష్ ఒక ప్రతిపాదన పెట్టాడు. "సుందరయ్య రాజ్యసభలో వుంటాడు. కనుక ఆయన ఢిల్లీ కేంద్రంగా వుంచుకొని, అక్కడ పార్టీ కేంద్రాన్ని ఏర్పాటు చేసే బాధ్యత తీసుకోవాలి. ఆ ఆఫీసుకు అవసరమైన, ఆర్థిక తదితర అంశాలు చూసుకుని, దాన్ని నిర్వహిస్తూ పార్లమెంటరీ పనిని గైడ్ చెయ్యాలి" అని.

తెలంగాణా కామ్రేడ్స్ అందరికీ, పునరావాసం పూర్తయ్యేదాకా పూర్తిగా తెలంగాణాను వదిలి, కేంద్ర బాధ్యతలలో వుండడం సాధ్యం కాదని నేను చెప్పాను. అప్పుడు కామ్రేడ్ ఎం.బి. తెలంగాణా వ్యవహారాలు, దైనందినంగా సంబంధాలలో వుంటూ చూడాలనీ, నేను తెలంగాణా కమిటీకి కార్యదర్శిగానే కొనసాగుతూ, సహకారం యివ్వాలనీ – ఇలాంటి అవగాహనకొచ్చాము. ఈ అవగాహన కూడా తెలంగాణా కామ్రేడ్స్‌కు ఇష్టంలేదు. నేను లేకపోతే, కమిటీలో తరచుగా వచ్చే గొడవలనెలా పరిష్కరిస్తారు అని.

దానికితోడు ఆంధ్రకమిటీలో రాజేశ్వరావు, చండ్రం వున్నారు. 1953 కల్లా రాజేశ్వరరావు తన విధానాన్ని మార్చుకున్నాడు. ఇక్కడ మెజారిటీ నిర్ణయాలు తెలంగాణా కమిటీ నిర్ణయాలకు భిన్నంగా వుండేవి. సరే, అసలు ఆంధ్రకమిటీలో సక్రమ నిర్ణయాలు తీసుకొనేట్లు చేయకుండా, తెలంగాణా కమిటీని సక్రమంగా నడపడం సాధ్యంకాదని కామ్రేడ్ ఎం.బి., నేను భావించాము. కనుక తెలంగాణా కమిటీ నిర్వహణ బాధ్యత తెలంగాణా కామ్రేడ్స్‌కు వదిలేసి, మేమిద్దరం మళ్ళీ ఆంధ్రకమిటీలోకి వచ్చాం. ఇది 1955 ముందు జరిగింది.

ప్రత్యేకంగా తెలంగాణా కమిటీ దాదాపు 1957 ఆరంభందాకా సాగింది. 1956 నవంబరులో ఆంధ్రప్రదేశ్ అవతరించింది. ఆ తర్వాత కొద్ది నెలలకే రెండు కమిటీలు కలిపి ఆంధ్రప్రదేశ్ కమిటీగా ఏర్పడింది.

# ఎన్నికల తర్వాత

1955 ఆంధ్ర అసెంబ్లీ ఎన్నికలలో నన్ను అభ్యర్థిగా నిలబెట్టారు. రాజేశ్వరరావును కూడా నిలబెట్టారు. అసెంబ్లీలో మెజారిటీ వచ్చి, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి గనుక మన ముఖ్య నాయకత్వం అసెంబ్లీలో వుండితీరాలని ఆ పని చేశాము. అది వేరే విషయం. తర్వాత చెప్తాను.

ఏమైనా ఆంధ్రప్రదేశ్ కమిటీ ఏర్పడ్డ తర్వాత కూడా విభేదాలు కొనసాగుతూనే వున్నాయి. నేనూ, కామ్రేడ్ ఎం.బి. ఒకపక్క, రాజేశ్వరరావు, చంద్రం వేరొకపక్క ఇదే విభేదాలు నేషనల్ కౌన్సిల్లో కూడా కొనసాగేవి. 1953 నుండీ రాజేశ్వరరావు మాతో విభేదించాడు. తెలంగాణా పోరాటం విరమణ తర్వాత రాజేశ్వరావు, మా ఉద్దేశంలో సంస్కరణవాదాన్ని చేపట్టాడు. ఈ పోరాటం అంతా పనికిమాలినదనీ, తప్పుడు ఎత్తుగడలవల్ల చాలా మంది కామ్రేడ్స్‌ను కోల్పోయేందుకు మేము కారణమైనామనీ – ఈ రకంగా అది వరకే వాదిస్తున్న ముఠా మాదిరే వాదించసాగాడు. భౌతిక పరిస్థితిని అంచనా వేసి ఇదుగో యిక్కడ పోరబాటు జరిగింది. ఇక్కడ సక్రమంగా వుంది అని తేల్చి చెప్పడం వేరే విషయం.

1952 నుండి 54 చివరి వరకూ నేను తెలంగాణా కమిటీకి కార్యదర్శిగా వున్నాను. ఆ కమిటీ విశాలాంధ్ర కమిటీ కిందనే వుండేది. ఆ సందర్భంగానే నేను రాజ్యసభ సభ్యుణ్ణి కూడా. పార్లమెంటులోనూ, శాసనసభలోనూ నా పనిని గూర్చి విడివిడిగా చెప్పుకుందాము.

తెలంగాణా పోరాట విరమణ తర్వాత, ఎన్నికలయిన తర్వాత పార్టీ కమిటీలో తలెత్తిన ముఖ్యమైన విభేదాలలో ఒకటి, పోరాటసమయంలో పోలీసులకు లొంగిపోయిన ముఖ్యులను తిరిగి పార్టీ కమిటీల్లోకి తీసుకోవచ్చునా? అసలు పార్టీ సభ్యత్వం యివ్వవచ్చునా? అన్నది. మామూలు కార్యకర్తలకైతే పార్టీ సభ్యత్వం యిచ్చి పార్టీలోకి తీసుకోవచ్చు. కానీ నాయకులుగా ఉన్నవారిని పార్టీలో జేర్చుకోకూడదు అన్న వైఖరిని మేము తీసుకున్నాము. అయితే అవతలి గ్రూపువాళ్ళు మాత్రం, పార్టీ అనుసరించిన తప్పుడు ఎత్తుగడలవల్లనే ఈ పరిస్థితి ఏర్పడింది. వాళ్ళు లొంగిపోవలసి వచ్చింది కనుక వారిని తిరిగి పార్టీలోకి, కమిటీల్లోకి తీసుకోవాలని వాదించారు.



నాయకులు లొంగిపోయి రహస్యాలు చెప్పడమంటే పిరికితనం తప్ప రాజకీయ ఎత్తుగడలో లోపంవల్ల అలా చేశారనడం సరికాదు. పైగా తమంత తాముగా లొంగిపోవడం. కనుక ఎత్తుగడ తప్పు అన్న నెపంతో అలాంటి వారిని పార్టీలోకి తీసుకుని, పెద్దల్ని చేస్తే నష్టం కలుగుతుంది అన్నది మా వాదన. చివరికి ఎలాగో ఒక రాజీ కుదిరింది. తాము పొరపాటు చేశామని అలా లొంగిన వారు గుర్తించి క్షమాపణ చెబితే తీసుకోవచ్చునని. అలా చెప్పిన వారు ఒకరొకరుగా దరఖాస్తు పెడితే పరిశీలించి, సభ్యత్వం యివ్వవచ్చును. ఆ మేరకు కొందరిని పార్టీలోకి తీసుకున్నాం.

ఇందుకు ఒక ఉదాహరణగా కృష్ణాజిల్లాలో అప్పుడు ముఖ్యులలో ఒకడైన టి.కె. రామస్వామి విషయం చెప్పవచ్చు. పోరాట కాలంలో ఈయన పోలీసులకు లొంగిపోయి కొన్ని రహస్యాలు చెప్పాడు. ఆ మేరకు అప్పట్లోనే సమాచారం అందితే ఆయన్ని అప్పుడే పార్టీలోంచి తొలగించాము. ఘాటే నాయకత్వాన కంట్రోల్ కమిషన్ వుంది. దానికి ఈ రామస్వామి తన విషయం రాసుకున్నాడు. కంట్రోల్ కమిషన్ ఆయన్ని తిరిగి పార్టీలోకి తీసుకోమంది. ఆంధ్ర కమిటీ మెజారిటీగా అతణ్ణి తీసుకోకూడదని నిర్ణయించింది.

1953లో ఆంధ్ర ప్రాంతానికి ప్రత్యేకంగా తణుకులో పార్టీ నాల్గవ మహాసభ జరిగింది. ఈ రామస్వామిని మహాసభకు రానివ్వాలా? కూడదా? అన్న ప్రశ్న ఆరంభంలోనే ఎదురైంది. కంట్రోల్ కమీషన్ తిరిగి సభ్యత్వం యివ్వమంది కదా. అయినాసరే తీసుకోరాదని మహాసభ చాలా ఎక్కువ మెజారిటీతో తీర్మానించింది. ఒక ముఖ్య నాయకుడు యిలాంటి పని చేయడంపట్ల ప్రతినిధులు చాలా కోపంగా వున్నారు. కమీషన్ నిర్ణయాన్ని కేంద్ర కమిటీ పునఃపరిశీలించాలని తీర్మానించాము. ఆయనను గూర్చి మాకున్న సమాచారం మొత్తం కేంద్ర కమిటీకి నివేదించాము. సరే మా నిర్ణయానికి భిన్నంగా మాపై కమీషన్ నిర్ణయాన్ని రుద్దలేదనుకోండి. కంట్రోల్ కమీషన్ చేసిన నిర్ణయమే అంతిమంగా భావించేందుకు వీలులేదు. దాని సిఫార్సులను కేంద్ర కమిటీ పరిశీలించాలి. మొత్తం పార్టీ నిర్మాణంపై నిర్ణయాధికారం కేంద్ర కమిటీది కదా. కనుక యిలాంటి విషయాల్లోనూ తుది నిర్ణయం కేంద్ర కమిటీదే అని వాదించాము. మామూలుగా కంట్రోల్ కమీషన్ నిర్ణయాలను అమలు జరపాలి. కాని రాష్ట్ర కమిటీ ఆ నిర్ణయాలతో విభేదిస్తే మాత్రం కేంద్ర కమిటీదే అంతిమ నిర్ణయం కావాలి.

ఈ విషయమై ఈ మధ్యవరకు పెద్ద వివాదం చెలరేగుతూనే వున్నది. కంట్రోల్ కమీషన్ కూడా మహాసభ చేతనే ఎన్నుకోబడినప్పుడు దానికి ప్రత్యేక అధికారాలు లేవనడం ఎలా సబబు? అంటే రెండు సమానాంతరంగా పని చేసే సంస్థలు వుండడం అన్నమాట.

ఆ తర్వాత నిబంధనావళిలో కేంద్ర కమిటీ కంట్రోల్ కమీషన్‌ను నియమిస్తుంది అని జేర్చాము. కంట్రోల్ కమీషన్ కేంద్రకమిటీ సభ్యుల గూర్చి కూడా విచారిస్తుంది. అందువలన దాని సిఫార్సులను పరిశీలించి తుదినిర్ణయం కేంద్ర కమిటీయే యివ్వాలి.

నాయకత్వ స్థానంలో వున్న కామ్రేడ్స్ పోరాట సందర్భంగా ఊగిసలాట, పిరికితనం వంటి బలహీనతలు ప్రదర్శిస్తే వాళ్ళను సాధారణ సభ్యులుగా కొనసాగనివ్వాలా వద్దా అన్న

ప్రశ్న అటుంచినా నాయకత్వ స్థానాల్లో మాత్రం పునఃప్రతిష్ఠించలేము. ఏమైనా అది నా ఖచ్చితమైన అభిప్రాయం. చాలా అరుదుగా తప్ప అలా పునఃప్రతిష్ఠించిన సందర్భాలలో మనం లాభంకన్నా నష్టమే ఎక్కువ పొందాము.

1962లో పార్టీ నేషనల్ కౌన్సిల్ సమావేశం నుండి బయటకు వచ్చాము. దాదాపు అప్పటిదాకా పై సమస్య యేదో రూపంలో పార్టీలో కొనసాగుతూనే వచ్చింది. 1962-63 పార్టీ సభ్యులను కలుసుకోవడం చేర్చుకోవడం మన విధానాన్ని ప్రచారంలో పెట్టడం యిదంతా సాగింది. మధ్యలో కొన్నాళ్ళు జైలు కూడా. 1964లో ఇక బహిరంగ చీలికే పార్టీలో వచ్చింది. అంతవరకూ ఒకే పార్టీలో వుంటూ వచ్చాము. సిపిఐ వారి ఆరోపణ కూడా "పార్టీలో వుంటూ మీరిలా వేరే ప్రచారం చేసుకుంటూ ముఠాగా వ్యవహరిస్తున్నారు" అనే. 'నిజమే' అని సమాధానం చెప్పాను. "పార్టీ మహాసభ నిర్ణయాలను ప్రక్కనబెట్టి పార్టీని మీ జేబు సంస్థగా చేసుకోవాలని మీరు యత్నిస్తున్నప్పుడు మేమలాచేయక తప్పలేదు. చేసింది వాస్తవం. అంతేకాదు సరైంది కూడా" అని స్పష్టంగా చెప్పాను. 1964 జులైలో తెనాలిలో సదస్సు జరిపాము. పార్టీ మహాసభను జరపాలనుకున్నాం. అప్పటికున్నది లూజ్ సభ్యత్వమే. అయినా పార్టీ మహాసభ పిలవక తప్పలేదు. ఆ విషయం మళ్ళీ తర్వాత చెప్పుకుందాం.

1954 నుండి వివిధ రాష్ట్రాలలో రాజకీయ, సైద్ధాంతిక, నిర్మాణ పోరాటం సాగుతూనే వున్నది. అదే సమయంలో ప్రజా ఉద్యమాలు, ఎన్నికలు, ఎత్తుగడలు యివన్నీ మామూలుగా సాగుతూనే వున్నాయి. 1952 నుండి ప్రతి పార్టీ మహాసభలోనూ, ప్రతి కేంద్ర కమిటీలోనూ రెండు ప్రత్యామ్నాయ డాక్యుమెంట్లు వుండేవి. 1958 వరకు కేంద్ర కమిటీ వుండేది. ప్రతి సందర్భంలో ఒకే అభిప్రాయం వెలిబుచ్చిన కామ్రేడ్స్ నూటికి నూరుపాళ్ళూ సరిగానే చెప్పారని కాదు, కానీ స్థూలంగా సరైన దృక్పథంలో వున్నారని చెప్పవచ్చు. పార్టీ చరిత్ర, విభేదాలు వీటిని గూర్చి అర్థం చేసుకోవాలంటే ఈ అంశం అధ్యయనం అవసరం.

ఈ విషయంలో ఆంధ్రకు సంబంధించి నేనూ, బసవపున్నయ్య, హనుమంతరావు, నండూరి ప్రసాదరావు, దేవులపల్లి ఒకటిగా వుండేవాళ్ళం. దేవులపల్లి వెంకటేశ్వరరావుకు సైద్ధాంతికంగా పెద్ద తెలిసినవాడనే అభిప్రాయం మొదటి నుండీ నాకు లేదు. మొదట్లో రాజేశ్వరరావుతో దేవులపల్లి వుండేవాడు. తెలంగాణా పోరాటం తర్వాత మావైపు వుండసాగాడు. నక్సలైట్లతో వెళ్ళే వరకూ మాతోనే వుండేవాడు. నేను చెప్పినది మన రాష్ట్రంలో స్థితిని గూర్చి. పార్టీ మహాసభలో మనం ప్రవేశపెట్టిన డాక్యుమెంట్లపై సంతకం పెట్టిన వారిలో వీళ్ళు వున్నారన్న మాట. కేంద్ర కమిటీలో నేనూ, ఎం.బి, రాజేశ్వరరావు, చంద్రం వున్నాము. రావి నారాయణరెడ్డి కూడా వున్నాడనుకుంటాను.

తెలంగాణా పోరాటంలో పాల్గొన్న కామ్రేడ్స్‌కు ఆ తర్వాత పునరావాసం కల్పించడం నా ప్రత్యేక బాధ్యత. రావి నారాయణరెడ్డి, యితర తెలంగాణా కామ్రేడ్స్ కూడా బాగా కృషి చేశారు. ఈ కేసులు, అవీ నడిపేందుకు ధనరూపంగా వారు చేయగలిగింది చాలా తక్కువే అయినా, యితర విధాల తోడ్పడ్డారు. ఉదాహరణకు, రాష్ట్ర ప్రభుత్వంతో, అప్పుడు శ్రీ బూర్గుల



రామకృష్ణారావు ముఖ్య మంత్రి. ఆయన వద్దకు వెళ్ళడం, తమ పలుకుబడిని వినియోగించి కొందరు కామ్రేడ్స్‌నైనా విడిపించడం వంటివి. ఒకోసారి ఆయన, దేశానికి సంబంధించిన వ్యవహారమిది, కేంద్రమే చెయ్యాలనే వాడు. రాజ్యసభలో నేనున్నాను. నెహ్రూగారిని కలిసే వాళ్ళం. 'మాకేం సంబంధం, ఇది రాష్ట్రం చూసుకోవలసింది' అని ఆయన అనేవాడు. నేనూ, రావి నారాయణరెడ్డి అప్పుడాయన పార్లమెంటు సభ్యుడు బద్దం ఎల్లారెడ్డి ప్రతినిధి వర్గంగా వెళ్ళి నెహ్రూను కలిశాం. నెహ్రూపై సమాధానం చెబితే, 'మీరు విడుదల చేయమని ఆదేశిస్తే రాష్ట్ర ప్రభుత్వం నిరాకరిస్తుందా" అని అడిగేవాళ్ళం అయినా మాకొకటి అర్థమయింది. ఈ కామ్రేడ్స్‌ను విడుదల చేయాలని వాళ్ళకు లేదు. రాధాకృష్ణన్ దగ్గరకు వెళ్ళాం. ఆయన ఈ విషయంలో ఉత్సుకత చూపించారు. కానీ, అవసరం వస్తే ఒక మాట వేయగలడుగానీ, ఆయన మాత్రం అంతకన్నా ఏమి చేయగలరు? అప్పుడు గోపాలస్వామి అయ్యంగారు రక్షణ శాఖ మంత్రి. ఆయన సౌమ్యుడు, ఉదారవాది. "ఇన్నాళ్ళు అడవుల్లో వున్న మీ వాళ్ళకు యిప్పుడు జైల్లో వుండటం కష్టంగా వుందా" అని నవ్వుతూ అన్నాడు. నాకు కోపం వచ్చింది. "ఆ మాటకొస్తే వాళ్ళలా జైళ్ళలో వుండాల్సివస్తే, నాకూ యిక్కడ రాజ్యసభలో వుండడం కన్నా, ఆ అడవిలో వుండటమే మంచిదనిపిస్తున్నది" అని అన్నాను. ఆ మరునాడు నేనాయనను కలిసేందుకు వెళ్ళగానే "గుడ్‌మార్నింగ్ జంగిల్‌మన్" అన్నాడాయన. నేను 'జీ జంటిల్‌మన్ లా చేత గాకుండా కూర్చునే బదులు జంగిల్‌మన్‌లా వుండటమే నాకుయిష్టం" అన్నాను. ఆయన నవ్వారు. "తెలంగాణా పోరాటం అన్నా, దాన్ని నడిపిన వారన్నా నాకు చాలా గౌరవం" అని ఆయన అన్నారు. "అదిసరే, యింతకీ వాళ్ళ విడుదల విషయం ఏమిటి?" అని అడిగాను. "నేనూ వాళ్ళను విడుదల చేయాలనే గట్టిగా అభిప్రాయపడుతున్నాను.కానీ నా వొక్కడి చేతిలో లేదుకదా. ఇంకా కట్జూ, తదితరులు కొందరు అలా విడుదల చేసేందుకు సిద్ధంగా లేరు. అయినా నా శాయశక్తులా కృషి చేస్తాను" అని అన్నారు.

1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత నేను సంజీవరెడ్డిని కలుసుకున్నాను. "తెలంగాణా పోరాటం నడపడంనేరమే అయితే, దాన్ని నడిపిన నాయకులం మమ్మల్ని వదిలేసి మామూలుగా తిరగనిస్తూ, మమ్మల్ని అనుసరించిన వాళ్ళను జైళ్ళల్లో వుంచడం ఏమిటి? అలా అయితే మమ్మల్నీ జైళ్ళల్లో నిర్బంధించాలి" అంటూ వాదించాను. ఆ రోజులు వేరు. ఆయన తనకు తగిన హుందాతనంతోనే విన్నాడు. "అదీగాక, మేము సాయుధ పోరాట విరమణ చేశాము కదా, ఎన్నికలో పాల్గొంటున్నాము. ఈ రకమైన బాధ్యత ఇంకా సవ్యంగా నిర్వహించడం, మా వాళ్ళు ఇంకా జైళ్ళల్లో వుండడంవల్ల మెరగవుతుందా? అయినా ఆ పోరాటానికి నాయకత్వం వహించడమే దోషమైతే మేము నాయకులం, బాధ్యులం మమల్ని జైళ్ళల్లో వుంచాలి. ఇప్పుడే జైలుకు వెళతాం. నన్ను జైల్లో పెట్టండి" అన్నాను.

"అదెట్లా. మిమ్మల్ని జైల్లో ఎలా పెట్టగలం?" అన్నారాయన.

"నిజమే కుదరదు. నేను బహిరంగంగా వచ్చేశాను. ఏ కారణం చూపించి నన్ను నిర్బంధించగలరు పోనీ, వాళ్ళను విడిచిపెట్టండి" అన్నాను.

"సరే, విడిచి పెడతాను. అయితే, అందర్నీ ఒక్కసారి కాదు. కేంద్ర నాయకత్వాన్ని కూడా వొప్పించుకోవాలి కదా. బ్యాచీలు బ్యాచీలగా విడిచి పెడతాను" అని వాగ్దానం చేశాడాయన. ఎక్కువ కాలంగా జైల్లో ఉన్నవారిని ముందు బ్యాచీలలో విడుదల చేయాలి. ఈ కాలనిర్ణయం కూడా అరెస్టయిన నాటి నుండి లెక్క వెయ్యాలి. కోర్టు ఎదుట హాజరు పరచిన నాటి నుండి కాదు. అలాగే అయిదు సంవత్సరాలకు పైగా జైల్లో ఉన్నవారిని వెంటనే విడుదల చేయాలి. ఈ రకంగా ఆయనతో ఒప్పందం కుదుర్చుకున్నాను.

తెలంగాణా పోరాటానికి సంబంధించిన వారిని తదనుగుణంగా 1958 నుండి విడుదల చేయడం ఆరంభమయింది. 1960 ఆగస్టు 15న చాలా మంది విడుదలయ్యారు. అప్పట్లో నేను 'కడుపులో పుండు' వలన నెత్తురు కక్కుకొని మద్రాసు ఆస్పత్రిలో వున్నాను. సంజీవరెడ్డి కూడా ఏదో వంట్లో బాగుండక మద్రాసు వచ్చాడు. ఆస్పత్రిలో నన్ను చూసేందుకు వచ్చారు. మామూలు పలకరింపులు అయిన తర్వాత "ఇంకా విడుదల కావలసిన వారున్నారు. వారినెప్పుడు విడుదల చేస్తారని" అడిగాను. "వచ్చే జనవరి 26కు గానీ, వారు జైలు జీవితం అయిదు సంవత్సరాలు పూర్తి చెయ్యరు" అందుకని అప్పుడు వదిలేస్తానన్నారు రహస్య జీవితం గడుపుతూ వాళ్ళు చాలా ఆలస్యంగా అరెస్టయ్యారు.

"ఆ జనవరి 26 నాటికే యింకా ముగ్గురు జైల్లోనే వుంటారు. వాళ్ళ సంగతేమి"టన్నాను.

"అయిదేళ్ళు పూర్తయిన వాళ్ళను విడుదల చేయాలని కదా మన వొప్పందం. వాళ్ళింకా అయిదేళ్ళు పూర్తి చేయలేదుగదా" అన్నాడాయన.

"అయినా, అందర్నీ వదిలిన తర్వాత ఆ ముగ్గురిని కూడా వదిలితే ఏమవుతుంది? ఆ ముగ్గురేమీ తమంతతాముగా కొత్తగా విప్లవం తెచ్చేదిలేదుకదా. వాళ్ళను వదిలినంత మాత్రాన పరిస్థితి ఏం కొత్తగా తీవ్రమవుతుంది? కనుక ఆ ముగ్గుర్ని ఇంకా జైల్లో వుంచుకోవడంలో అర్థం ఏమిటి?" అని నేను అడిగాను.

"నిజమే, విడుదల చేస్తాను. అయితే తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి అక్కడ అయిదు సంవత్సరాలు పూర్తి చేయని వాళ్ళు యింకా కొందరు జైల్లో వున్నారు. వీళ్ళని విడుదల చేయగానే మళ్ళీ వాళ్ళను కూడా విడుదల చేయమని ఒత్తిడి తెస్తారు కదా" అన్నాడాయన నవ్వుతూ.

"అది వేరే విషయం. తెలంగాణా తెలంగాణాయే, తూర్పుగోదావరి తూర్పు గోదావరే. ఈ రెంటినీ కలగాపులగం చేసే ప్రశ్నలేదు. అయినా ముగ్గుర్ని విడుదల చేయడానికి సిద్ధపడిన తర్వాత తూర్పుగోదారితో లంకెపెట్టడం సరికాదు" అన్నాను.

"సరే. అలాగే ఆ ముగ్గుర్ని కూడా విడుదల చేస్తాను. నీవేం దిగులుపడవద్దు. నిశ్చింతగా



వుండు. సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని కోరుకుంటున్నాను. ఇంకో ముప్పై సంవత్సరాలన్నా నీవు బతకాలి" అన్నాడాయన.

ఆ తర్వాత వారిని విడుదల చేశారు. ఆ విషయం కళావెంకట్రావు నాకు తెలియజేశారు. కొంత సంతృప్తి అనిపించింది. అయితే ఈ క్రమంలో అంతా నేనే చేశానని కాదు. ఇంకానాయకులు ఎల్లారెడ్డి వంటి వారు కూడా తమ తమ పలుకుబడిని వినియోగించారు. కోర్టులలో కేసులు నడుస్తున్న సందర్భంలో వివిధ పరిచయాలను వాడి, జడ్జీలకు చెప్పించేందుకు కూడా ప్రయత్నించారు. ఏమాటకామాటే చెప్పాలి. జడ్జీలు కూడా మొత్తం పోరాటం యెడల ఉదార దృక్పథంతో వ్యవహరించారు. నాటి జడ్జీలు తర్వాత ఎక్కడెక్కడ, ఏమేం చేస్తున్నారో ఈ వివరాలు నావద్దలేవు. కానీ వారికి కృతజ్ఞతలు చెప్పాలి. అయినా కొందరికి శిక్షలుపడ్డాయి. కారణం చట్టం, దానికితోడు బలమైన సాక్ష్యాలుండడం అంతేగానీ, ఏ జడ్జీని తప్పుపట్టలేను. అదీ తెలంగాణా పోరాటానికి సంబంధించింది.

# పార్టీ కేంద్రం, పార్లమెంటరీ రంగం

**ఆ** తర్వాత ప్రధానంగా చెప్పుకోవలసింది ఢిల్లీలో పార్టీ కేంద్రాన్ని గూర్చి. నేను రాజ్యసభకు ఎన్నికైనాను. పార్టీ తరపున పార్లమెంటరీ పార్టీ నాయకుడుగా ఎవరుండాలి అన్న ప్రశ్న వచ్చింది. బెంగాలీ కామ్రేడ్స్ హిరెన్ ముఖర్జీ కేరళ వాళ్ళు గోపాలన్ వుండాలన్నారు. కేంద్ర కమిటీ మాత్రం సుందరయ్య వుండాలని నిర్ణయించింది. 17 మంది ఆంధ్ర కామ్రేడ్స్ పార్లమెంటులో వున్నారన్నది కూడా ఒక అంశం దృష్టిలో వుండి వుండవచ్చు. రాజ్యసభలో నాయకుడుగా వుంటూ మొత్తం పార్లమెంటరీ పార్టీకి నాయకులుగా వ్యవహరించాలి. గోపాలన్ లోక్‌సభలో పార్టీ నాయకులు, హిరెన్ ముఖర్జీ వుపనాయకుడు. రాజ్యసభలో భూపేష్ గుప్తా ఉపనాయకుడు –ఇలా నిర్ణయం జరిగింది.

గోపాలన్‌కు నేనన్నా, ఆంధ్ర కామ్రేడ్స్ అన్నా ఎంతో గౌరవం వుండేది. ఆయనపట్ల మాకూ అంతే. నిజానికి గోపాలన్‌లో వున్న ఒక గొప్ప గుణమేమంటే ఎక్కడ ప్రజానీకం యిబ్బందులు వున్నా, అణిచివేతకు గురవుతున్నా అక్కడకు వెళ్ళి వాలేవాడు. ప్రత్యక్షంగా ప్రజలతో వుండేవాడు ఆ విధంగా పోరాట విరమణ తర్వాత కూడా, తెలంగాణాలో కామ్రేడ్స్‌పై నిర్బంధం, వారు రహస్య జీవితాలు గడపడం జరుగుతూ వచ్చింది. గోపాలన్ ఆ సందర్భంగా ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలలో పర్యటించాడు. ప్రభుత్వాన్ని, పోలీసుల్ని దుయ్యబట్టేవాడు. దానివల్ల ప్రజలలో ఎంతో ఉత్సాహం కలిగేది. ఆయనంటే అందుకని ఒక ప్రత్యేకమైన అభిమానం వుండేది. ఆంధ్ర, తెలంగాణాలోనే కాదు తమిళనాడు, దక్షిణ భారతదేశంలో మన కామ్రేడ్స్ అందరూ కూడా గోపాలన్‌ను అలా గౌరవించేవారు. అందుకే, రైతాంగం నడుపుతున్న పోరాట ప్రాంతాలన్నింటికీ ప్రత్యక్షంగా వెళ్ళగలిగిన గోపాలన్‌లాంటి కిసాన్ నాయకుడు యింకా మన పార్టీకి లభ్యంకాలేదు.

నన్ను పార్టీ తరపున పార్లమెంటులో నాయకుణ్ణి చేశారనిగానీ, తనను రెండో స్థానంలో వుంచారనిగాని, తన ప్రాధాన్యత తగ్గిందనిగాని, ఏనాడు ఆయన అసంతృప్తి చెందలేదు. పైగా లోక్‌సభ చర్చలన్నింటి సందర్భాల్లో నా వద్దకు వచ్చి, చర్చించి నిర్ణయాలు గైకొని వెళ్ళేవాడు.



ఆ విధంగా మంచి పరస్పర సహకార సంబంధాలు మా మధ్య వుండేవి. గోపాలన్ ప్రజల మనిషి ఇ.ఎం.ఎస్.కు గోపాలన్ కన్నా రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక విషయాలపై ఎక్కువ పట్టువుండేది. కానీ గోపాలన్ పార్టీ విధానాన్ని తన వాక్ నైపుణ్యంతో చాలా సులభగ్రాహ్యంగా వివరించగలిగేవాడు. ఆనందన్ నంబియార్ పార్లమెంటులో నిప్పులు కురిపించేవాడు. ఆ సందర్భాలలో కొన్ని చిక్కులు కూడా వచ్చేవి. నేను జోక్యం చేసుకొని సర్దవలసి వచ్చేది. గోపాలన్ మామూలు పర్యవేక్షణ అదీ చూసేవాడు. ఆ పార్లమెంటరీ పార్టీ వ్యవహారాల నిర్వహణలో దాదాపు భేదాభిప్రాయాలంటూ మా మధ్య వుండేవి కావు.

అప్పుడు పార్టీ కార్యదర్శి అజయ్‌ఘోష్, పార్టీ కేంద్రం కలకత్తాలో వుండేది. అక్కడ కొన్ని పార్టీ అంతర్గత గొడవలు వచ్చాయి. తర్వాత తాత్కాలికంగా బొంబాయికి మార్చారు. బొంబాయిలో పార్టీ పరిస్థితి అంతంత మాత్రంగా వుంది. ఢిల్లీలో మన వుద్యమం లేనేలేదు. పార్లమెంటు అక్కడుండటం తప్ప. అందుకని మద్రాసులో పార్టీ కేంద్రం పెట్టాలని నిశ్చయించారు. ఢిల్లీలో పార్టీ కేంద్రాన్ని ఏర్పాటు చేసే బాధ్యత నా కప్పగించారు. అందుకు అవసరమైన సిబ్బంది అదీ ప్రధానంగా కేరళ, తమిళనాడుల నుండి తెచ్చుకున్నాం. ఆంధ్ర నుండి పెద్దగా టైపిస్టులను తదితరులను అందించలేకపోయాం.

ఢిల్లీలో పార్లమెంటు నాయకుణ్ణి గనుక అక్కడ పార్లమెంటరీ కార్యాలయానికి ఏర్పాట్లు బాధ్యత నా మీద వుంచారు. తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పంజాబ్‌ల నుండి ఆఫీసు నిర్వహణకు అవసరమైన సిబ్బందిని, ఆర్థిక వ్యవహారాలు చూసేందుకు, చర్చల్లో పార్లమెంటు సభ్యులను గైడ్ చేసేందుకు అవసరమైన సమాచార సేకరణ చేయగలవారినీ, టైపిస్టులు వగైరాలను ఏర్పాటు చేసుకున్నాం. నేను 4 విండ్సర్ ప్లేస్‌లో వుండేవాణ్ణి. మన పార్లమెంటు సభ్యులందరకూ ఆ దగ్గర్లోనే నివాసాలు వచ్చేట్లు చూశాం. ఇది మాకు ఎంతగానో వుపకరించింది. తరచుగా కలిసి చర్చించుకునేందుకు అవకాశం వుండేది. నెం.2 విండ్సర్ ప్లేస్ మనం బలపరిచిన ఒక హరిజన ఎం.పి. పేరుమీద వుండేది. కర్ణాటక కాంగ్రెస్ నాయకుడు మత్తయ్య అని వుండేవాడు. ఆయన బీహార్ కాంగ్రెస్ ఎం.పి.లను తీసుకొచ్చి అక్కడ వుంచాలని అల్లరిచేశాడు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌ను కలిసి నేను పరిస్థితి వివరించాను. ఆయన, కట్టు ఏదో విందుకెడుతూ అక్కడకు వచ్చి పరిస్థితి చూచారు. స్వయంగా ఆయన రావడం పెద్దవార్త. ఆయన దాన్ని తర్వాత గోపాలన్ పేరుమీద మనకే యిచ్చారు. ఆ తర్వాత అశోకా రోడ్డులోకి మారాము. ఈ మత్తయ్య నెహ్రూని కలిసి ఈ మార్పు చేయించాడు. నెహ్రూ కూడా ఆ కాంగ్రెస్ వాళ్ళ ఒత్తిడికి సరేనన్నారు. ఈ విషయాన్ని మత్తయ్య తాను ప్రచురించిన డైరీలో కూడా రాసుకున్నాడు.

అప్పుడింకా నిక్కర్లే ధరించేవాడినా అన్నది సరిగా గుర్తులేదు. కాకపోతే అప్పుడప్పుడే పైజామాల్లోకి మారివుంటాను. సామాన్యంగా పార్లమెంటుకు నడిచి వెళ్ళేవాణ్ణి, దగ్గరేకదా. ఎక్కడకన్నా సైకిలు మీద కూడా వెళ్ళేవాణ్ణి. బహుశా సైకిలు మీద వెళ్ళినపుడు ఏ పాత్రికేయుడో చూసివుండి వుంటాడు అదొక పెద్ద మంచి లక్షణంగా అనవసర ఆర్భాటం చేశాడు. ఆఫీసు కోసం ఒక జీప్‌ను కూడా కొన్నాము. ఢిల్లీలో అప్పుడప్పుడు నేను జీప్‌లో కూడా తిరిగేవాణ్ణి.

ఇంతకీ చెప్పొచ్చేదేమంటే, ఈ పార్లమెంటు ఆఫీసును ఏర్పాటు చేయడం నేను చేసిన ముఖ్యమైన పనుల్లో ఒకటి. అక్కడ వున్న కామ్రేడ్స్ కష్టసుఖాలు చూడడం, క్రమశిక్షణ నిలపడం, ఈ పార్లమెంటు సభ్యులు తమ నియోజకవర్గాల్లో చేయాల్సిన పనిని, ఇక్కడ పార్లమెంటులో నిర్వహించవలసిన కర్తవ్యాన్ని సరిగా సమన్వయ పరచడం సంతృప్తికరంగానే చేశాను.

ఇంకా కొన్ని పనులు కూడా చేయాల్సి వచ్చేది. పార్టీని ఐక్యపరచడం వానిలో ఒకటి. పంజాబ్‌లో ఆ పని చేసేందుకు వెళ్ళి వచ్చేవాడిని. అలాగే అప్పటికీ ఇంకా రహస్య జీవితం గడుపుతున్న కామ్రేడ్స్ ఉన్నారు. వారిలో కామ్రేడ్ జయపాల్‌సింగ్ లాంటి వాళ్ళు వున్నారు. వారి అవసరాలు చూడాలి. అంతేకాదు. ఢిల్లీలో ఉన్నాను గనుక, వివిధ అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీలతో సంబంధాలు, వాళ్ళ రాయబార కార్యాలయాలకు వెళ్ళి రావడం - ఇలా ఉండేది. పార్టీ కేంద్రం మద్రాసులో, అక్కడి నుండి పార్టీ పత్రిక వెలువడేది. ప్రజా సంఘాల అఖిలభారత కార్యాలయం ఉండేది. వాటిపనిపై పర్యవేక్షణ, పార్టీ విధాన నిర్ణయం, పార్టీ రాజకీయ కేంద్రంగా మద్రాసు ఆఫీసు వుండేది. కొన్ని నెలలు గడిచిన తర్వాత నేనే పట్టుబట్టాను. ఇక్కడ ఢిల్లీలో పార్లమెంటు సమావేశాలలో వివిధ సమస్యలు వచ్చేవి. ఎంత అప్రమత్తతగా వున్నా, తరచుగా మాలో మేము చర్చించుకుంటున్నా, అప్పటికప్పుడు కొన్ని నిర్ణయాలు తీసుకోవలసి వచ్చినప్పుడు కొంత యిబ్బంది పడేవాళ్ళము. అదీగాక, పార్టీ కేంద్రాన్నుండిగాక యిలా అంతర్జాతీయ సంబంధాలు నిర్వహించడమూ సమంజసం కాదు. పైగా భారతదేశానికి, పాలనా కేంద్రం ఢిల్లీ, అక్కడ లేకుండా మద్రాసులో ఉండడం సరైనదికాదని, పార్టీ కేంద్రాన్ని ఢిల్లీకి మార్చాలని నేను ప్రతిపాదన పెట్టాను.

మళ్ళీ పార్టీ ఆఫీసు దాని నిర్వహణ అన్న సమస్య మొదటే వుంది కదా అన్న ప్రశ్న వచ్చింది. మొదలవ్వనివ్వండి. అవసరమైతే ఇల్లు అద్దెకు తీసుకుందాం. బెంగాల్, కేరళ, తమిళనాడు, పంజాబ్ యిలా వీలైన చోట్ల నుండి తగిన సిబ్బందిని రప్పించుకుందాం అన్నాను. ఆంధ్రలో ఆనాడు బెంగాల్, కేరళలకు తీసిపోని ఉద్యమం ఉన్నమాట నిజమే. కానీ, ఇంగ్లీషు వచ్చినవాళ్ళు, టైపిస్టులు యిలాంటి కేడర్ చాలా తక్కువగా వుండేది. తక్కువగా వున్నారు గనుక ఆంధ్రలోనే సరిపోయేవారు. ఈ రోజు నల్గొండ, వరంగల్ నుండి కేడర్‌ను రాష్ట్ర కేంద్రానికి తెప్పించవచ్చుగదా అంటే, ఆఫీసు పనికి ఉపయోగపడేవారు వుండొద్దూ. అందుకనే ఆంధ్ర నుండి కేంద్ర ఆఫీసు నిర్వహణ కేడర్ దొరికే వారు కాదు.

పార్లమెంటు చర్చలలో శక్తివంతంగా పాల్గొనాలంటే చాలా విషయ పరిజ్ఞానం కావాలి. సహజంగా, చాలా వివరంగా అధ్యయనం చేయడం, వివిధ అంశాలపై ఆథారిటీ అనుకున్న సమాచారం సేకరించడం నా అలవాటు. ఆ అలవాటు నాకెంతో వుపయోగపడింది. పైగా పార్టీలో కొందరు వివిధ అంశాలపై ప్రత్యేకంగా అధ్యయనం చేయగల కామ్రేడ్స్‌ను కూడా రప్పించుకునేవాళ్ళం. దానికితోడు ప్రభుత్వంలో కార్యదర్శులుగా, సహాయ కార్యదర్శులుగా వున్న ఉద్యోగస్తులు కొందరు-పార్టీ అభిమానులు కూడా - అప్పుడప్పుడు సహకరించేవారు.



మొత్తం మీద అక్కడ పార్టీ పార్లమెంటరీ కార్యాలయాల ఏర్పాటులో నా పాత్ర ప్రధానంగా వున్నది. అప్పుడప్పుడు కామ్రేడ్స్ అంటుండేవారు. సుందరయ్య వుండగా ఆఫీసు క్రమ శిక్షణతో, రెగ్యులర్‌గా నడిచేదని. నిజమే ఇంకో విషయం కూడా వుంది. అప్పటికింకా పార్టీలో, ఇంతగా పార్లమెంటరీ అవలక్షణాలు చోటు చేసుకోలేదు. అందువల్ల నా పని సులభమైంది.

అప్పట్లో పార్టీ ఆఫీసు అద్దె రెండు వేల రూపాయలు. ఇప్పుడది ఇరవై వేలు మించి వుంది. అయితే అగ్రిమెంటు రాసుకోవడంలో లోపంవలన ఆ ఇంటి యజమాని దాన్ని ఖాళీ చేయమని వత్తిడి తెచ్చాడు. కొంత కాలవ్యవధి అడిగాము. ఈ లోపల కేంద్ర కమిటీ అనుమతితో నేనొకపని చేశాను. పాత ఢిల్లీ - కొత్త ఢిల్లీ మధ్య మైదానం ఎదురుగా తుర్కమన్‌గేట్ ప్రాంతంలో ఒక పెద్దమనిషికి స్థలం వుంది. ఆ స్థలంలో ఆయన మాకు బిల్డింగ్ కట్టివ్వాలి. అందులో భూమిలోపల పత్రికా ప్రచురణ - కింది అంతస్తులో ఆఫీసులు, రెండు, మూడు అంతస్థులలో నివాసం వుండేందుకు ఇందుకుగాను ఆయనకు 50 వేలు ముందుగా మేముయివ్వాలి. అయితే ఆ తర్వాత పార్టీలో చీలిక వచ్చింది. ఆ కారణంగా ఆ మొత్తం పథకం పోయింది.

అసఫ్ ఆలీ రోడ్డులో పార్టీ కార్యాలయం వుండగా, భారత చైనా సరిహద్దు వివాదం జరిగింది. పార్టీ కార్యాలయంపై, కొందరు జాతీయదురహంకారులు దాడి చేయనున్నట్లు ముందుగా తెలిసింది. ఆఫీసు రక్షణకు అవసరమైతే, కొట్లాటకు సిద్ధపడిన కొందరు వాలంటీర్లను అక్కడపెట్టాము. ముఖ్యనాయకులను, వివిధ ప్రాంతాలకు తరలించాము. అనుకున్నట్లే వారు దాడిచేశారు. కొందరికి దెబ్బలు తగిలాయి. ఆ తగిలిన వారిలో ఎం.ఆర్. వెంకట్రామన్ కూడా వున్నాడు. పెద్ద దొమ్మీ జరక్కముందే పోలీసులు వచ్చారు గనుక అంతటితో ముగిసింది. వాళ్ళు ఆఫీసులో ఫర్నిచర్, కాగితాలు తగలబెట్టాలని చూశారు కాని, పెద్దగా నష్టమేమీ జరక్కుండానే ఆర్పివేయగలిగాము.

1964 నుండి 77 వరకూ పార్టీ కేంద్రం కలకత్తాలో వుంది. ఇక్కడ రెండు అంశాలున్నాయి. మొదటి నుండి నా అభిప్రాయం ఒకటి. మన పార్టీ కేంద్రం వున్నచోట దాన్ని రక్షించుకోగల బలమైన ఉద్యమం కూడా అక్కడ వుండాలి. అదే సమయంలో ఢిల్లీ ప్రభుత్వ కేంద్రమైనప్పుడు ఎక్కడో దూరంగా పార్టీ కేంద్రం వుంటే, ప్రతి సమస్యలోనూ జోక్యం చేసుకోవడం పార్టీకి కష్టమవుతుంది. ఇంతెందుకు? ఇక్కడ మనం ఇబ్బంది పడడంలా? విజయవాడలో పార్టీ కేంద్రం, హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ కేంద్రం. అందువల్ల నే తగినంత శక్తివంతంగా, తక్షణమే, వివిధ సందర్భాల్లో మనం కలుగచేసుకోలేక పోతున్నాం. హైదరాబాద్‌లో మన వుద్యమం తగినంత బలంగా లేదు. నల్గొండ ఉద్యమాన్ని హైదరాబాద్ వుద్యమంతో జతజేసేట్లు పార్టీ నిర్మాణం వుండాలన్న నా సూచన పార్టీలో విభేదాలు, చర్చలు - వీటివల్ల మూలపడింది. దురదృష్టవశాత్తు హైదరాబాద్‌లో మనం తగినంతగా ఎదగలేదు. అలాంటప్పుడు పార్టీ కేంద్ర రక్షణ ఒక సమస్యే. అక్కడకు కావలసినంత మందిని పార్టీ కేంద్ర నిర్వహణ తదితర అవసరాలకు సరిపడా, కార్యకర్తలను యితర ప్రాంతాల నుండి దిగుమతి చేసుకోవాలన్నా

అంత తేలికకాదు. కనుక ఎన్ని పరిమితులున్నా, ఇబ్బందులున్నా యిక్కడే వుండక తప్పడంలేదు. తగిన పరిస్థితులు హైదరాబాద్‌లో ఏర్పడినట్లు తోచిన మరుక్షణమే హైదరాబాద్‌కు మన పార్టీ రాష్ట్ర కేంద్రం మారవలసిందే.

అప్పుడూ అలాంటి పరిస్థితే పార్టీలో చీలిక వచ్చినప్పుడు మనకు ఢిల్లీలో ఏమీ మిగులలేదు. పైగా రెండేళ్ళు జైలులో వున్నాము. పార్టీ పత్రిక తీసుకురావాలి. అందుకు సరిపోయిన కార్యకర్తలు ఢిల్లీలో ఎక్కడ? పోనీ 'బహిరంగ కార్యకలాపాలు' నడవగల అవకాశం వుంటే ఏదోరకంగా తంటాలు పడవచ్చు. దీనికితోడు ఇద్దరు పొలిట్‌బ్యూరో సభ్యులు కలకత్తాలో వున్నారు. మనకు బలమైన ఉద్యమమూ అక్కడే వుంది. వారు ఢిల్లీ వచ్చే అవకాశం లేదు. కేరళ వాళ్ళు రారు ఇక నేను, బసవపున్నయ్య ఢిల్లీలో వుండి తంటాలుపడాలి ఎంత అనుభవం వున్నా ఆంధ్రలో వుద్యమం చాలా చిన్నది కేరళ, బెంగాల్ వుద్యమం, దైనందిన కార్యకలాపాల్లో తనపాత్ర నిర్వహించకుండా పార్టీ కేంద్రం ఎలా పని చేస్తుంది. అందుబాటులో సూర్జిత్, రణదివెలు వున్నా సమస్యతీరదు. అందువల్ల అప్పుడు ఢిల్లీలో పార్టీ కేంద్రం వుండటం సాధ్యంకాదు. ఇప్పటికీ, మన పి.బి. ఢిల్లీలో వున్నా కేంద్రానికి మనం ఇక్కడి నుండి తగినంత మంది కార్యకర్తలను పంపడం లేదు. "మీ రాష్ట్రాల సంగతేగానీ, కేంద్రం గొడవ మీకు పట్టడంలేదు. ఫెడరలిజమ్" ఇలా మనల్ని అంటూనే వున్నారు. ఎవర్ని పంపుతాం. ఇక్కడ మనకే సరిపోక పోతుంటే అది వేరే సంగతి. పై కారణాలన్నింటినీ దృష్టిలో వుంచుకుని, కలకత్తాకు పార్టీ కేంద్రాన్ని మార్చాము. మళ్ళీ 78లోగాని ఢిల్లీకి పార్టీ కేంద్రాన్ని మార్చలేదు.

కేవలం రాజకీయ గైడెన్స్ ఇవ్వడమే అయితే పార్టీ కేంద్రం ఎక్కడున్నా పర్వాలేదు. తెలంగాణా పోరాటం నిర్వహించాలంటే... కొన్నాళ్ళు వాళ్ళతో అడవుల్లో కేంద్రం నుండి నిర్వహించాం కొన్నాళ్ళు బయట ఉన్నాం. నిత్యం దైనందిన కార్యక్రమాల్లో కూడా గైడెన్స్ యిచ్చి నిర్వహించాలంటే మాత్రం పార్టీ కేంద్రం వుద్యమానికి దూరంగా వుండి చేయజాలం. పోరాటానికి గైడెన్స్ యివ్వడం అన్నది... అలాగే పరిస్థితిబట్టి వుంటుంది. ఆ మాటకొస్తే నేనూ, బసవపున్నయ్య, రాజేశ్వరావు ప్రత్యక్షంగా బి.ఎస్. వాళ్ళలాగా ప్రతిక్షణం తుపాకి పట్టుకునే పోరాటానికి నాయకత్వం వహించామా? అట్లా చెప్పాల్సివస్తే, ఆంధ్రప్రదేశ్‌లో తప్ప నాకు మిగతాచోట్ల ప్రత్యక్షంగా ప్రజలతో సంబంధంలేదు. గోపాలన్‌కు నా కన్నా ఎక్కువగా అలాంటి సంబంధం వుంది. కనుక నాయకత్వం వహించే వాళ్ళకు అదే గీటురాయిగా వుండదు. పార్టీ కేంద్రమూ అంతే. అన్ని అంశాలను దృష్టిలో వుంచుకుని చెయ్యాలి.

పార్టీ కేంద్రం నిర్వహించే సందర్భంలో నేనేమీ ప్రత్యేకమైన ఇబ్బందులను ఎదుర్కొనలేదు. క్రమశిక్షణా చర్యలకు పెద్దగా పాల్పడవలసిన పరిస్థితి రాలేదు. పోరాటసమయం కాదుగదా. పార్లమెంటరీ సమయంలో ప్రధానంగా నచ్చచెప్పి, మనం మార్గదర్శకంగా ప్రవర్తించి కామ్రేడ్స్‌లో మార్పు తీసుకురావాలి. తప్పనిసరి అయినప్పుడు తప్పక్రమశిక్షణా చర్యలతోనే సమస్యలను పరిష్కరించలేము. ఒకప్పుడు తెలంగాణా పోరాటం నిర్వహించి, దేశంలో పెద్ద పార్టీగా వున్నమాట నిజం. ఆ తర్వాత బలహీనమైనాము. అలా బలహీనమైనందువల్ల, నేను



పార్టీ కేంద్ర నిర్వహణలో ఆటంకాలు ఎదుర్కొన్నాననుకోవడం లేదు. ఇక తెలంగాణా పోరాట విషయమా? దురదృష్టవశాత్తూ ఆ పోరాట అనుభవాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, పార్టీని చైతన్యం చేయడంలో పార్టీ మొత్తంగానే సఫలీకృతం కాలేదు. నిజానికి తెలంగాణా పోరాటం మినహా 1857 తర్వాత దేశంలో జరిగిన సాయుధ పోరాటం ఏముంది? కొన్ని సాయుధ ఘర్షణలు జరిగాయి. కొంతమంది వ్యక్తిగత విప్లవకారులున్నారు. అయినా పోరాటం జరిగి 40 సంవత్సరాలు గడిచిపోయింది. మళ్ళీ మరో తెలంగాణా రాలేదు. ఆ పోరాట గుణపాఠాలనూ సమగ్రంగా, సక్రమంగా పార్టీ వినియోగించుకోలేక పోయింది. సరే, అది వేరే సంగతి.

1857 తర్వాత, ప్రాప్తకాలజ్ఞతగా ఎక్కడికక్కడ, అప్పటికప్పుడు రైతాంగం తదితర ప్రజానీకం సాయుధ ఘర్షణలకు తలపడినారు. కానీ సాయుధ తెలంగాణా పోరాటం సందర్భంగా కొన్ని ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక డిమాండ్లపై గ్రామ సీమల్లోని ప్రజలు – రైతాంగం తిరగబడ్డారు. పథకం రూపొందించి, సమన్వయం చేసి, పోరాట మార్గం నిర్దేశించగల కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించడం అన్నది ప్రాముఖ్యమైన ప్రత్యేక లక్షణం. ఆ సందర్భంగా సాంకేతిక తదితర యిబ్బందులను కూడా కొన్నింటిని ఎదుర్కొన్నాము. మందులు, అవీ బొంబాయి వంటి దూర ప్రాంతాల నుండి తెప్పించు కున్నాము. హఫ్‌కిన్స్ ఇనిస్టిట్యూట్ నుండి కూడా అక్కడెవర్నో డాక్టరును పట్టుకోవడం, అలాగే ఆయుధాలు బొంబాయి, నాగపూర్ తదితర ప్రాంతాల నుండి వచ్చేవి. వీటన్నింటికీ అక్కడ వున్న పార్టీ వుపకరించింది. అయితే చాలా ఖరీదు పెట్టి కొనాల్సివచ్చేది. అన్నట్లు, ఒక రైఫిల్‌ను ఆరువేల రూపాయలిచ్చి కొనాల్సి వచ్చింది. అప్పుడు డబ్బు కాదు ముఖ్యం. ఆయుధం, ఆ ఆయుధాల నాణ్యత. వీటన్నిటి విషయంలో దేశ వ్యాపితంగా పార్టీ సహకరించింది. అయినా శత్రువు వద్ద ఆయుధాలు సంపాదించడానికే ఎక్కువ ప్రాధాన్యత వుంటుంది. అయితే, ప్రతిసారీ శత్రువు వద్ద నుండీ, మిలటరీ ఆయుధ గిడ్డంగుల నుండి సంపాదించలేము. దానికీ మరింత సాంకేతిక పథకమూ, ఆచరణ అవసరం. ఒక్కోసారి మిలటరీ వాడేసిన ఆయుధాలను పనికొచ్చేవికావని అమ్మేవారు. దాన్ని కొన్నవారి వద్ద నుండి మనం కొనాల్సి వచ్చేది. అవేమంత నాణ్యమైనవి, నమ్మకమైనవి కావు ఇంతకీ చెప్పొచ్చేదేమంటే, అవసరాలకు తగినట్లుగా మనం అన్నీ సమకూర్చుకోలేక పోయాం. కానీ సమకూర్చుకున్న మేరకు కూడా వివిధ ప్రాంతాలలో పార్టీ యిచ్చిన సహకారం, చూపిన పరిచయాలు దోహదపడినాయి.

1954 వరకు పార్లమెంటరీ పార్టీ ఆఫీసును, పార్టీ కేంద్ర ఆఫీసును ఏర్పాటు చేయడం, నిర్వహించడం చేస్తూ వచ్చాను. అప్పటికి ఆఫీసుపని క్రమబద్ధంగా ఒక దారిన పడింది. 1955లో ఎన్నికల సందర్భంగా తిరిగి ఆంధ్రకు వచ్చాం. ఆంధ్ర కార్యదర్శి వర్గంలో నేను సభ్యుణ్ణి.

1952 ఎన్నికల తరువాత తణుకులో రాష్ట్ర మహాసభ జరిగింది. చంద్రం పార్టీ కార్యదర్శి అయ్యాడు. ఇక్కడ పార్టీలో అంతర్గత పోరాటాన్ని గురించి, ఎన్నికల్లో ఓటమి అనంతరం ఆ విభేదాలు మరింత తీవ్రమవడం గురించి చెప్పాలి. ప్రభుత్వం యెడల ఏ దృక్పథం వహించాలి?

హోల్‌టైమర్లు అందర్నీ ఏం చేయాలి? మొదలైన ప్రశ్నలన్నీ వచ్చాయి. సరే వీటన్నిటి గురించి చెప్పబోయే ముందు రాజ్యసభలో నేను సభ్యుడిగా వున్న కాలంలో నా కృషిని గురించి స్థూలంగా చెప్తాను.

పైన చెప్పినట్టు పార్లమెంటరీ ఆఫీసు, పార్టీ కేంద్ర కార్యాలయం వీటిస్థాపనలో నేను మంచి పాత్రను నిర్వహించానని చెప్పవచ్చు. రాజ్యసభ సభ్యుడిగా తెలంగాణా పోరాట భూమిక వున్నవానిగా దేశంలో ఇతర ప్రాంతాల్లో పర్యటించేవాడిని. పంజాబ్ ఉద్యమం సమరశీలమయింది. అందుకని వాళ్ళకు తెలంగాణా పోరాటమన్నా, ఆ కామ్రేడ్స్ అన్నా ప్రత్యకాభిమానం. నేను తరచుగా పంజాబ్ వెళ్ళి వస్తుండేవాడిని. ఇంకా రైతాంగ సమస్యలు, పోరాటాలు వున్న ప్రాంతాలకు కూడా వెళ్తుండేవాడిని.

రైతాంగ సమస్యలకు సంబంధించి నేను నిష్ణాతుణ్ణి అని కార్యకర్తలు భావించేవారు. 1944లో బెజవాడలో అఖిలభారత కిసాన్‌సభ మహాసభను చాలా పెద్దఎత్తున నిర్వహించాము. ఆ మహాసభ సందర్భంగా రాజేశ్వరరావు ప్రధానంగా ఏర్పాట్లకు సంబంధించిన విషయాలు చూసేవాడు. అయితే ముందుగానే దానికి ఒక పథకం రూపొందించడం, ముఖ్యమైన విషయాల్లో స్వయంగా భాగస్వామ్యం పంచుకోవడం నేను చేశాను. అదీగాక సుందరయ్యకు వ్యక్తిగా వున్న ప్రతిష్ట కూడా మహాసభ జయప్రదం అవడానికి తోడ్పడి వుండవచ్చు. ఆ తరువాత తెలంగాణా పోరాటం, దానిలో నా పాత్ర. అంతకుముందే 1932లోనే వ్యవసాయ కార్మికోద్యమానికి ఆంధ్రలోనే నాందీ ప్రస్తావన చేశాము. ఆ సందర్భంగా 1937లో అప్పటి రెవెన్యూ రికార్డులన్నీ పరిశీలించి నేనొక వ్యాసము రాశాను. ఆ వ్యాసంలో కోస్తాజిల్లా గ్రామాల్లో వ్యవసాయ రంగంలో వున్న వర్గ విభజన చర్చించాను. ఎంతమందికి జాయింట్ పట్టాలున్నది? భూమి ఎంత? వ్యక్తిగతంగా వున్న పట్టాలున్నది ఎంత మందికి? భూమి ఎంత? కౌలు స్వభావం ఏమిటి? ఇవన్నీ చోటు చేసుకున్నాయి. ఆ తరువాత తెలంగాణా పోరాట సందర్భంలో, రహస్య జీవితం గడుపుతున్నప్పుడు గ్రామసీమల్లో రైతాంగంలో వున్న వర్గ విభజన దృష్ట్యా మనమిత్రులెవరు? శత్రువులెవరు? తటస్థంగా వుండేది ఎవరు? మొదలైన అంశాలతో వ్యవసాయిక సమస్యపై ఒక పెద్ద వ్యాసం రాశాను. దాంతో రాజేశ్వరరావు ఏకీభవించలేదు. ఎం.బి.కి కూడా కొన్ని విభేదాలున్నాయి. ఏమైనా నా వ్యాసం ఆనాడు విజయవాడ నుండి లీగల్‌గా ప్రచురించబడే మన 'జనత' పత్రికలో ప్రచురితమైంది. ఈ వ్యాసం రాసేందుకు ఒక ప్రశ్నావళి తయారు చేసి వివిధ రాష్ట్రాలకు పంపాను. అలాగే నల్గొండ జిల్లాలో కొన్ని గ్రామాల్ని ఎంచుకొని ఈ సమస్యపై ప్రత్యేక అధ్యయనం చేశాను. ఈ దేశంలో రైతాంగ ఉద్యమానికి సంబంధించి మార్క్సిజం-లెనినిజాన్ని అన్వయించడంలో నేను కృషి చేశానని, కొంత వరకు సఫలీకృతుణ్ణి అయినానని భావిస్తున్నాను.

ప్రజాసంఘంగా వ్యవసాయ కార్మిక సంఘం ప్రత్యేకంగా వుండాలా అనేది పార్టీలో చర్చనీయాంశంగా వుండేది. నేటికీ వున్నది. బెంగాల్ కమిటీ ఇప్పటికీ వ్యవసాయ కార్మిక సంఘం ప్రత్యేక ప్రజాసంఘంగా ఉండాలన్న దాన్ని అంగీకరించడంలేదు. నా అభిప్రాయంలో



వ్యవసాయ కార్మికులు, నిరుపేద రైతులు కలిసి ఒక ప్రత్యేక వ్యవసాయ కార్మిక సంఘం వుండాలని. ఎందుకంటే, ఈ నిరుపేద రైతులు కూడా సగం వ్యవసాయ కార్మికులే గనుక. కాని అలా నిరుపేద రైతుల్ని వ్యవసాయ కార్మికులతో కలిపేస్తే ఇక రైతు సంఘంలో మిగిలేది మధ్యతరగతి, ధనిక రైతులేకదా? లెనిన్ "గ్రామీణ పేదల్ని విభజించవద్దని" చెప్పినా భారతదేశ పరిస్థితులకు అది అన్వయించదని మరో వాదన. 1978 జలంధర్ మహాసభల సందర్భంలో కూడా ఈ వివాదం తెగలేదు. ఏదైతేనేం ఒక రాజీ తీర్మానం వచ్చింది. దాని ప్రకారం నిరుపేదరైతులు వ్యవసాయ కార్మిక సంఘంలోగాని, రైతు సంఘంలోగాని తమకు ఇష్టం వచ్చినదాంట్లో చేరవచ్చు.

ఇక్కడ సైద్ధాంతిక అంశమేకాదు. ఎందుకంటే ఈ చర్చ 1937 నుంచి సాగుతూనే వుంది. ఒక దశలో వ్యవసాయ కార్మికులకు ప్రత్యేక సంఘం అక్కర్లేదని కూడా తీర్మానింప బడింది. ఒక వేళ మాటవరసకు రెండు సంఘాలు అవసరం అని భావించినా ఆచరణలో దేనికి ప్రాధాన్యత ఇవ్వాలి అన్నది సమస్యే. తగినంత మంది కార్యకర్తలు లేనప్పుడు వున్నవాళ్ళని ఏ ప్రాధాన్యతను దృష్టిలో వుంచుకొని ఏ రంగానికి కేటాయించాలి? ఈ విషయమై రెండు రంగాలూ అవసరమేనన్న సిద్ధాంతాన్ని నొక్కిచెప్పడంపట్ల ఇప్పటికీ ఆచరణలో పరిష్కారం దొరికిందని నేను భావించడంలేదు.

ఇప్పుడు కూడా కొన్ని జిల్లాల్లో వ్యవసాయ కార్మిక సంఘాన్ని నిర్మిస్తారు. రైతు సంఘాన్ని అశ్రద్ధ చేస్తారు లేదా రైతు సంఘాన్ని నిర్మిస్తారు. వ్యవసాయ కార్మిక సంఘాన్ని అశ్రద్ధ చేస్తారు. వ్యవసాయ కార్మిక సంఘాన్ని నిర్మించడం రైతు సంఘం నిర్మించడం కన్నా తేలిక. ఎందుకంటే వాళ్ళు బాగా అణచివేతకు గురవుతుంటారు. దారిద్ర్యంలోనూ వుంటారు. రైతు సంఘం అట్లాకాదు. రైతుల్ని సమీకరించేందుకు కష్టపడాలి. ఎట్లాగు భూస్వాములు మనకు వ్యతిరేకమే. ధనిక రైతులు అంత త్వరగా సంఘంలోకి రారు. ఇక మిగిలేది మధ్య తరగతి రైతులు వాళ్ళు కూడా మన ఉద్యమం బాగా బలంగా వుంటే తప్ప మనతోచేరదు. అలాంటప్పుడు పేద రైతుల కోసం ప్రత్యేకంగా రైతు సంఘం దేనికి? పైగా మధ్య తరగతి రైతుకి, పేద రైతుకి డిమాండ్ల విషయంలో కూడా పూర్తి సారూప్యత వుండదు. ఉదాహరణకు గిట్టుబాటు ధర తీసుకుందాం. పేద రైతుకు అమ్మేందుకు పెద్దగా మిగలదు. అలాంటప్పుడు గిట్టుబాటు ధరలభిస్తే సంతోషిస్తాడుగాని మధ్యతరగతి రైతుకుమల్లే పేద రైతుకు అది ప్రధాన డిమాండు కాదు.

తెలంగాణా పోరాటం తరువాత మనకు బహిరంగంగా పని చేసే అవకాశం వచ్చినప్పుడు 1953లో పంజాబ్‌లోని మెగాలో కిసాన్ మహాసభ జరిగింది. 1954లో కన్ననూరులో జరిగినట్టు గుర్తు. నేను కిసాన్‌సభ కార్యదర్శి వర్గంలో వున్నాను. కానీ, అది అంతముఖ్యమైన విషయంకాదు. ఆ మహాసభ సందర్భంగా విడుదలైన తీర్మానం రూపొందించడంలో నా పాత్ర, నిజానికి ఆంధ్ర కామ్రేడ్స్‌పాత్ర ప్రధానంగా వుంది. భూపరిమితి

ఎంత నిర్ణయించాలి అని వచ్చినప్పుడు ధనికరైతు భూమి ఏమీ పోకుండా చూసుకుంటూ, వీలైనంత తక్కువగా ఆ భూపరిమితి ఉండాలన్నది మేం చేసిన వాదన. ధనికరైతును శత్రువును చేసుకోకూడదు. ఆ పేరుతో పంపకానికి ఎక్కువ భూమి రాకుండా వుండేటట్లు ఎక్కువగా భూపరిమితిని నిర్ణయించకూడదు. వీలైనంత తక్కువగానే భూపరిమితి వుంటే తప్ప పంపకానికి తగినంత భూమి మిగలదు ఇది మొదటి అంశం.

అయితే ఆ తరువాత ఈ మొత్తం అవగాహన చర్చనీయాంశం అయింది. 1973 చర్చల సందర్భంలో ఇది కూడా ఒక అంశమే. అసలు భూస్వామికి సీలింగు పరిమితికి లోబడిన భూమిని ఉంచుకునే అవకాశం ఇవ్వచ్చా? అది ప్రశ్న. ఇవ్వరాదు. ఇతర జీవనాధారం అతనికి వున్నప్పుడు, ఈ భూమ్మీద ఆధారపడవలసిన అవసరం లేనప్పుడు భూస్వామికి ఆ భూమిదేనికి?తనంత తాను దానిపైనే ఆధారపడి జీవించవలసివస్తే వేరే సంగతి. తానే ప్రత్యక్షంగా వ్యవసాయం చేసుకుంటాడు. లేని యెడల భూమిని పడావు పెడ్తాడు. ఇది తనకు ఆస్తిగా చెప్పుకునేందుకు మాత్రమే ఉపయోగపడుతుంది. అలాంటప్పుడు భూమిపై వ్యవసాయం చేయడం తప్ప మరో వృత్తిలేని, వ్యవసాయం చేసుకునేందుకు భూమి లేని కోటాను కోట్ల ప్రజలకు తగినంత భూమి ఎలా లభ్యం అవుతుంది? అందువల్ల ఇతర జీవనాధారంగల భూస్వాములు భూమి నిరుపేదలకు పంచినప్పుడు మాత్రమే వ్యవసాయం చేసుకొని కనీస జీవనాధారం అయినా పొందగలుగుతాడు. అలాకాకపోతే భూమిలేని నిరుపేదలకు భూమి అనే నినాదం ఇవ్వడంలో అర్థమేమిటి?

ఈ విషయంలో 1973 చర్చల సందర్భంలో కూడా కేంద్ర కమిటీ నా అభిప్రాయంతో ఏకీభవించింది. సరే, ఆ తర్వాత అదంతా వెనక్కి నెట్టివేయబడిందనుకోండి. భూస్వాముల భూమి లాక్కోకుండా భూస్వామ్య విధానం రద్దు చేయడం ఎలా సాధ్యం? అన్నదాంతో కేంద్ర కమిటీకి కూడా ఏకీభావమే వుంది. చిన్న ఉద్యోగస్థులు, ఉపాధ్యాయులు, గుమాస్తాల వంటి వారికి భూమివుంటే దానికి నష్టపరిహారం చెల్లించి తీసుకుని, దున్నుకునే వాళ్ళకు ఉచితంగా పంచాలి. ఇదెలా వున్నా, 1954లో మేము ప్రతిపాదించినట్లు ధనికరైతు భూమి లాక్కోకుండా వీలైనంత తక్కువ గరిష్టపు భూ పరిమితి నిర్ణయించాలన్నది ఆమోదయోగ్యమైనది.

భారతదేశంలో వ్యవసాయ రంగం స్థితి ఏమిటి? భూస్వామ్య విధానం. ఏ మేరకు వుంది? వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ విధానం ప్రవేశించిందా? దాని ప్రమాదం ఏమిటి? ఇవన్నీ చర్చనీయాంశాలుగా నేటికీ కొనసాగుతున్నాయి. నిజానికి పెట్టుబడిదారీ విధానమే భారతదేశంలో సంపూర్తిగా అభివృద్ధి చెందలేదు. అలాంటప్పుడు వ్యవసాయ రంగంలో అది తీవ్ర ప్రభావాన్ని సూచించగల దశలో లేదు. అసలు పెట్టుబడిదారీ విధానమే వ్యవసాయ రంగంలో లేదా? అనేది కాదు. ప్రశ్న వ్యవసాయంలో అత్యంత అధునాతన యంత్రాల వాడకం, మిగతా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లో మాదిరిగా లేకపోయినా, ఏదో మేరకు వ్యవసాయరంగంలో కూడా పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందకపోలేదు. అది ప్రధానమైన మార్పుకాదు. ఈ విషయంలో విభేదాలుంటూనే వుండేవి. ఆ తరువాత వ్యవసాయ రంగంలో



చాలా మార్పులొచ్చాయి. వీటన్నింటిపైన వివిధ సందర్భాలలో నేను చేసిన అధ్యయనం, చర్చల్లో నా వాదనా విధానం, అనీ రికార్డులు చూస్తే తెలుస్తుంది. ఏమైనా వ్యవసాయ రంగంలో నన్ను నిష్ణాతుడుగా భావించడానికి యివన్నీ దోహదపడ్డాయి.

ఇక పార్లమెంటులోగాని, అసెంబ్లీలోగాని నా పాత్రను గురించి చెప్పవలసి వచ్చినప్పుడు ఒక సాధారణ సూత్రం చెప్పవచ్చు. నేను ఏ సమస్యనైనా క్షుణ్ణంగా, చాలా చిన్న చిన్న వివరాల్లోక్కూడా వెళ్ళి అధ్యయనం చేసేవాడిని. అది భూ సమస్య కానివ్వండి, ధరల సమస్య కానివ్వండి, మరేదైనా సరే. అలా అధ్యయనం చేయకుండా మనం చర్చల్లో మన సూత్రబద్ధవైఖరిని నిరూపించలేము. ఒకసారి అలా నిర్ణయానికి వచ్చిన తర్వాత ఇక దాన్ని ప్రచారంలో పెట్టాలి. ఈ విషయంలో కొంత మంది కామ్రేడ్స్ నేను మరీ గణాంక వివరాల్లోకి వెళ్ళి వివరించబూనటంవల్ల నా ప్రసంగాలు అంతగా ప్రజలను ఆకట్టుకొనేవి కావు అని విమర్శించేవారు. ఆ మాటకొస్తే గోపాలన్ చాలా ఆకట్టుకొనే విధంగా ప్రసంగించేవాడు. అధికారయుతంగా, అదే సమయంలో వినేవాళ్ళను ఆకర్షించే విధంగా చెప్పగలగడమనేది ఒక కళ.

పత్రికలవాళ్ళకి చర్చ ఎంత నిశితంగా జరిగింది. ఎంత లోతైన పరిశీలన ఇమిడి వుంది అనేది పెద్దగా అక్కర్లేదు. పార్లమెంటు రికార్డులనుబట్టి వాళ్ళు రాసుకుంటుంటారు. కొంత హంగామా, హడావుడి వాళ్ళకు కావాలి. ఆ లెక్కన ఆనందన్ నంబియార్‌కు పత్రికలు ఎక్కువ ప్రాచుర్యం ఇచ్చేవి. ఏది ఏమైనా క్షుణ్ణంగా అధ్యయనం చేయడం, ప్రతి సమస్యను అన్ని కోణాల నుంచి వివరంగా పరిశీలించడం మన పార్లమెంటరీ గ్రూపు ప్రత్యేకతగా గుర్తింపు పొందాయి. ఫలితంగా పార్టీ ప్రతిష్ట పెరిగింది. మన ప్రత్యర్థి వర్గాలు కూడా కమ్యూనిస్టులు బాగా అధ్యయనం చేస్తారు అన్న అభిప్రాయంతో వుండేవారు. ఒకసారి పార్లమెంటులో శ్రీ దేశ్‌ముఖ్ ఏవో కొన్ని గణాంక వివరాలు ఇవ్వసాగాడు. మనం లేచి ఆ అంశంపై మనం సేకరించిన గణాంక వివరాలు ఇచ్చాం. దేశ్‌ముఖ్ ఆగ్రహించే బదులు ఆగ్రహించలేదు సరికదా, తరువాత తన కార్యదర్శులను పిలిచి కమ్యూనిస్టులు ఏవో తోచిన లెక్కలు చెప్పరు. వాళ్ళు అధికారయుతమైన సమాచారాన్నే సేకరించి వుంటారు. కనుక వారికా వివరాలు ఎలా లభ్యమైనాయో, ఏ పుస్తకాన్నుండి వారు సేకరించారో తెలుసు కోవలసిందిగా ఆదేశించారు.

నెహ్రూ నిజంగానే బూర్జువా పార్లమెంటరీ సంప్రదాయాలను నిలబెట్టాలని ప్రయత్నించేవాడు. అందుకనే పార్లమెంటులో చర్చలను శ్రద్ధగా ఆలకించేవాడు. ఆయనతో ప్రత్యక్షంగా వాగ్యుద్ధానికి నేను దిగిన సందర్భాలున్నాయి. ఒకసారి ఏదో విషయమై రాజ్యసభ చర్చ జరుగుతూ వున్నది. నెహ్రూ కూడా వున్నారు. "లేడీమౌంట్‌బాటన్ భారతదేశం ఎందుకు వచ్చినట్టు, ఆమెకు ఇక్కడ ఏం పని? ఈ ప్రభుత్వాన్ని ప్రభావితం చేసేందుకు వచ్చిందా?" అని నేనడిగాను. నెహ్రూకు ఎక్కడలేని కోపం వచ్చింది. అంత కోపం ఎందుకు రావాలో నాకు తెలియదు. ఆమెకు, ఆయనకు ఏదో సంబంధం వున్నదన్న విషయం నా దృష్టిలో లేదు. నిజానికి నేను అలాంటివాటిని పట్టించుకునే వాడినికాదు నెహ్రూ "మీ మాటలు

ఉపసంహరించుకోండి" అని బిగ్గరగా అరిచాడు. నేనూ బిగ్గరగానే "ఎందుకు ఉపసంహరించుకోవాలి? ఈ బ్రిటిష్ వాళ్ళు యింకా ఏ విధంగా మనపై వొత్తిడి తెద్దామని ప్రయత్నిస్తున్నారు" అని అన్నాను. సభలో కొంత గందరగోళమైంది. అధ్యక్ష స్థానంలో వున్న రాధాకృష్ణన్ ఏదో విధంగా ఇరువుర్నీ శాంతపరిచాడు. ఆ మర్నాడు రాధాకష్ణన్ నన్ను పిలిపించారు. అంతకు ముందు రాధాకృష్ణన్ రచనలు కొన్ని నేను చదివి వున్నాను. ఈ తెలంగాణా పోరాటం, అది కూడా ఆయనకు తెలుసు. కాని నేను రాజ్యసభకు వచ్చిన తరువాత మాత్రమే ఆయనతో ముఖాముఖి పరిచయం ఏర్పడింది. ఆయన క్రిందటి రోజు సభలో నేను "నెహ్రూకు, ఆమెకు ఏదో సంబంధం వుందన్న పద్ధతిలో మాట్లాడినందుకు నెహ్రూకు అంత కోపం వచ్చింది" అని వివరించాడు. "అయ్యో పొరపాటు జరిగింది. నేనా ఉద్దేశంతో అనలేదు. ఆ అంశమే నా దృష్టిలో లేదు. ఆమె భారత ప్రభుత్వంపై ఏదో ఒత్తిడి తెచ్చేందుకు వచ్చిందని నాకు సమాచారం అందింది. అందుకనే అంత గట్టిగా అడిగాను. మీరు చెప్పేది నా దృష్టిలో వున్నట్లయితే నేను మరింత జాగ్రత్త పడేవాడిని. మీరు ఆయన్ని కలిసినప్పుడు చెప్పండి నా అభిప్రాయం అదికాదని. అలాంటి పరిస్థితి ఏర్పడినందుకు నేను క్షమాపణ కోరుతున్నానని చెప్పండి" అని రాధాకృష్ణన్‌గారితో చెప్పాను.

ఆ మర్నాడు నెహ్రూగారు నన్ను ఒక విందుకు ఆహ్వానించారు. అలా అప్పుడప్పుడు కొంత మంది పార్లమెంటు సభ్యుల్ని కలుసుకుంటూ వుండటం అనవాయితీ. ఆ విందుకు నేను, మీర్ అక్బర్ అలీఖాన్ కలిసివెళ్ళాం. తర్వాత ఆలీఖాన్ ఒరిస్సా గవర్నరు అయ్యారు. తర్వాత కూడా ఎప్పుడన్నా కలిస్తే ఆప్యాయంగా ఆ రాజ్యసభ నాటి రోజులు అవీ గుర్తు చేస్తుండేవాడు. గేటు వద్ద అతిథులను ఆహ్వానించేందుకని నెహ్రూ నిలబడి వున్నారు. ఆయన దగ్గరకురాగానే అంతకు ముందు రాజ్యసభలో జరిగిన చర్చను గూర్చి, నాది పొరపాటు అయిందని చెప్పాను. నెహ్రూ కూడా తాను అంత పెద్దగా అరిచి వుండాల్సింది కాదని, తనదీ పొరపాటేనని అంటూ అప్యాయంగా కౌగలించుకున్నారు. అదీ హుందాగా, స్పోర్ట్స్‌మెన్ షిప్‌తో వ్యవహరించడమంటే.

అలాగే ఒకసారి అప్పటి హోంమంత్రి కట్జూతో చిన్న ఘర్షణపడ్డాను. నేను పంజాబ్ వెళ్ళాను. నాకు వివిధ ప్రదేశాలు చూసే అలవాటు వుందికదా. అందుకని అక్కడ నుండి హిమాచల్‌ప్రదేశ్ వారి జీపు తీసుకుని టిబెట్‌కు 150 మీటర్ల దూరంలో వున్న రాంపూర్‌కు వెళ్దామని నిర్ణయించుకున్నాను. వెళ్తుంటే. దారిలో ఇంకా నిర్మాణంపూర్తిగాని వంతెనలు కొన్ని తగిలాయి. నేను సుందరయ్యనని, రాజ్యసభలో సభ్యుడ్ని అని, రాంపూర్ వెళ్ళాలని అనుకుంటున్నానని తెలుసుకున్న అక్కడి ఇంజనీర్లు కూలీలచేత జీపును మోయించి దాటించారు. అలా రాంపూర్ చేరారు. అయితే ఈ వార్తకు పత్రికలు అనవసర ప్రాముఖ్యత ఇచ్చాయి. చైనా వాళ్ళతో సంబంధాలు పెట్టుకునేందుకు వెళ్ళానని కథలు సృష్టించాయి. రాజ్యసభలో కట్జూ నన్ను అడిగాడు. "ఈ తెలంగాణా పోరాట సాయుధ యోధుడికి ఆ అడవుల్లో, కొండల్లో ఏం



పని?" అని. నాకు కోపం వచ్చింది. నేను లేచి "నేను రాజ్యసభ సభ్యుడ్ని. ఈ దేశంలో ఏ మారుమూలకైనా వెళ్ళగల హక్కు నాకుంది? నేనక్కడకు తెలంగాణాలోవలె ఏమీ పోరాటాన్ని ఆరంభించేందుకు వెళ్ళలేదు. అయినా తెలంగాణా పేరు చెబితే మీకెందుకంత భయం?" అని బిగ్గరగా అన్నాను. ఇంతలో రాధాకృష్ణన్ జోక్యం చేసుకొని" ఎందుకంత కోపం తెచ్చుకుంటావు? కట్జూ సంగతి నీకు తెలియదా" అంటూ అనునయించాడు. నిజం చెప్పాలంటే ఆ రోజుల్లో ఇంకా పార్లమెంటరీ క్రమశిక్షణ వుండేది. అందుకని వ్యక్తుల మధ్య సంబంధాలు స్నేహపూరితంగానే వుండేవి. పరస్పర గౌరవాభిమానాలు వుండేవి. పైగా రాజ్యసభ అధ్యక్షుడు రాధాకృష్ణన్, ఆయన ఉన్నత వ్యక్తిత్వం కూడా అలాంటి వాతావరణం ఏర్పడటానికి తోడ్పడేది. లోక్‌సభలో మౌలంకర్ స్పీకర్‌గా వుండేవారు. ఆయన బూర్జువా పార్లమెంటరీ సాంప్రదాయాలు ఉన్నతంగానూ కాపాడేవారు. ఇప్పుడేముంది? పార్లమెంటులో అరుపులు, కేకలు, రచ్చబండ చర్చలూ మామూలయినాయి.

హిందూ వివాహబిల్లు తీసుకురాదలచి ముందుగా రాజ్యసభలో దాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. భార్యాభర్తల సమ్మతిపై విడాకులు పొందగలిగే అవకాశం వుండాలంటూ విడాకులు పొందటం మరింత సులభతరం చేసే విధంగా ఆ బిల్లుకు నేను సవరణను ప్రతిపాదించాను. ఆ సవరణపై ఒప్పించే విధంగా నచ్చ చెబుతూ వాదన చేశాను. దానికితోడు సంఘ సంస్కరణలపట్ల మక్కువ, అలాంటి విషయాల్లో మరింత ఉదారంగా వుండవలెనన్న దృక్పథం నెలకొన్న సమయం అది అందువల్ల కొందరు కాంగ్రెస్ వారు కూడా ఆ సవరణకు అనుకూలంగా వున్నారు. ఫలితంగా మా సవరణ నెగ్గింది. అప్పుడు రాజ్యసభ ఉపాధ్యక్షుడు మైసూర్‌కు చెందిన కృష్ణమూర్తి. ఆయన ఇంతటి అభ్యుదయకరమైన సవరణ నెగ్గటంవల్ల ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. "ఈ దశలో మీరు పెట్టిన సవరణ నెగ్గుతుందని నేను వూహించనే లేదని" అన్నారు. ఆ తరువాత ఆ బిల్లు లోక్‌సభకు వెళ్ళింది. మేం పెద్దలం కదా? కనుక లోక్‌సభ మేము ఆమోదించిన సవరణను తిరస్కరించలేదు. అదీగాక అప్పుడున్న సాంఘిక వాతావరణ ప్రభావం కూడా అక్కడ సవరణ నెగ్గేందుకు దోహదపడింది. అయితే రాష్ట్రపతిగా వున్న రాజేంద్రప్రసాద్‌కు మటుకు ఈ బిల్లుపై కొన్ని అభ్యంతరాలుండేవి.

అలాగే స్టేట్ బ్యాంక్ ఉద్యోగస్థుల విషయంలో కూడా మేము గట్టిపట్టుపట్టాము. వారితో ప్రభుత్వం ఒక ఒప్పదం చేసుకొని అమలు జరప నిరాకరిస్తున్నది. ఆ విషయంపై వి.వి. గిరి రాజీనామా ఇచ్చివున్నాడు. ఏ కారణాలైతేనేమి రాజ్యసభలో పెద్దగొడవే జరిగింది. ప్రావిడెంట్ ఫండ్ బిల్లుకు సంబంధించి కూడా జరిగిన చర్చలో నేను బాగా అధ్యయనం చేసి తగిన సమాచారంతో ప్రభుత్వాన్ని నిలేశాను. నా ప్రసంగం చాలా బాగుందని, దాని పూర్తిపాఠాన్ని అన్ని రాష్ట్రాలకు పంపించాలని పార్టీ పార్లమెంటరీ కేంద్రం భావించింది. ఇంతకూ చెప్పొచ్చేదేమంటే క్షుణ్ణంగా సమస్యలను అధ్యయనం చేయడం, సమర్థవంతంగా దాన్ని సభలో ప్రవేశపెట్టడం జరుగుతుండేది. పార్లమెంటు సభ్యులందరికీ వివిధ సమస్యలపట్ల

సంపూర్ణావగాహన కల్గించేందుకు కృషి చేసేవాళ్ళం. అందుకు అవసరమైన సమాచారం సేకరించటంలో, మా వాదనను పరిపుష్టం చేయడంలో పార్లమెంటరీ పార్టీ కేంద్రసిబ్బంది ఎంతగానో సహకరించేవాళ్ళు.

ఆంధ్ర ప్రాంతం నుండి ఎన్నికయిన కమ్యూనిస్టు సభ్యులదే పెద్ద సంఖ్య. అప్పటికింకా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడలేదు. మద్రాసు రాష్ట్రంలోనే మనం వుండే వాళ్ళం. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడుతున్నాం. పొట్టి శ్రీరాములు ఆ దశలోనే నిరాహారదీక్ష ప్రారంభించారు.

ఆంధ్ర రాష్ట్రం కావాలని ప్రతి అవకాశాన్ని వాడుకుని రాజ్యసభలోనూ, లోక్‌సభలోనూ లేవనెత్తేవాళ్ళం. ప్రవాహంలా వస్తున్న టెలిగ్రాములు లన్నింటినీ పార్లమెంటు దృష్టికి తెచ్చేవాళ్ళం. పొట్టిశ్రీరాములు పరిస్థితి క్షీణిస్తున్నది. బయట ఆందోళన తీవ్రంగా వుంది అన్నీ కలిపి ఆంధ్రరాష్ట్ర అవతరణకు నెహ్రూ ప్రభుత్వం అంగీకరించేట్లు చేశాయి. అయితే, రెండు మూడు రోజులు ముందుగా ప్రభుత్వం ప్రకటించినా లేదా పొట్టిశ్రీరాములుగారి సలహాదార్లు నెహ్రూ ఇచ్చిన హామీలపై ఆధారపడి, మద్రాసు లేకుండా ఆంధ్రరాష్ట్ర అవతరణకు అంగీకరించి, నిరాహారదీక్ష మానుకోమని ఆయనకు సలహా యిచ్చినా ఆయన ప్రాణాలు కాపాడబడేవి. కాని మద్రాసులేని ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు వారు మొండిగా తిరస్కరించారు. అప్పటికప్పుడే రాష్ట్ర ఏర్పాటు జరగాలని పట్టుబట్టారు. ఫలితంగా ఆయన అశువులు బాశారు.

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు నాందీ జరిగింది. ఫజులాలీ కమీషన్ వేశారు. ఆ కమీషన్ సూచనల మంచి చెడ్డల వివరాలన్నింటిలోకి నేను వెళ్ళడంలేదు. కానీ కమీషన్ సూచనలు మన అభిప్రాయానికి భిన్నంగా వున్నాము. ఉదాహరణకు, మనం గ్రామాన్ని గీటురాయిగా తీసుకొని రాష్ట్ర సరిహద్దులు నిర్ణయించుకున్నాము. కానీ, 'జిల్లా'ను గీటురాయిగా తీసుకుని అందులోను 70 శాతంపైగా ప్రజలు మాట్లాడే భాష ఆసరాగా రాష్ట్రాల సరిహద్దులు నిర్ణయించాలని కమిటీ సూచించింది. ఫలితంగా రాష్ట్రాల సరిహద్దుల విషయంలో వాదాలు కొనసాగుతూనే వున్నాయి. పైగా 'తెలంగాణా' లాంటివి ప్రత్యేక రాష్ట్రాలుగా వుండాలని ఆ కమీషన్ సూచించింది. అలాకాదు, అలాంటివాటిని భాషా ప్రాతిపదికపై పక్కనున్న రాష్ట్రాలలో కలపాలని మన సూచన దీన్ని కమీషన్ అంగీకరించలేదు. జరిగిందేమిటి? మళ్ళీ అందుకై మరో ఉద్యమం అవసరమైంది.

ఆ సందర్భంగా మనం తీసుకున్న వైఖరి, తర్వాత వివిధ సందర్భాలలో రాష్ట్రాల ఏర్పాటు, సరిహద్దు వీటి విషయంలో మనం అనుసరించే విధానానికి మార్గదర్శకమైంది. విడిపోయే హక్కులేకుండా, ప్రధాన భాషలన్నింటికీ ప్రత్యేక రాష్ట్రాలు వుండాలనీ, ఆ రాష్ట్రాలకు తగినన్ని హక్కులు, మరింత పాలనా స్వేచ్ఛ కావాలనీ, కేంద్రం సాధారణ పర్యవేక్షణతోపాటు, నాలుగు ముఖ్యమైన శాఖలను అదుపులో వుంచుకుంటూ, రెండు రాష్ట్రాలు అంతకుమించిన వాటికి సంబంధించిన సమస్యలలో మాత్రం జోక్యం చేసుకోవాలనీ, మన విధానంగా రూపొందించుకోవడానికి దోహదపడింది.



ఈ విషయమై మొదటి నుండి మనం కమ్యూనిస్టుల్లా తీసుకున్న వైఖరి సూత్రబద్ధంగా వుండి, అది పెరుగుతున్న భాషా, జాతుల ప్రజానీకపు కోర్కెలకు అనుగుణంగా వుంది అందువల్లనే మన పార్టీ చిన్నదిగా వున్నప్పటికీ, భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణంలో ప్రధానపాత్ర వహించగలిగింది. నిజానికి 1956లో "సంయుక్త మహారాష్ట్ర" కావాలన్న ఉద్యమంలో మనం నిర్వహించిన పాత్రవలన, ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో మొదటిసారిగా వామపక్షాలు, ప్రత్యేకించి మన పార్టీ కూడా ఎక్కువ స్థానాలను సంపాదించుకోగలిగింది.

1950–54 మధ్య వివిధ సందర్భాలలో పార్లమెంటులో జరిగిన చర్చల్లో మనం ఏ వైఖరి తీసుకున్నాం. ఎంత సమర్థవంతంగా జోక్యం చేసుకున్నాం. ఇవన్నీ వాటి పార్లమెంటరీ రికార్డులు పరిశీలించితే అర్థమవుతుంది. ఆ రోజుల్లో రాజ్యసభలో జరిగిన చర్చల్లో మరో ముఖ్యమైన అంశం, కొత్తగా ఏర్పాటైన ఆంధ్రరాష్ట్ర రాజధాని ఎక్కడుండాలి అన్న విషయం. ఆంధ్ర రాష్ట్రానికి మధ్యలో అందరికీ అందుబాటులో వుండాలనీ, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన పిదప, హైదరాబాద్ రాజధానిగా వుండాలని మన వాదన. అయితే కాంగ్రెస్‌వారు అందుకు సిద్ధంగాలేక, తమలో ముఠా తగాదాల దృష్ట్యా కాంగ్రెస్ ఎం.ఎల్.ఎ.ల నిర్ణయానికి వదిలేశారు. కాంగ్రెస్ ఎం.ఎల్.ఎ. లంటే, తమిళనాడు కాంగ్రెస్ శాసనసభ్యులు కూడా వుంటారన్నమాట. సంజీవరెడ్డి నాయకత్వాన వారంతా జమకూడారు. విశాఖపట్నంలో రాజధాని వుండేందుకైనా అంగీకరించారుగానీ విజయవాడ, గుంటూరులకు మాత్రం అంగీకరించలేదు. చివరకు వాళ్ళు కర్నూలు రాజధాని అని నిర్ణయించారు. అది సరైంది కాదని మనం చెప్పాముగాని, ఒకసారి నిర్ణయమైన తర్వాత యిక ఏ ఆందోళనా లేకుండా ఆమోదించాము. అయితే, రెండేళ్ళలోనే ఆంధ్రప్రదేశ్ ఏర్పడడం, రాజధాని హైదారాబాద్ కావడం జరిగింది. ఆ సందర్భంగా, రాజ్యసభలో ఆంధ్ర రాజధాని విషయమై శక్తివంతమైన సుదీర్ఘ ఉపన్యాసం చేశాను. అసలు ఈ భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కాంగ్రెస్ ఎలా వ్యతిరేకించిందీ, తీరా తప్పని పరిస్థితుల్లో ఆంధ్రరాష్ట్ర ఏర్పాటును ఎలా అంగీకరించవలసి వచ్చిందీ, అంగీకరించిన తర్వాత మళ్ళీ రాష్ట్రం మొత్తం ప్రయోజనాల్ని రక్షించుకొనేందుకై ఎలా వ్యవహరించిందీ – యివన్నీ బహిర్గతం చేస్తూ ప్రసంగించాను. ప్రభుత్వం తాను తీసుకువచ్చిన బిల్లులో నా ప్రసంగంవలన తదుపరి ప్రత్యేకంగా మార్పులేమీ చేయలేదుగాని, తగు సమాచారం సేకరించి నా వాదనను చాలా శక్తివంతంగానే ప్రవేశపెట్టానని అభినం దించారు.

# శాసనసభా రంగం

**కొ**త్తగా ఏర్పడిన ఆంధ్రరాష్ట్రంలో 145 మంది శాసనసభ్యులుంటే, మనం 45 మందిమి వుండేవాళ్ళం. శాసనసభలో మనపార్టీ ఉప నాయకులు కామ్రేడ్ హనుమంతరావు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడ్డంతోటే అప్పటి దాకా మనతో ఐక్య సంఘటనలో వున్న ప్రకాశంగారి గ్రూపు కె.ఎం.పి., రంగా గ్రూపు కె.ఎల్.పి.లు రెండూ మన నుంచి విడిపోయి కాంగ్రెస్‌లో కలిశాయి. ప్రకాశంగారు ముఖ్యమంత్రి అయ్యారు. రంగా రాజ్యసభ సభ్యుడు. గౌతులచ్చన్న ఆ పార్టీ తరపున శాసనసభలో వుండేవాడు. వారి చర్యలు విమర్శకు గురైనా ఆంధ్ర రాష్ట్రం వచ్చిందన్న విజయోత్సాహంలో ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. వారు మనతో లేకపోయినా శాసనసభలో మనది చాలా బలమైన శక్తిగానే వుంది. ఆ తరువాత మద్యపాన నిషేధం బిల్లు సందర్భంలో కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోయింది. ఒక్క ఓటు తేడాతో ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం నెగ్గింది. చివరిక్షణంలో గుడివాడకు చెందిన సుబ్రహ్మణ్యేశ్వరరావు ఓటు నిర్ణయాత్మకమైంది.

తిరిగి ఎన్నికల సందర్భంలో కమ్యూనిస్టులు, కమ్యూనిస్టు సానుభూతిపరులు ఒక కనీస కార్యక్రమం రూపొందించి దానికి అంగీకరించే ఇతర పార్టీలను శక్తులను కలుపుకురావాలని భావించాం. అప్పటికే కేరళలో పి.ఎస్.పి. ఊగిసలాట లాడిన అనుభవం మా దృష్టిలో వుంది. అందువల్ల ఇతర పార్టీలను కలుపుకొచ్చేందుకు ప్రత్యేక శ్రద్ధతో కృషి చేయలేదు. ఉత్తర కోస్తా జిల్లాల్లో పి.వి.జి. రాజు ఆధ్వర్యంలో పి.ఎస్.పి.కి కొంతబలం వుంది. గట్టిగా కృషి చేసినట్లయితే కలుపుకు రాగలిగేవాళ్ళమే. అయితే కాంగ్రెస్ బాగా భ్రష్టుపట్టిపోయిందని 1948-51ల మధ్య మనంచేసిన త్యాగాల ఫలితంగా ప్రజలకు మనపై వున్న గౌరవాన్ని అతిగా అంచనా వేసుకొని ఒంటెత్తుపోకడతో వ్యవహరించాం. ఫలితం అందరికీ తెలిసిందే. మనకు వ్యతిరేకంగా కాంగ్రెస్‌లో వున్న అన్ని ముఠాలు, కాంగ్రెస్‌లో లేకపోయినా



కమ్యూనిస్టు వ్యతిరేకతగల అన్ని శక్తులు మనల్ని ఓడించడానికి ఏకమై, ఒక ఫ్రంట్‌గా సీట్లు సర్దుబాటు చేసుకొన్నారు. ఏవో కొద్దిసీట్లు మినహా దాదాపు అన్ని సీట్లు మనమే పోటీ చేశాం. ఏ జిల్లాలో అయినా మన బహిరంగ సభలకు లక్షల సంఖ్యలో జనం హాజరయ్యారు. ప్రజల్లో బ్రహ్మాండమైన స్పందన వచ్చింది. గెలుస్తామనే అనుకున్నాం. 30-33 శాతం వరకూ ఓట్లు వచ్చినా సీట్లు బాగా తగ్గిపోయాయి. కేంద్ర కమిటీ కూడా మాది పొరపాటు అవగాహన అని చెప్పిన గుర్తు లేదు. 1952 ఎన్నికల్లో ఇటు ఆంధ్ర ప్రాంతంలోనూ, అటు తెలంగాణాలోనూ మనం సాధించిన విజయాలతో కాస్త అహంభావంతో వ్యవహరించాము. లేకపోతే ఉన్న పరిస్థితిని దృష్ట్యా చూసినా, మన నిర్మాణ పటిమ దృష్ట్యా చూసినా మన అంచనా చాలా అతిగా వుంది. నేను గన్నవరంలో 800 ఓట్లు తేడాతో గెలిచాను. రాజ్యసభలో వున్న నేను, బసవపున్నయ్య ఇరువురమూ పోటీ చేయాలని నిర్ణయించుకున్నాం. కమ్యూనిస్టులు ఆషామాషీగా పోటీ చేయడంలేదని, అధికారంలోకి వచ్చేందుకే పోటీ చేస్తున్నారనే విశ్వాసాన్ని ప్రజల్లో కల్పించాలంటే మేము ఇరువురమూ పోటీ చేయాలని భావించాం. వెనక్కి తిరిగి చూసుకుంటే ఆ నిర్ణయమూ అంత సరైనది కాదని భావిస్తున్నాను. తగిన నిర్మాణం లేకుండా, ఎవరో ఒక వ్యక్తి ఆసరాగా తెలవగలం అని అనుకోవడం ఒక భ్రమ. వ్యక్తి ప్రతిష్టవల్ల కొన్ని ఓట్లు అదనంగా రావచ్చుగాని తగిన నిర్మాణం లేకుండా మనం నిర్ణయాత్మక శక్తిగా విజయం సాధించలేము.

అయితే యిక్కడ ఒక విషయం గమనించాలి. ఆ సమయంలో శత్రువులు చేయని దుష్ప్రచారం అంటూ లేదు. వ్యక్తిగత నిందలకు కూడా పాల్పడ్డారు. సరే బూర్జువా వర్గాల ప్రచారమే ఆ తీరుగా వుంటుంది. పురోగామిగా భావింపబడుతున్న నార్లవెంకటేశ్వరరావు లాంటి వాళ్ళు, ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక మనకు వ్యతిరేకంగా చాలా ఘోరంగా రాశాయి. ఎవరేమి మాట్లాడినా ఒక నిర్దిష్టమైన సమస్య వచ్చేటప్పటికి ఎవరెక్కడ నిలబడతారో స్పష్టమయింది. ఏది ఏమైనా ప్రజానీకం ఆ దుష్ప్రచారాన్ని నమ్మలేదు. మనపై ఎంతో విశ్వాసం వుంచారుగనుకనే మూడవ వంతు ఓట్లు పొందగలిగాం. ఈ ఓటమిని సరీగా అంచనా వేసుకొని, యీ ప్రజానీకాన్ని రాజకీయంగా అభివృద్ధి పరుచుకోవడం, మన పార్టీ నిర్మాణాన్ని పెంచుకోవడం - యిది కష్టమైనప్పటికీ మన ప్రధాన కర్తవ్యం.

నేను గన్నవరం ఎంచుకోవడం కూడా ఒక ప్రత్యేకమైన కారణం వుంది. మన ఉద్యమానికి అప్పుడది చాలా బలమైన కేంద్రం. పార్టీ రహస్యంగా వున్న సమయంలో ఆ ప్రాంతం ఉద్యమాన్ని ఎంతగానో ఆదుకున్నందువల్ల మన పార్టీకి చాలా విస్తృతంగా, గ్రామ గ్రామానికి బలమైన సంబంధాలు వున్నాయి. పోరాట కాలంలో ఆ ప్రాంతంలో ఎక్కువ మంది కామ్రేడ్స్ చిత్రహింసలకు గురయ్యారు, కాల్చి చంపబడ్డారు. 1945లో జరిగిన ఎన్నికల్లో నేనూ, కాట్రగడ్డ నారాయణరావు పశ్చిమ కృష్ణా నియోజకవర్గం అంతా సుపరిచితమే. అందులో గన్నవరం కూడా ఒక భాగం. మనకు బలమైన ఉద్యమం వున్నచోట నేను పోటీ చేసేటట్లయితే

కేవలం ఆ నియోజకవర్గానికే పరిమితమై వుండాల్సిన అవసరంలేదని, రాష్ట్రం యావత్తూ నేను ప్రచారం కోసం పర్యటించవచ్చునని భావించి పార్టీ నిర్ణయించింది. అయినా కేవలం 800 ఓట్లుతోనే గెలిచాను.

ఆ ఎన్నికల్లో నేను రాష్ట్రంలో మన పార్టీ అభ్యర్థులు నిలబడుతున్న నియోజకవర్గాలన్నీ దాదాపు పర్యటించాను. మన ఢిల్లీలో పార్టీ కేంద్ర కార్యాలయం జీపుకు కామ్రేడ్ గురుదయాళ్ అనే డ్రైవరుండేవాడు. సూర్జిత్ బంధువు కూడా. చాలా నమ్మకమైన కామ్రేడ్. ఈ మొత్తం ఎన్నికల్లో ఆయనే నా కారు డ్రైవరు. పంజాబ్ నుండి ఒక 5, 6 జీపులు డ్రైవర్లతో సహా ఎన్నికల కోసం వచ్చాయి. అలాగే తమిళనాడు, కేరళ నుండి, కేరళ వాళ్ళ సహాయం ప్రత్యేకించి చెప్పుకోవాలి. ఆంధ్రలో ఏదో గొప్ప సంఘటన జరగబోతున్నదని దేశ వ్యాప్తంగా అందరూ భావించారు. కాని మనం బాగా ఓడిపోయాం. బసవపున్నయ్య కూడా రేపల్లె నియోజకవర్గంలో పది వేల ఓట్ల తేడాతో ఓడిపోయాడు. రాజేశ్వరరావు అంతకుముందు 1952లో గెలిచిన నియోజకవర్గంలోనే ఓడిపోయాడు. అయితే అంతకుముందు ఎప్పుడో ఎన్నికల సభలో 'నేను గనుక ఓడిపోతే గాడిద మీద ఊరేగుతా"నని అన్నాడట. తీరా ఓడిపోయాడు. ఆ తర్వాత కాంగ్రెసు వాళ్ళు అందరూ "రా వచ్చి గాడిద నెక్కు" అంటూ అపహాస్యం చేశారు. రాజేశ్వరరావు అన్నాడని కాదు, అప్పటి వాతావరణమే అలా వుంది.

ఎన్నికలు జరగబోతుండగా వెలగపూడి రామకృష్ణ కొంత మంది కాంగ్రెస్ వాళ్ళను పోగేసి ఈ ఎన్నికల్లో మన మధ్య వున్న తగాదాలన్నింటిని పక్కకు నెట్టి మనమంతా ఐక్యంగా కృషి చేయాలి. అట్లా అయితేనే గెలవగలం. లేకపోతే కమ్యూనిస్టులు మనల్ని తుడిచి పెట్టేస్తారు అని చెప్తుండగా స్వయంగా విన్నాను. కాంగ్రెస్ కూడా ఆ ఎన్నికల్ని జీవన్మరణ సమస్యగా తీసుకుంది. కేవలం మన మీద దుష్ప్రచారాలకే అవి పరిమితం కాలేదు. భూస్వాములు మనకు వ్యతిరేకంగా తమకు అందుబాటులో వున్న అన్ని పద్ధతులూ వుపయోగించారు. భూస్వాముల ఇళ్ళల్లోని స్త్రీలు ఎన్నడూ బయటకు రానివారు ఇంటింటికీ తిరిగి చీరలు పంచారు. కాంగ్రెస్ వారు తాము గెలుస్తామని చెబుతున్నారు గాని, ఇంత పెద్ద మెజారిటీ వస్తుందని భావింపలేదు. ఎన్నికల ఫలితాలు వాళ్ళను కూడా ఆశ్చర్యంలో ముంచెత్తాయి. ఎన్నికల విధానం అలాంటిది. దామాషా పద్ధతిన ఎన్నికలు జరిగినట్లయితే మనమంత ఘోరంగా ఓడిపోయేవాళ్ళంకాదు. అసెంబ్లీలో 15 మందితో ఎన్నికయిన మన గ్రూపుకు నాయకుడిగా వ్యవహరించేందుకు నేను రాజ్యసభకు రాజీనామా ఇచ్చి ఆంధ్ర అసెంబ్లీలో వుండాలని నిర్ణయమైంది. పి.వి.జి. రాజుగారి ప్రజాసోషలిస్టు పార్టీకి 14 సీట్లు వచ్చాయి. విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో ఆ కుటుంబానికి వున్న పట్టు అలాంటిది. ప్రజాతంత్ర ఉద్యమం పెరిగితే తప్ప స్థానికంగా పలుకుబడిగల వ్యక్తికి ఓట్లేసే పద్ధతి పోదు. అందుకే ఏంగిల్స్ అన్నాడు. ఎన్నికలు ప్రజాచైతన్యానికి గీటురాళ్ళు అని. అంతేగాని ఎన్నికలే అన్నింటినీ నిర్ణయించవు.

ఈ 1955 ఆంధ్ర ఎన్నికలు భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ఒక ప్రత్యేకతను సంతరించుకున్నాయి. 1948-51 పోరాటం తరువాత 1952 ఎన్నికల్లో మన విజయం



పార్టీ పురోగమనానికి ఎంత ప్రాధాన్యతను కలిగి వుందో, 1955లో మన ఓటమి ఆ తరువాత పార్టీలో అంతర్గత విభేదాలు, అవి పెరిగి పెద్దవడంలో అంతటి ప్రాధాన్యతనూ కలిగి వుంది. ఈ ఓటమే విభేదాలలో నిర్ణయాత్మకమైనదని చెప్పలేము. కాని ప్రధానమైనది. అసలు మనం ఒంటరిగానే పోటీ చేయాలనే నిర్ణయానికి కూడా అంతకుముందు పార్టీలో జరిగిన చర్చలు, మన అనుభవము ముఖ్యపాత్ర వహించాయి. నాకు గుర్తున్నంత వరకు తిరువాన్కూర్ - కొచ్చిన్‌లో మనతో కలిసి పోటీ చేసిన పి.ఎస్.పి. ఆ తరువాత కాంగ్రెస్‌తో కలిసి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసింది. ఆంధ్రలో కూడా కె.ఎం.పి. కె.ఎల్.పి.లు కాంగ్రెస్‌తో కలిశాయి. కనుక ఈ ఊగిసలాడే శక్తులతో మనకు అవసరంలేదని వాటిని నమ్మజాలం అని మనంతట మనమే ఒంటరిగా పోరాడాలని నిర్ణయానికి వచ్చాం. పార్టీ విధానాలు రూపొందించుకునే సందర్భంలో, అంతర్గత విభేదాలు చర్చించుకునే సందర్భంలో, పార్టీ విప్లవ కార్యక్రమాన్ని తయారు చేసుకొనే సందర్భంలో తెలంగాణా పోరాట అనుభవాలు, 1952-55 ఎన్నికలు ప్రధాన పాత్ర వహిస్తాయి. వీటిల్లో ఒక కీలకమైన స్థానంలో వున్న నాకు సహజంగానే కేంద్ర కమిటీ నిర్ణయాల రూపకల్పనలో ఒక ముఖ్యమైన పాత్ర వుంది.

ఎన్నికల ఫలితాల విషయంపై మీ అభిప్రాయం ఏమిటి? అని నన్ను బొంబాయిలో కొందరు కామ్రేడ్స్ అడిగారు. అంతకుముందే నిర్ణయించుకున్న కార్యక్రమం ప్రకారం ఫలితాలు వచ్చే సమయానికి నేను బొంబాయిలో వున్నాను. "ఏముంది? మా అంచనాలు పొరపాటైనాయి. ఎందుకు, ఎట్లా జరిగిందో అధ్యయనం చేయాలి" అన్నాను. ఎన్నికలలో బ్యాలెట్ బాక్సులు తారుమారు చేయడం రిగ్గింగ్‌కు పాల్పడడం అక్కడక్కడ జరిగినా, బెంగాల్‌లో 1972లో జరిగినట్లు జరగలేదనే చెప్పాలి. చాలా దౌర్భాగ్యమైన దుష్ప్రచారానికి, ఓటర్లను మభ్యపెట్టడానికి, ఓటరుకు లంచాలివ్వడానికి బూర్జువా వర్గం తన సహజమైన ధోరణితో వ్యవహరించింది. ఎన్నికల ప్రచారం తుది ఘట్టం వచ్చేసరికి తాము గెలుస్తామన్న విశ్వాసం వారికి కలిగింది. అయితే యింత మెజారిటీలు వస్తాయనిగానీ, ఇన్ని నియోజకవర్గాలలో గెలుస్తామనిగానీ వారు కూడా భావించలేదు. తర్వాత కేంద్ర కమిటీలో ఈ ఎన్నికల సమీక్ష జరిగింది. ఓటమిపై ఎవరికి తోచిన అభిప్రాయాలు వాళ్ళు చెప్పారు. చర్చలెలా జరిగాయి? సమీక్షలో వచ్చిన అంశాలేమిటి? అన్నవి నాటి కేంద్ర కమిటీ రికార్డు చూస్తే తెలుస్తుంది. కానీ ఒక్క విషయం గుర్తుంది. 'శాంతి' ప్రచారం సరిగా చేయకపోబట్టి ఓడిపోయామని కేంద్ర కమిటీ తీసిన గుణపాఠాల్లో ఒకటి. 'కొంత చేశాము. అయినా ఇక్కడ ఎన్నికలకు శాంతి ప్రచారానికి సంబంధం ఏమిటి?' అని నేను అడిగాను. ఇలా పొరపాటు గుణపాఠాలను కూడా కేంద్ర కమిటీ తీసింది. ఆంధ్ర కామ్రేడ్స్ ఎవరూ 'శాంతి ప్రచారలోపం' కారణాన్ని అంగీకరించలేదు. అలాంటి పాఠాలు తీయడమంటే భౌతిక, వాస్తవిక పరిస్థితిని సరిగా అంచనా వేయకుండా స్వీయ మానసిక

దృక్పథంతో, యాంత్రికంగా నిర్ణయాలకు రావడమే. పరిస్థితిని మనకు అనుకూలంగా అతిగా అంచనా వేశామనీ, ఐక్య సంఘటన ఎత్తుగడలను సరిగా అనుమతించలేదని చెప్పడంలో అర్థం వుంది. కానీ శాంతి ప్రచారం ప్రసక్తి ఏమిటి?

ఆంధ్ర శాసనసభలో ఏం చేశాము, నా పాత్ర ఏమిటి – ఇలాంటి విషయాల వివరాల్లోకి వెళ్ళదలుచుకోలేదు. ముఖ్యమంత్రి గోపాలరెడ్డి అనుకుంటాను. సంజీవరెడ్డి ఉప ముఖ్యమంత్రి. ప్రకాశంగారు ఆరోగ్య కారణాలవల్ల అనుకుంటాను మంత్రి వర్గంలో లేరు. పరస్పర గౌరవం నాకూ, వారికి వుండేది కానీ ప్రత్యేక అభిమానం, అప్యాయతలు వున్నాయని చెప్పలేను. రాజకీయాల్లో ప్రవేశించిన వారిని రాజకీయంగా ఎదుర్కోవడమే నా పని కదా. ఆంధ్ర శాసనసభలో వుండి మేము తెలంగాణాను కూడా కలిపి విశాలాంధ్ర కావాలని కృషి చేశాం. ఈ విషయంలో నాకు లోతైన అవగాహన, అధ్యయనం వున్నాయి. కళా వెంకట్రావు నాతో అంటుండేవారు "మన రాష్ట్ర చరిత్ర, భూగోళం, వనరులు – వీటికి సంబంధించి ప్రభుత్వం కన్నా ఎక్కువే నీకు తెలుసు" అని. ఈ విశాలాంధ్ర విషయంలో తెలంగాణా కామ్రేడ్స్ పాత్ర కూడా వుంది. ఆంధ్రలోనూ, తెలంగాణాలోనూ వున్న కమ్యూనిస్టులు తీసుకున్న సూత్రబద్ధవైఖరి, విశాలాంధ్రకై వారి కృషి లేకపోయినట్లయితే, తెలంగాణాను ప్రత్యేక రాష్ట్రంగానే వుంచేవారని కూడా చెప్పవచ్చు.

నెహ్రూగారు ప్రత్యేక తెలంగాణా రాష్ట్రానికి అనుకూలం. 1950 ఆరంభంలో వచ్చిన విభేదాల మూలంగా, తెలంగాణాకు పార్టీలో ప్రత్యేక రాష్ట్ర కమిటీ వుండాలని తెలంగాణా కామ్రేడ్స్ కోరినమాట నిజమే. కానీ తెలంగాణా, ఆంధ్ర కలిపిన విశాలాంధ్ర రాష్ట్రం కావాలని కూడా వారు గట్టిగా కృషి చేశారు. అందరం తెలుగు భాష మాట్లాడే వాళ్ళమే అని కాదు. జాతీయభావం ఏర్పాటుకు అదొక్కటే సరిపోదు. భాష, ఆర్థిక స్థితి, తదితర అంశాలుంటాయి. ఏమైనా కమ్యూనిస్టు ఉద్యమ ఫలితంగా అలా విశాలాంధ్ర కావాలన్న ఆకాంక్ష గాఢంగా ఏర్పడింది. కాంగ్రెస్‌లో కూడా ఇలాంటి సెంటిమెంటు వుంది. గోవిందవల్లభవంత్ ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ అవతరణకు సిద్ధపడ్డారు. శ్రామిక వర్గం బలోపేతమైతే తప్ప, "తెలుగుజాతి" విచ్ఛిన్నానికి బూర్జువావర్గం ప్రయత్నించే అవకాశం, ఆ ప్రమాదం వుంటూనే వుంటుంది.

శాసనసభలో మా కృషి చాలా పకడ్బందీగా వుండేది. ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించేవాళ్ళం. లొసుగులు బహిర్గతం చేసేవాళ్ళం. నిర్మాణాత్మక సూచనలు, సలహాలు ఇచ్చేవాళ్ళం. అసెంబ్లీ కార్యదర్శి ఎ.వి. చౌదరి. ఆయన అంటుండేవారు, ఈ శాసనసభ మొత్తంలో క్షుణ్ణంగా, లోతుగా, ఏ అంశంపై నైనా అధ్యయనం చేసేది పి. సుందరయ్య అని. వివిధ సందర్భాలలో సలహాకై ప్రభుత్వ వున్నతాధికారులు వచ్చేవారు. మన వాదనను



కాదనగలిగేవాళ్ళు కాదు. సరైనదే అని వాళ్ళకు తెలిసినా, ప్రభుత్వ వాదనను బలపరచక తప్పేది కాదు. ఏమైనా బయట వుద్యమం బలంగా లేకుండా శాసనసభలో చేయగలిగింది తక్కువ. శాసనసభను బయట వుద్యమం బలపడేందుకు వినియోగించుకోవాలి.

ఒకసారి గోవింద వల్లభవంత్ ఆర్.ఎస్.ఎస్.పట్ల ఉదాసీన వైఖరి అవలంబించాడని మహాత్మాగాంధీ హత్యకు అందువల్ల ఆస్కారం ఏర్పడిందని నేనేదో సందర్భంలో అన్నాను. సంజీవరెడ్డికి కోపం వచ్చింది. "మీ పార్టీ మాదిరి చచ్చిపోయిన నాయకులపై ధ్వజమెత్తే సాంప్రదాయం మంచిదికాదని" అన్నారు. దాంతో గందరగోళం. రొక్కం నరసింహమూర్తి స్పీకర్. ఆయన నింపాదిగా వ్యవహరించి, సక్రమంగా సభలో చర్చసాగేట్లు చూసేవాడు. ఆయన జోక్యం చేసుకున్నాడు పొగాకుపై పన్ను విషయం, ఆంధ్రపట్ల కేంద్రం నిర్లక్ష్యం, వివిధ రకాల పన్నులు, నీటి వనరులు – వీటిపై సక్రమంగా అధ్యయనం చేసి చర్చ జరిపేవాళ్ళం. ఏమైనా కేవలం 15 మంది మాత్రమే వున్నాము కదా. బలమైన ప్రతిపక్షం కింద లెక్కకాదు. సంజీవరెడ్డి కూడా చాలా సందర్భాల్లో మాట్లాడేటప్పుడు మా వాదనలలో వాస్తవం వుందని అంగీకరించేవాడు. తమ వర్గ ప్రయోజనాల సంగతి అటుంచినా, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, తమ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తాము సమర్థించక తప్పేదికాదు. ఆ రోజుల్లో ఆంధ్ర శాసనసభలో నేను పార్టీ తరపున నాయకుణ్ణి. పిల్లలమర్రి వెంకటేశ్వర్లు ఉపనాయకుడు.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత తెలంగాణాకు సంబంధించిన మన శాసనసభ్యులు కూడా మాతో కలిశారు. అయితే వారు పి.డి.ఎఫ్. (పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్) పేరు మీద ఎన్నికయినవారు. కనుక ఆ పేరుతోనే ఆంధ్రప్రదేశ్ శాసనసభలో కూడా వ్యవహరిస్తామని వారి వాదన. కాని 1952 ఎన్నికల నాటికి తెలంగాణాలో మన పార్టీ లీగల్‌గాలేదు గనుక పి.డి.ఎఫ్. పేరుతో పోటీ చేయవలసి వచ్చింది. బహిరంగంగా గుర్తించబడిన తరువాత కూడా ఆ పేరుననే సాగడంలో అర్థంలేదు. కమ్యూనిస్టు పార్టీ పేరును వెనక్కినెట్టి పి.డి.ఎఫ్. పేరుతో కొనసాగాలన్నది సైద్ధాంతికంగా సరైనదికాదు. కనుక కమ్యూనిస్టు పార్టీగానే కొనసాగాలన్నది సైద్ధాంతికంగా సరైనదికాదు. కనుక కమ్యూనిస్టు పార్టీగానే కొనసాగాలన్నది మా వాదన. ఇదిలా వుండగా వారొక 40 మంది దాకా శాసనసభ్యులు ఎన్నికైనారు. ఆంధ్రప్రాంతం నుండి మేము 15 మందిమి మొత్తం ఈ గ్రూపుకు నాయకుడు ఎవరన్నది చర్చ. తెలంగాణా ప్రాంతం శాసనసభ్యులు నన్నే నాయకునిగా వుండమన్నారు. పి.డి.ఎఫ్. పేరు మీద నాయకుడిగా ఉండేందుకు నేనంగీకరించలేదు. రాజీగా ఒక ప్రతివాదన పెట్టాను. కమ్యూనిస్టు, పి.డి.ఎఫ్. కంబైన్డ్ ఫ్రంట్ అని పేరుపెడదామని, అప్పుడు నేను నాయకుడుగా వుంటానని, అందుకు వారంగీకరించలేదు.

నిజానికి అసలు పి.డి.ఎఫ్. అన్నది ఒక రాజకీయ పార్టీ కాదు కదా. అది ఒక ఐక్యసంఘటన పేరు. ఈ సమస్య మొత్తం ఒక ఐదు నెలలకు సంబంధించిన సమస్య. ఆంధ్రప్రదేశ్ అవతరణకు ముందు 1957లో జరగవలసిన సాధారణ ఎన్నికలు ఆంధ్రలో జరగవన్నది ఒక షరతు. కాంగ్రెస్‌కు ఆంధ్ర ప్రాంతంలో బాగా మెజారిటీ వుంది గనుక వారాషరతు విధించారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడడమన్నది ఈ ఎన్నికలకన్నా ప్రధానమైనది. కనుక మేము అంగీకరించాం. అంటే 1956 నవంబరు 1 నుంచి 1957 మార్చి వరకు అంటే మార్చిలో తెలంగాణా ప్రాంతానికి ఎన్నికలు జరగనున్నాయి. కనుక ఇది ఐదు నెలల సమస్య.

రావి నారాయణరెడ్డి పార్లమెంటులో వున్నాడు. అసెంబ్లీల లేదు. బద్దం ఎల్లారెడ్డి కూడా శాసనసభలో లేదు. దేవులపల్లి వెంకటేశ్వరరావు బై ఎలక్షన్లో ఓడిపోయాడు. అన్నట్టు యీ బై ఎలక్షన్ సందర్భంగా ఒక సంఘటన గుర్తుకు వస్తోంది. నిడమానూరు నియోజక వర్గంలో బై ఎలక్షన్‌లో మనం దేవులపల్లి వెంకటేశ్వరరావును అభ్యర్థిగా నిలబెట్టాం. ఆ సందర్భంగా ఎన్నికల ముందు రోజు నేను నిడమానూరులో వున్నాను. బాగా ఘర్షణలు జరిగే వాతావరణం వుంది. ఒక పోలింగ్‌బూత్ వద్ద అవసరమని మా వద్ద వున్న పాతిక మంది వాలంటీర్లను పంపాం. మరో అరగంటలో పొనుగోడు నుండి యింకో వాలంటీరు దళం మాకు రక్షణగా రావలసి వుంది. ఈ మధ్యకాలంలో కాంగ్రెస్ గూండాలు ఒక 50 మంది దాకా మా క్యాంపు మీద దాడి చేశారు. నేను, రావి నారాయణరెడ్డి, మందపాటి నాగిరెడ్డి, ఒక ఐదారుగురం మాత్రమే వున్నాం. మేము వున్నామని తెలిసి, కావాలనే ఒక పథకం ప్రకారం వాళ్ళు దాడి చేశారు. ఆ దాడిలో మాకు దెబ్బలు తగిలాయి. నా కాలి ఎముక విరిగింది. ఆ ఉప ఎన్నికలో మనం ఓడిపోయాం. రావి నారాయణరెడ్డి 1952లో పార్లమెంటుకు, అసెంబ్లీకి రెంటికీ ఎన్నికయ్యాడు. ఆయన పార్లమెంటులోనే ఉండాలి అని నిర్ణయమైనందువల్ల శాసనసభా నియోజకవర్గానికి తిరిగి ఉప ఎన్నిక అవసరమైంది. దాంట్లోనూ ఓడిపోయాం.

ఆ పరిస్థితిలో వి.డి. దేశ్‌పాండేను ఉపనాయకుడిగా వారు సూచించారు. దేశ్‌పాండే మరట్వాడాలో నాందేడ్ ప్రాంతానికి చెందినవాడు. ఆయనను జనగాం నియోజకవర్గంలో నిలబెట్టి గెలుచుకున్నాం. 1952 ఎన్నికల్లో పరిస్థితి అది. అభ్యర్థి ఎవరు అన్నది ప్రశ్నకాదు. పి.డి.ఎఫ్. అవునా? కాదా? ఆయన ఒక ముఖ్యమైన మరట్వాడా నాయకుడు. ఆయన శాసనసభ్యుడు కావాలి? మా అభ్యంతరం తెలంగాణా పోరాటాన్ని వ్యతిరేకించిన వారిలో వారొకరు అన్నదే తప్ప మరట్వాడా ప్రాంతం వాడన్నది కానేకాదు. శాసనసభ నవంబరు 1, 2 రెండు రోజులు రాత్రివేళ సమావేశమైంది. ఆ ఐదు నెలల్లో మళ్ళీ సమావేశం కాలేదు. స్పీకర్‌గా ఎన్నికైన అయ్యదేవర కాళేశ్వరరావును సాంప్రదాయ ప్రకారం స్పీకర్ కుర్చీలో కూర్చోబెట్టేందుకు ప్రతిపక్ష నాయకులు కూడా మర్యాద పూర్వకంగా అనుసరించాలి. నేను ఆ సమావేశానికి హాజరుకాలేదు. ఉపనాయకుడు దేశ్‌పాండే ఆ పని చేశాడు.



సమావేశం జరగబోయే ముందు రోజే నేను నా చైనా పర్యటన ముగించుకొని తిరిగి వచ్చాను. హాజరవదలచుకుంటే తగిన వ్యవధి వుంది. కాని కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా అయితేనే హాజరవదలచుకున్నానుగాని, ఈ వివాదం తేలకుండా హాజరవదలచుకోలేదు. 1955 నుండి 1967 వరకు మొదటి రెండేళ్ళు ఆంధ్ర శాసనసభలోనూ, ఆ తరువాత ఆంధ్రప్రదేశ్ శాసనసభలోనూ నేను వున్నాను. 1962లో గన్నవరం నుంచి 5 వేల మెజారిటీతో తిరిగి ఎన్నికయ్యాను. 1967లో పోటీ చేయలేదు. మార్క్సిస్టు పార్టీ ఏర్పడింది. దానికి నేను అఖిలభారత ప్రధాన కార్యదర్శిగా 1964 నుండి 1976 వరకు కొనసాగడం తెలిసిన విషయమే. అఖిలభారత ప్రధాన కార్యదర్శిగా వుంటూ, ఆంధ్ర శాసనసభకు తిరిగి నిలబడటం అన్నది సరైన పద్ధతికాదని భావించి 1967లో నిలబడలేదు.

అసెంబ్లీలో మనం ఏ యే సమస్యల మీద ప్రధానంగా చర్చించామో, అందులో నా పాత్ర ఏమిటి – ఇవన్నీ ప్రత్యేకంగా ఆ రోజుల్లో అసెంబ్లీ రికార్డులు చూస్తే దొరుకుతాయి. ఒకటి మాత్రం చెప్పగలం. బయట వున్న ప్రజా వుద్యమాన్ని ప్రతిబింబించేందుకు అసెంబ్లీ వేదికను వాడుకోవాలని, అసెంబ్లీ వేదిక ఆధారంగా బయట ప్రజా వుద్యమాన్ని పెంపొందించాలని మా ధ్యేయం. ఎంతవరకు చేయగలిగామన్నది పరిశీలించాలి. 1967లో శాసనసభా కాలం ముగియటానికి కొద్ది నెలలు ముందుగా, అప్పుడు జరుగుతున్న విశాఖ ఉద్యమానికి అండగా కమ్యూనిస్టు శాసనసభ్యులందరూ రాజీనామా యివ్వాలన్న ఆంధ్రప్రదేశ్ కమిటీ నిర్ణయానికి అనుగుణంగా నేను శాసనసభా సభ్యత్వానికి రాజీనామా యిచ్చాను. 1962–64 కాలంలో జైల్లో వున్నాను.

ఈ కాలంలో పార్టీ నిర్మాణంలో, అభివృద్ధిలో నా పాత్ర ఏమిటన్నది ప్రధాన ప్రశ్న. తెలంగాణా పోరాటం గూర్చి స్టాలిన్‌తో చర్చించిన తర్వాత అది ఒక విముక్తి పోరాటం కాదని, పాక్షిక సాయుధ పోరాటమేనని, ఏదో విధంగా రాజీపడక తప్పదనే నిర్ణయానికి వచ్చి పోరాట విరమణ జరిగిన విషయం తెలిసిందే. 1953లో కేంద్ర స్థాయిలో కార్యదర్శిగా అజయ్‌ఘోష్ ఎన్నికయ్యారు. దానర్థం పార్టీ మొత్తంగా ఐక్యం అయిందని కాదు. తెలంగాణాకు రాష్ట్ర కమిటీ వేరుగా, ఆంధ్ర ప్రాంతానికి రాష్ట్ర కమిటీ వేరుగా వుండాలన్న వాదన. అది మంచిది కాదు. రెంటికీ కలిపి ఒకటే కమిటీ అవసరం అన్నది మా వాదన, దానికి కేంద్ర నాయకత్వం అంగీకరించకపోవడం – రెంటికీ కలిపి ఒక సమన్వయ కమిటీని వేయడం యింతకుముందే ప్రస్తావించాను. ఈ విషయం మేము అంగీకరించకపోయినా పై పార్టీ చెప్పిందిగనుక అమలు జరిపాం. ఈ కమిటీలో రాజేశ్వరరావు, చండ్రం నాపైనా, బసవపున్నయ్యపైనా ఎప్పుడూ విమర్శలు సాగిస్తూనే వుండేవారు. మేము బహిరంగంగా పని చేస్తున్నా లీగల్‌గా వున్న కామ్రేడ్స్‌కన్నా రహస్య జీవితం గడుపుతున్న కామ్రేడ్స్‌పైనే ఎక్కువ మొగ్గు చూపుతున్నామన్నది

వారి నింద. దీనికి కారణం ఏమంటే, కమిటీలన్నింటినీ లీగల్ కామ్రేడ్స్‌తో నింపాలన్నది వారి ప్రయత్నం. లీగల్‌గా వున్న కామ్రేడ్స్ కమిటీలో వుండరాదని కాదు. కాని మొత్తంగా వారితో నింపేయడం సరికాదని, పార్టీకి విశ్వాసపాత్రులైన, తగిన సామర్థ్యంగల రహస్య జీవితం గడుపుతున్న కామ్రేడ్స్‌కు కూడా తగు ప్రాధాన్యత యివ్వాలన్నది మా వాదన.

అందుకు తెలంగాణాకు రెండు విడివిడి కమిటీలుండాలా, ఒకే కమిటీ వుండాలా? అన్న ప్రశ్నకు, అంతర్గత చర్చల సరళికి సంబంధం వుంది. పోరాట విరమణ జరిగింది. ఆ దశలో భూస్వాములు తమ గూండాలతో మనపై దాడులు సాగిస్తున్నారు. వారిని ఎలా రక్షించుకోవాలి. ఆంధ్ర కమిటీ సంపూర్తిగా ఆ విషయంలో భాగస్వామ్యం కాకుండా అసాధ్యం అవుతుంది. పైగా రహస్యంగా వున్న కామ్రేడ్స్‌కు ఒక్క తెలంగాణా కమిటీ నాయకత్వం తమకు తగిన విధంగా రక్షణ కల్పిస్తుందన్న సంపూర్ణ విశ్వాసంలేదు. ఈ పోరాటాన్ని తప్పనీ, నిర్వహించిన మేము అందరం ఒంటెత్తు పోకడపోయామనీ నిందిస్తున్నవారు, తమ రక్షణ కొరకు సర్వశక్తులు ఒడ్డి కృషి చేస్తారని సహజంగానే వారు విశ్వసించలేదు. రక్షణ కల్పించడమంటే వారిపై వున్న కేసులు, తదితర కుటుంబ వ్యవహారాలు చూస్తేనే సరిపోదు. అవతల భూస్వామ్య గూండాలు దాడి చేస్తున్నారు. ఆ దాడి నుండి ఆత్మరక్షణ చేసుకోగల కనీస నిర్మాణం అన్నా ఉండాలా? వద్దా? వారి విషయమై ఏవో సంభాషణలు, రిప్రజెంటేషన్‌లు చేస్తూ వుంటే సరిపోతుందా? వారికి ఆత్మరక్షణకు అవకాశం లేకుండాపోతే వారు జీవించి వుండగలరా? అసలు ఉద్యమమే నీరుకారిపోదా – యిలాంటి ప్రశ్నలన్నీ వున్నాయి.

ఉదాహరణకు మానుకోట ప్రాంతంలో ఒకటి కాదు, రెండు కాదు, మూడుకాదు, నాలుగైదుసార్లు సామాన్య ప్రజానీకాన్ని చావబాదారు. పార్టీ అంటే ఎంతగా అభిమానం ఉన్నా ప్రజలు ఎంత కాలం దెబ్బలు భరించగలరు? మనమేమి ప్రతిఘటన ఇవ్వని పరిస్థితుల్లో వారు మనల్ని విడిచిపోయినా ఇంకా కొందరు కాంగ్రెస్‌లో చేరినా ఆశ్చర్యపడనక్కర్లేదు. మరీ ప్రధానమైన అంశం, మనం పంచిన భూముల్ని తిరిగి భూస్వాములు స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. బాహాటంగా దాడులు, దౌర్జన్యాలు జరిపి మాత్రమే కాదు. తమ భూముల్ని పేదల్లోనే కొందరికి తక్కువ ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఇందువల్ల పేదల్లో ఐక్యత నిలపడం కూడా కష్టం అవుతుంది.

భూస్వాములు, వారి గూండాలను ఎదుర్కోవడం పెద్ద సమస్యకాదు. భూములు కొనుకున్న పేదలు కూడా భూస్వాములతో చేరితే పంచిన భూముల్ని నిలుపు కోవడం చాలా గడ్డు సమస్య అవుతుంది. కనుక భూస్వాములు గూండాయిజాన్ని ఎదుర్కొంటూ, గ్రామీణ పేదల్లో చీలిక రాకుండా ఐక్యత నెలకొల్పాలి. ప్రజానీకం మొత్తాన్ని భూస్వాములకు వ్యతిరేకంగా



నిలుపగలగాలి. ఇవన్నీ పార్టీలో అంతర్గత చర్చనీయాంశాలు అయినాయి. కేవలం రిప్రజెంటేషన్‌కు పరిమితమైతే రహస్యంగా జీవిస్తున్న కామ్రేడ్స్‌ను గాని, ఉద్యమాన్నిగాని రక్షించలేము. అలాగే ఆనాటి పరిస్థితులలో కేవలం ఎదురు తిరిగి పోరాటం మాత్రమే చేసి రక్షించుకొనలేము. అంటే విశాలాంధ్రపట్ల అవగాహనలోను, రహస్యంగా జీవిస్తున్న కామ్రేడ్స్‌ను రక్షించుకునే విషయంలోనూ మొత్తంగానే ఉద్యమింపచేయడంపట్ల, నిలబెట్టుకోవడంపట్ల విభేదాలు కమిటీలో ఏర్పడినాయి. కేంద్ర కమిటీ చర్చల్లో కామ్రేడ్ రాజేశ్వరరావు మేము (నేను, బసవపున్నయ్య, హనుమంతరావు) తీసుకున్న విధానానికి వ్యతిరేకంగా ఉండేవాడు. ఆంధ్రకు సంబంధించిన సమస్యల్లోనే కాదు. జాతీయంగా వచ్చిన సమస్యలు, అంతర్జాతీయంగా వచ్చిన సమస్యలు – వీటన్నింటా ఆయన, చంద్రం అదే వైఖరి అవలంభించారు.

# మార్క్సిస్టు పార్టీ ఆవిర్భావం

1948 రాజకీయ ప్రకటనలో బూర్జువా వర్గం మొత్తం అధికారంలో వుందని పేర్కొన్నాం. 1952 కార్యక్రమంలో మళ్ళీ ఈ కొసకు వచ్చి ఇది నిజమైన స్వాతంత్ర్యం కాదని, ఎవరో కొందరు వ్యక్తులు తప్ప పెట్టుబడిదారీ వర్గం మొత్తంగా సామ్రాజ్యవాదంతో ఘర్షణలో వుందని, కనుక సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటమే ఇంకా కొనసాగుతూ వున్నదని నిర్ధారించాము. అది తప్పు. సామ్రాజ్యవాదులపట్టు పూర్తిగా తొలగని మాట వాస్తవమే అయినా, ఇక్కడ వున్న పెద్ద పెట్టుబడిదారీ వర్గమే రాజ్యాంగ యంత్రం మీద ఆధిపత్యంలో వుంది. ఆ విషయానికనుకూలంగా మార్క్సిస్టు పార్టీ కార్యక్రమంలో సవరించుకున్నాం.

ఇక విదేశాంగ విధానం గురించి : రెండు శిబిరాల మధ్య దాగుడుమూతలు ఆడుతున్న విదేశాంగ విధానం మనదని, నికరమైన శాంతి విధానం కోసం పోరాడాలని సాధారణంగా అందరం అంగీకరించాం. సాధారణ సూత్రీకరణ వేరు. దాన్ని ఆచరణలో అమలును గమనించడం వేరు. అక్కడ కూడా బ్రిటీషు సామ్రాజ్యవాదం, అమెరికన్ సామ్రాజ్యవాదం ఏది మనకు ప్రధాన శత్రువు అన్న దాంట్లో కూడా విభేదాలున్నాయి. బ్రిటిషు సామ్రాజ్యవాదం నుండి విముక్తి పొందినప్పటికీ ఇంకా బ్రిటీషు సామ్రాజ్యవాదమే బలంగా వుంది. గనుక అదే మనకు ప్రధాన శత్రువు. అని యాంత్రికంగా కొందరు వాదిస్తే, అమెరికన్ సామ్రాజ్యవాదమే ప్రధాన శత్రువని పెరుగుతున్న ఆ ప్రమాదాన్ని గుర్తించండని కొందరు వాదించారు. ఏది ఏమైనా శాంతి కోసం అలీన విధానం కోసం పాటుపడుతున్న భారత ప్రభుత్వం అభివృద్ధికరమైన విదేశాంగ విధానాన్ని అవలంభిస్తున్నదని అభివృద్ధికర విదేశాంగ విధానమన్నది అభివృద్ధి నిరోధక ప్రభుత్వం అమలుపరచలేదు. గనుక అది అభివృద్ధికర ప్రభుత్వమేనని, కాకపోతే కొన్ని అభివృద్ధి నిరోధక ఒత్తిడిలు దానిపై వుంటున్నాయనీ కనుక ఈ ప్రభుత్వ విధానాన్ని బలపరచాలన్న వాదన వారు చేశారు. నెహ్రూ ప్రభుత్వం అనుసరిస్తున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని వినియోగించుకోవాలిగాని దానితోనే మన లక్ష్యాన్ని చేరుకోగలం అని భ్రమపడరాదు. కాంగ్రెస్‌లోని అభివృద్ధి కాముకులను బలపరుస్తూ, అభివృద్ధి నిరోధకులను



వేరు చేస్తూ కాంగ్రెస్‌లోని అభివృద్ధి కాముకులతో ఐక్య సంఘటన కట్టవచ్చున్నది వారి వాదన నిజానికి 1947 నుండి పార్టీలో జరుగుతున్న చర్చ కొనసాగింపే ఇది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే రెండవ ప్రపంచ యుద్ధానంతరం భారతదేశంలో విప్లవం సాధించేందుకు సరైన వ్యూహం ఏమిటి? ఎత్తుగడలు ఏమిటి? అన్న విషయం చివరికి 1964లో గాని స్పష్టంగా తేలలేదు. ఇంకా మనం కూడా విప్లవాన్ని తేవలసే వున్నది. ఒకటి మాత్రం స్పష్టమయింది. తరువాత సి.పి.ఐ.గా మారిన వారి విధానం మొత్తంగా విప్లవోద్యమానికి దోహదపడేది కాదు అన్న విషయం తేలిపోయింది. మార్క్సిస్టు పార్టీ విప్లవకర అవగాహనతో ఏర్పడి పురోగమించడమే అందుకు తిరుగులేని నిదర్శనం. అంటే 1947 నుంచి 62 దాకా పార్టీలో సరైన విధానం కోసం అంతర్గత పోరాటం నడిచిందన్నమాట. ఇదేదో గాలిలో నడిచిన చర్చ అనో, పదాలు పట్టుకు వేళ్ళాడారనో భావించరాదు. భారత విప్లవోద్యమానికి సంబంధించిన సజీవమైన సమస్యలపై సాగిన చర్చ అది.

ఆంధ్రలో 1955 ఎన్నికల అనంతరం, అంతకుముందే తీవ్రంగా వున్న విభేదాలు మరింత తీవ్రమైనవి. 1953 నుండి ప్రతి సందర్భంలోనూ రెండు పరస్పర వ్యతిరేకమైన తీర్మానాలు ముందుకొచ్చేవి. చివరకు ఏదో రాజీ తీర్మానం వెలువడేది. ఈ రాజీ తీర్మానం ఎలా వుండేదంటే ఎవరికి వారు తమకు వచ్చిన భాష్యం తాము చెప్పుకునేటట్లుగా వుండేది. 1956 పాల్ఘాట్ మహాసభకు వచ్చేసరికి రెండు అభిప్రాయాలు ప్రస్ఫుటంగా బయటపడ్డాయి. నేనూ, బసవపున్నయ్య, సూర్జిత్ ప్రసాదరావు, హనుమంతరావు కేంద్ర కమిటీలో ఒకే వైఖరి తీసుకొంటూ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టాము. హనుమంతరావు 1953లో జరిగిన మధురై పార్టీ మహాసభలోనే కేంద్ర కమిటీకి ఎన్నికైనాడు. దేవులపల్లి కూడా మా అభిప్రాయాలతోనే వుండేవాడు. ఆ మహాసభలో మేము ప్రతిపాదించిన తీర్మానంగాక కేంద్ర కమిటీ తరఫున అజయ్‌ఘోష్ ప్రవేశపెట్టిన తీర్మానం, అటువైపున రాజేశ్వరరావు, జోషి కలిసి ప్రవేశపెట్టిన తీర్మానం వున్నా రాజేశ్వరరావు తీర్మానానికి మూడవ వంతు ప్రతినిధుల మద్దతు వుంది. మా తీర్మానానికి అంతే, ఇక అజయ్‌ఘోష్ ప్రవేశపెట్టిన తీర్మానానికి అంతేబలం వుంది. ఏ రెండు గ్రూపులైనా కలిస్తే తప్ప మూడోవ దానిని ఓడించలేని పరిస్థితి ఇటీవల వాదోపవాదాల్లో కూడా ఆనాడు మీరు మీ తీర్మానాన్ని ఉపసంహరించుకున్నారు కదా అని సిపిఐ వారు మనల్ని ఎద్దేవా చేస్తే, మనం వారిని మీరు మటుకు మీ తీర్మానాన్ని నెగ్గించుకున్నారా? అని ప్రశ్నిస్తున్నాము. ఏదో ఒక రాజీ తీర్మానం 1956లో తయారైంది 1961లోనూ అంతే జరిగింది.

విదేశాంగ విధానానికి సంబంధించి ఇది శాంతి అలీన విధానం కనుక అభివృద్ధికరమైంది అన్నది వారి వాదన కొన్ని అభివృద్ధికర అంశాలున్నప్పటికి ప్రభుత్వవర్గ దృక్పథం నుంచే యీ విధానం ఉత్పన్నమైంది కనుక నికరంగా శాంతి, అలీన విధానం వున్నదని చెప్పజాలమని మా వాదన. ఇక రెండో విషయం, రెండో పంచవర్ష ప్రణాళికలో సూచించిన పారిశ్రామికీకరణ, ప్రణాళికాబద్ధ ఆర్థిక పురోగతి, అభివృద్ధికర అంశాలను బలపర్చాలని వారు బూర్జువా వర్గానికి కూడా ఏదో ప్రణాళిక అవసరం కనుక యిది వచ్చిందిగాని

ఈ లక్ష్యాలు ఏవీ సాధించబడవు, దీనిపై భ్రమ అనవసరం అని మేము ఇలా భేదించాము. ఇక మూడవ అంశం అసలు కీలకమైంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ద్వారా, శాంతియుత మార్గం ద్వారా మన లక్ష్యాన్ని చేరుకోవచ్చుని వారి వాదన. ఇంత స్పష్టంగా చెప్పారని కాదు. 1951లోనే మనం ఎత్తుగడల పంథాలో మన మార్గమేదో స్పష్టం చేశాము. ఆ లెక్కకువస్తే మార్క్స్ 1848లోనే స్పష్టం చేశాడు. కనుక పైకి ఎట్లా చెప్తున్నారన్నది కాదు. ఆచరణలో 1951లో రూపొందించుకున్న ఎత్తుగడల పంథాను అనుసరించి, విప్లవానికి తగు విధంగా పార్టీని సమాయత్తం చేస్తున్నారా లేదా అన్నది ప్రశ్న. వారు 1951 ఎత్తుగడల పంథాను గోడౌన్‌లో పడేశారు. మనం మాత్రం అదే అనుసరణీయమని వాదిస్తూ వచ్చాము. అయితే మనం కూడా పార్టీని, వివిధ ప్రజాసంఘాల్ని ఆ ఎత్తుగడల పంథాను అనుసరించి నిర్మించగలిగామా అని అడిగితే అది వేరే విషయం. ఆ మాటకొస్తే ఏ కమ్యూనిస్టు పార్టీగాని, కమ్యూనిస్టుగాని శత్రువు బలప్రయోగం చేసినప్పుడు, హింసకు పూనుకొన్నప్పుడు తలవొగ్గి భరించమని చెప్పదు. పెట్టుబడిదారీ వర్గం కూడా అలా చెప్పదు.

ప్రజలు సిద్ధంగా వున్నప్పుడు సాయుధ పోరాటం ద్వారా దోపిడీ వర్గ ప్రభుత్వాన్ని కూల్చివేయాలి. ఇది మౌలికమయిన విషయం. ప్రజల్ని ఎట్లాసన్నద్ధం చేస్తావు? ఎప్పుడు కూలదోస్తావు? అన్నది వేరే విషయం. కావలసింది అవగాహన. తదనుగుణంగా పార్టీని నిర్మించుకుంటూ ప్రజానీకాన్ని మెట్టుమెట్టుగా ముందుకు తీసుకుపోవాలి. వారిలో ఆ విప్లవ చైతన్యం రాత్రికిరాత్రే వస్తుందని కాదు. సంవత్సరాలు, దశాబ్దాలూ కూడా పట్టవచ్చు. కాని అసలా ప్రయత్నంలో వున్నామా లేదా అన్నది ప్రశ్న. ప్రజల సమస్యల్లో చిన్నచిన్నవి తీసుకోని పోరాడి సాధిస్తే వారి విశ్వాసాన్ని చూరగొంటాం.

అదే సమయంలో ఈ చిన్న చిన్న విజయాలు వారి జీవితాల్ని మౌలికంగా మార్చలేదన్న విషయం వారికి అర్థం అయ్యేట్లు చేయాలి. ఈ మొత్తం వ్యవస్థను మారిస్తే తప్ప తమ జీవితాలు మౌలికంగా బాగుపడవన్న విషయం ప్రజలు గ్రహించి, అందుకై సిద్ధపడాలి. కార్మికులు, రైతులు, యావత్ ప్రజానీకం పాల్గొనాలి. సైన్యంలో కూడా విప్లవానికి అనుకూలమైన సెక్షన్‌లు సిద్ధపడాలి. బలమైన కమ్యూనిస్టు పార్టీ వుండాలి. అనుకూలమైన జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు ఏర్పడాలి. అప్పుడు విప్లవం. అంతేకాని ఇవాళే విప్లవం తీసుకొస్తే మంచిదనిపించి స్వీయమానసిక దృక్పథంతో ప్రవర్తించడం కాదు. ఆ విప్లవానికి ప్రజానీకాన్ని ఏ పద్ధతిలో సన్నద్ధం చేస్తున్నాం. పార్టీని తదనుగుణంగా ఏ రకంగా తీర్చిదిద్దుతున్నాం అన్నవి ప్రధాన అంశాలు. ఆ లెక్కకు వస్తే 1951లో మనం ఎత్తుగడల పంథాను ఆమోదించినప్పుడు తక్షణమే విప్లవం తెస్తామని కాదు. ఆ అవగాహన వుండాలి అని అంగీకరించామన్నమాట. తరువాత కూడా ఈ విషయం చాలా చర్చోపచర్చలకు దారితీసింది. ఇది కాదు, పార్లమెంటు పద్ధతే మార్గం అనుకుంటే అప్పుడు మరో రకమైన పార్టీ నిర్మాణం అవసరం అవుతుంది. విప్లవ దృక్పథం స్థానంలో పార్లమెంటరీ దృక్పథం వుంటుంది. ఏ కార్యక్రమం చేపట్టినా, ఏ ఉద్యమాలు



నిర్వహించినా ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నడపడం మనం చూస్తుంటాం. ఎన్నికలు వస్తున్నాయనంగా ఏదో ఒక ఉద్యమం చేపట్టాలి. మనం పోరాడినట్టు కన్పించాలి అన్న దృక్పథం చాలా పార్టీల్లో వుంటుంది. మరీ మొరటుగా చెప్పాలంటే, మేము మీ కోసం పోట్లాడాం గనుక మీరు మాకు ఓటు వెయ్యాలని అడిగేందుకన్నమాట. ఈ జబ్బు మన పార్టీలో కూడాలేదని నేను భావించను. అధికారంలో ఉన్న బూర్జువా వర్గంతో కలిసి ఐక్య సంఘటన కట్టి తద్వారా జాతీయ ప్రజాస్వామ్యాన్ని స్థాపించి వ్యవసాయక విప్లవాన్ని, బూర్జువా ప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాల్ని పూర్తి చేయవచ్చు. అటు పిమ్మట సోషలిజం సాధించవచ్చు. అనడం శాంతియుత మార్గాన సోషలిజానికి పరివర్తన అని చెప్పడం కాక మరేమిటి? మొదట్లో జనతా ప్రజాస్వామిక విప్లవం అన్నపదానికి రాజేశ్వరరావు వాళ్ళు అభ్యంతరం చెప్పలేదు. కాని దానికి కార్మికవర్గం నాయకత్వం వుంటుంది అన్నప్పుడు వాళ్ళంగీకరించలేదు.

అలాగే 1955 పాల్ఘాట్‌లో ప్రస్తుత రాజ్యాంగ యంత్రాన్ని గూర్చి 'బూర్జువా భూస్వామ్య రాజ్యాంగ యంత్రం' అని అజయ్ ఘోష్ పేర్కొన్నాడు. 'బడా పెట్టుబడిదారీ నాయకత్వాన వున్న బూర్జువా-భూస్వామ్య యంత్రాంగం' అని ఆయన తీర్మానంలో లేదు. ఆ విషయమే మేము ఆయన్ని అడిగాము. అందుకు మహాసభలోనే ఆయన వివరణ యిచ్చాడు. బూర్జువా భూస్వామ్య రాజ్యాంగ యంత్రం అంటే, అందులో ఎవరు బలవంతులో వాళ్ళు నాయకత్వం వహిస్తారు కదా. అంటే బడా బూర్జువా వర్గమే నాయకత్వం వహిస్తుంది కదా. కనుక ప్రత్యేకించి పేర్కొనడం అనవసరమని ఆయన చెప్పారు. మేము బడా బూర్జువా నాయకత్వాన అని ఖచ్చితంగా పట్టుబట్టడానికి సిద్ధంగా లేము. ఎందుకంటే, అక్కడ మేము జేర్చమని ఓటింగు పెడితే ఓడిపోవడం జరిగేది. పోనీ చేర్చకపోతే జేర్చకపోయాడులే, ఆయన యిచ్చిన వివరణ ఆసరాగా మనం వివరించుదాము అని మేము వూరుకొన్నాం. అయితే సిపిఐ వారు తమ వాదనలో యిప్పటికీ ఆనాడు అజయ్‌ఘోష్ బడా బూర్జువా నాయకత్వాన అని అనలేదుకదా అని అంటుంటారు. ఆయన ఆ అంశాన్ని తన వివరణలో పేర్కొన్నారని మనం అంటూంటాం.

అంతర్జాతీయంగా మారిన పరిస్థితుల పేరిట ఇక్కడున్న పాలకవర్గాలతో కలిసి ఐక్య సంఘటన కట్టాలని వాదించడం సరైనదికాదు. ఎవరికి వ్యతిరేకంగా పోరాడాలి ఈ ఐక్యసంఘటన? అలాగే ఈ దేశానికి 'స్వతంత్రమే రాలేదు' అన్న గతంలో మాకున్న అవగాహన కూడా పొరపాటే. ఇక్కడున్న బడా పెట్టుబడిదారీ వర్గానికి, మనకు వున్న శత్రుత్వాన్ని ఆ అవగాహనతో సరిగా గమనించలేము. ముందుగా చెప్పినట్లు బ్రిటీష్ సామ్రాజ్యవాదమా? అమెరికన్ సామ్రాజ్యవాదమా? ఏది ప్రధాన శత్రువు అన్న చర్చ కూడా ఏదో సిద్ధాంత పరిజ్ఞానస్థాయిలో జరిగే చర్చకాదు. మేము బ్రిటీష్ సామ్రాజ్యవాదమే ప్రధాన శత్రువు అన్నాము. కాదు అమెరికన్ సామ్రాజ్యవాదం ప్రధాన శత్రువు అని వారి వాదన. హేరీపోలిట్ ఇక్కడకు వచ్చినప్పుడు అమెరికన్ సామ్రాజ్యవాదమే ప్రధాన శత్రువని, బ్రిటిష్ దానితోపాటున్న చిన్న

భాగస్వామిగా మారిపోయిందని చెప్పాడు. ప్రపంచ ప్రజల ప్రధాన శత్రువు అమెరికా కనుక, ఆ అమెరికా పాకిస్తాన్‌తో సైనిక ఒప్పందం చేసుకుంది కనుక ఆ పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా వున్న భారత ప్రభుత్వాన్ని బలపరచాలన్న వారి వాదన. అమెరికా ఆసరాతో భారత్‌పై పాకిస్తాన్ దండెత్తితే అప్పుడు దేశరక్షణలో ప్రభుత్వంతోపాటు మనమూ పాల్గొనవచ్చు. అంతేగాని, ఆ వంకతో ఈ ప్రభుత్వాన్ని బలపర్చరాదని మా వాదన.

సిద్ధాంతానికి సంబంధించిన సమస్యలేకాదు. వివిధ ప్రజాసంఘాలకు సంబంధించిన అంశాల్లో పై ధోరణులు ప్రతిబింబించాయి. కార్మిక సంఘం, విద్యార్థి సంఘం, వ్యవసాయ కార్మిక, రైతు సంఘాలు, అవి ఎక్కడికక్కడ పురోగమించాయి, ఎక్కడక్కడ వెనుకబడ్డాయి. ఎందుకిలా జరిగింది. వీటన్నింటినీ చర్చించి గుణపాఠాలు తీసుకోవాల్సిన సందర్భాల్లో కూడా చర్చల్లో కూరుకుపోవడం జరిగేది. అసలు అవగాహనలోనే విభేదమున్నప్పుడు అలా జరగడంలో ఆశ్చర్యంలేదు. ఇంకా ప్రాథమికంగా అసలు ఏ సంఘాన్ని అయినా ఏ దృక్పథంతో నిర్మించాలి అన్న విషయంలో కూడా ఏకీభావం వుండేదికాదు. అన్నీ విజయాలనో, అంతా పురోగమన మనో అనడమూ లేదా అన్నీ అపజయాలు, అంతా తిరోగమనమే అనడమూ సరి కాదు. కొన్ని విజయాలు, కొన్ని అపజయాలు, కొన్ని ప్రాంతాల్లో ముందుకు పోవడం, కొన్ని ప్రాంతాల్లో స్తబ్దతగా వుండడం మామూలే. అయితే వాటికి కారణాలు అన్వేషించి, తీవ్రంగా అధ్యయనం చేసి సరైన అనుభవాల్ని నేర్చుకుందామంటే ఈ అవగాహనలో వున్న విభేదం అధికంగా వుండేది.

1958లో అమృత్‌సర్‌లో పార్టీ మహాసభ జరిగింది. డాక్టర్ రామ్ వైద్యం నిమిత్తం మాస్కోలో వున్నందువల్ల నేను కూడా మాస్కో వెళ్ళాను. అందువల్ల నేను అమృత్‌సర్ మహాసభలకు హాజరుకాలేదు. ఆ మహాసభలోనే 'పార్టీని విస్తృతం చేయాలి అందుకని ప్రజా బాహుళ్యపు పార్టీగా దాన్ని మలచాలి' అన్న ప్రతిపాదన వచ్చింది. ప్రజాబాహుళ్యపు పార్టీ అంటే మన ఊరేగింపులో వచ్చిన ప్రతివానిని సభ్యుడిగా చేర్చుకోవడం కాదని అంటూనే సభ్యత్వం ప్రత్యేకతను నీరు కార్చే యత్నం జరిగింది. అక్కడే మూడు దొంతర్ల నిర్మాణ పద్ధతి ప్రవేశపెట్టబడింది. నేను దానికి వ్యతిరేకిని. మూడు దొంతర్లు వున్నాయంటేనే నాయకత్వం జీవితం అంతా సమావేశాలతో గడిచిపోతుందని నా భావన. ఏమైనా నేను ఆ సభలో లేనుకదా. ఉంటే ఏదో మారి వుండేదని నేను అనుకోవడం లేదు. ఆ సభలోనే రణదివెను తిరిగి కేంద్ర కార్యవర్గంలోకి తీసుకున్నారు. ఆయన 1948లో చేసిన పొరపాటు పేరుతో ఆయనపై కక్షగట్టే వైఖరిని ఆనాటి పార్టీ నాయకత్వం అవలంభించింది. 1951లో స్టాలిన్ వద్దకు వెళ్ళినప్పుడు స్టాలిన్ కూడా బి.టి.ఆర్. తన పొరపాటు సరిదిద్దుకొనేటట్లయితే తిరిగి తీసుకొండని చెప్పాడు. కాని నాయకత్వం ఆయనపై కత్తిగట్టినట్లుగా వ్యవహరించింది. ఇది కమ్యూనిస్టు ఉద్యమానికి వున్న ఒక జబ్బు. మేము మాత్రం ఆయనను తిరిగి తీసుకోవాలని, ఆయనకున్న శక్తియుక్తులను వాడుకోవాలని



పోరాడుతూనే వున్నాం. తప్పులు చేసినంత మాత్రాన శక్తియుక్తులను, పార్టీపట్ల విశ్వాసాన్ని పక్కకునెట్టి కక్షతో వ్యవహరించడం సరికాదనేదే మా అభిప్రాయం, ఈ అంతర్గత పోరాటంలో ఇంతవరకు బెంగాల్ నుండిగాని, కేరళ నుండిగాని ఎవరూ మాతో కలిపి ఏ తీర్మానాలు ప్రవేశపెట్టలేదు. ఆంధ్ర, పంజాబ్, మేము మాత్రమే ఈ పోరాటాన్ని ఇంతవరకు నడుపుతూ వచ్చాము.

నేను ప్రత్యేకంగా పార్టీ అవగాహనలో ముద్రవేసిన మరో అంశం రైతాంగ సమస్యకు సంబంధించినది. ఆ సమస్యపట్ల ప్రత్యేక శ్రద్ధతో అధ్యయనం చేసి తీర్మానించింది. 1953–54లో అంతకుముందున్న అవగాహనకు మౌలికంగా యిది నిర్దుష్టమైనది. భూగరిష్ట పరిమితి ఎంత నిర్ణయించాలి? భారతదేశ వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ విధానం ఎంతవరకు చొచ్చుకుంది? భూస్వాములకు ఎంత భూమి ఉండవచ్చు? ఇలాంటి ప్రశ్నలకు మనదేశ భౌతిక పరిస్థితులకు అనుగుణంగా సమాధానమివ్వడానికి ఒక తీవ్రమైన కృషి జరిపాము. ఇప్పటికీ సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక అంటుంటాము. ఆ అనడంలో పాత భూస్వామ్య విధానానికి వ్యతిరేకం అనే అర్థంలోనే వాడుతున్నాము.

ఈ సమస్య విషయంలో నేను ప్రత్యేక నిపుణున్ని అన్న అభిప్రాయం ఏర్పడింది. దానికి కారణం లేకపోలేదు. తెలంగాణా పోరాట అనుభవం నాకుంది. యాంత్రికంగా మార్క్సిస్టు–లెనినిస్టు సూత్రాలను యథాతథంగాదించడమేగాకుండా భారతదేశ ప్రత్యేక పరిస్థితులకు అన్వయించేందు కోసం వివిధ ప్రాంతాల్లో, గ్రామీణ స్థాయిలో వివరాలు సేకరించి, కొంచెం నిశితంగా అధ్యయనం చేసి వున్నాను. నా దృష్టిలో ఏదో దున్నేవానికి భూమి, భూస్వామ్య విధానం రద్దు అని సరిగా అర్థం చేసుకోకుండా నినాదాలివ్వడం కాదు. మనకది దైనందిన వ్యవహారాలలో కూడా చాలా ప్రాముఖ్యతగల సజీవ సమస్య. గ్రామీణ ప్రాంతాలవల్ల విభజనలోనూ, రైతు – కూలీ ఐక్యతను నిలబెట్టి, కాపాడి, పెంచి పోషించిడంలోనూ ప్రాధాన్యత వున్న సమస్య. ఈ విషయంలో నా అభిప్రాయాలు మోగా, విజయవాడ, కన్ననూరిలలో జరిగిన రైతు మహాసభల తీర్మానాలలో ఎలా వ్యక్తమయిందీ యింతకు ముందే చెప్పాను. ఆ వివరాలలోకి వెళ్ళడంలేదు.

1953లో స్టాలిన్ మరణించారు. అదొక ప్రాముఖ్యమైన అంతర్జాతీయ ఘటన, నేను అప్పుడు అంతర్జాతీయ సంబంధాల వ్యవహారాలను చూస్తున్నాను. ఢిల్లీలో వున్నాను గనుక రాజ్యసభలోనూ, లోక్‌సభలోనూ స్టాలిన్ మరణంపై ప్రస్తావన రావాలని నేను కోరాను. అంతకుముందు అలా విదేశీ ప్రముఖుల మరణాలపై ప్రస్తావించే సంప్రదాయం పార్లమెంటులోలేదు. నెహ్రూ, రాధాకృష్ణన్‌లు యిరువురూ అందుకు అంగీకరించారు. నెహ్రూ 'స్టాలిన్ అంతర్జాతీయంగా చాలా ప్రభావం చూపినవాడు. తప్పకుండా ప్రస్తావిస్తాను' అన్నారు.

రాధాకృష్ణన్ 'నేను ఆయన అధినేతగా వుండగా రష్యాలో కొన్ని సంవత్సరాలు రాయబారిగా వున్నాను. ప్రస్తావించకుండా ఎలా వుంటాను' అన్నారు. నేను చెప్తేనే మార్చుకున్నారని కాదు. వాళ్ళు ప్రస్తావించదలచారు. పైపెచ్చు పాకిస్తాన్‌తో అమెరికా సైనిక ఒప్పందం వుంది కదా. కనుక రష్యాతో మైత్రి మన ప్రభుత్వానికి అవసరం. ఆ దృష్టి కూడా వారిలో వుండి ఉంటుంది. అందువల్లనే అలా చేశారని చెప్పడమూ సరికాదు. ప్రతిసారీ అంత మొరటుగా ఆలోచించజాలము.

ఇక్కడ అంతర్గత పోరాటం జరుగుతుండగా, 1956లో సోవియట్ పార్టీ 20వ మహాసభ జరిగింది. అప్పుడే కృశ్చేవ్ స్టాలిన్‌పై మోపిన రహస్య ఆరోపణల పత్రం బయటకు పొక్కింది. నిజానికి చైనా, సోవియట్‌ల మధ్య బహిరంగ వాదోపవాదాలకు దారితీసిన మొదటి అంశం అది. మన పార్టీ తరపున అజయ్ ఘోష్ నాయకత్వాన ఒక ప్రతినిధి వర్గం ఆ మహాసభకు వెళ్ళింది. స్టాలిన్‌ను గూర్చి కృశ్చేవ్ ప్రసంగంపై ఇక్కడ మన పార్టీలోనూ విభేదాలున్నాయి. అయినా పాల్ఘాట్ మహాసభ కృశ్చేవ్ స్టాలిన్‌పై దుమ్మెత్తిపోయడాన్ని తిరస్కరించింది. స్టాలిన్ తప్పులు చేశారు. అయితే అదా ప్రధానం? అయినా తప్పులు జరుగుతున్నప్పుడు మిగతా పార్టీ ఏం చేస్తున్నట్లు? కనుక తప్పులన్నింటికి స్టాలిన్ కారకుడనడం సరికాదన్నది మన అభిప్రాయం.

అంతకన్నా ప్రధానమైన విషయం, ఆ పార్టీ మహాసభ అంగీకరించిన కొన్ని సైద్ధాంతిక అంశాలు చాలా నష్టాన్ని కలిగించాయి. ప్రపంచయుద్ధం ఆపవచ్చు అని, అందుకు శాంతియుత సహజీవనం మార్గమన్నది ఒకటి. కొన్ని దేశాలు శాంతియుత పరివర్తన ద్వారా విప్లవం లేకుండా సోషలిజానికి చేరవచ్చునన్నది మరొకటి. ఆ కొన్నిదేశాలు ఇవి అని పేర్కొనలేదు. నేను చాలా దేశాల వారిని అడిగాను. మీ దేశంలో ఆ శాంతియుత పరివర్తన వర్తిస్తుందా అని. ఒక్కరు కూడా వర్తిస్తుందని చెప్పలేదు. ప్రతివాళ్ళు తమ దేశంలో కుదరదు, ఇంకే దేశంలో అయినా అవకాశం వుందేమో అన్నవారే. ముఖ్యమైన పార్టీలకు వర్తించకుండా, ఎవరికి వర్తించేట్లు? కానీ అలా పరివర్తన జరుగుతుందని చెప్పడం వాస్తవాన్ని, మార్క్సిజాన్ని వక్రీకరించడమే.

శాంతియుత సహజీవనము, శాంతియుత పోటీ – వీటి ద్వారా మాత్రమే ప్రపంచ యుద్ధాన్ని నివారించ వచ్చునుకోవడం భ్రమ. ప్రపంచశాంతి కోసం పాటుపడుతూనే ప్రపంచ యుద్ధ ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. శాంతియుత సహజీవనం పేర వివిధ దేశాలలో అణగారిన ప్రజలను తిరగబడవద్దని చెప్పేందుకు వారెవరు? ప్రజలెందు కూరుకుంటారు? సామ్రాజ్యవాద స్వభావం ఏమిటి? అది శాంతియుత సహజీవనానికి, శాంతియుత పోటీకి పరిమితమవుతుందా? ప్రతి స్థానిక యుద్ధమూ ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందని, శాంతి



వచనాలతో సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కోగలమా? ప్రపంచయుద్ధ ప్రమాదాన్ని చూపి, సామ్రాజ్యవాదులు దౌర్జన్యాలు, దోపిడీలు చేస్తుంటే ఆ దేశ ప్రజలను చేతులుకట్టుకు కూర్చోమని చెప్పవచ్చునా. ఇదే రివిజనిజం అంటే. ఇప్పటికీ ఈ అంశాలు చర్చనీయాం శాలుగానే వున్నాయి. ఈ రోజు సిపిఐ వారు వాదోపవాదాల్లో, ఆనాడు సోవియట్ యూనియన్ చెప్పిన శాంతియుత సహజీవనం, శాంతియుత పోటీ వీటిని మీరు వ్యతిరేకించారా అని ప్రశ్నిస్తుంటారు. వాటిని వ్యతిరేకించడం కాదు సమస్య. వాటి వలననే ప్రపంచ శాంతి కాపాడుకోగలమని ప్రచారం చేయడాన్ని వ్యతిరేకించాము. నేడూ వ్యతిరేకిస్తాము. ఇక్కడింకో విషయం కూడా చెప్పాలి. రాజేశ్వరరావు, డాంగేలకు వ్యతిరేకంగా వున్న వాళ్ళం అందరం అన్ని సందర్భాలలో ఒకే రకంగా ప్రతిస్పందించామని కాదు. కొన్ని సందర్భాలలో మాలో మేము విభేదించిన అంశాలు వున్నాయి. కానీ ప్రధానంగా వాళ్ళు విప్లవ పార్టీకి తిలోదకాలిస్తున్నారు. మేము అనుసరిస్తున్న విధానం మార్క్సిజం–లెనినిజాన్ని సరిగ్గా అన్వయించడం అన్నదాంట్లో సాధారణ ఏకాభిప్రాయం వుంది. అదిగాక, వ్యక్తుల అనుభవాలు వాటినిబట్టి కూడా ఒక్కొక్కసారి నిర్ణయాలకు రావడంలో తేడాలుంటాయి. వెనక ముందులుంటాయి. ఉదాహరణకు 'డాంగే లేఖల' విషయం బయటపడిన తర్వాత వాటిలో నిజానిజాలు నిర్ధారణయ్యే వరకూ డాంగేతో సంభాషించే ప్రసక్తిలేదు అని ప్రకటన చేస్తానంటాడు ఇ.ఎం.ఎస్. నాకూ అసహనంగా వుంది. "అసలు వాళ్ళతో తెగతెంపులు చేసుకుంటున్నాం. ఆ నిజానిజాల నిర్ధారణతో పనేమిటి?" అన్నాను. ఏమైనా ఇ.ఎం.ఎస్. ఆ ప్రకటన చేశాడు. నిర్ణయాలకు రావడంలో అలాంటి తరతమ తేడాలుంటాయి.

మేము నేషనల్ కౌన్సిల్ నుండి బయటకు వస్తున్న సందర్భంలో డాంగే "పొండి! పీడవదులుతుంది" అన్నాడు. ఆ మాటలకు అసహ్యించుకుని, అటూ యిటూగా వున్న ఇద్దరు ముగ్గురు కూడా వచ్చి మాతో కలిశారు ఇ.ఎం.ఎస్. జాతీయ పరిస్థితికి సంబంధించి మా అంచనాతో ఏకీభవించాడు. వాళ్ళది రివిజనిజం అనడంలో ఆయనకే అనుమానం లేదు. అయితే అంతర్జాతీయ పరిస్థితిపై మాతో ఆయనకు కొన్ని తేడాలున్నాయి. "సరే, వాటి విషయం తర్వాత మరింత లోతుగా అధ్యయనం చేసి, కాస్త ఆలస్యమయినా పరిష్కరించుకుందాం. ప్రస్తుతం దేశ పరిస్థితికి సంబంధించి మన మధ్య ఏకీభావం వున్నప్పుడు కలిసి పనిచేద్దాం" అన్నాము. సరేనని అంగీకరించిన పిదప మార్క్సిస్టు పార్టీగా ఏర్పడ్డాము.

ఈ లోపల ఇంకో సంఘటన జరిగింది. 1962 ఆరంభంలో కామ్రేడ్ అజయ్‌ఘోష్ మరణించారు. ఆయన స్థానంలో పార్టీ కార్యదర్శిగా ఎవరుండాలి? మాలో ఎవ్వరమూ ఎన్నికయ్యే ప్రసక్తిలేదు. డాంగే తానుంటానన్నాడు. డాంగే పోతపోసిన క్రమశిక్షణా రాహిత్యము. ఆయనను ఎట్టి పరిస్థితుల్లోను కార్యదర్శిగా అంగీకరించేదిలేదు. ఇ.ఎం.ఎస్.ను కార్యదర్శిగా పెట్టాలి అని మనం పట్టుబట్టాం. వాళ్ళు అంగీకరించలేదు. అసలా విషయం పైననే పార్టీ చీలిపోయే ప్రమాదం ఏర్పడింది. పార్టీ ఐక్యత విచ్ఛిన్నం అవుతుందేమోనన్న భయంతో ఇ.ఎం.ఎస్. వున్నారు. చివరికి ఒకరాజీ ప్రతిపాదన కుదిరింది. ఇ.ఎం.ఎస్. కార్యదర్శిగా వుండాలి, డాంగే

పార్టీ ఛైర్మన్‌గా వుండాలి అని. అంతవరకూ ఛైర్మన్ పదవిలేదు. రాజీకోసం డాంగేకు ఆ పదవి సృష్టించబడింది. ఈ రాజీఫలితంగా ఒక కేంద్ర కార్యదర్శి వర్గంలోకి నేను, జ్యోతిబసు కూడా జేరాం. గోవిందనాయర్, రాజేశ్వరరావు కూడా వున్నారు.

1962 నవంబర్‌లో మేము బయటకు వచ్చిన తర్వాత, కార్యదర్శి వర్గం నుండి కూడా మేము రాజీనామా యిచ్చాము. తిరిగి రైల్లో వస్తుండగా ఇ.ఎం.ఎస్. నాతో అన్నారు. "పి.ఎస్. మీతో నాకు కొన్ని సైద్ధాంతిక విభేదాలున్నమాట నిజమే. కానీ వాళ్ళు ఎలాంటివాళ్ళో నాకు తెలుసు. వాళ్ళతో కలిసి పని చేయలేను. నేనూ కార్యదర్శిగా రాజీనామా యిస్తాను" అని అన్నారు. ఇ.ఎం.ఎస్. పేరును కార్యదర్శిగా వాడుకుంటూ తమ విచ్ఛిన్నకర పోకడను కొనసాగించాలని వారి అభిప్రాయం. అందువల్ల ఇ.ఎం.ఎస్. కొద్ది కాలంలోనే రాజీనామా యిచ్చారు.

విజయవాడ మహాసభలో రాజకీయ తీర్మానంపై అంగీకారం కుదరలేదు. మేము సూత్రబద్ధమైన వైఖరి తీసుకున్నాము. ఐక్యత కోసమే వున్నాము. చివరకు అజయ్‌ఘోష్ ఉపన్యాసం ఆధారంగా అంటూ అంగీకారం కుదిరింది. ఆ మహాసభలకు సుస్లోవ్ వచ్చారు. కమిటీనంతా తమ వారితో నింపాలని వారి ప్రయత్నం పంజాబ్ నుండి కేంద్ర కార్యవర్గంలోకి సూర్జిత్‌ను తీసుకోకుండా వాళ్ళు వదిలేశారు. "సూర్జిత్ లేకుండా పంజాబ్ నుండి మరెవ్వరిని తీసుకుని ప్రయోజనం ఏమిటి? నేనూ ఉండ"నన్నాను. మా యిద్దర్నీ వదిలేశారు. జ్యోతిబసు, "వాళ్ళిద్దరూ లేకుండా నేనుండి చేసేదేమిటి? నేనూ వుండ"నన్నాడు సూర్జిత్, పి.ఎస్., జ్యోతిబసు లేకుండా ఆ కేంద్ర కార్యవర్గం ఎవర్ని అదుపులో వుంచగలదు? అని అందరూ అన్నారు. మేము ఐక్యత కోరుతున్నాము. అట్లా అని అంతా వారు చెప్పినట్లే ఔనని వారితో కమిటీలు నింపమనిగాదు. సుస్లోవ్ వారిని పిలిచి చెప్పాడేమోగానీ, మమ్మల్నెవర్నీ పిలవలేదు. చివరకు రాజీ ప్రతిపాదన పది పదిహేనుమందినిజేర్చి కేంద్ర కార్యవర్గం ఏర్పరచాలని.

ఇంతకీ చెప్పొచ్చేదేమంటే, ఎవరో ఒక్క నాయకుడే ఈ రివిజనిస్టు వ్యతిరేక పోరాటాన్ని నిర్వహించారనుకోవటం పొరపాటు. నిజానికి బెంగాల్, ఆ తర్వాత కేరళలో నాయకత్వంలో ఎక్కువ భాగం మన వైపురాకపోతే మార్క్సిస్టు పార్టీ అప్పటికి ఏముంది. కేవలం ఆంధ్ర బలం మీద ఆధారపడి పార్టీ యీ రూపంలో వుండేదా? ఆంధ్రలో కూడా నాయకత్వంలో సగానికన్నా ఎక్కువ మంది సిపిఐ వైపు వెళ్ళారు. పార్టీ సభ్యులలో ఎక్కువ మంది మన వైపు వున్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఉద్యమమే తక్కువ. బీహారులో ఒక్క కేంద్ర కార్యవర్గ సభ్యుడు తప్ప అందరూ సిపిఐ వైపు వెళ్ళారు. ఒరిస్సాలోనూ అంతే. మహా రాష్ట్రలో సగం నాయకత్వం మన వైపు వచ్చినా, అసలు పార్టీయే అప్పటికి చాలా బలహీనపడింది. తమిళనాడులో చెరిసగం చీలాము.



రెండు పెద్ద ఉద్యమాలయిన బెంగాల్. కేరళలో మెజారిటీ నాయకత్వం, కార్యకర్తలు మనవైపు రాబట్టి, మార్క్సిస్టు పార్టీ నిలవగలిగింది. నిజానికి పార్టీ చీలిక అనంతరం, కేరళలో జరిగిన ఎన్నికలలో మార్క్సిస్టు పార్టీ విజయం పార్టీకి సుస్థిరత్వాన్ని సంపాదించి పెట్టింది. మార్క్సిస్టు పార్టీ సిద్ధాంతం సరయినదని నిరూపించింది.

ఆ ఎన్నికల విజయానికి రెండు రకాల ప్రాధాన్యత వున్నది. ప్రధాన నాయకత్వం జైలులో వున్నప్పటికి మనం గెలవడం. రెండు, సహజంగా గెలుపు కలిగించే ఉత్సాహం. అంతకుముందు 1955లో ఆంధ్రలో మనం ఓడిపోయాం. 62లో కూడా అదే పరిస్థితి. వీటి తరువాత మార్క్సిస్టు పార్టీగా ఏర్పడి ఎన్నో ఇబ్బందుల్ని ఎదుర్కొంటూ ఈ విజయాన్ని సాధించటంవల్ల మనం స్థిరంగా నిలదొక్కుకోగలిగాం. లేకపోతే మన పని మరింత కష్టతరమై వుండేది. 1967లో ఆంధ్రలో ఎన్నికల్లో సిపిఐకి తొమ్మిది, మనకు ఎనిమిదోఏమో వచ్చిన గుర్తు. ఒకర్నొకరు ఓడించుకోవడంలో మాత్రం సఫలీకృతులమయ్యాం. అప్పుడే ఈ నక్సలైట్ తప్పుడు ధోరణి ఆంధ్రను బాగా ఆవరించింది. "ఆంధ్ర కామ్రేడ్స్‌కు పొలిట్‌బ్యూరో లేఖ" అని ఒక మంచి ముఖ్యమైన డాక్యుమెంటును పొలిట్‌బ్యూరో విడుదల చేసింది. ఆంధ్రలో అంత పెద్దఎత్తున అతివాద దుందుడుకు వాదం పెరగడానికి కారణం ఏమిటి అని అందులో చర్చించాం. అయితే ఇప్పటికి కూడా ఆ గుణపాఠాలు సరిగా తీసుకున్నాం అని నేను భావించడం లేదు.

ఆంధ్రలో ఉద్యమం ప్రధానంగా రైతాంగ పునాది కలిగింది. దీనికి తగిన నిర్మాణయుతమైన కార్మిక వర్గ పునాదిలేదు. అందువలన సహజంగా పెటీబూర్జువా వర్గ దృక్పథానికి ఆస్కారం ఎక్కువగా వుంటుంది. ఇలాంటి కారణాలు చెప్పి సైద్ధాంతికంగా నక్సలిజం ఎలా తప్పో ఆ చిన్నపుస్తకంలో వివరించాము. కేవలం సిద్ధాంతాలలో కొన్ని ఉటంకింపులను పట్టుకొని వేళ్ళాడినంత మాత్రాన అంతర్గత పోరాటాన్ని నడపలేము. ఉదాహరణకు నేనున్నాను. నాకు తెలిసిన సిద్ధాంతమేదో నాకు తెలుసు. అదే సరిపోతుందని నేను అనుకోవడంలేదు. కాని వివిధ సందర్భాల్లో ఉద్యమానుభవం నాకుంది. పోరాటానుభవం, పార్లమెంటరీ అనుభవం వున్నాయి. ముఖ్యమైన కార్యకర్తల రాజకీయ, సైద్ధాంతిక పటిమ, ఆచరణలో వారి కృషి పైనా అవగాహన నాకుంది. అందుకని ఏదన్నా ఒక సమస్యరాగానే, వీటిన్నింటిని దృష్టిలో వుంచుకుని నా అభిప్రాయమేదో స్పష్టంగా చెప్పేస్తాను. అందువల్ల కొందరు కొన్ని సందర్భాల్లో నేను మరీ మొండిగా వుంటానని, వెసులుబాటు ఇవ్వనని బహిరంగంగానూ, లోలోపలా అనుకుంటుంటారు. నిజానికి అంతస్పష్టముగా చెప్పగలగడంలో నాకు ప్రత్యేకమైన సైద్ధాంతిక ప్రతిభ ఏమీ లేదు. కాని అనుభవం ఉంది. అవేరకమైన తప్పులు, ఎన్నిసార్లు మళ్ళీమళ్ళీ జరిగాయో, అలాంటప్పుడు వాటిపై స్పష్టంగా చెప్పగలగకుండా దీర్ఘంగా సైద్ధాంతికంగా ఆలోచించాల్సిన అవసరం ఏముంటుంది? అయితే పిడివాదం పనికిరాదు. పరిస్థితులు మారుతుంటాయి. సంఘటనలు

మారుతుంటాయి. వాటికి సంబంధించిన వ్యక్తులు మారుతుంటారు. ఇవన్నీ దృష్టిలో వుండాలి. సామాన్యంగా వీటిని దృష్టిలో ఉంచుకునే నా అభిప్రాయాన్ని చెబుతూ వుంటాను.

కనుక పార్టీలో విభేదాలన్నది, అంతర్గత పోరాటమన్నది ఆచరణతో లేని సిద్ధాంతంపైనా, పడికట్టుపదాలపైనా రాలేదని గుర్తుంచుకోవాలి. వివిధ సందర్భాలలో ప్రజా ఉద్యమాలను ఎలా నిర్వహించాలి, ఏ అవగాహనతో నిర్వహించాలి, వాటి గుణపాఠాలు ఏమిటి? అన్న ఆచరణకు సంబంధించిన ఎన్నో విషయాలలో ఈ విభేదాలున్నప్పుడు పార్టీలో అంతర్గత పోరాటం అవసరం అవుతుంది. ఒక్కోసారి చీలికకు కూడా దారి తీస్తుంది.

రైతాంగానికి సంబంధించిన అంశాలలో నన్ను నిపుణిడిగా భావిస్తారని చెప్పాను గదా. మన పార్టీ రైతాంగ సమస్యలపై చేసిన తీర్మానాలు, నిజానికి మన పార్టీకున్న అవగాహన, వాటిలో నా ప్రత్యేకమైన పాత్ర వుందని కూడా చెప్పాను. సరే, ప్రస్తుతం అవన్నీ వెనక్కి నెట్టివేయబడ్డాయి అది వేరే విషయం. తరువాత వివరిస్తాను.

1952 నుంచి 62 దాకా మరీ తీవ్రమైన స్థాయిలోనే అంతర్గత పోరాటం జరిగింది. వివిధ రాష్ట్రాల్లో కేంద్ర నాయకత్వం చేస్తున్న విధానాలను వ్యతిరేకిస్తున్న వారు తమ శక్తి సామర్థ్యాలను బట్టి సరైన విధానంకోసం పోరాడుతూనే వున్నారు. నేషనల్ కౌన్సిల్ నుండి బయటకు వచ్చి 27 మందిమి మాత్రం ఒక గ్రూపుగానే వ్యవహరించాలని నిర్ణయించుకొన్నాం. పార్టీని చీల్చరాదని అదే సమయంలో ఒక గ్రూపుగా వ్యవహరించిన తప్పదని భావించాము. 1962లో మమ్మల్ని ప్రభుత్వం నిర్బంధించింది. ఆ సందర్భంగా మొదటి శ్రేణి, రెండవ శ్రేణి నాయకత్వం రహస్య జీవితానికి వెళ్ళరాదని, మూడవ శ్రేణి నాయకత్వం మాత్రమే రహస్యంగా వుండాలని భావించాము. మేము గనుక రహస్యంగా వెళ్ళేట్లయితే మమ్మల్ని చైనా ఏజెంట్లు పంచమాంగ దళం అని ప్రచారం చేస్తున్న ప్రభుత్వానికి, జాతీయ దురంహంకారులకు అవకాశం ఇచ్చిన వాళ్ళమవుతాము. కాని ప్రభుత్వం అందరినీ నిర్బంధించలేదు. మన కామ్రేడ్స్ బయటవున్న వారు పార్టీ కేంద్ర నాయకత్వం చేస్తున్న తప్పుడు విధానాలను వ్యతిరేకిస్తూ చేతనైనంత ప్రచారం చేస్తున్నారు. 1963 ఆగస్టులో మేము విడుదలయ్యాం. ఆంధ్రలో నేను, హనుమంతరావు తదితరులం ఒక నిర్ణయానికి వచ్చాం. ఇక పార్టీ పద్ధతులను, నిర్ణయాలను పాటించనవసరంలేదు. ఎక్కడికక్కడ పార్టీ కేంద్రం అనుసరిస్తున్న తప్పుడు విధానాలను బహిర్గతం చేయాల్సిందే. తదనుగుణంగా వివిధ జిల్లాల్లో విస్తృతంగా జనరల్ బాడీలు జరిగాయి. నేను విస్తృతంగా రాష్ట్రమంతా పర్యటించాను. ఆ జనరల్ బాడీలో వారి తప్పుడు విధానాన్ని, మన సరైన పంథాను వివరించడమే ప్రధాన కర్తవ్యం. ఈ జనరల్ బాడీలకు పార్టీ సభ్యులు, సానుభూతిపరులు రాకుండా ఉండేందుకు రివిజనిస్టు దృక్పథంగల నాయకత్వం శతవిధాలా ప్రయత్నించింది. మనకున్న కార్యకర్తలు మనకు వున్నారు కదా. వారు ఈ జనరల్ బాడీలు విజయవంతమయ్యేందుకు తీవ్రంగా కృషి చేశారు. పైగా ఆలిండియా నాయకులలో ఒకనిగా పరిగణింప



బడుతున్న నేను ప్రసంగించాల్సిన జనరల్ బాడీలకు హాజరుకావద్దని నిరోధించడం అంత తేలికైన పనికాదు. పి.ఎస్. జనరల్‌బాడీకి వెళ్ళవద్దనడం ఏమిటి? అన్న ప్రశ్న వచ్చేది. మొత్తం మీద జనరల్ బాడీలన్నీ బాగా జరిగాయి. చైనా సమస్య చాలా ప్రాముఖ్యతను సంతరించుకుంది. చైనా పార్టీకి కూడా గొప్ప కమ్యూనిస్టు పార్టీగా చాలా విశిష్టత వుంది. అటు సోవియట్, ఇటు చైనా ఈ రెంటి విభేదాలన్నవి ఈ జనరల్ బాడీలలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించాయి.

దానిని ఆసరాగా చైనా కమ్యూనిస్టు పార్టీ ఆదేశానుసారం మేము పార్టీని చీల్చామని రివిజనిస్టులు ప్రచారం చేశారు. అది శుద్ధ అబద్ధం. ఆ మాటకు వస్తే రష్యా గొడవల్లేకపోతే కమ్యూనిస్టు పార్టీయే వుండేదే కాదు అని ఎవరైనా అనవచ్చుగదా. అయితే చైనా, భారత వివాదం రాకపోయినట్లయితే పార్టీలో చీలిక ఇంకొంతకాలం ఆలస్యమైవుండేది. కాని అనివార్యం మాత్రం అయ్యేది. మా అంతర్గత విభేదాలకు తోడు చైనా దురాక్రమణను త్రిప్పికొట్టేందుకు అమెరికన్ సామ్రాజ్యవాదుల నుండి కూడా సైనిక సహాయం పొందవచ్చు. అన్నంతగా వారు జాతీయ దురంహరంతో కొట్టుకుపోయారు. అందువల్ల పరిస్థితి త్వరితంగా చీలికకు దారి తీసిందిగాని, చైనాయే కారణం ఈ చీలికకు అని చెప్పడం కేవలం దుష్ప్రచారం మాత్రమే. నిజానికి వేరే పార్టీ ఏర్పాటు చేయండని చైనా వారు 1964లో పిలుపునిచ్చారు. 1962లోనే ఇక ఒక పార్టీలోనే కలిపి వుండటం అసాధ్యమని నిర్ణయానికి వచ్చామని ఇంతకు ముందే చెప్పాను. 1956 నుండి కూడా తీవ్రమైన అంతర్గత పోరాటంలో పార్టీ మునిగి వుంది అని కూడా చెప్పాను. 1956లో బుఖారెస్టులో జరిగిన సభకు భూపేష్‌గుప్తా, ఎం.బి. వెళ్ళారు. అక్కడ కూడా సోవియట్ వైఖరిని బలపరచలేదు. ఆ తరువాత దానిపై కేంద్ర కమిటీ సమావేశం జరిగింది. కేంద్ర కమిటీలో మేము పదకొండు మందిమి, వారు పదకొండు మంది గోపాలన్ మాకు అనుకూలంగా ఓటు చేస్తాడని నేను ప్రత్యేకంగా అర్జెంటుగా రమ్మని టెలిగ్రాం ఇచ్చి కేంద్రకమిటీ మీటింగుకు పిలిపించాను. కాని, ఆయన వచ్చి వాళ్ళకు అనుకూలంగా ఓటు చేశారు. దాంతో ఒక్క ఓటు తేడాతో బుఖారెస్టు తీర్మానాన్ని బలపరుస్తూ మా కేంద్ర కమిటీ కూడా తీర్మానించింది. గోపాలన్ నాకు చాలా సన్నిహితుడు. "అదేమిటయ్యా? మాకు వ్యతిరేకంగా వాళ్ళకు ఓటేసేందుకు నిన్ను పిలిపించానటయ్యా?" అని అడిగాను. దానికి గోపాలన్ నిజమేననుకోండి... అంటూ ఊరుకున్నాడు. అదంతా గోపాలన్‌కున్న సైద్ధాంతిక గందరగోళంవల్ల జరిగింది. గోపాలన్ గొప్ప ప్రజానాయకుడు కాని సైద్ధాంతికంగా వచ్చేసరికి కొంత గందరగోళంలోనే వుండేవాడు.

కనుక సోవియట్, చైనాల వల్ల భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ఈ తేడాలు వచ్చినాయి అనడం అవాస్తవం. స్టాలిన్ సమస్యపై సోవియట్‌తో విభేదించాము. అంతకు ముందు భారత ప్రభుత్వంతో సహకరించాలని సోవియట్ ఇచ్చిన సలహాను తిరస్కరించాము. 1957లో సోవియట్, చైనా పార్టీలు రెండూ అదే సలహానిచ్చినప్పుడు తిరస్కరించాము. 1960లో ఒక

కేంద్రం కమిటీ సమావేశంలో అజయ్‌ఘోష్ ప్రసంగిస్తుండగా నేను అడ్డుతగిలి "అజయ్ నువ్వు చైనాకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నావు. నువ్వు చెబుతున్నది వాస్తవం కాదు" అని బిగ్గరగా అరిచాను 'ఎందుకు బిగ్గరగా అరుస్తావు' అని కామ్రేడ్స్ అడిగారు. "తప్పుడుగా మాట్లాడుతుంటే లేదుగాని, అరిస్తే వచ్చిందా?" అని అడిగాను. కొన్ని సందర్భాల్లో అవసరాన్ని మించి కోపగించుకొని వుండివుంటాను.

1961 విజయవాడ మహాసభ సందర్భంగా పి.సి. జోషిగారు రాసిన ఒక వ్యాసాన్ని విశాలాంధ్రలో ప్రచురించాలని వారు ప్రయత్నించారు. నేను అంగీకరించలేదు. "మీరు దాన్ని ప్రచురిస్తే మిమ్మల్ని అందర్నీ బయటకు గెంటేస్తాను" అని చెప్పాను. తగాదా అయింది. చివరికి ఎలాగో సర్దుమణిగింది. 1962లో పార్టీ విభేదాల సందర్భంగా నాయకత్వంలో ఎక్కువ మంది అటువైపు వున్నారు. అదీగాక మేము అందరం జైల్లో వున్నాం. ఆ సమయం చూసుకొని 'విశాలాంధ్ర'ను వారాక్రమించారు. కొందరు సానుభూతిపరులు "పోనీయండి మనం వేరే పత్రిక పెట్టుకుందాం" అని సలహా ఇచ్చారు. వేరే పత్రిక పెట్టుకోగలమని నాకు తెలుసు. మనకు బలం లేనప్పుడు ఊరుకోవడం మంచిది. వేరే సంస్థను స్థాపించడం పెద్ద కష్టమేమీ కాదు. ఆ విషయంలో నాకెంతో విశ్వాసం వుంది. ఎన్ని నిర్మించలేదని? 1945 నుండి ప్రజాశక్తి, నవశక్తి, విశాలాంధ్ర ఇవన్నీ మేము నిర్మించినవే. కనుక మరొకటి నిర్మించగలం అని అనుకోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. ముఖ్యమైంది ప్రజా ఉద్యమం.

ఈ కాలంలో జరిగిన వివిధ జిల్లాల్లో జనరల్ బాడీల గురించి సగంలో ఆపేశాను కదా. ప్రతి జనరల్ బాడీలోనూ 6 నుండి 8 గంటలు దాకా ఉపన్యసించే వాడిని. మొత్తం మీద పార్టీలో మెజారిటీ సభ్యులను ఆంధ్రలో మనవైపు రాబట్టుకోగలిగాం. కాని నాయకత్వంలో అలా లేదు. వివిధ రాష్ట్రాల్లోనూ అంతకుముందు నుండే మన విధానం కోసం పోరాడుతున్న కామ్రేడ్స్ ఉన్నారు. అందరితోనూ కలిపి 1964 జులైలో తెనాలిలో ఒక సదస్సు పెట్టి మహాసభకు పిలుపునిచ్చాం. అప్పుడంతా పైపైన సభ్యత్వం. అమృత్‌సర్‌లో జనబాహుళ్యం (మాస్) పార్టీగా నిర్మించాలని భావించారు కదా. ఆంధ్రలో 28 వేల సభ్యత్వం వున్నది. మహాసభ పూర్తి కాగానే మమ్మల్నందర్నీ మళ్ళీ నిర్బంధించారు. 1966లో విడుదలైనాము. ఆ తరువాతగాని సభ్యత్వాన్ని సరిగా పరిశీలించే అవకాశం కలుగలేదు.

ఇంతకీ మార్క్సిస్టు పార్టీ ఏర్పడటంలో ఎం.బి., ఎం.హెచ్. వంటి ఆంధ్ర కామ్రేడ్స్‌తో కలిసి నేను ఒక ముఖ్యమైన పాత్రను నిర్వహించాను. మొదటి నుండి ఈ పోరాటంలో ఆంధ్ర కామ్రేడ్స్‌గా నేను, ఎం.బి. ముందున్నాం. సూర్జిత్ మాతో వుండేవాడు. ఆ తరువాత రామమూర్తి, ఎం.ఆర్. వెంకట్రామన్ మా వైపుకు వచ్చారు. పిదప కొంత కాలానికి ప్రమోద్, జ్యోతి ఇటువైపు మొగ్గారు. అయితే జ్యోతికి కొన్ని సంశయాలు యింకా వుండేవి. కాని వారు ఇటువైపు రావడంతో మాకు వూపు వచ్చింది. ఆ తరువాత 1963, 64లో గాని కేరళ కామ్రేడ్స్ యిటువైపు రాలేదు.



ఇ.ఎం.ఎస్.కు కూడా కొన్ని సంశయాలు, సందేహాలు యింకా మిగిలే వున్నాయి. అయినా కేరళ ఎన్నికల్లో మనకు 34, సిపిఐకి మూడు సీట్లు రావడంతో మన విధానం సరయినదని మరింతగా రుజువైనది. ఉమ్మడి పార్టీలో వుంటూనే నేను, ఎం.బి., సూర్జిత్, రామమూర్తి అప్పుడప్పుడూ కలుసుకుంటూ వివిధ రాష్ట్రాల్లో పరిస్థితిని చర్చించుకుంటూ వుండేవాళ్ళం. కామ్రేడ్ ఎం.బి. కేంద్రంలో వుంటూ పార్టీ ప్రోగ్రాం తదితర సైద్ధాంతిక అంశాలు చూస్తూ వివిధ రాష్ట్రాలతో సంబంధాలు పెట్టుకుంటూ వుండేవాడు. తరచుగా మేము కలుసుకొని చర్చించుకుంటూ వుండేవాళ్ళం. మహాసభలో కొత్తగా ఏర్పడిన ఈ పార్టీకి కార్యదర్శి ఎవరు అనే ప్రశ్న వచ్చింది. జ్యోతి, ఇ.ఎం.ఎస్.లకు కొన్ని సందేహాలున్నాయి కదా, తమిళనాడు ఉద్యమం బలహీనంగా వున్నది. ప్రమోద్ బెంగాల్ నుంచి కదిలే పరిస్థితి లేదు. పంజాబ్‌తో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ ఉద్యమం విస్తృతమైంది, లోతైంది. కనుక ఆంధ్ర నుండి కార్యదర్శి వుండాలి. అదీగాక యీ పోరాటంలో మొదటి నుండి నేనూ, ఎం.బి. ఖచ్చితంగా, స్థిరంగా ముందు వుంటూ వచ్చాం.

అయితే ఎం.బి. కేంద్రంలో వుండి వివిధ రాష్ట్రాలతో సంబంధం పెట్టుకుంటూ సైద్ధాంతిక అంశాలు చూస్తున్నాడు గనుక ఆయనే కార్యదర్శి అవుతాడని అందరూ అనుకున్నారు. కాని తీరా ఆంధ్ర కామ్రేడ్స్ నన్నే కార్యదర్శిగా వుండమని బలవంతపెట్టారు. నేను మొదట్లో అంగీకరించలేదు. కాని వారు పట్టుపట్టారు. ఈ అంతర్గత పోరాటంలో స్థిరంగా వుండడం, పార్టీ నిర్మాణ తొలిదశలో ఒక ముఖ్య పాత్ర వహించడం, సాధారణంగా దేశవ్యాపితంగా కూడా కాస్తో కూస్తో గుర్తింపు కలిగి వుండడం, అన్నింటినీ మించి నిర్మాణ విషయాల్లో అనుభవం కలిగి వుండడం - ఇవన్నీ కారణాలుగా చెప్పారు. ఆ విషయమే బసవపున్నయ్యతో కూడా చెప్పారు. నేను మాత్రం ఈ సైద్ధాంతిక రాజకీయ అంశాల విషయంలో బసవపున్నయ్య నాకు అవసరమని, కనుక బసవపున్నయ్య కేంద్రంలో వుండేటట్లయితేనే నేను కార్యదర్శిగా వుంటానని అన్నాను. బసవపున్నయ్య దానికి అంగీకరించారు. అయితే ఇప్పటికీ కొందరు కామ్రేడ్స్ బసవపున్నయ్య, నేను ఇద్దరం కేంద్రంలో వుండటంవల్ల ఆంధ్రలో ఉద్యమానికినష్టం జరిగిందని అంటుంటారు. ఏదో కొంత వాస్తవం వుండొచ్చేమోగాని, ఆ అభిప్రాయం సరైనదికాదు. ఒకరిద్దరు వ్యక్తులు వున్నారా లేదా అని కాదు. ఏమైనా మేము లేకపోవడంవల్ల ఆంధ్రలో పార్టీకి నష్టం జరిగిందనటం అవాస్తవం.

# ప్రభుత్వ నిర్బంధకాండ, దుష్ప్రచారం

1964 కలకత్తాలో పార్టీ మహాసభ రేపు జరుగుతుంది అనగా ప్రమోద్‌దాస్ గుప్తాతో సహా కొంత మంది బెంగాల్‌లోని ముఖ్యనాయకులను ప్రభుత్వం నిర్బందించింది. ప్రభుత్వానికి కూడా కొంత సమాచారం చేరింది. 1963, 64లో పార్టీ ఏర్పాటుకు ముందు వివిధ రాష్ట్రాల్లో మేము చేసిన ప్రచారం ఫలితంగా పార్టీలోని సమరశీల శక్తులు, మెజారిటీ పార్టీ సభ్యులు మా వైపు మొగ్గారు. అందుకని మమ్మల్ని చైనా ఏజెంట్లుగా దుష్ప్రచారం చేసి వేరు చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. అది ఫలించలేదు. మేమే ప్రభుత్వానికి నిజమైన ప్రమాదకారులమని ప్రభుత్వం భావించి, మార్క్సిస్టు పార్టీని మొగ్గలోనే తుంచేయాలని ప్రయత్నించింది. అందులో భాగమే ఈ అరెస్టులు. అయినా జ్యోతిబాసు, మరికొందరి నాయకుల్ని నిర్బంధించలేదు. బెంగాల్‌లో పార్టీ బలంగా వుంది. కనుక ఏమైనా తీవ్రమైన దాడి జరిగితే ఎదుర్కొవాల్సిందే గాని పార్టీ మహాసభను వాయిదా వేయరాదని నిర్ణయించు కున్నాము. మహాసభ జరిపి కేంద్ర కమిటీని, పొలిట్ బ్యూరోను ఎన్నుకోవలసి వుంది.

ఈ విధంగా నిర్బంధించడం ద్వారానే కాకుండా భారత ప్రభుత్వం తన ఏజెంట్లను కొందరిని అతివాద పదజాలంతో ముసుగువేసి మహాసభకు పంపింది. మహాసభలో వారు తక్షణ సాయుధ పోరాటం అంటూ ప్రతివాదన చేయసాగారు. ఇలాంటి వారు కొందరు బెంగాల్ పార్టీలో ఆ మధ్య కాలంలో చేరారు. పార్టీకి ఏమీ సంబంధం లేకుండా వారు చైనా రాయబార కార్యాలయానికి, నేపాల్ రాయబార కార్యాలయానికి సాయుధ పోరాటానికి ఆయుధ సహాయం చేయండి అని అడిగేందుకు వెళ్ళారు అయితే చైనా వారు చాలా అనుభవజ్ఞులు. వాళ్ళను నమ్మలేదు. కనుక సహకారం అన్న ప్రశ్న అప్పట్లో రాలేదు. నేను కామ్రేడ్ జ్యోతిబాసును, తదితర నాయకులను పిలిచి ఇలాంటి వ్యక్తులపట్ల అప్రమత్తంగా వుండమని, మన పార్టీని ధ్వంసం చేసేందుకు భారత ప్రభుత్వం ఈ నాటకం ఆడుతూ వుండవచ్చని హెచ్చరించాను. వారిని జాగ్రత్తగా గమనించి పార్టీలోంచి బహిష్కరించాలి. అలాంటి శక్తులకు మన పార్టీలో స్థానం లేదు.

మహాసభ అక్టోబరు 31 నుండి నవంబరు 7 వరకు జరిగింది. ఒక్క మాటలో చెప్పాలంటే వేరే పార్టీ ఏర్పాటు చేసుకోవాలన్న నిర్ణయ ద్వితీయ వార్షికోత్సవమన్నమాట



పొలిట్‌బ్యూరోలో నేనూ, బసవపున్నయ్య, ప్రమోద్, జ్యోతి, ఇ.ఎం.ఎస్. గోపాలన్, రామమూర్తి, సూర్జిత్, బి.టి.ఆర్. ఈ తొమ్మిది మందిమి ఎన్నికైనాము. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. బి.టి.ఆర్.ను 1962లోనే నిర్బంధించి, మమ్మల్ని విడుదల చేసినట్లుగా మధ్యలో విడుదల చేయకుండా 66లోగాని ప్రభుత్వం విడుదల చేయలేదు. మార్క్సిస్టు పార్టీకి సంబంధించిన కార్యక్రమాల్లో ఆయన లేడు. అయినా ఆయన అనుభవాలూ, శక్తియుక్తుల దృష్ట్యా పొలిట్‌బ్యూరోకు అవసరమని భావించి ఆయన్ను ఎన్నుకొన్నాము.

పశ్చిమబెంగాల్‌కే కాదు, వివిధ రాష్ట్రాలకు సంబంధించిన కేంద్ర కమిటీ సభ్యులకు కూడా ఈ అతివాద, దుందుడుకువాద శక్తులను గూర్చి హెచ్చరించాం. రివిజనిజంకు వ్యతిరేకంగా పోరాడుతున్న సందర్భంగా, ఇలాంటి శక్తులు అతివాద వాగాడంబరంతో పార్టీలో జొరబడుతుంటే, కొన్ని సందర్భాలలో వాటిని సరిగా గమనించలేదు. కనుక తగినంత జాగ్రత్తగా వుండాలనీ, అలాంటి శక్తులు పార్టీని ధ్వంసం చేస్తాయనీ హెచ్చరించాము.

పార్టీ మహాసభ అనంతరం పార్టీ మహాసభకు సంబంధించిన డాక్యుమెంట్లను ఎడిట్ చేసి ప్రకటించడం, మార్క్సిస్టు పార్టీగా ఎందుకు ఏర్పడవలసివచ్చిందో వివరించే కరపత్రాన్ని, పార్టీలో మితవాద సంస్కరణ వాదానికి వ్యతిరేకంగా జరిగిన అంతర్గత పోరాటాన్ని గూర్చిన కరపత్రాన్ని విడుదల చేశాము. వివిధ ప్రజారంగాలలో, వర్గ సంఘాలలో పార్టీ పని విధానం ఎలా వుండాలి అన్న విషయానికి కూడా తుది రూపం యిచ్చి, డాక్యుమెంట్లను తయారు చెయ్యాల్సిన పని వుంది. అందుకై త్రిచూర్‌లో కేంద్ర కమిటీ సమావేశం ఏర్పాటు చేసుకున్నాం. అదీగాక, అంతర్జాతీయ సిద్ధాంత విభేదాలకు సంబంధించిన చర్చయింకా పూర్తికాలేదు. తర్వాత చేద్దామనుకున్నాం గదా. ఆ పనీ వుంది.

ఈ లోపల కేంద్ర కమిటీ తరపున నేను వెళ్ళి నాటి హోంమంత్రి శ్రీ గుల్జారిలాల్ నందాను కలుసుకున్నాను. ఇంకా విడుదలకాని, యాభైకిపైగా వున్న మా పార్టీ నాయకులను విడుదల చేయమని అడిగాను. "పోలీసుల సంగతి మీకు తెలుసు. మాకు తెలుసు. మాపై ఏవో కట్టుకథలల్లుతున్నారు. మేము చైనా పార్టీ అనుయాయులము కాము. మా పార్టీ స్వతంత్రమైన పార్టీ, చైనా వారి పని చేసేందుకు యిక్కడ మేము లేము. మేము తక్షణం సాయుధ పోరాటానికి సన్నద్ధమవుతూన్నమన్న నెపంతో మాపై దాడికి ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది. సాయుధ పోరాటం చేయవలసింది ప్రజలు. మేము యింకా పార్టీని నిర్మించుకునే స్థితిలోనే వున్నాము" అని వివరించాను. ఆయన 'అబ్బే అలాంటి ఆలోచనేంలేదు' అని దాటవేశాడు. అయినా పార్టీపై దాడి జరగవచ్చునని వూహిస్తున్నదే. అయితే ఏం చేయాలి. అందుకు సిద్ధంగా వుంటూ పార్టీని నిర్మించుకోవాలి పార్టీని నిర్మించుకోవడం కూడా దాడిని ఎదుర్కోవడంలో భాగమే అన్న అభిప్రాయానికి వచ్చాము.

ఈ సమయంలో కేరళ ప్రభుత్వం కూలిపోయింది. మధ్యంతర ఎన్నికలు జరుగనున్నాయి. పార్టీ ఎన్నికలలో పోటీ చేయాలి. అన్నట్లు పార్టీ పేరేమిటి అన్నది కూడా అంతకుముందు చర్చనీయాంశమైంది. మన కామ్రేడ్స్ మన పార్టీ పేరు భారత కమ్యూనిస్టు పార్టీగానే వుండాలని అన్నారు. మనమే భారత దేశంలో నిజమైన కమ్యూనిస్టులం, కమ్యూనిస్టు ఉద్యమ పోరాట సత్సంప్రదాయాలకు మనమే వారసులం, ఆ పేరు మనకే ఉండాలి అన్నది వాదన. నిజమే, కానీ, కేరళలో ఎన్నికలు ఫిబ్రవరిలో జరుగనున్నాయి. ఎన్నికల కమీషనర్‌కు

మనమే కమ్యూనిస్టు పార్టీ అని, కంకీకొడవలి మనకు కేటాయించాలి అని కోరాము. ఎన్నికల కమీషన్ "ఎన్నికలు యింకా మూడు నెలలు కూడా లేవు. ఏది కమ్యూనిస్టు పార్టీ అని ఎలా నిర్ధారించాలి. ఒకవేళ నిర్ధారణకు వచ్చినా, మళ్ళీ అది కోర్టుకెక్కి వివాదగ్రస్తం అయితే తేలేదెన్నడు. ఈ దశలో వారిది కమ్యూనిస్టు పార్టీ కాదని, మీదే కమ్యూనిస్టు పార్టీ అని చెప్పలేము. కనుక మీరు పేరు మార్చుకుని, ఎన్నికల గుర్తు వేరే అడిగితే యిస్తాము" అని చెప్పింది. అంతకుముందే యీ సమస్య వస్తుందని వూహించే వున్నాము. అందువల్ల అలాంటి పరిస్థితి వస్తే, మనపార్టీ పేరు భారత కమ్యూనిస్టు పార్టీ అని, బ్రాకెట్లో 'మార్క్సిస్టు' అని వుంచుకునేందుకు పార్టీ మహాసభ ఆమోదం పొంది వున్నాము. కనుక భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)గా ప్రకటించాము. ఇక ఎన్నికల గుర్తు సుత్తికొడవలి నక్షత్రం వుండాలని  అడిగాము. గతంలో ఒకసారి ఉమ్మడి పార్టీ ఎన్నికల గుర్తుగా దాన్ని అడిగితే ఏవో కారణాలు చెప్పి తిరస్కరించారు. రష్యన్ పతాక చిహ్నం అని అందువల్ల కాదన్నట్లున్నారు. మేము "యిది రష్యన్ పతాకం కాదు. ఆ జెండాకు జెండాకర్రమూలలలో పైన నక్షత్రం వుంది. మా ఎన్నికల గుర్తులో జెండా మధ్యలో వుంది. కార్మిక, కర్షక ప్రజలకు పార్టీ 'వ్యాన్ గార్డ్' అనేందుకు నక్షత్రం గుర్తు" అని వాదించాము. ఎన్నికల కమీషన్ అంగీకరించింది. 'ఎవరికన్నా అభ్యంతరాలున్నాయా' అని అడిగింది. డాంగే అభ్యంతరం తెలిపాడు. ఎన్నికల గుర్తు జెండా గుర్తు గనుక ఓటర్లు గందరగోళపడతారని వాదించాడు. గందరగోళం ఏమీ లేదు, మీది 'కంకీకొడవలి, వారిది సుత్తికొడవలి నక్షత్రం' అని చెప్పి డాంగే వాదనను ఎన్నికల కమీషన్ తిరస్కరించింది. కమీషన్ కూడా త్వరగా తేల్చుకోవాల్సి వుంది గదా.

ఆ ఎన్నికలు చాలా ప్రధానమైనివి గనుకనే కేంద్ర కమిటీ సమావేశాన్ని కేరళలో వేసుకున్నాం. రేపు కేంద్ర కమిటీ సమావేశమనగా పొలిట్‌బ్యూరో సమావేశమవుతున్నది. కొందరు కేంద్ర కమిటీ సభ్యులు కూడా వచ్చివున్నారు. త్రిచూర్‌లో వున్న కేంద్ర కమిటీ సభ్యులనందరినీ, త్రిచూర్ వస్తూ మార్గ మధ్యంలో వున్న కేంద్ర కమిటీ సభ్యులను, కేరళలోనేగాక దేశవ్యాపితంగా వివిధ రాష్ట్రాలలో వున్న పార్టీ నాయకులను ప్రభుత్వం అరెస్టు చేసింది. అంటే మేమూహించినట్లే ప్రభుత్వం దాడికి పూనుకున్నదన్నమాట. కేరళలో దాదాపు రాష్ట్ర, జిల్లా నాయకత్వాలను మొత్తంగా అరెస్టు చేసింది. రెండవ శ్రేణి నాయకత్వం, రహస్యంగా వెళ్ళిన కామ్రేడ్స్ మాత్రం మిగిలారు. ఈసారి కూడా, నంబూద్రిపాద్‌ను, జ్యోతిబాసును అరెస్టు చేయలేదు. వారికి కొన్ని సంశయాలున్నాయని ప్రభుత్వానికి తెలుసు. వారిని వదిలేస్తే విభేదాలు మాలో రావచ్చుననీ లేదా వారు బయట వుండి పార్టీ విధానాన్ని అమలు జరపకపోతే, వారు అప్రతిష్టపాలై పార్టీ నుండి వేరుపడిపోతారని ప్రభుత్వ పథకం, ఏమైనా, వారని అరెస్టు చేయకపోవడం మంచిదయింది. పార్టీని సమీకరించి, కార్యక్రమాలు నిర్వహించగల అవకాశం వారికి ఏర్పడింది.

కేరళ కామ్రేడ్స్ చాలా దీక్షతో కృషి చేశారు. మనం గెలుస్తామనీ, సిపిఐ ఎక్కడా వుండదని కేరళ కామ్రేడ్స్ బాగా విశ్వాసంతో వున్నారు. అది చాలా కోణాల పోటీ సిపిఐ, పిఎస్‌పి, కాంగ్రెస్ చీలివుండగా, ముస్లింలీగ్ వొంటరిగా పోటీ చేస్తున్నది. మనకూ ముస్లింలీగ్‌కు ఏమీ అవగాహన లేదుగానీ, ప్రతి నియోజకవర్గంలోనూ వారు మనకు పోటీగా రాకుండా వుండగలందులకై కొన్ని నియోజకవర్గాలలో వారు పోటీ చేస్తున్న చోట మనం మానుకున్నాం. తద్వారా కాంగ్రెస్ వ్యతిరేక ఓట్లు చీలకుండా చూడాలని.



మేమందరం త్రిచూర్‌లో అరెస్టు చేయబడినాంగనుక అక్కడ జైల్లోనే వున్నాం. నేనూ, బసవపున్నయ్య, గోపాలన్, రామ్మూర్తి నలుగురం పొలిట్‌బ్యూరో మెంబర్లం, యింకా కొందరు కేంద్ర కమిటీ సభ్యులు, మాతోపాటు కేరళ నాయకుడు కామ్రేడ్ కనరన్ కూడా  జైల్లో వున్నాడు. ఆయనకు కేరళ పార్టీ పరిస్థితి గూర్చి మంచి పట్టు వుంది. ఎన్నికలకు ముందే ఏ యే నియోజక వర్గంలో ఎందరు వోటర్లు? నిరోధక శక్తుల బలాబల ఏమిటి? మనకెన్ని ఓట్లు వస్తాయి? అవన్నీ చెప్పాడు. ఎన్నికల ఫలితాలు ఆయన చెప్పినవన్నీ దాదాపు నూటికి నూరు పాళ్ళూ వాస్తవమని నిరూపించాయి. ప్రజలతోనూ, పార్టీ నిర్మాణంతోనూ ఆయనకున్న సజీవ సంబంధాలు అలాంటివి. మనమే ఏకైక పెద్ద ప్రతిపక్షంగా వచ్చాము. సిపిఐకి మూడు సీట్లు వచ్చాయి. అందులో రెండు మనం పోటీ చేయనివి. ఒక రిజర్వుడు నియోజక వర్గంలో పోటీ పెట్టవద్దనుకొని బలపరిచాము. వారికి 5-10 మధ్య శాతం ఓట్లు వచ్చాయి. మనకు 25 శాతం ఓట్లు వచ్చాయి.

మేము జైల్లో వుండగానే నందా ఒక శ్వేతపత్రం ప్రవేశపెట్టాడు. "తెలంగాణా పోరాటం" లాంటిది దేశ వ్యాప్తంగా ఆరంభించేందుకు ఒక పథకం వేశామని అందులో ఆరోపించాడు. అదంతా అబద్ధం అని జైలు నుండే సమాధానం యిచ్చాము. నాలుగు నెలల తర్వాత త్రిచూర్ జైలు నుండి మమ్మల్ని, మామా రాష్ట్రాల జైళ్ళకు మార్చారు. నన్ను, బసవపున్నయ్యను సికింద్రాబాద్ జైలుకు తీసుకువచ్చారు. నిజానికి 1962లో గానీ, ఈసారిగాని మేము డిటెన్యూలము కనుక, జైలు జీవితం ఏమీ బాధాకరంగా లేదు. స్వేచ్ఛగాలేము. అంతేగానీ, పత్రికలు తెప్పించుకునేవాళ్ళం, మా భోజనాలపై మాదే యజమాయిషీ. త్రిచూర్ జైల్లో గోపాలన్ కూడా వున్నారు కదా. అందులో కేరళ. ఆయన జైలు సూపరింటెండెంటును పిలిచి నువ్వు తెలివి తక్కువ దద్దమ్మవు నీకేం తెలియదు. ఇట్లా చెయ్యమని ఆదేశించేవాడు. ఆ సూపరింటెండెంట్ కూడా సరేనండి.  మీరు చెప్పినట్లే చేస్తాననే వాడు. అయితే 1962లో డిటెన్యూల కుటుంబాలుకు ఏమీ యివ్వలేదు. దానిపై ఆందోళన జరిపితే నామమాత్రంగా ఏదో పంపేవారు. చాలా మంది కామ్రేడ్స్ కుటుంబాలు గడవడం కష్టంగా వుండేది. అంతకు తప్ప, జైళ్ళలో బాధపడిందిలేదు.

1962లో అరెస్టు చేయబడిన వారిలో ప్రస్తుతం సిపిఐతో వుంటున్న వారు సదాశివన్, శ్రీకృష్ణ, ఎల్లారెడ్డిలాంటి వాళ్ళు కూడా వున్నారు. వారి కేంద్ర నాయకత్వం, తాము కేంద్ర కమిటీ తీర్మానానికి అనుకూలంగా వున్నట్లు రాసివ్వమని వీరిని ఆదేశించింది. ఆ మేరకు రాసిచ్చి విడుదలైనారు. ఒకరిద్దరు అలా రాసి ఇవ్వనిరాకరించారు. సిపిఐ రిప్రజెంటేషన్లు జరిపింది. జైల్లో వుండగా బయట వారితో సంబంధాలు పెట్టుకోవడం, మాపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టేందుకు వ్యాసాలు అవీ రాసి బయటకు చేరవేయడం చేస్తూ వుండడం సహజం. అలాగే జైల్లో వున్న కామ్రేడ్స్ సిద్ధాంత పరిజ్ఞానాన్ని పెంచేందుకై రాజకీయ తరగతులు నిర్వహించడం, వారి ఆత్మస్థయిర్యాన్ని నిలబెట్టేందుకు కృషి చేస్తుండే వాళ్ళం. 'మేము జైల్లో వుండగానే కామ్రేడ్ డి.వి. సుబ్బారావు, ఇతర కామ్రేడ్స్ ఇక్కడ 'జనశక్తి' వారపత్రిక ప్రారంభించారు "ప్రజాశక్తి" అన్న పేరుకు అనుమతి లభించలేదు.

# మహాసభలో చికిత్స

1956లో నాకు కడుపులో పుండుకుగాను ఆపరేషన్ చేశారు. అయితే 1953, 1959లో మళ్ళీ విపరీతమైన కడుపులో నొప్పి వాంతులు మొదలైనాయి. ఒకసారి ఖమ్మం మహాసభ అనంతరం బహిరంగ సభ వుంది. ఆ సభలో నేను ప్రసంగించాల్సి వుంది. తీరా ప్రసంగం ఆరంభించబోయే ముందు విపరీతంగా కడుపులో నొప్పి వచ్చింది. తమాయించుకుని, ఏవో నాలుగు మాటలు మాట్లాడి, ఎవ్వరికీ నొప్పి సంగతి చెప్పకుండా వేదికదిగాను. అడ్వకేట్ సుబ్బారావు ఇంటి తాళం చెవి నా వద్ద వుంది. లోపలికి వెళ్ళి పడుకున్నాను. మర్నాడు విజయవాడ వచ్చేందుకని స్టేషన్‌కు వచ్చాను. ప్లాట్‌ఫారం ఎక్కగానే పెద్దవాంతి అయింది. పోర్టరు కామ్రేడ్స్ కలిసి ఎత్తుకుని తీసుకు వచ్చి స్టేషన్‌లో పడుకోబెట్టారు. రైల్లో విజయవాడ చేరాను. పిన్నమనేని క్లినిక్‌లో వున్నాను. నెల్లూరుకు ఫోన్ చేస్తే డాక్టర్ శేషారెడ్డి వచ్చాడు.  అప్పుడు రామ్ మతి స్థిమితంలేని దశలో వున్నాడు. అక్కడ నుండి మద్రాసు జనరల్ ఆస్పత్రికి వెళ్ళాము. రామ్ కూడా ఈ లోపల కొంచెం బాగుపడి మద్రాసు వచ్చాడు. మళ్ళీ నాకు ఆపరేషన్ అవసరం అన్నారు. ఇక్కడ చేయించుకోవాలా, మళ్ళీ రష్యా వెళ్ళాలా అన్న ప్రశ్న వచ్చింది. మన కామ్రేడ్స్, డాక్టర్సు రష్యా వెళ్ళమన్నారు. సంజీవరెడ్డి ముఖ్యమంత్రి ఆయనా రష్యా వెళ్ళమని చెప్పాడు. రష్యా వెళ్ళాను. రెండోసారి మళ్ళీ ఆపరేషన్. ఆరు నెలలు రష్యాలో వున్నాను. తిరిగి వచ్చిన తర్వాత రెండేళ్ళు బాగానే వుంది. కానీ, మళ్ళీ నీళ్ళ విరోచనాలు, రక్తహీనత మొదలైనాయి విటోఫాల్ ఇంజెక్షన్లు చేయించుకుంటుండేవాడిని. త్రిచూర్ జైల్లో కూడా అవి కొనసాగాయి. సికింద్రాబాద్ జైలుకు వచ్చిన తర్వాత రాజమండ్రి నుండి డాక్టర్ శేషారెడ్డి కూడా ఈ జైలుకు వచ్చాడు. ఒక రోజు పెద్ద వాంతయింది. దాని రంగును బట్టి ఇది ప్రమాదకరమయిందని, వెంటనే ఆస్పత్రిలో చేర్చాలనీ డాక్టర్ శేషారెడ్డి సూచించాడు. ఉస్మానియా ఆస్పత్రిలో జేర్చారు. వాంతులు తగ్గాయిగానీ, ఆ రాత్రి చాలా ప్రమాదంగా గడిచింది. రక్తం ఎక్కించారు. శేషారెడ్డిని కూడా నాతో వుంచారు.

ఆపరేషన్ చేసి మొత్తం పొట్ట అంతా తీసివేయాల్సి వచ్చింది. డాక్టర్ రమేష్‌పాయ్ "అది చాలా పెద్ద ఆపరేషన్, అవసరమైతే చేద్దాము" అన్నారు. కానీ మన కామ్రేడ్స్ అందరూ, "అంత పెద్ద ఆపరేషన్ ఇక్కడ వద్దు, రష్యాలోనే చేయించుకోవా"లని పట్టుబట్టారు. అది



1965 అప్పటికే మనం మార్క్సిస్టు పార్టీగా ఏర్పడ్డాము. రష్యావారికి, మనం వారితో కొన్ని విషయాల్లో విబేధిస్తున్నామని తెలుసు. అంతకుముందు పంజాబ్ కామ్రేడ్ సత్వంత్‌ను రష్యా పంపాము వైద్య నిమిత్తం. కానీ ఎందుకో వారు గతంలో అంత సోదర భావంతో చూసినట్లు కాకుండా ముభావంగా వున్నారని తెలిసింది. మరి నేను వెళ్ళడం ఎలా వుంటుంది అని నిర్ణయం తీసుకోవలసి వచ్చింది. నేను, "ఇదంతా దేనికి ఇక్కడే చేయించుకుంటాను" అన్నాను. కానీ డాక్టర్లు కూడా అది పెద్ద ఆపరేషన్ అనీ, ఏమన్నా జరిగితే, ఎందుకైనా మంచిది రష్యానే వెళ్ళమన్నారు. వాళ్ళకు విశ్వాసం సరిపోలేదు. బ్రహ్మానందరెడ్డి కూడా అదే అన్నాడు. సరే, అయితే లీలను కూడా నాతో తీసుకువెళ్ళాలనుకున్నాను. డాక్టర్ రామ్ నేను చెప్పినా విన్పించుకోకుండా ఆ సమయంలో రహస్య జీవితం గడపడానికి వెళ్ళాడు. పేరు ప్రఖ్యాతులు పొందిన డాక్టరాయన. ఆయనను నిర్బంధించినందువల్ల ఆ ఆస్పత్రిని మూసివేయించ వచ్చునని ప్రభుత్వం భావించింది. అందుకే డాక్టర్ శేషారెడ్డిని కూడా అరెస్టు చేసింది. అయితే అదృష్టవశాత్తు అప్పటికే డాక్టర్ రమణారెడ్డి వచ్చివున్నారు. ఆయన, శేషారెడ్డి భార్య డాక్టర్ వింధ్య తదితరులు కలిసి ఆస్పత్రిని ఎలానో నిర్వహించారు. డాక్టర్ రామ్‌ని అరెస్టు అవ్వమని ఎందుకు చెప్పానంటే అప్పటికి అతని ఆరోగ్యం ఏం బాగోలేదు. ఇక ఈ రహస్య జీవితంలో వేళకు మందులు తీసుకొని ఆరోగ్యాన్ని సరిగా చూసుకొనే ఆస్కారం ఉండదు. ఈ విషయం చెప్పినా రామ్ అంగీకరించలేదు. దానిని ఓ సవాలుగా తీసుకున్నాడు. ప్రభుత్వానికి దొరికే ప్రసక్తి లేదు అని భీష్మించుకొని రహస్య జీవితంలోకి వెళ్ళాడు. ఇక ఆ స్థితిలో రామ్‌ను కూడా నా వెంట మాస్కోకు తీసుకువెళ్దామనుకున్నాను. ఆయన ఎక్కడున్నాడో తెలుసుకోవటమే కష్టమయింది. ఎలాగో కలుసుకొని నాతోపాటు రమ్మంటే పోలీసులు అరెస్టు చేస్తారు కదా. నేను వాళ్ళకు దొరకదలుచుకోలేదు అని కొంచెం మొండికెత్తాడు. "ఒకవేళ అరెస్టు చేసినా నాతో నీవు రావాలి కనుక, నేను రేపో మాపో వెళ్ళాలి కనుక వెంటనే నీకు పెరోల్ దొరుకుతుంది. నా వెంట రావచ్చు" అని ఎలానో సర్దిచెప్పాను. చివరికి అంగీకరించాడు.

నేను బ్రహ్మానందరెడ్డిని కలుసుకుని రామ్ కూడా నాతో రావాలి అని చెప్పాను. "ఎందుకు? మీ భార్య శ్రీమతి లీల వస్తుంది కదా, అదీగాక రామ్ యింకా అరెస్టు కాలేదు. అది నాకు సాధ్యం కాదేమో" అని సందేహం వెలిబుచ్చాడు నేను రామ్‌తో యీ విషయం చెప్పి నేను వెళ్ళగానే సంజీవరెడ్డిని కలుసుకుంటాను. నా నుండి ఫోన్ రాగానే బయలుదేరి రమ్మని చెప్పి నేను ఢిల్లీ వెళ్ళాను. రామ్‌కు నాకిక్కడ ఆపరేషన్ జరగడం ఇష్టంలేదు. మాస్కోలోనే జరగాలనే నిశ్చితాభిప్రాయంలో వున్నాడు. నేను ఢిల్లీ వెళ్ళి సంజీవరెడ్డిని కలుసుకొని పరిస్థితి వివరించి, రామ్‌ను గనుక నాతో పంపకపోతే రామ్ పరిస్థితి మరింత క్షీణిస్తుందని, తర్వాతయినా పంపక తప్పని పరిస్థితి ఏర్పడుతుందని, కనుక రామ్ కూడా నాతో వచ్చేందుకు అనుమతించమని అడిగాను. వెంటనే సంజీవరెడ్డి నా ఎదురుగానే ఫోన్ అందుకొని బ్రహ్మానందరెడ్డికి ఫోన్ చేసి "బ్రహ్మం డాక్టర్ రామచంద్రారెడ్డిని పంపేందుకు ఏమిటి నీ అభ్యంతరం. పరిస్థితినిబట్టి ఆయన కూడా సుందరయ్యతో వెళ్ళడం అవసరమని నేననుకుంటున్నాను. కనుక రామ్‌ను వెంటనే పంపేందుకు అనుమతించ"మని చెప్పాడు. తదనుగుణంగా రామ్ రెండో రోజున విమానంలో ఢిల్లీ వచ్చి నన్ను కలిశాడు. మేము ముగ్గురం సోవియట్ యూనియన్ వెళ్ళాం. సత్వంత్‌సింగ్

అనుభవం వేరే విషయం. నన్నుమటుకు 1960లో ఏ విధంగా స్వీకరించారో అదే పద్ధతిలో 65లో కూడా సోవియట్ వారు వ్యవహరించారు. నాకేమి మార్పు కన్పించలేదు. అన్నీ తెలిసే వైద్యం చేసేందుకే వారంగీకరించారు గనుక అంతా మామూలుగానే జరిగింది.

విమానాశ్రయంలో డాక్టర్లు, నర్సులతోకూడిన అంబులెన్సు ఎదురు చూస్తున్నది. విమానం దిగీ దిగడంతోటే అంబులెన్సులో ఆస్పత్రికి తీసుకువెళ్ళారు. మాలెంకొవ్ వైద్యం చేయించుకున్న ప్రధానాస్పత్రిలో నన్నొక వార్డులో చేర్చారు. డాక్టర్ రామ్ కూడా డయాబిటీస్ పేషెంట్ కనుక ఆయన నొక వార్డులో చేర్చారు. చుట్టుతా అడవి. విశాలమైన ప్రాంతంలో, పరిశుభ్రమైన వాతావరణంలో వున్న చాలా పెద్ద ఆస్పత్రి అది. ఎన్నో అంతస్తుల భవనాలు, వివిధ డిపార్టుమెంటులుగా, వివిధ బ్లాకులుగా ఎన్నో వున్నాయి. చక్కని పూలతోటలు హాస్పిటల్‌లో పెంచారు. 1960లో కూడా నన్ను ఆ ఆస్పత్రికే తీసుకెళ్ళారు. ఈ ఐదేళ్ళ కాలంలో యింకా ఎంతో ఆస్పత్రి అభివృద్ధి జరిగిందని దాని నిర్వాహకులు సంతోషంగా చెప్పారు.

ఇక్కడ ఓ విషయం చెప్పాలి. చచ్చిపోతానన్న భయం నాకెప్పుడూ కలుగలేదు. అట్లా అని ఖచ్చితంగా బతుకుతానని కూడా లేదు. వైద్యం ద్వారా ఎంత మేరకు చేయగలిగితే అంత మేరకు ఆ డాక్టర్లు కృషి చేయగలరన్న విశ్వాసం నాకుంది. అదీగాక జీవితంలో ఎంతో కొంత సాధించానన్న సంతృప్తి కూడా లేక పోలేదు. అందువల్లనే చావు అన్నది ప్రత్యేకంగా భయంకరంగా నాకు కన్పించలేదు. అయితే రామ్‌తో "ఒకవేళ నేనిక్కడ చనిపోతే ఆ శవాన్ని మళ్ళీ భారతదేశం తీసుకువెళ్ళడం వంటి హడావిడి ఏమీ చేయవద్దు. ఇక్కడే అంత్యక్రియలు ముగించండి" అని చెప్పాను. "అసలు ఆ ఆలోచన దేనికి మీకు ఆపరేషన్‌కు వెళ్ళబోయేముందు" అని రామ్ అన్నాడు అలాంటి ఆలోచన ఏదీ లేదు గనుకనే ఒక వేళ అని అన్నాను. అయినా ఎక్కడ చనిపోతే ఏమి? ఎలా జీవించాం అన్నది ముఖ్యంగాని అని నవ్వుతూ అన్నాను. బతికుంటే ఇంకా ఎక్కువ చేయగలం. చనిపోతే అంతే. ఇదొక్కటే భావన. ప్రొఫెసర్ మద్రుత్ నాకు రెండవ ఆపరేషన్ చేసిన డాక్టర్. ఆయనే ఈసారి కూడా నన్ను పరీక్షిస్తున్నాడు. రక్తం ఎక్కించటం వలన నేను కొంత కొలుకున్నాను. కాని విపరీతమైన నొప్పి అన్పించినప్పుడల్లా పాలు తాగుతుండేవాడిని. ఆ విధంగా నాపై నెలరోజులు వివిధ రకాలుగా పరీక్షలు జరిపి ఇక ఆపరేషన్ తప్పదని డాక్టర్లు నిర్ధారించారు.

1965 అక్టోబరు 5వ తేదీ నాకు ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. చాలా అరుదైన పెద్ద ఆపరేషన్ గనుక ఆ ముందురోజే అంతా సిద్ధం చేశారు. ఆ రోజు ఆపరేషన్. ప్రొఫెసర్ మద్రుత్ నా గదిలోకి వచ్చారు. నన్ను మరోసారి క్షుణ్ణంగా పరీక్ష చేసి "ఇవాళే ఆపరేషన్ చేద్దామని అనుకున్నాను. కాని నా చేతికి ఏదో అయింది కనుక ఇంకో వారం రోజులు ఆపరేషన్ వాయిదా వేస్తున్నానని" చెప్పాడు. కాని మరో డాక్టర్ కలేలియా ఆ తరువాత నాకు "ప్రొఫెసర్ మద్రుత్ చేతికి ఏమి కాలేదని, ఆపరేషన్ ముందు మరోసారి దానికి సంబంధించిన అందరి నిపుణులతోనూ సంప్రదించేందుకు, ఇంకో వారం రోజులు మీరు మరింతగా కోలుకునేందుకు, ఆపరేషన్‌ను ఇంకా తేలికగా భరించగలిగేందుకు వీలుగా సమయం



తీసుకున్నా"డని చెప్పింది. సరే ఏది ఏమైనా నేను చేసేది ఏముంది? డాక్టర్ల నిర్ణయం. అందులో ప్రొఫెసర్ మద్రుత్ ఈ విభాగానికే ఉన్నతాధికారి. రోగిగా నేను ప్రొఫెసర్ మద్రుత్ చెప్పిందానికి అంగీకరించాల్సిందే కదా.

శస్త్రచికిత్స విభాగానికి ప్రొఫెసర్ కేశిశేవ్ అధిపతిగా వున్నది. ఆమె ప్రతి రోజు వచ్చి చూసి ఆందోళన చెందవలసిన అవసరం ఏమీలేదని, అంతా సవ్యంగానే జరుగుతుందని చెప్తుండేది. నాకా ఆందోళన ఏమీలేదని, వారి వైద్య నైపుణ్యం మీద సోవియట్‌లో అభివృద్ధి చెందిన వైద్యశాస్త్రం మీద అపారమైన విశ్వాసం ఉందని చెప్పేవాడిని.

ఆపరేషన్ ఉదయం 9 గంటలకు మొదలైన సాయంత్రం 5-30 గంటల వరకు ఏకధాటిగా సాగింది. డాక్టర్ రామ్ కూడా ఆపరేషన్ థియేటర్‌లోనే వున్నాడు. ఆయన కూడా రోగి గనుక, ఆపరేషన్ థియేటర్‌లో ఆయన్ను ప్రత్యేకంగా చూసుకునేందుకు డాక్టర్ కలేలియా కూడా వుంది. ఆపరేషన్ అయిన 3వ రోజున "మీ ఆపరేషన్ జయప్రదంగా ముగిసిన దగ్గర నుండి రామ్‌కు డయాబిటిస్ తగ్గిపోనారంభించింది. ప్రవర్తనలో కూడా స్థిమితం వచ్చింద"ని చెప్పింది. ఆమె అన్నది నిజమే. బహుశ నాకాపరేషన్ ఎలా జరుగుతుందో అన్న ఆదుర్దా, ఆందోళనతో వున్న రామ్, నేను మృత్యుముఖం నుండి బయటపడినట్లు గ్రహించిన తరువాత కోలుకోనారంభించాడు.

ఆపరేషన్‌ను గురించిన సమాచారం అంతా డాక్టర్ రామ్ వివరంగా రాశాడు. అది డాక్టర్ శేషారెడ్డికి పంపాడు. లీల మనసులో ఎంత ఆందోళన చెందిందోగానీ, పైకి మాత్రం చాలా మామూలుగా, స్థిమితంగా వుంది. రామ్ 1965 డిసెంబర్‌లోనే తిరిగి వచ్చాడు. లీల కూడా నాకన్న కొంచెం ముందుగానే తిరిగి వచ్చింది. నేనుమటుకు 1966 ఫిబ్రవరిలో అంటే ఆరు నెలలు సంపూర్తిగా వుండి గడపి వచ్చాను. ఆపరేషన్ అదీ అయిన తర్వాత నన్ను ఒక విశ్రాంతి కేంద్రానికి మార్చి, అక్కడ శ్రద్ధగా చూశారు. బాగా కోలుకున్నాను. ఆ ఆపరేషన్‌లో ప్రధానమైన అంశం, నా పొట్టను పూర్తిగా తొలగించి, చిన్నపేగులతో ఒక చిన్న సంచీ లాగా చేసి పొట్టస్థానంలో అమర్చారు. అలాంటి ఆపరేషన్ నాకు జరిగిందంటే నమ్మలేనంతగా, నేను మామూలు మనిషినైనాను. ఆపరేషన్ బాగా విజయవంతమైనందుకు నాకు వైద్యం చేసిన వైద్యనిపుణులు సైతం ఎంతగానో సంతృప్తి చెందారు.

ఈ సందర్భంలో కామ్రేడ్ చంద్రశేఖర్‌ను గూర్చి చెప్పాలి. ఆయన 1955 ఆ ప్రాంతాల్లో సోవియట్ యూనియన్ వెళ్ళి అక్కడే వివాహం చేసుకుని స్థిరపడిన కామ్రేడ్. ఆయన 1960లోనూ, 65లోనూ కూడా నేను అక్కడ ఆస్పత్రిలో వున్న సమయంలో ప్రతి రోజూ వచ్చి నన్ను పరామర్శించి వెళ్ళే వాడు వార్తాపత్రికలు తీసుకువచ్చి యిచ్చి, వార్తలు చెప్పి, కొంత సమయం గడపి వెళ్ళేవాడు. నిజానికి నేను ఆంధ్రప్రదేశ్ దాటి ఏ మద్రాసో వెళితే ఎలా వుంటుందో అలాంటి వాతావరణం కల్పించాడు. నేనెక్కడో సుదూర ప్రాంతాన వున్న భావం కలిగేది కాదు. పిదప నేను రుమేనియా, క్యూబా ఇలా సోవియట్ యూనియన్ మీదుగా వెళ్ళవలసి వచ్చినప్పుడల్లా ఆయన విమానాశ్రయానికి వచ్చి నాతో గడిపేవాడు. అలాగే డాక్టర్ రామ్‌పట్ల, అంతకుముందు భారత సోవియట్ మిత్రమండలి తరఫున రష్యా వెళ్ళిన డాక్టర్

శేషారెడ్డి, డాక్టర్ రమణారెడ్డిగార్లపట్ల కూడా ఎంతో ఆదరాభిమానాలతో వ్యవహరించేవాడు. ఆయన సోవియట్ వెళ్ళకపూర్వం, నెల్లూరు ప్రజావైద్యశాలలో మామూలు నలత, అనారోగ్యాలకు, డాక్టర్ రామ్, శేషారెడ్డిలచే వైద్యం చేయించుకునేవాడు. కామ్రేడ్ చంద్రశేఖర్ నా ఒక్కడి విషయంలోనే కాదు మిగతా మన కామ్రేడ్స్ ఎవరు రష్యా వెళ్ళినా లేదా తనకు పరిచయమున్న సిపిఐ వారు ఎవరు వెళ్ళినా అలాగే శ్రద్ధ కనబరిచేవారు. నేనంటే మరికొంత ప్రత్యేక అభిమానం. నిజానికి చాలా సన్నిహితబంధువో, మిత్రుడో అన్నట్లుండే వాడు. ఇటీవలే చనిపోయాడు. చాలా మంచి కామ్రేడ్.

అలాగే కామ్రేడ్ ఉప్పల లక్ష్మణరావు, ఆయన మన పార్టీలో పూర్తిగా ఏకీభవించేవాడు. అయితే ఆయన ప్రవర్తన, గాంధీజీ నేర్పిన క్రమశిక్షణ, ఆయన స్థాయి ఆయనకొక ప్రత్యేకత కల్పించాయి. ఆయన మాస్కో రేడియోలో పని చేసేందుకు వెళ్ళాడు. మెర్లీ షోలింగర్ వంటి కామ్రేడ్ వున్నారు. అక్కడ భారత కమ్యూనిస్టు గ్రూపులో వీరు వున్నారు. అయితే వారు సిపిఐనే అధికారికంగా గుర్తించేవారు.

ఆపరేషన్ అయిన తర్వాత ప్రధానంగా నేను శానిటోరియంలో వుండేవాణ్ణి. నా అలవాటు ప్రకారం రోజు నడిచి వెళ్ళి పరిసర ప్రాంతాలు చూసి తెలుసుకుంటుండేవాణ్ణి. మామూలుగా శానిటోరియం హద్దులుదాటి వెళ్ళవద్దనేవారు. చుట్టూ అడవి కదా. తోడేళ్ళు ఉంటాయని. నేను మాత్రం వాచీ దగ్గరపెట్టుకుని టైమ్ దృష్టిలో వుంచుకొని నడకసాగించేవాణ్ని. తోడేలుకు కూడా మనుషులంటే భయమే తోడేళ్ళ గుంపు ఒక మనిషిపై దాడి చేస్తే ప్రమాదం. అంతేగాని సాధారణంగా తోడేలు ఏమీ చేయదు. నేనున్న దగ్గర నుండి. కామ్రేడ్ చంద్రశేఖర్ నివాసానికి నడిచివెళ్ళి వచ్చేవాణ్ని. 20 కిలోమీటర్లు అవుతుంది. రష్యాలో ప్రాథమిక అక్షరజ్ఞానం చిన్నచిన్న పదాలు నేర్చుకొని, ఆ ప్రాంతం పటం దగ్గర వుంచుకొని ఒక రోజు ఒక వైపు ఎంచుకుని, తిరిగి వచ్చేవాణ్ని. మామూలుగా పేర్లు, సంకేతాలు తెలుసుకోగలిగేవాణ్ని. గంటకు అయిదుకిలోమీటర్ల చొప్పున రెండు గంటలు వెళ్ళడం, రెండు గంటలు రావడం కష్టమనిపించేదికాదు. ఒకవేళ ఎప్పుడైనా ఆలస్యమయితే, నా ఆహారం నా గదిలో పెట్టి వెళ్ళేవారు. అలా చాలా అరుదుగా జరిగేది. ఎవర్నీ పలకరించ నక్కరలేకుండానే, పరిశీలనతో మాస్కో పరిసరాలను, ప్రజలను అధ్యయనం చేసేవాణ్ణి అలా తిరగడంపై ప్రత్యేక నిషేధమేమీ వుండేదికాదు. కాకపోతే వివిధ దేశాల వారు, వివిధ రాజకీయ అభిప్రాయాలు కలవారు వుండేవారు గనుక, ఆ ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకునేది. కానీ, రాజకీయంగా ఈ వాహ్యాళి విషయంలో పరిమితులుండేవికావు.

1958లో మొదటిసారి నేను, డాక్టర్ రామ్ మాస్కో వెళ్ళినప్పుడు అక్కడ పెద్ద వ్యవసాయ పారిశ్రామిక ఎగ్జిబిషన్ జరుగుతున్నది. ఇప్పుడది 'పర్మినెంటు' అయిందనుకోండి. నేను ఎక్కడికి వెళ్ళినా అక్కడ మ్యూజియములు ప్రధానంగా చూస్తాను. రష్యాలో అలాంటివానికి కొదవలేదు. నాకు 'గైడ్' అవసరం వుండేది కాదు. ఈ గైడ్‌లు ఏవేవో చాలా చెప్తారు. అవన్నీ నేను కావాలనుకున్న వివరాలు కాదు. అంతగా అయితే అది తర్వాత చదివి తెలుసుకోవచ్చు. అలాగే నాకు మాస్కోలోగానీ, పరిసరాల్లోగానీ తిరిగేందుకు ఎవరి సహకారమూ కావలసి



వచ్చేదికాదు. ఆ పటం వుండేది. సరిపోయేది. లీలకూడా రష్యా మూడుసార్లూ వచ్చింది.

1965లో వైద్యం నిమిత్తం వెళ్ళినప్పుడు తీరా ప్రయాణం అవబోతున్న ముందు తెలిసింది. నేను రష్యా ప్రభుత్వం ఆహ్వానం మీదగానీ, పార్టీ ఆహ్వానం మీదగానీ రష్యా వెళ్ళడంలేదని, రెడ్ క్రాస్ సంస్థ ఆహ్వానంపై వెళ్తున్నానని ఇక ఆ చివరి నిముషంలో చేయగలిగిందేమీలేదు గనుక వెళ్ళాం. అయితే వెళ్ళిన తర్వాత, అప్పుడప్పుడు వాళ్ళ పార్టీ తరపు రాజకీయ ప్రతినిధులు వచ్చి సంభాషించేవారు. 1982లో వెళ్ళినప్పుడు మాత్రం మమ్మల్ని సోవియట్ పార్టీ సాదరంగా ఆహ్వానించింది. మనకు, వారికి పార్టీకి, పార్టీకి మధ్య వుండే అధికార సంబంధాలు లేకపోయినా, ఆ లోటు కనపడలేదు. 1964లో మనం మార్క్సిస్టు పార్టీగా ఏర్పడినప్పుడు మనలను 'విచ్ఛిన్నకులు పార్టీ' అని, ఇప్పుడు మనల్ని, సిపిఐని 'రెండు కమ్యూనిస్టు పార్టీలు' అంటున్నారు. మామూలు స్నేహ సంబంధాలు మన మధ్య వున్నాయి.

నేను మాస్కోలో వుండగా, అప్పటి ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి తాష్కెంట్‌లో మరణించారు. ఆ రోజు సంతాపదినంగా పాటించారు. నేను తిరిగి భారతదేశం రాబోయేముందు మర్యాదపూర్వకంగా మాస్కోలోని భారత రాయబార కార్యాలయానికి వెళ్ళాను. అప్పుడు శ్రీ టి.ఎన్. కౌల్ రష్యాలో మన రాయబారి. ఆయన మాటల సందర్భంలో, "ఇప్పుడు మనదేశం వెళ్ళి చేసేదేముంది. ఎటూ అక్కడకు వెళ్ళిన తర్వాత మిమ్మల్ని అరెస్టు చేస్తారు కదా? ఇక్కడే యింకొన్ని నెలలు వుండొచ్చుగదా" అని అన్నాడు. "ఇక్కడుండి చేసేదేముంది. ఎటూ అక్కడకు వెళ్ళి తర్వాత మిమ్మల్ని అరెస్టు చేస్తారు కదా? ఇక్కడే యింకొన్ని నెలలు వుండొచ్చుగదా" అని అన్నాడు. 'ఇక్కడుండి చేసేదేముంది. ఎటూ ఆరోగ్యం కుదుట పడింది గనుక, అక్కడకు వెళ్ళి వుంటేనే మంచిది. మళ్ళీ అనవసరంగా పెరోల్ పొడిగించుకోవడం దేనికి" అని అన్నాను. "పోనీ, కొత్త ప్రధానిగా శ్రీమతి ఇందిరాగాంధీ వచ్చారు. ఢిల్లీ వెళ్ళినప్పుడు కలుసుకోవచ్చుగదా" అని ఆయన సందర్భవశాత్తు సూచించారు. "ఢిల్లీలో నేను రెండు మూడు రోజులుంటాను. వీలయితే కలుస్తాను. ఏమైనా కలుసుకునేందుకు ప్రయత్నం చేస్తానని" అన్నాను.

ఢిల్లీ వెళ్ళిన తర్వాత శ్రీమతి ఇందిరాగాంధీ నివాసానికి వెళ్ళాను. ఆమె కార్యదర్శితో, ఆమెను కలిసి మాట్లాడే అవకాశం కావాలని అడిగాను. ఆయన లోపలికి వెళ్ళి "ఆమె మాట్లాడేందుకు అభ్యంతరం లేదన్నారు. సుందరయ్యగారికి ఎప్పుడువీలో కనుక్కొని చెప్పమన్నారు" అని చెప్పాడు. "నేనేనయ్యా సుందరయ్యను" అన్నాను. ఆయన మళ్ళీ లోపలికి వెళ్ళారు. ఆమె వెంటనే ఆహ్వానించారు. నేను వెళ్ళి, నందాగారి శ్వేతపత్రం అంతా అబద్ధమనీ, పోలీసులు కల్పించిన కాకమ్మకథలపై ఆధారపడి తయారు చేయబడినదనీ చెప్తూ మీ హోమ్ శాఖ కార్యదర్శి ఎ.పి. సింగ్‌కు ఎసిఐతో సంబంధాలున్నాయని మాకు తెలుసు. ఇలా చాలా మంది వున్నారు. అలాంటి వాళ్ళ నివేదికలాధారంగా మమ్మల్ని జైళ్ళలో పెట్టడం సరైందికాదు అని చెప్పాను. ఆమె నవ్వి "నిజమే చాలా మంది వుండివుంటారు. మీకు తెలియందేముంది. నేను కొత్తగా వచ్చాను. ఏమైనా అన్ని తెప్పించుకు ఆలోచిస్తాను" అని చెప్పింది. తర్వాత ఆమె ఆ ఫైళ్ళు తెప్పించుకుని ముఖ్యులతో సంప్రదించి వుండాలి. ఎందుకంటే మమ్మల్ని ఏప్రిల్‌లో విడుదల చేశారు. నేనామెను ఫిబ్రవరిలో కలుసుకున్నాను. నిజానికి బ్రహ్మానందరెడ్డి మా విడుదలకు సుముఖంగా లేదని తెలుసు. దానికితోడు 1967లో ఎన్నికలు రాబోతున్నాయి.

ఆమె కొత్తగా వచ్చింది. తన ముద్ర వుండాలని భావించి వుండవచ్చు. శ్రీమతి గాంధీని ప్రధాని హోదాలో, రాజకీయ కర్తవ్యంపై కలుసుకోవడం అదే మొదటిసారి. అంతకుముందు నేను రాజ్యసభలో వుండగా, చాలాసార్లు నెహ్రూగారితోపాటు లేదా వారి యింట్లో ఇచ్చిన విందుల సందర్భంలో చూసుకుని, పరామర్శించుకుని వుండి వుంటాము. భూపేష్ ఆమె సహధ్యాయి. వారి కథ వేరే విషయం.

నేను జైలుకు వెళ్ళాను. అంతకుముందు మేము కొంతమందిమి, మా నిర్బంధంపై సుప్రీంకోర్టులో కేసువేసి వున్నాము. అవి ఒకదాని తర్వాత ఒకటిగా విచారణ కొస్తున్నాయి. కామ్రేడ్ బసవపున్నయ్య, డాక్టర్ రాధాకృష్ణమూర్తి, బోడేపూడి రాధాకృష్ణ తమ కేసుల సందర్భంగా ఢిల్లీకి తీసుకురాబడినారు. అలాగే నన్ను కూడా ఢిల్లీకి తీసుకువచ్చారు. నేను ఢిల్లీలో వుండగానే మమ్మల్ని విడుదల చేశారు. నేను పోలీసులతో అన్నాను. "ఇక్కడకు తీసుకువచ్చి విడుదల చేశారు. అంటే నా టిక్కెట్టు నేను కొనుక్కుని హైదరాబాద్ వెళ్ళాలా" అని. "లేదండి మీకు టిక్కెట్టుకొని సిద్ధంగా వుంచాము" అని చెప్పారు.

నేను మాస్కోలో వుండగానే ఇక్కడ లీలకు కంటి జబ్బు వచ్చింది. రెటినా వేరుపడిపోయింది. అందుకని, ఆమె హైదరాబాద్‌లోనే వుంది. ఢిల్లీ విమానాశ్రయానికి రాలేదు. ఇక్కడ డాక్టర్ రామచంద్రన్ దగ్గర వైద్యం చేయించుకుంటున్నది. "నువ్వు డాక్టర్ పరంజపి వద్దకు వెళ్ళకపోయానా? ఆయన గతంలో నీకు శుక్లాలు ఆపరేషన్ చేశాడుగదా" అని అడిగాను. "ఇక్కడ రామచంద్రన్ చేసిన జబ్బు నిర్ధారణ పద్ధతి, వైద్యం, అన్నీ డాక్టర్ పరంజపికి రాశాను. ఆయన ఇక్కడ బాగానే వైద్యం జరుగుతున్నదని, అంతకన్నా అదనంగా చేయవలసిందిలేదనీ తిరిగి నాకు రాశారు" అని చెప్పింది. అయినా "నీకు డాక్టర్ పరంజపి మీద విశ్వాసం వున్నప్పుడు అక్కడికే వెళ్ళి వైద్యం చేయించుకొని వుంటే బాగుండే"దని చెప్పి జైలుకు వెళ్ళాను.

ఆమె నిర్లక్ష్యం చేసింది. నేను జైల్లో వుండగానే ఆమెను డాక్టర్ పరంజపి వద్దకు వెళ్ళమని బలవంతం చేస్తుండేవాడిని. నేను విడుదలై వచ్చిన తర్వాత, డాక్టర్ పరంజపి వద్దకు వెళ్ళాము. ఆయన పరీక్షించి "ఇంతకన్నా చేయగలిగింది లేదు. రెటినా వేరుపడినందుకు ఇప్పుడు ఆపరేషన్ చేసినా, వున్న చూపు కూడా పోతుందేమో, కొంచెం ముందుగా వస్తే ఏమైనా చేయగలిగేవాణ్ణి" అని అన్నాడు. నాకు కొంచెం కోపం వచ్చింది. అసలే అంతకుముందు లీలకు ఒక కన్ను కనపడకుండా పోయింది. ఇప్పుడు రెండవ కన్ను చూపు కూడా క్రమేపీ క్షీణిస్తున్నది. ఆ విషయం ఆయనకు తెలుసు. పైగా లీల వుత్తరాల ద్వారా తన స్థితిని తెలియజేస్తుంటే, అదే పద్ధతి అంతకన్నా చేయగలిగిందిలేదు అన్నాడు. ఇప్పుడేమో, యిలా అంటున్నాడు. "మరేం చేయాలి?" అని అడిగాను. "ప్రస్తుతం అంతకన్నా ఎవరూ ఏమీ చేయలేరు. జాగ్రత్తగా మందులు వాడుతూ, ఆ వున్న దృష్టిని కాపాడుకోవాలి" అని చెప్పాడు.

అదృష్టవశాత్తూ డాక్టర్ ప్రభాకర్ 1969లో సీతాపూర్‌లో కంటి వైద్యంలో నైపుణ్యం కోసం వెళ్ళాడు. అక్కడ నుండి వుత్తరం రాశాడు. అక్కడ రెటినా వేరు పడిపోతే, ఆపరేషన్ చేసి బాగుచేయడంలో మంచి నైపుణ్యంగల డాక్టరొకరున్నారని, లీలను అక్కడకు తీసుకువచ్చి చూపించితే మంచిదని, లీల ఒపట్టాన వొప్పుకోలేదు. "ఆ ఎవరు మాత్రం ఇంతకన్నా చేస్తారు"



అని నిస్పృహతో రానంది. "ప్రయత్నిద్దాం, అందులో నష్టం ఏముంది? ఒక వేళ ఆయన ఆపరేషన్ చేసి బాగుచేస్తాడని విశ్వాసం కుదిరితేనే చేయించుకుందువుగాని. సరే, పరంజపికి ఈ విషయం చెబుదాం. దాచవలసిందేముంది?" అని నచ్చచెప్పి డాక్టర్ పరంజపి వద్దకు తీసుకువెళ్ళాను. ఆయన కూడా "వెళ్ళి చూపించుకురండి, దానివల్ల నష్టమేముంది?" అని సలహా యిచ్చారు. "ముందుగా ఆస్పత్రి నేను చూడాలి. నాకు ఆస్పత్రి నచ్చి, ఆ డాక్టరు మీద విశ్వాసం కుదిరితేనే చేయించుకుంటా"నంది. సరే, అట్లాగేనని చెప్పి సీతాపూర్ తీసుకువెళ్ళాను.

అక్కడకు వెళ్ళిన తర్వాత, ఆ డాక్టరు పరీక్ష చేసినతీరు, అక్కడి వాతావరణము నచ్చింది. డాక్టర్ ప్రభాకర్ దగ్గర వుండి, ఆపరేషన్ వివరాలు అవీ చెప్పి ధైర్యం ఇచ్చాడు. ఆమె ఆపరేషన్‌కు అంగీకరించింది. ముందు ఆపరేషన్ చేసి, గతంలో శుక్లం ఆపరేషన్ సందర్భంగా ఏర్పడిన కొన్ని లొసుగులను పూరించారు. 15 రోజుల తర్వాత మళ్ళీ అసలు వేరుపడిన రెటినాను సరి చేశారు. ఆపరేషన్ విజయవంతమైంది. "ఇక ప్రతిసారీ నా కంటిచూపును గూర్చిన ఆందోళన మీకు వుండదు లెండి" అని లీల తర్వాత నాతో ధైర్యంగా చెప్పింది.

1964లోనే కలకత్తాకు పార్టీ కేంద్ర ఆఫీసును మార్చాము. ప్రభుత్వం నిర్బంధాన్ని తప్పించుకున్నా కామ్రేడ్స్ రహస్యంగా వుండి పని చేస్తున్నారు. ఈ సమయంలోనే పీపుల్స్ డెమోక్రసి పత్రిక ఆరంభమయింది. మేము జైల్లో వుండగానే నన్నమాట. ఆ పత్రిక తీసుకురావడంలో ప్రధానంగా కృషి చేసింది పశ్చిమ బెంగాల్ కామ్రేడ్స్. కామ్రేడ్ రామదాస్ సంపాదకునిగా ప్రధాన బాధ్యత తీసుకున్నారు. కామ్రేడ్ ఉన్ని అని కేరళకు చెందిన టైపిస్ట్ ఒకరున్నారు. ఆయన లాగే కామ్రేడ్ చారి. చారి 1964 దాకా మాతో ఢిల్లీలో వుండి, పార్టీ ఆఫీసు కలకత్తాకు మారడంతోనే అక్కడకు వెళ్ళారు. ఇంకా కొందరు కామ్రేడ్స్, వీరంతా కలిసి పత్రిక నిర్వహణ చూసేవారు.

ఏది ఏమైనా విప్లవాలు ఎగుమతి చేస్తామని భావించడంలేదు. అదే సమయంలో ప్రపంచయుద్ధం వస్తుందనే భయంతో తమపై జరుగుతున్న అన్యాయాన్ని, దౌర్జన్యాన్ని ప్రజలు కలకాలం సహించరు. ప్రపంచయుద్ధం పేరు చెప్పి ప్రజలు తమ విముక్తికై సాగించే పోరాటాలను ఆరంభించవద్దనో, విరమించమనో సూచించడం మార్క్సిజమే కాదు ఇదీ మన వాదన. 1955 ఎన్నికల ఓటమి అనంతరం అప్పుడు రాష్ట్ర కార్యదర్శిగా వున్న రాజేశ్వరరావు "ఎన్నికల్లో ఓడిపోయాం ఇక మరింత భారాన్ని మోయలేం, కనుక హోల్‌టైమర్లను వారి జీవితాలను వారే పోషించుకోమని చెప్పి పంపించేద్దాం. అన్న వాదన ఆరంభించాడు. "ఇది సరయినది కాదు. ఎన్నికల్లో ఓడిపోయినా మూడోవంతు ప్రజలు మనకు అనుకూలంగా ఓటు చేశారు. అది ఆసరాగా ఉద్యమాన్ని సంఘటిత పరచుకోవాలి. ఉన్న పళాన హోల్‌టైమర్లను తీసేస్తే పార్టీలోకి పేదవర్గాల నుండి వచ్చిన హోల్‌టైమర్లు ఏమైపోతారు? ఎట్లాగూ ధనికవర్గాల నుండి వచ్చిన వారు తమను తాము పోషించుకోగలరు గనుక నిలదొక్కుకునే అవకాశం వుంది" అంటూ రాజేశ్వరరావు ప్రతిపాదనతో యిక్కడ పోరాడుతున్నాం. అంతర్జాతీయ పరిస్థితిపై, జాతీయ పరిస్థితిపై, వివిధ రాష్ట్రాల్లోని పరిస్థితులపై విభేదాలతోపాటు నిర్మాణపరమైన విషయాల్లో కూడా విభేదాలు వున్నాయన్నమాట.

# అంతర్జాతీయ ప్రభావం

**వి**భేదాలు యిలా సాగుతున్న సందర్భంలోనే 12 పార్టీల మహాసభకు అజయ్‌ఘోష్. భూపేష్ గుప్తా, బసవపున్నయ్య వెళ్ళారు. అప్పటికి సోవియట్ 20వ మహాసభపై చైనా పార్టీకి వున్న సంశయాలు, వ్యతిరేకతలు మాకు వివరంగా తెలియవు. 12 పార్టీల మహాసభలకు కూడా ఐక్యతను దృష్టిలో పెట్టుకొని చైనా పార్టీ ఆ మహాసభ ప్రకటనకు కొన్ని సవరణలు మాత్రమేచేసి దాన్ని ఆమోదించింది. ఒకటి మాత్రం నాకు బాగా గుర్తుంది. నేను పార్టీ అంతర్జాతీయ సంబంధాలు చూస్తున్న సందర్భాల్లో అజయ్‌ఘోష్ మాత్రం చెపుతుండేవాడు. సోవియట్ పార్టీ నెహ్రూ ప్రభుత్వం ఎడల మరింత సహకార ధోరణిని అనుసరించాలన్నది ఆయన చెప్పినదాని సారాంశం. నేను నమ్మలేదు. "ఈ కాకమ్మ కథలు అన్నీ ఎందుకు చెప్తావు. ఇక్కడ మీ విధానం అది కనుక దానికి అనుకూలంగా సోవియట్ పార్టీ కూడా వున్నదని మాకు నచ్చచెప్పే ప్రయత్నం చేస్తున్నావు" అని యింత మొరటగానూ చెప్తుండేవాడిని.

కాని సోవియట్ యూనియనే అలా సలహా ఇచ్చిందని తెలిసినప్పుడు కూడా నేనంగీకరించలేదు. మన అనుభవం వారి సలహాకు భిన్నంగా వుంది. వారిచ్చిన సలహాను పాటించి తీరాలన్న క్రమశిక్షణా నిబంధనావళి కూడా ఏమీలేదు. అయితే వారి సలహా ప్రభావం ఏమీ ఉండదా అంటే, ఉంటే ఉండవచ్చు కాని దానిని మేము పాటించనవసరం లేదు. పాటించలేదు. అదీగాక సలహాకైనా అభ్యంతరం చెప్పనప్పుడు ఇక్కడ పొరపాట్లు చేసి అందుకు ఎవరో కారణమనడం సరికాదు. మన అనుభవమూ, ఆలోచనా ఏమైంది? ఇటీవల నేను ఒక పుస్తకానికి చిన్న ఉపోద్ఘాతం రాస్తూ ఈ విషయం తడవ దలుచుకున్నాను. దానిపై గంగాధర రావు "మధ్యలో మీ పేరు ఎందుకులేండి. వాళ్ళ అవస్త ఏదో వాళ్ళనే పడనీయండి" అన్నాడు. ఏమైనా మనలోపాలకు ఇతర పార్టీలను నిందించడం వాస్తవమూ కాదు, సరైనదీ కాదు. నేను అంతకుముందు ఇక్కడున్న సోషలిస్టు దేశాల రాయబార కార్యాలయాలకు వెళ్తున్నా, వారు నాకెప్పుడూ చెప్పలేదు. నేను అలాంటి విషయాలు అడగలేదు. దానికీ ఒక పద్ధతి ఉంటుంది.



అజయ్‌ఘోష్ పార్టీ కార్యదర్శి గనుక, ఆయన మాస్కో వెళ్ళినప్పుడో మరెప్పుడో ఆయనతో వివరంగా చెప్పి వుంటారు.

1956లో బుల్గానిన్, కృశ్చేవ్‌లు భారతదేశానికి వచ్చారు. నేను ఏదో కేంద్ర కమిటీ సమావేశానికి ఢిల్లీ వెళ్ళాను. వారికి లక్షల సంఖ్యలో ఢిల్లీ ప్రజలు అఖండ స్వాగతం ఇచ్చారు. నేను ఆంధ్రకు తిరిగి వచ్చాను. బుల్గానిన్, కృశ్చేవ్‌లు మద్రాసు రానున్నారు. వారి స్వాగతోపన్యాసానికి ఆంధ్ర శాసనసభ్యులు హాజరయ్యేందుకు వీలుగా ఆంధ్ర శాసనసభకు ఆ రోజు సెలవు ఇవ్వమని కోరాను. దానికి కాంగ్రెస్ వారు అంగీకరించారు. ఆ విధమైన పరస్పర గౌరవం ఉండేది. భారత–సోవియట్ మైత్రికి ఉన్న ప్రాధాన్యత గూడా ఆ నిర్ణయానికి దోహదపడింది. కృశ్చేవ్, చుల్గానిక్ పర్యటన సందర్భంగా నెహ్రూ ప్రభుత్వ విదేశాంగ విధానం అభివృద్ధి కాముకమైంది అని వారు ప్రశంసించారు. ఆ ప్రశంసను లక్షల కాపీలు అచ్చొత్తించి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో తనకు అనుకూలంగా వినియోగించుకొంది. రష్యా పార్టీయే మేము అభివృద్ధి కాముకులమంటుంటే మీరేమిటి అభివృద్ధి నిరోధకులంటారు? అని వారు ప్రశ్నించేవారు. మేము ఆ తరువాత సోవియట్ వైఖరిని విమర్శించాం. చైనా పార్టీ కూడా 1957లో నెహ్రూ ప్రభుత్వంతో మీరు సహకరించదలచినట్లు బహిరంగంగా ప్రకటించమని, అందువల్ల నెహ్రూ వెనకాల వున్న ప్రజానీకంలో మీపై సద్భావం కలుగుతుందని ఒకవేళ నెహ్రూయే ఆ ప్రతిపాదన తిరస్కరిస్తే అది ఆయన తప్పుగానే మిగిలిపోతుందని మనకు సలహా యిచ్చింది. ఏతావాతా రష్యా–చైనా రెండు పార్టీలు కూడా 1956, 57 సమయంలో మనకు ఒకే రకమైన సలహానిచ్చాయి. మన అనుభవం దృష్ట్యా ఆ రెండు సలహాలను మనం తిరస్కరించాం. కేంద్ర కమిటీ మెజారిటీ దాన్ని త్రోసిపుచ్చింది. ఇక్కడ బూర్జువా, భూస్వామ్య ప్రభుత్వం వుంది. అది చాలా బలంగా వుంది. దానికి బయట నుండిగాని, లోపల నుండిగాని పెద్ద ప్రమాదం ఏమీలేదు. మనమా చాలా చిన్నశక్తి, పార్లమెంటులో మనదే పెద్ద ప్రతిపక్షమని చెప్పుకుంటున్నాం. కాని 500 మంది పార్లమెంటు సభ్యులలో మనం 30 మందిమి. మిగతా ప్రతిపక్షాలు ఆ మాత్రం కూడా లేవు. అందువల్ల మనం పెద్ద ప్రతిపక్షపార్టీ అన్నమాట నిజమే కాని ఈ భారత ప్రజానీకంలో మనం ఎంత? ఒక వేళ మనం ఐక్య సంఘటనకు సిద్ధంగా వున్నాం అని ఆ బూర్జువా – భూస్వామ్య ప్రభుత్వానికి చెప్పినా వాళ్ళు మనల్నెందుకు ఐక్యసంఘటనలో కలుపుకుంటారు. ఆ అవసరం వారికేమిటి? అంతకన్నా ముఖ్యమయింది మరొకటి వుంది. వాళ్ళు అధికారంలో వున్నారు. కొన్ని అభ్యుదయకరమైన చర్యలు చేపట్టినప్పటికి ప్రజావ్యతిరేక చర్యలే ప్రధానమైనవి. దాన్ని ఎదిరించేందుకే మనం వున్నాం. ఒక బూర్జువా ప్రభుత్వంతో ఐక్య సంఘటన కట్టరాదన్న నిబంధన ఏమీలేదు. కాని ఎప్పుడు ఐక్య సంఘటన అవసరం? ఎందుకు అవసరం? అని భౌతిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకోవాలి. అదేమీ లేకుండా

ఈ స్థితిలో ఐక్య సంఘటన కట్టడమంటే మనపార్టీ స్వతంత్ర ప్రతిపత్తిని కోల్పోవడం, క్రమేపీ పార్టీని రద్దు చేసుకునేందుకు మార్గం సుగమం చేసుకోవడమే అవుతుంది. కనుక ఒక దేశంలో వున్న నిర్దిష్ట పరిస్థితులు ఏమిటి? వివిధ శక్తుల బలాబలాలు ఏమిటి? అని భౌతిక వాస్తవిక దృక్పథంలో అంచనా వేసుకోవాలిగాని, వాళ్ళో వీళ్ళో చెప్పారని అటో యిటో కొట్టుకుపోవడం సరికాదు. ఆ విధంగా 50 ఏళ్ళో, 60 ఏళ్ళో ఎన్నో వత్తిడిలు వచ్చినా మనమెటూ కొట్టుకుపోలేదు.

ఇప్పుడు చైనా మహాసభకు ప్రతినిధివర్గం వెళ్ళాల్సివుంది. 1955లో నాకు కామెర్ల జబ్బు వచ్చింది. 1956లో కడుపులో పుండు. దానికి హైదరాబాద్‌లోనే డాక్టర్ రమేష్‌పాయ్ ఆపరేషన్ చేస్తానన్నాడు. కాని డాక్టర్ రామ్ ఒప్పుకోలేదు. “నాకెంత అనుభవం వుందో రమేష్ పాయ్‌కి అంతే అనుభవం వుంది. కాకుంటే కొంచెం ఎక్కువ వుందేమో. నీ విషయంలో ఏ రిస్కూ తీసుకోదలచలేదు. కనుక మద్రాసులోనే ఆపరేషన్ చేయాలని పట్టుబట్టాడు. ఆపరేషన్ సక్రమంగానే జరిగింది. ఆ తరువాత మళ్ళీ నాకు వాంతులు, అవి మొదలైనాయి. ఆపరేషన్ అయిన తరువాత నేనింకా విశ్రాంతి తీసుకుని కోలుకునేదశలో వుండగానే చైనాకు ఎన్నికైన ప్రతినిధివర్గంలో నన్ను కూడా చేర్చారు. పార్టీలోని విభిన్న అభిప్రాయాలు కలవాళ్ళు వెళ్ళేట్లయితే చైనా వాళ్ళతో చర్చలకు ఉపయుక్తంగా వుంటుందని ఒక అభిప్రాయానికి ప్రతినిధిగా నన్ను పంపారు. ఇ.ఎం.ఎస్., నేనూ, జోషి ప్రతినిధివర్గంలో వున్నాం. కామ్రేడ్ నిఖిల్ చక్రవర్తి మాకు పత్రికా విలేకరిగా వచ్చాడు. కామ్రేడ్ లీల కూడా నాతో వచ్చింది.

చైనా కామ్రేడ్ మమల్ని ఎంతో సాదరంగా ఆహ్వానించారు. నా ఆరోగ్యం దృష్ట్యా ప్రత్యేకాహారం, ప్రత్యేక సదుపాయాలు కల్పించి ఎంతో శ్రద్ధగా చూసుకున్నారు. అది చైనాలో నా తొలి పర్యటన. సవివరంగా నేను ఒక నోట్సు తయారు చేసుకున్నాను. చాలా అంశాలు వివిధ సందర్భాల్లో ఆ పర్యటన గూర్చి వెలువరించాను. కనుక మళ్ళీ ఆ వివరాలన్ని చెప్పబోవటంలేదు. ఒక విషయం మటుకు చెప్పాలి. మనపార్టీపట్ల వారికున్న సోదర భావాన్ని, గౌరవాన్ని వారు ప్రస్ఫుటంగా వెల్లడించారు. నేను 1956 సెప్టెంబరు 6 నుండి అక్టోబరు చివరి వరకు దాదాపు రెండు నెలలు చైనాలో గడిపాను. వివిధ ప్రాంతాలు, నగరాలు పర్యటించాను. వారి ఆర్థికాభివృద్ధిని గమనించాను. కాని అంతకన్నా ఎక్కువగా సెప్టెంబరు 10 నుండి వారు మహాసభ నిర్వహించిన తీరు నన్ను ముగ్ధుణ్ణి చేసింది. అంతకు ముందు నేను కాకుండా మన నాయకులు కొంత మంది సోవియట్ యూనియన్‌కు వెళ్ళివచ్చారు. కాని అక్కడ వారికెవరికి అధ్యక్ష వర్గంలో స్థానాలిచ్చి చైనాలో మమ్మల్ని గౌరవించిన రీతిలో పురస్కారాలు జరగలేదు. ఇతర సోదర పార్టీల ప్రతినిధివర్గం నాయకులను ఇతర దేశాల అధినేతలకన్నా ప్రత్యేక గౌరవంతో చూశారు. వారి విప్లవ దినోత్సవం అక్టోబరు 1. ఆనాడు



భారత రాయబారి ఎక్కడున్నాడో తెలియదుగాని వేదికమీద మేము వున్నాం. ఆ రకమైన గౌరవ ప్రతిపత్తులు యాంత్రికంగా అనిపించకపోవడం మరో విశేషం. ఇది మన పార్టీ ఎడల వారికున్న ప్రేమా, గౌరవాలకు చిహ్నం. నిజానికి మన పార్టీ చాలా చిన్న పార్టీ అయినా విమానాశ్రయంలో మాకు స్వాగతం ఇచ్చేందుకు కామ్రేడ్ లీషావ్‌చీ, కామ్రేడ్ ఛూతే, మరో ఇద్దరు ముగ్గురు కేంద్ర కమిటీ సభ్యులు వచ్చారు. మాకు నిజంగా ఆశ్చర్యం వేసింది. మాకే కాదు, అన్ని పార్టీల ప్రతినిధి వర్గాలకు చిన్నవైనా, పెద్దవైనా ఇలాంటి గౌరవాన్నే వాళ్ళు చూపించారు. అదీగాక భారతదేశం చాలా పెద్దదేశం. వారికి పొరుగున వున్న దేశం ఈ దేశ పరిణామాలు ప్రపంచ వ్యాపిత ప్రభావాన్ని కలిగివుంటాయి. ఇక్కడ ఈ దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం పురోగతిపట్ల సహజంగానే వారు చాలా ఆసక్తి కలిగి వుంటారు. కమ్యూనిస్టేతర ప్రభుత్వ నాయకులను ఆ మహాసభకు వారాహ్వానించలేదు. ఆ తరువాత కొంత కాలానికి సామ్రాజ్యవాద వ్యతిరేకత పేరుతో రుమేనియా పార్టీ మొదటిసారిగా బూర్జువా పార్టీల నాయకులను పిలవడానికి ఆరంభించింది.

మా ప్రతినిధి వర్గానికి ఇ.ఎం.ఎస్. నాయకుడు. వారు తమ విప్లవానుభవాలను వివరించారు. మేము వివిధ జాతీయ, అంతర్జాతీయ అంశాలపై మన పార్టీ విధానాన్ని వారికి తెలియజేశాము. సెప్టెంబరు నెల మొత్తం కాన్ఫరెన్స్‌తోనే సరిపోయింది. అక్టోబరు నెల అంతా చైనాలోని అన్ని ముఖ్య ప్రాంతాలను తిరిగి చూశాము. ఎక్కడకు వెళ్ళినా వారు మా పట్ల చూపిన గౌరవాభిమానాలు నాపై చెరగని ముద్రవేశాయి. మేము ఈ చర్చల్లో మునిగి వున్న సమయంలో లీల స్థానికంగా వివిధ ప్రదేశాలను తిరిగి వచ్చింది. లీల కూడా వారి ఆతిధ్యంపట్ల, వారు మా యెడల చూపిస్తున్న గౌరవంపట్ల, త్వరితగతిన వారు సాధిస్తున్న అభివృద్ధిపట్ల ఎంతో సంతోషించింది. వారు తమ దేశంలో వ్యవసాయ సమస్యలు పరిష్కరించిన తీరు, యానాన్‌లో వారి అనుభవాలు, 1927–1935 మధ్య కాలంలో ఒంటెత్తు పోకడతో వారు చేసిన తప్పిదాలు, చైనా విప్లవంలో మావోగారు పాత్ర – ఇవన్నీ వివరించారు. అన్నింటినీ మించి మనందరం ఒకే కమ్యూనిస్టు కుటుంబానికి చెందిన వారం అనేట్లు వారు ప్రవర్తించిన తీరు ప్రశంసనీయం సోవియట్ 20వ పార్టీ మహాసభతో మాలో ఏర్పడిన ఆవేదన, కొంత వరకు చైనావారి ప్రవర్తనతో ఉపశమించింది. అక్కడే నేను ప్రత్యేకించి బర్మా కామ్రేడ్స్‌తో చర్చలు జరిపాను. అప్పుడు వారు గెరిల్లా పోరాటంలో నిమగ్నమైవున్నారు. అయితే తరువాత వారితో సంబంధాలు పెట్టుకోవడం సాధ్యపడలేదు. అక్కడే నేపాల్, సిలోన్ కామ్రేడ్స్ కలిశారు. పాకిస్తాన్ కామ్రేడ్స్ రహస్య జీవితం గడుపుతున్నందువల్ల వారు చైనా రాలేదు. ఆ సందర్భంగానే పోలెండ్ కామ్రేడ్స్‌తో కూడా చర్చలు జరిపాం. ఏమైనా చాలా విలువైన అనుభవాలను ఆ పర్యటన నాకిచ్చింది.

ఇక ఇక్కడ వివిధ రాష్ట్రాలలో మావలె ఆలోచించే కామ్రేడ్స్ వున్నారు కదా వాళ్ళు స్థానికంగా రివిజనిస్టు ధోరణులకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. కేంద్ర కమిటీ సమావేశాలకు వచ్చినప్పుడో, మరేదైనా విస్తృత సమావేశాలలో కలిసినప్పుడో వారు తమ పరిస్థితిని వివరించేవారు. మొత్తం మీద నేను, తదితర కేంద్ర కమిటీలోని ఆంధ్ర కామ్రేడ్స్ ఎవరికి నచ్చినా, నచ్చకపోయినా మా అభిప్రాయాలను కేంద్రకమిటీ సమావేశాల్లో నిర్మొహమాటంగా చెప్తామని మిగతావారు భావించేవారు. అమృత్‌సర్ మహాసభలో వచ్చిన విభేదాల గురించి, మూడుదొంతర్ల పార్టీ కమిటీల నిర్మాణం గురించి చెప్పాను. నేను దానికి వ్యతిరేకిని. అంతకుముందు చైనా, రష్యా పార్టీలు యిచ్చిన సలహాను మెజారిటీ కేంద్ర కమిటీ తిరస్కరించింది. ఈ మూడు దొంతర్ల నిర్మాణాన్ని మెజారిటీ కేంద్ర కమిటీ ఆమోదించింది. మామూలు రాజ్యాంగబద్ధమైన పార్టీకి అమృత్‌సర్‌లో జరిగిన నిర్మాణ మార్పులు చెల్లుతాయేమోగాని, ఒక విప్లవ పార్టీకి మాత్రం సరిపడవని నా దృఢవిశ్వాసం. అయితే కేంద్ర కమిటీ సభ్యులలో ఎవరికున్న సిద్ధాంత పరిజ్ఞానం, ఎవరి అనుభవం వారికుంది.

అమృత్‌సర్ మహాసభలకు నేనూ హాజరుకాలేదు. డాక్టర్ రామ్‌ను వైద్యం నిమిత్తం రష్యా తీసుకువెళ్ళాలని అనుకున్నాం. రామ్ మొదట్లో అంగీకరించలేదుగాని, ఎలాగైతేనేం చివరకు ఒప్పించగలిగాం. రామ్ అసలే మూడీ మనిషి. ఎట్లాగో ఒప్పుకున్నారు. తీరా అమృత్‌సర్ మహాసభ అయింతరువాత వెళ్దామా అని అంటే మళ్ళీ నేను రానని మొండి కేయవచ్చు. అందుకని రామ్‌తోపాటు నేను మాస్కో వెళ్ళాను. మూడు దొంతర్ల విధానమే గనుక అమలు జరిగేటట్లయితే నేను కేంద్ర ఎగ్జిక్యూటివ్‌లో ఉండనని, అంతకు ముందు కేంద్ర కమిటీ సమావేశంలోనే స్పష్టం చేశాను. నేను ఆంధ్రకు పరిమితమై పని చేస్తున్నాను. అలాంటప్పుడు నేషనల్ కౌన్సిల్‌లో వున్నది చాలక, మళ్ళీ కేంద్ర ఎగ్జిక్యూటివ్‌లో ఉండడం దండగ అని నేను భావించాను. మీటింగ్‌లకే కాలహరణం తప్ప మరేమీ ప్రయోజనం వుండదు. అందుకని నేషనల్ కౌన్సిల్ లో మాత్రమే సభ్యుడిగా వుంటానని అన్నాను. అమృత్‌సర్ మహాసభలో ఎన్నికైన కేంద్ర కార్యవర్గంలో నేను లేను. కాని రెండు మూడు నెలలకే కేంద్ర కార్యవర్గంలో ఒక ఖాళీ ఏర్పడింది. ఆ స్థానంలో నన్ను కో–ఆప్ట్ చేసుకున్నారు. కేంద్ర కార్యవర్గంలో వుండకూడదన్న నిర్ణయం సరైనది కాదన్న అభిప్రాయానికి నేను కూడా వచ్చాను. ఒక స్పష్టమైన విధానంతో వున్న మనం అవకాశం వున్నంతవరకు లోపల వుండి పోరాడాల్సిందేనని, అప్పుడే మనం అనుకున్న విధానానికి న్యాయం చేకూర్చినట్లవుతుందని భావించాను. ఈ మార్పు అంతా కూడా రామ్‌తోపాటు మాస్కోలో వున్న రెండ్నేల్లలోనే జరిగిన గుర్తు. రామ్‌కు వాళ్ళు పెద్దగా చేయగలిగింది లేదని చెప్పారు. ఆయన ఇష్టం వచ్చినట్టు ఉంటారులే మనం చేయగలిగింది చేశాం అని నేను తిరిగి తీసుకు వచ్చాను.



1959లో భారత – చైనా సరిహద్దు వివాదం ఆరంభమైంది. పార్టీలో అంతర్గత విభేదాలు తీవ్రమవడానికి కూడా దోహదపడింది. నేను ఈ సరిహద్దు సమస్యపట్ల అంతకుముందే క్షుణ్ణంగా అధ్యయనం చేసి వున్నాను. ఎట్టి పరిస్థితుల్లోను లడక్ భారతదేశానికి చెందుతుంది అనడం సరైనదికాదు. మెక్ మోహన్ లైనును నిజానికి చైనా వారు అంగీకరించాల్సిన పనిలేదు. అది బ్రిటిషు సామ్రాజ్యవాదులసృష్టి. అయితే భారతదేశానికి అరుణాలచప్రదేశ్ అవసరం. కనుక మెక్‌మోహన్ లైనును చైనావారు గుర్తించాలి. వ్యూహాత్మకంగా అవసరంలేని, భౌగోళికంగా మనది కాని లడక్ ప్రాంతాన్ని మనం చైనా వారికి ఇచ్చేయాలి. ఇదీ నా అభిప్రాయం. పార్టీలో "చైనా అనుకూల ముఠా" ఒకటుందని, దానికి సుందరయ్య నాయకుడని పత్రికలు చిత్రించసాగాయి. 1959లోనే అజయ్‌ఘోష్, పెరులేకర్, నండూరి ప్రసాదరావు వాళ్ళు చైనా సందర్శించారు. ఆ సందర్భంగా చైనా కామ్రేడ్స్ మనవాళ్ళతో మొత్తం పరిస్థితిని వివరించి తమవాదన న్యాయసమ్మతం అయినదని, లడక్ తమదేనని, మెక్‌మోహన్ లైనును గుర్తించాల్సిన అవసరం తమకు లేదని, అయితే గుండు గుత్తుగా పరిష్కారం కుదిరేటట్లయితే మెక్‌మోహన్ లైనును గుర్తించేందకు తాను సిద్ధపడతామని, కాని ఆ మాట తాము చెప్పేటట్లయితే భారత ప్రభుత్వం మొండిగా వ్యవహరించి, లడక్‌ను ఇవ్వక, మెక్‌మోహన్ లైనును గుర్తించాలని పట్టుబడుతుంది అని చెప్పారు. ఈ విషయాన్ని అజయ్‌ఘోష్ ఇక్కడకు రాగానే భారత ప్రభుత్వానికి తెలియజేశారు. చైనా వారు వూహించినట్లే జరిగింది.

నిజానికి నేను పార్టీ కార్యదర్శిని కాను, పార్టీ కేంద్ర కార్యదర్శివర్గంలోనూ లేను. అయినా పత్రికలు మాత్రం నన్ను చైనా అనుకూల ముఠాకు నాయకుడిని చేశాయి. కారణం నా పదవి ఏమైనా భారత కమ్యూనిస్టు ఉద్యమంలో నేను ఒక ప్రముఖుడను. నేను ఏ హోదాలో వాదించినా దానికి వారు ప్రాముఖ్యతనిస్తున్నారు. పార్టీలో ఈ వివాదం జరుగుతున్న సందర్భంలోనే బెంగాల్ కామ్రేడ్స్ కొందరు కేరళ కామ్రేడ్స్ మా విధానాలకు అనుకూలమైన వైఖరిని చేపట్టారు. అయినా బూర్జువా జాతీయ తత్వంతో మెజారిటీ రాజేశ్వరరావు వాళ్ళకే వుంది.

ఈ సందర్భంగా నా పాత్ర వుందని చెప్పవచ్చు. పాత్ర అంటే ఏదో పెద్ద సిద్ధాంత కర్తగా కాదు. నా అభిప్రాయంలో సిద్ధాంతాన్ని, ఆచరణలో అమలుజరపడం కష్టం. ఆ విధంగా ఆచరణానుభవంతో కూడినది నా పాత్ర. సిద్ధాంతం లేకుండా ఆచరణ కష్టసాధ్యం. సిద్ధాంతమంటే కొన్ని కొటేషన్స్‌ను వల్లెవేయడంగానే అర్థం చెప్పుకోగూడదు. ఈ కొటేషన్లు కూడా 1948–51 విభేదాలలో విరివిగానే వాడి చూశాము.

1960లో మీరట్‌లో నేషనల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఆ సందర్భంగా ఢిల్లీ నుండి నిఖిల్ చక్రవర్తి ద్వారా ఒక వార్త వచ్చింది. భారత–చైనా సరిహద్దు వివాద సందర్భంగా మా అవగాహన దృష్ట్యా, ప్రభుత్వం మొత్తం నేషనల్ కౌన్సిల్‌ను అరెస్టు చేయనున్నదని, ఏం చేయాలి? ఏముంది? సిద్ధపడాల్సిందే. అయితే అందరు నాయకులూ నిర్బంధింపబడితే ఎలా?

అందుకని కొందరు కామ్రేడ్స్ రహస్యంగా వుంటూ మన విధానం, మన కార్యకర్తలకు, ప్రజలకునచ్చచెప్పాలి. అంటే అలాంటి పరిస్థితి ఏర్పడితే తప్పించుకోవాలి కానీ మీరట్ చిన్న పట్టణం. సూర్జిత్, నేనూ కలిసి ఆ పరిస్థితిలో ఎవరెవరు ఎలా తప్పించుకోవాలి అని పథకం రూపొందించాము. ఇక్కడ నా తెలంగాణా అనుభవం బాగా అక్కరకు వచ్చింది. అలాంటి సందర్భాలలో కంగారు పడకుండా, కాళ్ళు తొక్కుకోకుండా, స్థిమితంగా ఆలోచించాలి. ఒక అరగంట వ్యవధిలో తప్పుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశాము. బెంగాల్ కామ్రేడ్స్ అనుభవం వాళ్ళకుంది.

సమావేశంలో మా అభిప్రాయాన్ని బలపరిచేవాళ్ళం. మాలో మేము ముందుగా మాట్లాడుకున్నాం. ఈ వివాదం విషయంలో మా వైఖరి ఎలా వుండాలి అని. వాళ్ళూ అంతే. అందులో తప్పేమీలేదు. రహస్యం అసలేలేదు. కామ్రేడ్స్ సంతకాలతో డాక్యుమెంట్లు ప్రవేశపెట్టేవాళ్ళం. రహస్యంగా, ఒక గ్రూపు కట్టడం తప్పు. కానీ కేంద్ర కమిటీ సభ్యులమై వుండి, ఒక కేంద్ర కమిటీ సభ్యుడు మరో సభ్యుడితో మాట్లాడకూడదని ఎలా నిబంధన పెట్టగలం. పైగా ఒక విధానానికి సంబంధించి, ఒకే అభిప్రాయం గలవాళ్ళు ఆ అభిప్రాయాన్ని వెలువరించేముందు మాట్లాడుకోకూడదని ఎలా చెప్పగలం? రహస్యంగా గ్రూపును నిర్మించి ముఠా కట్టడం లేదు. చర్చల అనంతరం వచ్చిన నిర్ణయానికి కట్టుబడి వుండాలి. ఆ తర్వాత కూడా మా అభిప్రాయం అదికాదంటూ, ఒక గ్రూపుగా వ్యవహరించరాదు. పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యానికి, ముఠా కార్యకలాపాలకు చాలా తేడా వుంది. ఒక దానితో ఒకదాన్ని గందరగోళ పరచరాదు. అమలుకొస్తే 1962 నవంబరు నుండే జాతీయ కౌన్సిల్ నుండి విభేదించి బయటకు వచ్చిన 27 మందిమి ఒకగ్రూపుగా వ్యవహరించి కేంద్ర నాయకత్వ తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా పార్టీ కార్యకర్తల ముందుకు, ప్రజల ముందుకు మా వాదన తీసుకువెళ్ళాలని మహాసభ జరపమని కోరాలని నిశ్చయించుకున్నాము. అందుకు పార్టీ ఫారమ్‌ను ఉల్లంఘించినందుకు వాళ్ళు మాపై చర్యలు తీసుకున్నారు. అసలు పార్టీయే చీలే పరిస్థితి అది. అది వేరే విషయం.

అప్పుడు తీవ్రమైన సైద్ధాంతిక ఆచరణ విభేదాలు వున్నాయి. ఇరుపక్షాలు ఒకే పార్టీలో వుండగల స్థితిలేదు. మేముగానీ, వారుగానీ ఎవరమైనా వేరే పార్టీ పెట్టవలసిందే. 1962-63లో మేము జైల్లో వున్నాము. అది ఆసరాగా తీసుకొని పార్టీ యంత్రాంగాన్ని మొత్తం స్వాధీనం చేసుకోవాలని వాళ్ళు ప్రయత్నించారు. 52 వేల మంది పాత పార్టీ సభ్యులను పార్టీ నుండి తొలగించారు. కొత్తగా చాలా మందిని చేర్చుకొన్నారు. మేము జైళ్ళల్లో వున్నప్పుడు ఈ మార్పులు చేయడం జరిగాయి గనుక 1962 అరెస్టుకు ముందున్న సభ్యత్వ ప్రాతిపదికపై మహాసభ జరపమని మేము కోరాము. వారంగీకరించలేదు. ఈ మొత్తం వ్యవహారంలో, నేనే



మా గ్రూపుకు నాయకత్వం వహించానని చెప్పలేను. బసవపున్నయ్య, సూర్జిత్ కూడా ప్రధాన పాత్ర వహించారు. ఆంధ్రలో హనుమంతరావు, ఎల్.బి.జి., నాగిరెడ్డి, దేవులపల్లి మాతోనే వున్నారు. చంద్రం, రావి నారాయణరెడ్డి అటు వున్నారు. ఇక్కడ మన రాష్ట్రంలో విభజన తీవ్రంగానే వుంది. పంజాబ్‌లో రాష్ట్ర నాయకత్వంలో ఎక్కువ మంది ఇటే వచ్చారు. మద్రాసులో రామ్మూర్తి, వెంకట్రామన్ ఇటువైపు రాగా కళ్యాణ సుందరం, ఎ.ఎస్.కె. అయ్యంగార్‌లు అటువైపు వెళ్ళారు.

ఇ.ఎం.ఎస్. గోపాలన్‌లు, అజయ్‌ఘోష్ లైన్‌తోనో, మధ్యస్థంగానో వుండేవారు. 1964 దాకా అదే స్థితి. చైనా వాదన విషయంలో వారు సైద్ధాంతికంగా యింకా ఆలోచించాలనే అన్నారు. అయితే వారు రాజేశ్వరరావు, డాంగే గ్రూపును మాత్రం విశ్వసించేవారు కాదు. ప్రజా ఉద్యమాలలో పాల్గొనడంవల్ల, ప్రజలతో వుండడంవల్ల మేమంటే వారికి సానుభూతి వుండేది. కాని మాతోనూ లేరు. మొదట్లో దక్షిణాన వున్న నాయకత్వం రాజేశ్వరరావు వాళ్ళతో వుండే వారు. బెంగాల్‌లో పలుకుబడిగల చిన్న గ్రూపు మినహా, మిగతా అందరూ మా వైపు వచ్చారు. మహారాష్ట్రలో బి.టి. రణదివె, పెరులేకర్, కొల్హాట్కర్ మాతో వచ్చారు. మిరాజ్‌కర్ కూడా మాతోనే వచ్చాడు. ఆ తర్వాత 1967లో మళ్ళీ సిపిఐ లోకి వెళ్ళాడు. నిజానికి డాంగే వుత్తరాల గుర్చి సమాచారం యిచ్చింది ఆయనే.

అయితే, ఈ అభిప్రాయంగల కామ్రేడ్స్‌నందరినీ ఒక వేదికమీదకు తీసుకురావడంలో బసవపున్నయ్య, సూర్జిత్‌ల పాత్ర చాలా వుంది. ఆ రకంగా నేను, బసవపున్నయ్య, సూర్జిత్ ఆ స్థాయిలో కృషి చేశాం. కనుక సుందరయ్య తలబిరుసు తనం వల్లనో లేదా బసవపున్నయ్య మొండితనం వల్లనో పార్టీ చీలిందని చెప్పడం తప్పుడు ప్రచారం.

ఏమైనా ఢిల్లీ పార్టీ కేంద్రంగా నిర్వహణ కష్టమైంది. జ్యోతి, ప్రమోద్‌లు బెంగాల్లో వుంటారు. ఇ.ఎం.ఎస్., గోపాలన్‌లు కేరళలో వుంటున్నారు. నేను బసవపున్నయ్య, సూర్జిత్ ఢిల్లీలో వుండేది. అదీగాక, 1962-66 అనుభవం కూడా ఉంది. పార్టీ మీద దాడి జరిగితే, రహస్యంగా పార్టీ కార్యకలాపాలు నిర్వహించగలగాలి. విస్తృతమైన పునాదిగల ఉద్యమం వుంటే తప్ప సాధ్యంకాదు. ఢిల్లీలో ఎక్కడ అంత ఉద్యమం వుంది? అప్పటి స్థితిలో బెంగాల్‌లోనే అలా పార్టీ గడ్డుకాలంలో కూడా తన కార్యకలాపాలు నిర్వహించుకోగలదు పైగా గతంలో మద్రాసులో, బొంబాయిలో పార్టీ కేంద్రాలు నిర్వహించిన అనుభవమూ వుంది. అందుకని కలకత్తాకు పార్టీ కేంద్ర కార్యాలయాన్ని తరలించాలని నిశ్చయించు కున్నాము. ఢిల్లీలో పార్టీ పార్లమెంటరీ కార్యాలయాన్ని తరలించాలని నిశ్చయించుకున్నాము. ఢిల్లీలో పార్టీ పార్లమెంటరీ కార్యాలయం వుంటుంది. కలకత్తా అసలు పార్టీ కేంద్ర ఆఫీసు. ఇదే స్థితి 1976 వరకూ

సాగింది. 1976లో మళ్ళీ పార్టీ కేంద్ర ఆఫీసును ఢిల్లీ మార్చాలని నిశ్చయించుకున్నాం. ఎవరూ ఆ నిర్ణయాన్ని ప్రశ్నించలేదుగానీ, అది సరైన నిర్ణయమా అన్నది నేటికీ చర్చనీయాంశమే. కొన్ని పరిస్థితులవల్ల కలకత్తాలో కేంద్ర ఆఫీసు కొనసాగడం కష్టమయింది. కనుక ఢిల్లీకి మార్చాము.

నేను మాస్కోలో వైద్యం కోసం వెళ్ళివుండగా ఒక ఘటన జరిగింది. దాన్ని గూర్చి చెబుతాను. అప్పట్లో రష్యా, చైనా విభేదాలు తీవ్రమవుతున్నాయి. రష్యా ఆసియాలో భాగం కాదనీ, వియత్నాం విషయంలో రష్యాతో కలిసి ఐక్య కార్యాచరణ జరపరాదని చైనా ప్రకటించింది. భారత, పాక్ యుద్ధం జరుగుతున్నది. వీటిపై నా అభిప్రాయం రాసి, భారతదేశంలో మన కేంద్ర కమిటీకి తెలియజేయాలనుకున్నాను. భూపేష్‌గుప్తా కూడా అప్పుడు మాస్కోలో నన్ను చూసేందుకు వచ్చేవాడు. చైనా విధానాలు కొన్నింటితో విభేదిస్తూ, అలాగే భారత్ – పాక్ యుద్ధంలో భారత ప్రభుత్వాన్ని కొన్ని అంశాల దృష్ట్యా బలపరచవలసి వుందని నా అభిప్రాయం రాసి, ఒక కవరులో పెట్టి వుంచాను. భూపేష్ గుప్తా ఇండియాకు తిరిగి రానున్నాడు. ఆ తర్వాత నెలరోజులకు రామ్ కూడా ఇండియాకు రాబోతున్నాడు. కానీ, నా అభిప్రాయం కూడా ఎంత త్వరగా మన కేంద్ర కమిటీకి తెలిస్తే, వారు నిర్ణయం గైకొనేందుకు వీలుంటుందని, అంటే నా అభిప్రాయాలు తెలియకపోతే నిర్ణయం గైకొనకూడదనీ, గైకొనలేరనీ కాదు. భూపేష్ చేతికి అంటించిన కవరు యిచ్చి "కవరు విప్పకుండా జాగ్రత్తగా, మా పార్టీ వారికి ఈ వుత్తరం అందజేస్తావా?" అని అడిగాను. "అలాగే"నన్నాడు. ఆయన చేతికి యిచ్చాను. అయితే భూపేష్ తన వాగ్దానాన్ని భగ్నం చేసి, కవరులో వున్న నా లేఖ కొక కాపీ తీసుకొని, మళ్ళీ అంటించి మన పార్టీ ఆఫీసుకు దాన్ని చేర్చాడు. అంతేకాదు, ఆ లేఖ కాపీలు తీసి, తమ పార్టీ సభ్యులకూ, భారత ప్రభుత్వానికి కూడా పంపాడు. సిపిఐ(ఎం) కూడా తమలాగానే అభిప్రాయపడుతున్నదని చెప్పేందుకు దాంతో పెద్ద గందరగోళం. అదీగాక ఏ మాత్రం భారతదేశాన్ని బలపరచినా, చైనాను విమర్శించినా వ్యతిరేకించే బలమైన శక్తొకటి కేంద్ర కమిటీలోను, పార్టీలోను వుంది. దాంతో పెద్ద దుమారం రేగింది. నేను తిరిగి వచ్చిన తర్వాత దానిపై చర్చ జరిగింది. నేను అలా భూపేష్‌తో పంపడం పొరపాటే. కాకపోతే ఒక నెల ఆలస్యమయ్యేది. అంత ఆత్రపడి వుండవలసిన పనిలేదు. పొరపాటు చేశాను. అయితే ఆ వుత్తరంలోని రాజకీయ అంశాలకు కట్టుబడి యిప్పటికీ వున్నానని కేంద్ర కమిటీలో చెప్పాను. బెంగాల్ కామ్రేడ్స్ భూపేష్ గుప్తా ద్వారా నేను లేఖ పంపడంపట్ల బాగా అసంతృప్తితో వున్నారు. ఈ పరిస్థితిపై వివరణకు ఒక జనరల్ బాడీ వేశారు. నేను హాజరై, రాజకీయంగా మన వైఖరి ఎలా సరి అయినదో వివరించాను. అదే సమయంలో, ఆ లేఖను భూపేష్ గుప్తా ద్వారా పంపడంలో నేను తప్పు చేశానని అంగీకరించాను. ఇది బెంగాల్ కామ్రేడ్స్‌పై మంచి ప్రభావం కల్గించింది. మన నాయకత్వం మొండిగా అంతా సరైనదేనని వాదించేదనీ, తన తప్పులను వొప్పుకుంటుందనీ వారు గ్రహించారు. పైగా అలా జనరల్ బాడీలో కూడా చెప్పినందుకు మరింత ప్రభావితులైనారు. అందరు నాయకులూ అలా ఒప్పుకోలేరు. అదే విషయాన్ని కామ్రేడ్



ప్రమోద్ కూడా తర్వాత నాతో చెప్పాడు. తప్పు చేస్తే వొప్పుకోవడంలో పొరపాటేముంది. ఉద్యమాన్ని ధ్వంసం చేయాలని చేసిన తప్పుకాదు. తప్పు ఎవరైనా చేయవచ్చు. వొప్పుకోవడానికి నామోషి పడనవసరంలేదు.

1966 ఆగస్టుకల్లా దాదాపు మన కామ్రేడ్స్ అందరూ విడుదలైనారు. వెంటనే 1967 ఆరంభంలో ఎన్నికలున్నాయి. మన ఎన్నికల ఎత్తుగడను కేంద్ర కమిటీ చర్చించి, నిర్ణయించింది. ఆ వివరాలు అన్నింటి జోలికి వెళ్ళను. సిపిఐ మనతో ఎన్నికల అవగాహనకు రావడానికి దాదాపు అన్ని రాష్ట్రాలలోనూ తిరస్కరించింది. వారికేమాత్రం బలం వుందని తోచినా మనకు వ్యతిరేకంగా పోటీ పెట్టారు. ఒక్క కేరళలో మాత్రం 1965 అనుభవం దృష్ట్యా మనతో కలిసి ఎన్నికలలో పోటీ చేసింది. ఈ ఎన్నికలు కాంగ్రెస్‌పై పోరాటంతోపాటు మనకు, సిపిఐల మధ్య పోటీగా పరిణమించాయి. ఎన్నికల ఫలితాలు సమీక్షించబోవడం లేదు. ఆంధ్రప్రదేశ్ ఒక ప్రస్ఫుటమైన వుదాహరణ. ఇక్కడ ఇరువురం తీవ్రంగా నష్టపోయాం. వారు మనలను, మనం వారిని వోడించడంలో విజయం సాధించాము. ఏమైనా? కమ్యూనిస్టు అభిమానం వున్న ప్రజలు ఏ పార్టీతో వున్నారు? సిపిఐతోనా, మన సిపిఐఎంతోనా అన్నది కొంత వరకూ అప్పటికి ఈ ఎన్నికల ఫలితాలవల్ల తేటతెల్లమయింది. కేరళ, బెంగాల్ వారితో పోలిస్తే మనం బాగా బలంగా వున్నాము. ఆంధ్ర, తమిళనాడు, పంజాబ్‌లలో చెరిసగంగాను, బీహార్‌లో వారు మనకన్నా బలంగానూ వున్నారు.

# 1967 ఎన్నికలు

1967 కేరళలో కాంగ్రెస్ చీలి వుంది. దానికి తోడు మనము సిపిఐ ఇతర వామపక్షాలు కలిశాం. ముస్లింలీగ్‌తో ఎన్నికల వొడంబడికంటూ సంఘటన లేదుకానీ ఒకరి బలమైన స్థానాలలో మరొకరు పోటీ చేయరాదని అంగీకరించాం. ఈ పరస్పర పోటీ నివారణ ఆచరణలో మనం బలంగా వుండి పోటీ చేసిన చోట్ల వారి ఓట్లు మనకు పడాలనీ, వారు బలంగా వుండి పోటీచేసిన చోట్ల మన వోట్లు వారికి పడాలనీ అన్న అర్థం అవుతుంది. ఫలితంగా కాంగ్రెస్ కేవలం 9 స్థానాలు సంపాదించుకుంది. మనం ప్రధాన శక్తిగా వున్న ఐక్య సంఘటనకు 117 స్థానాలు వచ్చాయి. ఆ క్రమంలో సిపిఐకి కూడా 16 స్థానాలు వచ్చాయి. 1969 వరకూ, ప్రభుత్వం మన ఆధ్వర్యంలో కొనసాగింది. అయితే మొదటి నుండీ కూడా సిపిఐ పెరుగుతున్న మన ప్రభావాన్ని తగ్గించాలని నిశ్చయించుకుంది. అందుకై కాంగ్రెస్‌తోనైనా కలిసేందుకు అది సిద్ధపడింది. పైగా మనతో కలిసి వున్నంత కాలం వారి పార్టీ పెరగదని వారి భావన. దానికితోడు వారి కేంద్ర విధానం వుండనే వుంది. కాంగ్రెస్‌తో కలిసి వుండాలని 1969లో కాంగ్రెస్‌లో చీలిక వచ్చిన సందర్భం అదునుగా చూసుకుని, కాంగ్రెస్‌లో ఒక గ్రూపుకు 'అభివృద్ధి కాముక'మని ముద్రవేసి, వారితో కలిసి, మన ప్రభుత్వాన్ని కూలదోశారు. అదీగాక, మనంతట మనంగా ప్రభుత్వం నిర్వహించగలిగినంత బలంగా లేము కూడా. మిగతా అందరూ కాంగ్రెస్‌లో చేరితే మనం మైనారిటీ, అదే జరిగింది. అందువల్ల మన ప్రభుత్వం పడిపోయింది.

బెంగాల్‌లో కాంగ్రెస్‌కు మెజారిటీ వచ్చింది. అయితే, అజయ్ ముఖర్జీ కొందరు కాంగ్రెస్ శాసనసభ్యులను వెంటవేసుకని, కాంగ్రెస్ నుండి వేరుపడి బంగ్లా కాంగ్రెస్ అని ఒక ప్రత్యేక పార్టీగా ఏర్పరచాడు. ఆయనకూ, మనకూ ఎన్నికల ముందేమీ అవగాహనలేదు. వెంటనే మనం అజయ్‌ముఖర్జీకి ఒక పిలుపునిచ్చాము. ఆయన ముఖ్యమంత్రిగా వుండేట్లు, మనకు శాంతిభద్రతలు, వ్యవసాయ, కార్మిక శాఖల మంత్రి పదవులిచ్చేట్లు. అలా అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడకుండా నిరోధించవచ్చు. శాంతిభద్రతలు మనకిచ్చేందుకు అజయ్‌ముఖర్జీ అంగీకరించలేదు. ఆ శాఖ ముఖ్యమంత్రికే వుండాలని ఆయన పట్టుబట్టాడు



మన ప్రధాన లక్ష్యమైన కాంగ్రెసేతర ప్రభుత్వ ఏర్పాటు అవగాహన దృష్ట్యా ఆర్థికశాఖ మిగతా మనం కోరిన రెండు శాఖలు మనం తీసుకున్నాం. అజయ్‌ముఖర్జీ ముఖ్యమంత్రి అయ్యాడు. జ్యోతిబసు ఆర్థిక మంత్రి అయ్యారు. ఈ విషయంలో ఎవరో కొందరు వ్యక్తులు మినహా కేంద్ర కమిటీలోనూ, బెంగాల్ కమిటీలోనూ భేదాభిప్రాయాలు లేవు. మనం మంత్రివర్గంలో లేకుండా బయట వుండి బలపరచడమంటే ఆ ప్రభుత్వం చేసే తప్పుడు పనులన్నింటికి బాధ్యత వహించి, భుజాన వేసుకోవడమేగానీ మనం వున్న అవకాశాన్ని వాడుకుని పురోగమించడం జరగదు. ఇలా మనం అజయ్‌ముఖర్జీతో కలిసి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేస్తామని ఎవ్వరూ వూహించలేదు.

ఇక్కడ సిపిఐకి, మనకు ప్రధానమైన విభేదం వుంది. కాంగ్రెసేతర ప్రభుత్వాలని చెప్పి వారు జనసంఘంతో కూడా కలిసి ఉత్తరప్రదేశ్, పంజాబ్, బీహార్‌లలో తమకు తక్కువ శాసనసభా బలం వున్నా మంత్రివర్గాలలో చేరారు. మనం అలా చేరలేదు. మనల్ని అక్కడ చేరమని అకాలీ, ఎస్‌వి.డి. పార్టీల నుండి ఆహ్వానాలు అందాయి. మన పార్టీ శాసనసభలోనూ, వెలుపల బలంగా లేకుండా ప్రభుత్వ దైనందిన విధానాలలో మన ప్రభావాన్ని చూపలేనిచోట్ల మనం మంత్రివర్గంలో చేరకూడదు. జనసంఘ్ ఆ మంత్రివర్గంలో లేకపోయినా సరే. జనసంఘ్‌తో కలిసి, మంత్రివర్గాల్లో చేరి అధికారంలోకి వచ్చినా పెద్దగా వొరగబెట్టలేకపోగా ప్రజాస్వామ్య, లౌకిక పార్టీగా మనకున్న ప్రతిష్ట కూడా అడుగంటుతుంది అన్నది రెండవ విషయం. అలాంటి సందర్భాలలో కాంగ్రెసేతర ప్రభుత్వం గనుక నిర్మాణయుతమైన విమర్శ చేస్తూ, విడిగా, మంత్రివర్గంలో లేకుండా వ్యవహరిస్తాము. ప్రతిపక్షంగా వుంటామా లేదా అనేది వేరే ప్రశ్న. అది సమస్యనుబట్టి వుంటుంది. ప్రభుత్వ పక్షంతో కలిపి సంఘటనగా మాత్రం వ్యవహరించము. మన ప్రత్యేక ప్రతిపత్తిని, ప్రభుత్వాన్ని సమస్యపరంగా విమర్శించే హక్కు, అవకాశాన్ని నిలుపుకుంటాము. ఇదీ మన వైఖరి.చాలా తక్కువ మోతాదేగానీ అలాంటి మంత్రివర్గాలలో కూడా మనం పాల్గొనాలన్న ధోరణి మనపార్టీలో అక్కడక్కడ లేకపోలేదు.

పంజాబ్ కామ్రేడ్స్ అకాలీదళ్‌తో కలిసి మంత్రివర్గంలో ఉండాలని వాదించలేదు. కానీ అకాలీదళ్‌తో కలిసి మనం ఒక ఐక్యసంఘటనగా ఏర్పడగా ఆ సంఘటనకు కన్వీనర్‌గా కామ్రేడ్ సూర్జిత్‌ను ఉంచేట్లయితే మనం ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేయవచ్చునని వాదించారు. కేంద్ర కమిటీ దానికి అంగీకరించలేదు. సూర్జిత్‌ను కన్వీనర్‌గా అకాలీదళ్ అంగీకరించదన్న ప్రశ్నకాదు. సూర్జిత్‌కు వున్న పలుకుబడి, ఆయన త్యాగమయ జీవితం, ఆయన శక్తి సామర్థ్యాలు, అకాలీదళ్‌కూ తెలిసినవే. అయినా మనం మన అవగాహన ప్రకారం ఆ కామ్రేడ్స్ వాదన తప్పు అని వొప్పించాము. మంత్రివర్గంలో చేరతామా చేరమా అన్నది వేరే ప్రశ్న. అసలు వారితో కలిసి ఐక్య సంఘటనగా ఏర్పడటమే పైన పేర్కొన్నట్లు పొరపాటు దృక్పథం. ఇక్కడే సిపిఐకు మనకు ప్రధానమైన తేడా వున్నది. వారు తమకు తగిన బలం లేకపోయినా జనసంఘం లాంటి పార్టీలతో కలిసి కూడా కాంగ్రెసేతర మంత్రివర్గాలలో పాల్గొన్నారు. అది వారికి నష్టమే చేకూర్చిందిగానీ, అందువల్ల వారి పార్టీ ఆయా రాష్ట్రాలలో అదనంగా పెరిగిందేమీలేదు.

కేరళలో మనమే ముఖ్యమంత్రి. బెంగాల్‌లో మనం లేకుండా ఆ మంత్రి వర్గం మనజాలని పరిస్థితి. శాసనసభలో అజయ్ ముఖర్జీకి మన సంఖ్యాబలం అవసరం. అలాగే బయట కూడా ఆ మంత్రివర్గానికి మన ప్రజా మద్దతు అవసరం. మనం ప్రభుత్వంలో ఉన్నామని భావించిన ప్రజానీకంలోని వివిధ తరగతులు మన ప్రభుత్వానికి వున్న పరిమితులను గ్రహించకపోయినట్లయితే మనం చిక్కుల్లో పడవలసి వస్తుంది. ఎన్నాళ్ళనుండో పేరుకుపోయిన తమ తమ సమస్యలను తక్షణం మనం పరిష్కరించాలని ప్రజలు కోరడం సహజం. కానీ రాష్ట్ర ప్రభుత్వాలకున్న పరిమితులలో వారి మౌలికమయిన కోర్కెలు సక్రమంగా పరిష్కరించడం సాధ్యంకాదు. అందువల్ల ప్రజలకు మనపై కూడా అసంతృప్తి పెరిగే అవకాశం వుంది కనుక ఎప్పటికప్పుడు ప్రజల్ని రాజకీయంగా చైతన్యవంతంగా చేసుకుంటూ, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్న పరిమితులను వారికి తెలియచెప్పి ప్రజలను విశ్వాసంలోనికి తీసుకుని, ఆ పరిమితులలో ఏది తక్షణం ముఖ్యంగా చేయవలసిన పనో నిర్ణయించుకుని మన ప్రభుత్వాలు కృషి చేయాలి. ఇది అంత తేలికైన విషయం కాదు. ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌లో మన వామపక్ష ప్రభుత్వం కూడా ఈ ఇబ్బందులెదుర్కోవలసే వస్తున్నది.

1964లో నేను మార్క్సిస్టు పార్టీకి ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డాను. ప్రధాన కార్యదర్శి బాధ్యతల నుండి నేను తప్పుకున్నట్లు 1977 ఏప్రిల్‌లో బహిరంగంగా ప్రకటించాము. నిజానికి 1966 వరకు జైళ్ళలోనే సరిపోయింది. 1975 జూన్‌లో అత్యవసర పరిస్థితి ప్రకటించిన సందర్భంగా నేను నా ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా ఇచ్చాను. అత్యవసర పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలి. తదితర అంశాలపై విభేదాలు వచ్చి నేనిక ప్రధాన కార్యదర్శిగా కొనసాగరాదని నిర్ణయించుకున్నాను. అయితే 1976 జులైలో నా రాజీనామా ఆమోదించబడింది. కనుక 1966 నుండి 1975 లేదా 1976 ఈ పదేళ్ళలో నేను ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పటికి నా కృషి వివరాలన్నింటి జోలికి నేను వెళ్ళటం లేదు. ఆనాటి ఏ సమస్యలపై ఏయే వైఖరులు తీసుకున్నాము. నా ప్రత్యేక పాత్ర ఏమిటి ఇవి అన్నీ పార్టీ రికార్డులలో దొరుకుతాయి. నిజానికి అవి ఏమంత ప్రత్యేకించి బ్రహ్మాండమైనవిగా చెప్పలేను.

అయితే ఈ సమయంలో పార్టీ నిర్మాణాన్ని ఎలా సరిదిద్దుకోవాలి? వివిధ ప్రజాసంఘాలలో ఎలా పని చేయాలి? ఒక్క మాటలో చెప్పాలంటే, ఒక విప్లవ పార్టీకి అనుగుణంగా మన పార్టీని, ప్రజాసంఘాలను ఎలా నిర్వహించుకోవాలి అన్న ప్రశ్నలు ఈ పదేళ్ళ కాలంలో మనముందు ఉన్నాయి. 1936లలో పార్టీని ఆరంభించిన అనుభవం నాకుంది. అప్పట్లో సోషలిజం, కమ్యూనిజం ఇలాంటి పదాలు క్రొత్త ఈ రోజున మామూలుగా వాడుకలో వున్న పదాల నెన్నింటినో కొత్తగా ఆనాడు సృష్టించవలసి వచ్చింది. 1964లో కొత్తగా పార్టీని ఏర్పాటు చేసినపుడు కొంత అనుభవం కలిగిన, పట్టుదల కలిగిన కామ్రేడ్స్ కార్యకర్తలుగా కొత్తపార్టీకి ఉన్నారు. పార్టీ కూడా ఎన్ని రకాల అనుభవాలనో జీర్ణించుకుని, కొంత పరిణితి చెంది వున్నది. నిజానికి కొత్త పార్టీని సృష్టించడం అనడం కంటే పార్టీలోని తప్పుడు రాజకీయాలను ఎదుర్కొని ప్రక్షాళన చేయడంగా చెప్పుకోవచ్చు. ఇలా అంటున్నానంటే ఇదేదో



తేలికయిన పని అని నా ఉద్దేశ్యం కాదు. 1930కు, 1964కు అలాగే 1975కు భౌతిక పరిస్థితులలో చాలా తేడాలున్నాయి. ప్రతి విషయంలో పురోగమనమన్నది గతం కన్నా చైతన్యయుతంగా, విస్తృతంగా సాగుతున్నది. ఆటంకాలు, ఆటుపోట్లు అన్నవి ఉన్నా అనివార్యంగా పురోగమనం జరిగింది.

మన డాక్యుమెంట్లలో చైనా పార్టీ అవగాహనతో విభేదిస్తున్న విషయాలు కూడా మార్క్సిస్టు పార్టీ నిర్మాణమవుతున్న తొలి రోజులలో వున్నాయి. చైనా వారు 'నెహ్రూ తాత్విక ధోరణిపై మరికొంత వివరణ' అంతకుముందు 'కొంత వివరణ' అంటూ రెండు పత్రాలు వెలువరించారు. వానిలో వెలిబుచ్చిన కొన్ని సూత్రీకరణలతో విభేదించాము. అలాగే మన పార్టీ కార్యక్రమంలో, భారత ప్రభుత్వ వర్గ స్వభావానికి సంబంధించిన మన నిర్వచనంతో చైనా పార్టీ వారు ఏకీభవించలేదు. తమ అభిప్రాయంలో 'నెహ్రూ ప్రభుత్వం ఒక తొత్తు ప్రభుత్వం' అనీ, ఈ ప్రభుత్వాన్ని గూర్చిన మన నిర్వచనంతో తాము ఏకీభవించకపోయినా, మన పార్టీనే కమ్యూనిస్టు పార్టీగా గుర్తిస్తున్నామనీ, కనుక తమ అభిప్రాయాన్ని మనపై రుద్దే సమస్య లేదనీ స్పష్టంగా మనకు తెలియజేశారు. చైనా వారి వైఖరితో విభేదిస్తూ, నేను మాస్కో నుండి భూపేష్ ద్వారా రాసి పంపిన ఉత్తరం గూర్చి ఇంతకుముందే ప్రస్తావించాను. భూపేష్‌తో ఆ వుత్తరాన్ని పంపడం విమర్శకు గురైంది. కానీ, కేంద్ర కమిటీ ఆ రాజకీయ అభిప్రాయంతోనే వున్నది. కనుక 1964, 1965 కాలంలోనే చైనాకు, మనకూ మధ్య కొన్ని సూత్రీకరణలలోనే తేడాలున్నాయి.

కనుక మనం చైనా పార్టీ చెప్పినదానికల్లా తలలూపి, వారి పనుపున పార్టీని చీల్చి, వేరే పార్టీ పెట్టామనడం పచ్చి అబద్ధం. అయితే రష్యా, చైనాల ప్రభావం లేదా అంటే, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం మీదే వుంటుంది. మనపైన కూడా వుండవచ్చు. అంతేగాని, ఎవరి ఆదేశాలను మనం పాటించలేదు. మనం స్వతంత్రంగా వివిధ సమస్యలపై చర్చించి, మన నిర్ణయానికి మనం వచ్చాము. పార్టీ మహాసభ సందర్భంగానే పార్టీలో కొన్ని అనుమానించదగిన శక్తులు చేరుతున్నాయని గుర్తించి, వాటిపట్ల జాగ్రత్తగా వుండాలని హెచ్చరించాము కూడా. వారు చేస్తున్న ప్రభుత్వాలు కూడా మాకు తెలుసు. ఉదాహరణకు జగ్జిత్ సింగ్ లాయల్‌పురి ఇంగ్లండ్ వెళ్ళి అక్కడ చైనా రాయబార కార్యాలయం వారిని కలుసుకున్నాడు. ఇలాగే కొన్ని యత్నాలు సాగుతున్నాయి. మేము చైనా కామ్రేడ్స్‌ను కూడా హెచ్చరించాము. కొన్ని సందేహాస్పద శక్తులు మీ వల్ల ప్రోత్సాహం పొందుతున్నాయి. వారి విషయంలో అప్రమత్తంగా వుండాలని, వారిని దగ్గర చేరనీయవద్దని, నిజానికి అలా హెచ్చరించడం ఒక సోదర పార్టీగా మన కర్తవ్యం. ఏ ఏ రాష్ట్రాలలో ఎవరెవరు అలాంటి శక్తుల్లో, పార్టీకి తెలియకుండా చైనాతో సంబంధాలు పెట్టుకుంటున్నదెవరెవరో మాకు తెలుసు. మీరు మీ విధానాన్ని వివిధ భాషలలో అనువదింప చేయాలనుకుంటే ఆ బాధ్యతను ఎవరికి బడితే వారికి యివ్వవద్దు మేము చేయిస్తాము. అని చైనా కామ్రేడ్స్‌తో చెప్పాము. కానీ, చైనా వారు క్రమేపి తమకు ఎవరు నమ్మకమని తాము భావిస్తున్నారో అలాంటి వారి గ్రూపు ఒకటి యిక్కడ వుండాలని భావించారు.

# నక్జలైట్ చీలిక

1966, 67లోనే ఈ నక్సలైట్ గ్రూపులు సంఘటితపడుతున్నాయి. ఈ విషయం మాకు తెలుసు. అలా చైనా ఎంత చెప్తే అంత అనే సెక్షనొకటి కేరళలో బలంగానే వుంది. బెంగాల్‌లో కొందరు దుందుడుకువాదులపై చర్య కూడా తీసుకోవలసి వచ్చింది. సుశీల్‌కుమార్ రాయ్ వంటి వారిని పార్టీ నుండి తొలగించాము. ఇక్కడ ఆంధ్రలో జైల్లోనే చంద్రపుల్లారెడ్డి తన నక్సలైట్ ముఠాను ఏర్పాటు చేసుకుంటున్నాడు. కామ్రేడ్ బసవపున్నయ్యకు ఈ విషయం మరింత వివరంగా తెలుసు. ఆయన ఈ నక్సలైట్ వైఖరి గలవారితో వాదించి, సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నాడు. నేను మాస్కో నుండి వచ్చిన తర్వాత చైనా వైఖరిని నిశితంగా విమర్శిస్తూ కామ్రేడ్స్‌కు వివరించాను. పుల్లారెడ్డి వచ్చి "చైనా మన సోదరపార్టీ అలా విమర్శించవచ్చునా" అని అడిగాడు. "సోదరపార్టీ అయితే, వారు చెప్పినదానికల్లా మనం గుడ్డిగా తలలూపవలసిన పనిలేదు" అని చెప్పాను. మరి యింత తెలిసి, అలాంటివారిని బాధ్యతాయుత స్థానాల్లో ఎందుకు వుంచాల్సి వచ్చిందనే ప్రశ్న అడగవచ్చు. నిర్మొహమాటంగా చెప్పాలంటే, రాజకీయ అపరిపక్వత సైద్ధాంతిక నిశితత్వం కొరవడడం. ఆ మాటకొస్తే ఆంధ్రలోనే కాదు, కేంద్ర కమిటీలో కూడా ఈ మెతకదనం వుంది.

నక్సలిజం వ్యక్తిగత బలహీనతలు కావు, నచ్చచెప్పేందుకు. తప్పుడు రాజకీయ సైద్ధాంతిక అవగాహన. వాటిని ఖచ్చితంగా ఎదుర్కొనాలి. అందులో మీన మీషాలు లెక్కబెట్టే వీలులేదు. అలాంటి సందర్భాలలో ఎక్కడన్నా నేను అతిగా వ్యవహరించానేమో కూడా. "అతి" మనకు తగదు. కానీ, అలాంటి పోరాటం ఈ శక్తులతో నడవకుండా పార్టీ బతికి బట్టకట్టలేదు.

1964 తర్వాత కామ్రేడ్ హనుమంతరావు ఆంధ్రప్రదేశ్ కార్యదర్శిగా ఎన్నికైనాడు. బసవపున్నయ్య, హనుమంతరావు సైద్ధాంతికంగా విధానాన్ని వివిధ సందర్భాలలో వివరిస్తూనే వుండేవారు. ఆ నక్సలైట్ భావాలు కలవారు కూడా, పార్టీ విధానాన్ని వ్యతిరేకిస్తున్నామంటూ, స్పష్టంగా బయటపడలేదు. పార్టీ విధానం సరైనదే మేము దాన్ని అంగీకరిస్తున్నాం. అయితే చైనా వైఖరిని విమర్శించడం పట్ల కొన్ని అనుమానాలున్నాయి అంటూ ఆరంభించారు.



అనుమానాలు వ్యక్తం చేసినంతమాత్రాన పార్టీ నుండి బహిష్కరించలేముకదా. పైగా చైనా పార్టీ తీసుకున్న తప్పుడు విధాన తీవ్రత కూడా పోనుపోను బయటపడ్డది. ఆ తర్వాత క్రమంలో "అదేమిటి ఇంత ఘోరమైన తప్పులు చైనా ఎలా చేయగలిగింది." దీనికెక్కడో మూలం వుండి వుండాలని భావించాము. చైనా పొరపాటు మార్గాన పట్టిన తొలిదశ నాటి డాక్యుమెంట్లు మళ్ళీ చదువుతుంటే, ఈ తప్పుల వృక్షం పెరగడానికి బీజం అప్పుడే అని అర్థం అయింది. మన అనుభవమూ వుందిగా, 1948 రాజకీయ తీర్మానం ఆసరాగా కామ్రేడ్ బిటిఆర్ 'సోషలిస్టు విప్లవదశ' అనేదాకా సిద్ధాంతీకరించలేదూ.

వాళ్ళు చైనా విధానాలను గుడ్డిగా సమర్థిస్తున్నారనీ, తప్పుడు ధోరణులు కొన్ని వున్నాయనీ తెలుసు. కానీ వారు ఒక ముఠాగా వ్యవహరిస్తున్నారని తెలియదు. అసలు అలా ముఠాగా వ్యవహరిస్తారన్న అభిప్రాయంతో ఆరంభించంకదా. నేను అఖిలభారత కార్యదర్శిగా వున్నాను. పార్టీ పునర్నిర్మాణం, పత్రిక, వివిధ సైద్ధాంతిక అంశాలు, వివిధ రాష్ట్రాలలో పరిస్థితి – ఇవి చూసుకోవాల్సి వుండేది. పార్టీ సభ్యత్వమే తీసుకుందాం. 1964లో మనం పార్టీగా ఏర్పడినప్పుడు మన సభ్యత్వం ఒక లక్షపైగా వుంది. సిపిఐ సభ్యత్వం కలిసి చీలికకు ముందు లక్షపైగా వుంది. మనకూ లక్షపైగా సభ్యత్వం వుండి, సిపిఐకి మనకన్న ఎక్కువ వుంటే, మొత్తం సభ్యత్వం లక్షకు కొంచెం ఎక్కువగా మాత్రమే ఎలా వుంటుంది. దాన్ని బట్టి, వూరికే లెక్కకు సభ్యులుగా చేర్చారన్నమాట. కనుక ముందు పార్టీ సభ్యత్వాన్ని చక్కబరుచుకోవాలి. 1966లో జైళ్ళ నుంచి రాగానే, పార్టీ సభ్యత్వం పునరుద్ధరణ మొదలెట్టాము. 1967 ఆరంభంలో ఎన్నికలవల్ల 1967 జులై వరకూ పార్టీ సభ్యత్వ గడువు పొడిగించాము. కేరళలో, బెంగాల్‌లో ప్రధాన పార్టీగా గెల్చాము. అయినా 1967లో పార్టీ సభ్యత్వం తగ్గింది. ఆంధ్రప్రదేశ్‌ను ఉదాహరణగా తీసుకున్నా, 1964లో 28 వేలు సభ్యత్వం అయితే 1967లో 16 వేలకు పడిపోయింది. మిగతా 12 వేలు తాలు సభ్యత్వం అన్నమాట.

పార్టీ నిర్మాణాన్ని పకడ్బందీగా నిర్మించుకోవడం కోసం, తీవ్రంగా కృషి చేయాలి. 1967 నాటికి ఎన్నికలపట్ల భ్రమ, పదవీకాంక్ష, తనకు సీటు కావాలని, మనం మన బలంతో నిమిత్తం లేకుండా మరిన్ని సీట్లకు పోటీ చేయాలనీ ఇలాంటి పార్లమెంటరీ ధోరణులు బాగానే వున్నాయి. అసలెన్నికలలో ఎందుకు పోటీచేస్తాం. గెలవడం సరే, గెలవడం కోసమే పోటీ చేయము కూడా. ఒక్కోసారి రాజకీయ ప్రచారం కోసం పోటీ చేస్తాము. అలా ప్రచారం చేయాలన్నా కనీసం కొంత బలం వుండాలిగదా. ఏదో ఒకటి పెట్టుకోవాలి. ఆరవ వంతు డిపాజిట్. అంత లేకపోతే మానె, కనీసం 10 శాతం అయినా ఓటింగు వుండాలా? లేకపోతే రాజకీయ ప్రచారమూ చేయలేము. ఎన్నికల పరిచయాలను సంఘటిత పరచుకోగల కనీస పార్టీ నిర్మాణం అన్నా వుండలా? లేకపోతే పోటీ చేసి ఏం ప్రయోజనం? అలా సంఘటిత పరచుకునే శక్తి కూడా లేనప్పుడు పోటీ చేయడం దండగ. అప్పుడు ఉత్తరప్రదేశ్, బీహార్

వంటి చోట్ల మన పార్టీకి కొన్ని సీట్లలో 1 శాతం, 2 శాతంగా అతి తక్కువగా ఓట్లు వచ్చాయి. డిపాజిట్ సంగతి వదిలేద్దాం. అలాంటి ధోరణులను అరికట్టాలి. ఆ కామ్రేడ్స్‌కు నచ్చచెప్పాలి. ఇక గత్యంతరం లేకపోతే 'ఆదేశం' యివ్వడం కానీ, చెప్పగానే వినని వాళ్ళకందరికీ ఆదేశం యివ్వనారంభిస్తే, వాళ్ళు ఆదేశాన్ని ధిక్కరిస్తారు. పార్టీ నుండి బయటకు పోతారు. స్వతంత్రులుగా నిలబడతారు.

ఈ కాలంలో మార్క్సిజం-లెనినిజాన్ని మన స్థితికి అన్వయించుకోవడం పెద్దపని. పార్టీ నిర్మాణానికి సంబంధించిన మౌలికమైన డాక్యుమెంటును నేను, కామ్రేడ్ బసవపున్నయ్య కలిసి తయారు చేశాం. అలాగే రైతాంగ ఉద్యమాన్ని గూర్చిన డాక్యుమెంటు కూడా. విద్యార్థి - యువజన రంగాలకు సంబంధించి కామ్రేడ్ బసవపున్నయ్య సహకారంతో నేను తయారు చేశాను. నూతన పరిస్థితిలో నూతన కర్తవ్యాలు అని ఎన్నికల అనంతరం కేంద్ర కమిటీ విడుదల చేసిన ఆ డాక్యుమెంటు కామ్రేడ్ బసవపున్నయ్య రాసింది ట్రేడ్ యూనియన్‌కు సంబంధించిన డాక్యుమెంటును కామ్రేడ్ బి.టి.ఆర్., కామ్రేడ్ రామమూర్తి కలిసి రాశారు. అయితే ఈ ప్రధాన డాక్యుమెంట్లు ముసాయిదాగా తయారు చేసింది. పైన పేర్కొన్న వాళ్ళమే అయినా మిగతా కామ్రేడ్స్ వారి వారి అనుభవాలతో చర్చించి తుది రూపం యిచ్చారు. అందులో ప్రధానమైంది వ్యవసాయ సమస్య. దాని మీద తీవ్రమైన చర్చలు జరిగాయి. విభేదాలు వచ్చాయి. అది వేరే విషయం. చివరకు జలంధర్ మహాసభలో దానికి తుది రూపం యివ్వబడింది. అదే కొనసాగుతున్నది.

ఈ మొత్తం కాలంలో వివిధ సమస్యలపై నా పాత్ర ఏ రకమైన ప్రభావం చూపింది, ఎన్ని సందర్భాలలో సరైన మార్గం చూపగలిగాను. ఎన్ని సందర్భాలలో విఫలమైనాను అన్నవి డాక్యుమెంట్లలో వున్నాయి. కావాలంటే ప్రత్యేకంగా అధ్యయనం చేయవచ్చు. అయితే ఒక్క విషయం మాత్రం జ్ఞాపకం పెట్టుకోవాలి. డాక్యుమెంట్లలో కామ్రేడ్ బసవపున్నయ్య ఏం చెప్పాడు? బి.టి.ఆర్. ఏం చెప్పాడు? నేనేం చెప్పాను? అన్నవి కాదు ముఖ్యం. ఈ కాలంలో ప్రజా ఉద్యమాలేమిటి, వాటి పురోగమనమేమిటి అన్నది కూడా చాలా ప్రధానమైంది. నిజానికి ఎవరైనా తమ అభిప్రాయాలను వాటిపై ఆధారపడికదా - ఆ అనుభవాలు, గుణపాఠాలపై ఆధారపడికదా రూపొందించుకునేది. అవేం చూడకుండా కేవలం డాక్యుమెంట్లలోని చర్చోపచర్చలకే పరిమితమైతే కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర అంటే తగాదాల చరిత్రగా మిగులుతుంది. పైగా సిద్ధాంతం అన్నది ఆచరణ నుండి వస్తున్నది. మళ్ళీ అది ఆచరణకు తోడ్పడి రుజువు కావాలి.

1952 నుండి 1962 వరకూ లీగల్ సమయం. కనుక, ఆ సమయంలో జరిగినదంతా 'రివిజనిజం' అని చెప్పజాలం. ఏ అవగాహనతో వుద్యమ నిర్మాణానికి - ఎన్నికలకైనా సరే



సమాయత్తమవుతున్నామన్నది ప్రశ్న. విప్లవ అవగాహనతో 'లీగల్' సమయంలో కూడా పార్టీని, వుద్యమాన్ని నిర్మించుకోవాలి. అవన్నీ వదిలేసి నక్సలైట్లు నేడంటున్నట్లు అసలు తెలంగాణా పోరాట విరమణ చేసి వుండవలసింది కాదు, కొనసాగించినట్లయితే, ఈపాటికి విప్లవం వచ్చివుండేది అన్నది పనికిమాలిన వాదన. అలాగే ఓంకార్ కూడా ఏవో బ్రహ్మాండమైన ప్రజా వుద్యమాలు నడిపి వుండవలసిందని. ఒక్కోసారి సరైన విప్లవ అవగాహన కలిగి ఉద్యమాలు నిర్మిస్తున్నా - గుణాత్మకమైన మార్పు వెంటనే రాదు. భౌతిక పరిస్థితి దృష్టిలో వుండాలి.

ఆంధ్రలో రివిజనిజమూ, ఉగ్రవాదము కూడా తీవ్ర నష్టాన్ని కల్గించాయి. ఎందుకు అన్నది అధ్యయనం చేసి సరి చేసుకోవాలి. ప్రధానంగా రైతాంగ పునాది, పెటీ బూర్జువా పునాదిగల వుద్యమం ఆంధ్రలో వుంది. నాయకత్వం నిరంతరం రాజకీయ చైతన్యానికి కృషి చేయవలసిందే. అప్పుడే ఏమిటీ, ఇప్పుడు మటుకూ ఓంకార్ ధోరణికి అదే రైతాంగ వెనుకుబాటుతనం కారణం. ఓంకార్ ఒక్కడనే కాదు. ఎందుకు మనం రాజకీయ చైతన్యం కలిగించలేకపోతున్నాం? మన కృషి వుండాలి. భౌతిక పరిస్థితి కూడా ఎలా వుంది? పారిశ్రామిక కార్మికవర్గం మనం సంఘటితంగాలేదు. మనం ఇంకా యీ విషయంలో చాలా వెనుకబడే వున్నాం. రైతాంగాన్ని, గ్రామీణ వుద్యమాల్ని నిర్లక్ష్యం చేయమని కాదు. వాటి ప్రాధాన్యత వాటికుంది. అయినా, సంఘటిత శ్రామికవర్గ పురోగమనం లేకుండా, పెద్దగా పురోగమించడం సాధ్యంకాదు.

ఒక వుద్యమం వెనకబడిపోతుంటే, మా పార్టీ విధానం సరైనదే, భౌతిక పరిస్థితులే సరిగా లేవు అని చెప్తూ కూర్చుంటే ప్రయోజనం ఏమిటి? ఒక కూర రుచి దాన్ని ఎంత ఆత్రంగా తిన్నాము. అన్నదాన్నిబట్టి చెప్పాలి. పార్టీ విధానం సరైనది కాదు అన్నది చివరికి పార్టీ పురోగమనం మీద ఆధారపడి వుంటుంది. "మహారాష్ట్రలో కార్మిక ఉద్యమం ఎందుకు పెరగలేదంటే" డాంగే అనేవాడు, "మహారాష్ట్రలో పెట్టుబడిదారీ వర్గం చాలా తెలివైంది" అని. అంటే మహారాష్ట్రలో కార్మికవర్గం ప్రపంచంలోకెల్లా తెలివితక్కువదని అర్థం చేసుకోవాలా? లేకపోతే అక్కడ పార్టీ నాయకత్వం తెలివితక్కువ వారని చెప్పాలా? నా వుద్దేశం అలా చెప్పాలని కాదు. మార్క్సిజం, లెనినిజాన్ని ఆచరణలో అన్వయించుకోవడంలో ఆ నాయకత్వం విజయవంతం కాలేదు అని అర్థం. అందుకని, ఎందుకు విఫలం చెందాము? జాగ్రత్తగా పరిశీలించుకుని, ఆ కారణాలను తొలగించుకుని పురోగమించాలి. అప్పుడు విధానం సరైనది అని చెప్పినా అర్థం వుంది. ఒక సందర్భంలో అంతా సవ్యంగా వున్నా, వుద్యమం పెరగాల్సినట్లు పెరగదు. జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు, అవీ తగు విధంగా మారేదాకా ఆగాల్సి వుంటుంది.

కొందరు నాయకులు కదిలితేచాలదు. ప్రజానీకం కదలాలి అసలీ ప్రజల పాత్ర నక్సలైట్ల దృష్టిలోలేదు. ఈ వాదం ముందుగా బెంగాల్లో రాష్ట్ర కమిటీలోనూ, వివిధ జిల్లా కమిటీలలోనూ

పొడ చూపింది. కామ్రేడ్ ప్రమోద్ దాన్ని ఆదిలోనే తుంచివేయాలని పట్టుదలగా కృషి చేశాడు. వివిధ జనరల్ బాడీలు వేసి ఆ వాదన ఎంత ప్రమాదకరమో చెప్పాము. ఆ ముఠావాళ్ళే 1967 మంత్రివర్గంలో మనం పాల్గొనరాదన్న వాదన కూడా తెచ్చారు. అది తప్పని చాలా ఓపికగా, శక్తివంతంగా చెప్పాల్సి వచ్చేది. వాళ్ళు దుస్సాహసాలకు ఒొడిగట్టేవాళ్ళు.

అంతకుముందే చైనా వాళ్ళకు చెప్పాము. మీరు మా పార్టీని గుర్తిస్తూనే మా వెనకాలే మాకు హాని కలిగించే వాళ్ళతో సంబంధాలు పెట్టుకుంటున్నారు. అలాంటి వాళ్ళు పార్టీకి వ్యతిరేకంగా సమానాంతర పార్టీ ఏర్పాటు చేసేందుకు ఇది ప్రోత్సాహమిచ్చినట్లు అవుతుంది. మంచిది కాదు అని హెచ్చరించాము. "దేశభక్తియుత, విప్లవ శక్తులన్నింటితోనూ, సంబంధాలుంచుకోవడం మా విధానం" అన్నారు. ఈ "మా" అంటే, ఎవరో తెలియదు. వాళ్ళ కేంద్ర కమిటీనా, మాకు చెప్పిన వ్యక్తులా, లేక నాయకత్వంలో ఒక ముఠానా అని. వాళ్ళే అప్పుడు గందరగోళంలో వున్నారు. బెంగాల్లో అలాంటి వ్యక్తులను వివిధ స్థాయిలలో గుర్తించి, జాగ్రత్తపడమని పార్టీని సదా హెచ్చరించే వాళ్ళం. అక్కడే వున్నాం కదా. ఆ మేరకు, మన బెంగాల్ కామ్రేడ్స్ కృషి చేశారు. ఈ నక్సలిజానికిగానీ, మరే ఇతర అన్యవర్గ విధానాలకుగాని ఎక్కడికక్కడ రాష్ట్ర కమిటీలు పోరాటం నడపాలిగానీ, కేంద్రం ఒక్కటే ఆ పని ఎలా చేయగలదు?

ఇక్కడ ఆంధ్రలో పుల్లారెడ్డి, దేవులపల్లి, కొందరు యువకులు నక్సలైట్ల విధానంతో పూర్తిగా మమేకం అయినారు. చైనావారి ప్రచారాన్ని వాడుకుని, వాళ్ళు వివిధ జిల్లాలకు వ్యాప్తిచెందారు. పార్టీ నిర్మాణంలో వుంటూనే, ఈ పని దొంగచాటుగా చేశారు. చివరకు రాష్ట్ర కమిటీలో కూడా ఈ జాడ్యం బాగానే వ్యాప్తి చెందింది. పాలకొల్లులో ప్లీనం జరిగింది. నాల్గింట మూడువంతులు ప్రతినిధులు వారితో వున్నారు. చాలా కొద్దిమంది వ్యక్తులుగా మాత్రం కేంద్ర కమిటీతో వున్నారు. నేనక్కడ స్పష్టం చేయవలసి వచ్చింది. "మీరిలాగే వ్యవహరిస్తే, ఇక్కడ పార్టీ కమిటీని రద్దు చేసి, మళ్ళీ పార్టీని పునర్నిర్మించుకుంటాం. అందుకు తగిన మెజారిటీ బెంగాల్, కేరళ ద్వారా మాకు వుంది. ఈ పిచ్చిపిచ్చి వేషాలకు భయ పడేదిలేదు. సరైన మార్క్సిస్టు లెనినిస్టు పంథాను – మీ కోసం బలిపెట్టే ప్రశ్న లేదు" అని. ఈ పాలకొల్లు ప్లీనం ఎజెండా, అంతర్జాతీయ సైద్ధాంతిక సమస్యల ముసాయిదాపై చర్చ. ఆ ముసాయిదాను కేంద్ర కమిటీ 1967లో అంగీకరించింది. పాలకొల్లు ప్లీనం తర్వాత బర్ద్వాన్ ప్లీనంలో ఈ ముసాయిదా ఆమోదించబడింది.

1967 మేలో చైనా పార్టీతో సంప్రదింపులకు మనం ప్రతిపాదించాము. అయితే, చైనా పార్టీ వారు తిరస్కరించారు. సరే, మీకు మాతో పార్టీ రీత్యా సంబంధాలు కొనసాగించటం యిష్టం లేకుంటే, మీ యిష్టం అని స్పష్టంగా తెలియజేశాం. నేను, ప్రమోద్ డార్జిలింగ్ వెళ్ళాము.



పార్టీ వ్యవహారాలు చక్కదిద్దుదామని. అదే సమయంలో ఆ ప్రాంతం నేను చూడదలుచుకున్నాను కూడా. మేము అక్కడ వుండగానే నక్సల్‌బరీ ప్రాంతంలో స్త్రీలపై పోలీసులు కాల్పులు జరిపినట్లు తెలిసింది. కానూసన్యాల్ నక్సలైట్లకు నాయకుడు. ఆయన 1967 ఎన్నికలలో మన తరపు అభ్యర్థి కూడా ఆ ప్రాంతంలో బాగానే పలుకుబడి గలవాడు. ఆయనను పిల్చి అడిగాం, స్త్రీలను ముందు పెట్టడం సరైనదా అని. అలా అని పోలీసులు కాల్చడం న్యాయమనికాదు, అదీ అక్రమమే ఏమైనా పోలీసులంటే పోలీసులే. అంతకుముందు పార్టీ పిలుపునిచ్చింది. ప్రభుత్వ బంజర్లు వుంటే, ప్రభుత్వ ఉత్తర్వు కోసం చూడకుండా పేదలచేత ఆక్రమింపచేయమనీ, తరువాత ప్రభుత్వం ఆ ఆక్రమణలను ధృవపరుస్తుందని, నక్సల్‌బరీ ప్రాంతంలో 1200 ఎకరాల ప్రభుత్వ బంజరు వుంది. దాన్ని ఆక్రమించుకునేందుకు కానూసన్యాల్ ప్రజలను తీసుకురాలేదు. "అదెందుకు ఆక్రమించుకోలేదు?" అని అడిగాం. "ఇదేదో బంజర్ల కోసం పోరాటంకాదు. నక్సల్‌బరీ చైనాలో 'యూనాన్' వంటిది అక్కడ నుండి విముక్తి పోరాటం ఆరంభించదలుచుకున్నాం. ఆ భూములు ప్రజలు ఆక్రమిస్తే, తర్వాత ప్రభుత్వం వాటిని ధృవపరిస్తే భూమి దక్కిందని ఆ ప్రజలు పోరాటానికి రారు. అందుకనే ఆక్రమించదలచలేదు" అని స్పష్టంగా చెప్పాడు.

అయితే ఈ 'యూనాన్'ను పశ్చిమబెంగాల్లోనే, అదీ మనం అధికారంలో వున్నప్పుడు, ఈ సమస్యలు పరిష్కరించేందుకు యత్నిస్తున్నప్పుడు ఎందుకు ఆరంభించారు అని అడిగాను. కానూసన్యాల్ మాట్లాడలేదు. ఆ తర్వాత అప్పుడు వ్యవసాయ శాఖ చూస్తున్న హరికృష్ణ కోనార్ కూడా వెళ్ళి వాళ్ళతో మాట్లాడి వచ్చాడు. కోనార్‌కు, కానూసన్యాల్‌కు మంచి సంబంధాలుండేవి. కానూసన్యాల్ మంచి పలుకుబడిగల, పోరాట పటిమగల నాయకునిగా వెనకబడిన ప్రాంతంలో పార్టీ తరఫున పని చేసేవాడు. "కొన్ని వేల ఎకరాలను ప్రజలు ఆక్రమించుకుంటే ప్రభుత్వం ధృవపరుస్తున్నది మీరూ ఆక్రమించండి. అంతేకానీ, ఇదేం పోరాటం?" అని నచ్చచెప్పాడు. అంతేకాదు, "ప్రభుత్వ ఏజెంట్లు మీ నక్సలైట్‌లలో చేరారు. మీరు ఎప్పుడు, ఎక్కడ సమావేశం అవుతున్నదీ వారికి తెలుసు. అయినా, ఎందుకు మిమ్మల్ని ప్రభుత్వం నిర్బంధించడం లేదనుకుంటున్నారు. మిమ్మల్ని, ఈ నక్సలైట్ అరాచకత్వాన్ని వినియోగించి రెచ్చగొట్టదలచుకుంది ప్రభుత్వం" అని కూడా హెచ్చరించాడు వాళ్ళు వినలేదు. పోలీస్‌శాఖ మనచేతిలోలేదు. అజయ్ ముఖర్జీ చేతిలో వుంది. ఆయన ఈ నక్సలైట్ అరాచకత్వంపట్ల చాలా ఆగ్రహంతో వున్నాడు. పైగా ఆయనపై కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తున్నది. అయినా రెండు నెలలపాటు పోలీసులు రంగప్రవేశం చేయకుండా నిరోధించగలిగాము. కానీ నక్సలైట్ ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. ముఖ్యమంత్రిదే పోలీస్ శాఖ కూడా. అలాంటప్పుడు, అంతకన్నా జ్యోతిబాసు, కోనార్ మటుకు చేయగలిగిందే ముంటుంది?

ఈ కానూసన్యాల్‌కు బీహార్‌లోని నక్సలైట్లతో సంబంధాలున్నాయి. 1967 నుండి ఈ వ్యవహారం మాకు తెలుసు. ఇక్కడ ఆ సమయంలోనే పుల్లారెడ్డి ముఠా, ప్రత్యేకంగా పుల్లారెడ్డి ఆ మార్గం తొక్కి, రాజకీయ క్లాసుల్లో ఎక్కడ అవకాశం వస్తే అక్కడ తమ తప్పుడు విధానం ప్రచారం చేయసాగారు. ఉదాహరణకు, "ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర గుణపాఠాలు" అనే పుస్తకాన్ని – పుల్లారెడ్డి రాసిన దాన్ని ప్రచురించారు. నేను దాన్ని చదివాను. నేను కలకత్తా నుండే "ఆ పుస్తకం వక్రభాష్యాలతో నిండివుంది. దాని అమ్మకాలు నిలిపివేసి, కాపీలను ధ్వంసం చేయమని" ఆంధ్రప్రదేశ్ పార్టీకి 'ఆదేశం' యిచ్చాను. అయితే, ఇలాంటి సైద్ధాంతిక పోరాటం ఒక్క కేంద్రం నుండి చేస్తేసరిపోదు. రాష్ట్రాలు తమ తమ స్థాయిల్లో రాజకీయ చైతన్యం పెంపొందించాలి.

ఇక్కడొక విషయం చెప్పాలి. 1964–66 కాలంలో, రివిజనిజానికి వ్యతిరేకంగా పోరాడుతున్న దశలో, అతివాద దుందుడుకు వాదానికి వ్యతిరేకంగా కూడా జరుపవలసినంత నిశితమైన పోరాటాన్ని పార్టీ నడపలేదు. ఈ విషయాల్ని కేంద్ర కమిటీ ఆత్మవిమర్శ చేసుకుంది. చైనా పార్టీ తీసుకుంటున్న కొన్ని తప్పుడు వైఖరుల గూర్చి చెప్పలేదు అని కాదు. జనరల్ బాడీలలో అక్కడా చెప్పాము. కానీ ఈ ప్రమాదాన్ని అంచనావేసి దానికి వ్యతిరేక పోరాటాన్ని నిర్వహించాల్సినంతగా నిర్వహించలేదు. దీనికితోడు భౌతిక పరిస్థితి కూడా. రష్యా వైఖరి చాలా సంస్కరణవాద పంథాలో సాగుతున్నది. వియత్నాంలో దాని వైఖరి, అలాగే వివిధ సమస్యలలో ప్రత్యేకించి ఇక్కడ ఇందిరా ప్రభుత్వాన్ని భుజానమోసే దాని వైఖరి, సిపిఐ మనపట్ల ద్వేషభావంతో వ్యవహరిస్తుండగా ఇక్కడ మొత్తం కమ్యూనిస్టు ఉద్యమానికి సిపిఐ ప్రతినిధి అని సోవియట్ పార్టీ గుర్తించడం – ఇవన్నీ మన కామ్రేడ్స్‌ను చాలా అసంతృప్తికి, సోవియట్ నుండి వెలువడే సాహిత్యాన్ని, చివరకు ప్రామాణిక గ్రంథాలను కూడా చదవడానికి మన కామ్రేడ్స్ సుముఖంగా లేరు. అదేమంటే సోవియట్ వక్రభాష్యం చేసివుంటుందనే వారు. ఇదీనాటి పరిస్థితి. చైనా మనపార్టీపై చాలా తీవ్రమైన పదజాలంతో మనల్ని దూషించసాగింది. కనుక చైనా వారి ఏజెంట్లుగా మార్క్సిస్టు పార్టీ ఆవిర్భవించిందనడం సరికాదు. 1967 మధురైలో సైద్ధాంతిక సమస్యలపై డాక్యుమెంటు తయారవుతున్న సందర్భంలోనే ఉత్తరప్రదేశ్, కాశ్మీర్‌ల నుండి వున్న కేంద్ర కమిటీ సభ్యులు నక్సలైట్లతో వున్నారు. పార్టీ నిర్ణయానికి కట్టుపడతామని పైకి చెప్పినా వారి ముఠా చర్యలను సాగిస్తూనే వున్నారు. వారిని కేంద్ర కమిటీ నుండి బహిష్కరించవలసి వచ్చింది. దేవులపల్లి కూడా ముసాయిదా డాక్యుమెంటుకు వ్యతిరేకంగా వోటు చేశాడు. అయితే నా వద్దకు వచ్చి "నేను ముసాయిదాకు వ్యతిరేకం అయినా, పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి వుంటానని" చెప్పాడు. కానీ ముఠా కార్యకలాపాలు సాగిస్తూనే వచ్చాడు.

బర్ద్వాన్ ప్లీనంలో అత్యధిక మెజారిటీతో నక్సలైట్‌ల వాదన వీడిపోయింది. అక్కడ కేంద్ర కమిటీకి వ్యతిరేకంగా పోరాటంలో ప్రధానంగా నాయకత్వం ఆంధ్ర కామ్రేడ్స్‌లో పుల్లారెడ్డి,



నాగిరెడ్డి వీళ్ళది. శ్రీకాకుళం కామ్రేడ్స్ కామ్రేడ్ పంచాద్రి కృష్ణమూర్తి, తేజేశ్వరరావు. వైజాగ్ కామ్రేడ్ వెంకటప్పయ్య – వీళ్ళు కూడా అటువైపు మొగ్గి వాళ్ళతో కలిసి ఇక్కడ నక్సల్‌బరీ పరిస్థితులు అమలు జరపాలన్న యత్నంలో వున్నారు. దాన్ని నివారించి, సరైన పార్టీ విధానాన్ని వివరించే జనరల్ బాడీలను వాళ్ళు బహిష్కరించారు. వీళ్ళ విచ్చినాన్ని, అరాచకత్వాన్ని కూడా ఎదుర్కొనవలసి వచ్చింది. వీళ్ళేకాదు, సుబ్బారావు పాణిగ్రహి, వెంపటాపు సత్యం, రామలింగాచారి, నారాయణ అని కాల్చివేయబడ్డ ఒక ఉపాధ్యాయ కామ్రేడ్ – వీరందరూ కూడా అంటే, ఆ జిల్లా నాయకత్వం మొత్తం ఆ దుష్ప్రభావానికి గురైనారు. 1966 నుండీ వారు నాతో సంబంధంలో వున్నారు. "మీరు గిరిజనుల విషయంలో నడిపిన ఉద్యమం అభినందించదగ్గది. అయితే, దానికి అండగా వ్యవసాయ కార్మిక, రైతు ఇతర ఉద్యమాలను కూడా నడిపించాలి. ఇక్కడ తెలంగాణా పోరాటాన్ని పునరావృతం చేయడం సాధ్యంకాదు. ఆ పోరాట అనుభవాల నుండి గుణపాఠాలు తీసుకోవాలి. పాక్షిక సాయుధ గెరిల్లా పోరాటం నడపడానికి కూడా ఇక్కడ అవకాశాలు తక్కువ. ఉద్యమంపై తీవ్ర నిర్బంధకాండ వస్తే తట్టుకునేందుకు మీకు దాపుల్లో ఎక్కడా – పశ్చిమ గోదావరి జిల్లా చేరే వరకు ప్రజాస్వామ్య ఉద్యమం లేదు. మీరు మీ ప్రాంతంలో ఇతర ప్రధాన సంఘాలను కూడా అభివృద్ధి చేసుకుంటే ఇదొక ముఖ్యమైన కేంద్రం అవుతుంది" అని వారికి ఎన్నోసార్లు నచ్చచెప్పాను. నా అభిప్రాయంలో ఇలాంటి కేంద్రాలు చాలా అభివృద్ధికావాలి. అని ఒకదాన్ని ఒకటి ఆనుకుని వున్నవిగా వుంటే మరీ మంచివి. అలా లేకపోయినా అలాంటి కేంద్రాలు అభివృద్ధి కావాలి. తక్షణ సాయుధ పోరాటం ఆరంభిస్తామన్న ఉద్దేశ్యంతోనే ఈ కేంద్రాలను అభివృద్ధి చేయాలి అని నా ఉద్దేశ్యం కాదు. సరే ఈ నా అభిప్రాయం పార్టీలో చాలా చర్చనీయాంశం అయింది, అది వేరే సంగతి.

ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. కొందరు కామ్రేడ్స్ ఇప్పుడు వచ్చి ఆ నక్సలైట్ ఉద్యమంలో ఆనాడు తాము పాల్గోలేదని, తటస్థంగా వుండిపోయామని, అదొక గొప్ప కింద చెప్తుంటారు. నేను దానిని అంగీకరించలేను. నక్సలైట్లలో తమ తప్పుడు సిద్ధాంతాన్ని సంపూర్తిగా విశ్వసించి ప్రాణాలర్పించిన వారున్నారు. కాని ఆ సమయంలో తటస్థంగా వున్నారని చెప్పేవారిని నేనెలా అర్థం చేసుకోగలను. నక్సలిజం తప్పు అని భావించేట్లయితే మన పార్టీ వుంది, మన నాయకత్వం వుంది. వారితో చర్చించవచ్చు. అది చేయకుండా తటస్థంగా వుండటం కూడా ఆమోదించపబడినది కాదు. రాజకీయ అపరిపక్వతను నేను అర్థం చేసుకోగలను. కాని ఒక సైద్ధాంతిక పోరాటం తీవ్రంగా జరుగుతున్న సమయంలో తటస్థాన్ని వహించడాన్ని నేనంగీకరించలేను. ఆనాడు జిల్లా, తాలూకా స్థాయి దాదాపు మొత్తం నాయకత్వం అటువైపు కొట్టుకుపోయింది. దానివల్ల ఎంతో నష్టం జరిగిందని ఈనాడు అంగీకరిస్తున్న కామ్రేడ్స్ ఆ రోజు తటస్థంగా వుండటాన్ని ఎలా సమర్థించగలరు?

ఒక ప్రాంతంలో నాయకత్వంలో కొద్దిమేరకైనా పై కమిటీకి అనుకూలంగా వుంటే తప్ప పై కమిటీ సరాసరి పార్టీ సభ్యులను, సానుభూతిపరులను, ప్రజలను తమవైపు

మళ్ళించుకోవడం అంత సులభం కాదు. శ్రీకాకుళంలో దాదాపు కేంద్ర కమిటీ అభిప్రాయానికి ఎవరూ మిగల్లేదు. ఆ తర్వాత వారిలో కొందరు కాల్చి వేయబడినారు. కొందరు పోలీసు ఏజెంట్లుగా మారారు. కొందరు ఇప్పటికీ విప్లవ కారులమనే ముసుగులో బతుకుదెరువు చూసుకుంటున్నారు. చాలా కొద్దిమంది మాత్రం పొరపాటును గ్రహించి మనవైపుకు వచ్చారు. 5 ఏళ్ళు, 10 ఏళ్ళు, 15 ఏళ్ళు ఆ నక్సలిజం చేసిన నష్టాన్ని గమనించకుండా తాము ఎటూ తేల్చుకోలేక పోయామని ఇప్పుడు మనకు కొందరు చెప్తున్నారంటే అది నేను అంగీకరించలేను. ఇప్పటికి కూడా అలా అని అలాంటివారు ఇప్పుడైనా మనవైపు వస్తామంటే దాన్నొక నిబంధనగా పెట్టాలన్నది నా అభిప్రాయం కాదు. అనుమానాలతో నిర్ధారణకు రావడం సరైనదికాదు. కాని సైద్ధాంతిక విషయాలకు సంబంధించి సదా అనుమానాలు వెలిబుచ్చుతున్నవారిని, సందేహాలను వ్యక్తం చేస్తున్న వారిని జాగ్రత్తగా చైతన్యపరుస్తూ గమనిస్తూనే వుండాలి.

జనశక్తి పత్రిక ఎ.బి.కె. ప్రసాద్ పేరున పెట్టబడి వుంది. దాన్ని ఆయన నక్సలైట్లకు ధారాదత్తం చేశాడు. అయితే తమ్మినపోతురాజు మనతో వచ్చి మళ్ళీ విడిపోయినా ఈసారి విజయవాడలో నక్సలైట్ల కన్నా మనం బలంగా ఉన్నాం. అందువల్లనే మన ప్రెస్‌ను మన ఆధీనంలో వుంచుకోగలిగాం. ఆ తరువాత ఈ దినపత్రికను మనం నిర్వహించలేమని ఆ ప్రెస్‌ను కలకత్తా పంపాం. ఈ నక్సలైట్ల వ్యతిరేకపోరాటం చాలా జాగ్రత్తగా మెలుకువతో, కష్టపడి నడపాల్సి వచ్చింది. బెంగాల్‌లో మన కార్యకర్తలపైనా, ఆఫీసులపైనా భౌతికదాడులు వారు సాగించారు. అలీముద్దీన్ వీధిలో వున్న మన కేంద్రాఫీసుపై దాడి చేసేందుకు యత్నించారు. మనం తిప్పికొట్టాం. దేశ్‌హితైషి పత్రికను స్వాధీనం చేసుకునేందుకై పెద్ద ఎత్తున సమీకృతమై వచ్చారు. మనమూ తగు బలము సమీకరించుకొని వారి దాడిని ఎదుర్కొని, వారిని తరిమివేశాము. ఆ తరువాత కాంగ్రెస్, పోలీసు వాళ్ళతో కలిసి కూడా మన కార్యకర్తలపై హింసాకాండకు నక్సలైట్లు పాల్పడ్డారు. 1967 నుండి 77 వరకు దాదాపు 10 సంవత్సరాలు ఈ నక్సలైట్లు మన పార్టీపై సాగించిన దురాగతాలు ఇన్నని చెప్పలేము. చాలా నీచంగా దిగజారి కూడా మనల్ని నాశనం చేయడమే ధ్యేయంగా పెట్టుకొని వారు దుర్మార్గంగా వ్యవహరించారు సరే వాటికి తల ఒగ్గకుండా మనమున్నాం. నాకు నక్సలైట్లుపై అంత ద్వేషం ఉండటానికి వారు చేసిన ఈ దుశ్చర్యలే కారణం.

కేరళలో కూడా నక్సలైట్ల నుండి తీవ్రమైన ప్రమాదాన్నే ఎదుర్కొన్నాం. కేరళలో వారి పార్టీ మహాసభకు నేను, కామ్రేడ్ బసవపున్నయ్య, కామ్రేడ్ ఇ.ఎం.ఎస్, కామ్రేడ్ రామమూర్తి, కామ్రేడ్ గోపాలన్ మొత్తం ఐదుగురు పొలిట్‌బ్యూరో సభ్యులం హాజరయ్యాము. కేంద్ర కమిటీ విధానాన్ని వివరించాం. అంతేకాదు, జిల్లా తరువాత జిల్లా దాదాపు అన్ని జిల్లాల్లోనూ మేమే ప్రత్యక్షంగా పాల్గొని జనరల్ బాడీలు నిర్వహించాం. కయ్యూరు పోరాటం సందర్భంగా మరణ శిక్ష విధించబడి, తప్పించుకున్న కామ్రేడ్ కె.పి.ఆర్. గోపాలన్ నక్సలైట్లతో చేరారు. కొన్ని



ప్రాంతాల్లో వారెంత లోతైన సంబంధాలు కలిగి వున్నారంటే, 1964లో ఎవరి ఇంట్లో వుండి మేం ఆతిథ్యం పొందుతూ వుండగా అరెస్టు అయ్యామో ఆయన మన అజికోడ్ రాఘవన్‌ను హత్య చేసిన నక్సలైట్ ముఠాకు ఆశ్రయమిచ్చాడు. ఆంధ్రలో పరిస్థితి తెలిసిందే. పుల్లారెడ్డి, నాగిరెడ్డి ఈ ముఠా కలిగించిన నష్టం చాలా కాలానికి గాని పూడ్చుకోలేకపోయాం. దాదాపు అన్ని జిల్లాల్లో నాయకత్వంలో ఎక్కువ భాగం అటువైపే కొట్టుకుపోయారు. బీహార్‌లో సత్యనారాయణసింగ్ ఇలా వివిధ రాష్ట్రాల్లో తలెత్తిన ఈ విచ్ఛిన్నాన్ని ఎదుర్కొని పార్టీ విజయవంతమవడంలో నాదీ ఒక ముఖ్యమైన పాత్రని చెప్పగలను.

# కార్యకర్తలతో సంబంధాలు కీలకం

సైద్ధాంతికంగా, నక్సలిజానికి అరాచకత్వానికి వ్యతిరేకంగా పోరాటం సాగుతూనే వుండాలి. నేటికీ అది అవసరమే ముఖ్యంగా యువతీ యువకులలో, విద్యార్థులలో, మేధావులలో ఈ రకమైన అడ్డదారులను, దగ్గరి దారులను విప్లవ వాగాడంబరానికి ఆకర్షణ ఎక్కువగా వుంటుంది. వ్యవసాయ కార్మికులు, రైతులపై కూడా విప్లవ పోజుతో ఇది కొంత ప్రభావాన్ని చూపిస్తుంది. నిరంతరం ఓర్పుగా ఇలాంటి అడ్డదారులకు, ఎన్నికల చిట్కాలకు వ్యతిరేకంగా పార్టీని, ప్రజానీకాన్ని ప్రత్యేకించి ఈ సెక్షన్లను చైతన్యం చేస్తూనే వుండాలి. రివిజనిజం కన్నా ఇదేమి తక్కువ ప్రమాదకారికాదు. అది ఒక రకంగా విప్లవ చేవను తొలిచేస్తే ఇది మరో రకంగా విప్లవోద్యమాన్ని ధ్వంసం చేస్తుంది. ఏది ఎక్కువ ప్రమాదకారి అన్నది అప్పటి పార్టీ ఎదుర్కొంటున్న పరిస్థితిపై ఆధారపడి వుంటుంది. ఈ విధంగా ఓర్పుగా ప్రజా చైతన్యాన్ని పెంచడం అన్నది ప్రజలే తనను తాను విముక్తి చేసుకోవలసినవారు అన్న విషయాన్ని నిరంతరం గమనంలో వుంచుకుని, ప్రచారంలో పెట్టి ఆచరించాలి. పరిస్థితి విప్లవానికి పరిపక్వం అయ్యే వరకు ఇది తప్పదు. అందుకనే ఒక్కోసారి మన వాళ్ళు బ్రహ్మాండమైన అవకాశాలు వచ్చాయి, ఇది మూల మలుపు అని అంటుంటే నాకు చిరాకు అనిపిస్తుంది. 50 ఏళ్ళ నుండి ఇలాంటి మాటలు వాడుతూ తదనుగుణంగా ఆచరణలో చూపించలేనప్పుడు ఆ మాటలవల్ల ప్రయోజనం ఏమిటి? అందుకని భౌతిక పరిస్థితిని జాగ్రత్తగా అంచనా వేసుకొని నిగ్రహంతో వ్యవహరించాలి.

పశ్చిమ బెంగాలే వుంది. ఆ రోజుల్లో స్థూలంగా, ఈ శక్తులతో ఎలా వ్యవహరించాలి అన్న విషయాన్ని ప్రమోద్, తదితరులతో చర్చించేవాణ్ని. దాని అమలుకు కావలసిన యితర వివరాలు, అవీ ఆ రాష్ట్ర కమిటీ చర్చించేది. అమలు జరిపేది. రాష్ట్ర కమిటీలను కాదని కేంద్రం తనంతటతానుగా కింద దాకా వెళ్ళి చేయగలిగింది వుండదు. స్థానిక పరిస్థితులు, కార్యకర్తలు, వారిస్థాయి, యివేవి తెలియకుండా, సరాసరి పై నుండి వారందరిని బాగు చేయగలమనుకోవడం పొరబాటు.రాష్ట్ర కమిటీని ఒప్పించాలి. ఒప్పుకోలేదని, కేంద్ర కమిటీ ప్రత్యక్షంగా చేసేదేమీ వుండదు.



అలాగే ముఖ్యంగా యువజన విద్యారంగాలలో పని చేసే కామ్రేడ్స్ బెంగాల్‌లో నాతో చనువుగా వుండేవారు. ప్రమోద్, జ్యోతి తర్వాత నేనే వారికి దగ్గర. అందులో రహస్యమేమీ లేదు. ఆ రెండు రంగాలు నేను చూసేవాణ్ణి. మళ్ళీ ఆ రెండు రంగాలను పునర్నిర్మిస్తున్న దశ అది. అందుకని కలిసి మాట్లాడేవారు వారు వచ్చినప్పుడు, వారికి సమస్యలు వచ్చినప్పుడు శ్రద్ధగా వినేవాణ్ణి. ఇది విధానం అని విన్న తర్వాత చెప్పి, చర్చించేవాణ్ణి. నువ్వు వారితో ఎలా కలిసిమెలిసి వుంటావు అన్నదానిపై వారికి నీతో సాన్నిహిత్యం ఏర్పడుతుంది. వాళ్ళకేవో సమస్యలుంటాయి. అవి మనకు చిన్నవిగా తోచవచ్చు. వారికవి పెద్దవి. అసలు ఆ సమస్యను అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాలి. తరువాత మనం చెప్పేదే సరైన పరిష్కారం అన్నట్లు నచ్చచెప్పాలి. వారికి ప్రత్యేక ఇబ్బందులేమన్నా వుంటే కనుక్కోవాలి. వారిని విమర్శించవచ్చు. కోప్పడవచ్చు. కాని తమను అర్థం చేసుకుంటున్నా మన్నట్లు మనం – పెద్దవాళ్ళం వాళ్ళతో వ్యవహరించాలి. వారికి దైనందిన జీవితంలో వస్తున్న ఇబ్బందులు అన్నీ శ్రద్ధగా తెలుసుకోవాలి. వాళ్ళు చెప్తున్నదానికల్లా 'ఉ' కొట్టమని కాదు. అనవసర విషయాలు లేదా విషయాలను చెడ్డగా చిత్రిస్తున్నారనుకున్నప్పుడు వెంటనే దాన్ని తుంచివేయాలి. లేకపోతే మనం అలాగే వింటుంటే, మనం కూడా వారు చెప్తున్న అంశాలతో ఏకీభవిస్తున్నట్లు వారు భావిస్తారు. ఇలా మధ్యలో జోక్యం చేసుకుని వారు చెప్తున్న అంశాన్ని తరచి తరచి అడిగితే కొందరు కామ్రేడ్స్ బాధపడవచ్చు. నిరుత్సాహపడవచ్చు తప్పదు. అయితే శ్రద్ధగా వినడం చాలా ముఖ్యం.

కామ్రేడ్స్ ముడుచుకుపోయి, తాము చెప్పదలుచుకున్నది చెప్పలేక పోతున్నారను కున్నప్పుడు వాళ్ళ మనసులోది బయటపడేట్లు గుచ్చి గుచ్చి అడగాలి. లేకపోతే అసలు విషయం బయటకు రాదు. పెద్దలం మనం, మనకన్నా బాగా చిన్న కామ్రేడ్స్‌తో వ్యవహరించే సందర్భంలో వారి మానసిక పరిస్థితి కూడా మన గమనంలో వుండాలి. ఇలా బెంగాల్ కామ్రేడ్స్‌తో వ్యవహరించినందువలన బహుశా బెంగాల్ యువ కామ్రేడ్స్ నాతో సాన్నిహిత్యంగా వుండగలిగామని సంతృప్తి చెందివుంటారు.

ఈ సందర్భంలోనే మరో విషయం కూడా చెప్తున్నాను. బహిరంగ సభలకు, జనరల్ బాడీలకు వెళ్ళి ప్రసంగించవలసి వచ్చినప్పుడు, ఏదో చెప్పలేకపోతామా అన్నట్లు సంసిద్ధం కాకుండా వెళ్ళకూడదు. అలాగే పత్రికా విలేకరుల సమావేశాలకు కూడా. బహిరంగం సభలో వుపన్యాసం యిచ్చి రావడమే నాయకుడు చెయ్యాల్సిన పనికాదు. వెళ్ళినప్పుడు కామ్రేడ్స్‌తో మాట్లాడే కాలవ్యవధి వుంచుకుని, వారి ఉద్యమం మొదలైన విషయాలు కూడా తెలుసుకోవాలి. కార్యక్రమం ఎలా అమలవుతున్నదో పర్యవేక్షించాలి. కమిటీ మీటింగులూ, అవీ వేసుకున్నప్పుడు కూడా, ఒక రోజు ఒక పూట కమిటీ మీటింగులంటే నాకు గిట్టవు. మీటింగుకు వచ్చిన కామ్రేడ్స్‌తో తమ అనుభవాలన్నీ చెప్పేందుకు, మనం వినేందుకు తగిన వ్యవధి వుండాలా. వారి అనుభవాలు చిన్నవికావచ్చు, పెద్దవికావచ్చు. అది వేరే విషయం కొందరు చెప్పిన విషయాన్నే మళ్ళీమళ్ళీ చెప్తుంటారు. వారు ఆ విషయం దాటి మరో విషయంలోకి వచ్చేందుకు సహకరిస్తూ ఓర్పుగావినాలి. అందరూ ఒక్క తీరుగా చెప్పరు.

మా పొలిట్ బ్యూరోలో వివిధ రాష్ట్రాలకు చెందిన వాళ్ళం వున్నాం కదా. ఆ రాష్ట్రానికి చెందిన పొలిట్‌బ్యూరో నాయకులను మినహాయిస్తే, నాకు ఆ రాష్ట్రంలోని భౌగోళిక స్థితిగతులు, కార్యకర్తలు, మిగతా పొలిట్‌బ్యూరో సభ్యులందరికన్నా ఎక్కువ పరిచయం. అది నా ప్రత్యేక గొప్పతనం కాదు. ప్రధాన కార్యదర్శిగా వివిధ రాష్ట్రాలకు, వివిధ సందర్భాలలో, నేను ఎక్కువగా వెళ్ళివున్నాను అంతే.

నేను ప్రధాన కార్యదర్శిగా వున్న పదేళ్ళ కాలంలో, వివిధ రాష్ట్రాలలో వివిధ ఉద్యమాలు, అఖిలభారత స్థాయిలో పార్టీ పురోగమనం, వీటన్నింటా నా ముద్ర ఏదో మోతాదులో వుండి వుంటుంది. కొన్నిచోట్ల ఎక్కువగా, కొన్నిచోట్ల తక్కువగా, నిర్దిష్టంగా, ఏ ఏ సమస్యలలో, ఏ ఏ ఉద్యమాలలో నా పాత్ర ఏమిటి అన్నది ప్రత్యేకించి అధ్యయనం చేయాలి. ఇప్పుడా పనికి పూనుకోవడం లేదు. ఏమైనా, భారత కమ్యూనిస్టు వుద్యమంలో నా పాత్ర సగర్వంగానే నిర్వహించానని చెప్పవచ్చు. అయితే ఈ విషయం పార్టీ తుదిగా నిర్ణయించాలి.

1975 ఆ కాలంలో పార్టీలో అంతరంగిక చర్చ, విబేధాలు, నా అభిప్రాయములు అవన్నీ లిఖితపూర్వకమైన డాక్యుమెంట్లలో వున్నాయి. వివిధ స్థాయిలలో, హోదాలలో నేను పార్టీలో పని చేశాను. మిగతా కామ్రేడ్స్ కూడా నాతోపాటు గర్వించదగిన కృషి చేశారు. నా పాత్ర ఏమిటి అన్నది పార్టీ భవిష్యత్తు నిర్ణయిస్తుంది.

నాకు అభిమానం, గౌరవం గల కొందరు పార్టీ నాయకుల లిస్టు వుంది. వారిలో కొందరు ఈ రోజు సిపిఐలో వున్నారు. బతికి వున్నవారు, చనిపోయిన వారు కూడా వున్నారు. కమ్యూనిస్టు వుద్యమానికి వారు చేసిన సేవలను వాస్తవిక దృక్పథంతో రాసిపెట్టాలి. నా దృష్టిలో వారిలోని ఔన్నత్యం ఏమిటి, వారు చేసిన కృషి, ఎలా పార్టీకి ఉపకరించింది – ఇవన్నీ రాయాలి. 55, 60 సంవత్సరాల రాజకీయ జీవితాలు, ఎందరో ఉన్నతమైన కామ్రేడ్స్ నాకు తటస్థపడ్డారు. ఆ పని చేయాలంటే, ఆనాటి డాక్యుమెంట్లు తదితరమైన ఎన్నో చదవాలి. ఆ పని చేయగలనేమో చూద్దాం.